# జలపాఠాలు

## నదీజలాల పంపకం - ప్రాంతీయ అసమానతలు




కె. బాలగోపాల్

జలపాఠాలు
బాలగోపాల్

# జలపాఠాలు

నదీజలాల పంపకం – ప్రాంతీయ అసమానతలు

కె. బాలగోపాల్




మట్టి ముద్రణలు । ఆలగడప । తెలంగాణ

# జలపాతాలు

నదీజలాల పంపకం - ప్రాంతీయ అసమానతలు

**కె.బాలగోపాల్**

ప్రచురణ సంఖ్య: 17
మొదటి ముద్రణ: జూలై 2013
రెండవ ముద్రణ : సెప్టెంబర్ 2013
డిజైనింగ్, బుక్ మేకింగ్: జుగాష్‌విలి
డి.టి.పి.: కవిత, హైదరాబాద్
ముద్రణ: చరిత ఇంప్రెషన్స్, హైదరాబాదు- 20

ప్రచురణ

మట్టి ముద్రణలు
ఆలగడప, మిర్యాలగూడ
నల్లగొండ జిల్లా - 508207
ఫోన్: 9848015364

ప్రతులకు

పుట్ట పుస్తక శిబిరం, ఆలగడప, మిర్యాలగూడ,
నల్లగొండ జిల్లా తెలంగాణ
మరియు
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

బాలగోపాల్ రచనల కోసం: www.balagopal.org

**వెల : 120 రూపాయలు**

# నిష్పాక్షికుడికి నివాళిగా...

సామాజిక స్పృహ లేని సాహిత్యం వ్యర్థం, సాహితీ స్పృహ లేని సమాజం అనర్థం అని మా నాన్న శ్రీకిషన్ రావు అభిప్రాయం.

ప్రజలకు ఆనందంతో పాటు ఆరోగ్యాన్ని, చైతన్యాన్ని ఇచ్చే సాహిత్యం అచ్చు వేయాలన్నది మా నాన్న సలహానే. ఆలగడప, తెలంగాణ, మట్టి, వేనేపల్లి, మా భూమి, పచ్చనాకు ప్రచురణల పేర్లతో 1979 నుండి చిన్న చిన్న పుస్తకాలు వందల కొద్దీ వేసి పంచాం. హక్కుల ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొనడం మొదలుపెట్టాక పుస్తకాల ప్రచురణ మందగించింది. వేద్దామనుకున్న పుస్తకాలు రాతప్రతులుగానే మూటల్లో మిగిలిపోయాయి.

80వ దశకంలో బాలగోపాల్ సార్ పరిచయం ఒక గొప్ప మార్పు. అటు విప్లవోద్యమం, ఇటు బాలగోపాలం. నాకు, ఆజంకు శరీరం, మనసు అటు ఇటు పరుగులు తీస్తుండేవి. రాగో నవల ముందుమాట అనంతర చర్చను పుస్తకంగా వేయాలని సార్‌ను అడిగితే ఒకసారి అచ్చయిన వాటిని మళ్లీ వేయడం వల్ల ప్రయోజనం ఏమిటని తిరస్కరించారు. అట్లా చాలాసార్లు పాతవాటిని అడగటం, బాలగోపాల్ సార్ ఎందుకులే అనడం జరిగింది. కొత్తగా రాస్తే వేద్దువుగానిలే అని ఒకసారి హామీ అయితే ఇచ్చారు గాని, నాకు ఆ అవకాశం దక్కలేదు...

2009 అక్టోబర్ 8వ తేదీ రాత్రి భూమి బద్దలైనట్లు... ఆకాశం విరిగిపడ్డట్లు... కలం రాస్తూ రాస్తూ కాగితంలోకింకినట్లు... నాగలి దుక్కి దున్నుతూ దున్నుతూ మట్టిలో మమేకమైనట్లు...

బాలగోపాల్‌గారి రచనలన్నీ రావడం మొదలయ్యాక– సార్‌తో కలిసి కృష్ణా జలాల పునఃపంపిణీ ఉద్యమంలో పాల్గొన్న అనుభవంతో, తెలంగాణ ఉద్యమంలో పదే పదే ప్రస్తావనకు వస్తున్న జలవివాదాలను దృష్టిలో పెట్టుకుని వసంతమ్మని అడగటం,

నీళ్ళ మీద సార్ రాసిన వ్యాసాలను (జలపాఠాలు) వేసుకోమని తను ఇవ్వటం జరిగింది.

మన రాష్ట్రంలోని నదీ జలాల మీద, నీటి హక్కుల మీద ఎంతో సాధికారికంగా రాసిన వ్యాసాలివి. వివిధ ప్రాంతాల వాళ్ళు తమకు తోచిన అంచనాలతోను, స్వార్థంతోను ఇతరుల హక్కులను పరిమితంగా మాత్రమే గుర్తిస్తున్న సందర్భంలో బాలగోపాల్ సార్ రవ్వంత కూడా ఎవరి హక్కులకూ భంగం కలగకుండా, సహజ న్యాయసూత్రాలను పాటిస్తూ నీళ్ళు ఎవరికి చెందాలో, ఎందుకు చెందాలో స్పష్టంగా వివరిస్తూ రాశారు ఈ వ్యాసాలన్నిటినీ. ఏడాది క్రితమే రావాల్సిన పుస్తకం ఇది. మ్యాపులు, ప్రాజెక్టులకు సంబంధించిన సాంకేతిక వివరాలు సేకరించడంలో చాలా ఆలస్యం జరిగింది. ఈ పుస్తకం రావడంలో వసంతలక్ష్మిగారి కృషి, బ్రహ్మయ్యగారి పట్టుదల చాలా ఉన్నాయి. బాలగోపాల్ సార్ 'పద' ముద్రలు ఆయన వెళ్ళిపోయిన తర్వాతే మా 'మట్టి ముద్రణ'లో రావడం ఎంతో దుఃఖంగా ఉంది.

వేనేపల్లి పాండురంగారావు
15 జూన్ 2013



# ముందుమాటకు బదులు...

'నీరు పల్లమెరుగు' లాగా 'నీరు న్యాయమెరుగు' అనేది కూడా ఒక సార్వత్రిక సత్యమై వుంటే ఎంతో బాగుండేది! అప్పుడు అవసరాన్ని బట్టి సమన్యాయం పాటిస్తూ నీరే ఆయా ప్రాంతాలకు ప్రవహించి మనకు చాలా వివాదాలు లేకుండా చేసేది. కాని దానికి పల్లానికి పారడం మాత్రమే తెలుసు. అవసరాలు, న్యాయాన్యాయాలు నిర్ణయించుకోవాల్సిన బాధ్యత మనదే.

మన రాష్ట్రంలో నదీ జలాల పంపకం కనీసం 60,70 ఏళ్ల నుంచి రాజకీయ చర్చనీయాంశంగా ఉంటూ వచ్చింది. కట్టబోయే ప్రాజెక్టుల మీదే కాదు, కట్టేసిన ప్రాజెక్టుల మీద కూడా మనకు ఏకాభిప్రాయం లేదు. ప్రాజెక్టు కట్టిన ప్రాంతమో, రిజర్వాయర్ ఎత్తో, కేటాయించిన నీళ్లో, ఆయకట్టో, ముంపు పరిమాణమో ఏదో ఒకటి – కొన్ని సందర్భాలలో అన్నీ కూడా వివాదాస్పదం అవుతూనే ఉన్నాయి. దానికి ప్రధాన కారణం అభివృద్ధిలో ఇప్పటికే స్థిరపడ్డ ప్రాంతీయ అసమానతలే కాక ఇరిగేషన్ ఆధారిత వ్యవసాయమొక్కటే రైతుకు అంతో ఇంతో గిట్టుబాటయ్యే పరిస్థితులు నెలకొనడం. నేటి అభివృద్ధి నమూనాలో చిన్నవాటికి వేటికీ స్థానం లేదు. మెగాస్థాయి ఆలోచనలకే ఆదరణ. పంట దిగుబడి అయినా, వ్యాపారంలో లాభాలైనా భారీగానే ఉండాలి కాబట్టి చెరువులు, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు ఎవరి కంటికీ ఆనడం లేదు. భారీ పెట్టుబడితో భారీ ప్రాజెక్టులు కట్టడమొక్కటే వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారమన్నట్టు మాట్లాడడం పెరిగింది. ఈ నేపథ్యంలో నదీ జలాల్లో ఎవరి వాటా కోసం వాళ్లు పట్టుపట్టడం ఒక తప్పనిసరి అవసరమైంది. కొన్ని ప్రాంతాలు ఎప్పటినుంచో సాగునీటిని అనుభవిస్తున్నాయన్నది చారిత్రక కారణమే తప్ప న్యాయమైన కారణం కాదన్న అవగాహన ఒకసారి కలిగాక, సాగునీరు లభించని ప్రాంతాల నుంచి వచ్చే డిమాండ్లు ఉద్యమరూపం దాల్చడం అనివార్యమైంది. గత 10,15 సంవత్సరాలలో మన రాష్ట్రంలో జల వివాదాలు పెరగడానికి కారణమిదే.

నదీ జలాల్లో వాటా కోసం, కొత్త ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం, తెలంగాణ, రాయలసీమల నుండి ఒత్తిడి పెరుగుతున్న కాలంలో అవన్నీ కూడా హక్కుల సమస్యలేనని గుర్తించిన

వ్యక్తి బాలగోపాల్‌గారు. ఆయన చాలామందికి హక్కుల ఉద్యమకారుడిగా మాత్రమే తెలుసు. బాలగోపాల్‌గారు తన గురించి తాను చేసుకునే పరిచయం కూడా అదే అయినా ఆ హక్కుల ఉద్యమంలో భాగంగానే ఆయన మన సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను లోతుగా అధ్యయనం చేసి పరిష్కారాలను చూపే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆయా రంగాలలోని వృత్తినిపుణుల కంటే ఎక్కువ నైపుణ్యం సంపాదించి నిష్పాక్షిక నిపుణుడిగా పేరు తెచ్చుకున్నారు. ఆయన ఆ విధంగా కృషి చేసిన అనేక రంగాలలో నదీ జలాల రంగం కూడా ఒకటి.

ప్రాంతాల మధ్య విద్వేషాలకు నదీ జలాల పంపకం ఒక ప్రధాన కారణమనీ, నదీ జలాల న్యాయమైన పంపిణీ జరగనంత వరకు ఆ చిచ్చు అలాగే కొనసాగుతుందనీ చాలా సందర్భాలలో హెచ్చరిస్తూ వచ్చారు బాలగోపాల్‌గారు. అందుకే కృష్ణానదీ జలాల పునఃపంపిణీపై పెద్ద ఎత్తున చర్చను లేవనెత్తారు. నదీజలాల పంపకం అవసరాల ప్రాతిపదికగా మాత్రమే జరగాలని, ప్రాజెక్టుల నిర్మాణంలో, నీటి విడుదలలో ప్రాధాన్యాల్ని కూడా అదే ప్రాతిపదికపై నిర్ణయించుకోవాలని, ఆచరణలో ఎన్ని సమస్యలున్నప్పటికీ అదే సరైన వైఖరని పదే పదే చెప్పారు. ప్రజాభిప్రాయాన్ని కూడగట్టేందుకు సంబంధిత జిల్లాలన్నిట్లో సదస్సులు జరిపి ఆ డిమాండ్‌ను 'కృష్ణా జలాల పునఃపంపిణీ ఉద్యమం'గా ముందుకు తీసికెళ్లడంలో ఆయన కృషి చాలా ఉంది. వై.ఎస్.రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చాక రకరకాల కారణాల వలన ఆ డిమాండ్ నీరసించి పోయినప్పటికీ కృష్ణానదీ జలాల పంపకంలో జరిగిపోయిన అన్యాయాలను సరిదిద్దడానికి అదొక్కటే సరైన పరిష్కారమని నమ్మారాయన.

ఒక్క కృష్ణాజలాల గురించే కాదు గోదావరి నది  మీద ప్రతిపాదించిన అన్ని కొత్త ప్రాజెక్టుల మంచి చెడ్డల గురించి కూడా ఆయన విస్తృతంగా రాశారు, మాట్లాడారు. 276 గ్రామాలను ముంచి, వేలాది ఆదివాసులను నిర్వాసితుల్ని చేయనున్న పోలవరం ప్రాజెక్టును గట్టిగా వ్యతిరేకించడమే కాక అందుకు ఆదివాసులను కూడగట్టేందుకు ముమ్మర ప్రయత్నాలే చేశారు. ఒక విధంగా చెప్పాలంటే బాలగోపాల్‌గారు మన రాష్ట్రంలో స్వయంగా వెళ్లని, అధ్యయనం చెయ్యని ఇరిగేషన్ ప్రాజెక్టులు దాదాపుగా లేవని చెప్పొచ్చు. వంశధార, నాగావళి, పెన్‌గంగ, లెండి, రాళ్లవాగు, మన్నేరు, పాలేరు, సువర్ణముఖి, చిత్రావతి...ఇలా పెద్దా చిన్నా నదులన్నిటి మీదా– ప్రతిపాదనలో ఉన్న ప్రాజెక్టులతో సహా – అన్నిటి గురించీ సందర్భం వచ్చినప్పుడల్లా రాశారు. చెరువుల వ్యవస్థను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత నుంచి, గంగాకావేరి లింకు ప్రాజెక్టు నిరుపయోగత వరకు ఇరిగేషన్ విషయాలలో అనేక విలువైన విమర్శలు, సూచనలు చేశారు. జలయజ్ఞాలు జరపడం  కంటే నీటి హక్కుల్ని స్థిరపరచడం ముఖ్యమని, రివర్ వ్యాలీ అథారిటీల ఏర్పాటు అవసరమని, నదీ జలాలను ఆస్తిహక్కుగా పరిగణించే

కోర్టుల వైఖరి కంటే ఈ విషయాలలో రాజకీయ పరిష్కారాలే ప్రజలకు ఎక్కువ మేలు చేయగలవని– ఇలాంటి అనేక సూచనలు చేశారాయన.

మామూలుగా క్యూసెక్కుల, టి.యం.సిల భాష అందరికీ అర్థం కావడం కష్టం. అందుకే చాలామంది ఇరిగేషన్‌ను ఒక బ్రహ్మ పదార్థంగా భావించి నిజాల మీద కంటే ఇతరుల అభిప్రాయాల మీద ఎక్కువ ఆధారపడతారు. ఇది గ్రహించే బాలగోపాల్‌గారు వీలైనంత సరళమైన భాషలో ఆ విషయాలను వివరించే ప్రయత్నం చేశారు. ఈ సంపుటిలోని మొదటి వ్యాసమొక్కటే 'వ్యాసం' కాదు. అది విశాఖ హెచ్ఆర్ఎఫ్ కార్యకర్తలను ఉద్దేశించి చెప్పిన 'జలపాఠం'. మూడు గంటల సేపు రాష్ట్రంలోని మొత్తం అన్ని ప్రధాన జలవివాదాలు, ప్రాజెక్టుల గురించి వివరించిన ఉపన్యాసం కావడం వలన సమగ్రమైన అవగాహనకు ఉపయోగపడుతుందన్న ఉద్దేశంతో దాన్ని అన్నిటికంటే ముందు పెట్టాం. మిగతావన్నీ తేదీల ప్రకారమే పొందుపర్చాం.

ఇక ఈ పుస్తకాన్ని ఈ రూపంలో మీ ముందుకు తీసుకురావడానికి చాలానే కష్టపడాల్సి వచ్చింది. అన్ని ముఖ్యమైన ప్రాజెక్టుల మ్యాపులు, వాటి గురించిన సంక్షిప్త సమాచారం ఇస్తే పాఠకులకు ఉపయోగకరంగా ఉంటుందని ఏ క్షణంలో అనుకున్నామో ఆ క్షణంలోనే మా కష్టాలు మొదలయ్యాయి. ఇరిగేషన్ శాఖ వెబ్‌సైట్, ఏటా అది విడుదల చేసే రిపోర్టులన్నీ శోధించినా ఏ ప్రాజెక్టుకు ఎప్పుడు శంకుస్థాపన జరిగింది లాంటి ప్రాథమిక సమాచారం కూడా సంపాదించలేకపోయాం. నీటి కేటాయింపుల్లో, ఆయకట్టు లెక్కల్లో చాలాసార్లు పొంతనే ఉండేది కాదు. అంచనా వ్యయం పేర్కొన్నపుడు అది ఏ సంవత్సరంలో వేసిన అంచనానో చెప్పరు. మ్యాపులు కాపీ కావు. వాటి మీద అక్షరాలు కనిపించవు. కీలకమైన ప్రాంతాల పేర్లు ఉండవు. వీటన్నిటినీ తెలుసుకోవడానికి, సరిచూసుకోవడానికి చాలా సమయమే పట్టింది. ఇప్పటికీ కొన్ని పొరపాట్లు మిగిలి ఉండొచ్చు.

ఈ పనిలో మాకు సహకరించిన వారిలో వి.ప్రకాశ్ (జయశంకర్ తెలంగాణ ఆర్ & డి సెంటర్) ముఖ్యులు. ఇంకా వి.ఎస్.కృష్ణ (మానవహక్కుల వేదిక ప్రధాన కార్యదర్శి), ఈనాడు సీనియర్ జర్నలిస్టు యం.ఎల్. నరసింహారెడ్డి, జర్నలిస్టు పి. చిట్టిబాబుల సహకారం కూడా తీసుకున్నాం. మ్యాపుల్ని రూపొందించడంలో కె.రవి (డి.ఎల్.ఆర్.ఎల్) గారి సహాయం మరవలేనిది. వారందరికీ మా కృతజ్ఞతలు.

వేమన వసంతలక్ష్మి
మన్నం బ్రహ్మయ్య



25.6.2013

## ప్రవాహం ❊


- జలపాతాలు ........ 15
- ఆల్మట్టి వివాదం : న్యాయాన్యాయాల చర్చ ........ 62
- గండి గండికో నిర్లక్ష్యపు గాథ ........ 74
- విజన్ 'చూపు'లో వివక్ష ........ 84
- ఏ మంచికి నాంది? ఏ పథకానికి ప్రారంభం? ........ 89
- ప్రాజెక్టుల ఎండమావులు ........ 93
- కార్పొరేట్ సేద్యానికేనా జల 'సంరక్షణ'? ........ 129
- బచావత్ తరువాత : ఒక ప్రతిపాదన ........ 133
- చేసేది చేస్తూ ఉపదేశాలెందుకు? ........ 141
- కృష్ణానదీ జలాల పునఃపంపిణీకై ఉద్యమిద్దాం. ........ 144
- ఉట్టికెక్కి ఆపైన స్వర్గానికెక్కుదాం ........ 148
- కృష్ణా జలాలు : కొట్లాడవలసింది ఎవరితో, కొట్లాడుతున్నది ఎవరితో? .. 151
- కృష్ణా జలాలు : అతి తెలివి ప్రతిపాదనలు ........ 155
- ఇది అన్ని రకాలుగానూ మోయలేని బరువు ........ 159
- 'పునఃపంపిణీ' జరగకుండా కరువు సమస్య తీరుతుందా? ........ 165
- సీమాంతర ఉగ్రవాదం ........ 169
- కృష్ణాడెల్టా వాసులు వాస్తవ పరిస్థితులకు అలవాటుపడితే మంచిది ....... 172
- కృష్ణా జలాల జగడం : కొన్ని వాస్తవాలు, కొన్ని సూచనలు ........ 176
- ఆ యిన్ని నీళ్ళు ఎవరి నెత్తిన పోయడానికి? ........ 182
- పులిచింతలను ఎందుకు వ్యతిరేకిస్తున్నాం? ........ 185

● రాష్ట్ర ప్రభుత్వం సాగిస్తున్న జలయజ్ఞంలో
నిజమెంత? అబద్ధమెంత? మేలు ఎంత? కీడు ఎంత? .................. 191
● హిరమండలం రిజర్వాయర్ వద్దు ............................................ 199
● చెరువు కట్టలు ఎందుకు తెగుతున్నాయి? .................................. 207
● పోలవరం ప్రాజెక్టు : ఇంతకంటే ఘోరం ఇంకోటి ఉండదు. ............. 211
● పోలవరం ప్రాజెక్టును ఎందుకు వ్యతిరేకిస్తున్నాం? ......................... 223
● రెండవ కృష్ణా ట్రిబ్యునల్ ముందు మౌనమే సరయిన వ్యూహమా?....... 229
● రెండవ కృష్ణా ట్రిబ్యునల్ ముగియకముందే... .............................. 233
● నదీజలాలు : రాయలసీమ రాజకీయార్థిక జీవితం ......................... 237
● హంద్రీ – నీవా ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిర్మించాలి ..................... 260
● కడప జిల్లాలో ఊట చెరువుల సంతర్పణ .................................. 264
● వాళ్ళకెందుకు 'ప్రాణహితం' కాలేదు?....................................... 268
● ప్రాణహిత – చేవెళ్ళ ప్రాజెక్టు : స్థానిక అవసరాలు పట్టవా? ............. 271

అనుబంధం

● ముఖ్యమైన ప్రాజెక్టులు – వాటి సంక్షిప్త వివరాలు ......................... 276



## మ్యాప్‌లు


- గోదావరి బేసిన్ ప్రాజెక్టులు.................................. 27
- కృష్ణా బేసిన్ ప్రాజెక్టులు........................................ 28
- పెన్నా బేసిన్ ప్రాజెక్టులు ...................................... 29
- గోదావరి బేసిన్ వాలు మ్యాప్............................... 30
- కృష్ణా బేసిన్ వాలు మ్యాప్..................................... 31
- పెన్నా బేసిన్ వాలు మ్యాప్ .................................. 32
- 'జలపాతాలు' చెబుతూ బాలగోపాల్ గీసిన రేఖా చిత్రం... 97
- ఆంధ్రప్రదేశ్ బేసిన్ మ్యాప్ .................................. 98
- పూర్తి అయిన మేజర్ & మీడియం ప్రాజెక్టులు............ 99
- లోయర్ పెన్‌గంగ ప్రాజెక్టు.................................. 100
- మంజీర నది మీద ప్రాజెక్టులు ............................. 101
- నిజాంసాగర్ ప్రాజెక్టు ........................................ 102
- శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ........................................ 103
- ఎల్లంపల్లి ప్రాజెక్టు............................................. 104
- ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు.................................. 105
- ఇచ్చంపల్లి ప్రాజెక్టు............................................ 106
- దేవాదుల ఎత్తిపోతల పథకం............................... 107
- దుమ్ముగూడెం ఎత్తిపోతల పథకం ......................... 108
- పోలవరం ప్రాజెక్టు ............................................. 109
- గోదావరి డెల్టా సిస్టమ్ ........................................ 110
- భీమా ఎత్తిపోతల పథకం.................................... 111
- జూరాల మరియు రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ ............ 112

- నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం .............................. 113
- కల్వకుర్తి ఎత్తిపోతల పథకం .............................. 114
- కె.సి.కెనాల్ .................................................. 115
- హంద్రీ – నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం ...... 116
- గాలేరు – నగరి సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం...... 117
- శ్రీశైలం కుడిగట్టు కాలువ .................................. 118
- తెలుగుగంగ ప్రాజెక్టు ........................................ 119
- వెలిగొండ ప్రాజెక్టు ........................................... 120
- నాగార్జునసాగర్ ఎడమగట్టు కాలువ ....................... 121
- నాగార్జునసాగర్ కుడిగట్టు కాలువ.......................... 122
- ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు ............................ 123
- పులిచింతల ప్రాజెక్టు.......................................... 124
- కృష్ణా డెల్టా.................................................... 125
- వంశధార ప్రాజెక్టు ........................................... 126
- గంగా–కావేరి లింక్ ........................................... 127
- సోమశిల ప్రాజెక్టు............................................ 128




# జలపాఠాలు

రెండు బొమ్మలు వేసానిక్కడ. ఒకటి కృష్ణానది, రెండోది గోదావరి. మన రాష్ట్రంలో తగాదాలు ఎక్కువ ఉండేది ఈ రెండు నదుల మీదే. అవి రెండూ కూడా మీ ప్రాంతానికి సంబంధించినవి కావు. పోలవరం నీళ్ళు మీకు వస్తాయని మీరు ఆశిస్తున్నారు. అవి రావద్దని మేము అనుకుంటున్నాము. డ్యామే రావద్దని అంటున్నాం, మీకు రావద్దని కాదు. అదట్లా ఉంచి మీ జిల్లాకు దాదాపుగా ఏ సంబంధం లేనటువంటి ఈ విషయాల మీద అవగాహన కావాలని విశాఖపట్నం జిల్లా కమిటీ కోరుకోవడాన్ని నేను అభినందిస్తున్నా. ఎందుకంటే మనకు సంబంధించినవి మాత్రమే హక్కులు అనుకోకుండా ఈ రాష్ట్రంలో బ్రతుకుతున్నాం కాబట్టి, ఈ రాష్ట్రంలో ఏ ప్రాంతానికి సంబంధించినది అయినా మన సమస్యే అనుకోవడం మంచి లక్షణం.



బాబ్లీ బాబ్లీ అని వింటున్నాం ప్రతిరోజూ మీడియాలో. ఏమిటీ బాబ్లీ? టీడీపీ చెప్పింది కరెక్టా, టీఆర్ఎస్ కరెక్టా, కాంగ్రెస్ కరెక్టా? లేక అందరిదీ తప్పా. తెలియాలి కదా! అలాగే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ గురించి జరుగుతున్న వివాదం. పులిచింతల గురించి, పోలవరం గురించి, బాబ్లీ గురించి– అన్నిటి మీద భిన్నాభిప్రాయాలుంటాయి. ఉండటం సహజం కూడా. కాని మేము కొంతకాలం నుంచి నీటికి సంబంధించి ఒక అవగాహనతో మాట్లాడుతూ వచ్చాం. నీరనేది ప్రకృతి సిద్ధంగా వచ్చేది. ఒకరు కల్పించేది కాదు, ఒకరు తయారు చేసేది కాదు. గాలి, నేల లాంటిదే నీరు కూడా. అది అందరికీ వాళ్ళ వాళ్ళ అవసరాన్ని బట్టి సమానంగా అందుబాటులో ఉండాలి. అది తప్ప వేరే ఏ ప్రమాణాలు ఉండటానికి వీలు లేదు. నేను తయారు చేస్తే నాకుంటుంది అనొచ్చు

ఎవరైనా. నేను కనిపెట్టింది నాకుండాల అని కూడా అంటుంటారు అప్పుడప్పుడు. నేను మొట్టమొదట చూసింది నాకే చెందుతుంది అని తెల్లవాడు అన్నాడు. ప్రపంచాన్నంతా తాము చూసినప్పుడే పుట్టిందనుకున్నారు వాళ్ళు. నీళ్ళు ఒకడు మొట్టమొదట చూసిందీ కాదు, ఒకడు కనిపెట్టిందీ కాదు, ఒకడు తయారు చేసిందీ కాదు. ప్రకృతి ఇచ్చిందని లేదా దేవుడిని నమ్మితే దేవుడిచ్చాడని అనుకుంటాం మనం. కాబట్టి వాళ్ళ వాళ్ళ అవసరాన్ని బట్టి మాత్రమే నీటి మీద హక్కులు ఉండాలి. ఆచరణలో అనేక రకాల సమస్యలుంటాయి. అయినప్పటికీ ఈ సూత్రం లేక విలువ ప్రాతిపదికగానే నీటి పంపకం జరగాలన్న అవగాహనతోనే మొదటి నుంచీ మేము ఈ సమస్యపై స్పందిస్తున్నాం.

## నాలుగు ముఖ్య వివాదాలు

కృష్ణా, గోదావరి మన రాష్ట్రంలోని పెద్దనదులు. ఈ రెండు నదుల నీటి మీదే ఇప్పుడు చాలా వివాదం ఉంది. వివాదం ఉండేవాటిలో ముఖ్యమైనవి–

1. పులిచింతల
2. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్. ఇది శ్రీశైలం కుడికాలువ కుండే రెగ్యులేటర్.
3. బాబ్లీ. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువన మహారాష్ట్రలో ఉంటుంది ఇది.
4. పోలవరం.

## చట్టం కన్నా ముందే హక్కులు

నదీజలాల మీద హక్కులు అనేవి ఒక చట్టమంటూ ఏదీ లేని రోజులలోనే పుట్టడం మొదలైంది. బ్రిటిష్ వాళ్ళు పరిపాలిస్తున్న రోజులలో వాళ్ళ పాలనావసరాల కోసం కొన్ని ఆనకట్టలు కట్టారు. ఇప్పుడున్నంత పెద్ద డ్యాములు కావవి. వాళ్ళే మొదట కొన్ని హక్కులు కూడా కల్పించారు. ఇవ్వాళ ప్రకాశం బ్యారేజీ అంటున్నామే– అప్పుడు దాని పేరు అది కాదు. కృష్ణా డెల్టా వర్క్స్ అనేవారు – అక్కడొక ఆనకట్ట కట్టారు. దాని నుంచి కృష్ణా డెల్టాకు నీళ్ళిచ్చారు. అయితే వాళ్ళు ఆనకట్టలు కట్టింది వరదల్ని ఆపడానికి, జల రవాణాకు. అప్పట్లో రైళ్ళు, బస్సులు ఎక్కువ లేవు కాబట్టి సరుకుల రవాణాకు ఎక్కువగా పడవలను ఉపయోగించే వాళ్ళు. వరదల నియంత్రణ కూడా దాంట్లో భాగంగానే జరిగింది. ఒకసారి డ్యామంటూ కట్టిన తర్వాత నీళ్ళు ఉంటాయి కాబట్టి పంటలకు కూడా ఇచ్చారు. దానివల్ల పంటలు పండాయి. రైతులకు ఆదాయాలు పెరిగాయి. ఆ ప్రాంతం సంపన్నమైన ప్రాంతం అయింది. ప్రభుత్వాల రెవెన్యూ

కూడా పెరిగింది. అది కూడా ప్రభుత్వానికి మేలు చేసింది. అట్లా వాళ్ళు కృష్ణానది మీద ఒక బ్యారేజీ, గోదావరి మీద ధవళేశ్వరం దగ్గర ఒక బ్యారేజీ కట్టారు. దాదాపు అదే సమయంలో కావేరి మీద కూడా ఒక బ్యారేజీ కట్టారు. ఇది 19వ శతాబ్దం మధ్య భాగంలో జరిగింది. అప్పట్లో నువ్వు ఇక్కడ బ్యారేజీ కట్టి క్రింది వాళ్ళకు నీళ్ళిస్తున్నావు, వాళ్ళకు నీటిమీద హక్కులు కల్పిస్తున్నావు, మరి మా సంగతేమిటి అని అడిగే అవకాశం పై వాళ్ళకు లేదు. అడగటానికి ఒక చట్టమూ లేదు. అడగాలన్న ఆలోచన కూడా బహుశా ఆ రోజులలో లేదు. అలా ఏ చట్టమూ లేని రోజులలోనే కృష్ణాడెల్టాకు, గోదావరి డెల్టాకు హక్కులు పుట్టేసాయి. దాని వల్ల ఆ ప్రాంతాలు ఆ తర్వాత సంపన్నమైనాయి. అంతకు ముందు అవేమీ సంపన్న ప్రాంతాలు కావు. నిజానికి నివాసయోగ్యాలు కూడా కాని ప్రాంతాలే ఎక్కువ ఉండేవి. ఆ నీళ్ళు వచ్చిన తర్వాతనే అవి క్రమంగా బాగుపడ్డాయనేది వాస్తవం.

బ్రిటిష్ వాళ్ళు చేసినటువంటి చట్టాలలో ఎక్కడా కూడా ఒక నది నీటిపై ఎవరికెంత హక్కు ఉంటుందనేది లేదు. వాళ్ళ పాలనా ప్రాంతంలోనే మద్రాసు రాష్ట్రం ఉండేది, బొంబాయి రాష్ట్రం ఉండేది, బెంగాల్ ఉండేది, ఒరిస్సా ఉండేది. అయినా వీళ్ళ హక్కులెట్లా, వాళ్ళ హక్కులెట్లా అని విభజించే చట్టమేదీ బ్రిటిషువాళ్ళు చెయ్యలేదు. వాళ్ళు తమ పాలనా సౌలభ్యం ప్రకారం మాత్రమే చేసుకుంటూ పోయారు. బ్రిటిషు వాళ్ళు పరిపాలించిన కాలంలోనే తుంగభద్ర మీద కూడా ఒక డ్యాం కట్టారు. మనం ఒక నది గురించి మాట్లాడుతున్నామంటే నది, దాని ఉపనదులు కలుపుకునే మాట్లాడతాం. నది, దాని ఉపనదులు, దానిలోకి వచ్చే వాగులు అన్నీ కలిపితేనే నది. శ్రీశైలం డ్యాం కంటే ఎగువన తుంగభద్ర వచ్చి కృష్ణలో కలుస్తుంది, దాని కంటే ఎగువన భీమా నది కర్ణాటక నుంచి వచ్చి మన బోర్డర్ దగ్గర కలుస్తుంది. తుంగభద్ర మీద కర్నూలు జిల్లాలోని సుంకేసుల అనే గ్రామం దగ్గర ఒక డ్యాం కట్టారు. విజయవాడ దగ్గర ప్రకాశం బ్యారేజీ, గోదావరి మీద ధవళేశ్వరం బ్యారేజీ రెండూ దాదాపు 19వ శతాబ్దపు మధ్యభాగంలో కడితే సుంకేసులను 19వ శతాబ్దపు చివరి భాగంలో కట్టారు. ఎందుకోసం కట్టారంటే కె.సి.కెనాల్ కోసం. సుంకేసుల దగ్గర కట్టిన ఆనకట్ట నుంచి కర్నూలు, కడప జిల్లాలకు నీళ్ళిచ్చే కాలువ తవ్వారు. అదే కె.సి.కెనాల్. అదీ బ్రిటిషు కాలంలోనే జరిగింది. రాయలసీమకు, తెలంగాణకు మధ్య కొంత దూరం వరకు తుంగభద్రే సరిహద్దు. ఆ తర్వాత, అంటే తుంగభద్ర కృష్ణలో కలిసిన తర్వాత కొంత దూరం కృష్ణానదే సరిహద్దు. ఆ దిగువన కోస్తాంధ్ర ప్రాంతంలోకి పోతుంది నది.

రాయలసీమ 1807 నుంచి మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉంది. కానీ తెలంగాణ అంతా హైదరాబాద్ స్టేట్‌లో భాగంగా ఉంది. పెద్ద ప్రాజెక్టులేవీ కట్టలేదు వాళ్ళు. నిజాం కొన్ని చిన్న చిన్నవి కట్టాడు కాని పెద్దవి కట్టలేదు. అయితే చాలా ప్లాన్ చేశాడు. కృష్ణానదికి బాగా ఎగువన ఉన్న నారాయణపూర్‌లో పెద్ద ప్రాజెక్టు ఒకటి కట్టి గ్రావిటీ ద్వారానే తెలంగాణలో చాలా ప్రాంతాలకు నీళ్ళిచ్చే ప్లాన్ ఆయన చేశాడు. కాని అమలు చేయలేక పోయాడు.

రాజోలిబండ డైవర్షన్ స్కీమ్, తుంగభద్ర డ్యాం చాలాకాలం కిందే వచ్చాయి. తుంగభద్ర మీద కట్టిన ఈ రెండు ప్రాజెక్టులు కర్ణాటకలో ఉన్నాయి. ఆర్‌డిఎస్ అంటే రాజోలిబండ డైవర్షన్ స్కీమ్. ఇది కర్ణాటకలో ఉన్నా దీని నుంచి ఎక్కువ నీళ్ళు వచ్చేది మన మహబూబ్‌నగర్ జిల్లాకే. కర్ణాటకకు కొంచెమే వస్తుంది. అందుకే వాళ్ళు ఎక్కువ పట్టించుకోలేదు. ఇప్పటికీ అది ఒక కంప్లైంట్‌గా అలాగే ఉంది. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ నిర్వహణను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తనే ఎందుకు తీసుకొని నడపదు? తీసుకోవాలని డిమాండులు ఎన్ని వచ్చినా కర్ణాటక ప్రభుత్వంతో అప్పుడప్పుడు చర్చలు జరుపుతుంటుంది కాని ఏమీ జరగదు. తుంగభద్ర డ్యాం హోస్పేటకు అవతల ఉంది. అది కర్ణాటకకు, మనకు కూడా నీళ్ళిస్తుంది. దాన్నుంచి మన రాష్ట్రానికి రెండు కాలువలు వస్తాయి. హైలెవల్ కెనాల్ అనంతపురం జిల్లాకు, లోలెవల్ కెనాల్ కర్నూలు జిల్లాకు నీళ్ళు ఇస్తాయి. ఇవన్నీ పాత ప్రాజెక్టులు. ఇవన్నీ ఎందుకు చెప్తున్నానంటే స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్యానికి కొంచెం అటూ ఇటూగా వచ్చినటువంటి ప్రాజెక్టులే ఇవన్నీ కూడా. వీటిని కట్టేనాటికి నదీ జలాల పంపకం విషయంలో ఒక చట్టం గానీ, రాజ్యాంగ నియమం గానీ, ఒప్పందాలు గానీ, అగ్రిమెంట్లు గానీ ఏవీ లేవు అని చెప్పడం కోసం.

## జల వివాదాల పరిష్కార చట్టం

స్వాతంత్ర్యం వచ్చాక రాజ్యాంగం రాసుకున్నప్పుడు రాజ్యాంగంలో ఒక నియమం పెట్టారు. ఒక రాష్ట్రంలో పుట్టి, ఆ రాష్ట్రంలోనే సముద్రంలో కలిసిపోయే నది నీటిని ఏ విధంగా వినియోగించాలనేది రాజ్యాంగం చెప్పదు. ఒకటి కంటే ఎక్కువ రాష్ట్రాలలో ప్రవహించే నది అయితే, అంటే అంతర్రాష్ట్ర నది అయితేనే ఆ నది నీటి వినియోగం, ఆ బేసిన్ అభివృద్ధి, దాని వివాదాల పరిష్కారానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఒక చట్టాన్ని చెయ్యొచ్చు. ఆ చట్టం ద్వారా వివాద పరిష్కారానికి ఒక యంత్రాంగాన్ని రూపొందించవచ్చు. ఆ యంత్రాంగం తప్ప ఏ కోర్టు కూడా ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి వీలు లేదని కూడా రూల్ పెట్టొచ్చు. 1956లో అటువంటి చట్టం

చేశారు. దాని పేరు Inter State Water Disputes Act. దాని కింద ఏం చెప్పారంటే అంతర్రాష్ట్ర నదీజలాల వినియోగం విషయంలో సంబంధిత రాష్ట్రాలలో ఏ ఒక్క రాష్ట్రమైనా (సంబంధిత రాష్ట్రాలు అంటే ఏ రాష్ట్రాలలో అయితే ఆ నది పరీవాహక ప్రాంతం ఉందో వాటిలో ఏ ఒక్క రాష్ట్రమైనా అని) తమ వివాదాన్ని పరిష్కారం చెయ్యడానికి ఒక ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చెయ్యమని కేంద్ర ప్రభుత్వాన్ని అడగొచ్చు. అడిగితే కేంద్రం తప్పనిసరిగా వెయ్యవలసిందే. బుద్ధిపుడితే వేస్తాము, లేకపోతే లేదు అనడానికి వీలు లేదు. అయితే ఏ రాష్ట్రం అడగకపోతే మాత్రం కేంద్రం తనపాటికి తను వెయ్యడానికి వీలులేదు. అంటే కేంద్రానికి అదనపు అధికారం ఏమీ లేకుండా చేశారు ఆ చట్టంలో. ఆ ట్రిబ్యునల్‌కు చైర్‌పర్సన్‌గా సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి ఉంటాడు. రిటైర్డ్ జడ్జి కాదు, సిట్టింగ్ జడ్జి. వారితో పాటు నీటిపారుదలకు సంబంధించిన నిపుణులు గానీ, వేరే ఎవరైనా గానీ దాంట్లో సభ్యులుగా ఉంటారు. ఈ తీర్పు మీద అప్పీలు ఉండదు. అంటే దానిని కరెక్టా, తప్పా అని మళ్ళీ సుప్రీంకోర్టులో, హైకోర్టులో కేసులు వేయడానికి ఆస్కారం ఉండదు. ఆ అవకాశం ఉంటే అది ఏళ్ళ తరబడి కోర్టుల్లో అపరిష్కృతంగా ఉండి పోతుందని భావించారు. అది జరగకుండా ఉండాలనే ఉద్దేశంతో కోర్టులకు జోక్యం చేసుకునే అవకాశం ఇవ్వకుండా ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి, ట్రిబ్యునల్ తీర్పే అంతిమం అని చెప్పారు. ఈ తీర్పును అవార్డు అంటారు.

## రాష్ట్రం లోపల మన ఇష్టం

అయితే ట్రిబ్యునల్ ఈ రాష్ట్రానికి ఇంత వాటా, ఆ రాష్ట్రానికి ఇంత వాటా అని మాత్రమే నిర్ణయిస్తుంది. ఆ రాష్ట్రం లోపల వారు ఆ వాటాను ఏ రకంగా పంచుకుంటారు అనే విషయంలో ఎటువంటి పరిష్కార యంత్రాంగం లేదు. మన రాష్ట్రానికి సంబంధించి ఇది ఒక ముఖ్యమైన సమస్య. కృష్ణానది మహారాష్ట్రకు, కర్ణాటకకు, ఆంధ్రప్రదేశ్‌కు కామన్‌గా ఉండే అంతర్రాష్ట్ర నది. వివాదాల పరిష్కారానికి రెండు ట్రిబ్యునల్స్ వచ్చాయి. బచావత్ ట్రిబ్యునల్ 1976లో అవార్డు ఇచ్చింది. 2000 సంవత్సరంలో ఆ అవార్డు అయిపోయింది. తర్వాత బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ఏర్పాటయింది. అది రెండు మూడు నెలల్లో అవార్డు ఇవ్వబోతోంది. అందులో అది ఏం చెప్పినా ఒక రాష్ట్రం లోపల ఏ రకంగా వాడుకోవాలి అనేది మాత్రం చెప్పదు. నిజానికి ఒక ట్రిబ్యునల్ ముందుకు పోయినప్పుడు ప్రభుత్వాలు ఏం చేస్తాయంటే మా రాష్ట్రంలో ఈ ప్రాజెక్టు మేము ప్రతిపాదించాము దానికింత నీళ్ళు కావాలి, మరో ప్రాజెక్టు కట్టబోతున్నాం దానికింత నీళ్ళు కావాలి అని లెక్కలు చూపి అడుగుతారు. సరే అని ట్రిబ్యునల్ ఒప్పుకుంటుంది అనుకోండి, ఒప్పుకున్న తరువాత కూడా ఆ

లెక్కల ప్రకారమే దానిని పంచుకోవాల్సిన అవసరం లేదు. ఆ రాష్ట్రం దానిని ఏ రకంగానైనా వాడుకోవచ్చు. ఈ అవగాహన లేకే ఆల్మట్టి మీద మన వాళ్ళు సుప్రీంకోర్టుకు పోయారు. ఆ రోజే మేమన్నాం, అనవసరంగా సుప్రీంకోర్టుకు పోయారని. కర్ణాటక కృష్ణానదిలో తన వాటాను కోరినప్పుడు చూపించింది వేరు, ఆ తర్వాత చేస్తున్నది వేరు అనే వాదన నిలిచేది కాదు. వాళ్ళు ఎట్లైనా వాడుకొంటారు. లాజిక్ కోసం, ఆర్గ్యుమెంట్ కోసం ఒకటి చూపిస్తారు, తరువాత పరిస్థితులు మారితే వేరే రకంగా వాడుకోవచ్చు. దీని గురించి ఆ రోజే మేము పత్రికల్లో వ్యాసాలు కూడా రాశాము, కానీ చంద్రబాబు నాయుడు సుప్రీంకోర్టుకు పోయి, లక్షలు ఖర్చుపెట్టి కేసు ఓడిపోయి వెనక్కి వచ్చాడు. సుప్రీంకోర్టు చివరికి అదే మాట చెప్పింది. ఒకసారి కేటాయించిన తరువాత ఆ రాష్ట్రం ఏ రకంగా అయినా వాడుకోవచ్చు. అది వాళ్ళ హక్కు. ఆ నీళ్ళు వాళ్ళవి. అంతవరకు బాగానే ఉంది కానీ రాష్ట్రం లోపల ఏ రకంగా వాడుకోవాలి అనే వివాదానికి రాజ్యాంగంలో ఏ పరిష్కారం లేదు. చట్టంలోనూ లేదు. అది దేనికి దారి తీస్తుంది అంటే వివాదం మొత్తం రాజకీయం కావడానికి దారితీస్తుంది. అలాకాక న్యాయబద్ధమైనటువంటి పరిష్కారాన్ని చూపించే మార్గం ఏదన్నా రాజ్యంగంలో ఉన్నా, చట్టాలలో ఉన్నా బాగుండేది. అది లేకపోవడంతో పూర్తిగా రాజకీయంగా మారిపోతున్నది. దానివల్ల రకరకాల సమస్యలు. జనాన్ని రెచ్చగొట్టేందుకు, కోపాలకు, ఆవేశాలకు, ప్రాంతీయ ద్వేషాలకు దారితీస్తోంది. ఆ విషయం తర్వాత చూద్దాం.

1956లో అంతర్రాష్ట్ర జల వివాదాల చట్టం వచ్చిందని చెప్పా కదా. మన రాష్ట్రంలో అప్పటికి కృష్ణానది మీద ప్రకాశం బ్యారేజీ ఒక్కటే ఉంది. దాదాపుగా కేంద్రంలో ఆ చట్టం చెయ్యడమూ, దాని గురించి అన్ని రాష్ట్రాలలో అవగాహన పెరగడమూ ఒకేసారి జరిగింది. అప్పటికే నాగార్జునసాగర్ ప్రాజెక్టు ప్రతిపాదనలో ఉంది. ప్రతి ప్రాజెక్టు విషయంలో వంద సమస్యలున్నాయి. అయితే అవన్నీ ప్రస్తావించటం లేదు నేను. నాగార్జునసాగర్ ఎక్కడ కట్టారు, ఎక్కడ కట్టి ఉండవలసింది, తెలంగాణ వాళ్ళకు, రాయలసీమ వాళ్ళకు ఏమి హామీ ఇచ్చారు, చివరకు ఎట్లా మార్చారు– ఆ వివరాలలోకి పోవడం లేదు నేను. అదో పెద్ద కథ. సెంట్రల్ వాటర్ కమీషన్ దగ్గరకు పోయి అన్ని అనుమతులూ తెచ్చుకుని నాగార్జునసాగర్ ప్రాజెక్టును కట్టుకోవడం మొదలుపెట్టాం.

## సాగర్ 'ఘనత' కె.ఎల్.రావుది

మహారాష్ట్ర అప్పుడే అభ్యంతరాలు లేవదీసింది. ఇది మూడు రాష్ట్రాల ఉమ్మడి నది అయితే ఆంధ్రప్రదేశ్ వాళ్ళు విపరీతంగా కట్టేసుకుంటున్నారు ప్రాజెక్టులు, మీరు దానిని సాగనివ్వద్దు అని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. కేంద్రం ఏ నిర్ణయమూ

తీసుకోకముందే మనం నాగార్జునసాగర్ ప్రాజెక్టు దాదాపు పూర్తి చేసేసుకున్నాం. చాలా త్వరగా కట్టుకుంటూపోయాం. పూర్తవుతున్న ప్రాజెక్టును ఏం చేయగలరు? దాంట్లో ముఖ్యమైన పాత్ర కె.ఎల్.రావుగారిది. ఆయన నెహ్రూ కేబినెట్‌లో మంత్రిగా ఉండి ఈ పని చేశాడు. మనకు ఆయన హీరో కాని మీరు కర్ణాటక, మహారాష్ట్రలకు పోతే ఆయన్ని బాగా తిడతారు. కేంద్ర కేబినెట్‌లో ఉండి, దేశమంతటికి మంత్రిగా వ్యవహరించాల్సిన వాడు ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే మంత్రి అయినట్లు వ్యవహరించాడని తిడతారు– ఇప్పుడు వై.ఎస్. ఎట్లా కడప జిల్లాకు మాత్రమే ముఖ్యమంత్రిగా ఉంటున్నాడని మిగతావాళ్ళు తిట్టుకుంటున్నారో అట్లా. మొత్తానికి మనం ఎవ్వరి అభ్యంతరాలకు అవకాశం లేకుండానే రెండు ప్రాజెక్టులు కట్టుకున్నాం– కృష్ణాడెల్టా వర్క్స్, నాగార్జునసాగర్. చిన్న చిన్నవి ఎట్లాగూ ఉన్నాయనుకోండి.

ఆ దశలో మహారాష్ట్ర వాళ్ళ అభ్యంతరాలను కేంద్ర ప్రభుత్వం ఒక ట్రిబ్యునల్‌కు రిఫర్ చేసింది. ఆ ట్రిబ్యునల్‌కు అధ్యక్షుడు బచావత్ అని సుప్రీంకోర్టు జడ్జి. చాలా కష్టపడి పనిచేసే జడ్జి. ఈ మధ్యకాలంలో సుప్రీంకోర్టు జడ్జీలు ఇట్లా లేరు. మీరు గాని అవార్డు చదివితే ఆయన ఎంత కష్టపడ్డాడో అర్థం అవుతుంది. అదే సమయంలో గోదావరి మీద కూడా ట్రిబ్యునల్ వేశారు. గోదావరి మనకు, ఒరిస్సాకు, మధ్యప్రదేశ్‌కు (ఛత్తీస్‌గఢ్), మహారాష్ట్రకు, కర్ణాటకకు ఉమ్మడి నది. నిజానికి రెండు నదులలోనూ నీళ్ళన్నీ వాళ్ళవే, మనవి కావు. వాడకం మాత్రం మనకే ఎక్కువ దిగువన ఉన్నాం కాబట్టి. ఎక్కువ నీళ్ళు అక్కడ పడే వర్షాలే. ఈ సంవత్సరం ఇంకా శ్రీరాంసాగర్‌కు నీళ్ళు రాలేదు. శ్రీశైలంకూ రాలేదు. అంటే అక్కడ ఇంకా వర్షం పడలేదు అని. పడమటి కనుమలలో వర్షం బాగా పడితే మనకు వర్షాలు లేకపోయినా పైనించి వచ్చే నీళ్ళను హాయిగా వాడుకుంటాం. ఎటొచ్చీ రాష్ట్రమంతటికీ అందడం లేదనే మన ఫిర్యాదు.

## గోదావరి ఒక పేజీ అవార్డు

అదట్లా ఉంచి గోదావరి మీద మనకు ధవళేశ్వరం దగ్గర బ్రిటిషు కాలంలో కట్టిన ఆనకట్ట ఒకటే ఉంది. వేరే పెద్దవేమీ లేవు. గోదావరి విషయంలో ఏం జరిగింది అంటే గోదావరిలో నీళ్ళెక్కువ కాబట్టి ఆ నీటి పంపకంలో పెద్ద వివాదాలేమీ లేవు. ఎక్కువ అంటే అప్పటి అవసరం, అప్పటి అంచనాను బట్టి ఎక్కువ. కాబట్టి రాష్ట్రాలన్నీ ముందుకొచ్చి ఒక ఒప్పందానికి వచ్చాయి. మీకింత, మీకింత, మీకింత అని మేమే ఒప్పుకుంటున్నాము అని వేసిస్తే దానినే ఆయన అవార్డుగా ఇచ్చాడు. గోదావరి ట్రిబ్యునల్ అవార్డు అంతా కలిపి ఒక పేజీ అవార్డు. వాళ్ళే ఒప్పుకుంటున్నారు

కాబట్టి దీనినే నేను అవార్డుగా ఇచ్చేస్తున్నానని చెప్పాడాయన. దాంట్లో మన వాటా 1480 టి.యం.సి.లు.

కృష్ణానది మీద మాత్రం విపరీతమైనటువంటి వివాదం జరిగింది. అన్ని రాష్ట్రాలు కూడా కొట్లాట పెట్టుకున్నాయి. మాకెక్కువ కావాలంటే మాకెక్కువ కావాలని. ఎందుకంటే కృష్ణానది పరీవాహక ప్రాంతమంతా కూడా వర్షాభావ ప్రాంతం.

## బచావత్ లెక్కలు

మన దగ్గర దాదాపు సాగర్ లేదా ప్రకాశం బ్యారేజీ దగ్గర మొదలుపెడితే ఎగువన ఒక పక్క రాయలసీమ, ఒక పక్క తెలంగాణ, తుంగభద్ర మీద ఇంకా ఎగువకు వెళితే బళ్ళారి జిల్లా, కృష్ణానది మీద పైకిపోతే గుల్బర్గా, దాదాపు పడమటి కనుమల దగ్గరకు పోయేంత వరకూ కూడా వర్షాభావ ప్రాంతాలే. పడమటి కనుమలలో బాగా వర్షం పడుతుంది. కాని పడమటి కనుమల దిగువన కృష్ణానది ఎక్కువగా వర్షాభావ ప్రాంతంలోనే ప్రవహిస్తుంది. మళ్ళా కోస్తా జిల్లాలలో ప్రవేశించిన తర్వాతే కృష్ణానది వర్షాలు పడే ప్రాంతంలో ప్రవహిస్తుంది. ఎక్కువగా వర్షాభావ ప్రాంతాలలో ప్రవహించే నది కావడం వలన కృష్ణానది నీటి మీద ఒత్తిడి ఎక్కువ ఉంటుంది. మాక్కావాలంటే మాక్కావాలి అనేటువంటి డిమాండ్ చాలా ఉండింది. దాంతో సహజంగానే ఆంధ్రప్రదేశ్ మీద మిగిలిన రెండు రాష్ట్రాలు గొడవ పెట్టుకున్నాయి. వీళ్ళు ఇప్పటికే ఇంత తీసుకుంటున్నారు, ఇంక వాళ్ళకేమీ ఇయ్యొద్దు అని. దానికి బచావత్‌గారు ఏం చేశారంటే, ఎంత ఇవ్వాలి అంటే ముందు ఎంత ఉందో తెలుసుకోవాలి కదా. ఎంత నీళ్ళున్నాయి కృష్ణానదిలో అన్న అంచనా కోసం ఆయన మొట్టమొదట ఇంజనీర్లను పట్టుకొని వంద సంవత్సరాల సమాచారం తీసుకున్నాడు. ప్రతి సంవత్సరం ఒకే పరిమాణంలో నీరు ఉండదు కదా, ప్రవాహం రకరకాలుగా ఉంటూ ఉంటుంది. 75 శాతం డిపెండబిలిటీ అనే సూత్రం తీసుకున్నాడు. అన్ని సందర్భాలలోనూ దాన్ని ఉపయోగించరు కాని ఆయన తీసుకున్న ప్రమాణం అది. 75 శాతం డిపెండబిలిటీ ప్రకారం కృష్ణానదిలో మొత్తం 2060 టి.యం.సిల నీళ్ళు ఉంటాయని లెక్క తేల్చాడు. ఎక్కడ లెక్క పెట్టాడు ఆయన అంటే ప్రకాశం బ్యారేజీ దగ్గర. ఎందుకంటే పైన అప్పటికి ఎక్కువ ప్రాజెక్టులు లేవు గదా. నాగార్జునసాగర్ ఇంకా పూర్తి కాలేదు. అందువల్ల నదిలోకి వచ్చి చేరిన నీళ్ళంతా, కొద్ది కొద్ది వాడకం మినహాయిస్తే చివరకు అక్కడకు వచ్చేస్తుంది. కాబట్టి అక్కడ ప్రతి సంవత్సరం ఎంత నీరు అందుబాటులో ఉంటుందో డైరక్టుగా లెక్క ఎవరికీ తెలియదు కానీ ప్రవాహం లెక్కకట్టి దాన్నుంచి 2060 టి.యం.సిల నీళ్ళుంటాయని నిర్ధారించాడు.

75 శాతం డిపెండబిలిటీ అంటే– నాలుగింట మూడు సంవత్సరాలు అందుబాటులో ఉండే నీళ్ళని. నాలుగింట మూడు సంవత్సరాలు 2060 టి.యం.సిల నీళ్ళు ఉంటాయని ఒక అంచనాకు వచ్చాడు ఆయన. 75 శాతం డిపెండబిలిటీ తీసుకోకుండా 60 శాతం డిపెండబిలిటీ తీసుకుంటే ఇంకా ఎక్కువ అందుబాటులో ఉంటుంది. అంటే అయిదింట మూడు సంవత్సరాలు ఎంత నీరు ఉంటుందంటే ఇంకా ఎక్కువ ఉంటుంది. అలాగే ఆరింట మూడు సంవత్సరాలు తీసుకుంటే ఇంకా కూడా ఎక్కువ ఉంటుంది. కానీ 75 శాతం డిపెండబిలిటీ ఎందుకు తీసుకున్నారు అనంటే, నాలుగింట మూడేళ్ళు ఈ మాత్రం నీళ్ళు నాకు దక్కుతాయి అన్న భరోసా రైతుకు ఉంటుందని. రైతుకు ఆ మాత్రం భరోసా కూడా లేని ప్రాజెక్టులు కట్టడం న్యాయం కాదు అన్న అభిప్రాయంతో 75 శాతం డిపెండబిలిటీ తీసుకున్నాడు. 75 శాతం డిపెండబిలిటీ ప్రకారం సగటున ప్రతి నాలుగేళ్ళలో మూడేళ్ళు ఆ నీరు అందుబాటులో ఉంటుంది. వీటినే నికర జలాలు అంటున్నాం. ఏ సంవత్సరం అయినా అంతకంటే తక్కువ ఉంటే చెయ్యగలిగింది ఏమీ లేదు. కానీ ఎక్కువ ఉండొచ్చు కదా. అప్పుడా నీటిని మిగులు జలాలు అంటున్నాం. అంటే 2060 టి.యం.సి.ల కంటే ఎక్కువ ప్రవాహం ఏ రోజైనా– ఏ సంవత్సరం అయినా కృష్ణానదిలో ఉంటే దానిని మిగులు జలాలు అంటారు. నీళ్ళు నీళ్ళే, అది నికర జలం అయినా అదే పంట పండుతుంది, మిగులు జలం అయినా అదే పంట పండుతుంది. కానీ హక్కులు కల్పించేటప్పుడు కనీస గ్యారంటీ లేకుండా హక్కులు కల్పిస్తే అది హక్కు అనే భావననే అభాసుపాలు చెయ్యడం అవుతుంది. కాబట్టి కనీసం నాలుగేళ్ళలో మూడేళ్ళయినా నీకీ మాత్రం నీళ్ళు దొరుకుతుంది అని చెప్పాలి అంటే 2060 టి.యం.సి.ల వరకే మనం హక్కులు కల్పించాలి. అవే నికర జలాలు. ఆపైన ఏ సంవత్సరం అయినా ఉండవచ్చును. వాటికి మిగులు జలాలు లేదా సర్‌ప్లస్ వాటర్ అని ఆయన పేరు పెట్టారు.

## ఒక టి.యం.సి. అంటే....

ఇప్పుడు ఈ టి.యం.సి. అంటే ఏమిటో కొంచెం చెప్పుకుంటే మీకు ఈ సమస్య ఇంకా బాగా అర్థం అవుతుంది. టి.యం.సి. అంటే థౌజండ్ మిలియన్ క్యూబిక్ ఫీట్. అంటే వంద కోట్ల ఘనపుటడుగులు. ఒక ఘనపుటడుగు అంటే ఊహిస్తారు కదా. ఒక అడుగు పొడవు, ఒక అడుగు వెడల్పు, ఒక అడుగు ఎత్తు ఉన్న ఒక ఐస్ క్యూబ్‌ను ఊహించుకోండి. అటువంటివి వందకోట్లు ఊహించుకోండి. అదీ ఒక టి.యం.సి. అంటే. ఊహించలేము మనం. కాబట్టి దానికి ఇంకొక మార్గమేమిటీ అంటే ఒక టి.యం.సి.ని దేనికి వాడుకోవచ్చో చెప్పుకుంటే మనకు ఒక అంచనా

వస్తుంది. ఒక టి.యం.సి. నీటి ప్రవాహంతో ఆరువేల ఎకరాల తరి లేక మాగాణి పంట పండించుకోవచ్చు. అదే ఇరిగేటెడ్ డ్రై లేదా ఆరుతడి పంటయితే 10,000 ఎకరాలు దాకా పండించుకోవచ్చనేది మామూలుగా ఉండేటటువంటి ఒక అంచనా. రాజశేఖర్‌రెడ్డి వచ్చిన తరువాత 'డ్రిప్ ఇరిగేషన్' ద్వారా 22 వేల ఎకరాల దాకా కూడా పారించుకోవచ్చని ఆయన కనిపెట్టాడు. ఉదాహరణకు వరంగల్ జిల్లాలో కడుతున్న దేవాదుల ప్రాజెక్టులో 22 వేల ఎకరాలకు పంచుతారట ఒక టి.యం.సి. నీళ్ళను. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా వాడుకోవాలి వాళ్ళు దానిని. అది సాధ్యమవుతుందా లేదా అనేది రాబోయే రోజులలో చూడాలి. తెలంగాణ వాళ్ళకు ఎందుకు కోపం వస్తుందో అర్థం కావాలంటే ఇవన్నీ అర్థం కావాలి. ఇలాంటివి చేసినప్పుడు ఎవరికైనా సకారణంగానే కోపం వస్తుంది. అయితే ఆయనగారి పులివెందులకు కూడా ఆయన డ్రిప్ ఇరిగేషనే పెట్టాడు. పులివెందుల నియోజక వర్గంలో రెండు లక్షల ఎకరాలకు నీళ్ళిస్తున్నాడు. ఆ మేరకు సమభావమే పాటిస్తున్నాడు వరంగల్‌కూ, పులివెందులకూ.

ఇంకొక రకంగా చెప్పుకోవాలంటే చెరువును ఉదాహరణగా తీసుకుందాం. ఒక సగటు చెరువు స్టోరేజి కెపాసిటీ టి.యం.సి.లో పదో వంతు. అంటే మనం మరీ పెద్దది కాదు, మరీ చిన్నది కాదు అనుకునే చెరువు స్టోరేజి కెపాసిటీ టి.యం.సి.లో పదోవంతు కాబట్టి ఒక టి.యం.సి. అంటే పది చెరువులు అనుకోండి. తెలంగాణలో ఉన్నటువంటి చెరువుల సగటు సామర్థ్యం టి.యం.సి.లో పదవ వంతు అని ఒక లెక్క, దాని ప్రకారం చెపుతున్నాను. తెలంగాణలో 5000 చెరువులు ఇప్పటికీ బతికి ఉన్నాయని అంటారు కాబట్టి వాటి సామర్థ్యం 500 టి.యం.సి.లని లెక్క వేసుకోవచ్చు.

## వెనకబడిన ప్రాంతాల పేరు చెప్పి...

మళ్ళీ బచావత్ దగ్గరకు వద్దాం. 75 శాతం డిపెండబిలిటీ సూత్రం ప్రకారం ఆయన లెక్క కట్టింది 2060 టి.యం.సిల నీటిని కదా. ఎక్కువ నీళ్ళు అడగటానికి మూడు రాష్ట్రాలూ పోటీ పడ్డాయి. తమ తమ రాష్ట్రాలలోని వెనుకబడిన ప్రాంతాల గురించి వాళ్ళాయన దగ్గర కన్నీళ్ళు పెట్టుకున్నారు. మా రాష్ట్రంలో ఎడారి ప్రాంతం లాంటి అనంతపురం ఉంది, మహబూబ్‌నగర్ ఉంది అని మన వాళ్ళు; మాకు ఎడారి అయిపోతున్న గుల్బర్గా ఉంది అని కర్ణాటక వాళ్ళు– తర్వాత వాళ్ళకు నీళ్ళిస్తారా లేదా అనేది వేరే సంగతి– ఏడ్చేటప్పుడు ఈ జిల్లాల పేర్లు చెప్పి ఏడుస్తారక్కడ. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ఆ రాష్ట్రాలు ఏమన్నాయంటే ఇప్పటికే వాళ్ళు చాలా ఎక్కువ తీసుకుంటున్నారని. ఇక్కడ ప్రధానంగా క్యాచ్‌మెంట్ (పరీవాహక ప్రాంతం) అన్న ఆర్గ్యుమెంట్ ఒకటి ఆ రాష్ట్రాలు తీసుకొచ్చాయి. దాన్ని సులభంగా అర్థం

చేసుకోవాలంటే ప్రతి నదికి కూడా ఎక్కడెక్కడో పడిన వర్షం చిన్నచిన్న వాగులు, వంకలు ద్వారా నదిలోకి చేరుతుంది. ఆ చేరవేసే ప్రాంతాన్ని మనం క్యాచ్‌మెంట్ అందాం ప్రస్తుతానికి దాని టెక్నికాలిటీస్‌లోకి పోకుండా. క్యాచ్‌మెంట్ ఈల్డ్ (దిగుబడి) ఎంత అన్నది ఒకటి, క్యాచ్‌మెంట్ వైశాల్యం ఎంత అన్నది ఒకటి. ఎంత ప్రాంతం నుంచి నీరు నదిలోకి చేరుతుందనేది వైశాల్యం అయితే, ఎంత నీళ్ళు వాస్తవానికి చేరుతుందనేది ఈల్డ్. వర్షం పడితే ఈల్డ్ ఎక్కువ ఉంటుంది, లేకపోతే తక్కువ ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో క్యాచ్‌మెంటూ తక్కువే, ఈల్డూ తక్కువే.

కృష్ణానది పరీవాహక ప్రాంతంలోని షిమోగా, ఉడిపి ప్రాంతాలలో 4000, 3500 మి.మీ చొప్పున సగటు వర్షపాతం ఉంటే మన దగ్గర మహబూబ్‌నగర్‌లో 500 మి.మీ, కర్నూలులో 500 మి.మీ, అనంతపురంలో 450 మి.మీ ఉంది. కృష్ణానదికి మా కంట్రిబ్యూషన్ ఎక్కువ కాబట్టి ఎక్కువ నీరు మాకే ఇవ్వాలి అని కర్ణాటక అంది. మావి కరువు ప్రాంతాలు కాబట్టి మాకు ఎక్కువ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ అడిగింది. బచావత్ తీసుకున్న వైఖరి ఏమిటంటే ఇప్పటికే కట్టేసిన ప్రాజెక్టులు, వాటి స్థాయిని కదిలించము అని. కృష్ణాడెల్టా వర్క్స్, నాగార్జున సాగర్‌లను అప్పటికే కట్టేసుకున్నారు కాబట్టి, కట్టేసిన వాటిని కూల్చేయాలని ఎవరూ చెప్పరు గానీ ఆయన ఆ రోజే వాటి ఆయకట్టును తగ్గిద్దాం, వాటి నీటి కేటాయింపు తగ్గిద్దాం అనుంటే ఏమయ్యుండేదో చెప్పలేము. ఆంధ్రప్రదేశ్‌కు ఆయన చేసిన మేలు అది. అందుకే బచావత్ అవార్డును మనమే మెచ్చుకుంటాం. కర్ణాటకలో, మహారాష్ట్రలో తిడతారు. కె.ఎల్.రావు ఎలాగో బచావత్ కూడా అలాగే వాళ్ళకు. ప్రాజెక్టులు కూల్చమని ఎవ్వరూ చెప్పరు, ఉన్న ప్రాజెక్టు ఉంటుంది. కానీ రెండు పంటలకు బదులు ఒక పంటకే ఇవ్వండని అనుండొచ్చు. ఆయకట్టు తగ్గించమని, టెయిల్‌ఎండ్ తగ్గించమని చెప్పి ఉండవచ్చు. ఆయన అట్లా చెప్పకుండా ఎంత కేటాయింపు ఉందో అంత కేటాయింపు అట్లాగే కొనసాగుతుంది అనడం వలన ఏమయ్యిందీ అంటే మన ఈల్డ్ కంటే, మన క్యాచ్‌మెంట్ కంటే ఎక్కువ నీళ్ళనే మనం తీసుకోగలుగుతున్నాం. అయినా ఇంకా కావాలని అడిగారు మనవాళ్ళు ప్రధానంగా అనంతపురాన్ని, మహబూబ్‌నగర్‌ను చూపించి. ఇప్పటికీ ఆ రెండు జిల్లాలను చూపుతూ ఉంటారు కదా కరువు అంటే. బచావత్‌గారు ఏం చేశారంటే అంత ఇవ్వలేము కానీ మహబూబ్‌నగర్ జిల్లాలోని జూరాలకు మాత్రం 17.84 టి.యం.సి.ల కేటాయింపు చేశారు. ఈ ప్రాజెక్టు దాదాపు కృష్ణానది ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవహించే చోట ఉంది. తెలంగాణ వాళ్ళకు కోపం రావడానికి మరో కారణం ఏమిటంటే 1970లలో బచావత్ ట్రిబ్యునల్ దానికి 17.84 టి.యం.సి.ల కేటాయింపు ఇస్తే ఇవ్వాళ్టికీ 11.5 టి.యం.సి.లతో మాత్రమే జూరాల

ప్రాజెక్టు కట్టబడింది. ఎందుకంటే ఇంకా ఎక్కువ కెపాసిటీతో కడితే కర్ణాటక వాళ్ళ భూమి మునుగుతుంది, మునిగితే నష్ట పరిహారం ఇవ్వాలి. కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి, ఇవ్వాల్సిన పైసలు ఇచ్చి, ఆ మాత్రం ఎందుకు పూర్తి చెయ్యరు? ఆ పని అయిదు సంవత్సరాల జలయజ్ఞం తరువాత నిన్న మొన్న మొదలుపెట్టారు. జలయజ్ఞంలో ప్రధానమైన అంశం కూడా కాదు అది.

## ప్రిస్క్రిప్టివ్ రైట్

జూరాలకు మినహా అనంతపురానికి గానీ, కర్నూలుకు గానీ, వేరే వెనుకబడిన ప్రాంతాలకు గానీ బచావత్ అవార్డులో ఎటువంటి కేటాయింపు రాలేదు. అయితేనేం కృష్ణానదిలోని 2060 టి.యం.సిలలో మనకు 800 టి.యం.సిలు, కర్ణాటకకు 700 టి.యం.సి.లు, మహారాష్ట్రకు 560 టి.యం.సి.లు ఇచ్చారు. ఎక్కువ నీళ్ళు వాళ్ళవైనా కేటాయింపు మనకే ఎక్కువ. ఎందుకంటే ముందే కట్టుకున్నాం కాబట్టి. 'లా' లో ప్రిస్క్రిప్టివ్ రైట్ అంటారు. లా చదువుకున్న వాళ్ళకు తెలిసే ఉంటుంది, ముందే వచ్చి ఆక్రమించుకున్నవాడికి 'బై ప్రిస్క్రిప్షన్ హి హేజ్ యె రైట్' అని చెపుతారు. వెనక వచ్చిన వాడు దొంగ, ముందు తీసుకున్న వాడు దొర. మనం ముందు తీసేసుకున్నాం కాబట్టి మనం దొరలపోయాం. మనం మన నీళ్ళుగా భావించే 800 టి.యం.సి.ల నికర జలాల్లో 200 టి.యం.సిలు కర్ణాటక నుంచి వస్తాయి ప్రతి సంవత్సరం. క్యాచ్‌మెంట్ ప్రకారం నీళ్ళు పంచాలి అనంటే ఆ 200 టి.యం.సి.లు ముందు వాళ్ళకే ఇచ్చేయాలి. ఎందుకంటే అవి వాళ్ళ నీళ్ళు- వాళ్ళ నీళ్లు మన నీళ్ళు అనదలచుకుంటే. అందుకే మేము మొదటే అన్నాం, నీళ్ళు ఎవరివీ కావు, అవి ప్రకృతిలో భాగంగా వచ్చాయి. ముందు కట్టేసుకున్నంత మాత్రాన అంత నీరు ఎందుకివ్వాలి? తగ్గించి, కావాలంటే ఆంధ్రప్రదేశ్‌లోనే వెనకబడిన ప్రాంతాలకు కొంత తీసుకోండి అనుండొచ్చు బచావత్. కాని ఆయన అనలేదు. అది అట్లాగే ఉండిపోయింది.

అయితే కథ అక్కడితో అయిపోలేదు. అయిపోతే ఈ మిగిలినవన్నీ మనకు చర్చకే కావు. ఆ తరువాత ఏం జరిగిందంటే - బచావత్ అవార్డు గడువు అయిపోయింది. దాని గడువు 1976 నుంచి 2000 సంవత్సరం దాకానే. ఆ తరువాత ఏదన్నా వివాదం లేవదీసుకోవాలి, మళ్ళీ ఫ్రెష్‌గా అవార్డు తెచ్చుకోవాలి. మనవాళ్ళు ఏం చేశారంటే కాలువలను ఆధునీకరించడం ద్వారా మేము వృధా లేకుండా చేసుకున్నాము. అట్లాగే రిటర్న్ ఫ్లో అనేది కొంత ఉంటుంది ప్రాజెక్టుల్లో. అంటే ప్రాజెక్టుల నీళ్ళు పొలాలకు పెట్టిన తరువాత కొంత డ్రెయిన్స్ ద్వారా తిరిగి అదే నదిలోకి వస్తుందని


GODAVARI BASIN PROJECTS
0.00 Km
Nasik
274 Km
Jayakwadi
Singur (1717')
Ghanpur Anicut
NSP (1405')
Manjira River
686 Km
Alisagar LIS
Gutpa LIS
NSP: Nizam Sagar Project
MMD: Mid Maner Dam
LMD: Lower Maner Dam
UMD: Upper Maner Dam
FFC: Flood Flow Canal
SRSP: Sri Ram Sagar Project
764 Km
Sri Ram Sagar Project (1091')
UMD
Maneru
MMD (920')
SRSP Stage-I
GODAVARI RIVER
Saraswathi canal
LMD
Kadem River
Kadem canal
Kakatiya canal
FFC
284 Km
288 Km
905 Km
Yellampally Barrage
Irrigation pipeline
Ralivagu
Gollavagu
NTPC pipeline
SRSP Stage-II
998 Km
Pranahita River +492'
1046 Km
Indravati River
1065 Km
Ichampally Project
346 Km
1072 Km
GLIS (230')
SACB: Sir Arthur Cotton Barrage
PLMC: Polavaram Left Main canal
PRMC: Polavaram Right Main canal
CDC: Central Delta Canal
GLIS: Godavari Lift Irrigation Scheme
Dummugudem LI & HEP (160')
1162 KM
1268 Km
Sabari
Sileru
1312 Km
Polavaram Project (150')
PRMC
Thadipudi LIS
Pushkaram LIS
PLMC
1368 Km
SACB (70')
Western canal
CDC
Eastern canal
1465 Km
BAY OF BENGAL

# KRISHNA BASIN PROJECTS




VBR : Velugodu Balancing Reservoir
PVBBR: Pothuluri Veerabrahmendraswamy Balancing Reservoir
SBR : Somasila Balancing Reservoir
KBR : Kandaleru Balancing Reservoir
VGP : Veligonda Project
TGP : Teluguganga Project
KC Canal: Kurnool-Kadapa Canal

HNSS : Handri - Neeva Sujala Sravanthi
GNSS : Galeru - Nagari Sujala Sravanthi
AMRP: Alimineti Madhava Reddy Project
PJP : Priyadarshini Jurala Project
KLI : Kalwakurthy Lift Irrigation
NLI : Nettempadu Lift Irrigation
KSLI : Koil Sagar Lift Irrigation
BCR : Banakacharla Cross Regulator

# PENNA BASIN PROJECTS




CBR: Chitravati Balancing Reservoir
PABR: Penna-Ahobilam Balancing Reservoir
TGP Canal: Teluguganga Project Canal
TBPLLC: Tungabhadra Project Low Level Canal
TBPHLC: Tungabhadra Project High Level Canal
CB: Chagallu Barrage
GD: Gandikota Dam
MPR: Mid-Pennar Reservoir
SFC: South Feeder Canal

# GODAVARI BASIN PROJECTS





KRISHNA BASIN PROJECTS
LIS: Lift Irrigation Scheme
FRL: Full Reservoir Level
MCM: Million Cubic Meters
ha: Hectare
1 TMC = 28.317 MCM
I ha = 2.4711 Acres
Ac = Acres
Origin Mahabaleshwar, Maharashtra
Almatti Dam
Allocation = 54 TMC
Ayacut = 15.36 lakh Ac
(Total ayacut under UKP)
FRL
+519.66 m
526 Km
47 Km
Narayanapur Dam
Allocation = 119 TMC
FRL
+492.22 m
275 Km
KARNATAKA
Bhima LIS
Nettempadu LIS
Jurala
Allocation = 17.84 TMC
Ayacut = 1.02 lakh Ac
FRL
+318.5 m
176 Km
Kalwakurthy LIS
HNSS
SRBC / GNSS
Srisailam Dam
Capacity = 308 TMC
FRL
+269.73 m
100 Km
AMRP LIS
Nagarjunasagar Dam
Allocation = 281 TMC
Ayacut = 21.43 lakh Ac
FRL
+179.82 m
85 Km
Pulichinthala
Allocation = 9 TMC
Capacity = 45.77 TMC
FRL
+53.34 m
100 Km
Prakasam Barrage
Allocation = 181.20 TMC
Ayacut = 13.08 lakh Ac
FRL
+17.39 m
129 Km
BAY OF BENGAL
ANDHRA PRADESH
Jurala
Allocation = 17.84 TMC
Ayacut = 1.02 lakh Ac
Completed Project
HNSS
Ongoing Project


PENNA BASIN PROJECTS
origin Nandi Hills, KARNATAKA
UPP
Capacity = 1.81 TMC
Ayacut = 10,048 Ac
FRL +536.45 m
168 Km
PABR
Capacity = 11.10 TMC
Ayacut = 1.0 lakh Ac
FRL +443 m
52 Km
Mid Pennar Dam
Capacity = 4.41 TMC
Ayacut = 77,632 Ac
FRL +365.76 m
20 Km
Chagallu Barrage
Capacity = 1.65 TMC
Ayacut = 4500 Ac
FRL +265.93 m
55 Km
Gandikota Dam
Capacity = 26.85 TMC
Ayacut = 26,000 Ac
FRL +212 m
40 Km
Gandikota LIS (Surplus)
GR CBR LIS (6 Lifts)
Mylavaram Dam
Capacity = 9.96 TMC
Ayacut = 75,000 Ac
FRL +202.65 m
11 Km
Modernisation of
Mylavaram Canal
Somasila Project
Allocation = 48.53 TMC
Ayacut = 1.39 lakh Ac
FRL +100.58 m
130 Km
Sangam Anicut
Allocation = 15 TMC
Ayacut = 1.5 lakh Ac
FRL +30.01 m
52 Km
Nellore Anicut
Allocation = 10 TMC
Ayacut = 97,000 Ac
FRL +20.79 m
35 Km
34 Km
BAY OF BENGAL
PABR
Capacity = 11.10 TMC
Ayacut = 1.0 lakh Ac
Completed Project
Chagallu Barrage
Capacity = 1.65 TMC
Ayacut = 4500 Ac
Ongoing Project
PABR: Penna- Ahobilam Balancing Reservoir
UPP: Upper Penna Project
FRL: Full Reservoir Level
MCM: Million Cubic Meters
ha: Hectare
1 TMC = 28.317 MCM
I ha = 2.4711 Acres

లెక్క ఒకటి ఉంటుంది. వీటికి కచ్చితమైన లెక్కలు ఏమీ లేవు కానీ, ప్రాజెక్టుల కాలువల్ని ఆధునీకరించామని చెప్పి మనవాళ్ళు ఏమన్నారంటే నికర జలాల్లోనే ఒక 48 టి.యం.సి.లు మిగుల్చుకున్నాం కాబట్టి వాటికి కూడా మాకు అనుమతులు కావాలని చెప్పి 'సెంట్రల్ వాటర్ కమిషన్'కు అప్లికేషన్ పెట్టుకున్నారు. సెంట్రల్ వాటర్ కమిషన్ దానికి ఒప్పుకుని మూడు ప్రాంతాలకు మూడు ప్రాజెక్టులను ఆ 48 టి.యం.సిలలో కేటాయించింది. ఒకటి పులిచింతల– దీనికి 9 టి.యం.సి.లు. రెండవది భీమా–దీనికి 20 టి.యం.సిలు. మూడవది శ్రీశైలం కుడిగట్టు కాలువ– దీనికి 19 టి.యం.సిలు. కుడిగట్టు కాలువ అంటే కర్నూలు, కడప జిల్లాలకు, ప్రధానంగా కర్నూలు జిల్లాకు నీళ్ళందించే కాలవ. 48 టి.యం.సిలు మిగిల్చామన్నారు కాబట్టి దానిని పంచి - అప్పటికే ఈ ప్రాంతీయ ఫీలింగ్ వచ్చేసింది కాబట్టి - తెలంగాణకు 20 టి.యం.సిలు, రాయలసీమకు 19 టి.యం.సిలు, ఆంధ్రాకు 9 టి.యం.సిలు అని కేటాయించారు. 1980లలో ఈ పంపకం జరిగింది.

తెలంగాణలో కానీ, రాయలసీమలో కానీ కరువు ఎక్కువ కాబట్టి ఈ కేటాయింపులు సరిపోలేదు. అంతకుముందు కట్టేసుకున్నదంతా కోస్తా జిల్లాలకే పోతోంది. నాగార్జున సాగర్ నుంచి కూడా కొంత భాగం మాత్రమే నల్గొండకు వస్తుంది. నల్గొండకు వచ్చింది మళ్ళీ కృష్ణా జిల్లాకు పోతుంది. బాగా కరువున్నటువంటి దక్షిణ తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలకు ఇంకా అవసరం ఉంది. కాని నికర జలాలు అయిపోయినాయి. నికర జలాలలో కాలువలు బాగు చేసి ఆదా చేసుకున్నామని చెప్పిన 48 టి.యం.సిల పంపకం కూడా అయిపోయింది. ఇంకా కావాలంటే ఏమి చెయ్యాలి అనుకున్నప్పుడు మన వాళ్ళకు మిగులు జలాల మీద కన్ను పడింది.

## అక్రమాలకు తెర తీసిందిలా...

ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రి అయిన తరువాత రాయలసీమ నాయకులు ఆయన మీద బాగా ఒత్తిడి పెట్టారు. ఆయనకేమీ తెలియదు. తను దేవుడిని అనుకొనేవాడు ఆయన. అందుకే తనకు ఓటేశారని, తను ఏమైనా చెయ్యవచ్చని అనుకున్నాడు. రాజ్యాంగమూ, చట్టమూ, అవార్డులు వంటివి ఉన్నాయని పట్టించుకోలేదు ఆయన. బచావత్, తెలుగు పేరు కూడా కాదు అది, దేవుడి పేరు అసలేకాదు, ఎందుకు పట్టించుకోవాలి అనుకున్నాడేమో. అలాంటి ఎన్.టి.ఆర్‌ను పట్టుకొని ఇదే రాజశేఖరరెడ్డి, ఇదే మైసూరారెడ్డి, ఇదే రమణారెడ్డి, ఇవ్వాళ కొందరు కాంగ్రెసులో, కొందరు టిడిపిలో, కొందరు ప్రజారాజ్యంలో ఉన్నారు గానీ, ఆనాడు వాళ్ళందరూ కూడా చాలా ఒత్తిడి పెట్టి మిగులు జలాలను కడప, కర్నూలు జిల్లాలకు కేటాయింప

జేసుకున్నారు. ఆ జిల్లాలకు నీటి అవసరం లేదని నేను అనడం లేదు. వాస్తవంగా కూడా అవి బాగా వెనకబడిన ప్రాంతాలు. అయితే మనం అక్రమంగా పోతే ఆ అక్రమాన్ని వేరే వాళ్ళు కూడా చేయగలరన్న విషయం మరిచిపోకూడదు. అక్రమానికి ఎప్పుడూ నియమం ఉండదు. అది నియమ రహితంగా ఉండటం కూడా ప్రాంతీయ ద్వేషాలను రెచ్చగొడుతుంది.

ఒత్తిడి పెట్టటానికి వాళ్ళకు అవకాశం ఎక్కడ దొరికింది అంటే కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లు బచావత్ దగ్గర కూర్చొని మాట్లాడుకునేటప్పుడే మద్రాసు సిటీకి నీళ్ళు కావాలంటూ తమిళనాడు వాళ్ళు ఒక అర్జీ పెట్టారు. మద్రాసు సిటీ చాలా వర్షాభావమున్నటువంటి సిటీ. అందువల్ల మద్రాసు సిటీకి నీళ్ళివ్వండి అని చెప్పి బచావత్ అవార్డులో చెప్పారు. మూడు రాష్ట్రాలు అందుకు ఒప్పుకున్నాయి. దాంతో శ్రీశైలం డ్యాం నుంచి 15 టి.యం.సిలు తీసుకుపోవడానికి కాలువ తవ్వే అవకాశం దొరికింది. ఒరిజినల్‌గా అది కేవలం హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు కోసం కట్టిన డ్యాం. దానికి కాలువలు ఉండవు. స్టోరేజి మాత్రమే ఉంటుంది. నీళ్ళు కిందకి పోతాయి, టర్బైన్ టర్న్ అవుతుంది, కరెంట్ ఉత్పత్తి అవుతుంది. కానీ మద్రాసుకు తాగునీరు ఇవ్వడానికి కాలువ తవ్వే అవకాశం దొరికింది. కుడి పక్క నుంచి పోతుంది ఆ కాలువ. ఆ కాలువ తవ్వడం అనేది కాకతాళీయంగా ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రి అయిన తరువాత మొదలైంది. అప్పుడు వీళ్ళందరూ కూడా రాయలసీమకూ నీళ్ళు ఇవ్వాలి అని పెద్ద ఆందోళన చేసి సాధించుకున్నారు. న్యాయమైనటువంటి కోరికే, కాదనడం లేదు కానీ, అనుసరించిన పద్ధతే బాగా లేదు. చాలా ఒత్తిడి పెట్టి ఏం చేశారంటే ఎట్లాగూ మద్రాసుకు తీసుకుపోతున్నావు కదా, ఇంకొంచెం రాయలసీమకు కూడా ఇవ్వు అని చెప్పి ఆ కాలువ కుండే రెగ్యులేటర్‌ను మరింత వెడల్పు చేయించారు. ఆ కాలువను రెగ్యులేట్ చేసే గేట్లు ఉంటాయి కదా, అదే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్. నిజానికి అక్కడ ఉండేటటువంటి గ్రామం పేరు పోతులపాడు. ఈ రాజశేఖర్‌రెడ్డి, మైసూరారెడ్డి, రమణారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి వీళ్ళందరూ పోయి దానిని పోతిరెడ్డిపాడుగా మార్చి, మద్రాసుకు 15 టి.యం.సి.లు తీసుకుపోవడానికి ఎంత వెడల్పు అవసరమో దానికంటే ఇంకా ఎక్కువ వెడల్పు తప్పనిసరిగా చేయాలని చెప్పి గొడవ పెట్టి మరీ చేయించారు. చేయించి ఏం చేశారంటే మద్రాసుకు వెళ్ళే 15 టి.యం.సి.లే కాకుండా తమ జిల్లాలకు మరొక 29.8 టి.యం.సిలు కేటాయింప జేసుకున్నారు. దీనిలో కొంత కర్నూలుకు, ఎక్కువ భాగం కడపకు, అంతకంటే ఎక్కువ భాగం నెల్లూరుకు ఇచ్చుకుంటూ, ఇప్పుడు చిత్తూరుకు కూడా తీసుకుంటున్నారు. ఈ కాలవ పేరే తెలుగుగంగ.

ఈ 29.8 టి.యం.సిలు ఎక్కడి నుంచి వస్తాయి? అవి నికర జలాలలో భాగం కాదు. నికర జలాల పంపకం అయిపోయింది. ఆ పంపకాలలో నుంచే 15 టి.యం.సి.లు మద్రాసుకు పోతున్నాయి. 29.8 టి.యం.సిలు ఎక్స్‌ట్రా తీసుకుంది ఎక్కడి నుంచి? అవి మిగులు జలాలు అయి ఉండాలి. అంటే ఏ సంవత్సరమైనా 2060 టి.యం.సిల కంటే ఎక్కువ ఉంటే ఈ 29.8 టి.యం.సిలు వస్తాయి లేకపోతే రావు.కానీ బచావత్ అవార్డు ఈ మిగులు జలాల గురించి ఏం చెప్పిందంటే నికర జలాలకు మాత్రమే ప్రాజెక్టులు పరిమితం కావాలి అని. ఆ పైన నీళ్ళు ఏవైనా వస్తే కట్టిన ప్రాజెక్టుల ద్వారా వాడుకోవచ్చు తప్ప, కొత్తగా ప్రాజెక్టులు కట్టడానికి వీలులేదు అని. ఒక పంటకు ఇచ్చే చోట కావాలంటే రెండో పంటకు ఇవ్వు. లేకపోతే కొంచెం ఇచ్చే చోట ఎక్కువ ఇవ్వు. ఇరిగేటెడ్ డ్రైకి ఇచ్చే చోట మాగాణికివ్వు. అంతే తప్ప మిగులు జలాల మీద ప్రాజెక్టు కట్టుకోవడానికి వీలు లేదనేది బచావత్ ట్రిబ్యునల్ అవార్డులో ఒక ముఖ్యమైన అంశం. దానిని మొట్టమొదట అతిక్రమించింది మనమే. ఇప్పుడు బాబ్లీ అనీ, అంతకు ముందు ఆల్మట్టి అని గొడవ చేస్తూ ఉన్నాం కానీ మొట్టమొదట మొదలు పెట్టింది మనమే. మిగులు జలాల మీద హక్కు కల్పించుకుంటూ ప్రాజెక్టు కట్టడమనేది ఆంధ్రప్రదేశే మొదలు పెట్టింది. దానికి ఆనాడు ఎన్.టి.రామారావు పైన భారీ ఒత్తిడి పెట్టింది ఎవరంటే రాజశేఖర్‌రెడ్డి, రమణారెడ్డి, మైసూరారెడ్డి వీళ్ళే. ప్రధానంగా కడప జిల్లా నాయకులు. వీళ్ళే ఒత్తిడి పెట్టి చేయించారు.

ఆల్మట్టి గురించి మనం సుప్రీంకోర్టుకు పోతే వెంటనే వాళ్ళు ఏమడుగుతారు? తెలుగు గంగ ఎప్పుడు కట్టారు? ఎట్లా కట్టారు? ఇవన్నీ అడుగుతారు కదా, ఊరుకోరు కదా! ఇవ్వాళ మనం బాబ్లీ గురించి మాట్లాడితే తెలుగుగంగ గురించి వాళ్ళూ మాట్లాడతారు– మీరు ఎట్లా కట్టారు తెలుగుగంగ ప్రాజెక్టు అని. నేను అందుకే అన్నా, రాయలసీమకు నీళ్ళు అవసరం, ఎవ్వరూ కాదనరు, తెలంగాణకైనా, రాయలసీమకైనా నీళ్ళు చాలా అవసరం. వాటిని పొందడానికి ఒక పద్ధతి పాటిస్తే ఎదుటి వాళ్ళు గౌరవిస్తారు. మనం పద్ధతికి లోబడి ఉన్నాం కాబట్టి ఎదుటి వాళ్ళు కూడా పద్ధతి ప్రకారమే పోవలసి ఉంటుంది. నువ్వు భిన్నంగా పోతే ఏమవుతుందంటే ఎదుటి వాళ్ళు గౌరవించడం మానేస్తారు. తరువాత Chaos మాత్రమే మిగులుతుంది. ఏ రకమైన నియమాలు ఉండవు. దీన్ని కడప జిల్లా నాయకులకు వివరించి చెప్పటం సాధ్యం కాదు, వాళ్ళకు అర్థం కాదు. వాళ్ళ కల్చరే వేరు. అవకాశం ఉంటే చేసుకుంటాం అనేది తప్ప పద్ధతీ, చట్టమూ, నియమమూ, నీతీ అవన్నీ వాళ్ళ దృష్టికి రావు. ఇవన్నీ జరిగాక కూడా వెనుకబడిన ప్రాంతాలు ఇంకా చాలా అట్లాగే ఉండిపోయినాయి.

## గత చరిత్ర

దాంతో సహజంగానే మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల నుంచి డిమాండ్ వచ్చింది. నదికి అటువైపున రాయలసీమ అయితే ఇటువైపు తెలంగాణ. రాజకీయాలలో భాగంగా తెలంగాణ, రాయలసీమ అని చర్చిస్తున్నాం కానీ నైసర్గికంగా చూస్తే గోదావరి బేసిన్, కృష్ణా బేసిన్ అనేది సహజమైనటువంటి విభజన. కృష్ణా బేసిన్‌లోకి మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి కాక రాయలసీమలో కొంత భాగం వస్తుంది. రాయలసీమలోని మిగిలిన భాగం మొత్తం పెన్నా బేసిన్‌లో ఉంది.కానీ పెన్నా నదిలో నీళ్ళు చాలా తక్కువ కాబట్టి రాయలసీమ వాళ్ళు ఎప్పుడూ కూడా కృష్ణానది నుంచి నీళ్ళు తీసుకోవాలనే ఆలోచనలోనే ఉన్నారు. వేరే మార్గం లేదు కూడా. అనుసరించే పద్ధతుల పట్ల కోపమే తప్ప తీసుకోవడానికి వీలులేదు అంటే క్షామమూ, చావులూ తప్ప ఏమీ ఉండవు రాయలసీమలో. అందుకనే 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు అంటే మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్రరాష్ట్రం వేరు కావాలనే డిమాండ్ వచ్చినపుడు రాయలసీమ వాళ్ళకు చాలా అనుమానం ఉండింది. ఎందుకంటే అంతకుముందు బ్రిటిషువాళ్ళు ఏం చేశారంటే కృష్ణానదిపైన రాయలసీమ ప్రాంతంలో పెద్ద డ్యాం కట్టి వాళ్ళకు నీళ్ళిచ్చుకుంటూ తమిళనాడుకు నీళ్ళు తీసుకుపోవాలనే ఆలోచన చేశారు. తమిళనాడు వాస్తవానికి మనకంటే వర్షాభావ రాష్ట్రం. ఒక్క తంజావూరు దగ్గరున్న కావేరి డెల్టా తప్ప మిగతా రాష్ట్రం అంతా చాలా వెనుకబడి ఉంటుంది. ఇతరత్రా వాళ్ళు – ముఖ్యంగా ఇండస్ట్రియల్‌గా – చాలా డెవలప్ అయ్యారు. అది వేరే విషయం. వాళ్ళకున్నటువంటి అడ్మినిస్ట్రేటివ్ యోగ్యత వల్ల వాళ్ళు బాగుపడ్డారే కానీ వర్షం రీత్యా చూస్తే చాలా వర్షాభావం ఉన్న రాష్ట్రం తమిళనాడు. అప్పటి మద్రాసు రాష్ట్రం ఏమి ఆలోచన చేసిందంటే రాయలసీమలో ఎక్కడో ఒక చోట పెద్ద డ్యాం ఒకటి కట్టి రాయలసీమకు కొంత ఇస్తూ తమిళనాడుకు ఎక్కువ నీళ్ళు తీసుకెళ్ళాలని. మద్రాసు రాష్ట్రంలో ఉంటేనే ఆ నీళ్ళు మాకు వస్తాయి. ఆంధ్రులతో కలిస్తే, ఆంధ్ర రాష్ట్రం ఏర్పడితే మాకు అవి ఇవ్వరు అన్నటువంటి సందేహం ఆ రోజు రాయలసీమ నాయకులలో ఉండింది. కాబట్టే వాళ్ళు ఒత్తిడి పెట్టారు. కృష్ణానది జలాలలో రాయలసీమ అవసరాలకు మొదటి ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇస్తేనే ప్రత్యేక ఆంధ్రా రాష్ట్రానికి మేము ఒప్పుకుంటాం, లేకపోతే ఒప్పుకోమని వాళ్ళు అప్పుడు గొడవ పెట్టారు. అప్పుడు కుదిరిన ఒప్పందాన్నే శ్రీబాగ్ ఒడంబడిక అంటారు. శ్రీబాగ్ అనేది ఒక నాయకుడి ఇల్లు. ఆ ఇంటి పేరు అది. అక్కడ ఒక అగ్రిమెంట్‌లా జరిగింది. ఆంధ్రా ప్రాంత నాయకులు అంటే సర్కారు జిల్లాల నాయకులు, కృష్ణానది

జలాల వినియోగంలో రాయలసీమ అవసరాలకు మొదటి ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చే ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు వారిని ఒప్పించడం జరిగింది.

మళ్ళీ 1956లో తెలంగాణ వాళ్ళూ అదే అడిగారు. ఆంధ్ర నాయకులు మళ్ళీ అదే హామీ ఇచ్చారు. రాయలసీమ అవసరాలకు మొదటి ప్రాధాన్యం ఇస్తామని వాళ్ళకు 1953లో హామీ ఇచ్చి, మీకే మొదటి ప్రాధాన్యం ఇస్తామని 1956లో తెలంగాణ వాళ్ళకు చెప్పి చివరికి ఇద్దరికీ ఇవ్వకుండా సర్కారు జిల్లాలకు నీళ్ళు వాడుకోవడం కొనసాగించారన్నది వాస్తవం.

## తామరతంపరగా కొత్త ప్రాజెక్టులు

మళ్ళీ మిగులు జలాల దగ్గరికి వస్తే, మిగులు జలాల మీద తెలుగుగంగ ఎలాగూ ప్రారంభించావు కదా, ప్రారంభించాక ఇంక సమస్య ఏముంది అనుకున్నారు. మరిన్ని ప్రాజెక్టులు కట్టాలి అనే డిమాండ్ క్రమంగా పెరగడం మొదలైంది. ఆయా జిల్లాలలో ఆయా నియోజకవర్గ నాయకులు ఎవరో ఒకరు ఒక ఇంజనీరును పట్టుకోవడం, ఒక స్కీము తయారు చేయించడం, ఆ ప్రాజెక్టును ముందుకు తీసుకురావడం... ఇలా జరుగుతూ పోయింది. దాంతో రకరకాల ప్రాజెక్టులు చర్చకు వచ్చాయి. ఈ 40 టి.యం.సిలు దీనికి కేటాయిస్తాం, ఇన్ని ఎకరాలు ఇక్కడ సాగు అవుతాయి, ఇంకో 40 టి.యం.సిలు అక్కడ కేటాయిస్తాం, అక్కడ ఇన్ని ఎకరాలు సాగవుతాయి అంటూ రకరకాల హామీలు ఇచ్చుకుంటూ వచ్చారు. ఇటు తెలంగాణలో, అటు రాయలసీమలో కూడా హామీలు ఇచ్చుకుంటూ వచ్చారు. అవన్నీ హామీలుగానే ఉండిపోయాయి చాలా కాలం పాటు. ఒక్కొక్క దానికి పలుమార్లు పునాది రాళ్ళు కూడా వేశారు. శ్రీశైలం ఎడమ గట్టు కాలువకు, హంద్రీ- నీవాకు వేసిన పునాది రాళ్ళకయితే లెక్కే లేదు, అన్ని పునాది రాళ్ళు వేశారు. సరే పునాది రాళ్ళే కదా వేసుకుంటే వేసుకున్నారులే అని చెప్పి కర్ణాటక, మహారాష్ట్ర అభ్యంతరం చెప్పలేదు.

రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఏం చేశాడంటే పునాదిరాళ్ళు వేసినటువంటి మిగులు జలాల ప్రాజెక్టులన్నిట్నీ కట్టడం మొదలు పెట్టాడు. అవి తెలుగుగంగ కాక ఏడు ఉన్నాయి. వాటన్నిటికి నీళ్ళు ఇవ్వాలంటే కర్ణాటక, మహారాష్ట్రలకు పూర్తిగా మానేసి మనమే తీసుకోవాలి కృష్ణానది నీళ్ళన్నీ. ఆ ఎనిమిది ప్రాజెక్టులు ఏమిటీ అంటే మహబూబ్‌నగర్‌కు రెండు- నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం. భీమా ఏమో అంతకు ముందే ఆదా చేశాము నీళ్ళు అని చెప్పి తెచ్చుకున్న ప్రాజెక్టు. అనుమతి తెచ్చుకుంది 1980లలో అయితే 2008లో మొదలుపెట్టారు దానిని కట్టడం. కోపాలు వస్తాయంటే రాకుండా ఉంటాయా? అదే

రాయలసీమకు నీళ్ళు తీసుకెళ్ళే శ్రీశైలం కుడిగట్టుకాలువ మాత్రం దాదాపుగా పూర్తి అయిపోయింది. నాలుగైదు సంవత్సరాలలో పూర్తి చేసుకున్నారు దానిని. భీమా నిజానికి నికర జలాల ప్రాజెక్టే. అయినా తెలుగుగంగ తరువాతే మొదలుపెట్టారు దానిని. నెట్టెంపాడు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలు కాక నల్గొండ జిల్లాకు శ్రీశైలం ఎడమగట్టు కాలువ అనే ప్రాజెక్టు ఒకటి, నాగార్జున సాగర్ దగ్గర ఎలిమినేటి మాధవరెడ్డి కాలువ అనే ప్రాజెక్టు ఇంకొకటి కట్టడం మొదలుపెట్టారు. ఇవి నాలుగూ తెలంగాణకు.

రాయలసీమకూ ఇంకో రెండున్నాయి. అన్నీ శ్రీశైలం నుంచే మొదలవుతాయి. రాయలసీమకు నీళ్ళు ఇవ్వాలంటే వేరే మార్గమేమీ లేదు. ఒకటి హంద్రీ- నీవా ప్రాజెక్టు. ఇది కర్నూలు మీదుగా అనంతపురం జిల్లాకు నీళ్ళు తీసికెళ్ళే ప్రాజెక్టు. ఇంకొకటి గండికోట లేక గాలేరు- నగరి. కడప జిల్లాకు పోతుంది. తెలుగుగంగ ముందే ఉంది. కాబట్టి తెలుగుగంగ, హంద్రీ- నీవా, గండికోట లేక గాలేరు- నగరి మొత్తం మూడు అయ్యాయి. అవి మూడూ రాయలసీమకు అయితే ఇంకొకటి ప్రకాశం జిల్లాలోని గిద్దలూరు, కంభం ప్రాంతాలకు నీళ్ళు తీసుకెళ్ళే వెలిగొండ ప్రాజెక్టు. ఈ ప్రాంతం బాగా వెనుకబడినటువంటి కరువు ప్రాంతం. అంటే మిగులు జలాల మీద మొత్తం ఎనిమిది ప్రాజెక్టులు. ఒక్కొక్క దానికి నలభై, నలభై అయిదు, యాభై టి.యం.సిలు..... స్థానిక ఎమ్మెల్యే ఇష్టం, ఎంతైనా ప్రామిస్ చేస్తాడు. అతనికేమీ ఇబ్బంది లేదు. వాటన్నిటినీ పూర్తి చేయాలంటే 300, 350 టి.యం.సిల నీళ్ళు కావాలి. మనకేమో చుక్క లేదు. మనకిచ్చిన 800 టి.యం.సిలు అయిపోయినాయి కదా. అయినా ఈ ప్రాజెక్టులన్నీ కడుతున్నారు. మేము మొదటినుంచి చెపుతున్నది ఏమిటంటే, అన్నీ కరువు ప్రాంతాలే, నీళ్ళు కావాల్సిన ప్రాంతాలే, ఇవ్వడం అవసరమే, కాని సవ్యమైన మార్గం అనుసరించు అని.

## బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్

2004 సంవత్సరంలో రెండవ ట్రిబ్యునల్ ఏర్పడింది, ఆ ట్రిబ్యునల్ ముందుకుపోయి మిగులు జలాలకు కూడా మాకు హక్కులు కల్పించండి అనో, మిగులు జలాలకు కూడా ప్రాజెక్టులు కట్టుకొనే అవకాశం మాకు కల్పించండి అనో అడగాలి కదా. అటువంటి ప్రతిపాదనలు పెట్టకుండా నువ్వు బచావత్ అవార్డుకు వ్యతిరేకంగా ఇంత భారీగా 8 ప్రాజెక్టులు కట్టుకుంటూ పోతే రేపు కర్ణాటకనైనా, మహారాష్ట్రనైనా ఏమని ప్రశ్నిస్తావు నువ్వు? రెండవది రైతులను ఎంత మోసం చేస్తున్నావు నువ్వు? ప్రాజెక్టులు కట్టినప్పుడు నీళ్ళొస్తాయని చెప్పి ఆశపడతారు కదా! కాని ఇవి మిగులు జలాల ప్రాజెక్టులు, ఎప్పుడు నిండుతాయో తెలియదు. వరుణ దేవుడు నా పార్టీలో

చేరాడు అని రాజశేఖరరెడ్డి అనుకోవచ్చు కానీ ఆయన కాంగ్రెస్ పార్టీలో పర్మనెంట్‌గా ఉండేటట్టు కనపడ్డం లేదు. రాజీనామా చేసినట్టున్నాడు. అప్పుడేమి చెయ్యాలి? ఇవన్నీ ప్రశ్నలే.... అయినా కట్టుకొంటూ పోతున్నాడు. కామన్‌గా పత్రికలలో వచ్చే వ్యాఖ్యలైనా, మేము చేసేదైనా ఏమిటంటే ఈ ప్రాజెక్టులు కాంట్రాక్టర్ల కోసమేగానీ రైతుల కోసం కాదు. కాలువలు అద్భుతంగా తవ్వేస్తున్నారు. ఇవన్నీ ఎక్కువగా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు కాబట్టి పెద్ద డ్యాం కట్టేది ఏముండదు, చిన్న సంప్ లాంటిది క్రియేట్ చేస్తారు. లిఫ్ట్ చేసుకుంటూ పోతారు. భారీ ప్రాజెక్టులు కావు కాబట్టి ముంపు కూడా ఎక్కువేమీ ఉండదు. కాలువలే ప్రధానమైన కన్‌స్ట్రక్షన్ కాబట్టి కాంట్రాక్టర్లకు ఆదాయాలు అద్భుతంగా వస్తాయి. రాజశేఖరరెడ్డి వచ్చిన తరువాత మీరు రాష్ట్రంలో ఎక్కడికి పొండి కాంట్రాక్టర్లు కడప జిల్లా వాళ్ళే, వేరే ఎవ్వరూ లేరు. మీరు తెలంగాణ మారుమూల ప్రాంతానికైనా పొండి- అక్కడా వాళ్ళే. మంచిర్యాల దగ్గర చిన్న వాగు, ర్యాలీ వాగు అని, ఆ ప్రాజెక్టు నిర్మాణంలో ప్రమాదం జరిగి 12 మంది కూలీలు చనిపోయారని తెలిసి మేము పోయినప్పుడు దాని సబ్ కాంట్రాక్టర్లు ఇద్దరూ కడప జిల్లా వాళ్ళే అని తెలిసింది.

2000 సంవత్సరంలో బచావత్ అవార్డు టైమ్ అయిపోయినపుడు కర్ణాటక మన మీద ఫిర్యాదు చేసింది. అప్పటికి ఇంకా రాజశేఖర్‌రెడ్డి హయాం మొదలు కాలేదు కానీ, చంద్రబాబు నాయుడు నాగార్జునసాగర్ మీద ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టును మొదలుపెట్టాడు. బచావత్ అవార్డుకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ మిగులు జలాలతో ప్రాజెక్టు కట్టేసుకుంటున్నదని కర్ణాటక ఫిర్యాదు చేస్తే కేంద్ర ప్రభుత్వం మళ్ళీ ఒక ట్రిబ్యునల్‌ను నియమించింది. సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి బ్రిజేశ్ కుమార్‌ను ట్రిబ్యునల్ చైర్మన్‌గా నియమించింది. కర్ణాటక మొట్టమొదట వేసిన అప్లికేషన్ ఏమిటీ అంటే ఈ ఎనిమిది ప్రాజెక్టులనూ ఆపమని ఆదేశం ఇవ్వండీ అని. కారణం "Because it is contradictory to Bachawat Award". ఏం చెప్పారు మనవాళ్లు? ఆ 8 ప్రాజెక్టులకూ మేము నీటి హక్కులు అడగము, ఉంటే తీసుకొంటాము లేకపోతే లేదు అని చెప్పారు. దాంతో ట్రిబ్యునల్ కర్ణాటక అప్లికేషన్‌ను డిస్మిస్ చేసింది. మన పేపర్లో వార్త ఏమొచ్చింది? కర్ణాటక వాళ్ళ అభ్యర్థనను తోసిపుచ్చిన బ్రిజేశ్‌కుమార్ కమిషన్ అని. ఏమి తోసిపుచ్చింది అనంటే ఆంధ్రప్రదేశ్ 'అక్రమంగా కట్టుకుంటున్న ప్రాజెక్టులు ఆపండీ' అని వాళ్ళంటే మనవాళ్ళు 'మేము హక్కులు అడగం కదా ఎందుకు ఆపాలి' అన్నారు. దానితో డిస్మిస్ చేశారు. 'లా'లో దీన్ని infructuous application అంటారు. హక్కులు అడగని విషయం కాబట్టి, అందులో చట్టం నిర్ణయించాల్సిన అంశమేదీ లేదు కాబట్టి దాన్ని డిస్మిస్ చేశారు బ్రిజేశ్ కుమార్‌గారు. దీన్ని పట్టుకుని

‘కర్ణాటక వాళ్ళ అభ్యర్థనను తోసిపుచ్చిన రెండవ కృష్ణా ట్రిబ్యునల్’ అని పేపర్లో వార్తలు రాసుకున్నాం మనం.

ఇవ్వాళ పరిస్థితి ఏమిటి? ఈ ట్రిబ్యునల్ అవార్డు ముప్పై ఏళ్ళో నలభై ఏళ్ళో అమలులో ఉంటుంది. అంటే కరువు ప్రాంతాల కోసం తాము కడుతున్న ప్రాజెక్టులకు ముప్పై, నలభై ఏళ్ళ వరకు ఎలాంటి నీటి హక్కులుండవు అని ఒప్పుకొని వచ్చాడు రాజశేఖరరెడ్డి. దురదృష్టం ఏమిటంటే ఈ ఎనిమిది ప్రాజెక్టులలో నాలుగు తెలంగాణలో, మూడు రాయలసీమలో, ఒకటి ఆంధ్రాలో ఉన్నా, ప్రాంతీయ వైషమ్యాలు ఎంతగా ఉన్నాయంటే ఈ మూడు ప్రాంతాలలో ఏ ఒక్కటీ దీని గురించి మాట్లాడడం లేదు. వీళ్ళందరూ ఒకటిగా ఉండి ఉంటే ఈ ఎనిమిది ప్రాజెక్టుల ఆయకట్టుదారులు – అంటే ఈ ఎనిమిది ప్రాజెక్టుల ద్వారా నీళ్ళు పొందబోయే రైతాంగం అంతా కూడా ముందుకు వచ్చి ఆందోళన చేయగలిగి ఉండేది. ఎవ్వరూ మాట్లడకపోవడం వల్ల రాజశేఖరరెడ్డి గారే దానిని అవార్డు చేసి వెనక్కి రాగలిగారు.

## పునఃపంపిణీ ఒక్కటే పరిష్కారం

మరైతే ఏం చేయాలి అన్న ప్రశ్న వస్తుంది. నికర జలాలు లేవని మీరే అంటున్నారు, ఇవి కరువు ప్రాంతాలని కూడా మీరే అంటున్నారు, ఆయన ఏదో ఒక రకంగా మిగులు జలాల పేరు మీద ప్రాజెక్టులు కట్టేసి అప్పుడప్పుడైనా నీళ్ళు ఇస్తానంటే అదీ వద్దంటున్నారు, అనవసరంగా ఖర్చు అంటున్నారు, మరేం చేయాలి అని మమ్మల్ని మీరు ఒక ప్రశ్న వేయవచ్చు. దీనికి మేము మొదటి నుంచి చెప్తున్న జవాబు ఏమిటంటే, ఇంతవరకు నేను వాస్తవాలు చెప్పుకుంటూ వచ్చాను, ఇక్కడ మా మానవ హక్కుల వేదిక తరఫు నుంచి మేము చెప్తున్న జవాబు ఏమిటీ అనంటే నీటి హక్కుల్ని పునః పంపిణీ చేద్దాం. అది ఏ రకంగా చెయ్యాలనేది మళ్ళా చెపుతాను. మనకొచ్చిన 800 టి.యం.సిల కేటాయింపు ఇవ్వాళ ఏ రకంగా హక్కులుగా వాడుకోబడుతున్నాయో, అంటే కృష్ణాడెల్టాకు ఇంత, నాగార్జునసాగర్‌కు ఇంత.... అలా ఆ కేటాయింపును పునః పంపిణీ చేస్తే ఒక 200 టి.యం.సిలను మిగిలించవచ్చు. ఆ 200 టి.యం.సిలతో ఈ ఎనిమిది ప్రాజెక్టులకు 25,30 టి.యం.సిల చొప్పున నీళ్ళు ఇచ్చినా కూడా ఉపయోగమే. ఒక లక్షా యాభైవేల ఎకరాలకో, 2 లక్షల ఎకరాలకో ఆరుతడి పంటకైనా నీళ్ళొస్తాయి. ఆ మేరకైనా నీళ్ళుంటాయి. తాగు నీటికైనా వస్తాయి. ఇదీ మా ప్రతిపాదన.

## నీళ్ళ బదిలీకి వై.ఎస్.వ్యూహం

రాజశేఖరరెడ్డి గారి ఆలోచన ఏమిటీ అనంటే గోదావరి నుంచి నీళ్ళు తీసుకుని కృష్ణాకు మళ్ళిద్దామని. అందుకే కృష్ణా ట్రిబ్యునల్ దగ్గరకు పోయి మేము నీటి హక్కులు

అడగము అని చెప్పేసి, కర్ణాటక వాళ్ళ అభ్యంతరాన్ని డిస్మిస్ చేయించుకొని వెనక్కొచ్చి, గోదావరిలో నుంచి నీళ్ళు తీసుకొచ్చి కృష్ణాలో పోస్తాము, దానిని వాడుకొంటాము అని చెబుతున్నాడు. ఇది చాలా తెలివైన పని అని ఆయన భావిస్తున్నాడు. పోలవరం డ్యాం నుంచి 80 టి.యం.సిల నీళ్ళు ప్రకాశం బ్యారేజీకి తరలించాలని ఆయన ఆలోచన. పోలవరం నుంచి 80 టి.యం.సిలు, దుమ్ముగూడెం నుంచి నాగార్జునసాగర్ కిందకి మరో 100 టి.యం.సిలు, మొత్తం 180 టి.యం.సిల నీళ్ళను గోదావరి నుంచి కృష్ణా బేసిన్‌కు బదిలీ చేస్తే ఆ 180 టి.యం.సిలను కొత్తగా కట్టబోయే ఈ ప్రాజెక్టులకు వాడుకోవచ్చు అనేది రాజశేఖరరెడ్డి గారి ఆలోచన. ఆ ప్రకారమే పోలవరం డ్యాం కట్టేస్తున్నారు. మొండిగా ఉన్నారు. దుమ్ముగూడెం ప్రాజెక్టు కట్టేది ఈ 100 టి.యం.సిలు ట్రాన్స్‌ఫర్ చెయ్యడానికి, ఖమ్మం జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు నీళ్ళు ఇవ్వడానికి. ఖమ్మం జిల్లాలో నీళ్ళు ఇవ్వడానికి ఏర్పాట్లు ఏమీ మొదలవలేదు గానీ, ఈ ట్రాన్స్‌ఫర్‌కు మాత్రం ఏర్పాట్లు జరిగిపోతున్నాయి. టిఆర్ఎస్ వాళ్ళకు కోపం వస్తుందంటే ఊరికే రావడం లేదు. వాళ్ళ అభ్యంతరం ఏమిటి? ఆ నీళ్ళను కృష్ణా బేసిన్‌కు తరలిస్తారని. సరే టిఆర్ఎస్ రాజకీయాలలో భాగంగా కృష్ణా బేసిన్‌కు తరలింపు రాయలసీమకు ఇవ్వడానికే అంటారు కానీ రాయలసీమకే కాదు, దక్షిణ తెలంగాణకు కూడా వస్తుంది అది.

మీకు అనుమానం రావచ్చు. నాగార్జునసాగర్ కింద కృష్ణానదిలో కలవబోయే నీళ్ళు నది పైకి ఎలా పోతాయి? రాయలసీమకు, మహబూబ్‌నగర్‌కు, నల్గొండకు ఎలా ఇవ్వగలుగుతారని. ఎట్లా పోతాయో చూద్దాం. మన వాళ్ళకు ఈ ఆలోచన వస్తుందని కర్ణాటకకు, మహారాష్ట్రకు ముందే అనుమానం ఉంది. ఆంధ్రావాళ్ళు తెలివైన వాళ్ళు, ఇప్పుడు మీ దగ్గర కన్నీళ్ళు పెట్టుకొని మాకు జూరాలకివ్వండి, మాకు అనంతపురానికియ్యండి అని అడుగుతున్నారు కాని ఎప్పుడో ఒకప్పుడు గోదావరి నీళ్ళను కృష్ణానదిలోకి ట్రాన్స్‌ఫర్ చెయ్యబోతారు అని ఆ రోజే కర్ణాటక మహారాష్ట్రలు అన్నాయి. అందుకే బచావత్ తన అవార్డులో ఒక పేరా రాశాడు. ఏమనంటే "If at any time in the future Andhra Pradesh transfers water from the Godavari Basin to the Krishna Basin that water becomes part of the Krishna Basin. Therefore, both Karnataka and Maharashtra will also have a right to that water. అర్థమైంది కదా. ఎప్పుడైనా భవిష్యత్తులో గోదావరి నుంచి నీళ్ళు కృష్ణాకి గాని బదలాయిస్తే అవి కృష్ణా బేసిన్ నీళ్ళు అయిపోతాయి. అప్పుడవి ఈ పంపకంలో భాగం అవుతాయి. ఏ దామాషాలో అయితే 800, 700, 560 టి.యం.సిలను పంచారో అదే దామాషాలో ఆ నీళ్ళను కూడా పంచుకోవాలి. దాని

అర్థం ఏమిటి? ఈ 180 టి.యం.సిలలో 100 టి.యం.సిలు మనకు ఉంటాయి. మిగతా 80 టి.యం.సిలు వాళ్ళకు పోతాయి. ఎలా పోతాయి? ఇక్కడ నుంచి పైకి ట్యాంకర్లలో పోవు కదా అంటారేమో. వాళ్ళు పైన ఆపుకుంటారు.

ఆంధ్రా ప్రాంతాన్ని ఏమన్నా అంటే చాలామందికి కోపాలు వస్తాయి కానీ కృష్ణా డెల్టా మొత్తం వాడకం 180 టి.యం.సిలు. గోదావరి బేసిన్ నుంచి ఎంత ట్రాన్స్‌ఫర్ కానున్నాయో కరెక్టుగా అంతే. తెలంగాణ, రాయలసీమలకు నీళ్ళిచ్చే పేరు మీద ఏం చేస్తున్నారు అంటే కృష్ణా నది కంటే ఎప్పుడూ ఎక్కువ నీళ్ళుండే గోదావరి నుంచి కరెక్టుగా 180 టి.యం.సిలు కృష్ణాకు ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారు. కృష్ణాలో నీళ్ళు ఉన్నా లేకపోయినా, డెల్టాకు కావాల్సిన నీళ్ళు తప్పనిసరిగా గోదావరి నుంచి ట్రాన్స్‌ఫర్ అయివస్తాయి. అప్పుడు కృష్ణానది నీళ్ళను ఆ మేరకు పైనే ఆపుకోవచ్చు. నెట్టెంపాడు దగ్గర తీసుకోవచ్చు, కల్వకుర్తి దగ్గర తీసుకోవచ్చు, శ్రీశైలం దగ్గర ఆపేసుకోవచ్చు. సాగర్‌లో కూడా నిల్వ చేసుకోవచ్చు. ఆ విధంగా నల్లగొండకు, మహబూబ్‌నగర్‌కు, అనంతపురానికి, కర్నూలుకు ఇచ్చుకోవచ్చు అనేది ఆలోచన. కానీ దానిలో 80 టి.యం.సిలు కర్ణాటక, మహారాష్ట్రలకు పోతాయి కదా! కర్ణాటక వాడెక్కడాపుకుంటాడు? కరెక్టుగా జూరాలకు, భీమాకు పైన ఆపుకుంటాడు. టి.బి డ్యాం పైన ఆపుకుంటాడు. వర్షం బాగా ఉన్న సంవత్సరం సమస్య ఉండదు. ఎందుకంటే ఇంతకుముందే చెప్పాను కృష్ణానదిలోకి మనకు కర్ణాటక నుంచి 200 టి.యం.సిలు నీళ్ళు వస్తాయి. ఈ 80 టి.యం.సిలు వాళ్ళు ఆపుకున్నా మనకొచ్చేవి వస్తాయి. వర్షాభావం ఉన్న సంవత్సరాలలో మాత్రం ఈ 80 టి.యం.సిలు వాళ్ళు ఆపుకుంటే మహబూబ్‌నగర్‌కు నీళ్ళిచ్చే భీమా, జూరాల, అనంతపురానికి నీళ్ళిచ్చే టి.బి. డ్యాం ఇవన్నీ దెబ్బతింటాయి. అంటే ఈ ట్రాన్స్‌ఫర్ వల్ల జరగబోయేది ఏమిటంటే వర్షాభావ సంవత్సరంలో మహబూబ్‌నగర్, అనంతపురం, కర్నూలు జిల్లాలకు వచ్చే నీటి మీద దెబ్బ పడుతుంది– రాజశేఖరరెడ్డి గారు చేస్తున్నటువంటి ఈ పని వలన.

## గోదావరి మీద రెండే రెండు

గోదావరి సంగతి ఇంకా చెప్పుకోలేదు మనం. గోదావరిలో 1480 టి.యం.సిలు మన వాటాగా వచ్చాయని చెప్పాం కదా. ఆ 1480 టి.యం.సిలలో అప్పుడెప్పుడో బ్రిటిషువాడు ధవళేశ్వరం దగ్గర కట్టినటువంటి ఒక ఆనకట్ట, ఆ తరువాత శ్రీరాంసాగర్– ఇది దాదాపుగా మన రాష్ట్రంలోకి గోదావరి ప్రవేశించే మొదట్లో ఉంటుంది – తప్ప మనం గోదావరిపై మరేమీ కట్టుకోలేదు. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం– తెలంగాణలో మొత్తం 5 జిల్లాలు దాటి వస్తుంది

అది. అయినా ఒక్క ప్రాజెక్టు కట్టలేదు ఇన్ని సంవత్సరాలలో. తెలంగాణ అవసరాలకు ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చి 1956లో తెలంగాణను కలుపుకొని కూడా ఒక్క ప్రాజెక్టు కట్టలేదు. శ్రీరాంసాగర్‌ను కూడా నిజాం ప్రభుత్వం ఎంతమేరకు ప్లాన్ చేసిందో అంత మేరకు కట్టలేదు కానీ 10 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు దాని కింద ఉంది. ఇవ్వాళ కరీంనగర్ జిల్లా రాష్ట్రంలోనే 'వన్ ఆఫ్ ది డెవలప్డ్ డిస్ట్రిక్ట్స్‌గా ఉంది అంటే శ్రీరాంసాగర్ వల్లనే. గోదావరిలోని మిగతా నీళ్ళను కూడా వాడుకొని ఉంటే కరీంనగర్‌లాగే వరంగల్ బాగుపడేది, ఆదిలాబాద్ బాగుపడేది, మరికొన్ని జిల్లాలు కూడా బాగుపడేవి. కోపం రాకుండా ఎందుకుంటుంది ఎవరికైనా? ఎందుకు చెయ్యలేదు అన్న ప్రశ్నకు జవాబు ఏమిటి? శ్రద్ధ లేదు కాబట్టి. ఎందుకు శ్రద్ధ లేదు? ఆ ప్రాంతమంటే వివక్ష కాబట్టి. ఆటోమేటిక్‌గా రావా ఈ జవాబులు. వస్తాయి కదా. శ్రీరాంసాగర్, ధవళేశ్వరం కాక చిన్నచిన్నవి కొన్ని ఉన్నాయనుకోండి. ఉదాహరణకు మానేరు మీద అప్పర్ మానేరు డ్యాం, లోయర్ మానేరు డ్యాం. మంజీరా మీద సింగూరు, మంజీరా, నిజాంసాగర్. కాని సింగూరు, మంజీరా హైద్రాబాదుకు నీళ్ళు ఇవ్వటానికి సరిపోతాయి, రైతులకేమీ రావు. అప్పర్ మానేరు డ్యాంలో నీళ్ళు ఎప్పుడూ ఉండవు. మంచి ఫుట్‌బాల్ ఫీల్డ్‌లా ఉంటుంది. లోయర్ మానేరు డ్యాం కరీంనగర్ టౌన్‌కు నీళ్ళు ఇస్తుందంతే. అంతకంటే ఏమీ ఇవ్వదు.

## పోలవరం నీళ్ళు ఎవరికోసం?

ఆ ప్రాజెక్టులకు పోను ఆ 1480 టి.యం.సి.లలో వాడకుండా మిగిలి ఉంది 680 టి.యం.సి.లు. ఎక్కువే గదా అవి. దాంట్లో ఇవ్వాళ 335 టి.యం.సి.లు పోలవరానికి కేటాయించారు. కాని పోలవరం తెలంగాణ వాళ్ళకు చుక్క నీరు ఇవ్వదు. మొత్తం 9 ముంపు మండలాలూ ఆదివాసీ మండలాలే. అందులో ఏడు మండలాలు తెలంగాణలోనే ఉన్నాయి. అవన్నీ మునగనున్నాయి. పోలవరంకు కేటాయించిన 335 టి.యం.సి.లలో 80 టి.యం.సి.లు కృష్ణా నదిలోకి ట్రాన్స్‌ఫర్ చేస్తారు. మిగిలినవి పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలలో సాగునీటి సదుపాయం లేని మెట్ట ప్రాంతానికి సాగునీరు ఇస్తాయి. అది పోలవరం కుడికాలువ. పోలవరం ఎడమ కాలువ తూర్పు గోదావరి జిల్లాలోని తుని నుంచి విశాఖపట్నం దాకా మంచి నీళ్ళు ఇచ్చుకుంటూ వెళుతుందనుకున్నాం. కానీ ఎడమ కాలువ అది కూడ చెయ్యదని ఇవ్వాళ అర్థం అవుతుంది. అది రాంబిల్లి, అచ్చుతాపురం సెజ్‌లకు నీళ్ళిస్తుంది, కాకినాడ సెజ్‌కు నీళ్ళిస్తుంది, కోస్టల్ కారిడార్‌కు నీళ్ళిస్తుంది తప్ప విశాఖపట్నానికి ఏమీ ఇవ్వదు. పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలలో కుడికాలువ ఏం చేస్తుందో మనకు చూస్తే తప్ప తెలియదు. తెలంగాణవాదుల కోపం

ఏమిటంటే మిగిలిన 680 టి.యం.సిలలో 335 టి.యం.సిలు పోలవరానికి పోతున్నాయి, దుమ్ముగూడెం నుంచి మరో 100 టి.యం.సిలు కృష్ణా డెల్టాకు పోతున్నాయి. చివరికి 245 టి.యం.సిలు మాత్రమే తెలంగాణ జిల్లాల అవసరాలకు మిగిలాయి. ఇది న్యాయం కాదని సహజంగానే వాళ్ళకు ఆందోళన, ఆగ్రహం కలుగుతాయి కదా. ఒక రకంగా చెప్పాలంటే ఉత్తర తెలంగాణ జిల్లాల నీటి అవసరాలను తాకట్టు పెట్టి 180 టి.యం.సి.లు తీసుకొచ్చి కృష్ణా డెల్టాకు గ్యారంటీ కల్పించి, పై వాళ్ళు 80 టి.యం.సిలు ఏ రోజైనా ఆపేసుకోవచ్చు అన్న పరిస్థితి కల్పించి మళ్ళీ తెలంగాణకు, రాయలసీమకు నష్టం చేస్తున్నావు. మహబూబ్‌నగర్‌కు, అనంతపురానికి, కర్నూలుకు నష్టం చేసేటటువంటి ఆలోచన ఇది. ఇది ఎంతవరకు సమంజసమైనటువంటి ఆలోచన?

## మా వాదన

మేము దాని బదులు చెబుతున్నది ఏమిటంటే నదీ జలాల పునఃపంపిణీ జరగాలని. 180 టి.యం.సి.ల వాడకం ఏదైతే కృష్ణా డెల్టాలో జరుగుతూ ఉందో దాంట్లో 100 టి.యం.సిలు ప్రకాశం బ్యారేజీకి దిగువన నదిలో చేరతాయి కాబట్టి వాటిని వేరే ఎవ్వరూ తీసుకోలేరు. కృష్ణా డెల్టా అవసరాలను 180 టి.యం.సిలకు బదులు 100 టి.యం.సిలకే పరిమితం చేసి రెండు కాకపోతే ఒక పంట వేసుకోండి లేదా వరి కాక వేరే ఏదైనా పంట వేసుకోండి అని వాళ్ళకు చెపితే 80 టి.యం.సిల నీళ్ళను ఆదా చెయ్యవచ్చు. దీనితో పాటు మేము అంటున్నది ఇంకొకటి ఏమిటంటే ఈ డిపెండబిలిటీని 75 శాతం నుంచి 60 శాతానికి తగ్గించుకుందాం. అంటే రైతులకు నాలుగింట మూడేళ్ళు కాదు, అయిదింట మూడేళ్ళే నీళ్ళుంటాయి. దానికి ఒప్పుకుంటే నికర జలాలు పెరుగుతాయి. అంటే ప్రాజెక్టు కట్టుకోగల అవకాశముండే నీళ్ళు పెరుగుతాయి. 60 శాతం డిపెండబిలిటీ కింద మరొక 200 టి.యం.సిలు అదనంగా దక్కుతాయి. ఈ 200 టి.యం.సిలు, ఆ 80 టి.యం.సిలు మొత్తం 280 టి.యం.సిలను ఎనిమిది ప్రాజెక్టులకు కూడా ఒక్కొక్క దానికి 35 టి.యం.సిలు కేటాయించవచ్చు. ఒక రెండున్నర లక్షల ఎకరాల వరకు తరి పండించుకునే అవకాశం ఉంటుంది లేదా మూడు నుంచి నాలుగు లక్షల వరకు ఆరుతడి పండించుకునే అవకాశం ఉంటుంది. మంచి నీటి సరఫరాకు అవకాశం ఉంటుంది. అప్పుడు గోదావరి నీళ్ళు ట్రాన్స్‌ఫర్ చేయాల్సిన అవసరం ఉండదు. పై రాష్ట్రాలకు అప్పగించే అవసరం ఉండదు. కానీ ఇవ్వాళ ఏం జరుగుతుందంటే, ఈ ఎనిమిది ప్రాజెక్టులకు ఏ రకమైనటువంటి హక్కులు అడగమని చెప్పేసి, గోదావరి నుంచి కృష్ణానదిలోకి

నీళ్ళు ట్రాన్స్‌ఫర్ చేసి కృష్ణలో మిగిలే నీళ్ళను ఈ ప్రాజెక్టులకు ఇస్తామంటున్నారు. గోదావరి నీళ్ళు దాదాపు గ్యారంటీగా ట్రాన్స్‌ఫర్ అవుతాయి. కానీ కృష్ణలో పై నుంచి నీళ్ళు వస్తాయనే గ్యారంటీ లేదు. ప్రతి సంవత్సరం వస్తాయనే నమ్మకం లేదు. వాళ్ళు దానిని పైన ఆపుకుంటే అవి కూడా రావు. మరి అప్పుడు ఈ ఎనిమిది ప్రాజెక్టులకు డిపెండబిలిటీ 50 శాతం కాదు, 40 శాతం కాదు, 30 శాతం కూడా ఉండకుండా పోయే అవకాశం ఉంది. అప్పుడవి శాశ్వతంగా మిగులు జలాల ప్రాజెక్టులుగా ఉండిపోతాయి.

## పులిచింతల

పులిచింతల గురించి మీ అభ్యంతరమేమిటి అని చాలామంది అడుగుతుంటారు. ఇంతకు ముందు చెప్పాను కాలువలను ఆధునీకరించి, రివర్స్‌ఫ్లోని కూడా కలుపుకొని 48 టి.యం.సిలను ఆదా చేసి మూడు ప్రాంతాలకు పంచుకున్నాము అన్నాను. అందులో 19 టి.యం.సిలు రాయలసీమకు, 20 టి.యం.సిలు తెలంగాణకు, 9 టి.యం.సిలు పులిచింతల ద్వారా ఆంధ్రా ప్రాంతానికి అని చెప్పాను. దేనికోసం కట్టుకుంటున్నారు పులిచింతలను అనంటే చాలా ముందుచూపుతో అని చెప్పాల్సి ఉంటుంది. కర్ణాటక ఎప్పటికైనా పైన ప్రాజెక్టులు కట్టుకుంటే సకాలంలో కిందికి నీళ్ళు రాకపోవచ్చు కాబట్టి ఆ ప్రమాదాన్ని శంకించి ఈ ఏర్పాటు చేసుకుంటున్నారు. బచావత్ అవార్డులో మనమే ఒప్పుకున్నటువంటి పాయింట్ ఏమిటీ అనంటే ఆయన రెండు స్కీములు పెట్టి మూడు రాష్ట్రాలనూ అడిగారు మీకు ఏది కావాలి అని. వచ్చే నీళ్ళు ఎట్లా పంచుకుంటారనే దానికి సంబంధించినవే ఆ రెండు స్కీములు కూడా. ఒక పద్ధతేమో ప్రోరాటా. అంటే వచ్చిన నీళ్లు వచ్చినట్టుగా ఆయా ప్రాజెక్టుల సామర్థ్యం దామాషాలో తీసుకోవడం. దీని ప్రకారం ప్రతి డ్యాంలోనూ కొంత ఉంచుకొని మిగతాది కిందికి పంపించి వేయాలి, తర్వాతి వాళ్ళు కూడా అలాగే ఉంచుకొని కిందికి పంపించి వెయ్యాలి. అది మొదటి స్కీము. రెండవ స్కీము ఏమిటీ అనంటే పై వాళ్ళు తమకు ఎంత కేటాయించబడిందో అంత ఆపేసుకున్న తరువాతే కింది వాళ్ళకు వస్తుంది. ఈ రెండిట్లో ఏది కావాలని అడిగారు. మామూలుగా మనం ఏమనుకుంటాం? మొదటి స్కీమే కోరుకుంటే మనం కింద ఉన్నాం కాబట్టి ఎప్పటికప్పుడు వచ్చినవి తీసుకుంటే కొంతయినా వస్తుంది అని కదా. కానీ మన వాళ్ళు తెలివిగా ఆలోచిస్తున్నామని రెండోది కోరారు.

నిజానికి మొదటిది కోరుకుని ఉంటే వర్షాలు ఎంత పడ్డాయనే దానితో నిమిత్తం లేకుండా అందరూ దామాషా ప్రకారం నికర జలాలను పంచుకోవచ్చు. అలాగే

మిగులు జలాలు కూడా అందరూ సమానంగా వాడుకోవచ్చు. అట్లా గాకుండా బచావత్ గారు ఏమన్నారంటే మీరందరూ రెండవ స్కీముకు గానీ ఒప్పుకుంటే– అంటే పై వాళ్ళు తమ కెపాసిటీ మేరకు నీళ్ళను నింపుకున్న తరువాతే కిందికి పంపే పద్ధతికి ఒప్పుకుంటే – వర్షాభావ సంవత్సరాలలో కింద ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు నష్టం కాబట్టి అప్పుడు మిగులు జలాలు మొత్తం ఆంధ్రప్రదేశ్ వాడుకుంటుంది అని నేను అవార్డు రాస్తానని అన్నాడు. అయితే ఆంధ్రప్రదేశ్ వాడుకోవచ్చు కానీ ప్రాజెక్టులు కట్టుకోవడానికి మాత్రం వీలు లేదు. మన వాళ్ళు ఏం చేశారంటే అప్పటికి పైన ఎక్కువ ప్రాజెక్టులు లేవు. పై వాళ్ళు ఎంత నిలుపుకున్నా మిగులుతాయి కాబట్టి రెండోది ఒప్పుకుంటే మనకు నికర జలాలూ వస్తాయి, మిగులు జలాలూ వస్తాయి అనుకొన్నారు. కష్టం ఎప్పుడొచ్చిందంటే పై వాళ్ళు మేలుకున్న తరువాత. వాళ్ళు లేటుగా ఎందుకు మేలుకున్నారు? ఇక్కడ ప్రాంతీయ వివక్ష ఉన్నట్టే అక్కడా ప్రాంతీయ వివక్ష ఉంది. కృష్ణానది కర్ణాటకలో ప్రవహించే ప్రాంతమంతా వెనకబడిన ప్రాంతమే. పాత బొంబాయి రాష్ట్రం, పాత హైద్రాబాద్ సంస్థానంలోని ప్రాంతాలవి. వాటిని వాళ్ళు పట్టించుకోలేదు. వాళ్ళకు బెంగుళూరు, మైసూరే కర్ణాటక అంటే– మనకు ఆంధ్రప్రదేశ్ అంటే కొన్ని ప్రాంతాలు మాత్రమే అయినట్లు.

వాళ్ళు మేలుకునేటప్పటికి ఆంధ్రా వాళ్ళకు అర్థం అయ్యింది – వాళ్ళు డ్యాములు కట్టుకోవడం మొదలుపెడితే అవి నిండేదాకా కిందికి పంపియ్యరు అని. దాంతో ఒక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కావాలి పులిచింతల దగ్గర అనుకొన్నారు. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ అంటే దానికి ఎక్స్‌ట్రా కేటాయింపు ఏమీ ఉండదు. ముందు సంవత్సరం లేటుగా వచ్చిన నీళ్ళు దాంట్లో ఉంటాయి. రెండో సంవత్సరం పై నుంచి నీళ్ళు రాకపోతే దాన్ని వాడుకుంటారు. అందుకోసం ఉద్దేశించిందే పులిచింతల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్. మరి దానికి 9 టి.యం.సిల కేటాయింపు ఎందుకు అన్నది తెలంగాణ వాళ్ళు, రాయలసీమ వాళ్ళు వేస్తున్న ప్రశ్న. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ అంటేనే దానికి కేటాయింపు ఉండదు. ఉన్న కేటాయింపులోనే ముందు సంవత్సరం లేటుగా వచ్చిన నీళ్ళు వాడుకోనివి పైన ఉండిపోతాయి. ఆల్మట్టి రావడం వల్ల, నారాయణపూర్ రావడం వల్ల తరువాతి సంవత్సరం నీళ్ళు రావడం లేటయితే ఈలోగా ఈ నీళ్ళు వాడుకోవచ్చు. అటువంటప్పుడు దానికి కేటాయింపు ఎందుకు? కాబట్టి ఆ 9 టి.యం.సిలు నాగార్జునసాగర్‌లోనే ఆపుకుంటే తెలుగుదేశం పార్టీ హయాంలో మొదలుపెట్టిన ఎలిమినేటి మాధవరెడ్డి కాలువకు నీళ్ళివ్వొచ్చు. ఫ్లోరైడ్ బాధిత గ్రామాలకు ఆ నీళ్ళు అందుబాటులోకి వస్తాయి. అది భయంకరమైన వ్యాధి కాబట్టి ఆ 9 టి.యం.సిలను అక్కడ కేటాయించండి అన్నది తెలంగాణ వాళ్ళ విన్నపం.

కృష్ణా, గుంటూరు జిల్లాల వాళ్ళు ససేమిరా ఒప్పుకోలేదు. మాకు దాని పట్ల సీరియస్ అభ్యంతరం ఉంది. అక్కడున్నటువంటి మా బోటి సంఘాలను, ప్రజాతంత్ర సంఘాల వాళ్ళను నేనేమీ అనడం లేదు గానీ ఆ రెండు జిల్లాలలోని రాజకీయ శక్తులు, ప్రజలు నల్గొండ జిల్లాకు నీళ్ళు ఇవ్వడాన్ని గట్టిగా వ్యతిరేకించారు. 9 టి.యం.సిల నీటి కేటాయింపు లేకపోయినా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను శుభ్రంగా కట్టుకోవచ్చు. ఎవ్వరూ కాదనడం లేదు. పులిచింతల కట్టవద్దని ఎవ్వరూ అనలేదు. దానికి కేటాయింపు అక్కర లేదు అని మాత్రమే అంటున్నాం. కృష్ణా డెల్టాకు వచ్చే 180 టి.యం.సిల కేటాయింపులోనే మీరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కట్టుకోండి. ముందు సంవత్సరం వచ్చిన మిగులు జలాలు అక్కడ ఉంటాయి. ఈ సంవత్సరం ఆల్మట్టి వలన, నారాయణపూర్ వలన త్వరగా నీళ్ళు రాకపోతే మీరు ఆ నీళ్ళు వాడుకోండి. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కాన్సెప్టే అది కదా. లేదు లేదు ఆ 9 టి.యం.సిలు కావాల్సిందే అన్నారు వాళ్ళు. నల్గొండ జిల్లాలో మునుగోడు, సంస్థాన్ నారాయణపురం మండలాలు భయంకరమైన ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాలు, మీరు చాలా సార్లు టి.వి.లో చూసే ఉంటారు. వాళ్ళకు కృష్ణా జలాలు వస్తే ప్రజల ఆరోగ్యాలు బాగుపడతాయి. రెండవ పంట, మూడవ పంట సమస్య కాదిక్కడ. దానికి కూడా ఒప్పుకోకపోవడం అనేది పులిచింతల విషయంలో అభ్యంతరం. నాకు తెలిసి తెలంగాణ రాష్ట్ర సమితి కూడా దీన్ని గట్టిగా వ్యతిరేకించడం లేదు. మొట్టమొదట ఆ పార్టీ ఎన్నికలలో పోటీ చేసి కాంగ్రెస్ పార్టీతో పాటు అధికారానికి వచ్చినప్పుడు కూడా ఆ పార్టీ ఉపాధ్యక్షుడుగా ఉన్న ఒక వ్యక్తి, నేను పేరు చెప్పను, మాతో ఓపెన్‌గా అన్నాడు మేము వ్యతిరేకించము అని. తెలంగాణ హక్కుల విషయంలో టీఆర్ఎస్ ఎంత పట్టుదలతో ఉంది అనే దానికి ఇది ఒక చక్కటి ఉదాహరణ. మేము వ్యతిరేకించము, మాకు సాధ్యం కాదు అని ఆనాడే ఆయన  అన్నాడు. కొట్లాడటం వారికి ఇష్టం లేదు.

## పోతిరెడ్డిపాడు

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ గురించి ఇంతకు ముందే చెప్పాను. పోతిరెడ్డిపాడు అసలు పేరు పోతులపాడు. శ్రీశైలం నుంచి కుడి పక్కకు నీళ్ళు తీసుకునే కాలువకున్న రెగ్యులేటర్ అది. ఆ కాలువ ఎన్నిటికి అనుకుంటున్నారు? తెలుగుగంగ నీళ్ళు దాంట్లో నుంచే పోవాలి, ఎస్.ఆర్.బి.సి. నీళ్ళు దాంట్లో నుంచే పోవాలి. గండికోట లేక గాలేరు–నగరికి కూడా నీళ్ళు దాంట్లో నుంచే పోవాలి. హంద్రీ– నీవా నీళ్ళు మాత్రం దాంట్లో నుంచి పోవు. శ్రీశైలం డ్యాంలో వేరే పాయింట్ దగ్గర దానికి టేకాఫ్ పాయింట్ ఉంటుంది. అదే కృష్ణానది మీద కొంచెం పైన కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ఉంది

మహబూబ్‌నగర్ జిల్లాలో. ఇంకా పైన నెట్టెంపాడు పథకం ఉంది. ప్రకాశం జిల్లా గిద్దలూరుకు నీళ్ళు తీసికెళ్ళే వెలిగొండ ప్రాజెక్టు టేకాఫ్ పాయింట్ వేరే చోట ఉంది.

ఎందుకు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచారు అని మేము కోర్టులో ఛాలెంజ్ చేశాము. అప్పుడు ఆ జీవో చూశాము, ఆర్గ్యుమెంట్స్ కూడా రాశాము. కోర్టులో పెండింగ్‌లో ఉంది ఆ కేసు. ప్రభుత్వం ఏం చెపుతుందంటే కృష్ణానదిలో మిగులు జలాలు ఇదివరకు తీరికగా వంద రోజుల్లో వచ్చేవి, ఇప్పుడు ముప్ఫై రోజులలో మొత్తం వచ్చేస్తున్నాయట. అప్పుడు త్వరగా తీసుకోవాలి కదా ఆ నీళ్ళన్నీ, లేకపోతే సముద్రంలోకి పోతాయి.కాబట్టే రెగ్యులేటర్ సామర్థ్యాన్ని మేము పెంచుకోక తప్పదు అనే వాదనతో గండికోట లేక గాలేరు- నగరి ప్రాజెక్టు, తెలుగుగంగ ప్రాజెక్టు వాటికి మాత్రమే ఉపయోగపడే ఈ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని రాజశేఖరరెడ్డి పెంచాడు. సహజంగా అడిగే ప్రశ్న ఏంటంటే అదే కృష్ణానది మిగులు జలాలపైన హంద్రీ- నీవా ఉంది, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ఉంది, నెట్టెంపాడు ఉంది, వెలిగొండ ఉంది, మరి వాటికీ సమస్యే కదా? అవి కూడా తొందరగా తీసుకోవాలి కదా. వాటికోసం ఎందుకు ఏం చెయ్యవు నువ్వు? వంద రోజుల్లో వచ్చేవి 30 రోజుల్లో వచ్చేస్తున్నాయని ఎవరు కనిపెట్టారో తెలియదు కాని జీవోలో రాసి ఉంది అది. ఎవ్వరు చెప్పారో నాకర్థం కాలేదు. త్వరగా వచ్చేస్తున్నప్పుడు త్వరగా తీసేసుకోవడం కోసం నేను దీనిని వెడల్పు చేసుకుంటున్నాను అని నువ్వు అంటే రెండు ప్రాజెక్టులను మాత్రమే ఎలా దృష్టిలో పెట్టుకుంటావు? తెలుగుగంగ, గండికోట కాక మిగిలిన ఆరింటి సంగతేమిటి? ఆ రెండు నీ జిల్లావి (కడప) కాబట్టి వాటికొక న్యాయమా? నిజానికి ఆ నీళ్ళు హంద్రీ- నీవా టేకాఫ్‌ను దాటి వస్తాయి, వెలిగొండ టేకాఫ్‌ను దాటి వస్తాయి. కాని వాళ్ళు త్వరగా తీసుకోవడానికి మార్గం లేదు. తన జిల్లాకు నీళ్ళు తీసుకుపోయే తూము పెద్దదిగా చేసుకున్నాడు కాబట్టి తను తీసుకోగలడు. అదీ మా అభ్యంతరం. దీని మీద తెలంగాణ ఉద్యమం ఏమంటుందో తరువాత చెబుతాను.

ఎనిమిది మిగులు జలాల ప్రాజెక్టులను ఇప్పటికే అన్ని రకాలుగా అన్యాయం చేశారు. బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌కు పోయి వాటికి నీటి హక్కులు అడగము అని చెప్పి వచ్చారు. అంటే మరో నలభై ఏళ్ళపాటు ఆ ప్రాజెక్టులకు నీళ్ళను మనం హక్కుగా అడగటానికి వీలు లేదు. రెండవది, గోదావరి నుంచి నీళ్ళను ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాను కదా అంటున్నాడు. ట్రాన్స్‌ఫర్ చేస్తే కిందికి వస్తుంది, పైకి రాదు. అవి కిందకి వచ్చి కృష్ణా డెల్టాకు గ్యారంటీ కల్పిస్తాయి. ఆ 180 టి.యం.సిలు నాగార్జునసాగర్, ఆ

పైన ఆపుకుంటానంటే వర్షాభావ సంవత్సరాలలో 80 టి.యం.సిలను కర్ణాటక వాడు పైన ఆపుకుంటాడు. అది కరెక్టుగా మళ్ళీ వర్షాభావ ప్రాంతానికే ఎఫెక్ట్. ప్రతి సంవత్సరం అలా జరుగుతుందని నేనేమీ అనడం లేదు. వర్షాభావ సంవత్సరాలలో , ఈ సంవత్సరం లాంటి సంవత్సరాలలో అది ప్రభావం వేయగలదు. ఆ ఎనిమిదిటినీ సమానంగా చూస్తున్నావా నువ్వు? కడప జిల్లాకు నీళ్ళిచ్చేటువంటి తెలుగుగంగ, గండికోట ప్రాజెక్టులకు మాత్రమే ఎక్స్‌ట్రా ఏర్పాటు చేసుకుంటున్నావు, వేరే ఎవ్వరికీ ఏర్పాటు చేయకుండా. అందుకే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను అన్యాయమైనటువంటిదిగా మానవ హక్కుల వేదిక భావిస్తుంది.

పోలవరం గురించి ఇందాకే చెప్పాను. తెలంగాణకు ఇంకా మిగిలి ఉన్నటువంటి 680 టి.యం.సిలలో 335 టి.యం.సిలను తీసుకునే ప్రాజెక్టు. కాని ఒక్క చుక్క నీరు తెలంగాణకు ఇవ్వదు. సహజంగానే కోపం వస్తుంది తెలంగాణ వాళ్ళకు. అంతే గాకుండా 9 ఆదివాసీ మండలాలలోని – దాంట్లో 7 ఖమ్మం జిల్లాలో ఉన్నాయి – 276 గ్రామాలను పూర్తిగా ముంచేస్తున్నావు. అక్కడ బతికే వాళ్ళు ముఖ్యంగా కోయలు, కొండరెడ్లు. బాగా వెనుకబడిన తెగలు. వాళ్ళు బయటకు పోయి బతకలేరు. వాళ్ళకు నామ్‌కే వాస్తే భద్రాచలం దగ్గర ఇళ్ళు కట్టిస్తామని చెప్పారు గానీ, భద్రాచలం దగ్గర వాళ్ళు బ్రతకడం సాధ్యం కాదు. ఉపాధి చాలా సమస్య అవుతుంది. పోలవరం పట్ల మా అభ్యంతరం అదీ.

## బాబ్లీ

ఇక బాబ్లీ విషయానికొస్తే చిన్న ప్రాజెక్టు అది. అంటే మైనర్ ప్రాజెక్టు. ఒక పెద్ద సైజు చెరువు లాంటిది. మహారాష్ట్ర వాళ్ళు దానికి ఎంచుకున్న చోటు శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ లోపల ఉంది. డ్యాంకు రిజర్వాయర్ ఉంటుంది కదా, ఆ బ్యాక్ వాటర్ లోపల ఉండే చోటును ఎంచుకుని కడుతున్నారు వాళ్ళు. కాబట్టి పై నుంచి వచ్చే నీళ్ళే కాకుండా ఈ బ్యాక్ వాటర్ నీళ్ళంతా కూడా వాళ్ళు తీసుకుపోతారు. 2 టి.యం.సిల కోసం కట్టిన ప్రాజెక్టు అది. ఎంత తీసుకుపోయినా తెలంగాణ ఎడారి అయిపోతుందనేది ఎంత వాస్తవమో నాకు అర్థం కావడం లేదు. మేము మానవ హక్కుల వేదికగా దీని మీద ఒక వైఖరి ఏమీ తీసుకోలేదు. ఒక రోజు పోయి, చూసి, ఆ ఇంజనీర్లతో మాట్లాడదాము అనుకున్నాము. ఎందుకంటే మన దగ్గర ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ అని కొట్లాడుకుంటాం కాని వేరే రాష్ట్రాల దగ్గరకి వచ్చే సరికి మనమంతా 'మంచివాళ్ళం', వాళ్ళంతా 'చెడ్డవాళ్ళు'. తెలుగుజాతే గొప్పజాతి. నదుల విషయంలో వేరే జాతుల వాళ్ళందరూ దుర్మార్గులు అని ముఖ్యంగా మీడియా

భయంకరమైన ప్రచారం చేస్తుంది. కాబట్టి కేవలం 2 టి.యం.సిల కోసం కట్టిన ప్రాజెక్టు, ఒక వేళ శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్‌లో కట్టినా కూడా ఎంత తీసుకోగలరు వాళ్ళు? 10 టి.యం.సిలో, 15 టి.యం.సిలో.

శ్రీరాంసాగర్ 10 లక్షల ఎకరాలకు నీళ్ళిచ్చేటువంటి ప్రాజెక్టు. తెలంగాణ ఎడారి అయిపోతుంది అనే వ్యాఖ్య ఎంతవరకు వాస్తవమో తెలియదు కాబట్టి, మేము చూసి వచ్చాక మహారాష్ట్ర ఇంజనీర్లతో మాట్లాడాక ఒక అంచనాకు  రాగలుగుతాం అనుకున్నాం.

## లిఫ్టులు ఆచరణ సాధ్యమా!

ఆఖరున ఒక విషయం చెప్పి ముగిస్తాను. తెలంగాణకు ఇంకొక సమస్య ఏమిటంటే గోదావరి బేసిన్‌లో ఇంకా 245 టి.యం.సిలు ఉన్నాయని చెప్పాను కదా. తక్కువేమీ కాదు అవి. కానీ గోదావరి బేసిన్‌లో సమస్య ఏమిటంటే నదీ ప్రవాహం ఎత్తు బాగా తక్కువ, నీళ్ళు కావాల్సిన భూమి ఎత్తు చాలా ఎక్కువ. సముద్ర మట్టం నుంచి గోదావరి ప్రవాహం సుమారుగా 75-80 మీటర్ల ఎత్తులో ఉంటుంది. అక్కడి నుంచి నీళ్ళు ఎక్కడికి ఇవ్వాలి? వరంగల్‌కు కానీ, కరీంనగర్‌కు కానీ ఇచ్చుకుంటూ రావాలి. వేగంగా పెరుగుతుంది నేల ఎత్తు. అంటే గోదావరి జలాలు ఉత్తర తెలంగాణకు ఇవ్వాలంటే లిఫ్టు తప్ప వేరే మార్గం లేకపోవడమే సమస్య. లిఫ్టు ఇరిగేషన్ అనేక రకాలుగా సమస్యాత్మకం. ఇప్పుడు దేవాదుల కడుతున్నారు. 14 లిఫ్టులు దానికి. దేవాదుల ప్రాజెక్టు ద్వారా 50 టి.యం.సిలు  ఇస్తామంటున్నారు. డ్రిప్ ఇరిగేషన్ కింద ఒక టి.యం.సిని 22 వేల ఎకరాలకు ఇవ్వడం ద్వారా విపరీతంగా నీళ్ళు ఇస్తాము వరంగల్ జిల్లాకు అంటున్నారు కానీ 14 లిఫ్టులతో డిజైన్ చేసినటువంటి ప్రాజెక్టు దేశంలో ఇప్పటి దాకా లేదు. చిన్న లిఫ్టులు కావవి, బాగా పెద్ద లిఫ్టులు. మన రాష్ట్రంలో వంద ఎకరాలు, రెండు వందల ఎకరాలు, మూడు వందల ఎకరాల కోసం కట్టిన లిఫ్టు ఇరిగేషన్ స్కీములన్నీ మూత పడ్డాయి. నిధులు సరిగ్గా ఇవ్వక, రిపేర్లు జరగక రకరకాల కారణాలతో మొత్తమన్నీ మూత పడ్డాయి. అటువంటిది 50 టి.యం.సిల నీటిని 14 లిఫ్టుల ద్వారా వరంగల్ సిటీకి తాగు నీరు, చుట్టు పక్కల గ్రామాలకు సాగునీరు ఇస్తామన్నది ఎంతవరకు సాధ్యం అన్నది పెద్ద సందేహం. ఖర్చు చెప్పాలంటే ఒక ఎకరానికి 100 మీటర్లు లిఫ్టు చేసి సాగునీరు ఇవ్వాలి అంటే 1000 యూనిట్లు ఖర్చు అవుతుంది కరెంటు. ఇది లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం నిర్మాణ వ్యయం కాదు, ఆపరేషన్ ఖర్చు. నిర్మాణ వ్యయం ఎలాగూ కొంత ఉంటుంది. ఎకరానికి 100 మీటర్లు లిఫ్టు చేసి నీళ్ళివ్వాలి అంటే యూనిట్ రెండు రూపాయల లెక్కనేసుకున్నా

1000 యూనిట్లకు రెండువేల రూపాయలు ఖర్చు అవుతుంది. ఏ రైతైనా ఎకరా సాగునీటికి రెండువేల రూపాయలు కట్టగలడా?

కృష్ణా డెల్టాలో అయినా, గోదావరి డెల్టాలో అయినా నీటి తీరువా ఎంత వసూలు చేస్తారు? 200 రూపాయలు వసూలు చేస్తారు. డెల్టాలో ఏమో నువ్వు కాలువలు తవ్వి రెండువందలకు నీళ్ళిస్తావు, నేనేమో ఎకరాకు రెండువేలు కట్టుకోవాలా అనడా! ప్రాంతీయ వివక్ష మాట అటుంచి అసలు కట్టలేడు రైతు. అంతే కాదు ఇవ్వాళ మన వాళ్ళు ఏం చేస్తున్నారు? విద్యుత్ ఉత్పత్తి మొత్తం ప్రైవేటీకరణ చేస్తున్నారు. ఒక్కొక్కళ్ళు అయిదు రూపాయలు యూనిట్, ఆరు రూపాయలు యూనిట్‌కు అగ్రిమెంట్ చేసుకుంటున్నారు. అంటే రేపు రెండు వేల రూపాయలకు కూడా ఒక ఎకరాకు సాగునీరు రాదు. మూడువేలు కావచ్చు, నాలుగు వేలు కావచ్చు, అయిదు వేలు కూడా కావచ్చు. అసాధ్యం. అప్పుడు ఏమి చెయ్యాలి? గవర్నమెంట్ పెట్టుకోవాలి. మేము ఒక లెక్క తీశాము. ఇవ్వాళ కడుతున్న అన్ని ప్రాజెక్టులు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులే. గోదావరి నీళ్ళ మీద అయినా, కృష్ణా జలాల మీద అయినా రాజశేఖరరెడ్డి జలయజ్ఞం పేరు మీద కడుతున్నవి అన్నీ కూడా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులే. వీటన్నిటి కరెంటు ఖర్చు ప్రభుత్వం పెట్టుకోక తప్పదు. ఎందుకంటే రైతులు మహా అయితే 5 శాతం పెట్టుకోగలరంతే. ప్రభుత్వానికి ఎంత ఖర్చు అవుతుందంటే రాష్ట్రంలో ఇవ్వాళ అన్ని వ్యవసాయ బోరు బావులకు ప్రభుత్వం పెట్టుకుంటున్న దానికి సమానం అవుతుంది. అంటే బిల్లు రెండు రెట్లు అవుతుంది. వ్యవసాయ బావులకు ఇస్తున్న కరెంట్‌కే చెల్లించలేమని రోశయ్య గారు ఏడుస్తున్నారు. కొత్త ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తయ్యేటప్పటికి ఆ బిల్లు రెట్టింపు అవుతుంది. అది జరిగే పనేనా! ఏదో ఒక రోజు ఒక ప్రభుత్వం వచ్చి నావల్ల కాదూ అంటే ఏమవుతాయి ఈ ప్రాజెక్టులు. సెజ్‌లకు భూములిచ్చి, ఇదమ్మి, అదమ్మి వచ్చిన డబ్బులంతా ఇప్పుడు రైతులకు ఉచిత కరెంటుకు ఇస్తున్నాడు. రేపు ఏం చేస్తాడు? ఎకరాకు వెయ్యి యూనిట్ల విద్యుత్ కొని ఏ రైతూ వ్యవసాయం చేయలేడు, సాధ్యం కాదు.

## ప్రాణహిత – చేవెళ్ళ

ఇంకొక పెద్ద భూతం ఉంది, ప్రాణహిత – చేవెళ్ళ అని. దానికి 16 లిఫ్టులు. 750 కిలో మీటర్లు పోతుందది. ఆదిలాబాద్ జిల్లాలోని తుమ్మిడి హేటి దగ్గర మొదలుపెట్టి హైద్రాబాద్ దగ్గర చేవెళ్ళ వరకు వస్తుందది. ఆ ఊరి రాజకీయ ప్రాముఖ్యం మీ అందరికి తెలుసు. సబితా ఇంద్రారెడ్డి ఊరు. ఆ గ్రామం దాకా పోయి అక్కడ నీళ్ళివ్వాలి. దారి అంతా ఇచ్చుకుంటూ పోతుంది 160 టి.యం.సిల నీళ్ళు 16

లక్షల ఎకరాలకు. ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి ఇన్ని జిల్లాలకు. ఆ ఒక్క ప్రాజెక్టు రోజువారీ అవసరాల కోసమే ఒక అల్ట్రా మెగావాట్ థర్మల్ ప్లాంట్ కావాలి. మేము లెక్క వేసే చెపుతున్నాము ఈ మాటలు, ఊరికే మాట్లాడటం లేదు. 5000 మెగావాట్లు ఉత్పత్తి చేసే ఒక అల్ట్రా మెగావాట్ ప్లాంట్ ఈ ఒక్క ప్రాజెక్టు అవసరాల కోసమే కావాలి. కడతావా? ఎక్కడ కడతావు? అది ప్రైవేటు సెక్టార్‌కు ఇస్తే వాళ్లు రేపు ధర పెంచితే ఏమవుతుంది? ఎంత ఖర్చు పెట్టుకోగలుగుతావు? విచిత్రమేమిటంటే ఇంత దూరం పోయి 16 లక్షల ఎకరాలకు నీళ్ళిచ్చే ఈ ప్రాజెక్టు దాని టేకాఫ్ పాయింట్ దగ్గర 35 కిలోమీటర్ల వరకు ఒక్క చుక్క నీరు ఇవ్వదు. మళ్ళీ అది ఆదిలాబాద్ జిల్లాలో బాగా వెనుకబడిన ప్రాంతం కూడా. అక్కడి  జనాలు ఇవ్వాళ ఆందోళన చేస్తున్నారు ముందు మాకు నీళ్ళు ఇచ్చి తర్వాత మీరు తీసుకుపోండని. మేము కూడా వాళ్ళతో పాటు ఆందోళన చేస్తున్నాము. అక్కడెక్కడో చేవెళ్ళ పోవటానికి 16 లిఫ్టులు  కట్టగలిగిన వాడివి ఒక లిఫ్ట్ ద్వారా మాకు నీళ్ళు ఎందుకు ఇవ్వవు అని అంటున్నారు వాళ్ళు. అదొక అంశం.

## ఒక ప్రత్యామ్నాయం

ఇవన్నీ ఎందుకు చెపుతున్నానంటే గోదావరి జలాలు తెలంగాణకు ఇవ్వడం అనేది నీళ్ళున్నాయి తీసుకోవచ్చు అనేంత సులభమైన విషయం కాదు. చాలా మంది చేస్తున్న ఒక సీరియస్ చర్చ ఏమిటంటే క్యాచ్‌మెంట్‌లో నుంచి నీళ్ళంతా నదిలోకి పోనిచ్చి మళ్ళా లిఫ్టు చేసి వెనక్కు తీసుకొచ్చే బదులు క్యాచ్‌మెంట్‌లోనే ఎక్కడికక్కడ దానిని ఆపుకొనేటటువంటి ఇరిగేషన్ సిస్టం ఉండాలని. ఇది అసాధ్యమేమీ కాదు. తెలంగాణలో చెరువులు బాగా ఉన్నాయి, రాయలసీమలో కూడా. పై నుంచి వచ్చే నీళ్ళను ఎట్లాగూ లిఫ్టు ద్వారా తీసుకోక తప్పదు కానీ, కనీసం  మన క్యాచ్‌మెంట్‌లో ఉన్న నీళ్లనయినా మనం ఆ రకంగా వాడుకుంటే బాగుంటుంది. ఉత్తర తెలంగాణలో వర్షపాతం బాగానే ఉంటుంది. వరంగల్ జిల్లాను ఉదాహరణగా తీసుకుంటే దక్షిణాన ఉన్న జనగామ ప్రాంతంలో మహబూబ్‌నగర్‌లో లాగా, కర్నూలు, అనంతపురంలలో లాగా 500 మి.మీ వర్షపాతం మాత్రమే పడినా, ఏటూరు నాగారంలో 1100 మి.మీ దాకా వర్షం పడుతుంది. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలలో పడుతున్న వర్షపాతంతో సమానమది. ఆ వర్షాన్నంతా నదిలోకి పోనిచ్చి మళ్ళీ దానిని లిఫ్ట్ చేసి వెనకకు తీసుకోవడం ఎందుకు? ఎక్కడికక్కడ నీళ్ళను ఆపుకునేటువంటి చెరువుల వ్యవస్థను తయారు చేసుకునే మార్గం లేదా? ఇప్పుడు కూడా ఉన్నాయి కదా చెరువులు అంటారేమో. అవి చాలవు. ఎందుకంటే అదే టైములో వర్షం వల్ల అవీ నిండి

ఉంటాయి. కాబట్టి కొత్త చెరువులు తవ్వాల్సి వస్తుంది. ఉన్న వాటిని విస్తరించాల్సి వస్తుంది. అటువంటి వ్యవస్థ గురించి సీరియస్‌గా ఆలోచించకపోతే ఇది మనకు తలకు మించిన భారం అవుతుంది. ఆచరణ యోగ్యమైన పద్ధతి కాదు. కానీ ఆ సిస్టం వలన కాంట్రాక్టర్లకు పైసలు రావు. చిన్న చిన్న చెరువులు, కట్టలు కడితే వాళ్ళకు లాభాలు ఏమొస్తాయి?

రెండవది ఇవ్వాళ నేను ముఖ్యమంత్రి అయ్యాను కాబట్టి వచ్చే సంవత్సరానికల్లా 16 లక్షల ఎకరాలకు నీళ్ళు ఇచ్చేయాలి అనుకోవడం సబబు కాదు. నెమ్మదిగా జాగ్రత్తగా చేయాల్సిన పనులు అవి. మనకున్న రాజకీయ సంస్కృతి, మనకున్న రాజకీయార్థిక సంస్కృతి అటువంటి ఆలోచనలను అమలు చెయ్యదు. కానీ ఇవ్వాళ చాలా సీరియస్‌గా తెలంగాణలో జరుగుతున్న చర్చ మాత్రం గోదావరి జలాలను తెలంగాణకు ఉపయోగించాలంటే ఇది పద్ధతి కాదనే. పైనుంచి వచ్చే నీళ్ళను ఎట్లాగూ లిఫ్టు చెయ్యక తప్పదు, ఆ ఖర్చు భరిస్తాము కానీ మన క్యాచ్‌మెంట్ నీళ్ళయినా మనం ఈ రకంగా వాడుకుందామని వాళ్ళ ఆలోచన. దానికి కూడా అవకాశం లేనటువంటి వాతావరణం, పరిస్థితి ఉంది.

ఇవీ మొత్తంగా నేను మీకు చెప్పాలనుకున్న విషయాలు. మీరు ప్రశ్నలేమన్నా అడిగితే నాకు తెలిసిన మేరకు నేను జవాబు చెప్పే ప్రయత్నం చేస్తాను.

## ప్రశ్నలు – జవాబులు

ప్రశ్న : తెలంగాణలో కిందికి వస్తే గదా గోదావరి ఎత్తు తక్కువ ఉండేది, పైన గోదావరి మీద ప్రాజెక్టులు కట్టలేమా?

జవాబు: గోదావరిలోకి ఎక్కువ నీళ్ళు వచ్చేది ప్రాణహిత నుంచి, ఇంద్రావతి నుంచి, శబరి నుంచి కాబట్టి ప్రాణహిత దగ్గరకు వచ్చే లోపల గోదావరిలో ఉన్న నీళ్ళను ఎలాగూ వాడుకుంటున్నాం. శ్రీరాంసాగర్ దగ్గర ఎత్తు సుమారుగా ఉంది. దాన్ని ఇంతకుముందే కట్టేసుకున్నాం. అక్కడి నుండి తగ్గుతుంది ఎత్తు. మళ్ళీ నీళ్ళు ఎక్కడి నుంచి వస్తాయి మనకు? ప్రాణహిత దగ్గర. అక్కడ మరో ప్రాజెక్టు కట్టేసుకుంటున్నాము. ప్రాణహిత నది గోదావరిలో కలిసేది కాళేశ్వరం దగ్గర. అది ఒక పుణ్య క్షేత్రం. అక్కడ కాకుండా పైనే కట్టేసుకుంటున్నాం ప్రాజెక్టు. ఇంద్రావతి వచ్చి గోదావరిలో కలిసిన తరువాతనే ఇచ్చంపల్లి డ్యాం కట్టాలనే డిమాండు చాలా కాలంగా ఉంది. దాంట్లో అనేక సమస్యలున్నాయని చెప్పి దాని పక్కనే దేవాదుల దగ్గర

కడుతున్నారు.కాబట్టి నీకు నీళ్ళు అందుబాటులోకి వచ్చేటప్పటికే ఎత్తు తగ్గిపోతోంది. అదీ సమస్య.

ఇంకొక్క విషయం చెబుతాను, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ విషయం వచ్చేటప్పటికి మా అభ్యంతరం ఏమిటో నేను చెప్పాను– ఎనిమిది మిగులు జలాల ప్రాజెక్టులను సమానంగా చూడకుండా కడప జిల్లాకు నీళ్ళిచ్చే వాటికి ప్రాముఖ్యం ఇస్తున్నాడని. కానీ తెలంగాణవాదుల అభ్యంతరం ఏమిటి అంటే మిగులు జలాలు అసలు రాయలసీమకే ఇవ్వడానికే వీలు లేదని. కృష్ణానదిలోని మిగులు జలాలు మొత్తం తెలంగాణకే చెందుతాయి, రాయలసీమకు కాదు అని వాళ్ళు అంటున్నారు. అందువల్ల పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం పెంపుదలను వ్యతిరేకిస్తున్నారు. మేము ఆ వైఖరి తీసుకోవడం లేదు. మొదటే చెప్పాను. నీటి మీద హక్కు అనేది అవసరాన్ని బట్టి ఉండాలి. రాయలసీమకూ నీళ్ళు అవసరమే. ఎటొచ్చీ సమానంగా చూడాలి. అధికారం మాది కాబట్టి మా జిల్లాకు నేను ఎక్కువ ఇచ్చుకుంటాను అనే వైఖరి సరైనది కాదు. టి.ఆర్.ఎస్ అభిప్రాయం ఏమిటంటే – టి.బి డ్యాం వగైరాల ద్వారా రాయలసీమకు ఇప్పటికే కృష్ణా నీళ్ళు ఇవ్వడం జరిగింది. రాయలసీమ పెన్నానది బేసిన్‌లో ఉన్నటువంటి ప్రాంతం. ఏ బేసిన్ వాళ్ళు ఆ బేసిన్ నీళ్ళే తీసుకోవాలి. వేరే బేసిన్ నీళ్ళు వాళ్ళు తీసుకోవడానికి వీలు లేదు. హగరి అనే నది ఒకటి, హంద్రీ అని మరొకటి మాత్రమే – రెండూ చిన్న నదులే– కృష్ణానది ఉపనదులు. ఆ మేరకు మాత్రమే రాయలసీమకు కృష్ణానది మీద హక్కు ఉంటుంది. అదెలాగూ వాళ్ళిప్పుడు సుంకేసుల ప్రాజెక్టు నుంచి తీసుకుంటున్నారు కాబట్టి మిగులు జలాలలో ఇక రాయలసీమకు ఇవ్వడానికి వీలులేదు అనేది తెలంగాణ ఉద్యమకారుల అభిప్రాయం. మా అభిప్రాయం ఇంతకు ముందే చెప్పాను.

బేసిన్‌లో ఉండటం, ఉండకపోవడం అనేది మనం ఎంచుకున్నది కాదు. ప్రకృతిలో మనం పుడతాం. అవసరాన్ని బట్టి నీరు తెచ్చుకోక తప్పదు. ఇప్పుడు రాజస్థాన్‌లో నీళ్ళు లేవు కాబట్టి ఎక్కడ నుంచీ నీళ్ళు ఇవ్వం అంటే రాజస్థాన్ ఏమైపోవాలి? వేరే బేసిన్ నుంచి నీళ్ళు ఇస్తేనే రాజస్థాన్ ఈ మాత్రమైనా బ్రతకగలుగుతోంది. కాబట్టి అది సరైన వైఖరి కాదని

మా అభిప్రాయం. టి.ఆర్.ఎస్ అభిప్రాయం గానీ, చాలామంది తెలంగాణ ఉద్యమకారుల అభిప్రాయం గానీ రాయలసీమకు మిగులు జలాలు ఇవ్వడానికి వీలు లేదు అనే. అందువల్లే వాళ్ళు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు అభ్యంతరం చెప్పారు.

పోతే ఇంతకు ముందే చెప్పినట్లుగా క్యాచ్‌మెంట్‌లోనే గోదావరి జలాలను ఆపుకోవడం అనే దానికి చాలా సీరియస్‌గా వర్క్ చేస్తున్న వాళ్ళు ఉన్నారు. వరంగల్ రీజనల్ ఇంజనీరింగ్ కాలేజీలోని – ఇప్పుడు దానిని ఎన్.ఐ.టి అంటున్నారు – సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఉన్న వాళ్ళు అనేక ప్రతిపాదనలు చేశారు. నిజానికి అవన్నీ స్టడీ చేసి అమలు చేస్తే బాగుంటుంది. వాళ్ళను ఎవ్వరూ చెయ్యమనలేదు కానీ, ఇక్కడ ఉద్యోగం చేస్తున్నాం, ఈ ప్రాంతానికి మేలు చేయాలనే కమిట్‌మెంట్‌తో ఆ ప్రొఫెసర్లు ఈ పని చేశారు. అందులో ఎక్కువ పని చేసిన వ్యక్తి ఆంధ్రా ఆయన, కృష్ణా జిల్లా ఆయన, పాండురంగారావు గారు. ఆయన చాలా శ్రద్ధగా ఈ సమస్యను అధ్యయనం చేశారు. కాని ప్రభుత్వాలకు ప్రత్యామ్నాయాల పట్ల ఆసక్తి లేదు. ఎందుకంటే వాళ్ళకెంత సేపూ అయిదు సంవత్సరాలలో ఎంత సంపాదించుకోగలుగుతాం, మన కాంట్రాక్టర్లు ఎంత సంపాయించుకోగలుగుతారు అనే దాని మీదే ఉంటుంది వాళ్ళ ధ్యాస అంతా. రెండవది ముఖ్యమంత్రి గారు ఆదేశిస్తే ఆరునెలల్లో అయిపోవాలి. శ్రద్ధగా చేసే పనులు అట్లా అయిపోవు. అటువంటి దురదృష్టకరమైన వాతావరణంలో జీవిస్తున్నాం.

ప్రశ్న : అమెరికాలో 19వ శతాబ్దంలోనే నీటి పారుదల ప్రాజెక్టుల మీద సమగ్రమైన అధ్యయనాలు చేశారు. వాళ్ళ అనుభవాన్ని మీరేమన్నా పరిగణనలోకి తీసుకున్నారా?

జవాబు : అమెరికాలో కూడా తగాదాలు ఉన్నాయి. కానీ వాళ్ళేమి చేశారంటే నదీ జలాల పంపకానికి ట్రిబ్యునల్‌ను ఒకటి ఏర్పాటు చేసుకుని, పంపకం అయిపోయిన తరువాత దాన్ని ప్రభుత్వ నిర్వహణకు వదిలేయకుండా, ఆ తర్వాత కూడా దానిని పర్యవేక్షించడానికి రివర్ వ్యాలీ అథారిటీని పెట్టుకున్నారు. ఉదాహరణకు మిసిసిపి రివర్ వ్యాలీ అథారిటీ అని ఉంది.

అమెరికాలో మిసిసిపి ఒక పెద్ద నది. అనేక రాష్ట్రాల గుండా పోతుంది. మన కంటే అమెరికాలో ఫెడరల్ వ్యవస్థ ఎక్కువ కాబట్టి రాష్ట్రాలకు విడివిడి హక్కులు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి రివర్ వ్యాలీ అథారిటీ ఒకటి పెట్టుకుని, ఆ అథారిటీ నిర్ణయం ప్రకారం నడుచుకుంటారు. మన దగ్గర టి.బి. డ్యాంకు కూడా ఒక అథారిటీ ఉంది కాని అది అమెరికన్ అథారిటీ లాంటిది కాదు. పైర్ల కాలం వచ్చింది, మాకింత నీళ్ళు కావాలి అని మనవాళ్ళు, అలాగే కర్ణాటక వాళ్ళు తమకు టైమైందని ఇండెంట్‌లు (అభ్యర్థనలు) పంపితే అక్కడ నుంచి నీటిని విడుదల చేస్తారు. అది ఒక అడ్మినిస్ట్రేటివ్ అథారిటీ మాత్రమే. అడిగినప్పుడు నీళ్ళు ఇచ్చే అథారిటీ మాత్రమే. అట్లా కాకుండా వివాదాలను కూడా అప్పటికప్పుడు పరిష్కరించేటటువంటి అధికారమున్న ఒక అథారిటీని ఏర్పాటు చేసుకుంటే బాగుంటుంది. ముఖ్యంగా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌ల మధ్యనే కాకుండా తెలంగాణ, రాయలసీమల మధ్య కూడా అవసరం. మా అభిప్రాయంలో రెండూ కూడా కరువు ప్రాంతాలే. అయినా రకరకాల కారణాల వల్ల ఈ ప్రాంతాల మధ్య కొట్లాటలు వస్తున్నాయి కాబట్టి రాష్ట్రం లోపల, రాష్ట్రం బయటా కూడా ముందు ఒక అంగీకారానికి రావాలి. తర్వాత దానిని అమలు చేసే అధికారాలు ఉండే ఒక రివర్ వ్యాలీ అథారిటీని ఏర్పాటు చేసుకుంటే బాగుంటుంది. అది అమెరికా నుంచే నేర్చుకోనక్కర్లేదు కానీ ఆ అవసరం అయితే తప్పనిసరిగా ఉంది. చేస్తే బాగుంటుందని మా అభిప్రాయం.

ప్రశ్న : కావేరి విషయంలో ఎందుకు ప్రతిసారీ సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సి వస్తోంది?

జవాబు: కావేరి విషయంలో ఏమైందంటే కర్ణాటకకు, తమిళనాడుకు మధ్య వివాదం ఎంతకీ తెగడం లేదు. దాంతో ఆ నదీజలాల పంపకంపై వేసిన ట్రిబ్యునల్ అవార్డు (తీర్పు) ఇవ్వలేదు. ఆ కారణంగా ప్రతి సంవత్సరం తమిళనాడువాళ్లు తాత్కాలిక ఆర్డరు ఇవ్వమని ట్రిబ్యునల్‌కు దరఖాస్తు పెట్టుకుంటుంటారు. ట్రిబ్యునల్ ఆర్డరు ఇవ్వడం లేదంటూ ఆ తర్వాత సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్లు వేస్తున్నారు. చూస్తూ కూర్చుంటే గొడవలయిపోతాయి కాబట్టి 'మీ పరిధిలో ఉందా లేదా అని తర్వాత నిర్ణయిద్దురు కాని ప్రస్తుతానికి

ఆర్డరు అయితే ఇవ్వండి' అని ప్రభుత్వం సుప్రీంకోర్టుకు చెపుతూ వస్తోంది.

సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీలకుండే ప్రపంచ జ్ఞానం చాలా తక్కువ, ముఖ్యంగా ఇటువంటి విషయాలలో. అదే ట్రిబ్యునల్‌లో అయితే జడ్జితో పాటు ఇరిగేషన్ గురించిన జ్ఞానం ఉన్నవాళ్లు సభ్యులుగా ఉంటారు. జడ్జిలకు వదిలేయడం అంత మంచిది కాదని నా ఉద్దేశ్యం.

ప్రశ్న : జాతీయ నదుల అనుసంధానం గురించి సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశంలో భాగంగానే కృష్ణా- గోదావరి నదులను అనుసంధానం చేసి దేశంలోనే సుప్రీంకోర్టు ఆదేశాలను అమలుపరుస్తున్న మొదటి రాష్ట్రంగా ఉండబోతున్నామని చెప్పి పొన్నాల లక్ష్మయ్య గారు ప్రకటిస్తూ ఉంటారు. పోలవరానికి సంబంధించి పుచ్చలపల్లి సుందరయ్య గారే చెప్పారు, విశాలాంధ్రలో సమగ్ర నీటి పంపిణీకి పోలవరం కట్టాలని. ఆయనే చెప్పిన తరువాత పోలవరానికి అభ్యంతరం ఎందుకు అని ఒక ప్రశ్న వస్తూ ఉంటుంది. అలాగే ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్‌ల అభ్యంతరాలు ఏమిటి?

జవాబు: నేను పొన్నాల లక్ష్మయ్య గారి తెలివితేటలకు భరోసా ఇవ్వను, పుచ్చలపల్లి సుందరయ్య గారి అభిమానినీ కాను. అభిమానిని కాదంటే... అనుచరుడిని కాదని నా ఉద్దేశం. ఆయన గొప్పవాడే. కాదని ఎవరూ అనరు కానీ, నదుల అనుసంధానంలో చాలా సమస్యలున్నాయి. సుప్రీంకోర్టు ప్రధానంగా అంటున్నది ఏమిటంటే గంగానదిలో ప్రవాహం చాలా ఎక్కువ ఉంది. దక్షిణ భారత దేశంలో తక్కువ ఉంది. ఇవన్నీ ఎట్లుంటాయంటే వాళ్ళు ఢిల్లీలో కూర్చొని ముందు ఒక మ్యాప్ పెట్టుకుంటారు.ఎవరో నిపుణుల్ని అడుగుతారు. గంగానదిలో చాలా నీళ్ళున్నాయి, కింద లేవు, పంపించేస్తే బాగుంటుంది కదా అని. అంతకంటే దాని గురించి పెద్ద చర్చలేమీ లేవు. గంగానది నుంచి గోదావరి బేసిన్‌కు నీళ్ళు రావాలంటే రెండు పెద్ద లిఫ్టులు కావాలి. వింధ్య పర్వతాలు, సాత్పురా పర్వతాలు దాటాలి. రెండు సార్లు లిఫ్టు చేసి గోదావరి బేసిన్‌లో పొయ్యాలి. గోదావరిలో కూడా అంత షార్టేజి లేదు, షార్టేజి ఉండేది కృష్ణా బేసిన్, పెన్నా బేసిన్, కావేరి బేసిన్‌లలో. గోదావరి నుంచి మళ్ళీ కృష్ణా బేసిన్‌లోకి పోవాలంటే హైద్రాబాద్ రిడ్జ్ దాటాలి. అది కూడా 400 మీటర్ల లిఫ్టు. మూడు పెద్ద లిఫ్టులు, మూడు

పెద్ద జంపులు చెయ్యాలి. చివరికి కావేరి దాకా పోయేటప్పటికి ఎంతవుతుంది అనంటే నేను ఇక్కడ వేసిన లెక్క ప్రకారం ఎకరానికి 20 వేల రూపాయలు ఖర్చు అవుతుంది నీళ్ళు ఇవ్వడానికి. ఏమన్నా బుద్ధి ఉన్న ఆలోచనేనా అది?

డబ్బు సంగతి పక్కన బెట్టి, రెండోది గంగ నుంచి నీళ్ళు ఎక్కడ తీసుకోవాలి? పాట్నా నుంచి తీసుకోవచ్చు. కాని పాట్నా నుంచి నీళ్ళు తీసుకురావాలంటే ముందు జార్ఖండ్ దాటాలి, పశ్చిమ ఒరిస్సా దాటాలి, ఛత్తీస్‌గఢ్ దాటాలి. అవన్నీ వెనుకబడ్డ ప్రాంతాలే. సాగునీరు సరిగ్గా లేని ప్రాంతాలే. వాళ్ళ కళ్ళముందు నుంచి నీళ్ళు దక్షిణ భారతానికి పోతుంటే వాళ్ళు ఊరుకుంటారా? తెలంగాణ నీళ్ళు రాయలసీమకు పోతేనే ఊరుకోవడం లేదు, ఆంధ్రావాళ్ళు పైన నీళ్ళు ఆపుకుంటామంటేనే ఊరుకోవడం లేదు. సౌత్ ఇండియాకు నీళ్ళు పోతుంటే జార్ఖండ్ వాళ్ళు ఊరుకుంటారా? ఎంత గొడవ అవుతుంది? అప్పుడు బంగ్లాదేశ్ ఏమంటుంది. గంగానది మన నది మాత్రమే కాదు, అది అంతర్జాతీయ నది. బంగ్లాదేశ్‌కూ దానిలో హక్కుంది. ఇప్పటికే బంగ్లాదేశ్ ఫరక్కా బ్యారేజీ గురించి సీరియస్‌గా అభ్యంతరం చెబుతూ ఉంది. ఫరక్కా బ్యారేజీ కట్టి మా నీళ్ళు తగ్గించారని ఎప్పటి నుంచో అభ్యంతరం చెపుతూ ఉంది. కాబట్టి అనుసంధానం అనేది జరిగేది కాదు. నేను ఇంతకు ముందు అన్నాను సుప్రీంకోర్టు జడ్జీలకు ప్రపంచ జ్ఞానం చాలా తక్కువ అని. వాళ్ళు ఇచ్చిన సూచనను అదేదో పెద్ద ఆదేశంగా భావించి అమలు చెయ్యాలనుకోవడం సరైనది కాదు.

రెండవది సుందరయ్య గారు చెప్పి ఉండవచ్చును, ఎవరైనా చెప్పి ఉండవచ్చును. ఆ రోజు పూర్తి అవగాహన లేక ఆయన అలా అనుండొచ్చు. అయినా ఆయన గురించి మనకు తెలిసిన దాని ప్రకారం ఆయన ఇవ్వాళ ఉండి ఉంటే వ్యతిరేకిస్తాడనే నేను అనుకుంటున్నాను. ఆయన పార్టీ వాళ్ళు ఏమన్నా సరే, బి.వి.రాఘవులు ఏమన్నా సరే ఆయనైతే పోలవరాన్ని వ్యతిరేకించేవాడని నేను అనుకుంటున్నాను.

పోలవరం మన రాష్ట్రంలోని 276 గ్రామాల్నే కాక పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా రాష్ట్రాలలో కూడా విస్తారమైన అడవిని, అనేక ఆదివాసీ గ్రామాలను ముంచుతుంది. నువ్వు డ్యాం కట్టుకుంటున్నావు, మాకేమీ ఇయ్యవు, మరి మేమెందుకు ముంపు భరించాలని సహజంగానే వాళ్ళు అభ్యంతరపెడతారు

కదా. సుప్రీంకోర్టులో కేసు వేశారు. మేము కూడా హైకోర్టులో పోలవరం భూసేకరణకు వ్యతిరేకంగా కేసువేశాం. అయినా సుప్రీంకోర్టు ఏం చెపుతుంది? నష్ట పరిహారం ఇచ్చేసి తీసుకోండి అంటుంది. అంత కంటే ఏముందదు.

ప్రశ్న : ఇన్ని పెద్ద ప్రాజెక్టులు కట్టే కన్నా, ప్రతి 30 కిలోమీటర్లకు ఒక ప్రాజెక్టు కడితే మంచిది కదా?

జవాబు : ఖర్చు తక్కువే గాకుండా పంపిణీ మరింత ప్రజాస్వామికంగా ఉంటుంది. ఒక చోట పెద్ద డ్యాం కట్టి నీళ్ళంతా అక్కడే ఇచ్చే బదులు 30 చోట్ల కడితే అక్కడక్కడ నీళ్ళు ఇచ్చుకుంటూ వస్తారు కాబట్టి నీటి పంపిణీ మరింత ప్రజాస్వామికంగా, సమానంగా ఉంటుందనేది వాస్తవమే. కాని ఆలోచనలే వేరే రకంగా ఉంటున్నాయి ఇప్పుడు.

ప్రశ్న : కృష్ణా బేసిన్‌లో నీటికి కొరత ఉంది. గోదావరిలో నీరు పుష్కలంగా ఉంది. అలాంటపుడు గోదావరి నీటిని కృష్ణా బేసిన్‌కు ట్రాన్స్‌ఫర్ చేయడం తప్పెలా అవుతుంది? తప్పు కాకపోగా అవసరం, అనివార్యం కూడా. ఎక్కువ చిన్న ప్రాజెక్టులను కట్టడం ఆచరణయోగ్యమూ కాదు, ఆర్థికంగా లాభసాటీ కాదు. అలాగే గోదావరి ఎగువ ప్రాంతంలో భూమి చాలా ఎత్తులో ఉంటుంది కాబట్టి నీటిని అన్ని వందల మీటర్లు ఎత్తిపోయడం (లిఫ్ట్) ఆర్థికంగానూ, ఆచరణరీత్యా కూడా సాధ్యం కాని పని. చివరికి అవి నిష్ప్రయోజనంగానే ఉండిపోతాయి కదా.

జవాబు : రెండూ మీరే అన్నారు. చిన్న ప్రాజెక్టులు కట్టడం లాభసాటి కాదంటున్నారు. పెద్ద ప్రాజెక్టులు కట్టడం ఆచరణసాధ్యం కాదంటున్నారు.

లిఫ్ట్ ప్రాజెక్టులు దీర్ఘకాలికంగా ఆచరణసాధ్యం కాని మాట నిజమే. మరి దానికి ప్రత్యామ్నాయం ఏమిటి? క్యాచ్‌మెంట్‌లోనే నీటిని ఎక్కడికక్కడ నిల్వ చేసే చిన్న ప్రాజెక్టులు కట్టాలి. మీరు ఎకనామికల్ (ఆర్థికంగా లాభసాటి కాదనేది) అనే మాటను కేవలం నగదు ఖర్చుగా చూస్తున్నారు. అంటే సివిల్ ఇంజనీరింగ్ కయ్యే ఖర్చును లెక్కపెడుతున్నారు తప్ప సమాజానికి అయ్యే ఖర్చెంతో లెక్క పెట్టడం లేదు. సమాజానికయ్యే ఖర్చంటే దానికి జరిగే కీడు ఎంతో, మేలు ఎంతో ఆ లెక్కలు వేసుకోవడం లేదు.

ఉదాహరణకు ఒక పెద్ద ప్రాజెక్టు కడతాము. పది చిన్న ప్రాజెక్టులు కడతాము. నిర్మాణ వ్యయమే తీసుకుంటే ఒక పెద్ద ప్రాజెక్టు కట్టేదాని కంటే పది చిన్న ప్రాజెక్టులు కట్టడానికి ఎక్కువ ఖర్చే కావొచ్చు. అయితే ఆ పెద్ద ప్రాజెక్టు వల్ల జీవితం కోల్పోయే ప్రజానీకానికి కలిగే నష్టాన్ని కూడా ఖర్చుగా లెక్కిస్తే ఏది ఎక్కువ ఖరీదైనదో తెలుస్తుంది. ఇప్పటిదాకా ఆ ఖర్చును మనం పరిగణనలోకి తీసుకోవడం లేదు.

గోదావరి బేసిన్ నుంచి కృష్ణా బేసిన్‌కు నీళ్లను ట్రాన్స్‌ఫర్ చేయడం వలన ఆంధ్రప్రదేశ్ వాటా కొచ్చే నీళ్లలో కొంత కోల్పోతామని ఇంతకు ముందే చెప్పాను. ఎంత ట్రాన్స్‌ఫర్ చేస్తే దాంట్లో సగం పోగొట్టుకుంటాం. ఐదు తెలంగాణ జిల్లాలకు నీళ్లు ఇవ్వాల్సిన సమయంలో వాళ్లకు ఇవ్వకుండా కిందికి తీసుకుపోతానంటే వాళ్లు నష్టపోరా! కేవలం ఇంజనీరింగ్ దృష్టితో ఈ సమస్యను చూడొద్దు. రాజకీయ, సామాజిక దృష్టికోణం నుంచి కూడా చూడండి. ప్రాజెక్టు ఖర్చులో రాజకీయ, సామాజిక వ్యయం కూడా కలపండి. అదీ ముఖ్యమైన అంశమే. అప్పుడే దాని పూర్తి వ్యయం మనకు అంచనాకు వస్తుంది.

ప్రశ్న : పశ్చిమ కనుమల్లో, తూర్పు కనుమల్లో మైనింగ్ గాని జరిగితే ఈ రెండు నదులకు అసలు నీరు వచ్చే పరిస్థితే కనబడటం లేదు. అలాంటప్పుడు ఈ ప్రాజెక్టులు కట్టి ఏం ప్రయోజనం?

జవాబు : అదొక్కటే కాదు. ఇందులో ఇంకా చాలా సమస్యలున్నాయి. మైనింగ్ జరిగితే ఏ దారుల్లో అయితే వర్షంనీరు నదిలోకి వచ్చి చేరుతున్నదో ఆ దారులు చెల్లాచెదురై కొన్ని ప్రాంతాలు ముంపుకు గురవ్వొచ్చు. అది సీరియస్ ప్రాబ్లమే కాని గోదావరికి సంబంధించి మరో సీరియస్ ప్రాబ్లం కూడా ఉంది. అదేమిటంటే గోదావరి నదీ జలాల మీద ఒప్పందం కుదిరినప్పుడు ఛత్తీస్‌గఢ్ అనే రాష్ట్రం లేదు. Under the Constitution a new State is bound by the agreement of the previous State (రాజ్యాంగం ప్రకారం కొత్త రాష్ట్రం ఏదైనా పాత రాష్ట్రం కుదుర్చుకున్న ఒప్పందానికి కట్టుబడి ఉండాలి) అని ఉన్నప్పటికీ వాళ్లు గాని వివాదం లేవనెత్తితే, పెద్దఎత్తున రాజకీయ ఆందోళన మొదలుపెడితే, ఛత్తీస్‌గఢ్ వెనుకబడిన

ప్రాంతం కాబట్టి, ఎక్కువగా ఆదివాసులు ఉండే ప్రాంతం కాబట్టి, మా అవసరాల్ని పట్టించుకోకుండా మధ్యప్రదేశ్ గోదావరి నీళ్లన్నిట్నీ ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చేసిందని ఫిర్యాదు చేస్తే, మా అవసరాలకు ఆ నీళ్లను ఇవ్వాలని డిమాండ్ చేస్తే, రాజ్యాంగ వివాదం లేవనెత్తి కోర్టుకు వెళ్తే అప్పుడు మనకు వచ్చిన 1480 టి.యం.సిలలో ఎన్ని మిగులుతాయో అనుమానమే. ఇప్పుడు మనకు మిగులు అనుకున్నదంతా వాళ్లకు ఇచ్చేయాల్సి వస్తే తెలంగాణ కోసం ఏమైనా మిగులుతుందో లేదో సందేహమే. ఇవన్నీ కూడా ఓపెన్ క్వశ్చెన్స్.

ప్రశ్న: గోదావరి మీద పెద్ద డ్యాములు కట్టే అవకాశం అయితే లేదు. మరి టిఆర్ఎస్ వాళ్లు ఏమైనా ప్రత్యామ్నాయాలు చూపించారా?

జవాబు : తెలంగాణకు ప్రతినిధిగా టిఆర్ఎస్‌నే తీసుకోవాల్సిన అవసరం లేదు. తెలంగాణలో చాలామంది ఆలోచనాపరులు ఉన్నారు. మన రాష్ట్రంలో ఉన్న గోదావరి కాచ్‌మెంట్‌లో ఎక్కడికక్కడ నీటిని నిల్వ చేయడం ద్వారా, మరీ ఎక్కువ ఖర్చు కాని పద్ధతిలో కొంత నీటిని లిఫ్ట్ చేయడానికి ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా, ఉన్న చెరువుల్ని బాగు చేయడం ద్వారా, కొత్త చెరువుల్ని తవ్వించడం ద్వారా నీటిని ఉపయోగించుకోవడమే వరంగల్‌కైనా, కరీంనగర్‌కైనా మేలనేది వారు చేస్తున్న ఆలోచన.

మానవహక్కుల వేదిక విశాఖపట్నం
జిల్లా సభల సందర్భంగా చెప్పిన క్లాస్
27 జూన్ 2009

ఈ ఉపన్యాసాన్ని balagopal.org లోను, youtube లోను వినవచ్చు

# ఆల్మట్టి వివాదం: న్యాయాన్యాయాల చర్చ

ఇది ఆల్మట్టి గురించి మాత్రమే కాదు. ఆల్మట్టి గురించి జరుగుతున్న ఆందోళన గురించి కూడా. కృష్ణా జలాల విషయంలో మన రాష్ట్రంలో ఆల్మట్టి సమస్యలాగా అందరి సమస్యలుగా, రాష్ట్ర సమస్యలుగా గుర్తింపు పొందకుండా చాలా కాలంగా జరుగుతున్న ఇతర ఆందోళనల గురించి కూడా. ఏ వివాదాన్నయినా అన్ని కోణాల నుంచి చూడడం అవసరం అనేది ఒక ప్రాథమిక ప్రజాతంత్ర నియమం. ఆల్మట్టి విషయంలో తెలుగువాళ్ళము దానిని మరిచిపోయి నట్టున్నాము. కర్ణాటక ఏమంటున్నదో తెలుసుకునే ప్రయత్నం మనం చేయడం లేదు. వాళ్ల వాదనను తెలుగు ప్రజలకు వినిపించే ప్రయత్నం పత్రికలుగానీ రాజకీయ పార్టీలుగానీ చేయడం లేదు. విషయాలు చెప్పకుండా విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం మాత్రమే జరుగుతున్నది. మన రాష్ట్ర ప్రభుత్వానికి ఆల్మట్టి విషయంలో కర్ణాటక ప్రభుత్వంపైన రెండు ఫిర్యాదులున్నాయి. ఒకటి, ఎగువ కృష్ణా ప్రాజెక్టు కింద బచావత్ అవార్డు కేవలం 5.8 లక్షల హెక్టార్ల సాగుకు అనుమతి ఇవ్వగా, కర్ణాటక ప్రభుత్వం దానిని ఇప్పుడు 7.5 లక్షల హెక్టార్లకు పెంచుకుందని. అసలు ఎగువ కృష్ణా ప్రాజెక్టుకు బచావత్ ట్రిబ్యునల్ ఇచ్చిన అనుమతి ప్రకారం ఆల్మట్టి రిజర్వాయర్‌ను సాగునీటి కోసం ఉపయోగించు కోవడానికే వీలులేదు. సాగునీరు సరఫరా చేసేది నారాయణపూర్ రిజర్వాయర్. ఆల్మట్టి దానికి నీరందించే రిజర్వాయర్ మాత్రమే. అటువంటిది ఇప్పుడు కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి ఎడమ, కుడి కాలువలు తవ్వి పొలాలకు సాగునీరు అందివ్వాలని చూస్తున్నది.

అప్పర్ కృష్ణా ప్రాజెక్టు క్రింద కర్ణాటక సాగు విస్తీర్ణాన్ని పెంచుకోవడం దానంతటదే దిగువ ప్రాంతంవారికి నష్టకరం కాదు. తనకు కేటాయించిన

నీటి వాటాకు పరిమితమై కర్ణాటక ఏం చేసుకున్నా మనకు అభ్యంతరం ఉండనవసరం లేదు. అవార్డులో ముఖ్యమైన విషయం ఏ ప్రాజెక్టు క్రింద ఎంత సాగు విస్తీర్ణం ఆమోదించబడిందనేది కాదు. ఏ ప్రాజెక్టుకు ఎన్ని టియంసిల నీరు కేటాయించ బడిందనేది కూడా కాదు. మొత్తంగా ఒక్కొక్క రాష్ట్రానికి ఎంత నీరు కేటాయించబడిందనేదే ముఖ్యం. దానికి కర్ణాటక కట్టుబడి ఉందా లేదా అనేది ముఖ్యం. ఈ విషయం నిర్ణయించడానికి కావలసిన సమాచారం కర్ణాటక బహిరంగపరచడం లేదని మనం విమర్శించడం సబబే. కానీ మన సంగతి ఏమిటి? ప్రభుత్వ వ్యవహారాలు కనీసం పొరుగు ప్రభుత్వానికి కూడా తెలియకుండా రహస్యం పాటించడం భారత ప్రజాస్వామ్యానికి అంటుకున్న అవలక్షణాలలో ఒకటి. ప్రజలకు ఎట్లాగూ ఏదీ తెలపరు. మనం కట్టుకుంటున్న ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలన్నీ కర్ణాటకకూ మహారాష్ట్రకూ మనం దాచిపెట్టకుండా తెలియజేస్తున్నామా?

బచావత్ అవార్డు వచ్చేనాటికి ఆంధ్రప్రదేశ్ కృష్ణా నదీజలాలను అప్పటికే పెద్ద మొత్తంలో వాడుకుంటూ ఉంది కాబట్టి, అదనంగా ఆంధ్రప్రదేశ్‌కు 50 టి.యం.సిల నీటిని మాత్రమే ఆ అవార్డు కేటాయించింది. కర్ణాటక అప్పటికి వాడుకుంటున్నది తక్కువ కాబట్టి, కర్ణాటకకు బచావత్ అవార్డు 195 టి.యం.సిలు అదనంగా కేటాయించింది. దీనిని కర్ణాటక ఇప్పటికీ ఇంకా పూర్తిగా వినియోగించుకోలేదు. సగభాగానికి తగ్గ ప్రాజెక్టులు కూడా ఇప్పటికీ నిర్మించుకోలేదు. 2000 సంవత్సరం లోపల తన వాటా వినియోగాన్ని పూర్తి చేసుకోవడానికి ఆ రాష్ట్రం ఆరాటపడడం సహజం. అందుకోసం వేగంగా ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టడం కూడా సహజమే. అప్పర్ కృష్ణా ప్రాజెక్టుకు కేటాయించిన 155 టి.యం.సిల బదులు 173 వాడుకున్నా, 5.8 లక్షల హెక్టార్ల బదులు 7.5 లక్షల హెక్టార్లు సాగుచేసుకున్నా, బచావత్ అవార్డుకు లోబడి కర్ణాటక ఆ పని చేసుకుంటే మనకు అభ్యంతరం ఉండనవసరం లేదు. నీటి కేటాయింపును అతిక్రమించకుండా ఆయకట్టులో మార్పులు చేసుకున్నా, ఒక ప్రాజెక్టు ఆయకట్టు పెంచి ఇంకొకటి తగ్గించుకున్నా ఆ స్వేచ్ఛ కర్ణాటకకు ఎందుకు ఉండకూడదు? మన రాష్ట్ర హైకోర్టులో కర్ణాటక చేసిన వాదన ఇదే. తమ వాటాకు వచ్చిన 700 టియంసిలను, రిటర్న్ ఫ్లో (లేక రీ జనరేటెడ్ ఫ్లో) గా లభించే 34 టి.యం.సిలను మించి తాము వాడుకోబోవడం లేదనీ, ఏ మార్పులు చేసుకున్నా అందులో భాగంగానే చేసుకుంటామనీ అంటున్నారు.

నిజానికి, ఒక ప్రాజెక్టుకు కేటాయించిన నీటితో ఎంత విస్తీర్ణం సాగుచేసుకోవచ్చుననేది నీటి వాడకాన్ని బట్టి ఉంటుంది. ఇతర నీటి వనరులను దృష్టిలో ఉంచుకొని ప్రాజెక్టు జలాలను పరిమితంగా సరఫరా చేయవచ్చును. తరిసాగుకు కాక ఆరుతడి (ఇరిగేటెడ్

డ్రై) సాగుకు మాత్రమే ఇయ్యవచ్చును. ఈ రకంగా సాగు విస్తీర్ణం పెంచుకోవచ్చును. కర్ణాటక ఏం చేయదలచుకుందో మనకు తెలియదుకానీ, అప్పర్ కృష్ణాకు బచావత్ కేటాయించిన 155 టి.యం.సిలను, కర్ణాటకకు అందుబాట్లో ఉన్న రిటర్న్ ఫ్లో 34 టి.యం.సిలను కలుపుకొని ఆరుతడి సాగుకు పారించుకుంటే అప్పర్ కృష్ణా క్రింద 7.5 లక్షల హెక్టార్లు సాగుచేసుకోవచ్చు. 1 టి.యం.సి (అంటే వందకోట్ల ఘనపుటడుగులు) 10 వేల ఎకరాల ఆరుతడి సాగుకు సరిపోతుందని అంచనా. అంటే 189 టి.యం.సిలతో 18.9 లక్షల ఎకరాలు సాగు చేసుకోవచ్చును. హెక్టార్లలోకి మార్చుకుంటే ఇది 7.5 లక్షల హెక్టార్లవుతుంది.

కర్ణాటక ఈ పనే చేయదలచుకుందో లేక పైకి ఒకటి చెప్పి లోపల తన వాటాను మించి కృష్ణా జలాలు వాడుకోదలచుకుందో మనకు తెలీదు. ఎందుకంటే 173 టియంసిలకు పెంచుకున్న అప్పర్ కృష్ణా ప్రాజెక్టును మాగాణి సాగుకు ఉపయోగించుకునే ఉద్దేశ్యం కర్ణాటకకు ఉన్నట్టు ఆ రాష్ట్రం చేస్తున్న వాదనను బట్టి అనిపిస్తుంది. అప్పుడది 7.5 లక్షల హెక్టార్లకు సరిపోదు. మిగిలిన నీళ్ళు కర్ణాటక వాటా నుండే వస్తాయా లేక ఆంధ్రప్రదేశ్ వాటా చోరీకి గురి అవుతుందా అని మనకు అనుమానం రావడంలో తప్పులేదు. కానీ దానికి నివృత్తి ఏమిటి? సాగునీటి గురించి రైతులలో సహజంగా ఉండే అభద్రతా భావాన్ని ఆసరా చేసుకొని రెచ్చగొట్టడమా? ఇరుగు పొరుగు రాష్ట్రాలు ఒకరికి వ్యతిరేకంగా ఒకరు ఆందోళనలు చేపట్టడమా? భారతదేశాన్ని ఒక ఫెడరల్ ప్రజాతంత్ర దేశంగా తీర్చిదిద్దడంలో తాము నిమగ్నమై ఉన్నామని ఈ రెండు రాష్ట్రాల రాజకీయ ప్రముఖులూ చెప్పుకుంటారు కదా. దాని అర్థం వీళ్లూ వాళ్లూ కలిసి ఢిల్లీలో పదవులు పంచుకోవడం మాత్రమేనా? ఫెడరలిజం అంటే అధికార పదవుల పంపకం మాత్రమే కాదు. ఆర్థిక రాజకీయ వికేంద్రీకరణ, ఇరుగు పొరుగుల మధ్య సామరస్య సంబంధాలు, ఇచ్చిపుచ్చుకునే సంస్కృతి, వీటికి కావలసిన వ్యవస్థలు, వ్యవస్థిత ప్రజాతంత్ర సంప్రదాయాలు– ఇవన్నీ అభివృద్ధి చెందాలి. ఆల్మట్టి ఎత్తు ఎంత ఉందో చూసి వస్తామని బయలుదేరుతున్న పెద్దమనుషులు పనిలో పనిగా బీజాపూర్ జిల్లా రైతాంగం పరిస్థితి ఏమిటో కూడా చూసి రావచ్చు కదా? అప్పర్ కృష్ణా ప్రాజెక్టు ఆయకట్టులోని కరువు పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు కదా? దానిని కృష్ణా డెల్టాతో పోల్చిచూసుకోవచ్చు కదా? అప్పుడు కనీసం వాళ్ల సాగునీటి దాహం మనకు అర్థం అవుతుంది కదా?

'అనుమానం' మాటకొస్తే కృష్ణా జలాల వాడకం విషయంలో ఆంధ్రప్రదేశ్ వ్యవహార శైలి గురించి కర్ణాటకకూ మహారాష్ట్రకూ చాలా కాలంగా సహేతుకమైన అనుమానాలున్నాయి. బచావత్ ట్రిబ్యునల్ కృష్ణా నదిలోని నికర జలాలు 2,060

టియంసిలని అంచనా వేసి ఆంధ్రప్రదేశ్‌కు 800, కర్ణాటకకు 700, మహారాష్ట్రకు 560 పంచింది. ఇవికాక రిటర్న్ ఫ్లో ఆంధ్రప్రదేశ్‌కు 11 టియంసిలు, కర్ణాటకకు 34 టియంసిలు, మహారాష్ట్రకు 25 టియంసిలు దక్కుతాయి. ఈ జలాలమీద ఆయా రాష్ట్రాలకు 'హక్కు' ఉంటుంది. అంటే ఆ మేరకు ప్రాజెక్టులు కట్టుకోవచ్చును. ఈ 2,060 టియంసిలను మించి ఏ సంవత్సరమైనా నదిలో ప్రవహించే నీటిని అదనపు జలాలు లేక మిగులు జలాలు (సర్‌ప్లస్‌ఫ్లో) అంటారు. దీనిమీద కూడా మూడు రాష్ట్రాలకూ హక్కు ఇవ్వాలన్న కోరికను బచావత్ ట్రిబ్యునల్ తోసిపుచ్చింది. మిగులు జలాల మీద ఎవ్వరికీ హక్కు ఉండదు గానీ దిగువ రాష్ట్రమయిన ఆంధ్రప్రదేశ్ వాటిని వాడుకోవచ్చునని ట్రిబ్యునల్ అనింది. అంటే అర్థం, మిగులు జలాలను ఆధారం చేసుకొని ప్రాజెక్టులు కట్టుకోవడానికి వీలులేదు కానీ వాటిని ఆంధ్రప్రదేశ్ ఉపయోగించుకోవచ్చును అని.

అయితే మన రాష్ట్రం మిగులు జలాలను ఆధారం చేసుకొని ప్రాజెక్టులు నిర్మించే ప్రయత్నం చేస్తూనే ఉంది. నిజానికి రాయలసీమ, దక్షిణ తెలంగాణ జిల్లాల దాహం తీర్చాలంటే మన రాష్ట్రంలో వున్న రాజకీయ పరిస్థితులలో ఇది అనివార్యం అయింది. బచావత్ అవార్డు వచ్చే నాటికే మన రాష్ట్రంలో కృష్ణా జలాల అసమాన వాడకం వ్యవస్థీకృతం అయిపోయింది. కృష్ణా డెల్టా, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు పెద్ద భాగాన్ని మింగేసాయి. బచావత్ నుండి మనకు అదనంగా వచ్చిన నికర జలాలు 50 టియంసిలు మాత్రమే. రాయలసీమ, దక్షిణ తెలంగాణల సాగునీటి అవసరాలు తీర్చాలంటే ఈ అసమాన వాడకాన్ని సవరించి కోస్తా జిల్లాలు వాడుకుంటున్న కృష్ణా జలాలలో కొంత భాగాన్ని ఎగువన ఆపివేయాలి. లేదా మనకు హక్కులేని మిగులు జలాలను వాడుకోవాలి. మొదటిది రాజకీయంగా అసాధ్యం కావడం వల్ల రెండవదే జరిగింది. తెలుగుగంగ ఈ పరంపరలో మొదటిది. తెలుగుగంగ ద్వారా పారించుకుంటున్న 29.8 టియంసిలలో 15 టియంసిలు మాత్రమే నికర జలాలు (అవి కూడా నికర జలాలు కావనీ, మిగులు జలాలేననీ ఒక వాదన ఉంది). జూరాలకు కేటాయించిన నీటిలో కూడా కొంత భాగం మిగులు జలాలేనని కర్ణాటక అనుమానం. ఈ మధ్య మన ముఖ్యమంత్రి పునాదిరాళ్లు వేసిన గాలేరు- నగరి, హంద్రి- నీవా, వెలిగొండ ప్రాజెక్టుల విషయం కూడా ఇంతే. ఏ వాగులను వంకలను చూపించి ఆ ప్రాజెక్టులను రూపొందించుకున్నామో, వాటిలో ప్రతిపాదిత ఆయకట్టుకు కావలసిన నీళ్లు (మొత్తం 120 టియంసిలు) లేవు. శ్రీశైలం రిజర్వాయర్ నుండి కృష్ణా జలాలను తరలించి ఆ ప్రాజెక్టుల రిజర్వాయర్‌లను నింపుకుంటేనే అవి సాధ్యం అవుతాయి. కావలసిన మోతాదులో నికర జలాలు లేనప్పుడు తరలించే నీళ్లు మిగులు జలాలే కాగలవు. ఈ

అవసరాన్ని దృష్టిలో ఉంచుకునే తెలుగుగంగ కోసం ఉద్దేశించిన పోతిరెడ్డిపాడు తూము పరిమాణాన్ని పెంచమని రాయలసీమ ఉద్యమకారులు 1980లలో ఆందోళన చేసి సాధించుకున్నారు. ఈ విషయాలన్నీ కర్ణాటకకు, మహారాష్ట్రకు తెలియకుండా పోలేదు. 'ఆల్మట్టి' కింద పెంచుకున్న సాగుకు నీకు నీళ్లెక్కడి నుండి వస్తాయని మన ప్రభుత్వం కర్ణాటకను అడుగుతున్నది. దానికి జవాబుగా కర్ణాటక కూడా హంద్రీ లేక గాలేరు వంటి ఒక నీళ్లులేని వాగును చూపించగలదు. అదేదో వాళ్లు మాత్రమే పాల్పడుతున్న దుర్మార్గం కాబోదు. ఈ రకమైన తెలివితేటలు మనకు మాత్రమే ఉన్నాయనుకోకూడదు. ఇంక పులిచింతల గురించయితే కర్ణాటక దాకా ఎందుకు, రాయలసీమవాసులకే అనుమానాలున్నాయి. కృష్ణా డెల్టా ఆధునీకరణ ద్వారా ఆదా అయ్యే నీటితో పులిచింతల నిర్మించుకుంటున్నామని మన పాలకులు అంటున్నారు గానీ, 'నికర జలాలను కబ్జా చేసుకున్నది చాలక మిగులు జలాలను కూడా కబ్జా చేసుకోవడానికి కృష్ణా జిల్లావాళ్లు చేస్తున్న ప్రయత్నమే ఇది' అన్న సహేతుకమైన సందేహం రాయలసీమలో నెలకొని ఉంది.

నికర జలాలు పోను మిగులు జలాలన్నీ దిగువ రాష్ట్రమే వాడుకోవాలన్న బచావత్ నిర్ణయం పట్ల మహారాష్ట్ర, కర్ణాటకలలో అసంతృప్తి ఉండడంలో అన్యాయమేమీ లేదు. బచావత్ అవార్డు గడువు తీరిపోయిన తరువాత (అంటే క్రీ.శ.2000 తరువాత) చేసుకోబోయే కొత్త ఒడంబడికలో మిగులు జలాలను వాడుకునే అవకాశం తాము కూడా పొందగలమని ఆ రెండు రాష్ట్రాలూ ఆశిస్తున్నాయి. అయితే ఆ లోపల ఆంధ్రప్రదేశ్ మిగులు జలాలపైన 'హక్కు' కల్పించే ప్రాజెక్టులను కట్టేసుకుంటే ఆ అవకాశం కోల్పోతామని వాళ్లు న్యాయంగానే ఆందోళన చెందుతున్నారు. ఈ రకమైన పరస్పర సందేహాలూ అనుమానాలూ ఉన్నప్పుడు ఒకరిపైన ఒకరు ద్వేషం రెచ్చగొట్టడం పరిష్కార మార్గం కాదు. దేశాన్ని ఒక 'ఫెడరల్ ప్రజాతంత్రం'గా తీర్చిదిద్దే పద్ధతి ఇది కాదు. నదీ జలాల వాడకం విషయంలో జరిగిన ఒప్పందాలకు అందరూ కట్టుబడి ఉండేటట్టు చూడడానికీ,అవసరం వచ్చినప్పుడు వాటిని సమీక్షించుకొని సవరించుకోవడానికీ ఒక శాశ్వత ట్రిబ్యునల్‌ను నెలకొల్పవచ్చు. లేదా శాశ్వతమైన ఆర్బిట్రేషన్ వ్యవస్థనుగానీ రివర్ వ్యాలీ అథారిటీనిగానీ నెలకొల్పవచ్చు. ఇలాంటి వ్యవస్థలూ సంప్రదాయాలూ తగినన్ని రూపొందించుకుంటేనే భారతదేశం ఒక ఫెడరల్ ప్రజాతంత్ర వ్యవస్థ కాగలుగుతుంది. తెలుగుదేశం, అస్సాం గణపరిషత్, జనతాదళ్, సమాజ్‌వాది పార్టీ, సిపిఐలు కలిసి ఢిల్లీలో పదవులు పంచుకోవడమే ఫెడరలిజం కాదు.

కావేరీ జలాల విషయంలో కన్నడిగులు– తమిళులు అంటూ ద్వేషాలు రెచ్చగొట్టడం వల్ల కర్ణాటకలో జరిగిన హింసాకాండను మనం మరచిపోకూడదు. వేలాది తమిళ కుటుంబాలు ఆస్తులు కోల్పోయి కర్ణాటక నుండి తమిళనాడుకు పారిపోవలసి వచ్చింది. మన రాజకీయ పార్టీలు, దినపత్రికలు పనిగట్టుకొని రెచ్చగొడుతున్న ప్రాంతీయ విద్వేషాలు ముదిరితే ఆ చరిత్ర పునరావృతం కాగలదు. ఆ రకమైన హింస ఎవరిమీద జరిగినా తప్పే. ఆ నైతిక స్పృహ లేకపోయినా కనీసం తెలుగువాళ్లకే ఎక్కువ నష్టం జరగగలదనే ఇంగితమైనా మనకు ఉండాలి. ఆంధ్రప్రదేశ్‌లో కన్నడిగులు చాలామందే ఉన్నారుగానీ వాళ్లు సమాజంలో ఆధిపత్యం చలాయించడం లేదు. కర్ణాటకలో స్థానిక తెలుగువారు చాలామంది ఉన్నారు. ఎం.ఎల్.ఏలు, మంత్రులు కూడా ఉన్నారు. అంతేకాక ఆంధ్రప్రదేశ్ నుండి కర్ణాటకకు వలసపోయి వ్యవసాయంలో, కాంట్రాక్టులలో పెద్దస్థానం పొందినవాళ్లు కూడా చాలామంది ఉన్నారు. కర్ణాటక నీళ్లు – ఆంధ్ర నీళ్లు అంటూ నదీ జలాలను పంచుకునేటట్టయితే బళ్లారి జిల్లాలోని తుంగభద్ర డ్యాం క్రింద భూములు కొనుక్కున్న ఆంధ్రుల హక్కేమిటి? వాళ్లను కన్నడిగులు అక్కడి నుండి వెళ్లగొట్టవచ్చునా? బెంగుళూరు మహా నగరంగా ఎదిగిన క్రమంలో లాభం పొందిన ఆంధ్ర కాంట్రాక్టర్లు, పెట్టుబడిదార్లు అనేకులున్నారు. సర్కార్ జిల్లాలవాళ్లు, రాయలసీమవాళ్లు కూడా ఉన్నారు. 'మా అభివృద్ధి ఫలితం మీకెందుకు దక్కాలి?' అని వాళ్లను అక్కడి నుండి తరిమేయవచ్చునా?

'కృష్ణానది ఆంధ్రులకు కేవలం ఒక నది కాదు. అది మా వ్యక్తిత్వంలో అంతర్భాగం. మా సంస్కృతీ సంప్రదాయాలలో విడదీయరాని భాగం' అని మన రాష్ట్ర పాలకులు కేంద్రానికి సమర్పించిన నివేదికలో అన్నారు. బాగుంది. మరి 'మహారాష్ట్ర కృష్ణానది పుట్టినిల్లు. దాని మాతృగడ్డ' అని మహారాష్ట్రులు అనలేరా? కర్ణాటక కూడా ఇటువంటి కవిత్వం చెప్పజాలదా? మనకు మాత్రమే ఉన్నతమైన తాదాత్మ్య భావాలు ఉంటాయా? తక్కిన వాళ్లంతా నీటిని కేవలం నీరు అనుకునే పచ్చి భౌతికవాదులా?

రెండు, సాగు విస్తీర్ణం పెంపుదల గురించే కాక ఆల్మట్టిలో కర్ణాటక జల విద్యుదుత్పత్తి కోసం నిలువ ఉంచుకోబోతున్న నీటిని గురించి కూడా మనం ఆందోళన చెందుతున్నాం. బచావత్ అవార్డు ప్రకారం ఆల్మట్టి, నారాయణపూర్ రిజర్వాయర్ల మొత్తం కెపాసిటీ 80 టియంసిలు. ఇప్పుడు పెరిగిన ఆయకట్టు కోసం, టర్బైన్లు తిప్పుకోవడం కోసం దానిని కర్ణాటక 251 టియంసిలకు పెంచుకుంటూ ఉంది. దీని గురించే మన నాయకులంతా విపరీతంగా ఆవేశపడుతున్నారు. అంత నీళ్లు ఎగువ ప్రాంతంలో నిలువ ఉంచుకునేట్లయితే, దానిని సాగుకోసం ఉపయోగించుకోక

పోయినా అది నిండేంతవరకు నది నీళ్లు కిందికి పోకపోయేటట్టయితే, దిగువ ప్రాంతానికి నీళ్లు చాలా ఆలస్యంగా వస్తాయనీ, వర్షాభావం వున్న సంవత్సరాలలో అసలే రాకపోవచ్చుననీ మనవాళ్లు చాలా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా డెల్టా ఎడారి అయిపోతుందని ఒకరు, దివిసీమలో బ్రహ్మజెముళ్లు మొలుస్తాయని ఇంకొకరు, శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్లు ఇంకిపోయి రాష్ట్రం అంధకారంలో మునిగిపోతుందని మరొకరు విపరీతమైన అతిశయోక్తులు మాట్లాడుతున్నారు. ఇక్కడ కూడా వాస్తవాలెరిగి మాట్లాడుకోవడం అవసరం.

కర్ణాటక ఆ నీటిని టర్బైన్లు తిప్పడం కోసం నిలవ ఉంచుకుంటూ ఉంది. అది ఖర్చు కాదు. కొంత ఆవిరి అవుతుంది. కొంత వాడకంలో వృథా కావచ్చు. వృథా ఎంత అవుతుందనేది లెక్కగట్టి చెప్పలేము. ఆవిరి ఎంత అవుతుందనేది రిజర్వాయర్ ఉపరితల వైశాల్యాన్నిబట్టి ఉంటుంది. ఏమయినా అది నిలువ వుంచిన నీటిలో 10 శాతానికి అటూ ఇటూగా ఉంటుంది. ఆ మేరకు మాత్రమే దిగువ నీటి ప్రవాహం ఆలస్యం అవుతుంది (తొలి సంవత్సరం తప్ప). పైగా, ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవహించే కృష్ణా జలాలన్నీ ఆల్మట్టిని దాటి వచ్చేవే కావు. దిగువ ప్రాంతంలో కలిసే నీరు చాలా ఉంది. కృష్ణానది నికర జలాలలో మన వాటా అయిన 800 టియంసిలలో 462 కర్ణాటక నుండి వస్తాయని అంచనా. అయితే అందులో తుంగభద్ర, భీమా నదులు తెచ్చే నీరు కూడా ఉంది. ఆ నదులు కృష్ణలోకి ఆల్మట్టికి దిగువన కలుస్తాయి. అవి తీసుకొచ్చే నీటికి ఆల్మట్టి రిజర్వాయర్ అడ్డు రాదు. ఆల్మట్టి నుండి నేరుగా కిందికి పారే నీటిలో, ఆ రిజర్వాయర్ నుండి ప్రతి సంవత్సరం ఆవిరి అయ్యే (25 లేక 30 టియంసిల) నీటిమేరకు మాత్రమే మనకు నీరు ఆలస్యంగా రావడం, వర్షాభావ సంవత్సరాలలో లోటుపడడం జరుగుతుంది. కర్ణాటక చెప్పేవన్నీ అబద్ధాలేననీ, ఆ 251 టియంసిల రిజర్వాయర్ కెపాసిటీ సహాయంతో వాళ్లు 400 టియంసిల నీరు పొలాలకు ప్రవహింప జేసుకోదలచుకున్నారనీ మనల్ని మనం ఉద్రేకపరుచుకోదలచుకుంటే అది వేరే సంగతి.

వాళ్ల మాటలమీద కొంత విశ్వాసం ఉంచి (అనుమాన నివృత్తికి అనువయిన వ్యవస్థలు రూపొందించుకొని) ఆలోచించేటట్టయితే అంధకారాన్ని గురించి, కరువు కాటకాల గురించి ఆవేశపడవలసిన అవసరం ఎంత మాత్రం లేదు. మన రాష్ట్రంలో జరిగే విద్యుదుత్పత్తిలో 33 శాతం మాత్రం శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో జరుగుతుంది. ఆ విద్యుత్కేంద్రాలు ఇప్పటికంటే కొంచెం ఎక్కువ కాలం పూర్తి సామర్థ్యం కంటే కొంచెం తక్కువ సామర్థ్యంతో పనిచేయవలసి వస్తే దానివల్ల మనకు కొంత ఇబ్బందే

కానీ రాష్ట్రం చీకటి కొట్టయిపోదు. కరువు మాటకొస్తే కృష్ణాడెల్టా, నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతాలలో వర్షపాతం సమృద్ధిగానే ఉంది. భూగర్భ జలాలు సాపేక్షంగా బాగున్నాయి. 25 లేక 30 టియంసిల నీరు ఆల్మట్టిలో అదనంగా నిలిచిపోవడం వల్ల ఇక్కడ కరువు వస్తుందనడం హాస్యాస్పదం. నిజంగానే అందరూ భయపడుతున్నట్టు అంతకంటే ఎక్కువ నీరు నిలిచిపోయినా ఇక్కడ సాగునీటి వాడకపు పద్ధతులు, పంట విధానాలు కొంత మార్పిడి చేసుకోవలసి వస్తుందేమో. ఊరికే కేకలు వేయకుండా మనకు రాగల ఇబ్బంది ఎంతనేది వాస్తవికంగా అంచనా వేసి అప్పర్ కృష్ణా ప్రాజెక్టు సాగు చేయవలసిన ప్రాంతంలోని కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వారితో సహోదర భావంతో చర్చించడం సాధ్యం కాదా?

నీటి వాడకంలో న్యాయాన్యాయాల గురించి ఇంకొంచెం వివరంగా మాట్లాడుకుందాం. 'కర్ణాటక చర్యలవల్ల మా ప్రయోజనాలు దెబ్బతింటున్నాయి. వాటిని మేము కాపాడుకుంటాం' అని మాత్రమే మనము అనడం లేదు. 'మాకు అన్యాయం జరుగుతున్నది. న్యాయం చేయండి' అని కూడా అంటున్నాం. ఇది మంచిదే. ప్రయోజనాలనే కాక నైతిక ప్రమాణాలను కూడా ప్రాతిపదిక చేసుకొని మాట్లాడినప్పుడే మనుషుల మధ్య సంభాషణ సాధ్యం అవుతుంది. ఒట్టి ప్రయోజనాలే ప్రాతిపదిక అయితే తిట్టుకోవడం మాత్రమే సాధ్యం అవుతుంది. అయితే న్యాయాన్యాయాల ప్రాతిపదికన తమ ప్రయోజనాల గురించి మాట్లాడే వాళ్లు ఇతరుల ప్రయోజనాల గురించి కూడా అదే ప్రాతిపదికన ఆలోచించడానికి సిద్ధపడాలి. కృష్ణా జలాల విషయంలో కర్ణాటక ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేస్తున్నదని వాదించేవాళ్లు, మన రాష్ట్రానికి వచ్చిన వాటాను మనం అసమానంగా పంచుకోవడం వల్ల రాయలసీమ, దక్షిణ తెలంగాణ జిల్లాలకు జరిగిన అన్యాయాన్ని గురించి కూడా ఆలోచించడానికి సిద్ధంగా ఉండాలి. ప్రాదేశిక సానుకూలతను ఉపయోగించుకొని ఎగువ ప్రాంతంలో నీటిని బంధించి కూర్చోవడం అన్యాయం అనేవాళ్లు, రాజకీయ ఆధిపత్యాన్ని ఉపయోగించుకొని దిగువ ప్రాంతంలో ప్రాజెక్టులు కట్టేసి హక్కులు కల్పించుకొని కూర్చోవడం కూడా అన్యాయమని గుర్తించాలి. ఆల్మట్టి వల్ల కృష్ణాడెల్టా ఎడారి అయిపోతుందని ఆందోళన చెందేవారు, మన రాష్ట్ర వాటాను అసమంగా పంచుకోవడం వల్ల ఇప్పటికే సగం ఎడారి అయిపోయిన అనంతపురం గురించి కూడా ఆందోళన చెందాలి. కృష్ణాడెల్టా ఎడారి అయిపోతే అది కృష్ణాడెల్టావాసుల సమస్య మాత్రమే కాదనీ తెలుగువారందరి సమస్య అనీ వాదించేవారు, మహబూబ్‌నగర్ ఎండిపోయినా అనంతపురం వాడిపోయినా అది మహబూబ్‌నగర్ సమస్య మాత్రమే కాదనీ,

అనంతపురం సమస్య మాత్రమే కాదనీ, తెలుగు వాళ్లందరికీ సమస్య అనీ గుర్తించాలి. న్యాయాన్యాయాల గురించి మాట్లాడుతున్నారు కాబట్టి ఈ మాట అంటున్నాం. లేకపోతే అనవలసిన పని లేదు.

నల్గొండ జిల్లా వాళ్లు శ్రీశైలం ఎడమ కాలువ పనులు త్వరగా పూర్తిచేయాలనీ, దానిలోని సాంకేతిక సమస్యలను వేగంగా పరిష్కరించాలనీ చాలా కాలంగా చేస్తున్న ఆందోళన ఇప్పటికీ వాళ్ల ఆందోళనగానే ఉంది. అది మనందరి సమస్య కాలేదు. వాళ్లు చివరికి విసిగిపోయి పార్లమెంటు ఎన్నికలలో విపరీతంగా నామినేషన్లు వేసినప్పుడు మాత్రం అది మనందరికే కాదు, దేశానికే సమస్య అయింది. దానికోసం ఎన్నికల నామినేషన్ డిపాజిట్‌ను 10 రెట్లు పెంచారుగానీ శ్రీశైలం ఎడమ కాలువ సమస్యను మాత్రం పరిష్కరించలేదు. పరిష్కరించమని తెలుగువాళ్లందరూ ఒక్కగొంతుతో (ఆల్మట్టి గురించి చేస్తున్నట్టు) ఆందోళన చేయలేదు.

రాయలసీమకయితే సాగునీటి విషయంలో ఘోరమైన అన్యాయం జరిగింది. కోస్తా తెలంగాణ జిల్లాల కంటే రాయలసీమలో వర్షపాతం తక్కువ. భూగర్భ జలాలు తక్కువ. ఉన్న చెరువులన్నీ నాశనం అయ్యాయి. సాగునీటి కోసం కృష్ణ, పెన్నా నదులపైన రాయలసీమవాసులు ఆశలు పెట్టుకున్నారు. అవి రెండూ వాళ్లకు దక్కకుండా పోయాయి. కృష్ణ–పెన్నలపైన పెద్ద ప్రాజెక్టు కట్టి రాయలసీమను కరువునుండి విముక్తి చేయాలని బ్రిటిష్‌వాళ్లు గత శతాబ్దం చివరి రోజులలోనే ప్రతిపాదించారు. కానీ దానికి కార్యరూపం ఇవ్వలేదు. 1951లో అప్పటి మద్రాస్ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆలోచనకు మళ్లీ ప్రాణంపోసి, రాయలసీమకు 100 టియంసిల సాగునీరు ఇస్తూ తమిళ జిల్లాలకు కూడా సాగునీరు సరఫరా చేసే కృష్ణా–పెన్నార్ ప్రాజెక్టును రూపొందించి, ప్రణాళికా సంఘం ఆమోదం కూడా పొందింది. కానీ ఆ తరువాత ఆంధ్రరాష్ట్రం ఏర్పడినాక కృష్ణా నీళ్లు తమిళులకు ఇవ్వడానికి వీలులేదని మన పాలకులు గొడవచేసి ఆ ప్రాజెక్టును రద్దుచేసి నాగార్జునసాగర్ నిర్మించారు. తమిళులతోపాటు రాయలసీమవాసులు కూడా కృష్ణనీళ్లపైన హక్కును కోల్పోయారు. ఆ తరువాత పెన్నానది మీద సోమశిల ప్రాజెక్టు కట్టి నెల్లూరు జిల్లా అవసరాలకు పెద్దపీట వేయడం వల్ల ఆ నది కూడా రాయలసీమకు దక్కకుండా పోయింది. రాయలసీమ పేరుమీద కట్టిన తెలుగుగంగ ప్రాజెక్టు నీళ్లు కూడా రాయలసీమ కంటే నెల్లూరు జిల్లాకే ఎక్కువ పోతాయి. వర్షపాతానికీ సాగునీటి లభ్యతకూ సంబంధించిన గణాంకాలు చూస్తే రాయలసీమ దుస్థితి కొంతయినా అర్థం అవుతుంది.

| ప్రాంతం | సగటు వర్షపాతం (మి.మీ) |
|---|---|
| కోస్తా | 1024 |
| తెలంగాణ | 929 |
| రాయలసీమ | 691 |
| | సాగుభూమిలో నీటిపారుదల వసతిగల శాతం (1992) |
| కోస్తా | 58 |
| తెలంగాణ | 33 |
| రాయలసీమ | 22 |
| (తెలంగాణలో నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలను వేరుచేసి చూపిస్తే అవి కూడా రాయలసీమ వలెనే ఉంటాయి.) | |

వివక్ష ఫలితమైన రాయలసీమ దుస్థితి గురించి రాయలసీమ ఉద్యమకారులూ, మేధావులూ చాలాకాలంగా ఆందోళన చేస్తున్నారు. కృష్ణా జలాల విషయంలో జరిగిన అన్యాయాన్ని వివరణాత్మకంగా చెప్తున్నారు. కాని వినేవాళ్లెవరూ లేరు. అది మనందరి సమస్య ఎప్పుడూ కాలేదు. కేవలం రాయలసీమవాసుల సమస్య అయింది. రాయలసీమ ఎడారి అయిపోతున్నదని అందరూ ఏడవరు. రాయలసీమవాసులు మాత్రమే ఏడవాలి. హంద్రీ-నీవా, గాలేరు-నగరి, వెలిగొండ ప్రాజెక్టుల గురించి ఊరికే హామీలిచ్చి ప్రయోజనం లేదనీ, ఉద్దరగా దొరికే పునాదిరాళ్లు వేసిపోతే ఉపయోగం లేదనీ, నికర జలాలో మిగులు జలాలో ఏదో ఒక జలాలు కేటాయించి పనులు మొదలుపెట్టి క్రీ.శ. 2000 లోపల పూర్తి చేయాలనీ ఇప్పుడు రాయలసీమవాసులు ఆందోళన చేస్తున్నారు. అది వాళ్ల గొడవే అయింది. అందరి గొడవా కాలేదు. కానీ కేటాయించని నీళ్ల కోసం ఆల్మట్టి రభసలో కలిసి రమ్మని రాయలసీమవాసులను ఆహ్వానించడానికి మన పాలకులు వెనుకాడడం లేదు!

బచావత్ ట్రిబ్యునల్ ఎదుట ఆంధ్రప్రదేశ్ తన వాదన వినిపించేటప్పుడు మాత్రం రాయలసీమనే ప్రధానంగా చూపించింది. తరతరాల కరువు నుండి రాయలసీమకు విముక్తి లభించాలంటే కృష్ణా జలాలలో ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కువ వాటా కావాలని వాదించింది. అప్పటికే చాలా వాడుకుంటూ ఉండడం వల్ల అదనంగా ఎక్కువ నీరు ఆంధ్రప్రదేశ్‌కు దక్కలేదుగానీ మొత్తంమీద పెద్దవాటా మనకే దక్కింది. మిగులు జలాలను వినియోగించుకునే అవకాశం కూడా మనకే దక్కింది. కానీ రాయలసీమకు చేసింది

శూన్యం. నిజానికి కోస్తా జిల్లాలు కృష్ణాజలాల పైన తాము స్థాపించుకున్న 'హక్కు'ను కొంత వదులుకోనిదే రాయలసీమకు చేయగలిగింది తక్కువే. ఆంధ్రప్రదేశ్‌కు దక్కిన 800 టియంసిల నికర జలాలలో రాయలసీమకన్నా సర్కార్ జిల్లాలు మూడురెట్లు ఎక్కువ తీసుకుంటున్నాయి. మళ్లీ వర్షపాతం కూడా అక్కడే ఎక్కువ వుంది. భూగర్భజలాలూ అక్కడే మెరుగ్గా ఉన్నాయి. ఇదంతా చాలక ఇప్పుడు గోదావరి నదిమీద పోలవరం డ్యాం కట్టి గోదావరి, కృష్ణ నదుల మధ్య ప్రాంతంలో ఇప్పటికింకా నదీజలాలు అందని నేలలకు కూడా (భూగర్భజలాలు, చెరువునీరు సమృద్ధిగానే అందుతున్నప్పటికీ) నదీజలాలు అందించాలని నిర్ణయించారు. అప్పుడయినా కృష్ణనీళ్లు కొంచెం వదులుకుంటారేమోనన్న ఆశతో రాయలసీమవాసులు కూడా పోలవరాన్ని ప్రోత్సహిస్తున్నారు. కానీ పోలవరం నిర్మిస్తే దేవీపట్నం, పోలవరం తాలూకాల దగ్గర మొదలుపెట్టి భద్రాచలం దాకా వందలాది కోయ, కొండరెడ్డి గూడేలు మునిగిపోతాయి. నోరులేని ఆ జీవులు వీధులపాలవుతారు. సంవత్సరంలో రెండు పంటలకూ, అదీ తరిసాగుకు సరిపడా నదీజలాలు ఫ్రీగా సరఫరా అయితేనే అది వ్యవసాయం అనే అసాధ్యమయిన అభిప్రాయానికి మన సర్కార్ జిల్లాల మధ్యప్రాంతవాసులు వచ్చినట్లు అనిపిస్తుంది. ఈ అభిప్రాయాన్ని వదులుకోవడం అవసరం. ఇదే కోరిక ప్రతి ఒక్కరిలోనూ ఉంటే ఇంకొక భగీరథుడు దిగిరావలసి ఉంటుంది.

అయితే ఇది పురాణం కాదు కాబట్టి, సాగునీటి గురించి గొంతెమ్మ కోరికలు తగ్గించుకొని వర్షపాతం, చెరువులు, భూగర్భజలాలు, నదీ జలాలు అన్నిటినీ లెక్కలోకి తీసుకొని నీరు అనే ప్రకృతి వనరును అందరూ సమంగా పంచుకోవడానికి సిద్ధపడాలి. అందుకోసం ఇప్పుడు నదీజలాలు ఎక్కువగా వాడుకుంటున్న వాళ్ళు దానిని తగ్గించుకోవడానికీ, అందుకోసం తమ పంటల విధానాన్ని మార్చుకోవడానికీ కూడా సిద్ధపడాలి.

అప్పుడే రాయలసీమకూ, దక్షిణ తెలంగాణకూ, ఉత్తర కర్ణాటకలోని బీజాపూర్ వంటి వెనుకబడిన జిల్లాలకూ సాగునీటి విషయంలో న్యాయం జరుగుతుంది. నిజానికి అన్నిరకాల నీటివనరులనూ లెక్కలోకి తీసుకొని సమంగా పంచుకుంటే మన రాష్ట్రంలో ప్రతి ఎకరం సాగు భూమికీ ఒక్క పంటకు నీరు ఇయ్యవచ్చునని అంచనా. నదీజలాలు పంచుకోవలసింది భాషా రాష్ట్రాల ప్రాతిపదికన కాదు. నీటి అవసరానికి భాషతో ఏమీ సంబంధం లేదు. ఇతర నీటివనరులు సమృద్ధిగా ఉన్న ప్రాంతాలు, అవి లేని ప్రాంతాలు అనే ప్రాతిపదికన పంచుకోవాలి. ఈసారి (అంటే క్రీ.శ. 2000 తరువాత) కృష్ణానదీ జలాలను పంచుకొనే రోజు వచ్చినప్పుడు ఈ హేతుబద్ధమైన ప్రాతిపదికన పంపకం జరగాలనీ, దానికోసం అవసరమైన పంటమార్పిడి చేసుకోవడానికి అందరూ

సిద్ధంగా ఉండాలనీ, నదీజలాల విషయంలో ఈ రోజు న్యాయాన్యాయాల గురించి మాట్లాడుతున్న వాళ్లంతా దానికి ఒప్పుకుంటారని ఆశిద్దాం. న్యాయాన్యాయాల గురించి మాట్లాడుతున్నారు కాబట్టి ఈ ఆశ. దీని కోసం కృష్ణా రివర్ వ్యాలీ అథారిటీ వంటి ఒక ఫెడరల్ వ్యవస్థను స్థాపించుకోగలిగితే - భారతదేశాన్ని ఒక ఫెడరల్ ప్రజాస్వామ్యంగా తీర్చిదిద్దాలని ప్రస్తుతం చాలామంది వ్యక్తం చేస్తున్న రాజకీయ ఆకాంక్షకు కూడా అది తోడ్పడుతుంది.

*(ఆల్మట్టిపై మొదటిసారి వివాదం రేగినప్పుడు 'వార్త' పత్రికలో దీనిపై సుదీర్ఘ చర్చ జరిగింది. అందులో భాగంగా రాసిన ఈ వాస్యమే బాలగోపాల్ జల వివాదాలపై రాసిన తొలి వ్యాసం.)*

వార్త దినపత్రిక
2 సెప్టెంబర్ 1996



# గండి గండికో నిర్లక్ష్యపు గాథ

**1**996 జూన్, అక్టోబర్ నెలల్లో చిత్తూరు, కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాలలో వందలాది చెరువుల కట్టలు తెంచి గ్రామాలను అల్లకల్లోలం చేసిన విచిత్రమైన వరదలను రాష్ట్రం మరిచిపోయి ఉండవచ్చును గానీ ఆ ప్రాంత ప్రజలు మరిచిపోలేదు.

వీటిని 'విచిత్రమైన వరదలు' అని ఎందుకంటున్నామంటే వీటివల్ల దెబ్బతిన్న ప్రాంతం మామూలుగా కరువు ప్రాంతం. అక్కడ పొంగడానికీ ఊర్లు ముంచడానికీ పెద్ద నదులేవీ లేవు. కోనసీమలాగ తుఫాను దెబ్బ తగలడానికి సముద్రం దగ్గరలో లేదు. అది ప్రధానంగా చెరువులపైన ఆధారపడి వ్యవసాయం చేసుకునే ప్రాంతం. ఏ సంవత్సరమైనా వర్షాలు చెరువుల నిండా కురిస్తే సంతృప్తి చెందే ప్రాంతం. గత సంవత్సరం ఆ చెరువులే తెగి బీభత్సం సృష్టించాయి. పుండు మీద కారంలాగ, మన రైతులకు నీళ్లియ్యకుండా మద్రాసుకు మంచి నీళ్లు తీసుకుపోవడానికి తయారయి కడప, నెల్లూరు రైతుల కడుపు మండించిన తెలుగు గంగ కాలవ గట్టు కూడా పలు చోట్ల తెగింది. అది కూడా పొలాలను ముంచింది. ఆ ప్రాంతం వాళ్లు నిరుటి వరదలను ఇప్పటికీ మరిచి పోకపోవడానికి చాలా కారణాలున్నాయి. వరదలలో కొట్టుకొనిపోయిన వారి కుటుంబాలు తాము పోగొట్టుకున్న ఆప్తులను అప్పుడే మరిచిపోలేరు. పంట పోగొట్టుకున్న రైతులు ఆర్థికంగా ఇప్పటికీ కోలుకోలేదు. కాబట్టి ఆ దెబ్బను అంత సులభంగా మరచిపోలేరు. ఇసుక మేట వేసిన వందలాది ఎకరాల భూమిని రైతులు (అతికొద్ది మినహాయింపులతో) ఇప్పటికింకా బాగు చేసుకోలేదు. ఆ భారం వాళ్లను మరచిపోనివ్వదు. కానీ అన్నిటికంటే ముఖ్యమైన కారణం, గండ్లుపడి బోసిపోయిన చెరువు కట్టలు ఆనాటి

బీభత్సానికి గుర్తుగా ఈనాటికీ మరమ్మతులకు నోచుకోకుండా అట్లాగే ఉండడం. ఆ దృశ్యాన్ని నిత్యం చూస్తూ, మళ్ళీ వర్షం వస్తే తమ గతి ఏమవుతుందో అని భయపడే రైతులు నిరుటి ఉపద్రవాన్ని ఎట్లా మరిచిపోగలరు?

ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితులు ఉండడాన్ని చూసి వాళ్లకు ఏడవాలో నవ్వాలో తెలియడం లేదు. అది మామూలుగా కరువు ప్రాంతం కాబట్టి వర్షాలు తగినంత కురిసి భూమి లోపలా పైనా నీళ్లు నిలిస్తేనే వాళ్ల బ్రతుకు గడుస్తుంది. కానీ కురిసిన నీటిని నిలపవలసిన చెరువులు కట్టలు తెగి బోసిపోయి ఉన్నాయి. కాబట్టి వాన బాగా కురిస్తే మళ్లీ వరదలు రావడం తథ్యం. ఆ ప్రమాదం నుండి వర్షాభావం వాళ్లను కాపాడినట్టే!

ఆ వరదలకు కారణం ఒక రకమైన నిర్లక్ష్యమైతే ఇప్పుడు ఇంకొక రకం నిర్లక్ష్యం తోడయి ప్రజల జీవితాలను దుర్భరం చేస్తున్నది. వర్షం పడకపోతే బ్రతకడానికి అవసరమైన నీళ్లు దొరకవు. వర్షం సగటు మోతాదులో పడినా చెరువులకు మన పాలకులు చేసిన తాత్కాలిక మరమ్మతులు తట్టుకోలేవు. మళ్లీ చేలూ, ఊర్లూ మునిగిపోతాయి. అంతా అయినాక మళ్లీ చెరువులలో నీళ్లుండవు. '1999 వరకు ఇదే పరిస్థితి ఉంటుంది'. (అంటే గత సంవత్సరం కట్టలు తెగిన చెరువులకు పూర్తి మరమ్మతులు జరగవు) అని ప్రకాశం జిల్లా రాళ్లపాడు రిజర్వాయర్ మరమ్మతులు పర్యవేక్షిస్తున్న ఇంజనీరొకరు ('నా పేరు రాయొద్దు' అంటూ) అడిగిన వాళ్లకు నిజాయితీగా జవాబు చెప్తున్నాడు.

వరదలకు కారణమైన నిర్లక్ష్యాలన్నిటినీ (నిర్లక్ష్యాలు అని బహువచనంలో అనక తప్పదు) ఒక సారి జ్ఞాపకం చేసుకుందాం. ఈ వరదలు వచ్చిన ప్రాంతం అమలాపురం లాగ సముద్ర తీరానికి దగ్గరలో లేదు– అకస్మాత్తుగా ఉప్పెన వస్తే సకాలంలో ప్రజలను హెచ్చరించడం తప్ప ప్రభుత్వం చేయగలిగింది ఏముంది అని అడగడానికి. నిజానికి ఈ వరదలకు కారణం ఉప్పెన వంటి హఠాత్ పరిణామం కాదు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం ఈ వరదలకు దారి తీసిన మాట వాస్తవమే కానీ అదే వరదలకు కారణం కాదు.

చిత్తూరు జిల్లా మదనపల్లి పట్టణంలో జూన్ నెలలో 27 మంది ప్రాణాలు తీసిన వరదల గురించి తరువాత చెప్పుకుందాం. అక్టోబర్ నెలలో పెద్దఎత్తున నష్టం చేకూర్చినది కడప, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు కలుసుకునే చోట ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం, ఆ వర్షపునీటి ప్రవాహాన్ని నిలపలేకపోయిన ప్రభుత్వ నీటి పారుదల వ్యవస్థల నిర్వహణ, ప్రకృతి వనరుల సంరక్షణలోని లోపం. వర్షం భారీగా కురిసిన ప్రాంతం కలసపాడు, పోరుమామిళ్ల (కడపజిల్లా), కొమురవోలు, పామూరు (ప్రకాశం

జిల్లా), ఉదయగిరి (నెల్లూరు జిల్లా) మండలాలు. ఇదంతా బీడు భూములు, రాళ్ల గుట్టలు, ఎండిపోయిన చిట్టడవులతో నిండిన ప్రాంతం. ఇటువంటి ప్రాంతంలో ఉన్న కొద్దిపాటి పచ్చదనం కోసం పశువులూ, మనుషులూ పోటీ పడతారు. ఎప్పటికప్పుడు హరిత రక్షణ చర్యలు చేపట్టకపోతే, ఈ అవసరాలు తీరకపోగా ఏ కొంచెం అతివృష్టి కురిసినా వరద ప్రవాహానికి ప్రకృతి వేయగల అడ్డుకట్ట కొరవడుతుంది. నెమ్మదిగా ప్రవహించి నేలలోకి ఇంకి భూగర్భ జలాశయంలో కలవవలసిన నీరు ఏ ఆటంకం లేకపోవటం వల్ల వేగంగా వరద అయి పారుతుంది. బీడయిపోయిన కొండ చరియల పైన, బీడు భూములలోను కురిసే వర్షం ప్రవాహమై మట్టినీ రాళ్లనూ మోసుకొని దిగువ ప్రాంతాలలోకి వేగంగా ప్రవహిస్తుంది. పొలాలలో ఇసుక మేట వేస్తుంది. చెరువులలో పూడిక పెరుగుతుంది. వేగానికి తట్టుకోలేక పోతే చెరువుకట్టలకు గండి పడుతుంది. పొలాలూ, ఊర్లూ మునుగుతాయి.

గత సంవత్సరం అక్టోబర్ నెలలో రెండు దఫాలు విపరీతంగా వర్షం కురిసిన ఆ అయిదు మండలాలు కలిసే ప్రాంతాన్ని పరిశీలిస్తే ఆ వర్షం అంత ప్రమాదకరమైన వరదగా ఎందుకు మారిందో అర్థం అవుతుంది. అక్కడ కొండలు ఎప్పుడో బోడి అయిపోయాయి. బీళ్లు పచ్చదనం కోల్పోయి గులకరాళ్ల బంజర్లయ్యాయి. ఆ ప్రాంతంలో అడవుల పెంపకం కోసం, పచ్చదనాన్ని కాపాడడం కోసం ప్రభుత్వం చేసింది గానీ ప్రజలను చేయమని ప్రోత్సహించింది గానీ శూన్యం. దీనికి ఒకే ఒక్క మినహాయింపు కడప జిల్లా కలసపాడు మండలం రాజుపాలెం గ్రామంలోని వన సంరక్షణ సమితి. అటవీశాఖ ఆ గ్రామ రైతులతో కలిసి ఆ ఊరి పక్కన వున్న కొండ చరియలపైన వృక్ష సంపదను పెంపొందించడానికి చేసిన ప్రయత్నం కొంత సత్ఫలితాన్ని ఇచ్చింది. ఆ ప్రాంతమంతా ఈ మాత్రం ప్రయత్నం చేసి ఉంటే వరద తాకిడి పావు వంతయినా తగ్గి ఉండేదేమో.

అదేమీ లేకపోవడం వల్ల ఆ వరదనీరు శరవేగంగా కడపజిల్లా బద్వేలు తాలూకా వైపు, ప్రకాశం జిల్లా కందుకూరు తాలూకా వైపు ప్రవహించింది. అడ్డమొచ్చిన చెరువు కట్టలన్నీ తెంచుకుంటూ అటువైపు (కడపజిల్లాలో) సగిలేరునూ, దానినుండి పెన్ననూ, ఆపైన నెల్లూరు జిల్లాలో కండలేరు, పంబలేరులనూ, ఇటువైపు (ప్రకాశం జిల్లాలో) మన్నేరునూ నింపింది. మామూలు సంవత్సరాలలో దిక్కుమాలిన ఇసుక తిన్నెలుగా కనిపించే ఈ వాగులన్నీ ఆ రాత్రి బ్రహ్మపుత్రలయ్యాయి. ఎవ్వరూ పేరు విని ఎరుగని మన్నేరు ఒక నెలలో రెండు సార్లు ఉలవపాడు దగ్గర మద్రాసు-కలకత్తా జాతీయ రహదారిని తెగగొట్టి రైలు మార్గాన్ని ఉయ్యాలగా మార్చి వేలాది ప్రయాణీకులను ఇక్కట్ల పాలు చేసి జాతీయ ఖ్యాతి గాంచింది. ఆ ప్రాంతమంతా వర్షం పడుతూనే వుంది కాబట్టి ఈ ప్రవాహానికి ఇతర ప్రవాహాలు కూడ తోడయ్యాయి.

అక్టోబర్ 1వ తేదీన కురిసిన వర్షాల ప్రభావానికి కలసపాడు మండలం రామాపురం వద్ద సగిలేరు వాగుపైన ఉన్న ఎగువ సగిలేరు ప్రాజెక్టు కట్ట తెగింది. సగిలేరులో ప్రవాహం పెరిగింది. అక్టోబర్ 18-19 రాత్రి వచ్చిన వరద వల్ల అదే ప్రాజెక్టు అలుగు (మత్తడి) తెగింది. ఆ వరద కూడ చుట్టు తిరిగి మళ్లీ సగిలేరులోకి ప్రవాహించింది. ఎగువ సగిలేరు ప్రాజెక్టు కాలవ పోరుమామిళ్ల ప్రాంతంలోని చెరువులను నింపుతుంది. దానిని పోరుమామిళ్ల సప్లై చానెల్ అంటారు. ఎప్పుడో పూడిపోయిన ఆ కాలవ కట్ట ఈ ప్రవాహాన్ని భరించలేక 11 చోట్ల తెగింది. కాలవ ద్వారా ఒక పద్ధతి ప్రకారం చెరువులలోకి పోవలసిన నీరు అడ్డదిడ్డంగా దమ్మనపల్లి దగ్గరున్న పోరుమామిళ్ల చెరువులోకి ప్రవహించి ఆ చెరువు కట్టను పునాది నుండి పెకలించి వేసింది. 3800 ఎకరాల ఆయకట్టు ఉన్న ఆ చెరువు ఖాళీ అయిపోయి నీళ్లన్నీ మళ్లీ సగిలేరులోనే కలిసాయి. దారిలో అడ్డమొచ్చిన నేలనూ, ఊళ్లనూ ముంచాయి. ఈ విధంగా పోటెత్తిన సగిలేరులో ప్రవాహ వేగం విపరీతమయిపోయి అదే రాత్రి దిగువ సగిలేరు ప్రాజెక్టు ఆనకట్ట తెగింది. సకాలంలో గేట్లు తెరిచినప్పటికీ ప్రవాహ వేగానికి కట్ట తట్టుకోలేక పోయింది. రాక్షస హస్తాలతో పెకిలించి వేసినట్టు పెద్ద గండి పడింది. 50 ఇళ్లు నేలమట్టమయ్యాయి. 11 వేల ఎకరాల ఆయకట్టు ఉన్న ఆ ప్రాజెక్టు రిజర్వాయర్ ఖాళీ అయిపోయింది. చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే పోరుమామిళ్ల చెరువుకయినా, దిగువ సగిలేరు ప్రాజెక్టుకయినా ప్రభుత్వం రిపేర్ పేరిట చేసింది చిన్న రింగ్ బండ్ వేయడం మాత్రమే. అది ఈసారి వరద వస్తే ఎంత మాత్రం ఆపలేదనేది ఒక విషయం. మామూలు వర్షపాతం వస్తే ఆ రింగ్ బండ్‌లు నిలపగల నీరు ఆ రిజర్వాయర్ల ఆయకట్టులో 10వ వంతుకు కూడ సరిపోదనేది బహుశా అంతకంటే ముఖ్యమైన విషయం.

కడప జిల్లాలో సగిలేరును పొంగించిన వరద తూర్పున మన్నేరు వాగులోకి ప్రవహించింది. మన్నేరుకు రెండు ఉపవాగులు ఉన్నాయి. ఒకటి ఉప్పువాగు, ఒకటి పిల్లాపేరు. అక్టోబర్ 18-19 రాత్రి వీటికి పైన ఉన్న అయిదారు చెరువులు కూడా తెగి ఈ ఏర్లలో ప్రవాహం చాలా పెరిగింది. ఉప్పువాగుపైన ఉన్న నక్కలగండి ప్రాజెక్టు కట్ట తెగగా, పిల్లాపేరు పైనున్న గండిపాలెం ప్రాజెక్టు అలుగు దాటి శరవేగంగా నీరు ప్రవహించింది. ఇవి రెండూ మన్నేరుపైన ఉన్న మోపాడు ప్రాజెక్టులోకి ప్రవహించాయి. అప్పటికి 15 రోజులుగా నిండి వున్న మోపాడు ప్రాజెక్టు ఈ నీటిని ఆపలేక పోయింది. మన్నేరు నీరే కాక అయిదారు చెరువుల నీరు కూడా కట్టలు తెంచుకొని మోపాడులోకి వచ్చింది. ఈ నీరంతా అలుగు మీదుగా పెద్ద ఎత్తున ప్రవహించింది. ఆఖరి నిమిషంలో ఇళ్లు విడిచి పెట్టి వెళ్లిపోవాలని ప్రయత్నించిన మోపాడు క్రిస్టియన్‌పాలెం వాళ్లు,

కొత్తపల్లి వాళ్లు వరదలో కొట్టుకుపోయారు. క్రిష్టియన్ పాలెంకు చెందిన దళితులు 117 మంది చనిపోయారు. మొత్తం 250 మంది చనిపోయారు.

మన్నేరు ప్రతాపం అక్కడితో ఆగిపోలేదు. పామూరు మండలంలోని మోపాడు నుండి కిందికి ప్రవహించి లింగసముద్రం మండలంలోని రాళ్లపాడు ప్రాజెక్టు ఆనకట్టను మూడు చోట్ల తెంపింది. 20 మీటర్ల ఎత్తున్న కట్టను బుల్‌డోజర్ కంటే బీభత్సంగా దున్ని వెళ్లిపోయింది. దిగువకు శరవేగంగా ప్రవహించి ఉలవపాడు దగ్గర జాతీయరహదారినీ, రైల్వేలైన్‌నూ ధ్వంసం చేసి వార్తలు సృష్టించింది.

ఇక్కడ కొంచెం ఆగి ఈ బీభత్సమంతా ఎందుకు జరిగిందని ఆలోచిద్దాం. చెరువులోకయినా, ప్రాజెక్టు రిజర్వాయర్‌లోకయినా వరదనీరు ప్రవహిస్తే కట్ట ఎందుకు తెగాలి? చెరువు పరిమాణం వరకు నీరు చెరువులోనే నిలువ ఉండాలి. ఆపైన వచ్చిన అదనపు నీరు బయటికి పోవడానికి చెరువు నిర్మాణంలోనే ఒక ఏర్పాటు ఉంటుంది. దానిని అలుగు, మత్తడి, కలుజు మొదలయిన పేర్లతో పిలుస్తారు. ఆ అలుగు మీదుగా ప్రవహించే వరదనీరు చుట్టు పక్కల ఉన్న పొలాలకూ, ఇళ్లకూ నష్టం కలిగించకుండ ప్రవహించడానికి ఒక ఓవర్ ఫ్లో చానెల్ ఉంటుంది. ఇది సాధారణంగా దిగువన ఇంకొక చెరువులోకి (లేకపోతే వాగులోకి) ప్రవహిస్తుంది. నిజానికి పూర్వ కాలంలో కట్టిన చెరువులన్నీ చాలా నేర్పుగా రూపొందించిన నీటిపారుదల వ్యవస్థలు. ఒకదానికొకటి 'లింక్' అయిన అయిదారు చెరువులు ఒక వ్యవస్థగా కలిసి వుంటాయి.

దీనిని ఎంత జాగ్రత్తగా కాపాడినా అతివేగంగా వరద వస్తే కట్టలు తెగవచ్చు, అలుగు దాటి ప్రవహించిన వరదనీరు ఊళ్లను ముంచవచ్చు. ఇదివరకు నూటికో కోటికో ఒకసారి ఇలా జరిగేది. కాని ఇప్పుడు చెరువుల నిర్వహణ పట్ల ప్రభుత్వం ఏ మాత్రం ఆసక్తి చూపించకపోవడం వల్ల ఏ కొంచెం అతివృష్టి వచ్చినా చాలా నష్టం జరుగుతున్నది.ప్రతీ సంవత్సరం చెరువులోకి కొత్తగా వచ్చి చేరే నీటితోపాటు మట్టి కూడా కొట్టుకొస్తుంది. ఇది చెరువు గర్భంలో పూడికగా పేరుకొని పోతుంది. దీనిని ఎప్పటికప్పుడు తీసేయకపోతే చెరువు 'కెపాసిటీ' తగ్గిపోతుంది. అంటే చెరువులో నిలవ ఉండగల నీటి పరిమాణం తగ్గిపోతుంది. అది తగ్గిపోయే కొద్దీ నీళ్లు నిలవక అలుగు పారడం, కట్టలకు గండి పడడం జరుగుతుంది. గత అక్టోబర్ 18-19 రాత్రి గండిపడిన చెరువులలో రాళ్లపాడు రిజర్వాయర్‌కు 20 అడుగుల పూడిక ఉందనీ, పోరుమామిళ్ల చెరువులో పూడిక 15 అడుగుల దాకా ఉందనీ స్థానికులు చెప్తున్నారు. నిజానికి కొన్ని దశాబ్దాలుగా ఏ చెరువుకూ ఎక్కడా పూడిక తీయడమే లేదు.

చెరువు కట్టకు ఒకసారి గండి పడితే సరిగ్గా మరమ్మతు చేయకపోవడం వల్ల ఏ కొంచెం వరద వచ్చినా అక్కడే గండి పడుతుంది. రాళ్లపాడు రిజర్వాయర్‌కు 1994లో

ఒకసారి గండి పడింది. దానికి రిపేర్ జరిపించామనిపించారు. కానీ గత సంవత్సరం సరిగ్గా అక్కడే రిజర్వాయర్ కట్ట తెగి ఆ నీళ్లే ఉలవపాడు దగ్గర హైవేనీ రైల్వేలైన్‌నూ ధ్వంసం చేశాయి. 'అది ప్రకృతి వైపరీత్యం' అనుకొని ఓపికగా హైవేపైన గంటలకొద్దీ నిలిచిపోయిన ప్రయాణీకులకు ఈ సంగతి తెలిస్తే ప్రభుత్వంపైన ఎంత కోపం వచ్చేదో!

అలుగుపైన ప్రవహించే వరదనీటిని దిగువకు తీసుకు పోవలసిన ఓవర్ ఫ్లో చానెల్ తరచుగా దురాక్రమణకు గురి అవుతుంది. ఇళ్లు, పొలాలు వెలుస్తాయి. తెలిసి కూడా ఈ దురాక్రమణను అధికారులు అడ్డుకోరు. ఒక్కొక్కసారి పట్టాలు కూడా ఇస్తారు. దాని వల్ల వరదనీరు అడ్డదిడ్డంగా ప్రవహించి చాలా నష్టం చేస్తుంది.

నిజం చెప్పాలంటే చెరువుల నిర్వహణ అసమర్థంగా జరుగుతుందనడం కూడా తప్పే. అసలు చెరువుల నిర్వహణ అనేదే లేదనడం సబబుగా ఉంటుంది. మన పాలకులు అసలే పట్టించుకోని విషయాలలో చెరువుల వ్యవస్థ ఒకటి అంటే అతిశయోక్తి కాదు. చిన్న చెరువుల నిర్వహణ (ఆయకట్టు 100 ఎకరాల లోపు ఉన్నవి) పంచాయితీరాజ్ శాఖ బాధ్యత కాగా, పెద్దవాటి నిర్వహణ నీటిపారుదల శాఖ బాధ్యత. దీనికి ప్రభుత్వం 1 ఎకరం ఆయకట్టుకు 40 రూపాయలు (సంవత్సరానికి) ఇస్తుంది. చెరువుల నిర్వహణ కోసం నియమితులయిన వర్క్ చార్జ్‌డ్ సిబ్బంది జీతాలు దీనిలోనే పెట్టుకోవాలి. ఇతర ఖర్చులు ఉండనే ఉంటాయి. అందువల్ల పూడికలు తీయడానికి గానీ చెరువు కట్టల మరమ్మతుకు గానీ పైసలు వుండవు. కట్టలు తెగినప్పుడు ప్రభుత్వం ప్రత్యేక కేటాయింపుల రూపకంగా మరమ్మతుకు అయ్యే మొత్తం సమకూరుస్తుంది. దాని బదులు రొటీన్‌గా చెరువుల వ్యవస్థ సక్రమంగా నిర్వహించి కాపాడుకుంటే ఆ అవసరమే రాదు. ఈ విధాన రాహిత్యాన్ని అర్థం చేసుకుంటే తప్ప 1996 అక్టోబర్ నాటి వరదలను అర్థం చేసుకోలేం. మన రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలు సాగునీటి కోసం బావులపైన, చెరువులపైన ఆధారపడతాయి. బావుల బాగోగులు రైతు స్వంత బాధ్యత. పెట్టుబడి పెట్టుకోగలిగితే పెట్టుకొని వాటిని కాపాడుకోవాలి. చెరువులు ప్రభుత్వం బాధ్యతే కానీ వాటి నిర్వహణ శూన్యం. ఇక ప్రాజెక్టు కాలవల మాటకొస్తే కట్టేంత వరకే ఆసక్తి తప్ప ఆ తరువాత రిజర్వాయర్‌లోనూ, కాలవలలోనూ పూడికలు తీయడం, ఇతర మరమ్మతులు చేయడం రొటీన్‌గా జరగడం లేదు. బాగా పూడిపోయిన తరువాత ఏ ప్రపంచ బ్యాంకు దగ్గరో అప్పుతెచ్చి ఒక్కసారి రిపేరు చేస్తే (ఈ మధ్య కోనసీమలో చేసినట్టు) ఆ రైతులు అదృష్టవంతులనుకోవాలి. మరి నీటిపారుదల వ్యవస్థ నిర్వహణ గురించి ప్రభుత్వం ఏం చేస్తున్నట్టు?

తెలుగుగంగ కాలవ గట్లు తెగడం కూడ గత అక్టోబర్‌లో జరిగిన విధ్వంసానికి ఒక కారణం. ఈ విషయంలో మామూలు నిర్లక్ష్యానికి రాజకీయం కూడ తోడయింది. మద్రాసుకు మంచి నీరందించిన ఘనత త్వరగా దక్కాలని తవ్వీ తవ్వని కాలవల గుండా గత సెప్టెంబర్‌లో మద్రాసుకు నీటి సరఫరా ప్రారంభించారు. అక్టోబర్ నెలలో వరదలు వచ్చాయి. ప్రభుత్వం తొందరపాటు బయటపడింది. దానికి మూల్యం చెల్లించింది తొందరపాటుకు బాధ్యులయిన రాజకీయ నాయకులు కాదు. నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాల రైతులు.

శ్రీశైలం రిజర్వాయర్ నుండి బయలుదేరే తెలుగు గంగ కాలవ కడప జిల్లాలో పెన్నా నదిలో కలిసి సోమశిల చేరుకుంటుంది. సోమశిల రిజర్వాయర్ నుండి నెల్లూరు జిల్లాలోనే వున్న కండలేరు రిజర్వాయర్‌లోకి పోతుంది. అక్కడి నుండి మద్రాసుకు పోతుంది. దీనికి సంబంధించిన కాలవల నిర్మాణం, కాలవలపైన అవసరమైన బ్రిడ్జిల నిర్మాణం పూర్తిగా చేపట్టవలసి వుండింది. సోమశిల రిజర్వాయర్‌లో తెలుగుగంగ నీళ్లు కూడా (తాత్కాలికంగానయినా సరే) నిలువ ఉండాలి కాబట్టి సోమశిల కింద ముంపు పెరుగుతుంది. దీనికి సంబంధించిన భూసేకరణ చేయవలసి ఉండింది. ఇదేదీ చేయకుండ గత సెప్టెంబర్ నెలలో తెలుగుగంగ ద్వారా మద్రాసుకు నీళ్లు పంపించడం మొదలుపెట్టారు. అక్టోబర్‌లో కుంభవృష్టి కురిసేసరికి లోపాలన్నీ బయటపడ్డాయి. దానికి రైతులు కూలిన ఇళ్లతోనూ, మునిగిన చేలతోనూ, ఇసుక మేటవేసిన పొలాలతోనూ మూల్యం చెల్లించారు.

అక్టోబర్ 18-19 రాత్రి సగిలేరులో వచ్చిన వరద గురించి పైన చెప్పాము. సగిలేరు పెన్నకు ఉపనది. ఈ వరద పోయి పెన్నలో కలిసింది. అసలే తెలుగుగంగ కోసం ఎక్కువ నీళ్లు నింపుకున్న సోమశిల రిజర్వాయర్‌లో మరింత నీళ్లు చేరాయి. సోమశిల ముంపు పెరిగి అప్పటికింకా ముంపు గ్రామాలుగా గుర్తించనివి కూడ మునిగాయి. సోమశిల రిజర్వాయర్ పూర్తిస్థాయి 330 అడుగులు. అక్కడిదాకా నీళ్లు నిలిస్తే ముంపు ఎంత వుంటుందో అంతమేరకు భూసేకరణ చేయవలసి వుండింది. కానీ 315 అడుగులవరకే చేసారు. అందులోనూ అందరికీ నష్టపరిహారం ఇవ్వలేదు. 290 అడుగుల వరకు మునిగే గ్రామాలు మాత్రమే ఖాళీ అయ్యాయి. మిగిలిన వాళ్లను ఖాళీ చేయించలేదు. అంతలో తెలుగుగంగను తీసుకొచ్చి పెన్నలో కలిపారు. ఆపైన సగిలేరు వరద వచ్చింది. దీనితో అకస్మాత్తుగా ముంపు పెరిగి కడప జిల్లా అట్లూరు మండలంలో చాలా భూమి మునిగింది.

ఇదికాక, తెలుగుగంగ కాలవ నిర్మాణం సరిగ్గా జరగకపోవడం వల్ల కండలేరు రిజర్వాయర్‌కు దిగువన (నెల్లూరు, చిత్తూరు జిల్లాలలో) 7 చోట్ల కాలవగట్టుకు

గండిపడింది. రెండుచోట్ల అధికారులు, రైతులు నష్టాన్ని నివారించడానికి తామే తెగగొట్టారు. మిగిలిన చోట్ల, అదే తెగింది. ఉదాహరణకు నెల్లూరు జిల్లా వెంకటగిరి మండలంలో జంగాలపల్లి అనే గ్రామం వుంది. ఈ గ్రామం దగ్గర తెలుగుగంగ కాలవకు బ్రిడ్జి కట్టవలసి వుండింది. కానీ తొందరగా మద్రాసుకు నీళ్లు వదలాలన్న ఆరాటంలో బ్రిడ్జి నిర్మాణం సరిగ్గా జరిగే దాకా ఆగకుండ కాలవ ప్రవాహం కోసం సిమెంటు తూములు అమర్చి వాటిమీద మట్టిపోసి తాత్కాలికమైన బ్రిడ్జి తయారుచేసి మద్రాసుకు నీళ్లు వదిలారు. అయితే అక్టోబర్ 18-19 రాత్రి ఒక్కసారిగా కాలవలో ప్రవాహం పెరిగేసరికి ఆ తూములు సరిపోలేదు. నీళ్లు వెల్లువగా పైకి వచ్చేసాయి. జంగాలపల్లి మునిగిపోయింది. రైతులు నీటిపారుదల శాఖ ఇంజనీరును పిలిపించి ఆయన సలహా మేరకు బ్రిడ్జికి పక్కనున్న కాలవకట్ట తెంపి ఊరిని కాపాడారు. అయినప్పటికీ ఊరిలో నీరు నిలవడం వల్ల మగ్గాలపైన పనిచేయడం అసాధ్యమయింది. నిజానికి వరద రాకపోయినా పక్కనున్న కాలవ వల్ల జంగాలపల్లిలో తరచుగా మగ్గం గుంటలలోకి నీళ్లు వస్తుంటాయనీ, దానిని కండలేరు ముంపు గ్రామంగా గుర్తించి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలనీ గ్రామస్థులు కోరగా అట్లాగే స్వాధీనం చేసుకుంటామని అధికారులు చాలాసార్లు ప్రకటించారు. కానీ అదేమీ జరగక ముందే వరద వచ్చింది.

తెలుగుగంగ కాలవకు తక్కిన గండ్లన్నీ చిత్తూరు జిల్లాలో పడ్డాయి. తొట్టంబేడు మండలం రాంభట్లపల్లి గ్రామం దగ్గర ఒక చెరువు వుంది. ఆ చెరువు అలుగు మీదుగా వరద నీరు పోవలసిన ఓవర్ ఫ్లో ఛానెల్ మార్గానికి అడ్డంగా తెలుగుగంగ కాలవ తవ్వారు. అందువల్ల ఈ వరద నీటి మార్గం కోసం కాలవపైన బ్రిడ్జి కట్టారు. దాని ఎలైన్‌మెంట్ సరిగ్గా లేదని రైతుల ఫిర్యాదు. ఏమయితేనేం అక్టోబర్ 18-19 రాత్రి రాంభట్లపల్లికి ఎగువన వున్న 14 చెరువుల నుండి వరద వచ్చి రాంభట్లపల్లి చెరువు అలుగు మీదుగా ప్రవహించింది. తెలుగుగంగ కాలవ దాటడానికి దానికోసం ఏర్పాటు చేసిన బ్రిడ్జి సరిపోక ఆ వరద కాలువలో పడి కాలవ గట్టుకు మూడు గండ్లు వేసింది. పక్కనే వున్న కొన్నలి అనే గ్రామం దగ్గర కూడ తెలుగుగంగ కాలవకు గండి పడింది. 1993లో (అంటే కాలవ వాడకం ప్రారంభం కాకముందే) అదే చోట గండిపడిందనీ, దానిని రిపేరు చేసినప్పుడు ఒక్కొక్క లెవెల్‌లో రోలర్ వాడకుండ ఒకేసారి మట్టిపోసి రోలర్‌తో తొక్కారనీ, అందువల్ల మళ్లీ వరద వచ్చినప్పుడు అదే చోట కట్ట తెగిందని కొన్నలి రైతులు అంటున్నారు. రాంభట్లపల్లి సమీపంలోని కాలవలో కూడ 1993లో చెరువుల వరద నీటివల్ల ఇసుక మేట వేసిందనీ, కాలవ గర్భంలో పేరుకొని పోయిన ఈ ఇసుకను  తొలగించక పోవడం వల్ల రాంభట్లపల్లి దగ్గర తెలుగుగంగ కాలవ నీళ్లు ఒక్కొక్కసారి వెనక్కి ప్రవహిస్తాయనీ, అక్టోబర్  18-19 రాత్రి అది జరగడం

వల్లనే ఎగువన వున్న (నెల్లూరు జిల్లా) జంగాలపల్లి దగ్గర ముంపు వచ్చిందనీ స్థానికులు అంటారు. ఇది నిజమేనని నెల్లూరులోని తెలుగుగంగ ఆఫీసులో కూర్చున్న ఒక ఇంజనీరు నిజాయితీగా ఒప్పేసుకుంటాడు. కానీ వాళ్ల నిర్లక్ష్యానికీ, చేతకానితనానికీ రాంభట్లపల్లి రైతులూ, జంగాలపల్లి నేత పనివారూ మూల్యం చెల్లించవలసి వచ్చింది.

చిత్తూరు జిల్లా మదనపల్లి పట్టణంలో గత సంవత్సరం జూన్ నెలలో జరిగిన వరద బీభత్సంలో కూడ ప్రకృతి వైపరీత్యం ఎంత ఉందో మన పాలకుల నిర్వాకం అంత వుంది. మదనపల్లికి ఎగువన కర్ణాటక సరిహద్దు దగ్గర భారీగా వర్షాలు కురిసాయి. దాని ఫలితంగా మొత్తం 9 చెరువుల నీళ్లు (కొన్ని అలుగులు పొంగి, కొన్నిటి కట్ట తెగి) మదనపల్లి మీదికి వరదగా వచ్చాయి. బాహుదానది మదనపల్లి గుండా ప్రవహిస్తుంది. దానిలో కలిసే రెండు వాగులు (బుగ్గ కాలవ, ముగ్గురాళ్ల వంక) కూడ మదనపల్లి గుండా ప్రవహిస్తాయి. ముగ్గురాళ్ల వంక మదనపల్లి పట్టణం మధ్యనే బాహుదానదిలో కలుస్తుంది. పొంగిన 9 చెరువుల నీళ్లు ఈ వాగుల లోనికీ, నదిలోనికీ ప్రవహించి జూన్ 14 సాయంత్రం మదనపల్లి జలమయం అయింది. ఈ వాగులు వుండవలసినంత వెడల్పుగా వుంటే వరదనీటిలో చాలా భాగం ప్రవాహమై వెళ్లిపోయేదే. మదనపల్లికి ప్రాణగండం తప్పేదే. కానీ దురాక్రమణల వల్ల ఈ వాగులు పిల్ల కాలవలయిపోవడం వల్ల నీరంతా ఊరిపాలయింది. 27 ప్రాణాలు పోయాయి.

బాహుదానది 300 అడుగుల వెడల్పు వుండవలసింది కొన్నిచోట్ల 50 అడుగులే మిగిలింది. ముగ్గురాళ్ల వంక మేదరి బజారులో 120 అడుగుల వెడల్పు వుండవలసింది ఇప్పుడు కొన్నికోట్ల 10 లేక 15 అడుగులు మాత్రమే వుంది. ఇక్కడే వరద ఎక్కువ వచ్చి 27 ప్రాణాలు పోయాయి. ఈ వంకను ఒకపక్క మేదరివాళ్లు ఆక్రమించుకొని ఇళ్లు వేసుకుంటే ఇంకొక పక్క మునిసిపాలిటీయే ఆక్రమించుకొని షాపులు కట్టి అద్దెకు ఇచ్చింది. మేదరి వాళ్లు 40 ఏళ్లుగా వుంటున్నారు. వారి ఆక్రమణకు మునిసిపాలిటీ 'నో అబ్జెక్షన్' సర్టిఫికెట్ ఇచ్చింది. బుగ్గ కాలవను కూడ ఇదే విధంగా మధ్యతరగతి వాళ్ళు - కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ కులస్తులు- ఆక్రమించుకొని ఇళ్లు కట్టుకున్నారు. వరద వచ్చి జనం చచ్చిపోయిన తరువాత కూడా వీళ్ల ఆక్రమణను తొలగించే ప్రయత్నమేమీ మునిసిపాలిటీ చేయడం లేదు. తాను ముగ్గురాళ్ల వంకను ఆక్రమించుకొని కట్టిన షాపింగ్ కాంప్లెక్స్‌ను కూడా మునిసిపాలిటి తొలగించబోవడం లేదు. కానీ మేదరివాళ్లను మాత్రం బుట్టలు సర్దుకొని ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపొమ్మంటున్నారు. అప్పుడే మేదరి వీధికి కరెంటు కూడా తీసేసారు.

'ప్రకృతి బీభత్సం'లో పాలకుల బీభత్సం చాలా వుందని ఈ పాటికి అర్థం అయ్యే వుండాలి. ఈ బీభత్సం వల్ల పైన పేర్కొన్న జిల్లాలలో వేలాది ఎకరాలలో పంట నాశనం అయింది. వేల సంఖ్యలో ఇళ్లు కూలాయి. వందల ఎకరాల పొలంలో ఇసుక మేట వేసింది. దీనికి ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం అతి స్వల్పం. పూర్తిగా కూలిపోయిన ఇంటికి 1000 రూపాయలు, దెబ్బతిన్న ఇంటికి 500 రూపాయలు ఇచ్చారు. పంట నాశనమైన భూమికి ఎకరానికి 250 రూపాయల దాకా ఇచ్చారు. దీనిని రైతులు భిక్షగా భావిస్తే వాళ్ళను తప్పు పట్టనవసరం లేదు. అన్నిటికంటే పెద్ద నష్టం భూములలో ఇసుక మేట వేయడం వల్ల జరిగింది. ఇసుక మేటను తొలగించి ఆ భూమిని సాగు యోగ్యం చేసుకోవడానికి ఒక ఎకరానికి 10 వేల నుండి 20 వేలు ఖర్చవుతుందని అంచనా. దీనికి ప్రభుత్వం చేస్తున్న సహాయం శూన్యం. తెలుగుగంగ కట్టకు గండి పడడం వల్ల ఇసుక మేట వేసిన భూములకు మాత్రమే తెలుగుగంగ ప్రాజెక్టు ఖాతా నుండి కొంత మొత్తం ఇచ్చారు. మిగిలిన వాటికి ఏమీ ఇవ్వలేదు. వాటిని రైతులు బాగుచేసుకోలేకపోతే అవి బంజర్లుగా మిగిలిపోతాయి. ఇదంతా ఒకెత్తయితే గండిపడిన వందలాది చెరువులకు ఇప్పటికీ శాశ్వత మరమ్మతులు చేపట్టకపోవడం ఒకెత్తు. కొన్ని చెరువులు తెగిన కట్టలతో పురాతన శిథిలాలలాగ అట్లాగే వున్నాయి. మరమ్మతులు చేపట్టిన వాటికి తాత్కాలికమైన రింగ్‌బండ్‌లు మాత్రమే వేసారు. వీటి ఎత్తు చాలా తక్కువ. అవి నిలపగల నీరు తక్కువ. మామూలు ఆయకట్టులో కొద్ది భాగానికి మాత్రమే అది సరిపోతుంది. అతివృష్టి మరొకసారి వచ్చిందంటే ఈ రింగ్‌బండ్‌లను దాటి నీరు మళ్లీ ఊళ్ల లోనికీ, పొలాల లోనికీ వరద అయి ప్రవహిస్తుంది.రాబోయే రెండు సంవత్సరాల దాకా ఇదే పరిస్థితి అని నీటిపారుదల శాఖ ఇంజనీర్లే అంటుంటే ఇంక రైతులు ఎవరికి మొరపెట్టుకోవాలి?

అన్నట్టు చంద్రబాబు కంప్యూటర్లో చెరువుల సమాచారం వుందా? ఎన్ని చెరువులు, ఎంత ఆయకట్టు, ఎన్నిచోట్ల కట్టలు తెగాయి, ఎన్ని ఎకరాల పంట కొట్టుకుపోయింది, ఎన్ని ఇళ్లు ధ్వంసం అయ్యాయి, ఎన్ని ఎకరాలు ఇసుక మేటవేసాయి, ఎందరు చనిపోయారు, తలసరి ఎన్ని రూపాయల నష్టపరిహారం తమ ప్రభుత్వం ఇచ్చింది? ఈ సమాచారం వుందా? లేకపోతే ఎక్కించుకుంటే బాగుంటుంది. ఎక్కించుకొని వారానికొక్క సారయినా చూసుకుంటే తన బాధ్యత జ్ఞాపకం వుంటుందేమో.

స్వేచ్ఛ మాసపత్రిక
మే - జూన్ 1997



# విజన్ 'చూపు'లో వివక్ష

ప్రాంతీయ అసమానతలు తీవ్రస్థాయిలో ఉన్నాయని రాజ్యాంగమే గుర్తించిన మూడు రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి (మిగిలిన రెండు మహారాష్ట్ర, గుజరాత్). ఆ అసమానతలను కొంత మేరకయినా తగ్గించడానికి ఆర్టికల్ 371–డి లో పార్లమెంట్ కొన్ని ఆదేశాలను చేర్చింది. అవి ప్రధానంగా విద్యా ఉద్యోగ అవకాశాలలో మూడు ప్రాంతాల మధ్య ఉన్న అసమానతలను తొలగించడానికి – ఇంకా నేరుగా చెప్పాలంటే కోస్తా జిల్లాలవాళ్ళే విద్యా, ఉద్యోగ రంగాలను పూర్తిగా ఆక్రమించుకోకుండా చూడడానికి– ఉద్దేశించిన ఆదేశాలు.

అవి సక్రమంగా అమలు కావడం లేదన్నది ఒక విషయం కాగా, ప్రాంతీయ అసమానతలు, వివక్ష కేవలం విద్యా ఉద్యోగ రంగాలకే పరిమితం కాలేదన్నది మరింత ముఖ్యమైన విషయం. ఆర్టికల్ 371–డి స్ఫూర్తిని కాపాడుకోవడం ఎంత ముఖ్యమో అందులో ప్రస్తావనకు నోచుకోని ఇతర రూపాల వివక్షను ఎదుర్కొనే పాలనా విధానాలను సాధించుకోవడం కూడా అంతే ముఖ్యం. భాషా సంస్కృతుల నుండి సాగునీటి వరకు అన్ని రంగాలలోనూ వివక్ష, చిన్నచూపు, అసమాన ప్రతిపత్తి కనిపిస్తాయి.

మరొక 20 సంవత్సరాల లోగా మనకు స్వర్ణాంధ్రప్రదేశ్ అందిచ్చే వ్యూహం రచించానని చెబుతున్న ముఖ్యమంత్రి ఈ వివక్షనూ అసమానతలనూ అంతం చేయడానికి ఆ వ్యూహంలో ఏమి చెప్పారో తెలుసుకోవాలన్న కుతూహలం ఉండడం సహజం. స్వర్ణాంధ్రప్రదేశ్‌లో అన్ని రకాల అసమానతలూ పోతాయని 'విజన్ – 2020' పదేపదే అంటుంది కాబట్టి, ప్రాంతీయ అసమానతలు పోగొట్టడానికి అందులో ఏ ఆలోచనలు పొందుపరచబడ్డాయో చూడాలనుకోవడం సహజం.

తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల ఉద్యమ ఆకాంక్షలు సాగునీటికి చాలా ప్రాముఖ్యం ఇచ్చాయి. సాగునీటితో అన్ని సమస్యలూ పోవు గానీ తీవ్ర దారిద్ర్యాన్ని తగ్గించవచ్చు. సాగునీటి ప్రాతిపదికన జరిగే అభివృద్ధికి కొంత విస్తృత ప్రాతిపదిక ఉంటుంది. కొద్దిమందికి ఎక్కువ ప్రయోజనం కల్పించడమే కాక ఎక్కువ మందికి కొంత ప్రయోజనం కూడా కల్పిస్తుంది. దానివల్ల ఎక్కువ మంది చేతిలో కొంత మిగులు ఉంటుంది. దానితో ఆ వర్గాలలోని మలితరం కొంతయినా చదువుకొని, సాంకేతికంగా పురోగమించిన జీవిత రంగాలలోకి ప్రవేశించగలదు. లేదా అది వర్తక, పారిశ్రామిక పెట్టుబడిగా మారగలదు.

కోస్తాంధ్ర జిల్లాల చరిత్ర ఈ వాస్తవాన్ని కళ్ళకు కట్టినట్టు చూపిస్తుంది. అయితే సాగునీరంటే నదీజలాలే కానవసరం లేదు. చెరువులు, బావులు కూడా సాగునీటి సాధనాలే. చెరువుల నిర్మాణానికీ, మరమ్మత్తుకూ, నిర్వహణకూ హేతుబద్ధమైన విధానం ప్రభుత్వం దగ్గర ఉండాలి. ఇప్పటిదాకా అటువంటిది ఏమీ లేకపోవడం తెలంగాణ రాయలసీమలకు చాలా నష్టం కలిగించింది. ఎప్పుడో కాకతీయులూ కుతుబ్‌షాహీలూ విజయనగర రాజులూ అసఫ్‌జాహీలూ తవ్వించిన చెరువులే తప్ప కొత్తవేవీ లేకపోగా ఆ చెరువుల నిర్వహణ సహితం తీవ్రంగా నిర్లక్ష్యం చేయబడిన విషయాలలో ఒకటి.

స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనలో భాగంగానయినా చెరువు నీటివనరుల సంరక్షణ గురించి చంద్రబాబు ప్రభుత్వం ఏమైనా చెబుతుందేమోనని చూసినవారికి 'విజన్' నిరాశే కలిగిస్తుంది. కోట్ల పెట్టుబడి దిగుమతి చేసుకొని సాధించే కార్పొరేట్ అభివృద్ధి మీదే 'విజన్' దృష్టి అంతా.

చెరువుల తర్వాత బావుల కింద వ్యవసాయం తెలంగాణకూ రాయలసీమకూ అతి ముఖ్యం. ఇందులో ప్రభుత్వం చేసేది ఏమీ లేదు – కరెంటు సరఫరా చేయడం తప్ప. ఇప్పటిదాకా కరెంటు సబ్సిడీ ఉండబట్టి బావులకింద వ్యవసాయం ఈ రెండు ప్రాంతాలలోనూ బాగానే విస్తరించింది. గ్రామీణ జీవితం రూపురేఖలను కొంత మేరకది మార్చగలిగింది. కానీ ఇది ఎక్కువ రోజులు నిలిచేటట్టు లేదని 'విజన్' వైఖరి చూసినా, విద్యుత్ బోర్డు పునర్వ్యవస్థీకరణ చూసినా తెలుస్తుంది. అభివృద్ధికి అవసరమైన రోడ్లు, రైల్వేలైన్లు, ఓడరేవులు, కరెంటు మొదలయిన నిర్మాణపరమైన వ్యవస్థలను పెంపొందించడం మాత్రమే ప్రభుత్వం బాధ్యత అనీ, దాని కోసం పెద్దఎత్తున పెట్టుబడులు ఆహ్వానించాలనీ 'విజన్' దృక్పథం ఎంతగా చెబుతుందో, ఈ నిర్మాణాలకయ్యే ఖర్చు, నిర్వహణ వ్యయం వాడకందారుల ముక్కుపిండి వసూలు చేయాలని కూడా అంతే గట్టిగా చెబుతుంది. విద్యుచ్ఛక్తిని రైతులందరికీ శాశ్వతంగా

ప్రభుత్వం చవగ్గా సరఫరా చేయాలని నేననడం లేదు. అందరికీ చేయనక్కరలేదు గానీ సాగునీటి విషయంలో తీవ్రమైన లేమి అనుభవిస్తున్న ప్రాంతాలలోని సామాన్య రైతాంగానికి ఇవ్వడం అవసరం. సమంజసం కూడా. దీనికి కూడా తావులేకుండా చేసే 'విజన్' వైఖరి తెలంగాణ, రాయలసీమలకు చాలా అన్యాయం చేస్తుంది. ఈ ప్రాంతాల అభివృద్ధిని 20 ఏళ్లు వెనక్కి తీసుకుపోతుంది. వీరికి సబ్సిడీ ఇవ్వడం కోసం అభివృద్ధి చెందిన ప్రాంతాల రైతుల నుంచి (ఇక్కడి భూస్వాముల నుంచి కూడా) పూర్తి కరెంటు చార్జి వసూలుచేసినా అభ్యంతరం చెప్పనవసరం లేదు. (కాల్దారి రైతాంగ పోరాటం పేరిట గోదావరి డెల్టా రైతులకు సైతం కరెంటు సబ్సిడీ కొనసాగించాలని వాదించిన వారికి ఇది నచ్చకపోవచ్చుగాక. ఆ వైఖరి మొత్తంగానే సబ్సిడీల ఎత్తివేతకు మార్గం సుగమం చేస్తుంది.)

నిజానికి సాగునీటి విషయంలో దేశంలో అతికొద్ది రాష్ట్రాలకున్న సంపద మన రాష్ట్రానికి ఉంది. సాగునీటి వనరులను సక్రమంగా, సమదృష్టితో వాడుకుంటే ప్రతి ఒక్క ఎకరం సాగు భూమికి ఒక పంటకు సాగునీరు అందించవచ్చునని మన రాష్ట్రం గురించి అంచనా. కానీ ఇన్నేళ్ళ అభివృద్ధి ఇచ్చిందేమిటంటే కొన్ని ప్రాంతాలకు రెండు, మూడు పంటలకు నీళ్ళు, కొన్ని ప్రాంతాలకు ఒట్టి వర్షం నీళ్ళు! చెరువుల నిర్వహణ పట్ల ఇప్పటికీ ఏ మాత్రం పట్టింపు చూపించని ప్రభుత్వ భవిష్యదర్శిని వైఖరి, బావినీళ్ళ వాడకానికి అత్యవసరమైన కరెంటు సబ్సిడీ పట్ల ఆ దర్శిని ప్రదర్శించే వ్యతిరేక వైఖరి ఈ అసమానతను తీవ్రంగా పెంచుతాయే తప్ప తగ్గించవు.

పోనీ నదీజలాల వాడకం విషయంలో ఏమైనా సమదృష్టి పెరిగిందని 'విజన్' చూపిస్తుందా? ఇప్పటికే ఈ విషయంలో జరిగిన అన్యాయం గురించి కొత్తగా చెప్పనవసరం లేదు. గోదావరిలో కావలసినన్ని నీళ్ళున్నా మన పాలకులు దానిని సాగునీటికోసం వాడడంలో పెద్దగా ఆసక్తి చూపలేదు. దీనివల్ల ఉత్తర తెలంగాణ జిల్లాలు తీవ్రంగా నష్టపోయాయి. కృష్ణానదిలో అవసరం కంటే బాగా తక్కువ ఉన్న నీళ్ళను వాడే విషయంలోనూ మన రాష్ట్రంలో చాలా అన్యాయం జరిగింది. వర్షపాతం సాపేక్షంగా సమృద్ధిగా ఉన్న ప్రాంతాలకే కృష్ణానది నీళ్ళు మొదట లభించాయి. సరే, అది బ్రిటిష్ హయాంలోననుకుందాం. కానీ తెలుగువాళ్ళందరి కోసం విశాలాంధ్ర నినాదంతో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత కృష్ణానదిపైన నిర్మించిన మొదటి ప్రాజెక్టు కూడా ప్రధానంగా ఆ ప్రాంతానికే మళ్ళీ నీళ్ళిచ్చింది. రాయలసీమ, దక్షిణ తెలంగాణ ప్రాంతాలు (కృష్ణానది మీద ఆధారపడక తప్పని ప్రాంతాలు) నీళ్ళడిగేసరికి ఆ నదిలో మిగులుజలాలే తప్ప నికర జలాలు లేవన్నారు.

నదీజలాల ప్రాజెక్టులలో ఇప్పటికే కేంద్రం అనుమతి పొందిన వాటి జాబితా, అనుమతి కోసం ప్రయత్నం చేస్తున్న వాటి జాబితా 'విజన్ 2020'లో ఇచ్చారు. రాయలసీమ వాసులు గొంతెండిపోయేలాగా ఆందోళన చేస్తున్న హంద్రీ-నీవా, గాలేరు- నగరి ప్రాజెక్టులు ఈ రెండు జాబితాలలోను లేవు! ఎందుకని అడిగితే అవి మిగులు జలాల ప్రాజెక్టులని జవాబు చెబుతారేమో. కానీ కృష్ణాడెల్టా స్థిరీకరణ కోసం ఉద్దేశించిన పులిచింతల కూడా మిగులు జలాల ప్రాజెక్టే. దానిని మిగులు జలాల ప్రాజెక్టుగాకాక, కృష్ణా డెల్టాను ఆధునీకరించడం వల్ల మిగిలే తొమ్మిది టియంసిల నికర జలాలు ఉపయోగించుకునే ప్రాజెక్టుగా చూపించి ఇప్పటికే కేంద్రం అనుమతి కూడా సంపాదించేశారు.

ఈ అబద్ధం ఒకవేళ నిజమే అయితే- అంటే ఆ తొమ్మిది టియంసిల నీరు కృష్ణా డెల్టాను ఆధునీకరించడం వల్ల మిగిలే నికరజలాలే అయితే ఆ నీటిని ఇప్పటికే కృష్ణాజలాలు అత్యధికంగా వాడుకుంటున్న కృష్ణా, గుంటూరు జిల్లాల ఆయకట్టు స్థిరీకరణ అనే లగ్జరీ కోసం వాడకుండా నది పైభాగాన శ్రీశైలం దగ్గరే ఆపేసి నల్లగొండకు నీరిచ్చే శ్రీశైలం ఎడమ కాలువ ప్రాజెక్టులో పారించవచ్చు గదా? ఆ రకంగా శ్రీశైలం ఎడమ కాలువకు కొంతయినా నికరజలం అందించవచ్చు కదా? మిగులు జలాన్ని నికర జలంగా చూపించి అబద్ధం చెప్పి పులిచింతలకు ఆమోదం తేగల వాళ్ళు మరో అబద్ధం చెప్పి (హంద్రీ అనే నదిలో చాలా నీళ్ళున్నాయనీ, గాలేరు అనేది జీవనది అనీ చెప్పి) హంద్రీ- నీవాకు, గాలేరు - నగరికి కూడా కేంద్రం అనుమతి తీసుకురావచ్చు కదా!

ఇవేవీ చేయబోవడం లేదనీ నదీజలాల వాడకం విషయంలో స్వర్ణాంధ్రప్రదేశ్‌లో కొత్త ఏమీ లేదనీ 'విజన్ 2020' చెబుతుంది. అయినప్పటికీ అది స్వర్ణాంధ్రప్రదేశ్ ఎలా అవుతుందో చంద్రబాబునాయుడుకే తెలియాలి.

సాగునీటి విషయంలో కొత్త ఏమీ లేకపోగా ఇప్పటిదాకా బావులకూ, బోర్లకూ అందించిన కరెంటు సబ్సిడీ సైతం తీసేయబోయేటట్టయితే మరి తెలంగాణ రాయలసీమల వ్యవసాయ అభివృద్ధి గురించి 'విజన్ 2020' ఏం చెబుతుంది?

ఏమీ చెప్పకుండా పోలేదు. కానీ ఏం చెప్పిందో చదివిన తర్వాత ఏమీ చెప్పకుండా ఆ ప్రాంతాల రైతులను వారి పాటికి వారిని వదిలేస్తేనే బాగుండేదేమోనన్న సందేహం రాకమానదు. మెట్ట భూములను మాగాణిగా మార్చే పథకమేదీ లేని 'విజన్' మెట్ట భూములలోకి పెట్టుబడిని భారీగా ఆకర్షించే మార్గాన్ని మాత్రం అన్వేషిస్తుంది. తెలంగాణ మొక్కజొన్న సాగుకు అనువైన ప్రాంతమనీ, రాయలసీమ పళ్ళతోటలకు

అనువైన ప్రాంతమనీ, రెండు ప్రాంతాలూ పశుపోషణకు అనువైన పచ్చికబయళ్ళు విస్తారంగా కలిగి ఉన్నాయనీ 'విజన్' గుర్తించింది. మొక్కజొన్న కోళ్ళ దాణాగా కోళ్ళ ఫారాలకు ఉపయోగ పడుతుందనీ, పళ్ళతోటలున్న చోట ఫ్రూట్ జ్యూస్ పరిశ్రమ బాగా అభివృద్ధి చెందగలదనీ, పచ్చిక బీళ్ళున్న చోట పాల ఉత్పత్తుల పరిశ్రమ వర్ధిల్లగలదనీ కూడా 'విజన్' గుర్తించింది. కాబట్టి ఆ మూడు పరిశ్రమలకూ ముడిసరుకు సరఫరాచేసే రంగాలుగా తెలంగాణ, రాయలసీమల వ్యవసాయ క్షేత్రాలను 'విజన్' అర్థం చేసుకుంటుంది.

దీనివల్ల 'అభివృద్ధి' రానే రాదని అనలేం. గ్రామీణ ప్రాంతాల స్థలాల ఆదాయం పెరుగుదల రేటు కొంతకాలం మెరుగుపడవచ్చు. (ఆపైన కోళ్ళ పరిశ్రమ, ఫ్రూట్ జ్యూస్ పరిశ్రమ, పాల ఉత్పత్తుల పరిశ్రమ దేశీయ విదేశీయ మార్కెట్‌లో ఎదుర్కొనే ప్రతి సంక్షోభానికీ ఈ అభివృద్ధి కూడా గురికాగలదు). కానీ ఈ అభివృద్ధికి స్థిరత్వం లేకపోవడమే కాదు, విస్తృతి ఉండదు. ఆయా రంగాలలో పెట్టుబడి పెట్టే కంపెనీలతో రైతాంగం అమ్మకం– కొనుగోలు సంబంధాలు పెట్టుకొని వారి కనుసన్నలలో బతకాలి. పెట్టుబడి రుణాలు ప్రభుత్వ బ్యాంకులూ, పరపతి సంఘాలూ ఇక మీదట ఎక్కువగా ఇవ్వవు కాబట్టి రైతాంగం తీర్చలేకపోతే తమ భూములు వారికే లీజుకిచ్చుకొని కూలిచేసుకొని బతకాలి.

మెట్టసాగును పెట్టుబడితో ముడిపెట్టజూసే ఈ విజన్ 2020 'అభివృద్ధి పథం' తెలంగాణ,రాయలసీమల గ్రామీణ జీవితాలకొక వికృత రూపం ఇస్తుంది. కొద్దిమంది విపరీతంగా ప్రయోజనం పొందగలరు. కాని వారంతా స్థానికులే కానవసరం లేదు. కొంతమంది కొంత పొందుతూ కొంత పోగొట్టుకుంటూ అస్థిరంగా కొట్టుమిట్టాడుతూ బతుకుతారు. మెజారిటీకి మాత్రం ఈ వ్యూహం ఏమీ ఇవ్వదు. కనీసం కూలి చేసుకునే అవకాశం కూడా కల్పించదు. మొక్కజొన్న చేలు, పళ్ళతోటలు, పచ్చికబీళ్ళు ఎంతమందికి ఎన్ని దినాల పని కల్పిస్తాయి?

ఆంధ్రప్రభ దినపత్రిక
15 ఏప్రిల్ 1999

# ఏ మంచికి నాంది?
# ఏ పథకానికి ప్రారంభం?

చంద్రబాబునాయుడు మొన్న జరిగిన 12వ జన్మభూమికి 'నీరు– మీరు' అని పేరు పెట్టారే తప్ప 'నీరు – మనం' అని పేరు పెట్టలేదనేది కేవలం జోక్ కాదని కరవు ప్రాంతాల రైతులతో మాట్లాడితే అర్థం అవుతుంది. పేరును బట్టి పథకాన్ని లేక ప్రణాళికను వ్యాఖ్యానించడం న్యాయం కాదంటే ఒప్పుకోవలసిందే కానీ, పథకాన్ని చూసిన తరువాత దానికి తగిన పేరు పెట్టారనిపిస్తే అప్పుడు పేరు గురించి వ్యాఖ్యానించడం తప్పు కాదు.



రాష్ట్రంలో ఏ గ్రామానికి పోయినా, ఆ ఊరి నీటివనరుల పెంపుదల గురించి రైతులకు ఒక అభిప్రాయం ఉంటుంది. ఎంత పూర్తిగా వెనుకబడిన ప్రాంతంలోని ఎంత చిన్న కుగ్రామమైనా దీనికి మినహాయింపు కాదు. ఊరి సమీపంలో ఉన్న ఫలానా చెరువుకు పూడిక తీసి కట్ట మరమ్మతు చేస్తేనో, ఆ చెరువులోకి వచ్చే ఫలానా వాగుకో, వంకకో గట్లుకట్టి నీరు వృథా కాకుండా చెరువులో చేరేటట్టు చూస్తేనో, ఫలానా దిక్కున ఉన్న చేలల్లో వాటర్‌షెడ్ చేపడితేనో నీటివనరులు మెరుగవుతాయని ప్రతి ఊరిలోనూ రైతులు చెబుతారు. ఆంధ్రప్రాంతం సంగతేమోగానీ తెలంగాణ, రాయలసీమలలో రైతులిప్పుడు చెరువులను, కుంటలను పొలాలకు నీరు పారించుకునే వ్యవస్థలుగా కాక, భూగర్భజలాలను పెంపొందించి బావులలోనూ, బోర్లలోనూ నీటి ఊట పెంచే ఏర్పాటుగానే చూస్తున్నారు. ముఖ్యమంత్రి భూగర్భజలాల సంరక్షణ గురించి మాట్లాడడం మొదలుపెట్టకముందే రైతుల ఆలోచనలో ఈ మార్పు వచ్చినట్టుంది.

ఒక్కొక్క గ్రామంలో రైతులు చేసే సూచనలలో నిర్దిష్టత చాలా ఉంది. చెరువులతో వారికి కొన్ని శతాబ్దాల పరిచయం ఉంది కాబట్టి ఆ సూచనలు చాలా వరకు సహేతుకమైనవే. సాంకేతికంగా అసాధ్యమైనవి కూడా కావు. ఒక సమస్య ఏమిటంటే, ఒక ఊరి నీటి సమస్య పరిష్కారానికి ఆ ఊరివాళ్లు చేసే సూచన కొన్ని సందర్భాలలో పొరుగూరి నీటిసమస్యను పెంచవచ్చు. లేదా అదే ఊరిలో కొందరు సాగు చేసుకుంటున్న భూముల ముంపునకు దారితీయవచ్చు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ సహాయం అవసరం కావచ్చు. పథకాల అమలుకయ్యే ఖర్చు విషయంలోనూ ప్రభుత్వం సహాయం కొంతమేరకు అవసరం అవుతుంది. గ్రామస్థులు ఎంత శ్రమదానం చేసినా కొంత పెట్టుబడి ప్రభుత్వం నుండి రావలసి ఉంటుంది.

రైతుల ఆలోచనలను, ప్రభుత్వం చేయగల ఈ రెండు సహాయాలను దృష్టిలో ఉంచుకొని ఒక్కొక్క ఊరిలోనూ పథకాలు తయారు చేయవచ్చు. ఇప్పటికే అటువంటి పథకాలు అమలులో లేని ఊళ్ళలో ఈ కరువు సీజన్‌లో జరిగిన 'నీరు–మీరు' జన్మభూమిలో వాటికి నాంది పలికి ఉంటారని అమాయకులు ఆశించి ఉండవచ్చు. కానీ, కరువు తీవ్రంగా ఉన్న ప్రాంతాలలో సైతం ఏ ఒక్క గ్రామంలోనూ ఇది జరిగినట్టు కనిపించదు. మరి మొన్నటి జన్మభూమిలో ఏం జరిగిందని ప్రశ్నిస్తే, 'ఎండలో వచ్చిన అధికారులకు చెమటలు తుడుచుకునే దానికే సరిపోయింద'ని ఒక ఊళ్ళో, 'ముసలివాళ్ల పెన్షన్ చెక్కులు కొన్ని పంచి దానితో జనం మధ్య కొట్లాటలు పెట్టి జీపెక్కి వెళ్లిపోయినార'ని ఇంకొక ఊళ్ళో, 'గతంలో జరిగిన జన్మభూమిలో వేయిస్తామని చెప్పిన రోడ్డు సంగతి ఏమయిందని మేము అడిగినామని చెప్పి మామీద అలిగి వెళ్లిపోయినార'ని మరొక ఊళ్ళో జవాబు చెబుతున్నారు. నీటి వనరుల పేరుమీద జరిగిన జన్మభూమి అత్యధిక గ్రామాలలో నీటి గురించి ఒక్క ప్రణాళిక కూడా రూపొందించకుండా గడచిపోయింది.

గ్రామస్థులు ఎంత శ్రమదానం చేసినప్పటికి అన్ని ప్రాంతాలలో ప్రతి గ్రామంలో భూగర్భజలాల పెంపుదలకు ప్రణాళికలు ఒకేసారి రూపొందించి పని మొదలుపెట్టడం ప్రభుత్వానికి అర్థికంగా సాధ్యం కాకపోవచ్చు. కానీ కరువు తీవ్రతను బట్టి ప్రాధాన్యతా క్రమంలో ఎంపిక చేసుకొని ఈ సంవత్సరం మొదలుపెట్టగలిగినవి ఈ సంవత్సరం, మిగిలినవి మళ్లీ అదే ప్రాధాన్యతా క్రమాన్ని బట్టి వచ్చే సంవత్సరం, ఆ తదుపరి సంవత్సరం... చేపట్టవచ్చు. రైతులకు ఈ విషయం వివరించి చెప్పి ఒక టైంటేబుల్ రూపొందించి ఉండవచ్చు. తమ గ్రామాల్లో కంటె కరువు తీవ్రంగా ఉన్న గ్రామాలలో కరువు నివారణ చర్యలు మొదట ప్రారంభించడాన్ని వ్యతిరేకించేంత మూర్ఖులు ఎవరో కొందరు మాత్రమే ఉంటారు. కానీ ఎడారి అయిపోతున్నదని పత్రికలన్నీ ఘోషిస్తున్న

మహబూబ్‌నగర్ జిల్లా గట్టు మండలంలో సైతం ఏ ఒక్క గ్రామంలోనూ ఒక కొత్త పథకం చేపట్టడానికి నిర్ణయం చేయకుండా ముగిసిన నీటి జన్మభూమిని గురించి ఏమనాలి?

కరువును రాజకీయం చేయొద్దు అని ముఖ్యమంత్రి అంటుంటారు. రాజకీయం అనేదొక అసభ్యమైన పని అయినట్లు మాట్లాడే రాజకీయ నాయకుడు బహుశా ఈయనొక్కరేనేమో. ఆయన ఏ అసభ్యమైన అర్థంలో రాజకీయం అనే మాటను వాడుతున్నారో ఆ అర్థంలో ప్రజల ఆకాంక్షలన్నిటినీ తెలివిగా రాజకీయం చేయడం వల్లనే ఆయన అధికారంలోకి వచ్చారు. ఇప్పుడు అదే అర్థంలో కరువును రాజకీయం చేస్తున్నారు. గత సంవత్సరం వర్షాకాలపు పంట ప్రస్తుత కరువు ప్రాంతాలన్నిటిలోనూ బాగా దెబ్బతినింది. నైరుతి రుతుపవనాలపైన ఆధారపడే దక్షిణ జిల్లాలలోనయితే చాలావరకు పంటలే వేయలేదు. కాబట్టి ఈ వేసవి వచ్చేనాటికి మనుషులకు తాగు నీరు, చేయడానికి పని, పశువులకు మేత కరువవుతాయని ప్రభుత్వం ఊహించే ఉండాలి. అయినప్పటికీ ఈ కొరతను నివారించడానికి ఏమీ చేయలేదు. దీనికి సంజాయిషీ ఏమీ చెప్పుకోకుండా కరువు మధ్యలో నీటి సంరక్షణ గురించి ఊదరగొట్టే ప్రచారం చేయడాన్ని ఆయన ప్రయోగించే అసభ్యమైన అర్థంలో 'రాజకీయం' అనకపోతే ఏమనాలి? నిన్నటిదాకా పశువులకు మేత సరఫరా ఎక్కడా చేయలేదు, ప్రజలకు పనులు కల్పించడానికి కార్యక్రమాలెక్కడో తప్ప చేపట్టలేదు, చేపట్టిన దగ్గర కూడా పెట్టుబడి ఆదా చేయడానికి మానవ శ్రమ బదులు ప్రొక్లెయిన్లు వాడి ప్రజల నోట్లో దుమ్ము కొడుతున్నారు. పైగా 'ప్రొక్లెయిన్లు అవసరమైతే పొరుగు రాష్ట్రాలనుండి అరువు తెచ్చుకొని వాడాలి.ఎక్కువమందికి పని కల్పించాలి' అంటూ చంద్రబాబు పొంతనలేని అసంబద్ధపు ప్రకటనలిస్తున్నారు. సాగునీటి సంగతి దేవుడెరుగు. కనీసం తాగునీటికి కూడా కొత్తగా ఏర్పాట్లు చేసిన గ్రామాలను వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. ఒక్కొక్క ఊరిలో ప్రజలు తమకు తోచిన ప్రత్యామ్నాయాలు వెతుక్కొని రోజంతా మంచి నీళ్లు సేకరించుకోవడంలోనే గడుపుతున్నారు. ఈ మధ్యలో 'నీరు–మీరు' వచ్చింది. పోయింది. 'నీరు మీ కర్మ– దొరకపుచ్చుకో గలిగితే దొరకపుచ్చుకోండి లేకపోతే లేదు' అని దీని అర్థం అనుకోవాలి. భూగర్భజలాలన్నీ ఇంకిపోయి ఉన్న ఈ వేసవిలో ప్రభుత్వం మాత్రం నీళ్లెక్కడి నుండి తీసుకొస్తుందని అడగచ్చు. ఇప్పుడు అకస్మాత్తుగా తీసుకురాలేదు. కాని ఈ స్థితి ఈ వేసవిలో వస్తుందని కనీసం మొన్నటి డిసెంబర్ నాటికే అందరికీ తెలుసు. కనీసం ఉన్న మంచినీటి వ్యవస్థను పటిష్ఠం చేసుకోవలసి ఉండింది. కానీ నీళ్లట్యాంకు కట్టి కూడా దానికి బోరువేయని గ్రామాలను, రెండూ ఉండి పైప్‌లైన్లు వేయని గ్రామాలను, మూడూ ఉండి కరెంటు లోటువల్ల ట్యాంకులోకి

నీరెక్కని గ్రామాలను, అన్నీ ఉండి ఆ నీటిలో ఫ్లోరైడ్ కాలుష్యం మితిమీరి ఉండడం వల్ల వాటిని తాగి ప్రజలు ఆరోగ్యాలు పాడుచేసుకుంటున్న గ్రామాలను చూస్తే ఈ ఆరునెలలలో ఏ రకమైన జాగ్రత్త చర్యలూ ప్రభుత్వం తీసుకోలేదని అర్థమవుతుంది. గ్రామస్థులే ఎవరో ఒక రైతును అడుక్కొని తన పొలంలోని బావినీరు తాగడానికి ఇమ్మని కోరడం, ఆ రైతు తన బావిలో మిగిలి ఉన్న కొద్దిపాటి నీటిని వేసంగి పంటకు కాకుండ గ్రామస్థులు తాగడానికి ఇచ్చేందుకు ఇష్టపడక తగాదా పెట్టుకోవడం అనేక గ్రామాలలో జరుగుతున్నది. ప్రభుత్వమే అటువంటి రైతులకు ఎంతో కొంత నీటి కిరాయి చెల్లించి వారి బావుల నుండి ఊరి ట్యాంకులోకి లేక నల్లాలలోకి నీళ్లు పారించే ఏర్పాటు చేసి ఉండవచ్చు. ఏ ఒక్క గ్రామంలోనూ ఇది జరగలేదు.

అయినప్పటికీ నీటి వనరుల సంరక్షణ గురించి ఒక జాతర పద్ధతిలో ప్రచారం చేసుకొని అన్నా హజారే వంటి పెద్దలను పిలిచి మెప్పుకోలు సాధించుకోవడాన్ని రాజకీయం అనకపోతే దగా అనాలి. ముఖ్యమంత్రి ఆ రెండు మాటలనూ ఒకే అర్థంలో ప్రయోగిస్తున్నారు కాబట్టి రెండూ అనవచ్చు.

ఆంధ్రప్రభ దినపత్రిక
25 మే 2000



# ప్రాజెక్టుల ఎండమావులు

ఎండమావి ఎడారుల లక్షణం. ఎడారులుగా మారుతున్న ప్రాంతాలలో రైతులు ప్రాజెక్టుల ఎండమావులు చూస్తున్నారు. నీటి లేమి, పశుగ్రాసం కొరత, వలసలు, ఎండిపోయిన బావులు, అన్నీ మాట్లాడిన తరువాత మరి మీకు నీళ్లెక్కడి నుండి రావాలనుకుంటున్నారని దేవరకొండ గ్రామాలలో రైతులనడిగితే క్లుప్తంగా 'జూరాల' అంటారు. ఒక్క క్షణం మనం నల్గొండలో ఉన్నామా మహబూబ్‌నగర్‌లో ఉన్నామా దేవరకొండలో ఉన్నామా గద్వాలలో ఉన్నామా అని మనకే సందేహమొస్తుంది. 'మీరెక్కడ? జూరాల ఎక్కడ?' అని ఆశ్చర్యంగా అడుగుతాము. అప్పుడు తాము దర్శిస్తున్న ఎండమావిని పూర్తిగా వివరిస్తారు. జూరాల నుండి ఎత్తిపోతల ద్వారా మలచింతల ప్రాజెక్టు తయారయితే, ఆ నీళ్లతో డిండి ప్రాజెక్టు రిజర్వాయర్ నిండితే, అప్పుడు డిండి ఆయకట్టులో తమ ఊరుంటే పొలాలకు నేరుగా నీళ్లొస్తాయి, లేకపోతే నిండా నీళ్లున్న డిండి వల్ల తమ బావులలో ఊట పెరిగి ఆ రకంగా పొలాలకు నీళ్లొస్తాయనేది వారి కల. అది విని మనం నవ్వుతాం. మనతో పాటు వాళ్లు కూడా నవ్వుతారు. కానీ స్వప్నాన్ని చూడడం మానుకోరు. ఇంక పోయి వస్తాం అని మనం లేస్తుంటే ఎట్లయినా మలచింతల అయ్యేటట్లు చూడండి సార్ అంటారు.



దేవరకొండ నుండి నారాయణఖేడ్‌కు పోతాం. వాళ్ల ఎండమావి ఒక రకంగా ఎండమావి కాదు. సింగూరు 'బాక్ వాటర్స్' నిజంగానే కళ్లకు కనిపిస్తుంటాయి. కళ్లను ఊరిస్తుంటాయి. నల్లటి రేగడినేలలకు ఆ నీళ్లు

పారిస్తే హాయిగా బతకొచ్చు కదా అని నారాయణఖేడ్ రైతులు అనుకోవడం సహజం. కానీ సింగూరు హైదరాబాద్‌కు రిజర్వ్ చేయబడింది. అది ఉన్న ప్రాంతంలో రైతులకు నీళ్లివ్వడానికి దానికి స్వేచ్ఛ లేదు. దాని 'బాక్ వాటర్స్' ఒడ్డున ఉన్న గ్రామాలలో నివసించే రైతులు సాహసం చేసి ఎవ్వరి అనుమతి లేకుండా మోటార్లు పెట్టి నీళ్లు పారించుకుంటున్నారు గానీ మొత్తంగా ఆ తాలూకాకు సింగూరు నీళ్లు రావాలంటే ఎత్తిపోతల పథకం మంజూరు కావాలి. హైదరాబాద్‌కు కృష్ణ నుండి నీళ్లు తీసుకోరాదా? మంజీర నీళ్లే కావాలా?' అని వారంటారు. కానీ వారి కోరిక తీరదు. ఇప్పుడు నలభై ఐదు లక్షలున్న హైదరాబాద్ జనాభా ఎనభై లక్షలయినప్పుడు ఎంత నీళ్లు కావలసి ఉంటుందని నగర పాలకులు ఇప్పటినుండే అంచనాలు వేస్తున్నారు. చేజిక్కించుకున్న సింగూరు నీటిని విడిచి పెట్టరు. అందువల్ల నారాయణఖేడ్ వాసులకు సింగూరు బాక్ వాటర్స్ అనునిత్యం కనిపించే ఎండమావే.

బాంబుల నిలయమైన పత్తికొండ ప్రజలు ఇంకా సుదూర స్వప్నం దర్శిస్తున్నారు. గ్రామాలలో ఆరు నెలలుగా పనులు లేవు కాబట్టి బళ్లారికీ తుంగభద్ర ఆయకట్టు గ్రామాలకూ వలస పోయిన వారు పోయినారు. పోనివారు, తిరిగొచ్చిన వారు ఊరి రచ్చబండ దగ్గర కూర్చొని గప్పాలు కొడుతున్నారు. 'మీకు నీళ్లెక్కడి నుండి రావాలి' అంటే 'శ్రీశైలం' అని రాయలసీమవాసులకు సహజమైన బింకంతో జవాబు చెప్తారు. అక్కడికి శ్రీశైలం రెండు వందల యాభై కిలోమీటర్ల దూరం ఉంటుందేమో. అయినా శ్రీశైలాన్ని పత్తికొండకు రప్పించే స్వప్నమొకటి వాళ్లకు ఉంది. దానిపేరు హంద్రీ–నీవా సుజల స్రవంతి. కర్నూలు జిల్లా పడమటి భాగాన ఉన్న హంద్రీ నదిని చిత్తూరు జిల్లాలో ఉన్న నీవా అనే నదితో కలపడానికి కర్నూలు జిల్లా తూర్పు చివరనున్న శ్రీశైలం ప్రాజెక్టు 'బాక్ వాటర్స్' నీరు తీసుకొని ఎత్తిపోతల ద్వారా కొడుమూరు, పత్తికొండ తాలూకాలలోకి తీసుకుపోయి హంద్రీపైన కట్టిన రిజర్వాయర్లలో కలిపి అనంతపురం జిల్లాకు నీళ్లిచ్చుకుంటూ చిత్తూరుకు తీసుకుపోయే పథకం ఇది.

నవ్వుకుంటున్నారా?

కేంద్ర ప్రణాళికా సంఘం ఆమోదంగానీ నీటికేటాయింపుగానీ నిధుల మంజూరుగానీ లేని ఈ ప్రాజెక్టుకు పునాది రాళ్లు మాత్రం మూడు సార్లు పడ్డాయి. ఆ రాళ్లను చూస్తూ ఎప్పటికయినా నీళ్లొస్తాయని కలలు కంటూ ప్రస్తుత కరువు కాలాన్ని వెళ్లదీస్తున్నారు పత్తికొండ రైతులు.

మన రాష్ట్రంలో 'గట్టు' అనే ఊరొకటి ఉందని తెలియని వారెవరూ లేరిప్పుడు. అది గద్వాల తాలూకాలోని మండల కేంద్రమనీ ఆ మండలం ఎడారిగా మారిపోతున్నదనీ ఇప్పుడందరికీ తెలుసును. అతిశయోక్తులు మన జర్నలిజంలో భాగమయిపోయినాయి. కాబట్టి ఇది పూర్తిగా సత్యం కాకపోవచ్చునని చాలామంది అనుకోవచ్చును. కానీ ఈ వార్తలలో మాత్రం ఆవగింజంతకూడ అతిశయోక్తి లేదు.

అయితే ఆ ఎడారివాసులు కూడ ఒక ఎండమావిని దర్శిస్తున్నారు. సంవత్సరంలో ఎంత లేదన్నా ఏడు నెలలు కర్ణాటకలో ఎక్కడ పని దొరికితే అక్కడికి పోయి పని చేసుకొచ్చే ఈ ఊర్ల జనం మిగిలిన కాలంలో జూరాల 'బాక్ వాటర్స్' గురించి ఒక కల తయారు చేసుకున్నారు. దాని పేరు నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం. ఆ పథకం నిజమైతే మహబూబ్‌నగర్ జిల్లాలోని అతి నికృష్టమైన ప్రాంతంలో 2 లక్షల 25 వేల ఎకరాలకు నీళ్లొస్తుందనీ, అది సస్యశ్యామలమవుతుందనీ వారి స్వప్నం సారాంశం. ఇది నలభై ఏళ్లుగా కంటున్న కల. అది తీరుతుందని ఆశిస్తూ అంతవరకు కర్ణాటకకు పోతూ వస్తూ బతుకు వెళ్లదీస్తుంటారు గట్టు మండల వాసులు.

పైన వివరించిన స్వప్నాలలో మూడు కృష్ణానది పరీవాహక ప్రాంతానికీ ఒకటి గోదావరి పరీవాహక ప్రాంతానికీ చెందినవి. చివరిగా, గోదావరి పరీవాహక ప్రాంతానికి చెందిన ఇంకొక ఎండమావి గురించి చెప్పుకొని ముగిద్దాం. ఈ ఎండమావిని గోదావరి పరీవాహక ప్రాంతవాసులే కాక కృష్ణా పరీవాహక ప్రాంతవాసులు కూడా దర్శించడం విశేషం. దీని పేరు శ్రీరాంసాగర్ వరద నీటి కాలవ. కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ ప్రాంతానికీ వరంగల్ జిల్లా చేర్యాల, జనగామ ప్రాంతాలకూ ఇది నీళ్లివ్వాలి. అయితే అక్కడితో ఆగిపోకుండ ఈ నీళ్లు నల్గొండ జిల్లాలోని చిట్యాల ప్రాంతానికి కూడ వస్తాయని ఆ ప్రాంతవాసులు ఎదురు చూస్తున్నారు. అప్పటిదాకా ఫ్లోరైడ్ కాలుష్యంతో పాడయిన నీళ్లు తాగుతూ కీళ్ల జబ్బులను ఓపికగా భరిస్తున్నారు.

ఇవన్నీ ఎండమావులంటున్నామంటే ఈ ప్రాజెక్టులు అసాధ్యమని కాదు. వీటి నిర్మాణం చేపట్టాలన్న శ్రద్ధ మన రాష్ట్ర పాలకులకు లేదన్న విషయాన్ని ప్రజలు గ్రహించలేక పోతున్నారని మాత్రమే. లేక గ్రహించి కూడా ప్రాణం నిలుపుకోవడానికి ఏదో ఒక ఆశ కావాలి కాబట్టి గ్రహించనట్టు నటిస్తున్నారా?

ఈ వాక్యాలు చదివే వాళ్లెవ్వరూ తిండి కోసం వలసపోయే స్థితిలో ఉండరు, మంచి నీటి కోసం రోజులో సగభాగం బిందెలు మోసుకొని ఈ నల్లా దగ్గరికీ ఆ బావి దగ్గరికీ పరుగెత్తే స్థితిలోనూ ఉండరు. అందుకు కృతజ్ఞతగా ఈ ఎండమావులను నిజం చేయడానికి మనం చేయగలిగినది చేద్దామా?

ప్రజాతంత్ర
3 జూన్ 2000






జలపాఠాలు చెబుతూ
బాలగోపాల్ గీసిన రేఖాచిత్రం



ANDHRA PRADESH BASIN MAP
District Boundary
Basin Boundary
State Boundary
1. Bahuda
2. Mahendratanaya
3. Poondi minor drains
4. Naupada minor drains
5. Vamsadhara
6. Nagavali
7. Peddagedda
8. Kandivalasagedda
9. Champavathi
10. Gosthani
11. Meghadrigedda
12. Narvagedda
13. Anakapalle minor drains
14. Sarada
15. Varaha
16. Tandava
17. Pampa
18. Suddagedda
19. Yeleru
20. Godavari
21. Errakalva
22. Thammileru
23. Ramileru
24. Budameru
25. Krishna
26. Romperu
27. Gundlakamma
28. Minor drains between Gundlakamma and Musi
29. Musi
30. Paleru
31. Manneru
32. Kandaleru(Chippaleru)
33. Pennar
34. Upputeru
35. Swarnamukhi
36. Kalangi
37. Araniar
38. Koratliar
39. Palar
40. Ponniar
Note: Rivers indicated in red are interstate river basins
MAHARASHTRA
CHATTISGARH
ORISSA
BAY OF BENGAL
KARNATAKA
GODAVARI BASIN
KRISHNA BASIN
PENNAR BASIN
MACHILIPATNAM
CHENNAI
BANGALORE


COMPLETED MAJOR & MEDIUM PROJECTS
Medium Projects:
Medium Projects:
Reservoirs:
District & State Boundaries:
UP: Upper Pennar
LS: Lower Sagileru
US: Upper Sagileru
CT: Cumbum Tank
VRK: Veera Raghava Kota
PB: Paleru-Bitragunta
TPS: Torrigedda Pumping Scheme
PCRP: PCR Project (Gandipalem)
NRS: Nagavali River System
UMD: Upper Maner Dam
GDS: Godavari Delta System
PDS: Pennar Delta System
KDS: Krishna Delta System
KC Canal: Kadapa-Kurnool Canal
RDS: Rajolibanda Diversion Scheme
NSP: Nizamsagar Project
SRSP: Sri Ram Sagar Project
TBP LLC: Tungabhadra Project Low Level Canal
TBP HLC: Tungabhadra Project High Level Canal
NSP LBC: Nagarjunasagar Project Left Bank Canal
NSP RBC: Nagarjunasagar Project Right Bank Canal
Major Projects
NSP/Kadem/TBP LLC Jurala/PDS/KDS/Yeleru/ Thandava/Vamsadhara/ NRS/Musi/SRBC:
SRSP/RDS/KC canal/ TBP HLC/NSPRBC/ GDS/Somasila/ Narayanapuram:
NSPLBC:
Sathnala
Adilabad
Vattivagu
NTR Sagar
Kadem
Swarna
NSP
Ramadugu
SRSP
Boggulavagu
Koulsnala
NZB
Karimnagar
Nallavagu
Pocharam
UMD
Laknavaram
Malluruvagu
Shanigaram
Ghanpuram
Warangal
Sangam
Taliperu
Medak
L.T.Bayyaram
Khammam
Peddavagu
Kotipallivagu
Rangareddy
Nalgonda
Musi
Wyra
Lankasagar
TPS
Munneru
NSP LBC
Krishna
WG
GDS
Koilsagar
Dindi
Mahabubnagar
Jurala
Guntur
KDS
RDS
NSP RBC
TBP LLC
Prakasam
Gajuladinne
Kurnool
CT
Mopadu
TBP HLC
SRBC
KC Canal
VRK
PB
US
Rallapadu
LS
Somasila
TBP HLC
PCRP
PDS
Bhairavani thippa
UP
Yogivemana
Buggavanka
Somasila
Kanpur Canal System
Ananthapur
Kadapa
Nellore
Pennar Kumudvathi
Swarnamukhi
Chittoor
Krishnapuram tank
Arniar
Srikakulam
Pydigam
Vengalarayasagar
NRS
VZN
Vamsadhara
Andra
Thatipudi
Narayanapuram
Konam
Raiwada
VSP
Thandava
EG
Subbareddy
Yeleru
Pampa


LOWER PENGANGA PROJECT
(Adilabad)
Location: Chikkalwardha (V)
Yavatmal (dt), Maharashtra
Water allocated: Maharashtra - 37.55 TMC
Andhra Pradesh - 5.12 TMC
Right bank canal (AP): 48.60 Kms
Ayacut: Maharashtra - 2,10,885 Ac
Andhra Pradesh - 40,000 Ac
N
Km 48.60
MAHARASHTRA
NH-7
Bori
Wasari
Kodnori
Pimpalakutty
Digras
Dukhra
Lakhiwari
Jainath
Avalpur
Movragaon
Km 0.00
Km 52
Rampur
Right Bank Canal
ADILABAD
ANDHRA PRADESH
Left Bank Canal
Penganga
Chikkal Wardha Dam
Penganga is a tributary of river Godavari
Legend
River/ Streams
Left Bank Canal Ayacut
Right Bank Canal Ayacut
Canal
State Boundary
Road


PROJECTS ON RIVER MANJIRA
(Nizamabad & Medak)
N
Singur
Location: Singur (V), Pulkal (M)
Medak(dt)
Storage capacity: 29.91 TMC
Water allocated: 11 TMC
Drinking water for Hyd: 4 TMC
Ayacut: Regulated releases to
Nizamsagar, Ghanpur anicut
& 40,000 Ac ( Medak & Nizamabad)
Left canal: 48 Kms
Right canal: 12 Kms
Ghanpur Anicut
Location: Ghanpur (V), Kulcharam (M)
Medak (dt)
Ayacut: 21,625 Ac
Water allocated: 4.06 TMC
Right canal (Mahabub nahar): 42.8 Kms
Left canal (Fateh nahar): 14.8 Kms
Nallavagu project ayacut: 6,030 Ac
Water allocated: 1.09 TMC
Manjira Water Supplying Scheme
Location: Kalbagur (V), Medak (dt)
Water allocation: 2.97 TMC
Reservoir capacity: 1.5 TMC
Manjira is a tributary of river Godavari
GODAVARI
NIZAMABAD
Nizamsagar Project
Medak
Ghanpur Anicut
Manjira
Manjira Barrage
SANGAREDDY
Singur Project
Manjira
MAHARASHTRA
Nallavagu
Project
KARNATAKA
Manjira
GODAVARI
River
State border


SRIRAM SAGAR PROJECT
(Adilabad, Nizamabad, Karimnagar, Warangal, Nalgonda)
Legend
Stage - I ayacut
Stage - II ayacut
Canals
Rivers
FFC ayacut
Roads
Railway
To Nagpur
Saraswati Canal
Kadem Dam (Capacity - 7.62 TMC)
Kadem Canal
To Balharsha
GODAVARI
Metpalli
Koratla
Jagtial
Kakatiya canal
FFC
Stage - II
MMD: Mid Maner Dam
LMD: Lower Maner Dam
NSP: Nagarjunasagar Project
FFC: Flood Flow Canal
Peddapalli
Sircilla
KARIMNAGAR
Manthani
MMD
LMD
Maner
Morvancha vagu
SRSP STAGE - I
Location: Pochampad,
Nizamabad (dt)
Water allocated:145.35 TMC
Reservoir capacity: 112 TMC
Ayacut:
Nizamabad: 32,890 Ac
Adilabad: 34,967 Ac
Warangal: 3,64,078 Ac
Karimnagar: 5,36,328 Ac
Kakatiya canal: 284 Kms
Laxmi canal: 3.5 Kms
Saraswati canal: 77 Kms
Hyderabad
Parkal
Mulugu
WARANGAL
Narsampet
Pakala Lake
S.C.Railway
Jangaon
LMD capacity - 24 TMC
MMD capacity - 25.87 TMC
Nekkonda
Km 284.00
Hyderabad
SRSP STAGE - II
Water utilisation: 24.4 TMC
+4.7 TMC ground water
Ayacut:
Warangal: 1,13,578 Ac
Khammam: 68,914 Ac
Nalgonda: 2,57,508 Ac
Kakatiya canal:
284 to 386 Kms
Mahabubabad
Musi River
Stage - II
Musi Project
Suryapet
KHAMMAM
FFC Canal
Location: Mupkal
Balkonda (M), NZB(Dt)
Water allocated: 20 TMC
Ayacut:
Warangal: 60,000 Ac
Karimnagar: 1,30,000 Ac
Nalgonda: 30,000 Ac
Main canal: 288 Kms
NALGONDA
Musi Project Ayacut
Miryalaguda
NSP Canal
Paleru
Akeru
To Vijayawada


NIZAM SAGAR PROJECT
(Nizamabad)
GODAVARI
GODAVARI
Manjira
Nandipet
Balkonda
Armur
Navipet
Makloor
Yedapalle
NIZAMABAD
Bodhan
Kotgiri
Varni
Birkoor
Banswada
Main Canal
Nizamsagar
Nizamsagar Reservoir
Year of starting construction : 1923
River : Manjira
Location : Achampet, Nizamsagar(M)
Storage capacity : 17.80 TMC
Water allocated : 37.87 TMC
Length of main canal : 155 Kms
Contemplated Ayacut : 2.75 lakh acres
Legend
Rivers
Ayacut
Canals


YELLAMPALLY PROJECT
Ayacut
Stage - I Phase - I : 20,000 acres
Stage - II Phase - I : 2,00,000 acres
Stage - II Phase - II : 2,30,000 acres
Water Allocation
Stage - I Phase - I : 2 TMC
Stage - I Phase - II : 8.5 TMC
Stage - II Phase - I : 12 TMC
Stage - II Phase - II : 20 TMC
Stage - II Phase - II is part of Pranahitha - Chevella and Yellampally link
Stage - III is the ayacut of Pranahitha - Chevella project
Canals
Stage - I Phase - I:
Stage - I Phase - II:
Stage - II Phase - I:
Stage - II Phase - II:
Stage - III:
Flood Flow Canal :
St - I Ph - I ayacut:
St - II Ph - I ayacut:
St - II Ph - II ayacut:
St - III ayacut:
Forest:
District border:
Pranahitha River
Barrage
NTPC pipeline
St - I Ph - II
Stage - I Phase - I canal
Stage - III canal
St - II Ph - I canal
St - II Ph - II canal
NTPC
Manthani
Peddapalli
Maneru
GODAVARI
Dharmapuri
Jagityal
Korutla
Metpalli
Kodimial
Boinpalli
Karimnagar
Vemulawada
Sircilla
Chandurthi
Konaraopet
Yellareddypeta
Gambhiraopet
Mustabad
Dubbaka
Beijanki
koheda
Siddipet
Mirrdoddi
Nanganur
Cheriyal
Chigurumamidi
Husnabad
Janagoan
Gajwel
Ramaiahpet
Medak
Stage - III
Medchal
Shamirpet
Narsapur
Patancheru
Jogipet
Nizamsagar
Yellareddy
Kamareddy
Nizamabad
Balkonda
Armur
GODAVARI



PRANAHITHA - CHEVELLA PROJECT
(Adilabad, Nizamabad, Karimnagar, Warangal, Medak, Rangareddy, Nalgonda)
P: Package
A: Ayacut in acres
R: Reservoir
NR: New Reservoir
T: Tank
KC: Kakatiya Canal
GC: Gravity Canal
FC: Flood Canal
C: Canal
Pranahitha Barrage
P-3
FRL:+152 (1.26 TMC)
Wardha River
Wainganga River
PRANAHITHA
Thummidiheti
P-1
A:Nil
Karjalli (15 Km)
P-2
A: Nil
Surgapalli (28.5 Km)
P-4
A:20,500
Mailaram (71.5 Km)
P-5
A:36,000 Acres
116 Km
GODAVARI
SRSP
Hangaga
9.4 Km
Dilwarpur
9.7 Km
P-27
A:50,000
P-28
A:50,000
P-20
A: Nil
Masani (R)
P-21
A:1,84,000
Manchippa (T)
P-22
A:1,56,000
Bhumpalli (R)
Medaram (R)
FRL:230.0 (.58 TMC)
K C
P-6; A: Nil
P-7; A:Nil
P-8; A:Nil
Mothe Vagu
FRL:+318.0 (1.65 TMC)
P-9
A:80,000
UMD
FRL:+451.50
(2.20 TMC)
Mid Maneru Dam
FRL:318.0 (25 TMC)
Ananthagiri (NR)
FRL:+390 (1.7 TMC)
P-10;
A:30,000
P-11;
A:1,10,000
Imamabad (NR)
FRL:480 (1.6 TMC)
P-12
A:1,25,000
P-13
A:53,000
Yellampally Project
FRL: +148.0 (20 TMC)
Tadkapalli (R)
FRL: +635 (1.0 TMC)
Thipparam (R)
FRL: +635.0 (1.0 TMC)
Pamulaparthy (R)
FRL: +590.0 (1.0 TMC)
Chevella (R), 128 Km
FRL: +635 (3.0 TMC)
GC 18 Km
P-18 A:15,000
P-17
A:Nil
P-15
A:55,000
P-16
A:1,35,500
Haldi river
24 Km
P-14
A:90,000
P-19
A:25,000
P-23
A:NIL
Doulatabad (70 Km)
Cheriyal(100 Km)
Musi river (115 Km)
Chevella (125 Km)
Mukapalli
(33 Km)
Jangampalli, 3.70 Km
0.8 TMC
45.70 Km
0.8 TMC
Baswapuram (R)
100 Km
Chityala Mandal
P-24
A:14,000
P-26
A:2,00,000
Rayakod (C)
154 Km
Parigi(C)
37.8 Km
133 Km
Water utilisation: 160 TMC from Pranahitha
+ 20 TMC from Yellampally Project
Ayacut: Adilabad - 1,56,500 Ac;
Medak - 5,19,152 Ac; Nalgonda - 2,29,832 Ac;
Nizamabad - 3,04,500 Ac; Karimnagar - 1,71,449 Ac;
Warangal -11,863 Ac; Rangareddy - 2,46,704 Ac
Canal length:1055 Kms


ICHCHAMPALLY PROJECT
(Karimnagar, Khammam, Warangal)
Location: Ichchampally, Karimnagar (dt)
Ayacut: 1,57,042 Ac (Karimnagar, Khammam, Warangal)
Water availability: 85 TMC
Right main canal: 293 Kms
Left main canal: 94 Kms
Reservoir capacity: 366 TMC @ FRL +112.77 mts
GODAVARI
GODAVARI
Left bank canal
Right bank canal
Kinnersani
KHAMMAM
SRSP
Stage-II
ayacut
NALGONDA
Kakatiya canal
Kakatiya canal
LMD
HYDERABAD
NIZAMABAD
Ayacut:
Canals:
River:
Roads:
District boundary
State boundary


DEVADULA LIFT IRRIGATION SCHEME
(Warangal, Karimnagar, Nalgonda)
Intake at Gangaram Ch 0.00 Kms
Bheemghanapur, Ch 38.30 Kms
Stage - III
Ramappa, Ch 63.39 Kms
Salivagu, Ch 82.08 Kms
Stage-II
Nagaram, Ch101.48 Kms
Dharmasagaram, Ch 120.61 Kms
Aswaraopalli Ch 140.16 Kms
ST Ghanpur, CH 134.98 Kms
Peddacheruvu Ch 154.16 Kms
Stage - I
KARIMNAGAR
WARANGAL district
NALGONDA district
Legend
Canal Stage - I:
Canal Stage - II:
Canal Stage - III:
River/Tanks:
District boundary:
Ayacut:
Location: Gangaram(V)
Eturunagaram(M), Warangal (dt)
Water allocated: 38.18 TMC
Ayacut:
Warangal: 5,61,229 Ac
Karimnagar: 14,100 Ac
Nalgonda: 45,671 Ac
Pipeline length:
Stage - I: 138.5 Kms
Stage - II: 196.40 Kms
Stage - III: 202 Kms
Stage - I Tanks/Reservoirs:
Bheemghanpur, Ramappa, Salivagu, Nagaram, Dharmasagar, Station Ghanpur
Stage - II Tanks/Reservoirs:
Bheemghanpur, Ramappa, Salivagu, Nagaram, Dharmasagar, Gandiramaram, Bommakuru, Tapaspally, Veldanda, RS Ghanpur, Aswaraopalli, Chittakodur
Stage - III Tanks/Reservoirs:
All tanks in Stage - II and Rangaiah Cheruvu, Nashka, Pulkurthy, Chennur, Nawabpet, Kannaboinagudem, Jeelagudem, Laddanur, Inapur, Marreddy cheruvu


DUMMUGUDEM LIFT
IRRIGATION SCHEME
(Khammam, Warangal)
Dummugudem Anicut
GODAVARI RIVER
Bhadrachalam
Location: Pamulapally,
Aswapuram (M), Khammam(dt)
Water allocated: 16.5 TMC
Ayacut: 2,00,000 Ac
Canal length: 206.6 Kms
Kinnersani River
To Aswaraopet
Tammileru
Nagarjunasagar Left Canal
To Illendu
Wyra Lake
To Khammam
Legend
Rivers
Canals
Ayacut
Forest
Roads



POLAVARAM PROJECT
(Krishna, East Godavari, West Godavari, Visakhapatnam)
Location: Ramaiahpeta (V), Polavaram (M)
Storage : 194.6 TMC
Utilisation: 301.38 TMC
PRMC Length:174 Kms
PRMC Ayacut:
West Godavari: 2,58,000 Ac
Krishna - 62,000 Ac
PLMC Length: 181.50 Kms
PLMC ayacut:
East Godavari - 2,49,872 Ac
Visakhapatnam - 1,50,071 Ac
Sabari
ORISSA
Sileru
Foreshore submersion
Spill Way
Saddle Dam
Tunnel
Regulator
Dam
Power House
Saddle Dam
Tunnel
Head Regulator
Addathigala
Yeleru Project
Yeleru
Pampa
Thandava
Varaha
Sarada
Polavaram Left Main Canal
Anakapalle
Km 181.50 Kms
Kaniti Reservoir
Tuni
Peddapuram
Samalkot
KAKINADA
Rajahmundry
Kovvuru
Ramachandrapuram
Amalapuram
Razole
Narsapur
Bhimavaram
Yerrakalva
Buvderu
Thammileru
ELURU
Ramileru
Kolleru Lake
Budameru
Vijayawada
PRMC
Km 174.00
Prakasam Barrage
KRISHNA RIVER
MACHILIPATNAM
BAY OF BENGAL
PRMC: Polavaram Right Main Canal
Rivers
Canals
Proposed ayacut under Polavaram project
Proposed ayacut under Godavari delta
Proposed ayacut under Krishna delta


GODAVARI DELTA SYSTEM
(East & West Godavari)
Year of starting construction: 1857
Location: Dowleshwaram
Storage capacity: 3.78 TMC
Water allocated : 263.60 TMC
Ayacut in East Godavari:
Eastern Delta: 2,45,333 Ac
Central Delta: 2,01,896 Ac
Pithapuram Branch Canal: 35,970 Ac
Ayacut in West Godavari :
Western Delta: 5,29,962 Ac
Total: 10,13,161 acres
Legend
River
Ayacut
Canals
Canal: Length
Eastern Delta: 253.7 Kms
Central Delta: 199 Kms
Western Delta: 563 Kms (Total length of 11 major canals)
SACB: Sir Arthur Cotton Barrage
SACB
EAST GODAVARI
WEST GODAVARI
Polavaram
Seethanagaram
Thallapudi
Kovvuru
Chagallu
Rajahmundry
Dowleshwaram
Kadiam
Yeleshwaram
Gollaprolu
Pithapuram
Kothapalli
Samalkota
Samalkota canal
Bikkavolu
Pedapudi
Kakinada
Kakinada canal
Anaparthi
Mandapeta canal
Mandapeta
Rayavaram
Karapa
RCPuram
Coringa canal
Injaram canal
Teki drain
Thallarevu
Godavari eastern bank canal
Gowthami
I.Polavaram
Amalapuram main canal
Ambajipeta
Amalapuram
Katrenikona
Uppalaguptam
Allavaram
Godavari
Razole
Malkipuram
Vasista
Narasapuram
Mogalturu
Bhimadole
Tadepalligudem
Unguturu
Pentapadu
Undrajavaram
Tanuku
Peravali
Eluru
Nidamarru
Ganapavaram
Attili
Ragavaram
Penugonda
Penumantra
Achanta
Akiveedu
Undi
Veeravasaram
Palakollu
Kalla
Bhimavaram



BHIMA LIFT IRRIGATION PROJECT
(Mahabubnagar)
Legend
Canals
Ayacut under lift - I
Ayacut under lift - II
Rivers
Shankarasamudram (BR), 1.818 TMC
Yenukunta (BR), 0.118 TMC
Shankarasamudram LMC (97 Kms)
Rangasamudram (BR)
1.895 TMC
97 Kms
81 Kms
Rangasamudram Canal
29 Kms
Yenukunta Canal
Ookachettivagu
Project
Shankarasamudram
RMC (39 Kms)
Location of
lift - II
KRISHNA RIVER
Jurala Project
Budpur
LMC
37.80 Kms
Sangambanda
LMC (45 Kms)
Budpur (BR)
1.313 TMC
Budpur RMC (16 Kms)
Location of
lift - I
Peddavagu
Sangambanda (BR)
3.317 TMC
Sangambanda
RMC (24.40 Kms)
KRISHNA RIVER
Bhima River
BR - Balancing Reservoir
LMC - Left Main Canal
RMC - Right Main Canal
Location of lift-I : Panchadevapadu(V), Atmakur (M)
Location of lift-II : Ramanpadu(V), Wanaparthy(M)
Water allocated : 20 TMC
Ayacut under lift - I : 1,11,000 Acres
Ayacut under lift - II : 92,000 Acres
Total : 2,03,000 Acres
Stabilisation under Shankarasamudram &
Rangasamudram tanks: 4000 acres

# JURALA &
# RAJOLIBANDA DIVERSION SCHEME (RDS)
## (Mahabubnagar)

JURALA

| | |
|---|---|
| Year of starting construction | : 1981 |
| River | : Krishna |
| Location | : Revulapally (V) Dharoor (M) |
| Water allocated | : 17.84 TMC |
| Storage capacity | : 11.94 TMC |
| Notified ayacut | : 1,02,200 Ac |
| Left canal length | : 85.28 kms |
| Right canal length | : 46.30 kms |




RDS: Rajolibanda Diversion Scheme
PJP LMC: Priyadarshini Jurala Project Left Main Canal
Cumec: Cubic Meter per Second
MCM: Million Cubic Meters
1 TMC = 28.317 MCM
1 Cumec = 35.32 Cusecs

**Legend**

- Rivers (blue)
- Canals (red)
- Jurala Ayacut (yellow)
- RDS Ayacut (green)

RDS

| | |
|---|---|
| Year of starting construction: | 1946 |
| River: | Tungabhadra |
| Location: | Rajolibanda (V), Karnataka |
| Water allocated: | 17.1 TMC (AP - 15.9, Karnataka - 1.2) |
| Water utilisation by AP: | 7.26 TMC |
| Length of main canal: | 142.9 Km (100.4 Km in AP) |
| Notified ayacut: | AP - 87500 Ac, Karnataka - 5879 Ac |

# NETTEMPADU LIFT IRRIGATION PROJECT
## (Mahabubnagar)




KALWAKURTHY LIFT IRRIGATION SCHEME
(Mahabubnagar)
Jadcherla
Kalwakurthy
Dindi River
Dindi Reservoir
Bijnepalli
Nagarkurnool
Gopalpet
Gudipalligattu BR
(0.96 TMC)
FRL +502.00
Km 42.80
Achampet
Jonnalabogada BR
(2.14 TMC)
FRL +407.00
Km 26.40
Lingal
Singotam BR
(0.55 TMC)
FRL +333.80
Km 16.00
Yellur BR
(0.35 TMC)
FRL +333.80
Km 2.00
Kollapur
Veepanagandla
KRISHNA RIVER
BR: Balancing Reservoir
Location: Regumanigedda of Yellur (V)
Kollapur (M)
Water allocated: 25 TMC
Ayacut: 3.4 lakh acres
Main canal length: 206.6 Kms
Legend
Roads
River/Reservoir
Canal
Ayacut


KURNOOL - KADAPA (KC) CANAL
Sunkesula Anicut
TUNGABHADRA
KRISHNA RIVER
KRISHNA RIVER
KURNOOL
Handri River
Lock in Sula Km 120.19
Nippulavagu
Galeru
Legend
Canals/ Channels
River
Santajutur Anicut at Km 150.56
Bandi Atmakur Channel at Km 156
Nandyal
Km 170.00
Revanur Channel
Nunipalli Channel at Km 173.90
Sirvella Channel at Km190..
Harivaram Channel
Km 190.00
Km 210.00
Year of starting construction: 1863
Location: Sunkesula (V), Kurnool (dt)
Water allocated: 39.9 TMC
Main canal length: 306 Kms
Ayacut: Kurnool - 1.74 lakh acres
Kadapa - 0.92 lakh acres
Allagadda
Kundu River
PENNA
Rajoli Anicut at Km 234.64
Chitravathi River
PENNA
Chapadu Channel (Length=40.70 KM)
Kundu River
Km 265.00
Mydukur
Mydukuru Channel
Adinimmayapalli Anicut At Km 290.22
Papagni River
PENNA
Km 305.60
Kadapa Tank
KADAPA


TELUGUGANGA PROJECT
(Kurnool, Kadapa, Nellore, Chittoor)
KRISHNA
KRISHNA
TUNGABHADRA
GUNTUR
Srisailam project
Gundlakamma
Head Regulator at Pothireddypadu
Banakacharla cross regulator
KURNOOL
Velugodu (BR) (16.95 TMC)
PRAKASAM district
Musi
ONGOLE
SRBC
SR NO-I(2.13 TMC)
SR NO-II(2.44 TMC)
Paleru
Manneru
SPVBR(17 TMC)
Kundu River
Porumamilla Tank
PENNA
Somasila Dam (78 TMC)
PENNA
PENNA
KADAPA
NELLORE
BAY OF BENGAL
Chitravathi
Kandaleru Reservoir (68 TMC)
ANANTHAPUR district
Mandavya River
Pullageru
Gundaleru
Bahuda
Pincha
Papagni
ANDHRA PRADESH
ANDHRAPRADESH
KP Canal
KARNATAKA
CHITTOOR
MADRAS
Poondi Reservoir (2.75 TMC)
TAMILNADU
Legend
Proposed ayacut
Rivers & Reservoirs
Canals
State boundary
District boundary
BR: Balancing Reservoir
KP Canal: Kandaleru - Poondi Canal
SR: Subsidiary Reservoir
SRBC: Srisailam Right Bank Canal
SPVBR: Sri Pothuluri Veerabrahmendra swamy Balancing Reservoir
Year of starting construction: 1983
Location: Pothireddypadu Head Regulator
Water utilisation: Irrigation - 59 TMC
(29 TMC from Krishna flood waters &
30 TMC from Pennar flood waters),
Drinking water supply for Chennai - 15 TMC
Main canal length: 433.25 Kms
Ayacut: 5.75 lakh acres(Nellore - 2,54,000 ,
Chittoor - 46,000, Kadapa - 1,67,000
Kurnool - 1,08,000)


HANDRI - NEEVA SUJALA SRAVANTHI (HNSS)
(Kurnool, Kadapa, Ananthapur, Chittoor)
KRISHNA
KRISHNA
HNSS Point Malyala
TUNGABHADRA
Srisailam Reservoir
KURNOOL
Malyala
HNSS Canal
Pattikonda
Hagari River
Guntakal
Uravakonda
Penna River
MPR
Mylavaram Dam
PABR
ANANTHAPUR
HNSS Canal
Chitravathi
KADAPA
Papagni River
Kadiri
Penna River
Cheyyeru
Mandavya River
Piler
Madanapalli
Punganur
CHITTOOR
Palamaner
Neeva River
Km 610.70
Kuppam
Legend
State Border
District Border
HNSS Canal
River
Location: Malyala (V), Kurnool (District)
Water utilisation: 40 TMC
Main canal length: 610 Kms
Ayacut: 6,02,500 acres (Kurnool - 80,000; Kadapa - 37,500; Chittoor - 1,40,000; Ananthapur - 3,45,000)
MPR: Mid Pennar Reservoir
PABR: Penna - Ahobilam Balancing Reservoir


GALERU - NAGARI SUJALA SRAVANTHI (GNSS)
(Kadapa, Chittoor, Nellore)
KRISHNA
Srisailam Reservoir
Pothireddypadu
Head Regulator
KURNOOL
Gorakallu
Reservoir
(12.44 TMC)
Owk Reservoir
(4.31 TMC)
Gandikota
Reservoir (26.85 TMC)
Legend
Canals
Ayacut
Rivers
District boundary
State boundary
ONGOLE
BAY OF BENGAL
Vamikonda
Reservoir
(1.6 TMC)
Sarvarajasagar
(3.06 TMC)
KADAPA
PENNA
NELLORE
Durgamsagar
Velikondasagar
Krishnasagar
Sri Balaji Reservoir(3.0 TMC)
Padmasagar (0.45 TMC)
Srinivasasagar (0.448 TMC)
Nagari
CHITTOOR
Location: Pothireddypadu Head Regulator
Water utilisation: 38 TMC
Main canal length: 338.021 Kms
Ayacut: Kadapa - 1,55,000 Ac
Chittoor - 1,03,500 Ac
Nellore - 1500 Ac


SRISAILAM RIGHT BANK CANAL(SRBC)
(Kadapa, Kurnool)
KRISHNA
Srisailam Dam
Pothireddypadu Head Regulator
Dornala
KURNOOL
Banakacharla Cross Regulator
Teluguganga Canal
Velugodu BR (16.95)
Gorakallu BR (12.44 TMC)
Santhajutur
Panyam
Nandyal
Sirvella
Legend
SRBC Canal
SRBC Ayacut
Rivers/Reservoirs
Roads
Owk BR (4.31 TMC)
Banaganapalle
Kunderu
Allagadda
PENNA
Mylavaram Dam
Proddaturu
Maidukuru
PENNA
Papagni
Location: Pothireddypadu Head Regulator
Water allocated: 19 TMC
Main canal length: 199 Kms
Ayacut: Kurnool - 1.67 lakh acres
Kadapa - 0.23 lakh acres
BR: Balancing Reservoir


VELIGONDA PROJECT
(Prakasam, Nellore, Kadapa)
KRISHNA
Nagarjuna sagar Dam
GUNTUR district
Srisailam Dam
KRISHNA
Teegaleru Canal
Erragondapalem
Vinukonda
KURNOOL district
Tunnel 18.00 Kms
Dornala
FFC
Markapur
Darsi
Addanki
Nallamala sagar
Rallavagu
Cumbum Tank
PRAKASAM district
Turimella
Gundla Brahmeswara
Podili
ONGOLE
Nandyal
Racherla Tank
Kanigiri
Western Branch Canal
22.70 Kms
Eastern Canal
Komarolu
Kandukuru
Pamuru
Km 199.90
Peddireddipalli
Porumamilla
Sitaramapuram
Gandipalem
BAY OF BENGAL
Udayagiri
Kavali
KADAPA district
Udayagiri Branch Canal
Vinjamur
NELLORE district
PENNA RIVER
Kanigiri Reservoir
Legend
Canals
Rivers
Ayacut
Addl Ayacut
Reservoirs
Nallamala sagar: 53.85 TMC
Turimella Reservoir: 2.45 TMC
Peddireddypalli Reservoir: 2.02 TMC
Gundla Brahmeswara: 0.415 TMC
Location: Kollamvagu
Water utilisation: 43.5 TMC
Eastern canal: 199.90 Kms
Teegaleru canal: 48.30 Kms
Western branch canal: 22.7 Kms
Udayagiri branch canal: 17.5 Kms
Flood Flow Canal (FFC): 21 Kms
Ayacut: Prakasam - 3,36,100 acres
Nellore - 84,000 acres
Kadapa - 27,200 acres

# NAGARJUNASAGAR LEFT BANK CANAL

## (Nalgonda, Khammam, Krishna, West Godavari)




Legend

River
NSP LBC canal
Musi canal
NSP LBC ayacut
Musi ayacut

BC: Branch Canal
(M): Major
NSP LBC: Nagarjunasagar Project Left Bank Canal
WR: Wyra Reservoir

NSP LBC

Year of starting construction : 1955
River : Krishna
Location of NSP: Nandikonda (V), Peddavura (M) Nalgonda (District)
NSP Reservoir storage capacity: 408.24 TMC
Water allocated to NSP: 281 TMC
Water allocated to NSP LBC: 132 TMC
Canal length : 179 kms

| | | |
|---|---|---|
| Ayacut of NSP LBC: | Nalgonda - | 3,81,022 Ac |
| | Khammam - | 2,76,633 Ac |
| | Krishna - | 3,70,681 Ac |
| | West Godavari - | 2,244 Ac |
| | Total - | 10,30, 580 acres |

MUSI (Nalgonda)

| | |
|---|---|
| Year of starting construction | : 1954 |
| River | : Musi |
| Storage capacity | : 4.34 TMC |
| Notified Ayacut | : 30,183 acres |
| Left canal length | : 41.75 kms |
| Right canal length | : 33.80 kms |


NAGARJUNASAGAR RIGHT BANK CANAL
(Guntur, Prakasam)
Nagarjuna Sagar Dam
KRISHNA
Dachepalli
Machavaram
Gurazala
Piduguralla
Bellamkonda
Karampudi
Sattenapalle
Nagarjuna Sagar Right Canal
Guntur Branch Canal
Rompicherla
Narasaraopet
Prathipadu
Santhamaguluru
Chilakaluripet
Pedanandipadu
Vinukonda
Addanki Branch Canal
Tripuranthakam
Martur
Kakumanu
Kurichedu
Inkollu
Addanki
Darsi
Chimakurthi
Ongole Branch Canal
Ongole
Santhanuthalapadu
Kothapatnam
Legend
River
Canal
Ayacut
Year of starting construction: 1955
Location of NSP: Peddavura (V)
Nalgonda (District)
Water allocated to NSP RBC: 132 TMC
Length of main canal: 203 Kms
Notified ayacut of NSP RBC: Guntur - 6,68,541 acres
Prakasam - 4,44,729 acres

# ALIMINETI MADHAVAREDDY PROJECT(AMRP)
# SRISAILAM LEFT BANK CANAL (SLBC)
## (Nalgonda)




Legend

| | |
|---|---|
| NSP LBC Ayacut | |
| AMRP Ayacut | |
| Rivers | |
| Canals | |
| Musi Ayacut | |
| Roads | |

R: Reservoir
BR: Balancing Reservoir
SLBC: Srisailam Left Bank Canal
AMRP: Alimineti Madhava Reddy Project
NSP LBC: Nagarjuna Sagar Project Left Bank canal

Location: Gravity Scheme - Foreshore of Srisailam Reservoir
Lift Scheme - Foreshore of Nagarjunasagar Reservoir
Water allocated: 30 TMC
Canal length: Gravity scheme -185 Kms,
Lift scheme HLC -136 Kms, Lift Scheme LLC - 85 Kms
Ayacut: 2.70 lakh acres in Nalgonda district


PULICHINTHALA PROJECT
Legend
Canal:
River:
Ayacut:
Location: Pulichinthala (V)
Bellamkonda (M), Guntur (D)
Water allocated: 9 TMC
Storage Capacity: 45.77 TMC
Ayacut: Stabilisation of Krishna
delta ayacut
BAY OF BENGAL
Bhimavaram
ELURU
Kolleru
Gudivada
Machilipatnam
Avanigadda
Repalle
Tenali
Chirala
GUNTUR
Prakasam
Barrage
KRISHNA
Kattaleru
Wyra
Munneru
Paleru
Pulichinthala
Dam
NALGONDA
Dachepalli
Piduguralla
GUNTUR
district
Musi
Miryalaguda
Macherla
NSP Dam
Halia
NALGONDA
PRAKASAM
district
Gundlakamma
River
ONGOLE


KRISHNA DELTA SYSTEM
(West Godavari, Krishna, Guntur, Prakasam)
ELURU
Kolleru lake
Pedapadu
KRISHNA
Vijayawada
Gannavaram
Kaikaluru
Mandavalli
Unguturu
Nandivada
Kalidindi
Prakasam Barrage
Thadepalli
Penamaluru
Gudivada
Kankipadu
Mudinepalli
Vuyyuru
Gudlavalleru
Bantumilli
Pedakakani
Duggirala
Pamarru
Pamidimukkala
Kollipara
Tenali
Pedana
Movva
Gudur
Chebrolu
Machilipatnam
Vemuru
Kollur
Ghantasala
Tsundur
Amruthalur
Challapalli
Bhattiprolu
Kakumanu
Ponnur
Cherukupalle
Mopidevi
Nagaram
Avanigadda
Koduru
Pittalavanipalem
Repalli
Nagayalanka
Karlapalem
Karamchedu
Bapatla
Nizampatnam
PRAKASAM
Chirala
Vetapalem
Chinaganjam
Legend
River
Canals
Ayacut
Year of starting construction: 1852
Location: Vijayawada
Storage capacity: 3.071 TMC
Water allocated: 181.20 TMC
Eastern main canal length: 370 Kms
Western main canal length: 322 Kms
Notified ayacut:
West Godavari: 58,000 Ac
Krishna: 6,79,498 Ac
Guntur: 4,99,231 Ac
Prakasam: 72,120 Ac
Total: 13,08,849 Ac


INTERLINKING OF RIVERS
HIMALAYAN COMPONENTS
1. Kosi - Mechi
2. Kosi - Ghagra
3. Gandak - Ganga
4. Ghagra - Yamuna
5. Sarada - Yamuna
6. Yamuna - Rajasthan
7. Rajasthan - Sabarmati
8. Chunar - Sone Barrage
9. Sone dam - Southern tributaries of Ganga
10. Manas - Sankosh - Teesta - Ganga
11. Jogighopa - Teesta - Farakka (Alternate)
12. Farakka - Sunderbans
13. Ganga (Farakka) - Damodar - Subernarekha
14. Subernarekha - Mahanadi
Sarada
Ghagra
Gandak
Yamuna
Mechi
Teesta
Sankosh
Manas
Kosi
Brahmaputra
Ganga
Ghagra
Gomti
Luni
Chambal
Ganga
Barak
Sabarmati
Kalisindhi
Parbati
Betwa
Ken
Sone
Damodar
Suvarnrekha
Narmada
Mahanadi
Tapi
Luni
Ganga
Ghagra
Gomti
Ganga
Brahmaputra
Barak
Chambal
Kalisindhi
Parbati
Betwa
Ken
Sabarmati
Damodar
Suvarnarekha
Narmada
Mahanadi
Tapi
Wainganga
Par
Penganga
Godavari
Manjira
Godavari
Krishna
Pennar
Cauvery
Palar
Vaigai
Vaippar
PENINSULAR COMPONENTS
1. Mahanadi - Dowleshwaram (G)
2. Ichampalli (G) - Nagarjunasagar (K)
3. Ichampalli (G) - Pulichintala (K)
4. Polavaram (G) - Vijayawada (K)
5. Almatti (K) - Pennar
6. Srisailam (K) - Pennar
7. Nagarjunasagar (K) - Somasila (P)
8. Somasila (P) - Palar - Cauvery
9. Cauvery - Vaigai - Gundar
10. Ken - Betwa
11. Parbati - Kalisindh - Chambal
12. Par - Tapi - Narmada
13. Damanganga - Pinjal
14. Bedti - Varda
15. Netravati - Hemavati
16. Pamba - Achankovil - Vaippar
G: Godavari
K: Krishna
P: Penna


VAMSADHARA PROJECT
(Srikakulam)
Katragada
Neradi
Neradi Barrage
Singidi BR
FFC
ORISSA
Kotturu
Link canal
Parapuram BR
Km 34.00
Hiramandalam BR
Gotta Barrage
Hiramandalam
SC
HLC
LMC
Km 104.240
Palasa
LMC
Tekkali
Sarubujjili
Km 30.00
Jalumuru
Kotabommali
YPB OHC
RMC
Narsannapeta
Amadalavalasa
Nagavali River
Gara
SRIKAKULAM
Km 55.00
Singidi BR:0.069 TMC
Parapuram BR:0.404 TMC
Hiramandalam BR:19.05 TMC
Location: Gotta (V), Hiramandalam (M)
Water allocated: 35.23 TMC
(Stage - I: 17.84, Stage - II: 17.39)
Left Main Canal : 104.24 Kms
Right Main Canal: 55 Kms
Flood Flow Canal: 34 Kms
High Level Canal: 30 Kms
Ayacut:
Stage - I : 1,48,230 Ac
Phase - I of Stage - II : 62,280 Ac
Phase - II of Stage - II: 45,000 Ac
Legend
Completed:
On going:
New:
River:
Canal:
State Boundary:
YPB OHC: Yeragam Purushottapuram Bhairi Open Head Channel
LMC: Left Main Canal; RMC: Right Main Canal
BR: Balancing Reservoir; FFC: Flood Flow Canal; SC: Surplus Channel


SOMASILA PROJECT (Nellore)
Location: Somasila (V), Ananthsagaram (M)
Storage capacity: 78 TMC
Water utilisation: 48.528 TMC
South canal: 76.20 Kms
North canal: 73 Kms
Kavali canal: 67.5 Kms
Ayacut:
Stabilisation - 2,75,000 Ac (Under Pennar Delta System)
New ayacut - 1,39,000 Ac
Legend
River/ Reservoirs
Existing Irrigation
New Irrigation Canals
District Boundary
Railway Line
Roads
KR: Kanigiri Reservoir
AT: Ananthasagaram Tank
VT: Venkatachalam Tank
NFC: North Feeder Channel
SFC: South Feeder Channel
Kavali
NELLORE
KR
Duvvuru
Kaligiri
Sangam Anicut
Podalakuru
Kanupur Canal
Gudur
VT
Adurupalli
Atmakur
PENNA
Kandaleru Reservoir
NFC
SFC
Teluguganga Flood Flow Canal
Kandaleru
Rapur
Duttaluru
Udayagiri
AT
Somasila Dam
Sitaramapuram
Badvel
Porumamilla
Paluguralläpalli
Siddavatam
KADAPA district

# కార్పొరేట్ సేద్యానికేనా జల 'సంరక్షణ'?

మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారికి కొన్ని ప్రాథమిక సత్యాలు కూడా చెప్పవలసి వస్తున్నది.

నీళ్లంటే ఆయన భూగర్భ జలాలేనని ఎందుకు అనుకుంటున్నారు? నీటిని జాగ్రత్త చేయడమంటే భూమిలోకి పంపించడమేనని ఎందుకు అనుకుంటున్నారు? చెరువంటే ఊట చెరువేనని ఎందుకనుకుంటున్నారు? నీళ్లు ఏ కొంచెం ఆవిరైనా ఏ కొంచెం సముద్రంలోకి పోయినా అది 'వృథా' యేనని ఎందుకు అనుకుంటున్నారు.?

కురిసిన వర్షం కొంత నేలలోనికి ఇంకుతుంది. కొంత నేలమీద మట్టిలో నిలుస్తుంది. కొంత ఆవిరి అవుతుంది. కొంత సముద్రంలో కలుస్తుంది. సముద్రంలో కలిసినది మళ్లీ ఆవిరి అవుతుంది. ఆవిరి అయినది గాలిలో తేమ అవుతుంది. తిరిగి వర్షమవుతుంది. భూమిలోకి ఇంకినది తిరిగి నేలపైకి (మానవ పరిశ్రమ ఫలితంగా) వచ్చి నేలమీది మట్టిని తడుపుతుంది. మొక్కలకు, మనుషులకు ప్రాణం పోస్తుంది. తిరిగి మట్టినుండి, మొక్కలనుండి, మనుషుల ఒంటిమీది స్వేద బిందువులనుండి ఆవిరి అవుతుంది. మళ్లీ వర్షమవుతుంది.



ఇదొక 'సైకిల్'. దీనిని ఎక్కడో ఒకచోట తెంపేస్తే ఏమవుతుందో చెప్పడం కష్టం. ప్రపంచంలోని మనుషులంతా ఒక్క మనసుతో ప్రతీ వర్షంనీటి చుక్కనూ నేలలోకి తొక్కేసి ఆవిరికాకుండా, సముద్రంలో కలవకుండా చేసేస్తే సముద్రాలేమవుతాయో, చేపల వంటి సముద్ర జీవులేమవుతాయో, గాలిలో తేమ తగ్గిపోయి ఋతుపవనాలేమవుతాయో చెప్పడం అంత సులభం కాదు. మానవ మనుగడపైన దాని ప్రభావం ఎలా ఉంటుందో కూడా చెప్పడం కష్టం.

భగ్నమయిన వాతావరణ సమతుల్యాన్ని పునరుద్దరించే ప్రయత్నంలో భాగంగా వాటర్‌షెడ్లకు సంబంధించిన ఆలోచన పుట్టింది. వ్యవసాయాన్ని ప్రకృతిపైన దాడిగా భావించే కార్పొరేట్ పెట్టుబడిదారీ దృక్పథానికి దానిని అనుసంధానం చేయాలని చంద్రబాబునాయుడు ప్రయత్నిస్తున్నాడు. వాటర్‌షెడ్ల ద్వారా భూగర్భ జలాలను పెంపొందించాలనీ, ఒక్క చుక్కనీరు కూడా ఆవిరికాకుండా, సముద్రంలోకి పోకుండా భూగర్భ జలాశయంలోకి పోవాలనీ ఒక పక్క అంటాడు. అదే సమయంలో పాశ్చాత్య ఆగ్రోబిజినెస్ కంపెనీలను రాష్ట్రంలోకి ఆహ్వానించి, వారి ఎగుమతి దిగుమతి వ్యాపారానికి రాష్ట్ర వ్యవసాయరంగాన్ని కార్యక్షేత్రంగా మలచే వ్యవసాయ విధానాన్ని ప్రకటిస్తాడు. ఆ ఆగ్రోబిజినెస్ కంపెనీలు ఏం చేస్తాయి? విపరీతంగా నీళ్లుతాగే కొత్త వంగడాలను విస్తారంగా పండించి, లేదా రైతుల చేత పండింపచేసి ఎగుమతి చేస్తాయి. ఇప్పుడు రాష్ట్రంలోని కరువు ప్రాంతాలలో 300 అడుగుల లోతుకు (రాయలసీమలో కొన్ని చోట్ల 500 అడుగులదాకా) బోర్లు వేయిస్తున్నారు. చంద్రబాబు ఆహ్వానిస్తున్న కార్పొరేషన్లు ఇంకొక 100, 200, 300 అడుగుల లోతుకు బోర్లువేసి అయిదేళ్లు కష్టపడి కాపాడిన వాటర్‌షెడ్ ఫలితాన్ని ఒక కారు పంటకోసం పీల్చేయగలవు.

అప్పుడేమి చేయాలంటే ఇంకా ఇంకా చెట్లు పెంచాలి. ఎక్కడ ఖాళీ జాగా దొరికితే అక్కడ చెట్లు పెంచి వర్షం ఇంకా బాగా పడేటట్లు చూడాలి. అలా పడిన వర్షమంతా భూగర్భ జలాశయంలోకి పోయేటట్టు చూడాలి. మళ్లీ లోతుగా బోర్లువేసి ఆ నీటి నంతటినీ ఒక రివర్స్ జలపాతంలాగా పైకి లాగేసి విపరీతంగా నీళ్లుతాగే ఎగుమతి బ్రాండు వ్యవసాయ ఉత్పత్తులు చేపట్టి కార్పొరేషన్ల ద్వారా ఎగుమతి చేసి....

ఇది ఆధునీకరణ ఉన్మాదం. ఆధునీకరణ వల్ల దెబ్బతిన్న పర్యావరణాన్నీ, నేలకింద ఉన్న నీటి వనరులనూ, నేలమీద మట్టినీ, చెట్లనూ కాపాడి ప్రకృతికీ మనిషికీ స్నేహ సంబంధాన్ని పునరుద్ధరించడం కోసం పుట్టిన పర్యావరణ పరిరక్షణ ఉద్యమాన్ని- అందులో భాగమైన జల సంరక్షణ ఉద్యమాన్ని- అదే ఉన్మాదానికి బలిపెట్టే వ్యవసాయ విధానం చంద్రబాబుది.

నీళ్లంటే భూగర్భ జలాలు మాత్రమే కాదు. ఉపరితల జలాలు కూడా. నీటితో మనిషికి స్నేహ సంబంధమున్న రోజులలో రెండింటినీ సమతూకంగా వాడుకున్న సమర్థమైన సాగునీటి వ్యవస్థ ఉంది. తెలంగాణలోనూ, రాయలసీమలోనూ చక్కటి చెరువుల వ్యవస్థ ఉండేది. చెరువులు ఇప్పటికీ ఉన్నాయిగానీ అవి చాలావరకు శిథిలమయి ఉన్నాయి. ఉన్నమేరకు 'వ్యవస్థ'గా లేవు. ఒక చెరువు అలుగు పారితే మరో రెండు చెరువులలోనికీ, వాటి అలుగులు పారితే ఇంకొక మూడు చెరువులలోనికీ నీరు చేరే

వ్యవస్థ ఉండేది. ఇప్పుడు చెరువులన్నీ పూడిపోయి క్రికెట్ మైదానాలలాగా ఉన్నాయి. కట్టలు పాడయి, నిలిచిన కొద్దినీరు అలుగు మీదనుండే కాక కట్టకింది నుండి కూడా పలుదిక్కుల ప్రవహిస్తున్నాయి. అలుగు పారిన నీటిని కింది చెరువులోకి చేర్చే కాలువలు పాడవడం వల్ల నీరు అస్తవ్యస్తంగా ప్రవహించి కింది చెరువులలోకి చేరడం లేదు.

యాభై ఏళ్లుగా ఈ చెరువుల గురించి పట్టించుకున్న ప్రభుత్వమేదీ లేదు. జలసంరక్షణ గురించి ఇంత పెద్దఎత్తున ఇప్పుడు ప్రచారం జరుగుతున్నది కదా – ఇప్పుడయినా చెరువుల వ్యవస్థను బాగుచేసే ఆలోచన చేయొచ్చు కదా? పూర్వపు స్థాయికి వాటిని తీసుకువచ్చినట్లయితే కురిసిన వర్షం ప్రతీ చుక్కా కాకపోయినా చాలాభాగం చెరువులలో నిలుస్తుంది. భూగర్భ జలాల ఊట పెంచడానికి పనికొస్తుంది. తూముల ద్వారా పారించుకుని పంటలు పండించుకోవడానికీ పనికొస్తుంది.

చెరువు నీళ్లందని ప్రాంతాలుంటాయి. చెరువులే లేని గ్రామాలు కూడా ఉంటాయి. వాటికి బావినీళ్లే శరణ్యం కాబట్టి బావులలో ఊటపెంచే జలసంరక్షణ విధానాలు అక్కడ అవలంబించవచ్చు. శతాబ్దాలుగా చెరువులు, బావుల (ఉపరితల, భూగర్భ జలాల) సమన్వయం ద్వారానే వ్యవసాయం నడచింది తెలంగాణ, రాయలసీమలలో. ఇప్పుడు అకస్మాత్తుగా నీళ్లంటే భూమి లోపలివే ఎందుకయ్యాయి? నీటిని వినియోగం కోసం భద్రపరచడమంటే భూగర్భ జలాశయాలలో భద్రపరచడమే ఎందుకయింది?

చెరువుల కింద ఆగ్రోబిజినెస్ కార్పొరేషన్లు వ్యవసాయ వ్యాపారం చేపట్టడం కష్టం. కొన్ని వందల ఎకరాలు లీజుకు తీసుకుని (దీనికోసం భూమి గరిష్ఠ పరిమితి చట్టాలను సవరించాలన్నది చంద్రబాబు వ్యవసాయ విధానంలోని ఒక ముఖ్య ప్రతిపాదన), ఎరువులు సమృద్ధిగా వేసి నీళ్లు సమృద్ధిగా పారించుకుని విదేశాలలో బాగా అమ్ముడుపోయే మేలురకం వ్యవసాయ ఉత్పత్తులు చేపట్టడం చెరువుల కింది వ్యవసాయంలో సాధ్యం కాదు. కావలసినన్ని చోట్ల బోర్లు వేసుకుని భూగర్భ జలాలను పెద్దమొత్తంలో పీల్చుకుంటేనే సాధ్యం అవుతుంది. దానికి కాకతీయుల, రాయల కాలం నాటి చెరువుల వ్యవస్థ అక్కరలేదు. చెరువులన్నీ ఊటచెరువులుగా మారిపోవాలి, బోర్లకు నీళ్లు అందించాలి. వాగులు, వంకలు చెరువులలోకి నీళ్లు చేరవేయనక్కరలేదు. నేలలోకి చేరవేయాలి. బోర్లకు అందివ్వాలి.

చెరువుల వ్యవస్థను లెక్కలోకి తీసుకోకుండా వాటర్‌షెడ్ల కోసం చెక్‌డ్యాంలు కట్టడం వల్ల ఇప్పటికే సగం ఎండిపోయిన చెరువులు పూర్తిగా ఎండిపోతున్నాయన్న ఫిర్యాదు వినవస్తున్నది. మహబూబ్‌నగర్ జిల్లా నాగర్‌కర్నూల్ దగ్గర కేసరిసముద్రం అనే చెరువు ఉంది. అది అయిదు చెరువుల వ్యవస్థలో ఒకటి. విపరీతమైన పూడిక వల్ల, కట్ట

పాడుకావడం వల్ల అసలే పనికి రాకుండా పోతున్న ఆ చెరువులోకి నీళ్లు చేరవేసే ఒర్రెలు వాటర్‌షెడ్లలో భాగమైపోవడం వల్ల అసలే అందులోకి నీళ్లు రావడం లేదన్న ఫిర్యాదు ఉంది.

చెరువు ఆయకట్టులో ఉన్న రైతులు ఖర్చులేకుండా సాగునీరు పొందగలరు. బావులు ఖర్చుతో కూడుకున్న పని. నిజానికి బోర్లు వచ్చిన తర్వాత బావులనేవి కేవలం అలంకారప్రాయమే కాబట్టి భూగర్భ జలాలు ఉపయోగించుకోవాలంటే బోర్లు వేసుకోవాలి. మోటార్లు పెట్టుకోవాలి. పెరుగుతున్న కరెంట్ ఛార్జీలు కట్టుకోవాలి. కార్పొరేట్ వ్యవసాయం రంగప్రవేశం చేసిన తర్వాత వాళ్లు వేసినంత లోతుగా వేరెవరూ బోర్లు వేయలేరు. కాబట్టి భూగర్భ జలాలన్నీ వారివే. కరెంట్ ఉత్పత్తికయ్యే ఖర్చు మొత్తం వినియోగదార్లే పెట్టుకోవాలనే ప్రపంచబ్యాంకు నియమాన్ని మన పాలకులే మొట్టమొదటగా అమలు చేస్తున్నారు కాబట్టి కార్పొరేషన్లు, వారి కనుసన్నలలో వ్యవసాయం చేసే ధనిక రైతులు తప్ప వేరే ఎవరూ బోర్లు వేసుకునే స్థితిలో – భూగర్భ జలాశయాలలోని నీటిని వ్యవసాయంకోసం వాడుకునే స్థితిలో– ఉండబోరు. చెరువుల వ్యవస్థను పునరుద్ధరించి, దానికి పోటీగానో, ప్రత్యామ్నాయంగానో కాక అనుబంధంగా భూగర్భ జలసంరక్షణ చేపట్టి లోతయిన బోర్లు ఎవ్వరూ వేయడానికి వీలులేదన్న చట్టం చేసినట్లయితే చాలా భిన్నమైన సామాజిక చిత్రం కనిపిస్తుంది. అయితే అందులో 'విజన్– 2020' నమూనా ఆధునీకరణకు చోటు అంతగా ఉండకపోవచ్చు.

ఆంధ్రప్రభ దినపత్రిక
8 జూన్ 2000



# బచావత్ తరువాత : ఒక ప్రతిపాదన

బచావత్ అవార్డు గడువు తీరిపోయి ఒక సంవత్సరం కావస్తున్నది. కృష్ణా నదీజలాలను ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలు ఏ ప్రాతిపదికపైన పంచుకోవాలో చెప్పిన అవార్డు బచావత్ అవార్డు. ఆ అవార్డు గడువు తీరిపోయేంతవరకు మూడు రాష్ట్రాలు దానికి కట్టుబడి ఉండాలి. ఏ రాష్ట్రమయినా దానిని ఉల్లంఘిస్తే తక్కిన రెండు రాష్ట్రాలు సుప్రీంకోర్టులో కేసు వేయవచ్చు. సుప్రీంకోర్టు తగురీతిలో అవార్డును అమలు చేయించగలదు. 'ఆల్మట్టి' విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కర్ణాటక ప్రభుత్వంపైన సుప్రీంకోర్టులో కేసు వేసిన సంగతి తెలిసిందే.



అవార్డు గడువు దాటిపోయిన తరవాత, వాళ్లే కొత్త ఒప్పందం చేసుకునేంతవరకు మూడు రాష్ట్రాలు పాత అవార్డుకు కట్టుబడి ఉండడం ఒక సత్‌సంప్రదాయం. అయితే శాశ్వతంగా అదే అవార్డును కొనసాగించనక్కరలేదు. కొత్త ఒప్పందం చేసుకోవచ్చు. చర్చల ద్వారా అది సాధ్యం కానట్టయితే కేంద్ర ప్రభుత్వానికి అర్జీ పెట్టుకొని అంతర్రాష్ట్ర జల వివాదాల చట్టం కింద మరొక ట్రిబ్యునల్‌ను (బచావత్ ట్రిబ్యునల్ లాంటిది) నెలకొల్పమని అడగవచ్చు. ఈ సంవత్సర కాలంలో ఇవి రెండూ జరగలేదు.

బచావత్ ట్రిబ్యునల్ గడువు తీరిపోయిన వెంటనే, కొత్త ఒప్పందానికి తాను సిద్ధమేనని కర్ణాటక ముఖ్యమంత్రి ప్రకటించాడు. తరువాత దానిని పునరుద్ఘాటించాడు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి కూడా అటువంటి ప్రకటన చేశాడు.

మళ్లీ ఇంకొక ట్రిబ్యునల్ ఏర్పాటు చేసుకొనే బదులు మూడు రాష్ట్రాలూ చర్చల ద్వారా ఒప్పందం ఏర్పరచుకోవడమే మేలయిన పద్ధతి. న్యాయమూర్తులు సాంకేతిక సంప్రదాయాలకూ, వ్యక్తిగత ఆస్తి తగవుల పరిష్కారం కోసం పుట్టిన సివిల్ చట్టాల న్యాయశాస్త్ర సూత్రాలకూ బానిసలు. ఉమ్మడి ప్రజావసరమైన నదీజలాల పంపకం పరస్పర అవగాహనతో కూడిన ఇచ్చిపుచ్చుకునే వైఖరితో జరగడమే సరయిన పద్ధతి కాబట్టి అది న్యాయమూర్తుల ఆధ్వర్యంలో కాక సంబంధిత ప్రజలు, ప్రభుత్వాల మధ్య చర్చల రూపంలో జరగడమే మంచిది.

అందువల్ల కర్ణాటక ముఖ్యమంత్రి ప్రకటనకు మన ముఖ్యమంత్రి స్పందించి వుంటే బాగుండేది. కానీ ఈయన సంవత్సరం గడిచినా మాట్లాడడం లేదు. దీనికి రెండు కారణాలు వుండవచ్చు. బచావత్ అవార్డు పట్ల ఆంధ్రప్రదేశ్‌కు వున్న సదభిప్రాయం మొదటి నుండి కర్ణాటకకూ మహారాష్ట్రకూ లేని సంగతి తెలిసిందే. ఆ అవార్డు తమకు పూర్తి న్యాయం చేయలేదని వారి అభిప్రాయం. ఆ అభిప్రాయం న్యాయమైనదా అన్యాయమైనదా అన్నది ఇక్కడ ప్రశ్న కాదు. ఆ అభిప్రాయం వుండబట్టే కర్ణాటక, మహారాష్ట్రలు బచావత్ అవార్డు గడువు తీరిపోయిన వెంటనే కొత్త ఒప్పందానికి సిద్ధమని ప్రకటించి వుండవచ్చును. ఆ కారణంగానే మన ముఖ్యమంత్రి స్పందించకుండా వున్నాడేమో. ఊరుకుంటే 'మనకు' అనుకూలంగా వున్న బచావత్ తీర్పే అమలవుతూ వుంటుందనుకుంటున్నాడేమో.

లేదా, కృష్ణానది నీటి వినియోగం సమస్యను మళ్లీ చర్చకు పెడితే తీగలాగితే డొంకంతా కదిలినట్టు రాష్ట్రం లోపల ఆ నది నీటి పంపకంలో జరిగిన అన్యాయం చర్చకొస్తుందని భయపడుతున్నాడేమో.

కారణమేదైనా, మన ప్రభుత్వం మౌనం సరయినది కాదు. కర్ణాటక ప్రతిపాదనకు మన ప్రభుత్వం స్పందించి, మూడు రాష్ట్రాలూ కృష్ణానది నీటి వినియోగం గురించి కొత్త ఒప్పందం చేసుకోవాలని మనం కోరవలసి వుంది. ఇది కేవలం ప్రభుత్వాల మధ్య ఒప్పందం కానక్కరలేదని దిగువన చూద్దాం. అయితే కొత్త ఒప్పందం ఎందుకు చేసుకోవాలి? బచావత్ తీర్పులో ఏం లోపం వుంది? దానినే శాశ్వతంగా కొనసాగనిస్తే వచ్చిన నష్టమేముంది?

బచావత్ ట్రిబ్యునల్ కృష్ణా నదీజలాల వివాదం పరిష్కారం కోసం అనుసరించిన పద్ధతిలో మూడు లోపాలున్నాయి. అందులో రెండు ట్రిబ్యునల్ ఎంచుకున్న పద్ధతి నుండి పుట్టాయి. మూడవది అంతర్రాష్ట్ర జలవివాదాల చట్టంలోనే వుంది. ఆ చట్టం అంతర్రాష్ట్ర నదుల నీటి విషయంలో తలెత్తే వివాదాల్ని 'రాష్ట్రాల' మధ్య వివాదాలుగానే

పరిగణిస్తుంది. 'రాష్ట్రాల' ప్రాతిపదికనే పరిష్కరిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రమే ఆ చట్టం కింద నెలకొల్పే ట్రిబ్యునల్ ముందు వాది- ప్రతివాదులు. ఆయా రాష్ట్రాలలోని ప్రాంతాల మధ్య వున్న వివాదాలు లెక్కలోకి రావు. అన్ని ప్రాంతాలకూ రాష్ట్ర ప్రభుత్వమే ప్రతినిధి అని ఆ చట్టం భావిస్తుంది.

కాగా, మిగిలిన రెండు లోపాలు జస్టిస్ బచావత్ ఎంచుకున్న పద్ధతి నుండి వచ్చాయి. బచావత్ ట్రిబ్యునల్ కృషిని కించపరచడం మా ఉద్దేశ్యం కాదు. తన ముందు ఉంచిన కర్తవ్యాన్ని జస్టిస్ బచావత్ చాలా ఓర్పుతోనూ నేర్పుగానూ నిర్వర్తించారు. ఆయన తీసుకున్న శ్రమ, ప్రదర్శించిన వివేచన ఆ నివేదిక చదివితే అర్థం అవుతుంది. అయినప్పటికి అందులో రెండు ప్రధాన లోపాలున్నాయని గుర్తించక తప్పదు. అవి రెండూ కూడా ఈ మూడు రాష్ట్రాలలోని వెనుకబడిన ప్రాంతాలకు నష్టం చేశాయి.

ఒకటి, నది నీటిని నికర జలాలు- మిగులు జలాలు అని వర్గీకరించి మిగులు జలాలకు కేటాయింపు వుండదని తీర్మానించడం. నిజానికి నికర జలం నికరమూ కాదు; మిగులు జలాలు భావనాపరంగా తప్ప వేరే ఏ అర్థంలోనూ మిగులు కాదు.

రెండు, వివాదం తన ముందుకొచ్చేసరికి స్థిరపడిపోయిన నీటి హక్కులకు భంగం కలిగించకూడదని భావించడం. ఈ వైఖరి ఆయన జడ్జి కావడం వల్ల వచ్చిందనడంలో సందేహం లేదు. ఒక ఆస్తి తగాదా కోర్టు ముందుకొచ్చినప్పుడు అప్పటికే స్థిరపడిపోయిన హక్కులకు భంగం కలిగించకూడదని బూర్జువా సివిల్ చట్టం భావిస్తుంది. నీళ్ళు వ్యక్తిగత ఆస్తి కాదు కాబట్టి దానికి ఈ సూత్రం వర్తింపజేయడం న్యాయం కాదు. ఈ మూడు లోపాలనూ కొంచెం పరిశీలించి ఇప్పుడేం చేయాలో మాట్లాడుకుందాం.

## 1. నికర జలాలు- మిగులు జలాలు

మూడు రాష్ట్రాల అవసరాల కోసం కృష్ణా నదీజలాలను ఏ విధంగా పంపిణీ చేయాలని నిర్ణయించే ముందు అసలు కృష్ణానదిలో ఏ సంవత్సరమైనా నీళ్లెంత లభ్యమవుతుందో తెలుసుకోవాలని గుర్తించిన జస్టిస్ బచావత్ ఆ పనికి పూనుకున్నారు. మనకు ఈనాటికీ ఉపయోపడే సమాచారాన్ని సేకరించారు. 100 సంవత్సరాల సమాచారాన్ని సేకరించి, 75% సంవత్సరాలలో (అంటే నాలుగు సంవత్సరాలలో మూడింటిలో) కృష్ణానదిలో 2060 టియంసిల నీరుంటుందని గుర్తించారు. ఆ 2060 టియంసిల నీటిని నికరజలాలు అన్నారు. దానిని మాత్రమే ప్రాజెక్టులకు కేటాయిస్తామన్నారు. ఏ సంవత్సరమైనా అంతకంటె ఎక్కువ నీరు కృష్ణానదిలో వుంటే దానిని మిగులు జలాలుగా

భావించాలన్నారు. దానిని ప్రాజెక్టులకు కేటాయించేది లేదనీ, వున్న ప్రాజెక్టుల ద్వారా దానిని వాడుకోవచ్చుననీ (ఆ హక్కు కూడ ఒక్క ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే ఇచ్చారు) లేకపోతే అది సముద్రంలోకి పోవలసిందే అన్నారు.

ఒక ప్రాజెక్టు కడితే దాని ఆయకట్టుదార్లయిన రైతులకు నీరు లభిస్తుందని ఆశిస్తారు. కాబట్టి కచ్చితంగా నీళ్ళుంటేనే ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వాలని భావించడం సబబేననుకుందాం. కానీ బచావత్ ట్రిబ్యునల్ 'నికర జలాలు' అని తేల్చిన 2060 టియంసిలు మాత్రం ఏ సంవత్సరమయినా కచ్చితంగా లభిస్తుందని ఎవరైనా భరోసా ఇయ్యగలరా? 75% సంవత్సరాలలో లభిస్తుంది అని సంతృప్తి కోసం చెప్పవలసిందేగానీ 2001-02 సంవత్సరంలో నా నీళ్లు నాకొస్తాయా అని ఏ రైతు అడిగినా అవునని ఎవరూ అనలేరు. అప్పుడు ఈ భావన వల్ల ఒరిగిందేమిటి? మిగిలిన 25 శాతాన్ని సముద్రంలోకి పోనివ్వడం తప్ప?

పైగా, 75% అన్న ప్రమాణం ఎందుకు ఎంచుకున్నట్టు? దానికి ప్రత్యేకమైన కారణమేమీ లేదు. 80 లేక 85% ఎంచుకొని వుంటే ఇంకా తక్కువ ప్రాజెక్టులకు అనుమతి లభించేది. కానీ లభించిన వాటి ఆయకట్టుదార్లకు మరింత ఎక్కువ నీటి గ్యారంటీ వుండేది. 60 లేక 65% శాతం ఎంచుకొని వుంటే ఇంకా ఎక్కువ ప్రాజెక్టులకు అనుమతి లభించి వుండేది. లభించిన వాటి ఆయకట్టుదార్లకు నీటి గ్యారంటీ తక్కువ వుండేది.

నీటిని వృథాగా సముద్రంలోకి పోనీయడం కంటే, తక్కువ గ్యారంటీ వున్నా ఎక్కువ ప్రాజెక్టులకు అవకాశం ఇచ్చే నిర్ణయమే ఎందుకు మెరుగనుకోకూడదు? నీటి గ్యారంటీ అన్ని ప్రాజెక్టుల ఆయకట్టుదార్లకూ ఒకే మోతాదులో అవసరం వుండదు. వర్షపాతం సహజంగానే ఎక్కువ వుండే ప్రాంతాలలో రైతాంగానికి ప్రాజెక్టు నీటి వల్ల అదనపు ఉపయోగం వుంటుందే తప్ప అది జీవిత అవసరం కాదు. కరువు ప్రాంతాలలో వుండే ప్రాజెక్టుల పరిస్థితి అందుకు విరుద్ధం.

కాబట్టి నికర జలాలు- మిగులు జలాలు అనే కృత్రిమమైన వర్గీకరణను విడిచిపెట్టి, 60 లేక 50 శాతం నీటి లభ్యత ప్రాతిపదికన ప్రాజెక్టులు కట్టుకొని (ఇంకా తక్కువ కూడ కావచ్చు) ఏ సంవత్సరమైనా మొదట నదిలోకి వచ్చే నీళ్లు కరువు ప్రాంతాలలో వుండే ప్రాజెక్టులకు పారించడం ద్వారా ఆ ప్రాజెక్టుల ఆయకట్టుదార్లకు ఎక్కువ గ్యారంటీ, వర్షాభావం లేని ప్రాంతాల ప్రాజెక్టులకు తక్కువ గ్యారంటీ ఇవ్వడంలో తప్పేముంటుంది?

## 2. అప్పటికే నెలకొన్న హక్కులను కాపాడడం

కృష్ణానదీ జలాలపైన కోస్తా ఆంధ్ర జిల్లాలు కొన్ని చారిత్రక, రాజకీయ కారణాల వల్ల ఏనాడో హక్కులు పొంది వున్నాయి. వారు ఆ హక్కులు పొందినప్పుడు నదీజలాల పంపిణీకి సంబంధించిన చట్టంగానీ అవార్డుగానీ ఒప్పందంగానీ ఏదీ లేదు. ఇతర ప్రాంతాల అవసరాల గురించి ఎవరూ అడగలేదు. నాగార్జునసాగర్ ప్రాజెక్టయితే అప్పటి మైసూరు, మహారాష్ట్ర ప్రభుత్వాల అభ్యంతరాలు నడుమ నిర్మించారు.

ఈ విధంగా నెలకొన్న హక్కులను శాశ్వతమైనవిగా గౌరవించవలసిన అవసరం లేదు. కానీ జస్టిస్ బచావత్ ఆ విధంగా భావించడం వల్లనే కృష్ణా నదీజలాలలో ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కువ వాటా వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో కోస్తా ఆంధ్రకు ఎక్కువ వాటా వచ్చింది. బచావత్ అవార్డు '75 శాతం లభ్యత' ప్రాతిపదికన నిర్ధారించిన 2060 టిఎంసీల నీటిలో ఆంధ్రప్రదేశ్‌కు 800 టియంసిలు, కర్ణాటకకు 700, మహారాష్ట్రకు 560 వచ్చిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ వాటా అయిన 800 టియంసిల నీటిలో 377.7 టియంసిలు కోస్తా ఆంధ్రకు, 266.8 తెలంగాణకూ, 122.7 రాయలసీమకూ వచ్చిన సంగతి కూడ తెలిసిందే. నిజానికి తెలంగాణలో అప్పటికే వాడకంలో వున్నట్టు ట్రిబ్యునల్‌కు లెక్కజూపిన ఊహాత్మక మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులను కనుక మినహాయిస్తే తెలంగాణ వాటా అంత కూడ లేదు. కృష్ణానది అత్యధికంగా ప్రవహించేది మహబూబ్‌నగర్ జిల్లాలో. అయితే నల్లగొండ, కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలు కూడా కృష్ణానదీ జలాలపైన ఆధారపడక తప్పదు. కోస్తా జిల్లాలు వాడుకుంటున్న 377.7 టియంసిల నీటిని 'అప్పటికే నెలకొని వున్న హక్కు' అనే పేరు మీద కొనసాగించకుండా బచావత్ ట్రిబ్యునల్ అందులో మూడవ వంతు (అంటే 126 టియంసిలు) తగ్గించివున్నా పై అయిదు జిల్లాలలోని శ్రీశైలం ఎడమ కాలువ, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, హంద్రీ-నీవా, గాలేరు-నగరి మొదలయిన పేర్లతో చలామణి అవుతున్న ప్రాజెక్టులకు సగం నీటి కేటాయింపయినా- 'నికర జలాల' కేటాయింపు- సాధ్యం అయివుండేది. ఆ ప్రాజెక్టులకు అనుమతి లభించేది. మూడవ వంతు కాక సగం తగ్గించివుంటే ఈ కరువు జిల్లాల ప్రజలు కలలుగంటున్న మేరకు ప్రాజెక్టులను 'నికర జలాల' కేటాయింపుతో కట్టి వుండవచ్చు. దీనివల్ల కోస్తా జిల్లాలకు కృష్ణా జలాలు దక్కకుండా ఏం పోవు. ఇప్పుడు దక్కేటంత పుష్కలంగా దక్కకపోవచ్చునంతే.

అయితే 'నికర జలాలు- మిగులు జలాలు' అనే వర్గీకరణే అనవసరం అని పైన చెప్పుకున్నాము కాబట్టి అక్కడి కేటాయింపులు తీసి ఇక్కడ చేర్చడం వంటి కసరత్తులక్కరలేదు. మరయితే ఏం చేయాలి?

కృష్ణానది పరీవాహక ప్రాంతంలోని కరువు ప్రాంతాలు ఆ నది నుండి ఎంత నీరు కోరుకుంటున్నదీ ఇప్పటికే అంచనాకు వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ తెలంగాణ, రాయలసీమ జిల్లాలు, కర్ణాటక, మహారాష్ట్రలలోని వాటి పొరుగు జిల్లాలు– ఒక్కమాటలో చెప్పాలంటే దక్కన్ పీఠభూమి ప్రాంతం– వర్షపాతం తక్కువ వున్న ప్రాంతం. ఈ ప్రాంతంలో ఇప్పటికే కృష్ణానది మీద నిర్మించిన ప్రాజెక్టులున్నాయి. కాగా మరికొన్ని ప్రాజెక్టుల ప్రతిపాదన కూడ జరిగింది. అయితే 'నికర జలాలు' లేవు అన్న కారణంగా ఇవి ఆమోదం పొందలేదు.

ఇప్పుడు జరగవలసింది పాత ప్రాజెక్టులనూ ప్రతిపాదిత ప్రాజెక్టులనూ కలిపి ప్రాధాన్యతల ప్రాతిపదికన ఒక జాబితా తయారు చేయడం. వర్షపాతం, భూగర్భ జలాలు, భూసారం అననుకూలంగా వున్న ప్రాంతాలకు నీరిచ్చే ప్రాజెక్టులకు మొదటి ప్రాధాన్యత. అవి మెరుగుగా వుండేకొద్దీ తక్కువ ప్రాధాన్యత ఇస్తూ ఒక ఉమ్మడి జాబితా మూడు రాష్ట్రాలూ తయారు చేయాలి. అవసరమయితే ఈ మూడు రాష్ట్రాలకూ చెందని నిపుణుల సహాయం తీసుకొని ఈ ప్రాధాన్యతలు నిర్ణయించాలి.

అందరి కోరికలు కలుపుకుంటే నదిలో '75 శాతం లభ్యత' ప్రాతిపదికన కాదు సరికదా, '10 శాతం లభ్యత' ప్రాతిపదికన కూడ దొరకనంత నీరు అవసరమవుతుందేమోనని అనుమానం రావచ్చు. ఎవరి అవసరాలను వారు ఇతరుల అవసరాలతో నిమిత్తం లేకుండ ప్రతిపాదిస్తున్నారు కాబట్టి ఈ అనుమానం నిజమైనా ఆశ్చర్యమేం లేదు. అప్పుడు అన్ని ప్రాజెక్టుల ప్రణాళికలను (కొత్తవే కాదు, పాతవి కూడ) తీసుకొని వాటి ఆయకట్టును ఒకే దామాషాలో (లేదా పైన పేర్కొన్న మూడు ప్రమాణాలు నిర్దేశించే దామాషాలో) తగ్గించాలి.

ప్రాధాన్యతల ప్రాతిపదికన ప్రాజెక్టుల జాబితా తయారుచేసుకున్న తరువాత ఇప్పుడు ప్రతిపాదనలో వున్న అన్ని ప్రాజెక్టుల్ని కట్టేసుకోవాలి. ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో నదిలోకి మొదటవచ్చి చేరే నీటిని మొదటి ప్రాధాన్యతగల ప్రాజెక్టులలోకి మొదట పారించాలి. తక్కువ ప్రాధాన్యతగల ప్రాజెక్టు నది పైభాగాన వుంటే దాని గేట్లు తెరచి నీటిని కిందికి పోనివ్వాలి. ఆ తరువాత నదిలోకి వచ్చిన నీరు రెండవ ప్రాధాన్యతగల ప్రాజెక్టులలోకి, ఆ తరువాత మూడవ ప్రాధాన్యతగల ప్రాజెక్టులలోకి... ఈ విధంగా 'నికరం', 'మిగులు' అన్న మీమాంస లేకుండ మొత్తంగా నదీజలాలను వాడుకోవచ్చు.

### 3. రాష్ట్రాల మధ్య సమస్యగా చూడడం

ఇది పరీవాహక రాష్ట్రాల మధ్య సమస్య కాదనీ, నది నీటి అవసరం ఎక్కువ వున్న ప్రాంతాలకూ తక్కువ ఉన్న ప్రాంతాలకూ మధ్య వున్న సమస్య అనీ ఈపాటికి

అర్థమయ్యే వుంటుంది. 'ఆల్మట్టి' గురించి జరిగిన గొడవలో సర్కార్ జిల్లాల నాయకులూ మేధావులూ రాయలసీమవాసులను తమలాంటి ప్రాంతానికే చెందిన బీజాపూర్ వాసులకు వ్యతిరేకంగా రెచ్చగొట్టిన వైనం చూశాము. ఇది అర్థరహితమైన భాషా భేదం. కృష్ణానది ఒకచోట మరాఠీ, ఒకచోట కన్నడం, ఒకచోట తెలుగు మాట్లాడదు. అవసరాన్ని బట్టి నీటి వాడకం వుండాలనుకున్నట్టయితే అనంతపురం వాసులకు బీజాపూర్‌వాసులతోనే పోలిక తప్ప కృష్ణా జిల్లా వారితో కాదు.

రేపు జరగవలసిన చర్చలు, మళ్లీ ఆ నది నీటిని మూడు రాష్ట్రాలూ ఎంతెంత తీసుకోవాలని కాదు. ఈసారి చర్చలు జరగవలసింది (1) ప్రాజెక్టుల ప్రాధాన్యతలను హేతుబద్ధంగా నిర్ణయించుకొని అందరూ అంగీకరించే ప్రాధాన్యతల జాబితా తయారు చేసుకోవడానికి (2) అన్ని (ఉనికిలో వున్న, ప్రతిపాదనలో వున్న) ప్రాజెక్టుల నీటి పరిమాణాలూ కలుపుకుంటే నదిలో అసలే నీరు దొరకనంత అయ్యేటట్టయితే అన్నిటి ఆయకట్లనూ తగిన దామాషాలో తగ్గించుకోవడానికి (3) ఈ ఒప్పందం అమలును పర్యవేక్షించే 'రివర్ వ్యాలీ అథారిటీ'ని ఏర్పాటు చేసుకోవడానికి జరగాలి.

ఈ చర్చలలో ఈ మూడు రాష్ట్రాల ప్రభుత్వ ప్రతినిధులేకాక, ప్రాజెక్టుల ఆయకట్టుదార్ల ప్రతినిధులు కూడ (ఉన్న ప్రాజెక్టులే కాక ప్రతిపాదిత ప్రాజెక్టులకు సంబంధించినవారు కూడ) పాల్గొనవలసి వుంటుంది. ప్రాంతీయ విభేదాలు, వివక్ష తీవ్రంగా వున్న ప్రస్తుత పరిస్థితులలో 'ప్రభుత్వమే రాష్ట్రంలోని ప్రజలందరి ప్రతినిధి' అని గుడ్డిగా విశ్వసించజాలము. ఆయకట్టుదార్ల ప్రతినిధులను ఏ విధంగా ఎంపిక చేసుకుంటామనేది ప్రస్తుతానికి అనవసరం. వారి గొంతుక కూడ చర్చలలో వినిపించాలని మాత్రం నొక్కి చెప్పాలి.

అయితే ఒక ఒప్పందానికి వచ్చిన తరువాత దానిని మూడు రాష్ట్రాల ప్రభుత్వాల మధ్య ఒప్పందంగా రాసుకొని మూడు రాష్ట్రాల ప్రతినిధులూ సంతకం చేయాలి. అప్పుడే అది చట్టబద్ధం అవుతుంది. అంటే ఎవరైనా అతిక్రమిస్తే సుప్రీంకోర్టు ద్వారా దానిని అమలు చేయించుకోవడం సాధ్యం అవుతుంది.

రాయలసీమ, దక్షిణ తెలంగాణ జిల్లాలకే కాక, కర్ణాటక, మహారాష్ట్రల కృష్ణానది పరీవాహక ప్రాంతంలోని కరువు జిల్లాలకు కూడా న్యాయం చేయగల మార్గం ఇదొక్కటే. సర్కారు జిల్లాలకు నీరిచ్చే నాగార్జునసాగర్, కృష్ణా డెల్టా వర్క్సుకు ఆఖరి ప్రాధాన్యత లభిస్తుంది కాబట్టి వారు ఇప్పుడు వాడుతున్నంతగా కృష్ణా జలాలను వాడుకోలేరు. వారికి ఎంత దక్కుతుందన్న విషయంలో గ్యారంటీ కూడా ఇప్పుడున్నంత వుండదు.

75 శాతం కంటె తక్కువ లభ్యత వుండొచ్చు. అంటే వారు వర్షపాతాన్నీ బావినీటినీ అప్పుడప్పుడు ఎంతో కొంత దొరికే కృష్ణా జలాలనూ సమన్వయపరచుకునే రీతిలో పంట విధానాన్ని మార్చుకోవలసి ఉంటుంది.

## ముగింపు

ఈ రూపంలో కృష్ణా జలాల గురించి కొత్తగా చర్చలు జరపవలసిన అవసరాన్ని మనం గుర్తించాలి. మన రాష్ట్ర ప్రభుత్వంపైన కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలపైన ఒత్తిడి పెట్టడానికొక ఉద్యమం నిర్మించాలి. ఆ రెండు రాష్ట్రాలూ దీనికి సులభంగానే ఒప్పుకోవచ్చు. కాని మన రాష్ట్రంలోని బలమైన రాజకీయ శక్తులను ఏ విధంగా ఒప్పిస్తామన్నది మన ముందున్న ప్రశ్న.

ఈ ప్రయత్నానికి ప్రజాతంత్ర శక్తులంతా నడుం కట్టాలని కోరుకుంటూ–

*(ఈ డాక్యుమెంట్ ఆధారంగా అనంతపురం, కడప, కర్నూలు, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో చర్చలు జరిగాక 27.1.2002న గద్వాలలో కృష్ణానదీ జలాల పునఃపంపిణీ ఉద్యమం ఏర్పడింది)*

*మానవహక్కుల వేదిక (HRF) బులెటిన్‌లో రిపోర్టుగా వచ్చింది*

20 ఏప్రిల్ 2001



# చేసేది చేస్తూ ఉపదేశాలెందుకు?

తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని గురించి పెద్దఎత్తున చర్చ, ఆందోళన జరుగుతున్న ఈ దినాలలోనే పులిచింతల ప్రాజెక్టు పనులు చేపట్టే అనౌచిత్యానికి పాల్పడడంలో ఉన్న అహంభావాన్ని అర్థం చేసుకోవాలంటే కృష్ణా నదిపైన ఎన్ని ప్రతిపాదిత ప్రాజెక్టులు నీటి కేటాయింపు కోసం ఎంత కాలంగా కాచుకొని ఉన్నయో ఒకసారి జ్ఞాపకం చేసుకోవాలి.

ముంపు నల్లగొండకు, ప్రయోజనం కృష్ణా జిల్లాకా అన్న దొక్కటే పులిచింతల విషయంలో ఉన్న అభ్యంతరం కాదు. అదే ప్రధాన అభ్యంతరమూ కాదు. అంతకంటే ముఖ్యమైన అభ్యంతరం నీటికేటాయింపుకు సంబంధించినది. నల్లగొండ, మహబూబ్‌నగర్, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలలోని కరువు ప్రాంతాలకు నీళ్లివ్వగల ప్రాజెక్టులు కృష్ణా జలాల నుండి కేటాయింపు లభిస్తుందని ఎదురు చూస్తున్నాయి.



కృష్ణా డెల్టా ఆయకట్టు స్థిరీకరణ వాటితో ఎంత మాత్రం పోల్చదగ్గ అవసరం కాదు. 'నల్లగొండలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసిన తరువాత కావాలంటే పులిచింతల కట్టుకోండి' అని నల్లగొండకు చెందిన నాయకులు కొందరు అంటున్నారంట. వారికి అర్థం కాని విషయం ఏమిటంటే అవి కట్టుకుంటే ఇది సాధ్యం కాదు, ఇది కట్టుకుంటే అవి సాధ్యం కావు. కృష్ణా నదిలో ఇంకా మిగిలి ఉన్న నీరేమైనా ఉంటే అది ఎవరికి చెందాలన్నది ఇక్కడ ప్రశ్న. దీనికి అందరి కోరికలను ఇముడ్చుకునే సమాధానమేదీ లేదు. అందువల్ల పులిచింతలను నిర్ద్వంద్వంగా వ్యతిరేకించవలసిందే.

ఆల్మట్టి గురించి కృష్ణా, గుంటూరు జిల్లాల నాయకులు చేసిన గొడవ మనం మరచిపోలేదు. అప్పట్లో, 'మన రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటాయి' అన్నారు. అది నిజమా? లేక అతిశయోక్తా అన్న సంగతి అటుంచి, దెబ్బతింటాయనుకున్న ప్రయోజనాలలో ఒక్క ప్రయోజనాన్ని కాపాడుకోవడానికి మాత్రం పకడ్బందీగా చర్యలు తీసుకున్నారు. అదే పులిచింతల ప్రాజెక్టుకు సాధించుకున్న అనుమతి. ఆల్మట్టి వల్ల కృష్ణా డెల్టా ఆయకట్టులో వరినాట్ల సమయానికి నీళ్ళు అందకుండా పోయే ప్రమాదముంది కాబట్టి ముందు సంవత్సరం నాగార్జునసాగర్ నుండి దిగువకు ప్రవహించిన నీటిలో దాదాపు 13 టియంసిల నీటిని పులిచింతలలో బంధించి, జూన్, జూలై నెలలలో ప్రకాశం బ్యారేజీలోకి దానిని వదలాలన్నది ప్రణాళిక.

కర్ణాటక దీనికి ఎప్పుడో అభ్యంతరం తెలిపింది. పులిచింతల ద్వారా పారించుకోబోయేది మిగులు జలాలనీ, ఆ ప్రాజెక్టు బచావత్ అవార్డుకు వ్యతిరేకమనీ ఆరోపించింది. మన వాళ్ళు రెండు వేరు వేరు జవాబులు చెప్పారు. కృష్ణా డెల్టాలో అభివృద్ధి పనులు చేపట్టడం వల్ల మన రాష్ట్ర వాటాలోని నీటిని కొంత ఆదా చేయగలగుతున్నామనీ, దానినే పులిచింతల ప్రాజెక్టులో వాడుకుంటున్నామనీ ఒకసారి అన్నారు. అంతకంటే తెలివి మీరి సాగర్‌కు దిగువన కృష్ణానదిలోకి వచ్చి చేరే నీటినే పులిచింతలలో స్టోర్ చేసుకుంటున్నామన్నారు. నమ్మశక్యంకాని ఈ జవాబులను కేంద్రం మాత్రం నమ్మింది (నమ్మించదలచుకుంటే మన వాళ్ళు ఏదైనా నమ్మించగలరనడానికి ఇది ఒక తార్కాణం మాత్రమే).

అది నిజమే అయితే కృష్ణా డెల్టా వాడకం కోసం ప్రకాశం బ్యారేజీలో బంధిస్తున్న నీటిలో 13 టియంసిలు తగ్గించి దానిని శ్రీశైలంలోనే ఆపుకోవచ్చును కదా? ఆ 13 టియంసిల నీటికోసం దక్షిణ తెలంగాణ, రాయలసీమ జిల్లాలలో ఎన్ని లక్షల ప్రజలు దాహంతో ఎదురుచూస్తున్నారు! 13 టియంసిల నీటిని ఆరుతడి (ఇరిగేటెడ్ డ్రై) పంటకు పారించుకుంటున్నట్టయితే 1 లక్షా 30 వేల ఎకరాలకు నీరు అందియ్యవచ్చు. దేవరకొండకో, కల్వకుర్తికో, పత్తికొండకో, ఉరవకొండకో ఆ నీరు అందిస్తే ఎంత మేలు చేసిన వారవుతారు? ఆ కరువు తాలూకాల ప్రజలు ఎంతో సంతోషిస్తారు. దానికంటే కృష్ణా డెల్టాలో జూన్ నెలలోనే వరినాట్లు పడేటట్లు చూడడం ఎందుకు ముఖ్యమయింది? ఏ ప్రమాణాల ప్రకారం ముఖ్యమయింది?

శ్రీశైలం రిజర్వాయర్‌లో గానీ ఆ పైనగానీ ఇంకొంచం నీరు ఉంటే బాగుండునని ఎంత మంది ప్రజలు ఎదురు చూస్తున్నారో ఒకసారి జ్ఞాపకం చేసుకుందాం. హామీలు పొందిన ప్రాజెక్టుల గురించే మాట్లాడుకున్నా లక్షల మంది ఉన్నారు. నల్లగొండ జిల్లాలో శ్రీశైలం ఎడమ కాల్వ అని పిలవబడే ప్రాజెక్టొకటి ఉంది. దానికి నీటి కేటాయింపు లేదు. ఇప్పుడు పులిచింతలలో బంధిస్తున్న 13 టియంసిలను శ్రీశైలంలోనే

ఆపేసి ఈ కాలువ తవ్వి ఉంటే తీవ్ర దుర్భిక్షానికి నిలయమైన దేవరకొండ తాలుకాకు నీళ్ళొచ్చేవి. కానీ శ్రీశైలంలో నీళ్లు లేవని చెప్పి ఆ ప్రాజెక్టు పేరు మార్చకుండా దానిని నాగార్జునసాగర్ రిజర్వాయర్ 'బాక్‌వాటర్స్' మీద ఆధారపడ్డ మూడవ కాలువగా నిర్మిస్తున్నారు. నాగార్జునసాగర్ రిజర్వాయర్ పొంగి పొర్లితే తప్ప ఈ శ్రీశైలం ఎడమ కాలువ ముఖం దగ్గరికి నీళ్లు రావు. వచ్చినా ఆ కాలువ దేవరకొండకు పోదు. అంతకంటే కొంచెం మెరుగయిన ప్రాంతాలకు మాత్రమే అది నీరందించ గలుగుతుంది.

శ్రీశైలం నుంచి ఇంకొంచెం పైకిపోతే కృష్ణానది పైన మహబూబ్‌నగర్ జిల్లావాసులు పెట్టుకున్న ఆశలు చూస్తాం. పులిచింతలలో బంధించడానికి నిజంగానే నీళ్ళుంటే– అది కర్ణాటక ఆరోపిస్తున్నట్టు మిగులు జలం కాకుంటే– ఆ నీటిని జూరాల దగ్గరే ఆపేస్తే చిక్కిపోయిన ఆ ప్రాజెక్టుకు తొలినాటి వైభవం తిరిగి వచ్చేది కదా? లేదా కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా ఎత్తిపోతల పథకాలకు కేటాయించి ఉండవచ్చును కదా? అప్పుడు కల్వకుర్తి, గద్వాల తాలూకాలు పచ్చబడేవి కదా!

శ్రీశైలం రిజర్వాయర్ వైపు ఆశగా చూస్తున్న రాయలసీమ ప్రాజెక్టులూ ఉన్నాయి. గాలేరు– నగరి, హంద్రీ – నీవా, వెలిగొండ వంటి పెద్ద ప్రాజెక్టుల సంగతి పక్కనపెట్టినా, శ్రీశైలం నుండి ఒక 10 టియంసిల నీటిని కెసికెనాల్‌లోకి పారించినట్టయితే హోస్పేట డ్యాం నుండి కెసికెనాల్‌లోకి పోయేదానిలో ఆ మేరకు నీరు తగ్గించి దానిని అనంతపురం జిల్లాకు నీళ్ళిచ్చే తుంగభద్ర ఎగువ కాలువలోకి పారించుకోవచ్చునన్న ఆశ ఎడారి సదృశమైన అనంతపురం జిల్లావాసుల చిరకాల వాంఛగా ఉంది. తుంగభద్ర ఎగువ కాలువ ఆయకట్టును స్థిరీకరించడానికి ఇది అవసరం. దానికంటే కృష్ణాడెల్టా ఆయకట్టును స్థిరీకరించడం ఎందుకు ముఖ్యమయింది? ఏ ప్రమాణాల ప్రకారం ముఖ్యమయింది?

కృష్ణానది జలాల వినియోగం విషయంలో మన రాష్ట్రంలో చాలా అన్యాయం జరిగిందనేది ప్రాంతీయ వివక్షకు సంబంధించిన చర్చలో ఒక ముఖ్యమైన ఫిర్యాదుగా ఉంది. ఆ చర్చ చాలా తీవ్రరూపం తీసుకుంటున్న దశలోనే క్షామపీడిత ప్రాంతాలకు మరింత అన్యాయం చేస్తూ పులిచింతల నిర్మాణం చేపట్టడాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి? 'మా ప్రయోజనాలు మేము కాపాడుకుంటాం. మీరేం చేస్తారో చేసుకోండి' అనే సవాలుగా అర్థం చేసుకోవాలా? మరి అటువంటప్పుడు సమైక్య రాష్ట్రంలోనే అందరి ప్రయోజనాలూ ఒనగూడుతాయని ఉపన్యాసాలూ ఉపదేశాలూ చేయడం ఎందుకు?



ప్రజాతంత్ర
17 జూన్ 2001

# కృష్ణానదీ జలాల పునఃపంపిణీకై ఉద్యమిద్దాం

ప్రజలారా!

నీళ్లు మనిషికి ప్రకృతి ఇచ్చిన సంపద. అది ఎవరి స్వంత ఆస్తి కాదు.

కొన్ని చారిత్రక, రాజకీయ కారణాల వల్ల ఈ ప్రకృతి సంపద ఒక్కొక్క చోట ఒక్కొక్క సామాజిక వర్గం 'ఆస్తి' అయింది. అది చాలా ఫలవంతమైన ఆస్తి కాబట్టి దానిని స్వంతం చేసుకున్న 'అదృష్టవంతులు' మరింత సంపన్నులవుతున్నారు. అంటే మరింత 'అదృష్టవంతులు' అవుతున్నారు. ఈ 'అదృష్టం' వెనక ఉన్నది రాజకీయం అని గుర్తించి అది లేనివారు తిరగబడినప్పుడు మాత్రమే అది తలకిందులు కాగలదు.

ఇప్పుడు మనం కృష్ణానది గురించి మాట్లాడుకుందాం.

కృష్ణ, దాని ఉపనదులు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలలో ప్రవహిస్తాయి. అందువల్ల కృష్ణానదిని చట్టం 'అంతరాష్ట్ర నది'గా గుర్తించింది. మూడు రాష్ట్రాల మధ్య ఆ నది నీటిని ఏ విధంగా పంపిణీ చేయాలన్న విషయంలో వివాదం లేవదీసే అధికారం, పరిష్కారం పొందే అధికారం మూడు పరీవాహక రాష్ట్రాలకూ రాజ్యాంగమే ఇచ్చింది.



కృష్ణానదికి మూడు పరీవాహక రాష్ట్రాలే కాదు ఆంధ్రప్రదేశ్‌లో మూడు పరీవాహక ప్రాంతాలూ ఉన్నాయి. అయితే రాష్ట్రం లోపలి పరీవాహక ప్రాంతాల మధ్య నది నీటి వాడకం విషయంలో ఉన్న అసమానతను ప్రశ్నించే అధికారం, దానిని సవరించుకునే యంత్రాంగం చట్టం కల్పించలేదు, రాజ్యాంగమూ కల్పించలేదు. అయినా నదీజలాల లభ్యత జీవించే హక్కుకు సంబంధించిన విషయం కాబట్టి, చట్టం హక్కు కల్పించకపోతే రాజకీయంగా కొట్లాడి సాధించుకోక తప్పదు. అవసరమయితే దానికోసం చట్టాన్నీ, రాజ్యాంగాన్నీ మార్చుకోక తప్పదు.

బచావత్ ట్రిబ్యునల్ కృష్ణానదీ జలాలను మూడు రాష్ట్రాల మధ్య పంచుతూ ఆంధ్రప్రదేశ్‌కు 800 టియంసిల నీరు, కర్ణాటకకు 700 టియంసిల నీరు, మహారాష్ట్రకు 560 టియంసిల నీరు కేటాయించింది. మూడు రాష్ట్రాలకూ కేటాయించింది కలుపుకుంటే 2060 టియంసిల నీరు అవుతుంది. కృష్ణానదిలో నాలుగింట మూడు సంవత్సరాలలో 2060 టియంసిల నీరు ఉంటుందని జస్టిస్ బచావత్ అంచనా వేసి, రైతులకు కనీసం ఆపాటి భరోసా ఉండాలని భావించి ఆ మేరకు మాత్రమే నీటిని ప్రాజెక్టులకు కేటాయించారు. ఈ నీటిని 'నికర జలాలు' అన్నారాయన. ఆ పైన ఏ సంవత్సరమైనా కృష్ణానదిలో అదనంగా నీరుంటే దానిని మిగులు జలాలు అన్నారాయన. ఈ మిగులు జలాలపైన ప్రాజెక్టులు కట్టుకోవడానికి వీలు లేదనీ, వాటిని ఇప్పటికే ఉన్న ప్రాజెక్టుల ద్వారా ఆంధ్రప్రదేశ్ మాత్రమే వాడుకోవచ్చుననీ జస్టిస్ బచావత్ అన్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 800 టియంసిల నీటిలో 377 కోస్తా ఆంధ్రకూ, 267 తెలంగాణకూ,123 రాయలసీమకూ దక్కాయి. వర్షపాతం, భూగర్భ జలాలు మెరుగుగా ఉన్న కోస్తా జిల్లాలకే నదీజలాల కేటాయింపు జరగడానికీ, కరువు చాలా తీవ్రంగా ఉండే తెలంగాణ, రాయలసీమ జిల్లాలకు అంత తక్కువ దక్కడానికీ కారణాలు చారిత్రకమైనవి, రాజకీయమైనవి.

నిజానికి చారిత్రక కారణమే రాజకీయ కారణంగా పరిణమించింది. బ్రిటిష్ పాలకులు ఎగువ ప్రాంతపు ప్రజల అవసరాల గురించి ఆలోచించవలసిన అగత్యం లేని రోజులలో, అంటే 19వ శతాబ్దపు మధ్యభాగంలో కృష్ణాడెల్టా మీద ఆనకట్ట నిర్మించడంతో కోస్తా జిల్లాల మధ్యప్రాంతవాసులు కృష్ణానదీ జలాలు వాడుకోవడం మొదలయింది. దానినుండి వచ్చిన సంపద వారి నాగరికతకు బలాన్ని అందిచ్చింది. ఆ బలంతో వారు ఆధునిక ఆంధ్రప్రదేశ్‌ను రాజకీయంగా శాసిస్తున్నారు. నాగార్జునసాగర్‌ను తమకు అనుకూలంగా రూపొందించుకొని కృష్ణానదీ జలాలలో మరింత వాటా పొందగలిగారు. రేపు అవకాశం ఇస్తే పులిచింతల ద్వారా ఇంకొంచెం చేజిక్కించుకుంటారు.

బచావత్ అవార్డు అమలులో ఉన్నప్పుడు సహితం ఈ అన్యాయాన్ని సవరించడానికి అవకాశం వుండింది. ఎందుకంటే బచావత్ అవార్డులో ఒక్కొక్క ప్రాజెక్టుకూ విడివిడిగా కేటాయింపు జరిగినప్పటికీ ఆ విడివిడి కేటాయింపులు శిరోధార్యం కాదు. మొత్తంగా రాష్ట్రానికి కేటాయించిన 800 టి.యం.సిల నీటిని మించకుండా రాష్ట్రం లోపల ప్రాజెక్టులను ఏ విధంగానైనా మార్పు చేసుకుని ఉండవచ్చును.

ఈ విషయం బచావత్ అవార్డు చదివినా, దానికి ప్రాతిపదిక అయిన చట్టాన్ని చదివినా స్పష్టంగా అర్థం అయి వుండేది. ఇదే విషయాన్ని 'ఆల్మట్టి' కేసులో సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేసింది.

ఏమయితేనేం, 2000 సంవత్సరం మే నెలతో 1976 నుండి మనల్ని శాసించిన బచావత్ అవార్డు గడువు తీరిపోయింది. ఇప్పుడు కొత్తగా కృష్ణానదీ జలాల వినియోగాన్ని గురించి ఆలోచించే అవకాశం ఏర్పడింది. కొత్త ఒప్పందానికి తాము సిద్ధంగా వున్నామని కర్ణాటక, మహారాష్ట్రలు ప్రకటించినప్పటికీ మన రాష్ట్ర ప్రభుత్వం కిమ్మనడం లేదు. కృష్ణానది మీద చర్చ మళ్ళీ మొదలుపెడితే రాష్ట్రం లోపల జరిగిన అన్యాయం దాగదన్న భయమే కారణం కావచ్చు!

కానీ కృష్ణానదీ జలాలపైన ఆధారపడిన కరువు పీడిత ప్రాంతవాసులు ఊరుకోవడానికి వీలులేదు. ఈసారి రాష్ట్రాల మధ్య జరగబోయే చర్చలలో ప్రాంతాల మధ్య అసమానత కూడా చర్చకు రావలసి వుంది. దానిని సవరించవలసి వుంది.

ఈ స్పృహతో మానవహక్కుల వేదిక 2001 సంవత్సరంలో 'బచావత్ తరువాత' అనే శీర్షికన ఒక అవగాహనా పత్రాన్ని రూపొందించి నల్గొండ, మహబూబ్‌నగర్, కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలలో అన్ని పార్టీలనూ ప్రజాసంఘాలనూ వ్యక్తులనూ పిలిచి సమావేశాలు నిర్వహించడం జరిగింది. కొద్ది మార్పులతో అందరూ ఆమోదించిన ఆ అవగాహన పత్రంలోని ప్రధాన అంశాలు ఇవి:

1) కృష్ణానదీ జలాల పంపిణీకి సంబంధించి కర్ణాటక, మహారాష్ట్రలతో కొత్త త్రైపాక్షిక ఒప్పందానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలి, అది ట్రిబ్యునల్ రూపంలో కాక ప్రభుత్వాల మధ్య ఒప్పందం రూపంలో ఉండాలి.

2) ఈ ఒప్పందంలో రాష్ట్రాల మధ్య నీటి పంపిణీతోపాటు, రాష్ట్రం లోపల ప్రాంతాల మధ్య నీటి పంపిణీకి కూడా కచ్చితమైన స్థానం ఉండాలి.

3) ముందునుండి ఉన్న నీటి హక్కులకు భంగం కలిగించకూడదన్న సూత్రాన్ని విడిచిపెట్టి, నీటి అవసరాన్ని బట్టి నీటి హక్కులను తిరిగి నిర్ణయించాలి.

4) ఒక్కొక్క ప్రాజెక్టు ఆయకట్టు ప్రాంతంలో సగటు వర్షపాతం ఎంత, భూగర్భ జలాల పరిమాణం ఏమిటి, భూసారం (తేమను నిలుపుకునే స్వభావం) ఏ పాటిది, నదీజలాలకు ఆ ప్రాంతం అందిచ్చే నీరెంత, ఆయకట్టు ప్రాంతంలోని పేదరికం ఎంత, తదితర ప్రమాణాలను ఆధారం చేసుకొని ప్రాజెక్టుల ప్రాధాన్యతను నిర్ణయించాలి. ఒక ప్రాధాన్యతల జాబితాను త్రైపాక్షిక ఒప్పందంలో భాగంగా తయారు చేసుకోవాలి.

5) నదీ జలాలను నికర జలాలు, మిగులు జలాలు అని వర్గీకరించకుండా, నదిలో లభించే నీటిని పైన పేర్కొన్న ప్రాధాన్యతల జాబితాను అనుసరించి, ఎక్కువ ప్రాధాన్యత గల ప్రాజెక్టులకు తొలి హక్కు కల్పిస్తూ తక్కువ ప్రాధాన్యత గల

ప్రాజెక్టులకు మిగిలిన నీటిలో (ప్రాధాన్యతల వరుస క్రమంలో) హక్కులు కల్పించే పద్ధతిలో వాడుకోవాలి.

6) దీని వలన సర్కార్ జిల్లాల ఆయకట్టుదార్లకు కృష్ణానదీ జలాలపైన ఉన్న హక్కు తగ్గడమే కాక భరోసా కూడా తగ్గుతుంది కాబట్టి వారు పంట మార్పిడికి సిద్ధపడాలి.

కృష్ణానది, దాని ఉపనదుల ఎగువ భాగాన ఉన్న దక్షిణ తెలంగాణ, రాయలసీమ జిల్లాలకు నదీజలాల విషయంలో న్యాయం జరగడానికి ఇది తప్ప వేరే మార్గం లేదు.

నదీజలాలు న్యాయంగా పంచుకున్నప్పటికీ సాగునీటి అవసరం అందరికీ తీరదని మేము గుర్తించకపోలేదు. మొత్తంగా నీటి సమస్య పరిష్కారం కావాలంటే దీనితోబాటు చెరువుల నిర్వహణ మీద, భూగర్భ జలాల పెంపుదల మీద దృష్టి పెట్టాలని మేము గుర్తిస్తున్నాం. ఒక సమస్యను గురించి ఆందోళన చేస్తున్నామంటే వేరే వాటిని విస్మరిస్తున్నామనుకోనవసరం లేదు.

సాగునీటి కోసం నదీజలాల ప్రాజెక్టుల పైన ఆధారపడినట్టయితే పర్యావరణ సమస్యలు, నిర్వాసితుల సమస్యలు ఉత్పన్నం కావా అని ఆందోళన చెందేవారు కూడా ఉంటారు. కానీ ఈరోజు నల్గొండ, రాయలసీమ జిల్లాలకోసం ప్రతిపాదిస్తున్న ప్రాజెక్టులు ఇప్పటికే శ్రీశైలం వద్దనున్న రిజర్వాయర్‌పైన ఆధారపడినవే తప్ప కొత్త రిజర్వాయర్‌ల (చిన్నా చితకా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లు తప్ప) అవసరం వాటికి ఉండవు. మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రతిపాదిత ప్రాజెక్టులు ప్రధానంగా చిన్నచిన్న రిజర్వాయర్లపైన ఆధారపడిన ఎత్తిపోతల పథకాలు కాబట్టి ఈ ఉద్యమానికి 'పర్యావరణ సంశయం' అడ్డం రానవసరం లేదు.

కృష్ణా నదీజలాల పరిధిలో న్యాయం జరగాలంటే బలమైన ఉద్యమం అవసరం. ఈ పోరాటం కేవలం రాష్ట్ర ప్రభుత్వం మీదనే కాక రాష్ట్ర రాజకీయాలలో ప్రబల శక్తిగా ఉన్న సర్కార్ జిల్లాల పెత్తందారీ ప్రయోజనాల మీద కూడానన్న విషయం స్పష్టమే. ఈ పోరాటం చేయకపోతే కృష్ణానది పైన ఆధారపడక తప్పని కరువు జిల్లాలకు భవిష్యత్తు లేదన్నది కూడా స్పష్టమే.

ఆ జిల్లాల ప్రజలే కాక ఎవరైనా ఎక్కడివారైనా సరే న్యాయాన్ని కాంక్షించే వారంతా ఈ ఉద్యమంలో భాగం కావాలని ఆహ్వానిస్తూ–

కృష్ణానదీ జలాల పునఃపంపిణీ ఉద్యమం కరపత్రంగా వచ్చింది
17 జనవరి 2002



# ఉట్టికెక్కి ఆపైన స్వర్గానికెక్కుదాం

గంగా కావేరి 'లింకు' ప్రతీ అయిదేళ్ళకొకసారి సకల సమస్యలకు మందుగా ముందుకొస్తుంటుంది. గంగలో ఎంత నీరు అదనంగా ఉందో లెక్కగట్టి, దక్షిణాది నదులలో ఎంత తక్కువుందో లెక్కగట్టి, దాని నుండి దీనిని తీసేస్తే ఇంకా మిగులే ఉంటుంది కాబట్టి మనందరి కరువు సమస్యలూ దీనితో శాశ్వతంగా తీరిపోతాయని ఎవరో ఒకరు ప్రకటిస్తుంటారు.

వారికి కూడికలూ తీసివేతలూ వచ్చునన్న ఒక్క విషయం తప్ప దీనివల్ల వేరే ఏమీ రుజువు కావు. ఈ ప్రకటన ఎప్పుడు విన్నా వీళ్లు గంగ దగ్గర ఎందుకు ఆగిపోతున్నారు, బ్రహ్మపుత్రను కూడ కావేరికి కలిపేస్తే ఇంకా చాలా నీళ్లు లభిస్తాయి కదా అన్న అనుమానం వస్తుంటుంది. దానికి ఈ మధ్య ఎవరో జవాబు చెప్తూ, బ్రహ్మపుత్ర, సింధు అంతర్జాతీయ నదులు (అంటే మనకే కాక ఇతర దేశాలకు కూడా హక్కున్న నదులు) కాబట్టి వాటిలోని అదనపు జలాల మీద మనం ఏ ప్రాజెక్టులూ కట్టుకోలేమనీ అందువల్లనే గంగా–కావేరి లింకు గురించి మాత్రమే మాట్లాడుతున్నామనీ అన్నారు.



గంగా నది మీద సహితం బంగ్లాదేశ్‌కు హక్కుంది కాబట్టి ఈ తర్కం ప్రకారం గంగను దాని ఉప నదులను కూడా వదిలేయాలి. అప్పుడు మిగిలేది మహానది– కావేరి లింకే తప్ప గంగా–కావేరి లింకు కాదు. అయినా అసలు సమస్య అది కాదు. 'అంతర్జాతీయ' నదుల విషయంలో మనం అటువంటి ప్రాజెక్టు చేపడితే ఇతర దేశాలు ఒప్పుకోవంటున్నారు.

మరి జాతీయ నదుల మాటేమిటి? 'తన నీటిని' పొరుగు వారికి అప్పగించే ప్రాజెక్టును ఏ రాష్ట్రమైనా ఒప్పుకుంటుందా? ఒకే రాష్ట్రంలో ఒక ప్రాంతం వారు మరొక ప్రాంతానికి కనీస నీటి వసతి కల్పించడానికి తమ నీటి దుబారాను సైతం తగ్గించుకోవడానికి సిద్ధంగా లేరు. ఎక్కడో బీహార్‌లో ఉండే వారు గంగా జలాన్ని దక్షిణాదికి తీసుకుపోతుంటే చూస్తూ ఊరుకుంటారా?

బీహార్ ప్రజలూ ఉత్తరప్రదేశ్ ప్రజలూ గంగ నీటిని దక్షిణాది రాష్ట్రాలతో పంచుకోవాలన్న అభిప్రాయాన్ని దేశమంతా వినేటట్టు ప్రకటించిన మన ముఖ్యమంత్రి, కృష్ణాజిల్లా వాళ్ళు పులిచింతల ప్రాజెక్టును వదులుకొని, ఆ నీటిని శ్రీశైలం నుండి గానీ దాని కంటే ఎగువ ప్రాంతం నుండి గానీ తెలంగాణ, రాయలసీమ ప్రజలు తీసుకునే అవకాశం కల్పించాలని ప్రకటించగలడా? ప్రకటించలేడు. ఎక్కడో దూరాన ఉన్న వారికి ఎన్ని నీతులయినా చెప్పవచ్చు. దగ్గరున్న వాళ్ళకు చెప్పడం కష్టం. దూరం నుండి– లేక బల్ల మీద మ్యాప్ పెట్టుకొని– చూస్తే నదీ జలాలలో నీళ్ళు మాత్రమే కనిపిస్తాయి. దగ్గర నుండి చూస్తే అందులో నీళ్ళతో పాటు రాజకీయాలు, కలవారి ఆధిపత్యాలు కనిపిస్తాయి. వాటిని వదులుకొని నీటిని నీటిగా– అంటే కడుపుకింత తిండి పెట్టే వనరుగా చూడడం పొరుగు వారికి నేర్పించిన నాడు గంగా కావేరి లింకు గురించి మాట్లాడుకుందాం.

చంద్రబాబునాయుడు నోటి నుండి ఈ మాటలు రావడం మరీ విడ్డూరం. ఆయన రాష్ట్రం లోపల నదీజలాల ప్రాజెక్టుల గురించి మాట్లాడటం మానేసి చాలా కాలం అయింది. ఎవరైనా మాట్లాడినా విననట్టు నటిస్తాడు. నీరు–మీరు అంటూ వాననీటిని పొదుపుగా వాడుకోవడమే నీటి సమస్యకు ఏకైక పరిష్కారం అని చెప్తాడు. ప్రాజెక్టులు కట్టడం డబ్బు దండగ వ్యవహారం అనీ, ఇంకుడు గుంతలే మోక్ష మార్గమనీ అంటాడు. అటువంటి వ్యక్తి అకస్మాత్తుగా గంగా – కావేరి లింకు గురించి ఎందుకు మాట్లాడుతున్నట్టు? ఎందుకయినప్పటికీ తెలంగాణవాదులు కృష్ణాజలాల కొత్త ట్రిబ్యునల్‌పైన జరిగిన అఖిలపక్షంలో రాష్ట్రం లోపల కృష్ణాజలాల అక్రమ పంపిణీ గురించి ప్రశ్న లేవదీసి అతనిని బాగా ఇరకాటంలో పెట్టారు. గంగ నుండి దక్షిణాదికి నీళ్ళు తీసుకురావాలని మాట్లాడుతున్న పెద్దమనిషి తెలంగాణవాదులకు ఏం జవాబు చెప్పగలడు? ఒకరి కోసం మరొకరు తమ నీటి హక్కును వదులుకోనక్కరలేదని అనగలడా? భారీ నీటి పారుదల ప్రాజెక్టుల ఊసు విడిచిపెట్టి ఇజ్రాయిల్ తరహా వ్యవసాయం చేసుకుందాం రండి అనగలడా? ప్రస్తుతానికి ఏమీ అనకుండానే అఖిలపక్షం ముగించాడు.

రేపు మళ్లీ ఈ చర్చ వస్తే కర్ణాటక బూచి చూపించి తెలంగాణవాదుల నోరు నొక్కేయగలడు. మన లోపలి కొట్లాటలు మరచిపోయి కర్ణాటక ఎత్తుగడలను ఐక్యంగా ఎదుర్కోవాలి అనేది రాబోయే రోజులలో మనం బలంగా వినబోయే వాదన. ఆల్మట్టి గొడవ జరిగినప్పుడూ అదే విన్నాం. ఎగువ తుంగ విషయంలోనూ అదే వింటున్నాం. కానీ కర్ణాటక ఏదో ఒక అల్లరి చేసినప్పుడే కృష్ణాజలాల విషయం మన రాష్ట్రంలో పెద్దఎత్తున చర్చకు వస్తుంది. తెలంగాణవాసులైనా, రాయలసీమవాసులైనా అప్పుడే తమ హక్కుల గురించి మాట్లాడాలి. ఆ తరువాత మాట్లాడినా వినేవారుండరు. ఇది కేవలం అదనుకూ అవకాశానికీ సంబంధించిన విషయం కాదు. కృష్ణాజలాల విషయంలో 'మన' (అంటే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన) ప్రయోజనాలు అంటూ ఏమీ లేవు. తెలంగాణ, రాయలసీమవాసులకు కర్ణాటకతోనే పోలిక ఎక్కువ. ఎగువ ప్రాంతాల వారి హక్కుల గురించి అడగవలసిన అగత్యం లేని రోజులలో దిగువ ప్రాంతం వారు నీటిపైన హక్కులు నెలకొల్పుకుని, వెనక వచ్చిన ఎగువ ప్రాంతం వారిని దొంగలు అంటే అంగీకరించవలసిన అవసరం లేదు. కర్ణాటకకూ అదే జరుగుతున్నది. రేపు తెలంగాణ వేరయితే తెలంగాణకూ అదే జరుగుతుంది.

అందుకే మొన్నటి అఖిలపక్షంలో టిఆర్ఎస్ ప్రతినిధులూ తెలంగాణకు చెందిన కాంగ్రెస్ ప్రతినిధులూ కర్ణాటకతో రేపు ట్రిబ్యునల్ ముందు నడవబోయే వ్యాజ్యాన్ని గురించే కాదు, 'మన' మధ్య నడవని వ్యాజ్యాన్ని గురించి కూడ చర్చించుకుందాం అనడం విశేషం. నిజానికి కర్ణాటక కోరినట్టూ చంద్రబాబు అంగీకరించినట్టూ రేపు కొత్త ట్రిబ్యునల్ వచ్చినా అది 'మిగులు' జలాలు ఏ విధంగా పంచుకోవాలన్న విషయం మీదనే కదా తీర్పు చెప్పబోయేది? ఆ జలాల పేరే 'మిగులు' జలాలు. అసలు జలాల వాడకం మీద ఇప్పటికే స్థిరపడి పోయిన హక్కులను కదిలించకుండ, ఆపైన మిగిలిన జలాలను పంచుకోవడం వల్ల కరువు ప్రాంతాలకు ఏ మాత్రం ప్రయోజనం రాగలదు? 'నికరం' 'మిగులు' అన్న వర్గీకరణ తీసేయకుండ నికర జలాలు పోను అదనంగా ఉన్నదానిని పంచుకోవడం అంటే ఆ నికర జలాల మీద హక్కున్న అయకట్టుదార్ల అవసరాలన్నీ తీరిన తరువాతే రేపు కొత్తగా రాబోయే హక్కుదార్లకు నీళ్లొస్తాయని అర్థం కాదా? ఆ రకమైన 'హక్కు'తో కల్వకుర్తి ఎత్తిపోతల పథకం నిర్మించుకున్నా హంద్రీ–నీవా పథకం కట్టుకున్నా అవి నీళ్ళిచ్చే కరువు ప్రాంతాలకు ఏం ఒరుగుతుంది? ఈ ప్రశ్న లేవనెత్తడానికీ, దీనిని కోస్తా జిల్లాల రాజకీయ నాయకుల ముందు పెట్టడానికీ సిద్ధంగా లేని ముఖ్యమంత్రి గంగా–కావేరి లింకు గురించి మాట్లాడడం ఎందుకు?

ప్రజాతంత్ర



28 అక్టోబర్ 2002

# కృష్ణా జలాలు :
# కొట్లాడవలసింది ఎవరితో కొట్లాడుతున్నది ఎవరితో?

తెలంగాణ నాయకులు, రాయలసీమ నాయకులు ఒకరినొకరు తిట్టుకోవడం ద్వారా కృష్ణానదీ జలాల సమస్య మరొకసారి పత్రికలకు ఎక్కింది.

వీళ్లిద్దరూ కలిసి కృష్ణానదీ జలాల విషయంలో  సర్కార్ జిల్లాలు ఈ రెండు ప్రాంతాలకు చేసిన అన్యాయాన్ని విమర్శించే రోజు ఎప్పుడు వస్తుందోగానీ, ఈ లోపల ఈ రూపంలో కృష్ణానదీ జలాల సమస్య చర్చకొచ్చింది. ఏ విధంగా వస్తేనేం, చర్చకు రావడం సంతోషించదగ్గ విషయమని ఒప్పుకొని సంతృప్తి చెందుదాం.



రాయలసీమ నాయకులకు నోరెక్కువ కాబట్టి, అల్లరి చేసే అలవాటెక్కువ కాబట్టి సర్కార్ జిల్లాలు తీసుకుపోగా మిగిలిన కొంచెం నీళ్లు రాయలసీమవాసులే కొట్టేస్తారేమోనని తెలంగాణ వారి భయం. తెలంగాణ పెద్ద ప్రాంతం కాబట్టి, ప్రత్యేక తెలంగాణ ఉద్యమం బలాన్ని చూపించి తెలంగాణవాసులు ఆ నీటిని తామే తీసుకుంటారని రాయలసీమవాసుల భయం.

ఇద్దరూ  కొట్లాడుకుంటున్నది మన రాష్ట్రానికి ప్రాజెక్టులు కట్టుకునే హక్కులు లేని మిగులు జలాల గురించేనని, హక్కులున్న నికర జలాలలో పెద్ద వాటా సర్కార్ జిల్లాలు తీసేసుకున్నాయనీ ఈ కొట్లాట గురించి పేపర్లో చదివిన వారికెవ్వరికీ అర్థం అయి ఉండదు.

వీళ్లిద్దరూ తమలో తాము కొట్లాడుకోనపుడు కర్ణాటకను తిడుతుంటారు. ఆ తిట్లకు కూడ 'క్యూ' (సూచన) బెజవాడ నుండే వస్తుంది. బచావత్ అవార్డు కర్ణాటకకు ఇచ్చిన కృష్ణా జలాల వాటాను వాడుకోవడంలో ఆ రాష్ట్రం చాలా ఆలస్యం చేసింది. ఇప్పుడు కొంత కాలంగా మేల్కొని త్వరత్వరగా వాడుకుంటూ ఉంది. అంతవరకు వాళ్లు వాడుకోక పోవడం వల్ల ఆ నీళ్లు కిందికి వచ్చి మన నీళ్లయ్యాయి. దాంతో మనం (అంటే కృష్ణానదీ మీద ప్రాజెక్టులున్న ప్రాంతాల వాళ్లు) అదనంగా అనుభవించగలిగాం. ఇప్పుడు ఫ్రీగా వచ్చిన ఆ నీళ్లు పోతున్నాయని గొడవ పెట్టడం ఏం సబబు?

ఆల్మట్టి గురించి మన వాళ్లు గొడవ చేసినప్పుడు కర్ణాటక ఈ జవాబే చెప్పింది. సుప్రీంకోర్టు కూడా ఈ జవాబును సమర్థించింది. ఇప్పుడు అప్పర్ తుంగ గురించి మన వాళ్లు అదే విధంగా గొడవ చేస్తున్నారు. కానీ అప్పర్ తుంగ నీళ్లు కూడ కర్ణాటక వాటాలోనివే అని తుంగభద్ర బోర్డు సెక్రెటరీ అంటున్నారు. అదే నిజమైతే ఈ గొడవ కూడ అర్థరహితమైనదే.

కర్ణాటకను తిట్టేటప్పుడు కోస్తా జిల్లాల నాయకులు ప్రయోగించే అతిశయోక్తులను విమర్శించడం కూడ తెలంగాణ, రాయలసీమ నాయకులు తమ కర్తవ్యంగా భావించడం లేదు. కృష్ణా డెల్టా బీడు పడుతుందనీ, అవనిగడ్డలో బ్రహ్మజెముళ్లు మొలుస్తాయనీ కోస్తా జిల్లాల నాయకులు అంటుంటే దేవరకొండ గురించీ పత్తికొండ గురించీ ఎన్నడూ ఒక్క బొట్టు కన్నీరు కార్చని వారికి అవనిగడ్డ గురించి సానుభూతి కోరుకునే హక్కు ఏముందని ఒక్కరూ అడగడం లేదు. కోస్తా జిల్లాల హిపోక్రసీ నుండి తమను తాము వేరు చేసుకునే ప్రయత్నం ఏ మాత్రం చేయకుండా తెలంగాణ, రాయలసీమ నాయకులు కర్ణాటకను తిట్టడంలో వారితో గొంతు కలుపుతున్నారు.

కృష్ణానదీ జలాలు మన రాష్ట్రంలో అసమానంగా పంపిణీ కావడం తెలంగాణ, రాయలసీమల అసలు సమస్య అన్న స్పృహ ఈ నాయకులకు ఎప్పుడొస్తుందో? మిగులు జలాలలో వాటా కోసం తమ మధ్య తాము కొట్లాడుకోవడం కాదు, అసలు జలాలలో తగు వాటా కోసం కొట్లాడడం తమ ఉమ్మడి కర్తవ్యం అన్న స్పృహ వాళ్లకు ఎప్పుడు వస్తుందో? రాయలసీమ నాయకులు ఈ ప్రతిపాదన ఆచరణ సాధ్యం కాదని కొట్టిపారేస్తున్నారు. తెలంగాణ నాయకులు రాయలసీమను ఆంధ్రనుండి వేరు చేసి చూడడం ఇప్పటికీ నేర్చుకోలేదు. రెండింటినీ కలిపేసి 'ఆంధ్ర' అంటూ ఆ 'ఆంధ్ర' నుండి తెలంగాణ వేరయిపోతే, కృష్ణానది ప్రధానంగా ప్రవహించేది తెలంగాణలో కాబట్టి దానిని ఆసరా చేసుకొని ఆ నదీ జలాలలో అధికవాటా తీసుకోవచ్చునని

భావిస్తున్నారు. అందువల్ల ఈ లోపల రాయలసీమను ఆంధ్ర నుండి వేరుగా గుర్తించి, వారితో కూడ కృష్ణ నీళ్లు పంచుకునే ప్రాతిపదిక మీద ఇద్దరూ కలిసి ఆంధ్ర ప్రాంతం మీద పోరాడడం అనవసరం అనుకుంటున్నారు.

కృష్ణానది ప్రధానంగా ప్రవహించేది తెలంగాణలోనే అయినా దాని ముఖ్య ఉపనది అయిన తుంగభద్ర మన రాష్ట్రంలో ప్రధానంగా ప్రవహించేది రాయలసీమలో. (అయితే కృష్ణకు కర్నూలులో కొంత పరీవాహక ప్రాంతం, తుంగభద్రకు మహబూబ్‌నగర్‌లో కొంత పరీవాహక ప్రాంతం ఉన్నాయి.) నది నీటిలో ఉపనది నీటిని వేరు చేయడం అసాధ్యం కాబట్టి జలవనరుల చర్చలో ఒక నదిని గురించి మాట్లాడుతున్నామంటే దాని ఉపనదులను కలిపే మాట్లాడుతున్నామని అర్థం. కాబట్టి కృష్ణానది తెలంగాణ, రాయలసీమలు రెండింటికీ చెందినది. నిజానికి తుంగభద్ర, కృష్ణను కలిసే చోట కృష్ణ నుండి వచ్చి కలిసే నీటి కంటే తుంగభద్ర నుండి వచ్చి కలిసే నీరే ఎక్కువని ఒక అంచనా (అయితే ఇది ఎంత కచ్చితమైన నిర్ధారణో చెప్పలేను).

'ఎవరి నీళ్లె'క్కువ అనే చర్చలోకి పోకుండా, రెండు ప్రాంతాలూ కృష్ణ నీటిని పంచుకోక తప్పదని గుర్తించడం అవసరం. అయితే ఈ గుర్తింపు రెండు ప్రాంతాలలోని రాజకీయ నాయకులలోనే కాదు, మేధావులలోను లేదు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాష్ట్ర నాయకుడు కావచ్చునుగానీ, కృష్ణా నదీ జలాల దగ్గర కొచ్చేసరికి మాత్రం కడప జిల్లా నాయకుడి లాగే మాట్లాడతాడు. తెలంగాణ సంగతి పక్కన పెట్టండి, అనంతపురం అవసరాలను కూడ లెక్కలోకి తీసుకోడు. 1980ల మధ్య భాగం నుండి రాయలసీమ నాయకులూ, మేధావులూ బచావత్ అవార్డు గురించీ, కృష్ణానదీ జలాల గురించీ రాసిన వ్యాసాలలో, పుస్తకాలలో నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల ఊసు ప్రస్తావనగా మాత్రమే కనిపిస్తుంది. అలాగే 'కృష్ణానది' అన్న ప్రయోగంలో తుంగభద్ర కూడ కలిసే ఉందనీ, రాయలసీమతో కృష్ణానది నీళ్లను పంచుకోక తప్పదనీ గుర్తించడానికి తెలంగాణవాసులూ సిద్ధంగా లేరు. కృష్ణ నీళ్ళు 'మా నీళ్ళు' అని భావిస్తారు వాళ్లు. నిజానికి నదిలోకి నీరు వచ్చి చేరే పరిమాణాన్ని బట్టి నది నీటిని 'మా నీళ్ళు', 'మీ నీళ్ళు' అని వర్గీకరించేటట్టయితే, కృష్ణానది నీళ్ళు ప్రధానంగా కర్ణాటకవి- ఆంధ్రవీకావు, తెలంగాణవీ కావు, రాయలసీమవీ కావు. కృష్ణానది జన్మస్థలమైన షిమోగా జిల్లాలో సగటు వర్షపాతం 2500 మి.మీలు కాగా మహబూబ్‌నగర్‌లో 750 మిల్లీమీటర్లు, కర్నూలులో 630 మి.మీలు.

కానీ నది నీటిని ఆ విధంగా నాది, నీది అనడంలో అర్థం లేదు. ఒకచోట వర్షం పడడానికి అక్కడ నివసించేవారు చేసేదేమీ లేదు. వర్షం ప్రకృతి సిద్ధంగా పడుతుంది.

ఒక నది బేసిన్‌లో కురిసే వర్షమంతా (నేలలో కలిసే నీటిని మినహాయించి) నదిలో వచ్చి కలుస్తుంది. ఆ బేసిన్‌లోని ప్రాంతాలలో ఎక్కడ వర్షపాతం తక్కువయితే అక్కడ నదీ జలాలను ఎక్కువ ఇవ్వాలి. అంటే ప్రాజెక్టు నీళ్లు ప్రధానంగా వర్షాభావ ప్రాంతాలకు చెందాలి.

ఇప్పుడు దానికి పూర్తి భిన్నంగా జరుగుతున్నది. మన రాష్ట్రంలోని కృష్ణానది బేసిన్‌లో వర్షాభావ ప్రాంతాలు దేవరకొండ, కల్వకుర్తి, గద్వాల, ఆదోని, పత్తికొండ, ఉరవకొండ, రాయదుర్గం ఇత్యాది కాగా, కృష్ణానది నీళ్లు ఎక్కువగా వాడుకుంటున్నది వర్షపాతం సాపేక్షంగా సమృద్ధిగా ఉన్న కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలు. ఈ అన్యాయాన్ని సవరించడానికి తెలంగాణ, రాయలసీమవాసులు నడుము కట్టడం ప్రస్తుత చారిత్రక అవసరం. అది విడిచిపెట్టి వీరిద్దరూ ఒకరినొకరు నిందించుకోవడం, మేధావులు కూడా వారితో గొంతు కలపడం బాధాకరం.

ఉద్యమం మాసపత్రిక
నవంబర్ 2002

# కృష్ణా జలాలు :
# అతి తెలివి ప్రతిపాదనలు

**కృ**ష్ణానదీ జలాల వినియోగంపైన కొత్త ట్రిబ్యునల్ రానుంది. కృష్ణానదీ పరీవాహక రాష్ట్రాలయిన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలు తమ డిమాండ్లు, ఫిర్యాదులూ ఆ ట్రిబ్యునల్ ముందు ఉంచి పరిష్కారం కోరబోతాయి. ట్రిబ్యునల్ ఇవ్వబోయే అవార్డు- ఇంకొక ముప్ఫై ఏళ్ళో నలభై ఏళ్ళో అమలులో ఉండబోతుంది.

కృష్ణానదీ జలాలు తప్ప వేరే గత్యంతరం లేని కరువు జిల్లాలు మన రాష్ట్రంలో మెండుగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా రాబోయే కృష్ణా జలాల ట్రిబ్యునల్ ముందు ఏ వైఖరి అవలంబించబోతుందనేది ఆ ప్రజలందరి సమస్య. ప్రభుత్వం సంప్రదించిన ఒక్కొక్క పార్టీ ఒక్కొక్క అభిప్రాయం చెప్పడమే కాక, కృష్ణానదీ జలాల సమస్యను అధ్యయనం చేసిన మేధావులు కూడా రకరకాల అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ అభిప్రాయాలన్నిటినీ విని, చర్చించడం కోసమే ఈ సెమినార్ నిర్వహిస్తున్నాం.



రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం ఇప్పటికే తుది రూపం తీసుకుంది కాబట్టి దాని గురించి నాలుగు మాటలు చెప్పి, మా ప్రతిపాదన వివరించి మిమ్మల్ని సెమినార్‌కు ఆహ్వానిస్తాము.

రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదనలలో ఒకటి సమంజసమయినదే. మూడు రాష్ట్రాల మధ్య నదీ జలాల పంపకం అంటూ జరిగిన తరువాత, దాని అమలు గురించి నిత్యం ఒకరినొకరు తిట్టుకుంటూ జనాన్ని

రెచ్చగొట్టుకుంటూ సంకుచిత ప్రయోజనాలు పొందజూసే బదులు దాని పర్యవేక్షణకు నిష్పాక్షికమైన వ్యవస్థను నెలకొల్పడం ఉచితంగా ఉంటుంది. అది రివర్ వ్యాలీ అథారిటీ రూపంలోనయినా ఉండవచ్చు, వేరే ఏ ఉచితమైన రూపంలోనయినా ఉండవచ్చు.

మిగిలిన ప్రతిపాదనలు కర్ణాటక, మహారాష్ట్రలు కృష్ణానదీ జలాలలో తమ వాటాను మించి వినియోగించుకోకుండా ఉండగలందుకు ఆంక్షలు పెట్టే ప్రతిపాదనలు. ఒక్కొక్క రిజర్వాయర్ నుండి పారించుకోవడానికి అనుమతి గల నీటిలో 2/3 వ వంతు కంటె ఎక్కువ రిజర్వాయర్‌లో నిలువ ఉంచుకోకూడదని, ఒక సబ్ బేసిన్ నుండి మరొక సబ్ బేసిన్‌కు నీటి కేటాయింపును బదలాయింపు చేసుకోకూడదనీ మన ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నది.

ఒక రిజర్వాయర్‌లో ఎంత నీరు నిలువ ఉంచుకుంటే ఎంత నీరు పారించుకోవచ్చుననే దానికి సార్వత్రికమైన ప్రమాణమేదీ లేదు. గంగానది లాగా నిత్యం ప్రవహించే నది అయితే అతి చిన్న రిజర్వాయర్‌తోనయినా పుష్కలంగా నీరు పారించుకోవచ్చు. కాని వర్షాభావ ప్రాంతంలో ప్రవహించే నది అయితే ఎక్కువ నీటిని నిల్వ ఉంచుకోవలసి ఉంటుంది. 2/3 అనే నిష్పత్తి సార్వత్రికంగా సరిపోతుందని మన ప్రభుత్వానికి ఎవరు చెప్పారు? ఎక్కువ నిలువ ఉంచుకొని వారి వాటా కంటె ఎక్కువ వాడుకుంటున్నారన్న అనుమానం ఉంటే రివర్ వ్యాలీ అథారిటీ వంటి పర్యవేక్షక యంత్రాంగం దానికి పరిష్కారం కాగలదు గానీ ఇటువంటి అహేతుకమైన పరిమితులు కాదు. ఇక ఒక సబ్‌బేసిన్‌లోని ప్రాజెక్టులకు కేటాయించిన నీటిని మరొక సబ్ బేసిన్‌లోని ప్రాజెక్టులకు బదలాయించకూడదన్న నియమం- మాకు అర్థమయినంతవరకు- దుర్మార్గమైన ఆలోచన. కృష్ణానది నీటిలో కోస్తా జిల్లాలు వాడుకుంటున్న దానిలో గణనీయమైన భాగాన్ని నది ఎగువన ఉన్న దక్షిణ తెలంగాణ, రాయలసీమ జిల్లాలకు బదలాయించనిదే ఆ జిల్లాల కరువు సమస్య తీరదనేది అందరూ ఎరిగిన సత్యం (ఎరిగినట్టు బయటకు ఒప్పుకున్నా- ఒప్పుకోకున్నా).

ఇంకొక ప్రతిపాదన అతి తెలివి ప్రతిపాదన. కర్ణాటక, మహారాష్ట్రలు బచావత్ అవార్డు గడువు ముగిసే నాటికి (అంటే 2000 సంవత్సరం మే నెల 31 నాటికి) వారి వాటాలో ఎంత వాడుకొని ఉంటే అంతే వారి హక్కని ప్రకటించి, ఆ పైన మిగిలివున్న నీటిని మళ్లీ మూడు రాష్ట్రాలకూ పంచాలని మన వాళ్ళు అంటున్నారు. అంటే నీకిచ్చింది నువ్వు వాడుకోకపోతే అది నాకు చెందుతుందని దబాయింపు అన్నమాట. మనందరి తరపున మన ప్రభుత్వం ఈ మాటలు మాట్లాడుతున్నందుకు మనమంతా సిగ్గు పడాలి.

ఇంకొక అతి తెలివి ప్రతిపాదన కూడా మన ప్రభుత్వం పెడుతున్నది. ఒక వైపు మిగులు జలాలపైన పూర్తి హక్కు (ప్రాజెక్టులు కట్టుకునే హక్కుతో సహా) మనకే ఉండాలని అడుగుతూ, అదే సమయంలో ఎగువన ఉన్న కర్ణాటక, మహారాష్ట్రలు తమ హక్కు మేరకు నీళ్ళు నింపుకున్నాకనే మనకు నీళ్ళు వదిలే పద్ధతి విడిచిపెట్టి వచ్చిన నీళ్ళలో మన వాటాను వచ్చింది వచ్చినట్టు కిందికి రానివ్వాలంటున్నారు. ఇవి రెండూ ఏక సమయంలో సాధ్యమా? పై వాళ్ళు తమ కోటా మేరకు పూర్తిగా నింపుకున్నాకనే కిందికి నీళ్ళు వదిలేటట్టయితే, అందరి కేటాయింపులనూ మించి ప్రవహించే నీరేదయినా ఉంటే దానిని కింది రాష్ట్రం వాడుకోవడం ఉచితంగా ఉంటుందనీ, ఎప్పటికప్పుడు నదిలోకి వచ్చిన నీటిని కింది వాళ్ళ వాటా మేరకు కిందికి విడిచిపెట్టేటట్లయితే అందరి కేటాయింపులనూ మించి ప్రవహించే నీటి మీద అందరికీ వాడకపు హక్కు ఇవ్వడం ఉచితంగా ఉంటుందనీ జస్టిస్ బచావత్ భావించారు. ఈ తర్కంలో తప్పేమీ లేదు. రెండు స్కీములలోని అనుకూల అంశాలను కలిపి కొత్త స్కీము తయారుచేసి ప్రతిపాదించడం ప్రజలను మభ్యపెట్టడానికే తప్ప ఇంక దేనికీ పనికిరాదు.

అయితే మన ప్రభుత్వం ప్రతిపాదనల 'ఫ్రేంవర్క్'లోనే లోపం ఉంది. 'ముందు కర్ణాటకతో ఐక్యంగా కొట్లాడుదాం, ఆ తరువాత మన అంతర్గత విభేదాలు పరిష్కరించుకుందాం' అని మన ప్రభుత్వం అంటున్నది కానీ టిఆర్ఎస్ వారు అన్నట్టు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలకూ కర్ణాటకతో ఒకే రకమైన విభేదం ఉందని ఎందుకనుకోవాలి?

అంతేకాక, అంతర్గత విభేదాల పరిష్కారాన్ని గురించి ఒక నిర్ణయం తీసుకున్నాకనే ట్రిబ్యునల్ ముందు ఏ ప్రతిపాదన పెట్టాలో నిర్ణయించుకోగలము. ముందు ట్రిబ్యునల్‌కు పోయి కర్ణాటకను కట్టుదిట్టం చేసి మిగులు జలాలపైన కూడా హక్కు పొందుదాం, ఆ తరువాత మనం మన విభేదాలు పరిష్కరించుకుందాం అంటే పరిష్కరించుకోవడానికీ పంచుకోవడానికీ మిగులు జలాలు మాత్రమే ఉంటాయి. దక్షిణ తెలంగాణ, రాయలసీమ జిల్లాల ముఖాన ఆ మిగులు జలాలు కొట్టి, 'తన్నుకు చావండి' అనబోతారు. ఈ మధ్య కాలంలో ఆ రెండు ప్రాంతాల నాయకులు చేస్తున్న ప్రకటనలు చూస్తే వాళ్లు నిజంగానే తన్నుకు చావడం తథ్యం అని అర్థం అవుతుంది.

దక్షిణ తెలంగాణ, రాయలసీమ జిల్లాలకు కృష్ణానది నీటికి సంబంధించి అనేక హామీలు దశాబ్దాలుగా ఇస్తున్నారు. 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుకూ, 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పాటుకూ, శ్రీబాగ్ ఒప్పందానికీ, పెద్దమనుషుల ఒడంబడికకూ ఈ హామీలే

ప్రాతిపదిక. యాభై ఏళ్ళుగా ఈ హామీలు పునాదిరాళ్ళయ్యాయి, పైలాన్‌లు అయ్యాయి. అంతే తప్ప అవి ప్రాజెక్టులు కాలేదు.

ఇవి వర్షాభావ ప్రాంతాలు కాబట్టి, వీటికి అందరి హక్కులూ పోను మిగిలిన జలాలు కాక, కచ్చితమైన నికర జలాలనే కేటాయించాలి. అది జరగాలంటే సర్కార్ జిల్లాలు కృష్ణా జలాలలో వాడుకుంటున్న వాటాను గణనీయంగా తగ్గించి, శ్రీశైలంలోనూ దానికి ఎగువన మహబూబ్‌నగర్ భూభాగంలోనూ నిలుపుకోవాలి (టిఆర్‌ఎస్ వారు సూచించినట్టు ఆల్మట్టిలోనూ కొంత భాగం నిలుపుకొని మహబూబ్‌నగర్‌కు పారించుకోవచ్చు).

దశాబ్దాలుగా హామీలిచ్చిన ఈ ప్రాజెక్టులకు నెలవయిన నల్గొండ, మహబూబ్‌నగర్, కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల ప్రతినిధులతో 2002 సంవత్సరం జనవరి 21న గద్వాల పట్టణంలో జరిగిన ఒక సెమినార్‌లో ఈ అవగాహనతో కృషి చేయడానికి కృష్ణానదీ జలాల పునఃపంపిణీ ఉద్యమం ఏర్పడింది. హామీ ఇచ్చిన అన్ని ప్రాజెక్టులకూ ముందు నికర జలాలను పునఃపంపిణీ చేసి ఆ పైన ట్రిబ్యునల్ ఎదుట మన రాష్ట్రం వైఖరిని నిర్ణయించుకోవాలనీ, దానికోసం హామీ ఇచ్చిన ప్రాజెక్టుల కోసం ఆందోళన చేస్తున్న ఉద్యమకారులను సంప్రదించాలనీ ప్రభుత్వానికి సూచిస్తూ ఒక లేఖ రాసాము.

మాకొక అభిప్రాయం ఉన్నట్టే అన్ని పార్టీలకూ, అందరు నిపుణులకూ తలా ఒక అభిప్రాయం ఉంది. ఈ అభిప్రాయాల మధ్య చర్చ, సంవాదం జరగడం అవసరం అని మేము భావిస్తున్నాం. అందుకోసం నిర్వహిస్తున్న సెమినార్‌కు అందరూ హాజరై న్యాయమైన నీటి హక్కు సాధనకు తోడ్పడతారని ఆశిస్తున్నాం.

కృష్ణానదీ జలాల పునఃపంపిణీ ఉద్యమం కరపత్రంగా వచ్చింది.
17 నవంబర్ 2002



# ఇది అన్ని రకాలుగానూ మోయలేని బరువు

**ఉ**త్తరాది నదులలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయి కదా, వాటిని దక్షణాదికి పారించి నీళ్లు తక్కువ ఉన్న కృష్ణ, కావేరి, పెన్న బేసిన్లను సస్యశ్యామలం చేయవచ్చునన్న ప్రతిపాదన, దక్షిణాది వారికి వినగానే ఉత్సాహం కలిగిస్తుంది.

విన్న క్షణం మాత్రమే కలిగిస్తుంది. కొంచెం ఆలోచిస్తే, దీని బదులు మరొక భగీరథుడు దిగివస్తాడని నమ్ముకోవడం మేలనీ అది దీనికంటే అవాస్తవికమైన నమ్మకం కాదనీ అర్థం అవుతుంది.

ఒక సీరియస్ ప్రతిపాదనను ఈ విధంగా వెక్కిరించడం భావ్యం కాదంటారేమో. నేను వెక్కిరించడం లేదు, సీరియస్‌గానే అంటున్నాను.



గంగానదిలోని నీటి ప్రవాహం ఆ బేసిన్ అవసరాన్ని మించి చాలా ఎక్కువ ఉన్నమాట వాస్తవమే. బ్రహ్మపుత్ర సంగతి చెప్పనవసరం లేదు. ఆ అదనపు నీరంతా సముద్రంలోకి పోయేబదులు 'లింక్' కాలువల ద్వారా దక్కన్ పీఠభూమి మీదికీ తూర్పు తీరానికీ ప్రవహించి మహారాష్ట్ర, దక్షిణ తెలంగాణ, రాయలసీమ, కర్ణాటక, తమిళనాడులలోని కరువు జిల్లాల పొలాలకు నీరు అందించాలని ఆలోచించడంలో సూత్రప్రాయంగా తప్పేమీ లేదు. ఎటొచ్చీ దానికి కార్యరూపం ఇచ్చే ప్రతిపాదనలను పరిశీలించినప్పుడే ఈ పథకం విజ్ఞత గురించి సందేహం వస్తుంది.

పాట్నా సమీపంలో బ్యారేజి కట్టి సంవత్సరంలో 150 రోజులు 50 వేల క్యూసెక్కుల నీటిని దక్షిణానికి తరలించవచ్చునని ముప్ఫైఏళ్ల కింద కె.ఎల్.రావు అంచనా వేసారని చెప్తారు. నిజానికి 60 వేల క్యూసెక్కుల ప్రవాహాన్ని తరలించే అవకాశం ఉందిగానీ అందులో 10 వేల క్యూసెక్కుల ప్రవాహం దక్షిణ బీహార్ అవసరాల కోసం విడిచిపెట్టవలసి వుంటుందనీ,

మిగిలిన 50 వేల క్యూసెక్కుల ప్రవాహాన్ని గంగా లోయ నుండి నర్మదలోయలోనికీ, అక్కడి నుండి గోదావరి లోయలోనికీ, అక్కడి నుండి కృష్ణలోయలోనికీ, అక్కడి నుండి కావేరి లోయలోనికీ తరలించవచ్చుననీ ఆయన ఆనాడు ప్రతిపాదించాడు.

ఆనాటి 'దక్షిణ బీహారే' ఈనాటి జార్ఖండ్. ఆనాడు అది ఒక వెనుకబడిన రాష్ట్రంలో వివక్షకు గురయిన ప్రాంతంగా ఉండింది. ఇప్పుడు ఆ వివక్షను అధిగమించడం కోసం వేరుపడి ఒక ప్రత్యేక రాష్ట్రం అయింది. గంగానదీ జలాన్ని దక్షిణానికి తీసుకుపోవడం మొదలుపెడితే వారు అందులో పదివేల క్యూసెక్కుల ప్రవాహంతో సంతృప్తి చెందుతారా? జార్ఖండ్‌లో ప్రతి ఎకరానికీ నీళ్లిచ్చిన తరువాతే నర్మదా బేసిన్‌లోనికి గంగాజలాన్ని పోనిస్తామని వాళ్లు అనరని నమ్మకమేమిటి?

నర్మదానది లోయ నుండి గోదావరి లోయలోనికి వచ్చే లోపల ఛత్తీస్‌గఢ్, విదర్భ అనే మరి రెండు కరువు పీడిత ప్రాంతాలు మన 'గంగా-కావేరి' కాలవకు తారసపడతాయి. ఛత్తీస్‌గఢ్ కూడ తన అభివృద్ధికి మధ్యప్రదేశ్‌లో న్యాయమైన ప్రయత్నం జరగడం లేదన్న అభియోగంతో వేరుపడిన రాష్ట్రం. మహారాష్ట్ర మీద అదే అభియోగం పెట్టి వేరుపడడానికి సిద్ధంగా ఉన్న ప్రాంతం విదర్భ. ఈ రెండు ప్రాంతాల అవసరాలను కాదని గంగానది నీటిని మన పొలాలకు తీసుకురావడం 1970లో సాధ్యమయ్యేదేమోగానీ ఇప్పుడు సాధ్యం కాదు.

అటువంటప్పుడు 'గంగా-కావేరి' లింకు ప్రాజెక్టు మనకు ఇవ్వగల నీరెంత?

ఈరోజు దేశంలోని అన్ని ప్రాంతాలలోనూ తమ ప్రాంత అవసరాల గురించి, ప్రయోజనాల గురించి ప్రజలలో స్పృహ పెరిగింది. చైతన్యం పెరిగింది. ఇది కొంత మందికి సంకుచితమైన ప్రాంతీయతత్వంగా కనిపించవచ్చును. ఒక్కొక్కప్పుడు నిజంగానే సంకుచిత రూపం తీసుకోవచ్చును కూడా. అయినప్పటికీ ఇది మౌలికంగా సత్పరిణామమే. గంగానది నీటిని దక్షిణాదికి తీసుకొచ్చే ప్రయత్నం అడుగడుగునా ఈ స్థానిక చైతన్యాన్ని ఎదుర్కొంటుంది. దానిని సంతృప్తి పరచక తప్పదు. అటువంటప్పుడు గంగ దగ్గర బయలుదేరిన నీరు నేరుగా గోదావరికి వచ్చేస్తాయనుకోవడం తెలివితక్కువతనం.

పాట్నాకు దిగువన గంగానదిపైన ఆధారపడిన ప్రజల ప్రయోజనాలకు అవసరమైన ప్రవాహాన్ని ఉండనిస్తూ కూడా పాట్నా దగ్గర 60 వేల క్యూసెక్కుల ప్రవాహాన్ని పక్కకు మళ్ళించవచ్చునని ఆనాడు కె.ఎల్.రావు అన్నారు. ఈనాటి స్థానిక చైతన్యం దృష్ట్యా ఈ అంచనా సరయినదేనా? మన దేశం సంగతి అటుంచి పాట్నాకు దిగువన వున్న ఫరక్కా బ్యారేజిని దాటిన తరువాత గంగానది బంగ్లాదేశ్‌లోనికి ప్రవహిస్తుంది. ఫరక్కా బ్యారేజి నిర్మాణానికి అనుమతించడమే బంగ్లాదేశ్ ప్రయోజనాలను దెబ్బ తీసిందని

ఆ దేశంలోని కొన్ని రాజకీయపక్షాలు ఆందోళన చేస్తున్నాయి. షేక్ హసీనాను ఆ కారణంగా భారత్ ఏజెంట్‌గా అభివర్ణిస్తున్నాయి. ఇప్పుడు ఫరక్కాకు ఎగువన పాట్నా దగ్గర 60 వేల క్యూసెక్కుల ప్రవాహాన్ని మనం పక్కకు మళ్లించుకుంటామంటే బంగ్లాదేశ్ ఊరుకుంటుందా? ఇది అంతర్జాతీయ సమస్య అయ్యే ప్రమాదం లేదా?.

కె.ఎల్.రావు పథకాన్ని యథాతథంగా అమలు చేయబోమనడం ఈ ప్రశ్నలకు జవాబు కాదు. గంగ నీటిని కావేరికి మళ్లించడానికి ఏ పథకాన్ని రచించినా ఈ సమస్యలు రాకతప్పదు.

రెండవది 'లిఫ్టు' సమస్య. గంగా–కావేరి లింకు ప్రాజెక్టులో కనీసం రెండుచోట్ల భారీగా లిఫ్టులు ఉపయోగించాలి. మొదటిది–గంగానది లోయ నుండి నీటిని వింధ్య పర్వతశ్రేణులు దాటించి నర్మదా బేసిన్‌లో పడేయడానికి. రెండవది–గోదావరి నుండి తెలంగాణ మధ్య భాగాన్ని దాటించి కృష్ణ బేసిన్‌లో వేయడానికి. (నర్మదా బేసిన్ నుండి గోదావరి బేసిన్‌కు, కృష్ణా బేసిన్ నుండి కావేరి బేసిన్‌కు లిఫ్టు అవసరం లేకుండా గ్రావిటీ ద్వారానే నీరు ప్రవహించే అవకాశం ఉంది.)

ఇందులో మొదటి లిఫ్టు దాదాపు 350 మీటర్లు, రెండవది 150 మీటర్లు ఉంటాయి. అంటే మొత్తం 500 మీటర్ల లిఫ్టు అవసరం ఉంటుంది. సంవత్సరంలో 150 రోజులు 50 వేల క్యూసెక్కుల ప్రవాహాన్ని 500 మీటర్లు లిఫ్టుచేసి పోసే భారీ విద్యుత్ వ్యవస్థ దీనికి అవసరం.

పరిమాణం సంగతి అటుంచి, దీని ఖర్చు ఎవరు పెట్టుకుంటారు? 1 ఎకరానికి ఆరుతడి పంటకు నీళ్లియ్యడానికి 100 మీటర్లు లిఫ్టు చేసి పోసేటట్టయితే యూనిట్ 2 రూ॥ల రేటు ప్రకారం సంవత్సరానికి 2000 రూ॥ ఖర్చు అవుతుందని అంచనా. 500 మీటర్లు ఎత్తి పోయడానికి ఎకరానికి 10,000 రూ॥లు ఖర్చవుతుంది. ప్రస్తుతం మన ప్రభుత్వాలు ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి కంపెనీల దగ్గర యూనిట్ 3 రూ॥లు (ఇంకా ఎక్కువ కూడ) పెట్టి కరెంటు కొంటున్నాయి కాబట్టి ఆ ప్రకారం లెక్క పెట్టుకుంటే ఎకరానికి 15,000రూ॥లు ఖర్చవుతుంది.

సాగునీటి కోసం ఎకరానికి 15,000 రూ॥లు ఖర్చుపెట్టగల రైతులు ఎక్కడ ఉన్నారు.?

కరెంటు అంత ఖర్చుకాకపోవచ్చుననీ, గంగా–కావేరీ కాలువ నుండే మార్గ మధ్యంలో కరెంటు ఉత్పత్తి చేయవచ్చుననీ, అది గ్రావిటీ మీద ఆధారపడే జలవిద్యుత్తు కాబట్టి యూనిట్‌కు రూ॥1–00 కూడ ఖర్చుకాదనీ ఒక వాదన ఉంది. నర్మదా బేసిన్ నుండి గోదావరి బేసిన్‌కు పోయే దారిలో కొన్ని చోట్ల 'డ్రాప్' చెప్పుకోదగ్గ మోతాదులో ఉన్న కారణంగా అక్కడ విద్యుత్తు ఉత్పత్తి చేయొచ్చు. కానీ దీని పరిమాణం ఎంత ఉండగలదో అంచనా లేదు. ఆ కరెంటును వెనక్కి తీసుకుపోయి గంగా బేసిన్ నుండి వింధ్య

పర్వత శ్రేణులపైకి నీటిని లిఫ్టుచేయడానికి వినియోగించేటట్టయితే అయ్యే కరెంటు సరఫరా ఖర్చు ఎంత, సరఫరా నష్టం ఎంత అనే అంచనా లేదు. ఒకవేళ అన్నీ లెక్కలోకి తీసుకున్నా ఒక ఎకరానికి రూ॥ 10,000 నుండి 15,000 పెట్టుకోగల రైతులు మాత్రం ఎంత మంది ఉన్నారు? 10,000 కాదు, ఎకరానికి 2,000 రూపాయలు సాగునీటి కోసం ఖర్చుపెట్టుకొని బతికి బట్టకట్టగల రైతులు తెలంగాణలోనయినా రాయలసీమలోనయినా ఉన్నారా?

కె.ఎల్.రావు తన పథకం రచించిన రోజులలో విద్యుత్ వ్యవస్థ మొత్తం ప్రభుత్వ రంగంలో ఉండేది. వ్యవసాయానికీ ఇతర తప్పనిసరి అవసరాలకూ కరెంటు సబ్సిడీ ఇచ్చే సంప్రదాయమూ ఉండింది. ఇప్పుడు విద్యుత్ వ్యవస్థ వేగంగా ప్రైవేటీకరించబడుతున్నది. విద్యుత్ ఉత్పత్తిలో కనీసం 60 శాతం ప్రైవేటు రంగంలో జరగాలని ప్రపంచబ్యాంకు షరతు. ప్రైవేటు అంటే బహుళజాతి సంస్థలనే అర్థం. విద్యుత్ చార్జీలకు సబ్సిడీలు మొత్తంగా తొలగించి వేయాలన్నది కూడ ప్రపంచ బ్యాంకు షరతులలో ఒకటి. కాబట్టి గంగా – కావేరి లింకు అంటే అర్థం కరువు రైతులు ఎన్‌రాన్ వంటి బహుళజాతి కంపెనీల దగ్గర భారీ మూల్యానికి నీళ్లు కొనుక్కోవడం అని. ఖర్చు సంగతి అటుంచి విదేశీ కంపెనీల వ్యాపార ప్రయోజనాలపైన ఆధారపడక తప్పని పద్ధతిలో కరువు ప్రాంతాల నీటి అవసరం తీర్చడం రాజకీయంగా తెలివయిన పనేనా? బహుళ జాతి కంపెనీల వ్యాపార ప్రయోజనాలనూ అమెరికా రాజ్యం ఆధిపత్య నీతినీ వేరు చేసి చూడగల రోజులెప్పుడయినా ఉన్నాయేమో గానీ ఇప్పుడు ఆ రెండింటి మధ్య విభజన రేఖ లేదని ఇరాక్ యుద్ధం స్పష్టం చేసింది.

ఇంకొక సమస్య కూడ ఉంది. నర్మదా బేసిన్ నుండి గోదావరికి వచ్చి చేరే గంగా నది నీటిని నిలువ చేయడానికి గోదావరి మీద తెలంగాణలో పెద్ద రిజర్వాయరు నిర్మించాలి. కె.ఎల్.రావు ఇచ్చంపల్లిని సూచించారు. ఇచ్చంపల్లి దగ్గర కాకపోతే దానికి ఇటో అటో బ్యారేజి కట్టవలసి ఉంటుంది. అయితే దీని వల్ల అడవిభూమి, ఆదివాసీ ఆవాసాలు పెద్దఎత్తున మునుగుతాయి. 200 పైగా ఆదివాసీ గ్రామాలు మునుగుతాయని అంచనా. మొదటి నుండి ఇచ్చంపల్లి ప్రాజెక్టుపట్ల మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లు ఉత్సాహం చూపకపోవడానికి కారణం ఇదే. మధ్యప్రదేశ్ ఒప్పుకోనిది ఆదివాసుల ప్రయోజనాలకు ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వక తప్పని ఛత్తీస్‌గఢ్ ఒప్పుకుంటుందనుకోవడం అవివేకం అవుతుంది.

గోదావరి జలాలను తెలంగాణ అవసరాల కోసం తీసుకోవడానికి ఎట్లాగూ వరంగల్–కరీంనగర్ సరిహద్దు ప్రాంతంలో ఒక ప్రాజెక్టు కట్టుకోక తప్పదు కాబట్టి అదే ప్రాజెక్టును గంగా– కావేరి లింకు కోసం వాడుకోవచ్చునంటారేమో. అది సరైన అభిప్రాయం కాకపోవచ్చు. గంగాజలం దక్షిణాదికి 365 రోజులూ రాదు. 150

రోజులు వస్తుందని కె.ఎల్.రావు అభిప్రాయం. గోదావరి నుండి తెలంగాణ అవసరాల కోసం ఇచ్చంపల్లికి దిగువన ఎక్కడి నుండయినా తీసుకునే నీరు 365 రోజులూ అందుబాట్లో ఉంటుంది. దానిని లిఫ్టుద్వారా తీసుకోవడానికి పెద్ద రిజర్వాయరు అక్కర లేదు. చిన్న ఆనకట్ట కట్టి ఎప్పటికప్పుడు లిఫ్టుద్వారా తీసుకోవచ్చు. దేవాదుల (అది అయితే గియితే) ఆ రకమైన ప్రాజెక్టు. సంవత్సరంలో సగం రోజులు వచ్చే గంగనీటిని మిగిలిన రోజులలో కూడ కిందికి తీసుకుపోవాలంటే గోదావరిపైన పెద్ద రిజర్వాయరు కట్టి నీటిని భద్రపరచక తప్పదు. ముంపు కారణంగా అటువంటి ప్రాజెక్టు సాధ్యం కాకపోవచ్చు.

ఎప్పటికప్పుడు చెల్లించవలసిన కరెంటు బిల్లులేకాక ప్రాజెక్టు నిర్మాణానికి అయ్యే ఖర్చు కూడా పెద్ద మొత్తంలో ఉంటుంది. ఈ ఖర్చు కొన్ని వేల కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా. సాగునీటి కోసం అంత ఖర్చు పెట్టడానికి మన పాలకులు సిద్ధంగా ఉన్నారా? సుప్రీంకోర్టు ఆదేశించింది కాబట్టి కొంత హడావుడి చేస్తున్నారు. ఇప్పుడు దేశాన్ని ఏలుతున్న వ్యవసాయ విధానంలో సాగునీటికి కేంద్ర స్థానం లేదు. వ్యవసాయ వ్యాపారీకరణ, ఎగుమతి మార్కెట్లతో దానిని ముడిపెట్టడం ప్రస్తుత వ్యవసాయ విధానం ప్రముఖ లక్షణం. దానికి ఎంతమేరకు, ఎక్కడ, ఏ రూపంలో సాగునీరు అవసరమయితే అంతమేరకు మాత్రమే సాగునీటి గురించి మన పాలకులు ఆలోచించదలచుకున్నారు. ఇది ఎక్కువ భాగం నదీజలాల ప్రాజెక్టుల రూపంలోకాక రైతులు స్వంత ఖర్చుతో కల్పించుకునే చిన్న నీటి వనరుల రూపంలో ఉండబోతుంది.

అటువంటప్పుడు భారీగా పెట్టుబడులు అవసరమయ్యే గంగా-కావేరి లింకు ప్రాజెక్టును ప్రభుత్వం తన ఖర్చుతో చేపడుతుందని నమ్మగలమా? ఏదో ఒక బహుళజాతి కంపెనీకి అప్పగించి 'యూజర్ ఛార్జీల' పేరు మీద రైతులనుండే ఆ ఖర్చును రాబట్టుకునే ఆలోచన చేయదని నమ్మకమా?

మొదట చర్చించిన సమస్యకు తిరిగివద్దాం. మన రాష్ట్రంలోని భిన్న ప్రాంతాలు పొరుగువారి నీటి అవసరాల కోసం ఒక చుక్కనీళ్ళు వదులుకోవడానికి సిద్ధంగా లేరని చూస్తూనే, మనం గంగా బేసిన్ వాసులు తమిళనాడు దాకా దక్షిణాన ఉన్న అన్ని ప్రాంతాల కోసమూ గంగనీటిని విడిచి పెడతారని సులభంగా నమ్మేస్తున్నాం. పులిచింతలలో నిలువ ఉంచడానికి 9 టియంసిల నీరు ఉన్నట్టయితే దానిని ఎగువనున్న కరువు ప్రాంతాలకు కేటాయించాలనీ, పులిచింతల కట్టి కృష్ణా డెల్టా స్థిరీకరణకు అంత ప్రాముఖ్యం ఇవ్వడం అన్యాయమని తెలంగాణవాసులూ రాయలసీమవాసులూ కొన్ని సంవత్సరాలుగా గొడవ చేస్తున్నా పులిచింతల కట్టి తీరుతామన్న పంతాన్ని ఆంధ్రప్రాంతం వారు వదులుకోవడం లేదు. కృష్ణాజలాల

గురించి కొత్త ఒప్పందమేదయినా జరిగి ఇంకొంచెం నీళ్లు ఎగువ ప్రాంతానికి దక్కేటట్టయితే దానిని రాయలసీమవాసులతో పంచుకోవడానికి తెలంగాణవాసులకు మనసొప్పడం లేదు. శ్రీశైలం నుండి ఎస్కేప్‌చానెల్ ద్వారా నియమాలకు విరుద్ధంగా కె.సి.కెనాల్‌కు కృష్ణనీళ్లు తీసుకుంటున్న కర్నూలు-కడప వాసులు ఆ మేరకు తుంగభద్ర నీటిని కె.సి.కెనాల్ నుండి హెచ్.ఎల్.సికి బదలాయించడానికి అంగీకరించాలన్న అనంతపురంవాసుల కోరికకు స్పందించడం లేదు. రెండు రాష్ట్రాల ఉమ్మడి నది అయిన పెన్న మీద కర్ణాటకకు కూడ హక్కు ఉందని ఒప్పుకోవడానికి అనంతపురం వాసులు సిద్ధంగా లేరు. అసలు నదీ జలాల గురించి కర్ణాటక ఏం మాట్లాడినా అదంతా అబద్ధమేనన్న ప్రగాఢ నమ్మకాన్ని వదులుకోవడానికి తెలుగు వారెవ్వరూ సిద్ధంగా లేరు.

అయినప్పటికీ గంగా బేసిన్ ప్రజలు 'తమ నీటిని' నర్మదా బేసిన్‌కూ, తపతి బేసిన్‌కూ, గోదావరి బేసిన్‌కూ, కృష్ణ బేసిన్‌కూ, పెన్న బేసిన్‌కూ, కావేరి బేసిన్‌కూ సులభంగా ఇచ్చేస్తారని మనమంతా (మనం గంగా బేసిన్ వాళ్లము కాదు కాబట్టి) సులభంగా నమ్మేస్తున్నాం.

ఇప్పుడు ఈ అలజడి అంతా సుప్రీంకోర్టు ఆదేశం నుండి పుట్టింది. ఈ మధ్యకాలంలో మన కోర్టులు తమకు తెలిసీ తెలియని విషయాలలో ఆర్డర్లు జారీ చేయడం అలవరచుకున్నాయి. బాబ్రీ మసీదు స్థలం మీద యాజమాన్యం ఎవరిదో తేల్చమని అలహాబాద్ హైకోర్టును అడిగితే, దానికింద తవ్వి అక్కడ ఎప్పుడయినా రామాలయం ఉండేదేమో చూడమని పురావస్తుశాఖను ఆదేశించింది. అదే విధంగా, కరువు గురించి ప్రభుత్వాలు ఏమీ చేయడం లేదని సుప్రీంకోర్టులో కేసు వేస్తే, బ్రహ్మపుత్ర నీళ్లు దేశమంతా పంచమని ఆ కోర్టు ఆదేశించింది.

కరువు సమస్యనూ దాని పరిష్కారాన్నీ సుప్రీంకోర్టు జడ్జిలలాగ మిడిమిడి జ్ఞానంతో కాక లోతుగా అధ్యయనం చేసినవారు ఉన్నారు. వర్షం నీటిని, ఉపరితల జలాలను, భూగర్భజలాలను పర్యావరణాన్ని ధ్వంసం చేయని రీతిలో ఉపయోగించుకుంటూ అందరి నీటి అవసరాలూ సమానంగా తీర్చుకోవడం సాధ్యమే! ఆకాశమంత పెద్ద ప్రణాళికలు తయారు చేసి రైతుల నడ్డి విరచవలసిన పనిలేదు. మన వ్యవసాయరంగం భవిష్యత్తును మన నియంత్రణలో లేని శక్తుల చేతిలో పెట్టనవసరం లేదు. కేంద్రీకృత వ్యూహాలు రచించి స్థానిక ప్రజాసమూహాల మధ్య చిచ్చుపెట్టనవసరం లేదు.



కదలిక మాసపత్రిక
ఏప్రిల్ 2003

# ‘పునఃపంపిణీ’ జరగకుండా కరువు సమస్య తీరుతుందా?

ఎప్పుడూ కరువు ఉండే ప్రాంతాలలోనే కాక హెచ్చుతగ్గులుగా రాష్ట్రమంతటా ఈ సంవత్సరం కరువు ఉండడం వల్ల ‘కరువు సమస్య’ అన్ని చోట్లా చర్చకు వస్తున్నది. పత్రికలూ ఇతర ప్రసార సాధనాలూ కరువును ఒక ప్రధాన విషయంగా చర్చిస్తున్నాయి.

అంతవరకు మంచిదే. కానీ దినపత్రికలలో కరువు గురించి రాస్తున్న వారు గతంలో ఆ విషయాన్ని పట్టించుకున్నవారు కాకపోవడం వల్ల వారు చేస్తున్న చర్చ దుర్భర పరిస్థితుల వర్ణనను దాటిపోవడం లేదు.



కరువంటే వర్షాభావం కాదు. కరువంటే నీటి ఎద్దడి. మొక్కలకూ మనుషులకూ పశువులకూ కావలసినంత నీరు దొరకక పోవడం కరువు. వర్షపాతంలో లోటు దానికి ఉండగల ఒకానొక కారణం మాత్రమే. వర్షం ఎక్కువ పడినా అది అకాల వర్షమో అకస్మాత్తు వర్షమో అయితే కరువును తప్పించుకోలేకపోవచ్చు. వర్షం తక్కువ పడినా నీటివనరుల సమర్థ వినియోగం అలవరచుకున్న చోట కరువును తప్పించుకోవచ్చు. వర్షాభావం ఉన్న సంవత్సరాలలో నీటి కొరతకు గల ఇతర కారణాలు ఒకదానికొకటి తోడయి కరువును పెంచుతాయనేది సత్యమే. కానీ వర్షాభావమే కరువుకు కారణం కాదు.

మహబూబ్‌నగర్ జిల్లాలోనూ, దీనికి పొరుగున్న ఉన్న నల్లగొండ, రాయలసీమ జిల్లాలలోనూ కరువు నిత్యం ఉంటుంది. వాతావరణ నిపుణులు రుతుపవనాలు సకాలంలో వచ్చి సమృద్ధిగా వాన కురిపించాయని ప్రకటించిన సంవత్సరాలలోనూ కరువు ఉంటుంది, లేని

సంవత్సరాలలోనూ ఉంటుంది. లేని సంవత్సరాలలో మరి కొంచెం ఎక్కువ ఉంటుందంతే. 'కరువు ప్రాంతాలు'గా పేరుగాంచిన అన్ని ప్రాంతాలకూ ఇదే వర్తిస్తుంది.

ఇక్కడ కరువు ఒక వ్యవస్థ, వైపరీత్యం కాదు. సగటు పరిస్థితి, విపరీత పరిస్థితి కాదు. పనులు దొరకక వలస పోవడం, పశువులకు మేత దొరకక కోతకు తోలడం, మంచినీటి కోసం మైళ్లకు మైళ్లు తిరిగిరావడం ఇక్కడ నిత్యజీవిత పరిస్థితులు.

దీనికి పరిష్కారం దొరకాలంటే వానదేవుడిని తిట్టుకునీ ప్రయోజనం లేదు, పూజలూ యాగాలూ చేసీ ప్రయోజనం లేదు. పూజల వల్ల వర్షం కురుస్తుందని ఒకవేళ మనం నమ్మినా అది కురిసిన సంవత్సరం కూడా ఇక్కడ కరువే కాబట్టి వాటివల్ల ప్రయోజనమేమీ లేదు.

మనకు అందుబాట్లో ఉన్న నీటి వ్యవస్థను ఎంత న్యాయంగా, ఎంత సమర్థంగా వాడుకుంటున్నామన్నది మనం చూడవలసిన విషయం. పరిగెత్తే నీటికి నడక నేర్పించాలనీ కురిసే వాన మొత్తం భూగర్భ జలాలలో చేరి బావుల ఊట పెంచేటట్టు చూడాలనీ మన ముఖ్యమంత్రి మనల్ని ఊరికే ఊదరగొడుతుండడం వల్ల భూగర్భ జల వ్యవస్థ గురించి మాత్రం కొంచెం అవగాహన పెరిగింది.

కానీ మన ప్రభుత్వం అదొక్కటి మాత్రమే ఎందుకు మాట్లాడుతుంది? వర్షం నేలమీద మాత్రమే కురవదు. వాగులలో, వంకలలో, కుంటలలో, చెరువులలో, నదులలో అన్నిచోట్లా కురుస్తుంది. వీటన్నిటినీ 'ఉపరితల జలవనరులు' అంటారు. భూగర్భ జల వ్యవస్థ గురించి ఎంతగా ఆలోచించాలో, ఉపరితల జల వ్యవస్థ గురించి కూడ అంతగా ఆలోచించాలి కదా! ప్రభుత్వం ఆలోచించకపోతే మనమైనా ఆలోచించాలి కదా!

మహబూబ్‌నగర్‌నే తీసుకున్నట్టయితే కృష్ణానది ఈ జిల్లాకు స్వతస్సిద్ధమైన వనరు. ఆ నది నీటిలో న్యాయబద్ధమైన వాటా మహబూబ్‌నగర్‌కు అందినట్టయితే వర్షాభావం ఉన్న సంవత్సరాలలో కూడా పరిమితమైన కరువుతో ఈ జిల్లా తప్పించుకోగలుగుతుంది.

మహబూబ్‌నగర్‌కు ప్రధానంగా వర్తించే ఈ విషయం నల్లగొండకు, రాయలసీమ జిల్లాలకు కూడా వర్తిస్తుంది. అయితే చారిత్రకంగా నెలకొన్న చేదు వాస్తవమేమిటంటే కృష్ణానదీ జలాలలో పెద్ద వాటా దిగువన ఉన్న సర్కారు జిల్లాలు తీసుకుంటున్నాయి. అక్కడ సగటు వర్షపాతం ఇక్కడికంటె బాగా ఎక్కువ. కాబట్టి నేలలో తేమ ఎక్కువ,

భూగర్భ జలాలు ఎక్కువ, 'నీటికి నడక నేర్పించినట్ట'యితే భూగర్భ జలాలను పెంపొందించుకునే అవకాశమూ ఎక్కువ.

అయినా ఆ ప్రాంతానికే నదీ జలాలలో పెద్ద వాటా ఇచ్చి వర్షపాతం తక్కువ ఉన్న జిల్లాలను ఎండబెట్టడం సమైక్య ఆంధ్రలో యాభై ఏళ్లుగా జరిగిన వంచన.

దీని గురించి మాట్లాడకుండా కరువు సమస్య గురించి మాట్లాడగలమా? తరలి పోతున్న కూలి జనం ఫోటోలు, బక్కచిక్కిన పశుగణం చిత్రాలు ఎన్ని ప్రచురించినా కరువు సమస్యను పూర్తిగా చూపించినట్టవుతుందా? కృష్ణా నదీ జలాల అసమాన పంపిణీని అంతమొందించడం కరువు సమస్య పరిష్కారానికి ఒక ముఖ్య సాధనం అని ప్రకటించకుండ కరువు చర్చను ముగించగలమా?

ఇది ఆకలి దప్పుల చర్చ మాత్రమే కాదు, జీవన్మరణ సమస్య. ఈ సంవత్సరం మే నెల మొదటి వరకే మహబూబ్‌నగర్ జిల్లాలో 28 మంది తిండిలేక చనిపోయారు. కరువు వ్యవసాయం బరువు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న వారినీ, తిండిలేక ఒంట్లో సత్తువ లేక వడదెబ్బకు చనిపోయిన వారినీ, తిండి కోసం దూరప్రాంతానికి కూలీలుగా వలసపోయి దిక్కులేని మరణం పాలయిన వారినీ కూడ లెక్కపెట్టుకుంటే ఈ సంవత్సరం కరువుకు ప్రత్యక్షంగానో పరోక్షంగానో మహబూబ్‌నగర్ జిల్లా వాసులు వంద మందిదాకా బలి అయి ఉంటారు.

పరిస్థితి ఇంత ఘోరంగా ఉన్నా మన రాష్ట్ర ప్రభుత్వం కృష్ణానదీ జలాల పునఃపంపిణీ సంగతి అటుంచి, అనుమతి పొందిన ప్రాజెక్టుల విషయంలో సహితం వివక్షను విడిచిపెట్టడం లేదు. మే నెల మొదటి వారంలో చంద్రబాబు నాయుడు కృష్ణా జిల్లా నందివాడలోనూ, మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్‌లోనూ కృష్ణానదీ జలాల ప్రాజెక్టుల గురించి ఉపన్యసించాడు. అక్కడ పులిచింతల గురించి, ఇక్కడ భీమా గురించి మాట్లాడాడు. ఇవి రెండూ ఒకే ప్రాతిపదికన నికరమైన నీటి కేటాయింపు పొందిన ప్రాజెక్టులు. మొదటిది సంపన్నమైన కృష్ణా డెల్టా స్థిరీకరణ కోసం ఉద్దేశించిన ప్రాజెక్టు కాగా, రెండవది కరువు పీడిత మహబూబ్‌నగర్ ప్రజలకు ప్రాణం పోయడం కోసం రూపొందించిన ప్రాజెక్టు. అయితే నందివాడలో మాట్లాడుతూ పులిచింతలను 'త్వరలోనే' పూర్తి చేస్తానని హామీయిచ్చిన ముఖ్యమంత్రి, భీమా గురించి మాట్లాడేటప్పుడు ప్రాజెక్టుకు నిధులు సేకరించే ప్రయత్నంలో ఉన్నామని ఆశ చూపిస్తూ (పులిచింతలకు ఉన్న నిధులు భీమాకు ఎందుకు లేకుండా పోయాయో) భీమా

ప్రాజెక్టులో ఒక భాగంగా చూపించబడుతున్న 15 వేల ఎకరాల ఆయకట్టు గల 'సంగంబండ రిజర్వాయరు' పరిపూర్తి గురించి మాత్రమే హామీ ఇచ్చాడు. సంగంబండ రిజర్వాయర్‌ను అక్కడికే పరిమితం చేస్తే ఇంక భీమా ప్రాజెక్టు అనేదేదీ ఉండదని ముఖ్యమంత్రికి తెలియదనుకోవాలా?

ఇప్పుడు అమలవుతున్న ఈ వివక్ష నుంచి రేపు జరగవలసి ఉన్న పునఃపంపిణీ దాకా అన్ని విషయాలూ చర్చించుకుందాం రమ్మని ఆహ్వానిస్తూ....

12 మే 2003

మే 16న మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్‌లో జరిగిన సదస్సు కోసం రాసిన ఈ కరపత్రం కృష్ణానదీజలాల పునఃపంపిణీ ఉద్యమం కరపత్రంగా వచ్చింది.



# సీమాంతర ఉగ్రవాదం

అనంతపురం జిల్లాలోని తెలుగుదేశం సానుభూతిపరులను కూడగట్టి రాష్ట్ర సరిహద్దు దాటి పరగోడు రిజర్వాయర్ దగ్గరకు పోయి పని ఆపాలన్న ఆందోళన చేపట్టిన చంద్రబాబుకు ఎవరూ ఒక విషయం చెప్పినట్టు లేదు. శ్రీశైలానికి దర్శనానికి పోయే వారిలో కన్నడిగులే ఎక్కువ. దర్శనం అయిపోయిన తరువాత వారు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు అడ్డం పండుకొని తెలుగుగంగ 'ఇరిగేషన్ కాంపొనెంట్'కు ఆంధ్రప్రదేశ్ కృష్ణా నీళ్ళు తీసుకోకుండా అడ్డుకొమ్మని కర్ణాటక ముఖ్యమంత్రి కృష్ణ రెచ్చగొడితే ఏమవుతుంది? ఎందుకంటే తెలుగుగంగలో మద్రాసుకు మంచి నీళ్ళిచ్చే 'కాంపొనెంట్' మాత్రమే చట్టబద్ధమైనది. పనిలో పనిగా కర్నూలు, కడప, నెల్లూరు జిల్లాలలో సాగునీటి కోసం మనం తీసుకోవాలని చూస్తున్న నీళ్ళకు బచావత్ అవార్డులో అనుమతి లేదు. దాని గురించి కర్ణాటక ప్రభుత్వం అప్పుడప్పుడు నిరసన ప్రకటనలు చేస్తున్నది గానీ గుంపును పోగు చేసి దానికి అడ్డం పడాలన్న ఆలోచన కర్ణాటక ఇప్పటిదాకా చేయలేదు. ఇప్పుడు చంద్రబాబు దారి చూపించాడు కాబట్టి చేయొచ్చు.



నదీజలాల వాడకానికి సంబంధించిన చేదు వాస్తవం ఏమిటంటే నియమ విరుద్ధమయిన నడవడిక మొదలు పెట్టింది మనమే. అన్ని నియమాలనూ మొదట అతిక్రమించింది మనమే. మనల్ని చూసి కర్ణాటక నేర్చుకుంటున్నదని ఉక్రోషం ప్రదర్శించడం ఏం న్యాయం?

చంద్రబాబు ఊరికే రచ్చ చేయడం, ప్రతిపక్షాలు (వామపక్షాలతో సహా) తగుదునమ్మా అని 'కడదాకా నీతోనే ఉంటాం' అని అతనికి హామీ ఇవ్వడం చూస్తే పరగోడు ఎంతపెద్ద ప్రాజెక్టో, దానిని నిర్మించడానికి కర్ణాటక ఎంత పెద్ద అక్రమానికి పాల్పడుతున్నదో అని అనుకోవచ్చు.

రెండూ నిజాలు కావు. పరగోడు మన ఊళ్ళలోని సగటు చెరువు సైజు ప్రాజెక్టు. దానిని కర్ణాటక మంచి నీటి పేరు చెప్పి నిర్మించుకొని సాగునీటి కోసం పారించుకున్నా తద్వారా తీసుకోగల నీళ్ళు కొంచెమే.

పరగోడు చిత్రావతి నది మీద కడుతున్న ఒకానొక చిన్న రిజర్వాయరు. చిత్రావతి పెన్నకు ఉపనది. పెన్నమీద మనం అనంతపురం జిల్లాలో, కడప జిల్లాలో, నెల్లూరు జిల్లాలో ప్రాజెక్టులు కట్టుకున్నాము. అవి కర్ణాటకకు చెప్పి కట్టామా అని అడిగితే మనవాళ్ళకు చాలా కోపం వస్తుంది. 'మనం కింది భాగంలో ఉన్నాం. మనం ప్రాజెక్టులు కట్టుకుంటే కర్ణాటకకొచ్చిన నష్టమేమీ లేదు. కానీ ఎగువన ఉన్న కర్ణాటక మనకు చెప్పకుండా, మనల్ని ఒప్పించకుండా ప్రాజెక్టులు కట్టుకుంటే మనకు రాగల నీటిని ఆపుతారు. కాబట్టి మనం ఏకపక్షంగా ప్రాజెక్టులు కట్టుకోవచ్చు. వాళ్ళు మాత్రం మనల్ని మెప్పించి కట్టుకోవాలి'. ఇదీ మన వాదన.

దీనికి కర్ణాటక దగ్గర జవాబు లేదనుకుంటే పొరబాటే. నదిపై భాగాన ఉండే వాళ్ళు కింది ప్రాంతపు కాచ్‌మెంట్ నుంచి నీళ్ళు తీసుకోలేరు. (కాచ్‌మెంట్ అంటే నదికి వర్షపు నీటిని చేరవేసే ప్రాంతం అని అర్థం). పై భాగాన ఉన్న వాళ్ళు తమ ప్రాంతపు కాచ్‌మెంట్ నీటిని మాత్రమే వాడుకోగలరు. సులభంగా చెప్పాలంటే, పరగోడు నుంచి కర్ణాటక ఎంత నీరు పారించుకున్నా అదంతా కర్ణాటకలో కురిసి చిత్రావతిలో చేరిన వర్షం నీళ్లే. మన కాచ్‌మెంట్ నీటిని వాళ్ళు వాడుకోలేరు.

కింది ప్రాంతం వాళ్లు మాత్రం తమ కాచ్‌మెంట్ నీళ్లేకాక పై ప్రాంతం కాచ్‌మెంట్ నీళ్లు కూడ వాడుకోగలరు. కాబట్టి తమ పై ప్రాంతం వాళ్ళు ఏం చేసుకున్నా కింది వాళ్ళు అడగనవసరం లేదుకానీ పై ప్రాంతం నీళ్లు తమకు వదిలిపెట్టాలని డిమాండ్ చేసే కింది ప్రాంతం వాళ్లు దానికి కారణం చెప్పి ఆ హక్కు, ఆ అర్హత ఎక్కడి నుంచి వస్తాయో చెప్పుకోవాలి. ఉదాహరణకు పెన్నానదిలో మన కాచ్‌మెంట్ నీళ్ళు మొత్తం మనమే వాడుకుంటున్నాం. అంతేకాక కర్ణాటక తన కాచ్‌మెంట్ నీళ్ళు మొత్తం వాడుకోకూడదని, మనం కోరుకున్నంత మనకు విడిచి పెట్టాలనీ మనం అంటున్నాం. ఇదే పరగోడు గొడవ.

రెండు వాదనలూ వినగానే హేతుబద్ధంగా అనిపిస్తాయి కదూ? వాస్తవం ఏమంటే నదీ జలాల విషయంలో కర్ణాటక చాలా ఆలస్యంగా మేల్కొనింది. కర్ణాటకలో కృష్ణ, పెన్నా నదులు ప్రవహించే ప్రాంతం రాజకీయంగా పలుకుబడి లేని ప్రాంతం. మన రాష్ట్రంలో ప్రాంతీయ ఆధిపత్యం ఉన్నట్టే కర్ణాటకలోనూ ఉంది. పాత మైసూరు రాష్ట్రం, ధార్వాడ్, హుబ్లి ప్రాంతం కర్ణాటకలోని ఆధిపత్య ప్రాంతాలు. ఇతర ప్రాంతాల అవసరాలకు అంత ప్రాముఖ్యం లభించదు.

అందువల్ల కృష్ణ, పెన్నా నదుల వినియోగం విషయంలో కర్ణాటక చాలా అలసత్వం ప్రదర్శించింది. వాళ్ళు వాడుకోకుండ విడిచిపెట్టిన నీళ్లంతా మన రాష్ట్రంలోకి ప్రవహించగా, మనం రకరకాల రూపాలలో దానిని వాడుకుంటున్నాం. అది 'మన నీళ్ళు' అన్న అభిప్రాయానికి మనం వచ్చేసాము. కర్ణాటక నాలుగయిదేళ్ళుగా మేలుకొని తన హక్కులు వినియోగించుకోవాలని చూస్తున్నది. దానితో మన నీళ్లు మనకు దక్కకుండా ఆపేస్తున్నదని ఆందోళన చెందుతున్నారు. అల్లరి చేస్తున్నారు.

ఎక్కడి కాచ్‌మెంట్ నీళ్లు అక్కడే వాడుకోవాలనీ, ఏ రాష్ట్రంలో కురిసిన నీరు ఆ రాష్ట్రం ఆస్తే అనీ నేను అనడం లేదు. వర్షం ఒకరు కురిపించేది కాదు కాబట్టి దాని మీద ఆస్తి హక్కులు ప్రకటించుకోకుండ దానిని ప్రకృతి వనరుగా గుర్తించి అందుబాట్లో ఉన్నవారు అవసరాన్ని బట్టి పంచుకోవడమే నీటి విషయంలో ఉచితమైన వైఖరి. కోలార్ కంటె అనంతపురంలో కరువు ఎక్కువ కాబట్టి కర్ణాటక చిత్రావతి నీటిలో కొంచెం అనంతపురానికి ఇవ్వాలని మనం అడగొచ్చు. అందులో తప్పేమీ లేదు. కానీ పై వాళ్లు తమ నీటి హక్కుల్ని శాశ్వతంగా మనకు అర్పించి సన్యసించాలనీ, అది మన హక్కు అనీ దబాయించడం, అల్లరి చేయడం అర్థరహితం.

కర్ణాటక మీద మనకు హేతబద్ధమైన ఫిర్యాదులు లేవని కాదు. అప్పర్ తుంగ ప్రాజెక్టులో కర్ణాటక బచావత్ అవార్డు కింద తనకు ఉన్న హక్కు కన్న ఎక్కువ వాడుకుంటున్నదన్న సందేహానికి ఆస్కారముంది. హోస్పేట డ్యాంలో పూడిక వల్ల నిండకుండా ఉన్న నీళ్ళు అప్పర్‌తుంగలో నిలుపుకుంటున్నానని కర్ణాటక అంటున్నది. కానీ ఆ 'నిండకుండా ఉన్న నీటి' లో మన వాటా కూడ – బచావత్ అవార్డు ప్రకారం – ఉంది. తుంగభద్ర ఎగువ కాలువ, దిగువకాలువ, రాజోలిబండ డైవర్షన్ స్కీంల వాటా ఉంది. ఇది మనం న్యాయబద్ధంగా ఫిర్యాదు చేయగల విషయమే కానీ అప్పుడు కరువు పీడిత రాయలసీమ జిల్లాల అవసరాల కోసం మనం శ్రీశైలం నుండి తెలుగు గంగ ద్వారాను, ఎస్కేప్ చానెల్ ద్వారాను నియమ విరుద్ధంగా తీసుకుంటున్న నీటికీ, ఇప్పుడు కొత్తగా గురు రాఘవేంద్ర ప్రాజెక్టు ద్వారా తుంగభద్ర నుండి తీసుకోబోతున్న నీటికీ కూడ సంజాయిషీ చెప్పుకోవలసి ఉంటుంది.

ప్రజలకివేవీ తెలియదని చెప్పి ఏదో ఒక అల్లరి చేసి గుంపును పోగు చేసి ప్రయోజనం పొందాలని చూడడం క్షమించగల విషయం కాదు.

ప్రజాతంత్ర

23 జూన్ 2003



# కృష్ణా డెల్టావాసులు వాస్తవ పరిస్థితికి అలవాటు పడితే మంచిది

**కృ**ష్ణా డెల్టాను కాపాడడం కోసం అక్కడి రైతులు చేస్తున్న ఆందోళన పట్ల ఇతర ప్రాంతాల వాళ్లకు సానుభూతి లేకపోలేదు గానీ సందర్భాన్ని బట్టి మాట మార్చే డెల్టా రాజకీయాలను ప్రశ్నించకుండ ఉండలేం.

పులిచింతల ప్రాజెక్టును తెలంగాణవాసులు, రాయలసీమ వాసులు వ్యతిరేకించినప్పుడు కోస్తా వాళ్లు ఏమన్నారో జ్ఞాపకం ఉందా? 'అవి మా నీళ్లు– వాటితో మీకేం పని?' అన్నారు. నాగార్జునసాగర్‌కు దిగువన కృష్ణానదిలోకి వచ్చి చేరే నీళ్లనే డెల్టా అవసరాల కోసం వాడుకుంటున్నారనీ, ఆ నీటి మీద పులిచింతల ప్రాజెక్టు కట్టుకున్నా ఇంకొక ప్రాజెక్టు కట్టుకున్నా సాగర్‌కు ఎగువన ఉన్న వారికి అడిగే హక్కు లేదనీ దీని అర్థం.

అదే నిజమయితే, వర్షపాతం సగటు స్థాయిలో ఉన్న ఈ సంవత్సరం 'సాగర్ నుండి నీళ్లు వదలండి, డెల్టాను కాపాడండి' అని ఎందుకు మొత్తుకుంటున్నారు? సాగర్‌కు దిగువన నదిలో కలిసే నీరంతా వారిదే కదా? అదే వాడుకుంటున్నారు తప్ప పైభాగాన కురిసే వర్షం తెచ్చే నీటితో మాకు నిమిత్తం లేదంటున్నారు కదా? మరి ఇప్పుడు ఈ గొడవ ఎందుకు?

కృష్ణానదీ జలాల గురించి  అవగాహన ఉన్నవారు నాగార్జునసాగర్‌లో కరెంటు ఉత్పత్తి ఆపేస్తే అసలు సంగతి బయటపడుతుందని ఆనాడు అన్నారు. కరెంటు ఉత్పత్తి పేరు మీద (టర్బైన్లు తిప్పడానికి) సాగర్ నుండి

కిందికి వదిలే నీరంతా కృష్ణా డెల్టాకు సాగు నీరవుతున్నది. ఆ రూపేణా ఎగువ కాచ్‌మెంట్ నీళ్లు పెద్ద పరిమాణంలో డెల్టాను తడుపుతున్నాయి. ఈ విషయం ఈ సంవత్సరం డెల్టా రాజకీయవాదులు పరోక్షంగా ఒప్పుకున్నట్టే.

కృష్ణా డెల్టా మాగాణి పంటలకు తప్ప ఇంక దేనికీ పనికి రాదు కాబట్టి మొదటి ప్రాధాన్యతగా డెల్టాకు నీళ్లివ్వాలని ముఖ్యమంత్రే కాక చాలామంది అంటున్నారు. ముద్దుల కొడుకు పరమాన్నం తప్ప ఇంకేమీ తినలేడు కాబట్టి మిగిలిన పిల్లలకు పాలు లేకున్నా పరవాలేదు, ఉన్న పాలంతా వాడి కోసం పరమాన్నం వండమన్నాడట ఒక తండ్రి.

నేను వ్యవసాయంలో నిపుణుడిని కాను కాబట్టి కృష్ణా డెల్టాలో పల్లికాయలు, మక్కలు పండించడం సాధ్యమా కాదా అన్న చర్చలోకి పోయే సాహసం చేయను గానీ ఒక మాట చెప్పక తప్పదు.కొన్ని దశాబ్దాలుగా కృష్ణాడెల్టా వాసులు అనుభవిస్తున్న 'నీటి హక్కు' వారికి సహజంగా వచ్చింది కాదు. ఎగువ ప్రాంతం వారికి సాగునీటి గురించి అవగాహన లేకపోవడం వల్ల కొంత, అవగాహన ఉన్నా వీరి రాజకీయ ప్రాబల్యం కారణంగా ఏమీ చేయలేకపోవడం వల్ల కొంత కృష్ణానదీ జలాలు డెల్టా భూములను ఒకటికి మూడుసార్లు తడుపుతున్నాయి. అదంతా తమ హక్కేనని వాళ్లు అనుకుంటే అనుకున్నారు. వారితో బాటు అందరూ అనుకోవాలంటే ఎట్లా?

అప్పుడెప్పుడో బ్రిటిష్ వాడు కృష్ణా, గోదావరి నదులపైన ఆనకట్టలు కట్టి సాగునీరు పుష్కలంగా ఉన్న జీవితం ఎట్లాగుంటుందో వారికి రుచి చూపించాడు. అప్పటికి ఎగువ ప్రాంతాల వారికి ఆ నదిపైన హక్కులు లేవు. హక్కులడిగే స్వేచ్ఛ లేదు. చాలా కాలంపాటు అవగాహన కూడ లేదు.

అందువల్ల ఉద్దరకు నీళ్లు కిందికి వస్తుంటే దానిని అమితంగా వాడుకుంటూ అదంతా తమ హక్కేనని కృష్ణా డెల్టావాసులు అనుకోసాగారు. బచావత్ ట్రిబ్యునల్ దీనికి ఆమోద ముద్ర వేసింది. కర్ణాటక, మహారాష్ట్ర ఇది అన్యాయం అని అప్పుడే అన్నాయిగానీ ఏం చేయలేకపోయాయి.

ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణ, రాయలసీమ జిల్లాలు త్వరలోనే మేల్కొన్నాయి గానీ ఒకే రాష్ట్రంలో ఉండడం వల్ల తమ వాటా అడిగి తీసుకునే సౌలభ్యం రాజ్యాంగంలో లేక గొంతు చించుకోవడానికి మాత్రమే పరిమితమయ్యాయి. వేరు రాష్ట్రమైన కర్ణాటక ఆలస్యంగా మేలుకున్నా వేరు రాష్ట్రం కావడం వల్ల తన హక్కును తాను

నిలబెట్టుకోగలుగుతున్నది. ఆల్మట్టి కేసులో మనమే సుప్రీంకోర్టుకు పోయి కర్ణాటక ప్రయాసకు ఆమోద ముద్ర వేయించాము.

ఈ పరిస్థితి ఇంక వెనుదిరిగే ప్రసక్తి లేదు. తెలంగాణ వేరయినా, లేక వేరు కాకుండ ఉండడానికి తెలంగాణకు తగిన హక్కులు కల్పించినా కృష్ణా డెల్టాకు చేరే నీరు రాబోయే రోజులలో ఇంకా తగ్గిపోతుంది. ప్రపంచంలో అందరూ బతుకుతున్నట్టు వారు కూడ వాన నీటినీ బావి నీటినీ కాలవ నీటినీ (ఉన్న మేరకు) జాగ్రత్తగా కలిపి వాడుకోవడం నేర్చుకోక తప్పదు. ఆరోజు నిజంగా వచ్చినప్పుడు కృష్ణా డెల్టాలో కూడ వేరే పంటలు పండుతాయని గుర్తించక తప్పదు కాబట్టి గుర్తించబోతారు. మరి ఈ లోపల మా తండ్రులు బతికినట్టే మేమూ బతుకుతాం, అది మా హక్కు, దానికి కావసిన నీరంతా శ్రీశైలం నుండి, సాగర్ నుండి మాకు పంపించాల్సిందే అని అల్లరి చేయడం ఎందుకు? వారికి ముఖ్యమంత్రి, సకల రాజకీయ పార్టీలు వంతపాడడం ఎందుకు?

బచావత్ అవార్డు స్వభావం రీత్యా ఈ కోరిక మన్నించదగినది కాదు. నదిలోకి చేరిన నీటిని అన్ని ప్రాజెక్టులూ ఎప్పటికప్పుడు తమ తమ వాటాలలో పంచుకోవాలా లేక ఎగువన ఉన్న ప్రాజెక్టుల అవసరాలు తీర్చే మేరకు నీరు నిలువ ఉంచుకున్న తరువాతే దిగువన ఉన్న ప్రాజెక్టుల వాటా కిందికి పోవాలా అన్న చర్చ బచావత్ ట్రిబ్యునల్ ముందు వచ్చింది. మొదటి దానిని స్కీం 'బి' అనీ, రెండవ దానిని స్కీం 'ఏ' అనీ బచావత్ రిపోర్టు వ్యవహరిస్తుంది. వీటిలో ఏది ఎంచుకుంటారో చెప్పమని జస్టిస్ బచావత్ పరీవాహక ప్రాంత రాష్ట్రాలను అడిగినప్పుడు దిగువన ఉన్న ఆంధ్రప్రదేశ్ సహితం స్కీం 'ఏ' కావాలనే అనింది. ఎగువన ఉన్న రాష్ట్రాలకు నదీ జలాల గురించి అవగాహన లేదు కాబట్టి వాళ్ల నీటి వాటా మేరకు వారు ప్రాజెక్టులు ఇంకా ఎప్పటికో గానీ కట్టుకోబోరు కాబట్టి నీళ్లంతా కిందికే వస్తుంటాయి లెమ్మని చెప్పి స్కీం 'ఏ' ఎంచుకుంది ఆంధ్రప్రదేశ్. ఇప్పటిదాకా అదే జరిగింది. దాంతో ఆ నీళ్లన్నీ తమవేనని ఆఖరున ఉన్న కృష్ణా డెల్టావాసులు భ్రమ పడడము జరిగింది. కర్ణాటక ఆలస్యంగా నిద్రలేచి తన వాటా మేరకు ఆల్మట్టి కట్టుకొని 'అది నిండిన తరువాతే కిందికి నీళ్లిస్తాం' అనేసరికి స్వయంకృతమైన నష్టం అర్థమయిన మన పాలకులు నాలుక కరచుకొని ఊరుకోక సుప్రీంకోర్టుకు పోయి మొట్టికాయ వేయించుకున్నారు.

రాష్ట్రాల మధ్య వర్తించే తర్కమే రాష్ట్రం లోపలా వర్తించడం సబబు కాబట్టి నదిలోకి వచ్చి చేరిన ప్రవాహం జూరాల అవసరాలు తీర్చిన తరువాతే శ్రీశైలానికి విడుదల

చేయాలి, శ్రీశైలం అవసరాలు తీర్చిన తరువాతే సాగర్‌కు విడుదల చేయాలి, సాగర్ అవసరాలు తీర్చిన తరువాతే కృష్ణా డెల్టాకు విడుదల చేయాలి. 'అంతా మాకే ఇచ్చెయ్యండి' అని అడగడం కాదు సరికదా, 'ఎప్పటికప్పుడు మా వాటా మాకు ఇవ్వండి' అని అడిగే హక్కు సహితం కృష్ణా డెల్టాకు లేదు.

పంటలు వేయలేక వాళ్లు ఏడుస్తుంటే ఇంత కర్కశంగా మాట్లాడుతున్నావా అంటారేమో. రుచులు తెలిసిన వారికి ఆకలి బాధ ఎక్కువ ఉండవచ్చును గానీ రుచుల ఎరుకకే నోచుకోని వారి అవసరాన్ని అంత మాత్రం చేత తక్కువ చేసి చూడలేము.

ప్రజాతంత్ర
1 సెప్టెంబర్ 2003

# కృష్ణా జలాల జగడం:
# కొన్ని వాస్తవాలు, కొన్ని సూచనలు

కృష్ణానది నీటి గురించి కొంత కాలంగా రాష్ట్రంలోని మూడు ప్రాంతాలలోనూ జరుగుతున్న ఆందోళనలను చూస్తున్నాం. ఎవరికి వారు మా ప్రాంతానికి నీళ్లు మొదట ఇవ్వాలని అడుగుతున్నారని అర్థమవుతున్నదే తప్ప ఇందులో న్యాయాన్యాయాలను అర్థం చేసుకోవడానికి కావలసిన సమాచారం ప్రజల దగ్గర లేదు, పత్రికలు ఇవ్వడం లేదు.

ఒకటి మాత్రం స్పష్టం అయ్యే ఉండాలి. కృష్ణానదిలో మామూలుగా వచ్చేదానికంటే ఈ సంవత్సరం తక్కువ నీళ్లు వచ్చాయి కాబట్టి వచ్చిన నీటిని ఎవరికి ముందు ఇవ్వాలి లేదా దానిని పంచడంలో ఎవరి అవసరాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి అన్న తగవు వచ్చిందని అర్థం అయ్యే ఉండాలి. ఇది ఎప్పుడయినా వచ్చి ఉండగల సమస్యే కాబట్టి దీని పరిష్కారానికి ఒక నియమం ఏదీ ఇన్నాళ్లూ ఎందుకు ఏర్పరచుకోలేదు అన్న సందేహం కూడా వచ్చే ఉండాలి.



కిందటి సంవత్సరం దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు ఉన్న సంగతి తెలిసిందే. అందువల్ల అన్ని ప్రాజెక్టులలోనూ నీటిమట్టం బాగా అడుగంటింది. అయినా శ్రీశైలం, నాగార్జునసాగర్‌ల నుండి కనీస నీటి నిలువ మట్టాన్ని దాటి కూడా మన రాష్ట్ర ప్రభుత్వం నీటిని దిగువకు విడుదల చేసింది. దానికి తోడు ఈ సంవత్సరం కూడా కృష్ణా నదికి ప్రధానంగా నీళ్లు అందించే పడమటి కనుమలలో వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. మన రాష్ట్రంలో (మొత్తం మీద) సగటు వర్షపాతం ఉన్నప్పటికీ కృష్ణానదిలో నీళ్లెక్కువ లేకపోవడానికి కారణం ఆ నదిలోకి నీటిని తీసుకొచ్చే

'కాచ్‌మెంట్ ప్రధానంగా కర్ణాటక, మహారాష్ట్రలలో ఉండడం, అక్కడ ఈ సంవత్సరం కూడా వర్షాభావ పరిస్థితులు ఉండడం.

కృష్ణానది మీద (దాని ఉపనదులైన కొయ్‌నా, తుంగభద్ర, భీమ, ఘటప్రభ, మూసి మొదలైన నదులను కలుపుకొని) మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లు మూడింటిలోనూ ప్రాజెక్టులున్నాయి. ఈ మూడు రాష్ట్రాలూ ఎంతెంత నీళ్లు ఆ నది నుంచి తీసుకోవచ్చునో చెప్పే బచావత్ అవార్డు ఉంది.

బచావత్ అవార్డు కృష్ణానదిలో నాలుగింట మూడు సంవత్సరాలు (అంటే 75 శాతం భరోసాతో) 2060 టియంసిల నీరు ఉంటుందని అంచనా వేసి, అందులో 800ల టియంసిల పైన ఆంధ్రప్రదేశ్‌కు హక్కు ఇచ్చింది. (700 టియంసిల పైన కర్ణాటకకు, 560 టియంసిల పైన మహారాష్ట్రకు ఇచ్చింది) అంతేకాక, ప్రాజెక్టుల నుంచి పొలాలకు పారించే నీటిలో కొంత భాగం తిరిగి నదిలోకి పోతుందని అంచనా వేసి ఆ లెక్క కింద ఆంధ్రప్రదేశ్‌కు మరొక 11 టియంసిల నీటిపైన హక్కు ఇచ్చింది. అంటే ఆంధ్రప్రదేశ్‌కు మొత్తం 811 టియంసిల నీటిపైన హక్కు ఉంది.

టియంసి అంటే ఎంతో తెలుసుకోకపోతే ఈ అంకెలూ సంఖ్యలూ అర్థం కావు కాబట్టి ఒక టియంసి అంటే వంద కోట్ల ఘనపుటడుగులు అని చెప్పుకోవాలి. వందకోట్ల ఘనపుటడుగుల నీటిని ఊహించుకోలేము కాబట్టి దానిని అర్థం చేసుకోవడానికి ఒక వివరణ ఇవ్వడం ఉచితంగా ఉంటుంది. మనం ఏ ప్రాంతం వారిమయినా చెరువులను చూసే ఉంటాము. ఒక టియంసిలో మూడవ వంతు నీటి నిలువ సామర్థ్యం ఉండే చెరువు మామూలుగా ఒక పెద్దచెరువుగా భావించబడుతుందని చెప్పుకుంటే ఒక అంచనా వస్తుందనుకుంటాను.

ఒక టియంసి నీటితో ఎంత పొలం సాగు అవుతుందో తెలుసుకోవడం కూడా ఈ సందర్భంలో ఉపయోగపడుతుంది. ఒక టియంసి నీటిని మాగాణి (తరి) సాగుకు వాడేటట్టయితే 6,000 ఎకరాలకు, ఆరుతడి (ఇరిగేటెడ్ డ్రై) పంటకు పెట్టేటట్టయితే 10,000 ఎకరాలకు సరిపోతుందని అంచనా. ఇతర నీటి వనరులతో కలుపుకొని పొదుపుగా వాడుకునేటట్టయితే ఇంకా ఎక్కువ భూమికి పారించుకోవచ్చునని వేరే చెప్పనవసరం లేదు.

ఇప్పుడు మన రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యను తిరిగి ప్రస్తావిద్దాం. నాలుగింట మూడు సంవత్సరాలు నదిలో 2060 టియంసిల నీరు ఉంటుందని అంచనా వేసి మూడు రాష్ట్రాలకూ పైన చెప్పిన పద్ధతిలో బచావత్ అవార్డు పంచిందని

చెప్పుకున్నాము. ఆ 2060 టియంసిల మేరకూ ప్రాజెక్టులు కట్టేసుకున్న తరువాత ఏ సంవత్సరమైనా నదిలో అంతకంటె తక్కువ నీళ్లు వస్తే ఏమవుతుంది? నాలుగింట ఒక సంవత్సరం అది జరిగే అవకాశం ఉందని బచావత్ అవార్డే అంటుంది కాబట్టి ఇది వేసుకోనక్కరలేని ప్రశ్న కాదు.

బచావత్ అవార్డు మూడు రాష్ట్రాల మధ్య నది నీటిని పంపిణీ చేసే తీర్పే తప్ప రాష్ట్రం లోపలి విషయాలతో దానికి ప్రమేయం లేదు. రాష్ట్రాల మధ్య ఏం జరుగుతుందంటే ఎగువ రాష్ట్రం తన అవసరాల మేరకు తన ప్రాజెక్టులలో నీళ్లు నిలుపుకున్న తరువాతే దిగువకు నీళ్లు పంపుతుంది.

మరి రాష్ట్రం లోపల ఏం జరుగుతుంది? బచావత్ అవార్డులో దానికి జవాబు లేదు. ఒక రాష్ట్రానికి కేటాయించిన నీటి వాటాను ఆ రాష్ట్రం తన సరిహద్దుల లోపల ఏ విధంగా పంచుకుంటుందనే విషయంలో దానికే స్వేచ్ఛ ఉంటుందని బచావత్ అవార్డు అంటుంది. ఆల్మట్టి కేసులో ఇదే విషయాన్ని సుప్రీంకోర్టు ధృవీకరించింది.

స్వేచ్ఛ ఉన్న చోట బాధ్యత కూడ ఉంటుందని వేరే చెప్పనవసరం లేదు. నీళ్లు తక్కువ వచ్చిన సంవత్సరం రాష్ట్రంలోని ప్రాజెక్టుల మధ్య దానిని ఏ విధంగా పంచాలి? పై ప్రాజెక్టు తన అవసరాల మేరకు నిలుపుకున్న తరువాతే కిందికి పంపించాలా? లేకపోతే వచ్చిన నీటిని వచ్చినట్టు ఒక నిర్దిష్ట నిష్పత్తిలో అన్ని ప్రాజెక్టులకూ పంచాలా? రెండవదే జవాబయితే ఏ నిష్పత్తిలో పంచాలి? ఆయా ప్రాజెక్టుల సామర్థ్యం నిష్పత్తిలో పంచాలా? లేకపోతే కరువు ప్రాంతాలకు కొంచెం ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే పద్ధతిలో నిష్పత్తిని నిర్ణయించాలా?

దీనికి అధికారికంగా ఏ జవాబూ లేదు. ఇన్నేళ్లలో ఈ ప్రశ్నలకు జవాబు చెప్పే ఒక విధానం గానీ, ఒక ఆనవాయితీ గానీ – చట్టం సంగతి సరేసరి – మన రాష్ట్ర పాలకులు రూపొందించలేదు. గడిచిన నెల రోజులుగా మచిలీపట్నం నుంచి మిర్యాలగూడెం దాకా, మిర్యాలగూడెం నుంచి నంద్యాల దాకా ధర్నాలు, నిరాహార దీక్షలు చేపట్టిన రాజకీయ పార్టీలు దీని గురించి ప్రభుత్వాన్ని అడగవలసింది. కానీ ఈ పాపంలో అందరికీ భాగం ఉంది కాబట్టి అడగకుండా జాగ్రత్తపడ్డారు. ఒకే పార్టీ నాయకులు నంద్యాలలో ఒక డిమాండుతో, మిర్యాలగూడెంలో ఇంకొక డిమాండుతో, మచిలీపట్నంలో వేరొక డిమాండుతో ఆందోళన చేపట్టారు. ఈ మూడు నాల్కల వైఖరికి ఏ పార్టీ మినహాయింపు కాదు.

ఏ నియమమూ లేకపోయినా ఇటువంటి సంక్షోభం ఇన్నాళ్లూ తలెత్తకపోవడానికి కారణం కర్ణాటక తన వాటా నీటిమేరకు ప్రాజెక్టులు కట్టుకోవడానికి

తొందరపడకపోవడం. 1990ల మధ్యభాగం దాకా కర్ణాటక తన నీటి హక్కుల విషయంలో తాత్సారం చేస్తూ ఉండింది. (ఇది ఆ రాష్ట్రంలోని ప్రాంతీయ అసమానతలతో ముడిపడి ఉన్న విషయం) అంతేకాక మన రాష్ట్రం వాటాలో కొత్తగా మంజూరయిన జూరాల, శ్రీశైలం కుడిగట్టు కాలవ ప్రాజెక్టులు నత్తనడక నడుస్తూ ఉన్నాయి. అందువల్ల బెజవాడ దగ్గర కృష్ణా డెల్టాకు కేటాయించిన నీటి వాటా కంటె సగటున 400 టియంసిల ఎక్కువ నీరు మూడేళ్ల కిందటి వరకు కూడా కృష్ణా నదిలో లభ్యమయ్యేవి. తీవ్ర వర్షాభావ సంవత్సరాలలో సహితం కృష్ణా డెల్టాకు తన వాటా కంటే 100 టియంసిలకు తక్కువ కాకుండా అదనపు నీరు లభించేది. ఆల్మట్టి పూర్తయిన తరువాతే తన వాటాకు కొంచెం ఇటూ అటూగా మాత్రమే నీళ్లు లభించే సగటు స్థితి డెల్టాకు వచ్చింది. ఈ సంవత్సరం నెలకొన్న అసాధారణ పరిస్థితులలో అందరిలాగా వారికి కూడా సాగునీటికి కటకట అయింది.

ఏ నియమమూ లేకపోతే ఏమవుతుందంటే బలవంతుల ఆటలే సాగుతాయి. ఒక నెల రోజులుగా రాష్ట్రంలో ఇదే చూస్తున్నాం. 'ఏమయినా సరే డెల్టా భూములను కాపాడుతాం' అని ముఖ్యమంత్రి పదే పదే ప్రకటిస్తున్నాడు. డెల్టా రైతులు కూడా రైతులే, వారికీ ప్రభుత్వం చేయూత ఇయ్యవలసిందే గానీ వారు మాత్రమే రైతులా? ఎగువ ప్రాంతం వ్యవసాయాన్ని కాపాడే బాధ్యత ప్రభుత్వానికి లేదా? ప్రభుత్వం అందరినీ కాపాడవలసిందే, నీటి వనరులయినా ఏ వనరులయినా అందరికీ తగు మోతాదులో అందియ్యవలసిందే. కానీ అది నియమబద్ధంగా ఉండాలి, ఆ నియమం న్యాయంగా ఉండాలి, ఆ న్యాయానికి ఒక ఉచితమైన ప్రమాణం ఉండాలి. వీటి దాఖలాలేవైనా ఈ నెల రోజులలో కనిపించాయా?

కడప, కర్నూలు జిల్లాలకు శ్రీశైలం రిజర్వాయర్ నుంచి ఒక చుక్క నీరు ఇయ్యాలన్నా శ్రీశైలంలో నీటిమట్టం 854 అడుగులు ఉండాలి. ఆ జిల్లాల ఆయకట్టుదార్ల అవసరాలు పూర్తిగా తీర్చడానికి కాదు, ఒక చుక్క నీరియ్యాలన్నా శ్రీశైలం రిజర్వాయర్‌లో నీటిమట్టం 854 అడుగులు ఉండక తప్పదు. పోతిరెడ్డిపాడు 'టేక్-ఆఫ్' లెవలే అంత. ఆ జిల్లాల వాళ్లు ఆ మాట అంటే ముఖ్యమంత్రి సెప్టెంబర్ 15 దాకా శ్రీశైలం నుంచి నీళ్లు కిందికి వదలబోమని హామీ యిచ్చాడు. సెప్టెంబర్ 15 నాటికి నీటిమట్టం 854 అడుగులు చేరుకోకపోతే ఏం చేస్తారో మాత్రం చెప్పలేదు.

ఇదంతా సెప్టెంబర్ మొదటి దినాలలో. అయితే ఒక వారం తిరగకముందే ముఖ్యమంత్రి కృష్ణా జిల్లాకు పోయి వెంటనే శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నీళ్లు కిందికి విడిచిపెడతామని హామీ ఇచ్చాడు. ఈ హామీ వెంటనే అమలయింది కూడా.

(అయినప్పటికీ వారి అవసరాలకు చాలినంత రాలేదనీ, ఇంకా విడిచిపెట్టమనీ డెల్టా నాయకులు ఆందోళన కొనసాగించారు - అది వేరే సంగతి).

శ్రీశైలం నుంచి కిందికి ప్రవహించే కృష్ణానది నీళ్లు నేరుగా బెజవాడకు పోవు. మధ్యలో నాగార్జునసాగర్ ఉంది. దానికి కుడి, ఎడమ కాలువలున్నాయి. గుంటూరు, ప్రకాశం జిల్లాలకు నీళ్లిచ్చే కుడికాలువకు కొంచెం దిగువనుండే నీళ్లు అందుతాయిగానీ సాగర్‌లో నీటిమట్టం 510 అడుగులుంటే తప్ప నల్లగొండకు, ఖమ్మంకూ (కొంచెం కృష్ణా జిల్లా మెట్ట తాలూకాలకు కూడా) నీళ్లిచ్చే ఎడమ కాలువకు నీళ్లందవు. ఆపైన కూడా నీళ్లుంటే తప్ప ఈ మధ్యనే రాష్ట్ర ప్రభుత్వం నల్లగొండకు వరమంటూ ఆర్భాటంగా ప్రకటించిన ఎలిమినేటి మాధవరెడ్డి కాలవ కోసం నీళ్లు ఎత్తిపోసి నిలువ ఉంచే అక్కంపల్లి రిజర్వాయర్ కనీసం తడవదు. ముఖ్యమంత్రి కృష్ణా వివాదం గురించి చేసిన ప్రకటనలలో ఈ అవసరాల ప్రస్తావన సహితం లేదు.

ఈ విషయాలన్నీ దృష్టిలో ఉంచుకుంటే తప్ప రాష్ట్రంలోని మూడు ప్రాంతాలలో నెలరోజులుగా సాగుతున్న ఆందోళనలను అర్థం చేసుకోలేం. అర్థం చేసుకోకపోతే అన్ని ఆందోళనలనూ ఒకేగాటన కట్టి నిందించడమో, అభినందించడమో జరుగుతుంది. అది అవాంఛనీయం.

కృష్ణా నదిలో నీళ్లు తక్కువ ఉన్నప్పుడు దానిని భిన్న ప్రాజెక్టుల మధ్య ఏ ప్రాధాన్యతల ఆధారంగా పంచాలో నిర్ధారించే నియమావళిని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించాలనీ, ఆ నియమావళి అందరి అవసరాలనూ లెక్కలోకి తీసుకుంటూ, కరువు ప్రాంతాల ప్రాజెక్టుల అవసరాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేదిగా ఉండాలనీ, ఈ సమస్య ఎప్పుడొచ్చినా ప్రభుత్వం ఏ ఒత్తిడులకూ లొంగకుండా ఆ నియమావళి ప్రకారం నడుచుకోవాలనీ, అందుకోసం ఒక స్వతంత్రమైన రెగ్యులేటరీ కమిషన్‌ను నెలకొల్పాలనీ డిమాండ్ చేయడం అవసరం. ఆ డిమాండ్‌ను సాధించుకోవడం అవసరం.

అయితే కృష్ణా జలాలకు సంబంధించిన అసలు సమస్య ఇది కాదు. మన రాష్ట్రంలో భిన్న ప్రాంతాల మధ్య ఆ నది నీటిలో మన వాటాగా వచ్చిన 800 (లేక 811) టియంసిల నీటిని పంపిణీ చేసిన విధానమే అన్యాయమైనది. కోస్తా ఆంధ్రకు 377 టియంసిలు, తెలంగాణకు 267 టియంసిలు, రాయలసీమకు 123 టియంసిలు పంపిణీ చేశారు. తెలంగాణకు ఇచ్చిన 267 టియంసిలలో చెప్పుకోదగ్గ మొత్తం కాయితాల మీద తప్ప ఎక్కడున్నాయో తెలియని మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు కేటాయించబడ్డాయి.

ఈ పంపిణీ ఏ రకంగా చూసినా అన్యాయమైనది. వర్షపాతం, భూగర్భ జలాలు ఎక్కువ ఉన్న ప్రాంతానికి ఎక్కువ నది నీరు, తక్కువ ఉన్న ప్రాంతాలకు తక్కువ నది నీరు కేటాయించడం అన్నిటికంటె ప్రాథమికమైన అన్యాయం. దీనిని ఇప్పటికయినా సవరించి వర్షాభావం, కరువు, పేదరికం అధికంగా ఉన్న తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలకు నీళ్లిచ్చే పెండింగ్ ప్రాజెక్టులకు నీటిని ఒక హక్కుగా కేటాయించడం ద్వారా కృష్ణానది నీటిని పునఃపంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమించడం అవసరం. అప్పుడుగానీ నీటి హక్కుల విషయంలో న్యాయం జరగదు.

కృష్ణానదీ జలాల పునఃపంపిణీ ఉద్యమం కరపత్రంగా వచ్చింది
9 అక్టోబర్ 2003



# ఆ యిన్ని నీళ్లు ఎవరి నెత్తిన పోయడానికి?

గోదావరి నీళ్ళు తెలంగాణకు వస్తాయి వస్తాయని ఎదురు చూడగా చూడగా, ఇప్పుడు 'దేవాదుల స్టేజ్-1, ఫేజ్-1' పేరిట ఏటూరునాగారానికి ఎగువ నుండి అయిదంటే అయిదే టియంసిల నీళ్లు తీసుకొచ్చి వరంగల్ పక్కనున్న ధర్మసాగర్ చెరువులో పోస్తారని వింటున్నాం.

స్టేజ్-1 ఉన్నచోట స్టేజ్-2 (కనీసం) ఉండాలి. అలాగే ఫేజ్-1 ఉన్నచోట (మళ్ళీ కనీసం) ఫేజ్-2 ఉండాలి. ప్రస్తుతానికి అక్కడితో ముగించేసి ఆ తరువాత తక్కిన దశల గురించి ఆలోచిస్తామంటే కుదరదు. ఒక నదిలో ఒక చోట నుండి తీసుకునే నీరంతా ఒకే ప్రణాళిక కింద తీసుకోవలసి ఉంటుంది. అంటే స్టేజ్-1, ఫేజ్-1 అనే ఆ అయిదు టియంసిల ఎత్తిపోతల పథకం అన్ని స్టేజిలు, అన్ని ఫేజ్‌లు కలిసిన దేవాదుల ప్రాజెక్టులో అంతర్భాగంగానే ఉండక తప్పదు. ఆ మొత్తం ప్రాజెక్టు ప్రణాళికలో భాగంగానే దీని ప్రణాళిక ఉండక తప్పదు. హైదరాబాద్‌లోని సెక్రెటేరియట్ ఫ్లయ్ ఓవర్ లాగ కొంచెం కట్టేసి ఆ పైన ఏ విధంగా కొనసాగించాలో ఆలోచిస్తామనడం నీటి పారుదల ప్రాజెక్టుల విషయంలో చెల్లదు (ఫ్లయ్ ఓవర్ నిర్మాణానికయినా అది తెలివయిన పద్ధతని కాదు గానీ, దానిని జోక్‌గా తీసుకునే అవకాశమయినా ఉంది, నీటి పారుదల ప్రాజెక్టుల విషయంలో హాస్యానికి తావు లేదు).

మరి రాష్ట్ర ప్రభుత్వం దగ్గర దేవాదుల గురించి ఒక సమగ్రమైన ప్రణాళిక గానీ కనీసం దాని ముసాయిదా గానీ ఉందా? లేదని అందరికీ తెలుసును. అసలు దేవాదుల గ్రామం దగ్గర నీళ్లు తీసుకోవడానికి అనుకూల

పరిస్థితులు లేవనీ, దానికి కొంచెం ఎగువ నుండి తీసుకోవాల్సి ఉంటుందనీ ఇంజనీర్లు చెప్పిన సంగతి కూడా తెలుసును. ఎక్కడి నుండి తీసుకున్నా ఉత్తర తెలంగాణలోని ప్రధాన వర్షాభావ ప్రాంతానికి (అర్ధ చంద్రాకారంలో ఉండే కామారెడ్డి- సిద్ధిపేట- సిరిసిల్ల- హుస్నాబాద్- చేర్యాల- జనగామ- ఆలేరు- భువనగిరికి) ఆ నీటిని తీసుకుపోవాలంటే 300 నుండి 400 మీటర్లు ఎత్తిపోయవలసి ఉంటుంది. ముంపు దృష్ట్యా గోదావరినది మీద పెద్ద రిజర్వాయర్ కట్టడం సాధ్యం కాదు కాబట్టి, ఎత్తిపోసిన నీటిని నిలువ ఉంచే రిజర్వాయర్‌లు నదికి దూరంగా నిర్మించవలసి ఉంటుంది. ఎన్ని నిర్మిస్తారు, ఎక్కడ నిర్మిస్తారు, అతి తక్కువ ఖర్చుతో అత్యధిక వర్షాభావ ప్రాంతాలకు నీళ్లెట్లా ఇస్తారు అనేవి కీలకమైన ప్రశ్నలు. 1 ఎకరానికి ఆరుతడి నీరు ఇవ్వడానికి 100 మీటర్లు ఎత్తిపోయాలంటే 2000 రూపాయల నుండి 3000 రూపాయల దాకా కరెంటు ఖర్చవుతుందని అంచనా. అంటే దేవాదుల నుండి పైన పేర్కొన్న వర్షాభావ ప్రాంతానికి నీళ్లు ఎత్తిపోయాలంటే ఎకరానికి 6000 రూపాయల నుండి 12000 రూపాయల కరెంటు ఖర్చవుతుంది. అంత ఖర్చు భరించడం సాధ్యం కాదు కాబట్టి - భరించమని అడగడం న్యాయమూ కాదు కాబట్టి- దానికి ఏం ఏర్పాటు చేయాలి- ఇవన్నీ దేవాదుల కొక ప్రణాళిక అంటూ ఉంటే అందులో పొందుపరచవలసిన విషయాలు.

ఇవేవీ లేకుండ, 5 టియంసిల నీటిని ముందస్తుగా తీసుకొచ్చి కడియం శ్రీహరి నియోజకవర్గాన్ని కొంచెం తడిపే పథకానికి స్టేజ్-1, ఫేజ్-1 అని పేరు పెట్టి, ఒకటి వచ్చిన తరువాత రెండు రాకపోతుందా అన్న ఆశతో మిగిలిన కథ పూరించాలని చూడడం చిల్లర రాజకీయాలకు పరాకాష్ఠ. అసలు ఆ 5 టియంసిల నీటిని ధర్మసాగర్ చెరువు ద్వారా వాడుకోవడం సాధ్యమో కాదో కూడ తెలీదు. ఎందుకంటే ధర్మసాగర్ చెరువు నీటి నిల్వ సామర్థ్యం 1 టియంసి కంటె కూడ తక్కువ (0.8.టియంసిలని వినికిడి- పూడిక పుణ్యాన అంత కూడ ఉందో లేదో తెలీదు). దాని ద్వారా సహజంగానయితే ఒకటిన్నర, లేక రెండు టియంసిల నీటిని వాడకానికి తీసుకోవడం సాధ్యమవుతుంది. 5 టియంసిలు తీసుకోవడానికి ఎటువంటి మాయ చేయబోతున్నారు?

తలాతోకా లేని దేవాదుల శకలం బదులు ఇప్పటికే చాలా పరిశోధన చేసి ఒకటికి రెండు నమూనాలు తయారు చేసిన శ్రీరాంసాగర్ వరద కాలువ చేపట్టవచ్చును కదా? దానికి ప్రణాళికే కాదు, కేంద్ర జలసంఘం అనుమతి కూడ ఉంది. దేవాదుల ప్రాజెక్టు సుదూర ప్రయాణం చేసి ఏ వర్షాభావ ప్రాంతానికి నీళ్లియ్యాలో, అదే

ప్రాంతానికి ఈ వరద కాలవ కూడా నీళ్లిస్తుంది. దేవాదుల కంటే దీనిలో ఎత్తిపోతలు బాగా తక్కువ కాబట్టి రైతుకయ్యే ఖర్చు కూడా తక్కువే. పేరుకది 'వరద కాలవ' అయినప్పటికీ ఎలిమినేటి మాధవరెడ్డి కాలవ లాగ, శ్రీశైలం కుడిగట్టు కాలవ లాగ అది బాక్‌వాటర్ ప్రాజెక్టు కాదు, అతివృష్టి వున్నప్పుడు మాత్రమే నీళ్లు దొరికే మిగులు జలాల ప్రాజెక్టు కూడా కాదు. పోచంపాడు రిజర్వాయర్‌లో పూడిక వల్ల శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు రావలసిన నీళ్లే నిలువ వుండక కిందికి వచ్చేస్తున్నాయి. అదే వరద కాలవ నీళ్లు. ఎంత లేదన్నా కనీసం 30 టియంసిల నీటికి శ్రీరాంసాగర్ వరద కాలవలో భరోసా ఉందని చెప్పుకోవచ్చు. అన్ని రకాలుగా దేవాదుల స్వప్నం కంటె యోగ్యమైన ఈ ప్రాజెక్టు గురించి మాట్లాడకుండా స్టేజ్-1, ఫేజ్-1 అంటూ ప్రజల ఆకాంక్షలతోనూ అవసరాలతోనూ ఆటలాడుకోవడం ఎందుకు?

అసెంబ్లీని రద్దుచేసి 'ఆపద్ధర్మ ప్రభుత్వం'గా మారిపోవడంలో ఒక సౌకర్యం ఏమిటంటే ఇంక విధాన నిర్ణయాలు ప్రకటించకూడదు. గోదావరి జలాలను తెలంగాణ అవసరాల కోసం ఇన్ని రోజులు ఎందుకు వినియోగ పెట్టలేదన్న ప్రశ్నను దాటవేసి ఇప్పుడు ఎన్నికల కమిషన్ అభ్యంతరం పెడుతుంది కాబట్టి ఏ ప్రణాళికా ప్రకటించే పరిస్థితి లేదని, ఇంకొక్కసారి వోట్లు వేసి గెలిపిస్తే చేయవలసిందంతా చేసేస్తామని హామీలు గుప్పిస్తూ కాలక్షేపం చేసేయొచ్చు. చిల్లర రాజకీయవాదులకు అంతకంటె ఏం కావాలి?

ప్రజాతంత్ర
24 నవంబర్ 2003

# పులిచింతలను ఎందుకు వ్యతిరేకిస్తున్నాం?

రైతుల ప్రాణాలు కాపాడాలంటే సాగునీరివ్వాలని అడిగామని చెప్పి రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం ఎడాపెడా ప్రాజెక్టులకు శంకుస్థాపనలూ, భూమిపూజలూ మొదలు పెట్టింది. 'పెండింగ్' ప్రాజెక్టులుగా పేరుపడిన అన్ని ప్రాజెక్టులూ అయిదేళ్లలోపల కట్టేస్తానని దబాయిస్తున్నది.

ఉన్న నిధులు పొదుపుగా వాడి ఎక్కడ ప్రాజెక్టులు ఎక్కువ అవసరమో, ప్రాజెక్టులకు అవకాశం లేని ప్రాంతాలలో సాగునీటి పెంపుదల ఏవిధంగా చేపట్టవచ్చునో విశ్లేషించి పథకాలు చేపట్టే బదులు, నీటి కేటాయింపులేని ప్రాజెక్టులూ, పర్యావరణ అనుమతి లేని ప్రాజెక్టులూ, పొరుగు రాష్ట్రాలు ససేమిరా అంటున్న ప్రాజెక్టులూ, ప్రజలు వద్దంటున్న ప్రాజెక్టులూ అన్నిటికీ ఇక్కడ వందకోట్లు, అక్కడ అయిదు వందల కోట్లు కేటాయించి భూమి పూజలు మొదలుపెట్టింది ప్రభుత్వం.

'ప్రజలు వద్దంటున్న' ప్రాజెక్టులలో పులిచింతల ఒకటి. ప్రాజెక్టు వల్ల ముంపుకు గురయ్యే ప్రజలు ప్రాజెక్టును వ్యతిరేకించడం సహజం అని కొట్టిపారేస్తున్నారు. అది సహజమేగానీ దీన్ని కొట్టిపారేసే విషయంగా ఇప్పుడు ప్రపంచంలో ఎక్కడా భావించడం లేదు. 'దేశం' బాగుపడడానికి కొంతమంది త్యాగం చేయక తప్పదనే వైఖరి ఒకనాడు ప్రాచుర్యం పొంది ఉండింది. కానీ క్రమంగా , 'దేశం' పేరు చెప్పుకున్నా, 'సమాజం' పేరు చెప్పుకున్నా బాగుపడేది కొందరు వ్యక్తులేననీ, నష్టపోయేదీ కొందరు వ్యక్తులేననీ, ఇద్దరూ 'దేశం'లో భాగమే కాబట్టి ఒకరి బాగునూ, మరొకరి వినాశనాన్నీ ఒకటిగానే చూడాలనీ అవగాహన పెరిగింది. ప్రాజెక్టు వల్ల

నిర్వాసితులయ్యే వారి స్థిరాస్తులకు (ఉంటే) నష్టపరిహారం ఇచ్చేసి చేతులు దులిపేసుకునే వైఖరి చాలావరకు పోయింది. మనకంటే నాగరికమైన దేశాలలో, నిర్వాసితుల పూర్వ జీవన ప్రమాణం ఏమాత్రం దెబ్బతినకుండా ఉండే పద్ధతిలో ప్రాజెక్టు చేపట్టగలిగితేనే చేపడుతున్నారు. నీటి పారుదల ప్రాజెక్టు విషయంలోనయితే, కొత్తగా వచ్చే ఆయకట్టులోనే నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తున్నారు. మన రాష్ట్రంలో ప్రస్తుతం ప్రపంచ బ్యాంకు నిధులిస్తున్న శ్రీరాంసాగర్ రెండవ దశ ప్రాజెక్టుకూ, శ్రీశైలం కుడిగట్టు కాలవ ప్రాజెక్టుకూ ఈ నియమాన్ని ప్రపంచ బ్యాంకు వర్తింపచేస్తున్నది.

కానీ పులిచింతల వల్ల కొత్త ఆయకట్టేమీ రాదు కాబట్టి ఆ రకమైన పునరావాసం కల్పించడం సాధ్యం కాదు. పులిచింతల కృష్ణా డెల్టాలో ఇప్పటికే సాగవుతున్న 12.5 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించే ప్రాజెక్టు. కానీ దానికోసం నల్లగొండ, గుంటూరు జిల్లాలలో దాదాపు 30 వేల ఎకరాలు మునుగుతాయి. ఏడు గ్రామాలు పూర్తిగా, ఐదు గ్రామాలు పాక్షికంగా మునుగుతాయి. ప్రాజెక్టుకు కొత్త ఆయకట్టు లేదు కాబట్టి నాగరిక దేశాలు ప్రస్తుతం అనుసరిస్తున్న నమూనా ప్రకారం ఈ జనానికి కొత్త ఆయకట్టులో పునరావాసం కల్పించే అవకాశం లేదు. అసలు వారికి ఏ పునరావాసమూ దక్కదు. స్థిరాస్తులున్న వారికి కొంత నష్టపరిహారం దక్కుతుందంతే. అందులో లాయర్లూ, బ్రోకర్లూ తినగా మిగిలిన దానిలో ఎకరానికి పది గుంటలు కూడా వారు తిరిగి ఏ ఊరిలోనూ కొనుక్కోలేరు. స్థిరాస్తులు లేని వారికి ఆ మాత్రం కూడ దక్కదు.

## ఆ ప్రజల అభ్యంతరాన్ని 'ఎప్పుడూ ఉండేదే' అని కొట్టిపారేయడం తగునా?

పులిచింతల ప్రాజెక్టు సున్నపురాయి నిక్షేపాలున్న ప్రాంతంలో కడుతున్నారనీ, దాని వల్ల ఆ ఖనిజం వృథా అయిపోతుందనీ తెలంగాణ రాష్ట్ర సమితి లేవదీసిన అభ్యంతరానికి ప్రభుత్వం మరీ విచిత్రమైన జవాబు చెప్తున్నది. ఇప్పుడక్కడ ఉన్న ఖనిజం ప్రస్తుతం తవ్వుతున్న పద్ధతిలో తవ్వితే 2009లో అయిపోతుందనీ, ఇంకా వేగంగా తవ్వి ఇప్పుడే అంతా తీసేసి ప్రాజెక్టు కట్టేస్తామనీ పొన్నాల లక్ష్మయ్యగారు అంటున్నారు. అయిదు సంవత్సరాల నిక్షేపాన్ని అయిదు వారాలలో తవ్వేయడం సాధ్యమేనని అనుకున్నా, దానినంతా ఎక్కడ దాచుకుంటారు? మిర్యాలగూడెం నిండా గోడౌన్లు కట్టి భద్రపరుస్తారా? అక్కడ దొరికే సున్నపురాయిని స్థానిక సిమెంటు ఫ్యాక్టరీలకు ముడిసరుకుగా వాడుకోవడం జరుగుతున్నది. వాటి అవసరం మేరకు తవ్వడం జరుగుతున్నది. అయిదేళ్ల సరుకును ఇప్పటికిప్పుడు తవ్వేసి తీరికగా సిమెంటు ఉత్పత్తికి వాడుకుంటామనడం ఇంగితం ఉన్న వారిచ్చే జవాబేనా?

## ప్రధానమైన అభ్యంతరం

అయితే పులిచింతలను వ్యతిరేకించడానికి ప్రధానమైన అభ్యంతరం నీటి హక్కులకు సంబంధించినది. నిజానికి తొలినాడు ఇదే ప్రధాన అభ్యంతరంగా ఉండింది గానీ ఎవరి కారణాల వల్ల వారు దీని గురించి ఇప్పుడు మాట్లాడడం మానేసారు కాబట్టి కొంచెం వివరంగా చెప్పుకోవడం అవసరం.

'వృథాగా సముద్రంలోకి పోయే నీటిని' పులిచింతలలో బంధించి డెల్టా ఆయకట్టు స్థిరీకరణ కోసం వాడుకుంటున్నామనీ, దానిని వ్యతిరేకించడం కుళ్లుబోతుతనమనీ వాదిస్తున్నారు. ఇది అవాస్తవం. దీనిని అర్థం చేసుకోవడానికి కృష్ణా జలాల వాడకానికి సంబంధించిన వ్యవస్థ గురించి కొంత అవగాహన అవసరం. కోస్తా జిల్లాలకు చెందిన నాయకులకు ఈ అవగాహన ఏ మాత్రం లేకపోవడం వల్ల అక్కడి రైతాంగాన్ని ఊరికే రెచ్చగొట్టడం జరుగుతున్నది.

కృష్ణానది మూడు రాష్ట్రాల ద్వారా ప్రవహించే నది (తెలంగాణ వేరయితే నాలుగవుతుంది). దాని పరీవాహక ప్రాంతంలో వర్షాభావ తీవ్రత అధికం కాబట్టి ఆ నది నీటికి డిమాండు ఎక్కువ. అందువల్ల దాని మీద న్యాయబద్ధంగా హక్కులను రూపొందించుకోవడం, దానికి అందరూ కట్టుబడి ఉండడం అవసరం. దీనికి ప్రస్తుతం అమలులో ఉన్న వ్యవస్థ బచావత్ అవార్డు.

బచావత్ అవార్డు కృష్ణానదీ జలాలలో ఒక హక్కుగా వాడుకోగలిగిన దానిని 'నికర జలాలు' అనీ, తక్కిన దానిని 'మిగులు జలాలు' అనీ వర్గీకరించింది. పులిచింతలలో బంధించబోయేది 'వృథాగా సముద్రంలోకి పోయే నీళ్లు' అంటే అర్థం అది అంతా మిగులు జలమని. అది అబద్ధం. పులిచింతలలో బంధించబోయే 40 లేక 45 టియంసిల నీటిలో 9 టియంసిలు నికర జలాలు. (మిగతావి ముందు సంవత్సరం ఆలస్యంగా వచ్చి చేరే నీళ్లు). 9 టియంసిలను ఆరుతడి పంటలకు వాడుకుంటే 90 వేల ఎకరాలకు సరిపోతుంది. ఎగువ ప్రాంతంలో ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు నుండి హంద్రీ-నీవా దాకా ఒక్క చుక్క కూడా నికర జలం కేటాయింపు లేని దుర్భిక్ష ప్రాంతాల 'పెండింగ్ ప్రాజెక్టులు' అరడజను దాకా ఉండగా, సుభిక్ష ప్రాంతపు ఆయకట్టును కేవలం స్థిరీకరించే ప్రాజెక్టుకు 9 టియంసిల నికర జలం కేటాయింపు చేయడం సబబు కాదన్నది మొదటి అభ్యంతరం.

బచావత్ అవార్డు ప్రకటించే నాటికే ఆంధ్రప్రదేశ్ కృష్ణానదీ జలాలను పెద్ద మొత్తంలో వాడుకుంటూ ఉండడం వల్ల ఆ అవార్డు మనకు కొత్తగా నికర జలాల కేటాయింపు చేయడానికి ఇష్టపడలేదు. ఒక్క జూరాల ప్రాజెక్టుకు మాత్రమే ఇచ్చింది. అయితే

నల్లగొండ జిల్లాలో నడుస్తున్న బాధాకరమైన ప్రహసనాన్ని గురించి ఇక్కడ చెప్పుకోవాలి. చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, మునుగోడు ప్రాంతాల ఫ్లోరైడ్ సమస్య అందరికీ తెలిసినదే. అదొక భయంకరమైన సమస్య అని అందరూ ఒప్పుకుంటారు. కృష్ణానది నుండి ఆ గ్రామాలకు తాగునీరు ఇవ్వడం దీనికొక పరిష్కారం అని ప్రభుత్వం గుర్తించింది. ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు నేరుగానయినా పరోక్షంగానయినా దానికి ఉపయోగపడగలదు. కానీ ఆ ప్రాజెక్టుకు చుక్క నికర జలం కేటాయింపు లేదు.

కాగా, చౌటుప్పల్ ప్రాంతానికి నీళ్లివ్వడం కోసమని చెప్పి వంద సంవత్సరాలకు పైగా మూసీనది పైన ఉన్న చిన్న ఆనకట్టల (కతువాల) వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తున్నారు. 50 వేల ఎకరాల ఆయకట్టు ఉన్న ఈ వ్యవస్థ మధ్య భాగంలో పిల్లాయిపల్లి దగ్గర పక్కకు కాలవతీసి చౌటుప్పల్‌కు నీళ్లిస్తామంటున్నారు. దానివల్ల తమ పొలాలు ఎండి పోతాయని పిల్లాయిపల్లికి దిగువన ఉన్న కతువాల ఆయకట్టుదార్లు గొడవ చేస్తున్నారు. రెండు కరువు ప్రాంతాల రైతుల మధ్య గొడవ పెట్టి చోద్యం చూసే బదులు ఈ 9 టియంసిల నీటిని ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టుకు, ప్రత్యేకించి, ఫ్లోరైడ్ ప్రాంతాల తాగునీటి అవసరానికి కేటాయించవచ్చు కదా?

సాగునీటి వ్యవస్థను ఆధునీకరించి నీటిని పొదుపు చేసుకొని, పంట కాలవల నుండి తిరిగి నదిలోకి చేరే 'పునరుత్పత్తి జలాన్ని' దానికి కలుపుకొని మన వాటాలో నుండే మరికొంత నికర జలాన్ని పుట్టించుకునే అవకాశం మనకు ఉండింది. కృష్ణా డెల్టా ఆధునీకరణ ద్వారా 29 టి.యం.సిల నికర జలాన్ని ఆదా చేసుకున్నామనీ, కెసి కెనాల్ ఆధునీకరణ ద్వారా 8 టి.యం.సిల నికర జలాన్ని ఆదా చేసుకున్నామనీ చెప్పి, మన రాష్ట్రానికి లభ్యమవుతుందని బచావత్ అవార్డు గుర్తించిన 11 టియంసిల 'పునరుత్పత్తి జలాన్ని' దీనికి చేర్చి 48 టియంసిల నికర జలాలను అదనంగా మనకిచ్చిన కేటాయింపు నుండే మనం పొందాము. అందులో 19 టియంసిలు కర్నూలు (కొంతమేరకు కడప) జిల్లాలో దుర్భిక్ష ప్రాంతాలకు నీళ్లిచ్చే శ్రీశైలం కుడిగట్టు కాలవ ప్రాజెక్టుకూ, 20 టియంసిలు మహబూబ్‌నగర్ జిల్లాలోని కరువు ప్రాంతాలకు నీళ్లిచ్చే భీమా ప్రాజెక్టుకూ కేటాయించి ఆ రెండు ప్రాజెక్టులకూ ఆమోదం పొందాము. పనిలో పనిగా మిగిలిన 9 టియంసిలు పులిచింతలకు కేటాయించడం జరిగింది.

ఆ కేటాయింపు సబబా? శ్రీశైలం కుడిగట్టు కాలవతోనూ భీమా ప్రాజెక్టుతోనూ రాయలసీమ, దక్షిణ తెలంగాణ జిల్లాల కరువు తీరిపోదు. ప్రభుత్వాలే గుర్తించి, నికర జలాల కేటాయింపు లేకపోయినా పదే పదే పునాది రాళ్లు వేసిన 'పెండింగ్' ప్రాజెక్టులు ఇంకా దండిగా ఉన్నాయి. ఆర్భాటంగా కట్టేసి నీళ్లొచ్చేదీ లేనిదీ తెలియకుండ ఉన్న ఎలిమినేటి మాధవరెడ్డి కాలవ ఉంది. (దానికి తోకగా ఒక వరద కాలవ కూడ

ఉంది- వరద కాలవకు వరద కాలవ ఉండడం ప్రపంచంలోనే ఇది తొలి ఉదాహరణ కావచ్చు) ఊసెత్తడమే మానేసిన శ్రీశైలం ఎడమగట్టు కాలవ ఉంది. తెలుగుదేశం పాలనలో జీవో జారీచేసి మహబూబ్‌నగర్ వాసులను ఊరిస్తున్న కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ఉంది. అదే జిల్లాలో ఈ మధ్యనే ప్రభుత్వం తన హామీని పునరుద్ఘాటించిన నెట్టెంపాడు ఉంది. తెలుగుదేశం హయాంలో కర్నూలు, అనంతపురం జిల్లాలలో మూడుసార్లు పునాదిరాళ్లు వేసి కాంగ్రెస్ హయాంలో జీవో పొందిన హంద్రీ - నీవా ఉంది. అనంతపురం జిల్లా వాసులు ఎప్పటి నుండో అడుగుతూ తెలుగుదేశం హయాంలో జీవో సాధించిన పిఎబిఆర్ ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అటక నుండి తీసి దుమ్ముదులిపి ఇంకొక్కసారి హామీయిచ్చిన గండికోట, వెలుగొండ ప్రాజెక్టులున్నాయి. వీటిలో ఏ ఒక్కదానికి ఆ 9 టియంసిలు కేటాయించినా 90 వేల ఎకరాల మేరకు సస్యశ్యామలమవుతుంది. ఈ 'పెండింగ్' ప్రాజెక్టులన్నీ కరువు ప్రాంతాల ప్రాజెక్టులే కాబట్టి ఆ కేటాయింపు ఆ మేరకు ప్రజల జీవన్మరణ సమస్యను పరిష్కరిస్తుంది. అటువంటిది ఆ నీటిని కృష్ణా డెల్టా స్థిరీకరణకు కేటాయించడం ఏం న్యాయం?

అయితే నికర జలం కేటాయింపు వెనక్కి తీసుకున్నట్టయితే పులిచింతల కట్టేసుకోవచ్చునంటున్నామా? అనడం లేదు.

పులిచింతలను స్థిరీకరణ ప్రాజెక్టు అనడమే ఒక రకంగా పొరబాటు. ఒక ప్రాజెక్టు ఆయకట్టుకు రావలసిన నీళ్లు పూర్తిగా రాకపోయినా, సరైన సమయంలో రాకపోయినా దానికోసం చేసే ప్రత్యామ్నాయ ఏర్పాటును ఆయకట్టు స్థిరీకరణ అంటాం. పులిచింతల పైకి చూడగా అటువంటి ఏర్పాటుగానే కనిపిస్తుంది గానీ అది నిజమేనా? కృష్ణా డెల్టా ఆయకట్టుదారులు కొన్ని చారిత్రక- రాజకీయ కారణాల వల్ల ఒక రకమైన నీటివాడకానికి అలవాటుపడ్డారు. చాలాకాలం ఎగువ భాగాన చెప్పుకోదగ్గ ప్రాజెక్టులేవీ లేవు. ఆ తరువాత కర్ణాటకకు బచావత్ అవార్డు ద్వారా హక్కులు పుట్టినా వాడుకోవడంలో చాలా తాత్సారం చేసింది. తెలంగాణ,రాయలసీమ వాసులకు అడిగే హక్కే లేకుండ పోయింది. అందువల్ల తమ కేటాయింపు మించి నీరు పొందడం, అది కూడా వర్షాకాలం తొలిదినాలలోనే పొందడం కృష్ణా డెల్టావాసులకు సాధ్యం అయింది. బచావత్ అవార్డులో కేటాయింపు ఖరీఫ్‌కు మాత్రమే ఉండగా, అంతకంతా రబీ కూడా పండించుకోసాగారు.

ఇప్పుడు ఎగువ ప్రాంతం వారు తమ హక్కుల గురించి స్పృహ పెంచుకునేసరికి ఉద్దరకు వస్తున్న నీళ్లు తగ్గిపోవడమే కాక, తమకు అలవాటయిన సమయానికి (సకాలంలో) నీళ్లు రావడం కూడా సమస్యాత్మకం అయింది. దీనికి వారు ఎవరినీ

నిందించలేరు. కృష్ణా డెల్టాకు కేటాయించినది 181 టియంసిలు. అందులో ఆధునీకరణ ద్వారా 29 టియంసిలు ఆదా అయ్యాయని అంటున్నారు కాబట్టి మిగిలిన 152 టియంసిల నీరు వారి హక్కు. అది ఎప్పుడు లభిస్తుందనే విషయంలో నదికి 'టెయిల్ ఎండ్'లో ఉండేవారికి ఇతరులను నిందించే హక్కు ఎక్కడిది?

అనివార్యమైన ఈ మార్పుకు అలవాటుపడడానికి, పంటలలో మార్పులు చేసుకోవడానికి వారికి కొంత సమయం పడుతుంది, నిజమే. అయితే అలవాటయిపోయిందని దాన్ని శాశ్వతంగా భావించి 'స్థిరీకరించాల'నుకోవడం ఎంతవరకు సబబు?

దీనికోసం ఇప్పుడు పులిచింతల కట్టేసుకుంటే, దానిలోకి 45 టియంసిల నీరు చేరే మేరకు సాగర్ నుండి దిగువకు నీళ్లు పోవాలన్నది ఒక 'హక్కు' అయి కూర్చుంటుంది. నిజానికి ఆ 'హక్కు' కోసమే కదా పులిచింతల కట్టుకుంటున్నది! రేపు కొత్త కృష్ణా జలాల ట్రిబ్యునల్ ముందుకు ప్రభుత్వం పోయి ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు నుండి హంద్రీ-నీవా దాకా కరువు ప్రాంతాల ప్రాజెక్టులకు నీటి కేటాయింపు ఏదో ఒక రకంగా సాధించినా, ఆ కేటాయింపులకు పులిచింతలే పోటీ అవుతుంది. ఈ 'హక్కు' వాటికి అవరోధం అవుతుంది. ఎందుకంటే సాగర్‌కూ పులిచింతలకూ మధ్య 45 టియంసిలు నదిలోకి వచ్చి చేరుతాయనడం కల్ల. అందులో ఎక్కువ భాగం పైనుండే రావలసి ఉంటుంది.

అందువల్లనే ఇప్పుడు ప్రతిపాదించిన చోట కాకుండా దిగువన కట్టుకొని సాగర్‌కు దిగువన కృష్ణానదిలోకి చేరే నీటితో పులిచింతలను నింపుకొమ్మని విమర్శకులు అంటున్నారు. కృష్ణా డెల్టా అవసరాలకు కావలసిన నీరు (అంటే 152 టియంసిలు) సాగర్‌కు దిగువనే సగటు సంవత్సరాలలో లభిస్తుందని నిపుణుల అంచనా. ఏ సంవత్సరమైనా అది తక్కువయితే చేయగలిగిందీ లేదు, సాగర్ కట్టమీదుగా అంతకంటే ఎక్కువ పొర్లివస్తే ఆపగల వారూ లేరు. అటువంటి అదనపు నీటిని ఆపుకోవడానికి బెజవాడకు ఎగువన ఇంకొక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కట్టుకుంటామన్నా ఎవరికీ అభ్యంతరం ఉండదు.

ఇప్పుడు ప్రతిపాదించిన చోట కాక ఇంకా దిగువన కడితే ముంపు ఎక్కువ ఉంటుందనీ, 46 గ్రామాలు, 60 వేల ఎకరాల భూమి మునుగుతాయనీ పొన్నాల లక్ష్మయ్యగారు అంటున్నారు.

అట్లాగయితే ప్రాజెక్టు కట్టనేవద్దు మరి.

మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది

1 నవంబర్ 2004



## రాష్ట్ర ప్రభుత్వం సాగిస్తున్న 'జలయజ్ఞం'లో..
## నిజమెంత? అబద్ధమెంత? మేలు ఎంత? కీడు ఎంత?

**కాం**గ్రెస్ ప్రభుత్వానికి ఒక సంవత్సరం నిండిన సందర్భంగా వారు సాధించిన ఘనకార్యాల గురించి చేసుకున్న ప్రచారంలో 'జలయజ్ఞానికి' చాలా పెద్దపీట వేసిన సంగతి అందరం చూశాము. రాష్ట్రంలో ఏ మూలకు పోయినా పెద్దపెద్ద కాలువలు తవ్వుతుండడం చూస్తున్నాము.

రెండు సంవత్సరాలలో 8 ప్రాజెక్టులూ, అయిదేళ్ళలో మొత్తం 30 ప్రాజెక్టులూ నిర్మిస్తామన్నది కాంగ్రెస్ వారి హామీ. అదే 'జలయజ్ఞం'. దీనికోసం ఇప్పటికే 27 వేల కోట్లు ఖర్చయ్యే 157 పనులు మొదలయ్యాయంట. అందులో 68 పనులు (వ్యయం 13 వేల కోట్లు) తెలంగాణలోను, 46 పనులు (వ్యయం 8 వేలకోట్లు) కోస్తా ఆంధ్రలోను, 43 పనులు (వ్యయం 6 వేల కోట్లు) రాయలసీమలోను చేపడుతున్నారంట. అయిదేళ్ళలో 30 ప్రాజెక్టులూ పూర్తిచేసి 65 లక్షల ఎకరాలను కొత్తగా సాగునీటి కిందికి తీసుకురావడంతో పాటు మరొక 22 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరిస్తారంట.

ఇది అసాధ్యం అని ఎవరైనా అంటే, అందులో సగం సాధ్యమయినా మంచిదే కదా అనేవాళ్ళుంటారు. నాలుగవ వంతయినా జరగదంటారా అనేవాళ్లూ ఉంటారు. ఏమీ చేయకుండా వుండడం కంటే ఏ కొంచెం చేసినా మేలే కదా అనేవాళ్లు సహితం వుంటారు.

సాధ్యాసాధ్యాలనూ అవసరాన్నీ దృష్టిలో వుంచుకొని ఏ ప్రాజెక్టులు ఇప్పుడే సాధ్యమో, ఏవి ఎక్కువ అవసరమో, వేటివల్ల నిజంగా మేలు జరుగుతుందో వాటితో మొదలు పెట్టినట్టయితే, చివరికి నాలుగవ వంతే జరిగినా అంతకంటే తక్కువే జరిగినా పరవాలేదనుకోవడంలో తప్పు లేదు.

కానీ ఇప్పుడు జరుగుతున్నది అది కాదు. 30 ప్రాజెక్టుల మీదా పని ఏకసమయంలో మొదలయి వేలకోట్లు కేటాయించేశారు. పనులు కాంట్రాక్టర్లకిచ్చి మొదలు పెట్టించేశారు. రాబోయే ఆయకట్టును ఊహించుకుని ఆశలు పెట్టుకొమ్మని రైతులకు చెప్పేశారు. వీటిలో సగం ప్రాజెక్టులు సాధ్యంకాకపోతే సగం డబ్బులు వృథా అవుతాయి. సగం ఆశలు వమ్మవుతాయి. వృథా అయిన ఖర్చు ప్రజలందరికీ భారం అవుతుంది. వమ్మయిన ఆశలు ప్రజల మధ్య ఘర్షణలకూ, ద్వేషాలకూ దారితీస్తాయి. ఆర్థిక సంక్షోభం, సామాజిక కల్లోలం మిగులుతాయి.

కాంట్రాక్టర్లు మాత్రం బాగుపడతారు. ఇంతా అంతా కాదు, చాలా బాగుపడతారు. 'జలయజ్ఞం' అందుకోసమేనా అని అడిగితే రాజశేఖరరెడ్డి అభిమానులకు కోపం వస్తుందేమో. కానీ ఇప్పుడే కోపం చేసుకోకుండా చివరిదాకా చదివి అప్పుడు చెప్పమని మా మనవి.

రెండేళ్ళ లోపల పూర్తిచేయబోయే ప్రాజెక్టులలో వంశధార స్టేజ్-2, ఫేజ్-1 ఒకటి. స్టేజ్-2 కోసం నేరడి దగ్గర మన ప్రభుత్వం ప్రతిపాదించిన మళ్లింపు పథకానికి ఒరిస్సా ఇన్నేళ్లుగా ఒప్పుకోలేదు. కాబట్టి ప్రస్తుతానికి నేరడికి దిగువన కాట్రగడ దగ్గర సైడ్ కాలవ తీసి ఎంత నీళ్లొస్తే అంత తీసుకుంటామనీ, దీనికి స్టేజ్-2 ఫేజ్-1 అని పేరు పెడతామనీ అంటున్నారు. బాగానే వుంది. కానీ అన్ని నిర్మాణాలూ స్టేజ్-2కు తగినట్లు చేసేస్తున్నారు. హిరమండలం దగ్గర 19 టియంసిల రిజర్వాయర్ కడుతున్నారు. దానిపైన రెండు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు కడుతున్నారు. 20 వేల ఎకరాలకు వరద కాలవ, 82 వేల ఎకరాలకు కుడికాలువ తవ్వేస్తున్నారు. వంశధార స్టేజ్-1 కింద ఇప్పటికే ఒక పంటకు నీళ్లొస్తున్న 1,48,000 ఎకరాలకు స్టేజ్-2 ద్వారా రెండవ పంటకు నీళ్ళివ్వడానికి 'లింక్' కాలువ తవ్వేస్తున్నారు. హిరమండలం రిజర్వాయర్ కోసం 21 గ్రామాలను ఖాళీ చేయించేస్తున్నారు. రైతులతో బేరంపెట్టి నష్టపరిహారంతో సంతృప్తిపరచి పంపించేద్దామని చూస్తున్నారు. ఇంతాచేసి ఒరిస్సా నేరడి బ్యారేజికి సమ్మతి ఇవ్వకనేపోతే? ఇప్పుడు ఫేజ్-1 పేరిట చేపట్టే కాట్రగడ సైడ్ కాలువ అందులో మూడవ వంతు నీరు మాత్రమే ఇస్తుంది. దానితోనే సరిపెట్టుకోవలసి వస్తే? నీళ్ళు లేని కాలువలు, నేల తడవని రిజర్వాయరు ఎవరిని ఉద్ధరించడానికి కట్టినట్టు? కాలవొచ్చింది కదా ఇక నీళ్ళు రావా అని ఎదురుచూసే ఆయకట్టుదార్లను ఎవరు ఊరడించేట్టు?

ఒరిస్సాతో వున్న తేడాను ద్వైపాక్షికంగా పరిష్కరించుకోలేకపోతే కేంద్ర ప్రభుత్వాన్ని కోరి ట్రిబ్యునల్ ఏర్పాటు చేయించుకోవాలి. ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం వంశధార

స్టేజ్–2 కట్టుకోవాలి. అంతే తప్ప 'ఆలూ లేదు చూలూ లేదు' అనే ఈ వ్యవహారం ప్రజాధనాన్ని కాంట్రాక్టర్లకు దోచి పెట్టడానికి తప్ప ఇంక దేనికోసం ఉద్దేశించబడింది?

ఒక్క వంశధారే కాదు, జంఝావతి, నాగావళి, బాహుద నదుల విషయంలోనూ ఒరిస్సాతో మనకు విభేదాలున్నాయి. చెరిసగం నీళ్లు తీసుకోవాలన్న స్థూలమైన ద్వైపాక్షిక ఒప్పందాలున్నాయి గానీ ప్రతీ ప్రాజెక్టు విషయంలోనూ తేడాలొస్తున్నాయి. అవి ద్వైపాక్షికంగా పరిష్కారం కావని గడచిన అయిదు దశాబ్దాలలో అర్థమయిపోయింది. ప్రతిపాదిత ప్రాజెక్టుల కోసం ట్రిబ్యునల్ ఏర్పాటును ఆహ్వానించి దాని తీర్పు వచ్చే దాకా ఆగడం విజ్ఞతగల పాలన అనిపించుకుంటుంది.

హడావుడిగా కట్టేస్తున్న ప్రాజెక్టులలో పోలవరం ఒకటి. ఇప్పటికే దీనికి వేలకోట్లు కేటాయించారు. అయితే ఈ ప్రాజెక్టుకు అవసరమయిన మూడు ముఖ్య అనుమతులకు ప్రయత్నం కూడా ఇప్పటిదాకా జరగలేదు. ఒకటి, కేంద్ర అటవీశాఖ అనుమతి. ఈ ప్రాజెక్టు కింద దాదాపు 10,000 ఎకరాల అడవి మునుగుతుంది కాబట్టి దీనిని చేపట్టడానికి కేంద్ర అటవీశాఖ అనుమతి కావాలి. రెండవది కేంద్ర సామాజిక న్యాయశాఖ అనుమతి. ఈ ప్రాజెక్టు కింద దాదాపు లక్షన్నర జనాభా నిర్వాసితులవుతారు. అందులో సగం ఆదివాసులు. కాబట్టి కేంద్ర సామాజిక న్యాయశాఖ అనుమతి లేకుండా ప్రాజెక్టు చేపట్టడానికి వీలులేదు. మూడోది, పర్యావరణ అనుమతి. గోదావరి లోయ అడవులు జీవావరణం (బయోస్పియర్) దృష్ట్యా విలువయినవని పర్యావరణ నిపుణులు భావిస్తే ఈ అనుమతి దక్కదు.

'అనుమతులు వచ్చినప్పుడు వస్తాయి, ఈ లోపల పనులు చేసుకుంటూ పోదాం' అన్న వైఖరి చెల్లదనీ, చివరకు అనుమతులు రాకపోతే ప్రజాధనం వృథా అవుతుంది కాబట్టి అన్ని అనుమతులూ తీసుకున్నాకనే పనులు మొదలు పెట్టాలనీ ఈమధ్యనే మన హైకోర్టు పులిచింతల కేసులో రాష్ట్ర ప్రభుత్వాన్ని గట్టిగా మందలించింది. అయినప్పటికీ పులిచింతలలో చేసిన పనే పోలవరంలో మళ్లీ చేస్తున్నారు. రైతులకు నీళ్లివ్వాలన్న ఆరాటంతోనే ఇదంతా చేస్తున్నారని నమ్మలేం. ఎందుకంటే అనుమతులు లేకుండా ప్రాజెక్టు కట్టుకుంటూపోతే ఎప్పుడో ఒకప్పుడు కేంద్ర ప్రభుత్వమో, కోర్టులో అడ్డం తగులుతాయి. అనుమతులు లేని ప్రాజెక్టును పూర్తిచేసి రైతులకు నీళ్లివ్వడం కల్ల. కానీ కట్టినకాడికి కాంట్రాక్టర్లకు పైసలు మాత్రం దక్కుతాయి.

పోలవరం గురించి మరొక రెండు విషయాలు చెప్పుకోవాలి. మునగబోయే 10,000 ఎకరాల అడవికి మారుగా ఎక్కడో ఒకచోట 10,000 ఎకరాల ప్రభుత్వ బంజరును అటవీశాఖకు అప్పగించి అనుమతి తెచ్చుకునే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేసినా

(అంతటి బంజరు భూమి ఒకచోట కాకపోయినా నాలుగయిదు చోట్ల దొరుకుతుందనుకున్నా), సుప్రీంకోర్టు అడ్డం పడగలదు. రాజశేఖర్‌రెడ్డి గారి న్యాయ సలహాదారులు వారికీ విషయం చెపుతున్నారో లేదోగానీ కొన్నేళ్ళుగా సుప్రీంకోర్టు అటవీ భూముల బదలాయింపు మీద నిత్య నిఘా వేసి వుంది. 'గోదావర్మన్ కేసు' అనే కేసొకటి సుప్రీంకోర్టులో వుంది. ఆ కేసులో సుప్రీంకోర్టు తుదితీర్పు ఇవ్వదలచుకోలేదు. దానిని అడవుల సంరక్షణకు ఒక సాధనంగా వాడుకోదలచుకుంది. రెండు మూడు నెలలకొకసారి ఆ కేసు విచారణకొస్తుంది. ఆ మధ్యకాలంలో అటవీ భూముల బదలాయింపుకు ఎక్కడ అనుమతి ఇచ్చివున్నా దానిపైన ఎవరైనా ఆ కేసు విచారణ సమయంలో మధ్యంతర అర్జీ పెట్టుకోవచ్చు. సుప్రీంకోర్టు దానిపైన నిపుణుల చేత విచారణ జరిపించి, ఆ అనుమతి చెల్లుతుందా లేదా అన్నది చెప్తున్నది. చాలా సందర్భాలలో కఠినంగా వ్యవహరిస్తున్నది.

రెండవది, ఈ అడ్డంకులన్నీ తొలిగినా ఆదివాసుల ప్రతిఘటనను ప్రభుత్వం ఎదుర్కొనవలసి వుంటుంది. పోలవరం వల్ల ఎంత తక్కువన్నా 70,000 ఆదివాసీ జనాభా నిర్వాసితులవుతారు. వారి బతుకులు ఛిద్రమవుతాయి. వారు అంత సులభంగా తమ ఊళ్ళనూ కొండలనూ అడవులనూ విడిచిపెట్టి పోరు. ఎవరి నాయకత్వం వున్నా లేకపోయినా వారికి తోచిన పద్ధతిలో ప్రతిఘటిస్తారు. వాళ్ల తలలు పగలగొట్టకుండా కాళ్లు చేతులు విరగ్గొట్టకుండా పోలవరం సాధ్యం కాదు. ఇప్పటికే అభివృద్ధి చెందివున్న కోస్తాంధ్ర జిల్లాలలో ఇంకొక 8 లక్షల ఎకరాలకు సాగు నీరివ్వడానికి సమాజంలో అట్టడుగున వున్న ఆదివాసులను- అందులోను అంత పెద్దమోతాదులో- అణచివేతకు గురిచేయడాన్ని మానవత్వం వున్న వాళ్లెవరూ ఆమోదించలేరు.

శ్రీశైలం ఎడమగట్టు కాలవ, ఎలిమినేటి మాధవరెడ్డి కాలవ, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, నెట్టెంపాడు, హంద్రీ-నీవా, గాలేరు- నగరి, గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకం, పెన్నహోబిలం, తెలుగుగంగ, వెలిగొండ - ఇవన్నీ రాజశేఖర్‌రెడ్డి గారి 'జలయజ్ఞం'లోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులు. వీటిలో ఒక్కదానికీ ఒక్క చుక్క నీటి కేటాయింపు లేదు. వీటికోసం కృష్ణా-తుంగభద్ర నదులలో ఒక్కచుక్క నీరు తీసుకునే హక్కు మనకు లేదు. అయినప్పటికీ తెలుగుగంగ కొన్నేళ్లుగా కట్టుకుంటూ పోతున్నారు. ఎలిమినేటి మాధవరెడ్డి కాలవ దాదాపు పూర్తిచేశారు. ఇప్పుడు మిగిలిన వాటన్నిటి కోసం వందలూ వేల కోట్ల రూపాయలు కేటాయించి కాలవల తవ్వకం, ఎత్తిపోతల రూపకల్పన మొదలుపెట్టారు.

ఇవన్నీ తీవ్ర వర్షాభావ ప్రాంతాల ప్రాజెక్టులు కాబట్టి వీటికి వ్యతిరేకంగా మాట్లాడాలంటే ఎవరికైనా బాధ అనిపిస్తుంది. కానీ సాధ్యాసాధ్యాలతో సంబంధం లేకుండా కాంట్రాక్టర్ల జేబులు నింపి ప్రజలలో ఆశలు రేకెత్తించి చివరికి ప్రజల మధ్య విద్వేషాలు మిగిలించే కంటే ముందునుండే వాస్తవాలు తెలుసుకోవడం మంచిది. మొదటి కృష్ణా జలాల ట్రిబ్యునల్ (బచావత్ ట్రిబ్యునల్) చేసిన నీటి కేటాయింపుల ప్రకారం ఈ ప్రాజెక్టులేవీ కట్టుకునే హక్కు మనకు లేదు. రెండవ కృష్ణా జలాల ట్రిబ్యునల్ మనకేమయినా హక్కు ఇస్తుందన్న ఆశ వున్నట్టయితే ఆ ట్రిబ్యునల్ ముందుకు పోవాలి. నేరుగా వాదించి ఏదో ఒక మేరకు హక్కు సంపాదించుకోవాలి. గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించి ఆ బేసిన్‌లో నీటి కొరత సమస్యను పరిష్కరించదలచుకున్నా ట్రిబ్యునల్ ముందుకు పోక తప్పదు. దీని సాధ్యాసాధ్యాల గురించి ఇంకొక సందర్భంలో మాట్లాడుకుందాం గానీ, ఎంత నేర్పు ప్రదర్శించినా మనకు ఎక్కువ దక్కడం కష్టం. ఎందుకంటే ఇప్పటికే మనం కృష్ణా బేసిన్‌లో చాలా ఎక్కువ నీళ్లు తీసుకుంటున్నాం. కాబట్టి పైన ఏకరువు పెట్టిన ప్రాజెక్టులన్నీ సాధ్యపడడం కల్ల. అతి కష్టంమీద వాటిలో రెండింటికో మూడింటికో అనుమతి తెచ్చుకోవచ్చునేమో.

ఇప్పటికే రెండవ కృష్ణా ట్రిబ్యునల్ కూర్చొనింది. అందరి వాదనలూ, విజ్ఞాపనలూ వినడానికి సిద్ధమవుతూ వుంది. విజ్ఞతగల ప్రభుత్వం దానిమీద దృష్టి పెట్టి, అక్కడ ఏ మేరకు నీటి హక్కు దక్కితే ఆ మేరకు వీటిలో రెండింటినో మూడింటినో న్యాయబద్ధంగా ఎంపిక చేయవలసి వుండింది. దాని బదులు అన్నిటికీ విచ్చలవిడిగా డబ్బులు కేటాయించి ప్రజలలో ఆశలు రేకెత్తించడం వల్ల జరిగేదేమిటంటే, కేటాయించి ఖర్చు పెడుతున్న డబ్బులో నూటికి డెబ్బై రూపాయలు తప్పనిసరిగా వృథా కావడం; రేపు ఈ ప్రాజెక్టులలో ఏ రెండు మూడింటిని ఎంపిక చేసినా ప్రజలలో తీవ్ర అసంతృప్తి ఏర్పడడం; ప్రాంతాలవారీగా, జిల్లాల వారీగా ప్రజల మధ్య విద్వేషాలు చెలరేగడం. ఇది తెలివితక్కువతనం మాత్రమే కాదు, దుర్మార్గం కూడా.

రాజశేఖరరెడ్డి 'జలయజ్ఞం' విద్యుత్ వినియోగం విషయంలో రాష్ట్రం మొత్తం మీద పెద్ద భారాన్ని వేయబోతున్నది. ఆయన గారు పూర్తిచేయబోయే 30 ప్రాజెక్టులలో 17 ఎత్తిపోతల పథకాలు. చిన్నా చితక ఎత్తిపోతలు మనకు పరిచయమే. అవి రాష్ట్రంలో ఎక్కడా సఫలం కాలేదన్న సంగతి కూడా తెలిసినదే. అలాంటిది ఇవి చిన్నా చితక పథకాలు కూడా కావు. భారీ ఎత్తిపోతల పథకాలు. అయితే ఇక్కడ మేము వాటి సాంకేతిక సాధ్యాసాధ్యాల గురించి మాట్లాడడం లేదు. విద్యుత్ వినియోగాన్ని గురించి, దానికయ్యే ఖర్చుల గురించి మాత్రమే మాట్లాడుతున్నాం.

30 ప్రాజెక్టులలో 17 ఎత్తిపోతల ప్రాజెక్టులంటే అర్థం, కొత్తగా సాగునీటి వసతి కల్పించబోయే 65 లక్షల ఎకరాలలో 35 లక్షలదాకా ఎత్తిపోతల కింద వుంటాయని. ఒక్కొక్క ఎత్తిపోతల పథకంలో నీటిని ఎంత ఎత్తుకు లిఫ్ట్ చేయవలసి వుంటుందనేది ప్రాజెక్టును బట్టి వుంటుంది. 50 మీటర్ల నుండి 300 మీటర్ల దాకా లిఫ్ట్ అవసరం అవుతుందని స్థూలంగా చెప్పవచ్చు. సగటున 150 మీటర్లు ఎత్తిపోయవలసి వుంటుందనుకుందాం. 1 ఎకరానికి అవసరమయిన సాగునీరు 100 మీటర్లు లిఫ్ట్ చేసి పోయడానికి 1000 యూనిట్ల కరెంటు అవసరం అవుతుందని అంచనా. యూనిట్‌కు 2 రూపాయల ధర వేసుకున్నా 150 మీటర్లు ఎత్తిపోయడానికి 3000 రూపాయలు అవుతుంది. ఏ రైతూ అంతమొత్తం కాదుకదా అందులో 10వ వంతు మించి పెట్టుకోలేడు. మిగిలినది ప్రభుత్వమే పెట్టుకోవలసి వుంటుంది. 35 లక్షల ఎకరాలకు ఇది ఎంత అవుతుందంటే ఇప్పుడు మొత్తం వ్యవసాయ బోర్లు, మోటార్లకు అవసరమైన కరెంటుకోసం రాష్ట్రంలోని రైతులంతా కలిసి ఖర్చు చేస్తున్నంత (ఈ విషయం లెక్కలు వేసి రుజువు చేయొచ్చు). అంటే రాజశేఖరరెడ్డి గారి 'జలయజ్ఞం' ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం భరించవలసిన వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ రెండు రెట్లవుతుంది. ఇప్పుడిస్తున్నదే మోయలేని పాలకులు దీన్ని రెండురెట్లు పెంచితే మోస్తారా? జలయజ్ఞం అయిపోయిన తర్వాత కరెంటు సబ్సిడీ మేమియ్యలేము, మీరే బిల్లు కట్టండి అంటే రైతులేం కావాలి? అంత ఖరీదయిన సాగునీరు మాకు అక్కరలేదని రైతులంటే ఇంత హంగామా చేసి కట్టిన ప్రాజెక్టులు ఏం కావాలి?

ఎత్తిపోతల ప్రాజెక్టులు ఎన్నయినా చేపట్టవచ్చుననే పద్ధతిలో వ్యవహరించడమే తెలివితక్కువతనం. కాగల ఖర్చును దృష్టిలో వుంచుకొని అత్యవసరమైన వాటికి పరిమితం కావడం ఉచితమనిపించుకుంటుంది. గోదావరి జలాలలో మనం ఇంకా వాడుకోని వాటా వుంది కాబట్టి గుత్ప, అలీసాగర్‌లతో పాటు ఉత్తర తెలంగాణలో 300 మీటర్ల కాంటూరుకు ఎగువన ఉన్న మెట్ట నేలలకు నీరిచ్చే శ్రీరాంసాగర్ వరద కాలవకూ, ప్రాణహిత నుంచి నీళ్లు మళ్లించి రూపొందించిన ఎల్లంపల్లి ప్రాజెక్టుకూ ప్రస్తుతానికి పరిమితం కావడం మంచిది.

**అయితే ఏం చేయాలి?**

మరి ప్రభుత్వం ప్రాజెక్టులే చేపట్టవద్దంటారా అని అడుగుతారేమో.

వద్దని మేము అనడం లేదు. చేపట్టదగినవి 'జలయజ్ఞం' లిస్టులోనూ వున్నాయి. ఆ లిస్టులో లేనివీ వున్నాయి.

ఏ అనుమతులూ అక్కరలేకుండా, ఎవరినీ నిర్వాసితులు చేయకుండా, ఏ పొరుగు రాష్ట్రంతోనూ గొడవ లేకుండా వెనుకబడిన ప్రాంతాలకూ, దుర్భిక్ష ప్రాంతాలకూ సాగునీరివ్వగల ప్రాజెక్టులు వున్నాయి. అవి రాజశేఖరరెడ్డి గారి ముప్ఫైలో లేకపోవడం చాలా ఆశ్చర్యం కలిగించే విషయం.

పెన్‌గంగ నదిమీద మహారాష్ట్ర ఆదిలాబాద్‌కు ఉత్తరాన దిగువ పెన్‌గంగ ప్రాజెక్టు కట్టింది. ప్రాజెక్టు ఖర్చులో 12 శాతం మనం చెల్లించి ఒక కాలవ తవ్వుకొని 5,6 టియంసిల నీళ్ళు తీసుకుపోవచ్చని చెప్పింది. 12 శాతం అంటే కేవలం 240 కోట్లు. ఆ మొత్తం మహారాష్ట్రకు ఇచ్చేస్తే చాలా వెనుకబడిన తాంసి, బేల, జైనత్ మండలాలలోని 61 గ్రామాలలో 40,000 ఎకరాలకు నీళ్లొస్తాయి. 'జలయజ్ఞం'లో ఇదెందుకు లేదు? అసలు 'జలయజ్ఞం'లో ఆదిలాబాద్‌కు నీళ్ళిచ్చే ఒక్క ప్రాజెక్టూ ఎందుకు లేదు?

రాజోలిబండ మళ్లింపు పథకాన్ని ఆధునీకరించి దాని ఆయకట్టును పూర్తిస్థాయిలో కాపాడమని మహబూబ్‌నగర్ ప్రజలు చాలాకాలంగా ఆందోళన చేస్తున్నారు. దీనికి ఏ అనుమతులూ అక్కరలేదు, ఎవరినీ ముంచనక్కరలేదు. రాష్ట్రంలోని పాత ప్రాజెక్టులు ఒక్కొక్కటీ ఆధునీకరిస్తూ వాటి ఆయకట్టులు కాపాడుతూ వస్తున్నారు కదా. 19వ శతాబ్దపు ప్రాజెక్టులయిన గోదావరి డెల్టా, కృష్ణా డెల్టా, కె.సి. కెనాల్‌లను పూర్తిస్థాయిలో ఆధునీరించారు. కె.సి.కెనాల్‌ను ఇంకా ఆధునీకరించే పథకం 'జలయజ్ఞం'లోని ముప్ఫై పథకాలలో ఒకటి. 20వ శతాబ్దపు తొలి సంవత్సరాలలో నిర్మించిన విజయనగరం జిల్లా తోటపల్లి ప్రాజెక్టును ఆధునీకరించడమే కాక మళ్లింపు పథకం స్థానంలో చిన్నపాటి డ్యాం నిర్మించి ఆయకట్టు పెంచుతున్నారు. అయితే వీటి తరువాత వరుస క్రమంలో వచ్చే పాత ప్రాజెక్టులయిన రాజోలిబండ ఊసే లేదు. 87 వేల ఎకరాల ఆయకట్టు ముప్ఫైవేలకు పడిపోయిన ఈ ప్రాజెక్టు మీద తగిన మొత్తం ఖర్చుపెడితే 50,000 ఎకరాలు సస్యశ్యామలమవుతాయి.

హోస్పేటలోని తుంగభద్ర డ్యాంలో పూడిక 30 టియంసిల మేరకు పేరుకొని పోవడం వల్ల అనంతపురం, కర్నూలు జిల్లాలకు నీళ్లిచ్చే తుంగభద్ర కుడిగట్టు ఎగువ కాలవ, దిగువ కాలవలు బాగా దెబ్బతిన్నాయి. వాటి ఆయకట్టులో సగం కూడా తడవడం లేదు. అయితే ఈ రెండు కాలవలు కర్ణాటకలోని భూములకు నీళ్లిచ్చి మన రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయి కాబట్టి ఈ సమస్య మనదే కాదు, వారిది కూడా. అందువల్ల, పూడిక కారణంగా టి.బి. డ్యాంలో నిలవకుండా వున్న నీటిని సమాంతర కాలవల ద్వారా దాని గమ్యానికి తీసుకుపోవడం కర్ణాటకకూ అభ్యంతరం వుండదు. ఎగువ కాలవకు

సమాంతర కాలవను కర్ణాటకే ప్రతిపాదించింది. మనమే స్పందించడం లేదు. దిగువ కాలవకూ అదే ఉభయతారకమైన ఏర్పాటు చేసుకోవచ్చు. ఎంతలేదన్నా ఒక లక్ష ఎకరాలను తిరిగి ఆయకట్టులోకి తేగల ఈ పథకాలు జలయజ్ఞంలో ఎందుకు లేవు?

నల్గొండ జిల్లాలోని మునుగోడు, సంస్థాన్ నారాయణపురం మండలాల ఫ్లోరైడ్ సమస్య అందరికీ తెలిసిందే. రాష్ట్రంలో 'జలయజ్ఞం' అంటూ జరిగితే ఈ గ్రామాలకు నీళ్లివ్వడం అందులో ఒక ముఖ్య కార్యక్రమం కావాలి. కానీ కాంగ్రెస్ వారి 'జలయజ్ఞం'లో ఈ ప్రస్తావన లేదు. దీనికి అనువయిన మార్గాలు లేకపోలేదు. అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి హైద్రాబాద్‌కు తరలిస్తున్న 4 టియంసిలు ఆ గ్రామాలకు కేటాయించినా, పులిచింతలకు కేటాయించిన 9 టియంసిల నికర జలాలలో సగం ఆ గ్రామాలకు బదలాయించినా వారి సమస్య తీరుతుంది.

ఎప్పుడో లేక ఎవరో కట్టేసిన ప్రాజెక్టులకు కేవలం మరమ్మతులు చేయడం లేదా ఒకటీ అరా కాలవలు తవ్వడం పెద్దగా జేబులు నింపే వ్యవహారం కాదు కాబట్టే తక్కువ ఖర్చుతో కచ్చితమైన ఫలితం పొందగల ఈ పనులను నిర్లక్ష్యం చేస్తున్నారనుకోకూడదా?

**ముగింపు**

ఆంధ్రప్రదేశ్ హరితాంధ్రప్రదేశ్ కావలసిందే కానీ దానికి జరగవలసింది వేలకోట్ల ప్రజాధనాన్ని కాంట్రాక్టర్ల జేబులలో పోసి జనానికి అసాధ్యమైన ఆశలు కల్పించి సాగునీటి వనరులన్నీ రాజకీయ ప్రాబల్యం గల ప్రాంతాలకు కట్టబెట్టి చివరికి అప్పులూ, విధ్వంసమూ, ప్రజల మధ్య విద్వేషమూ మిగిల్చే అడ్డగోలు సాగునీటి ప్రయోగం కాదు. సాగునీటిని సార్వజనీనమైన హక్కుగా గుర్తించి, అనువయినవీ, అవసరమయినవీ, విధ్వంసకరం కానివీ అయిన నదీజలాల ప్రాజెక్టులు చేపట్టి, మండలానికి రెండు చెరువులను ఎంపిక చేసి సమగ్రంగా మరమ్మతు చేసి, భూగర్భ జలాల పెంపుదల కోసం భూసార సంరక్షణ కోసం తగు చర్యలు చేపట్టే సాగునీటి విధానం. అదే ఇంతకంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాన్ని ఇవ్వగలదు, రాష్ట్రంలోని ప్రతి ఎకరానికి ఒక పంటకైనా సాగునీరు ఇవ్వగలదు.

మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది

10 జూన్ 2005



# హిరమండలం రిజర్వాయర్ వద్దు

వంశధార అంతర్రాష్ట్ర నది. అది ఒరిస్సాలో పుట్టి మన రాష్ట్రంలోకి ప్రవేశించి సముద్రంలో కలుస్తుంది. ఆ నది నీటి గురించి మనకూ, ఒరిస్సాకూ ఇదివరకే ఒప్పందం జరిగింది. ఆ నదిలో 115 టియంసిల నికర జలం ఉందని గుర్తించి రెండు రాష్ట్రాలూ చెరి సగం వాడుకోవచ్చని అనుకున్నారు.

కాబట్టి వంశధారలో నీళ్లున్నాయి. మనకు హక్కూ ఉంది. అయితే ఆ నది చాలా దూరం రెండు రాష్ట్రాల సరిహద్దు వెంబడి ప్రవహించడం వల్ల, ఏ స్థలంలోనయితే వంశధార స్టేజ్-2కు మళ్లింపు పథకం నిర్మించాలని మన ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నదో ఆ స్థలం గురించి ఒరిస్సా వివాదం లేవదీసింది. దశాబ్దాలుగా ఆ వివాదం పరిష్కారం కాకుండా ఉంది.



ఒక్క వంశధారే కాదు. జంఝావతి, బాహుద నదుల విషయంలోనూ ఇదే సమస్య ఉంది. నదీజలాలు సగం సగం వాడుకోవాలన్న ఒప్పందం ఉభయ రాష్ట్రాల మధ్య ఉంది. నదులలో జలాలూ ఉన్నాయి. అయితే ఆ నదులు రెండు రాష్ట్రాల సరిహద్దులలో ప్రవహిస్తుండడం వల్ల మన వాటా మేరకు ప్రాజెక్టులు కట్టుకోవడానికి మన ప్రభుత్వాలు చేసిన ప్రతిపాదనలన్నిటికీ ఒరిస్సా అభ్యంతరం చెప్తున్నది. ఈ అభ్యంతరాలు దశాబ్దాల తరబడి అపరిష్కృతంగా ఉండిపోతున్నాయి.

యథాప్రకారం మన రాజకీయ పార్టీలూ, పత్రికలూ ఒరిస్సావాళ్ళను మూర్ఖులనీ, కుళ్ళుబోతులనీ తిడుతూ కాలక్షేపం చేస్తున్నాయి.

మన చుట్టూ ఉన్న అన్ని రాష్ట్రాలూ– కృష్ణా విషయంలో కర్ణాటక, గోదావరి విషయంలో మహారాష్ట్ర, ఉత్తరాంధ్ర నదుల విషయంలో ఒరిస్సా– నదీజలాల విషయంలో ఎందుకు మూర్ఖంగా ఉంటున్నారా అన్న సందేహం తెలుగుజాతికి ఎన్నడూ రాదు. మనబోటి మంచివాళ్లకు ఇంతచెడ్డ పడోసీలు దొరికారేమిటా అని బాధపడుతూ కాలక్షేపం చేస్తుంటాం.

వాళ్లంతా మూర్ఖులు కారేమో, వాళ్ల కారణాలు వాళ్లకున్నాయేమో అనుకోవడానికి సిద్ధపడడం అందరికీ మంచిది. ఉత్తరాంధ్ర నదుల విషయానికొస్తే, ఒరిస్సాతో తగవు ద్వైపాక్షికంగా పరిష్కారం కాదని ఈపాటికి రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం అయి ఉండాలి. అప్పుడు కేంద్ర ప్రభుత్వానికి అర్జీ పెట్టుకొని ఒక ట్రిబ్యునల్ ఏర్పాటు చేయించుకొని ఉంటే పరిష్కారం దొరికేది. దానికి ఒరిస్సా కూడ కట్టుబడి ఉండేది. కనీసం పదేళ్ల కింద ఈ పని చేసి ఉండవచ్చు. చేసివుంటే ఈపాటికి వంశధార, జంఝావతి, బాహుద నదులపైన ఏదో ఒక చోట ప్రాజెక్టులు కట్టుకొని ఉందుము.

అటువంటిదేం జరగలేదు.

★ ★ ★

సమాచార హక్కు చట్టం అక్టోబర్ నెల నుండి అమలులోకి రానుందట.

అప్పటిదాకా ప్రజలకు ఏ సమాచారము చెప్పొద్దని మన పాలకులు నిర్ణయించుకున్నట్టున్నారు.

వంశధార స్టేజ్–2 దీనికొక మంచి ఉదాహరణ. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలు ఎంత అసంబద్ధంగా ఉన్నాయంటే అది నిజమైన ప్రాజెక్టేనా లేక ఊహా అని ఎవరికైనా అనుమానం వస్తుంది. అది కాగితం మీద మాత్రమే ఉంటే నవ్వుకొని ఊరుకుందుము గానీ హిరమండలం రిజర్వాయర్ కోసం భూముల సేకరణ యత్నం, నిర్వాసితులను గుర్తించే యత్నం మొదలయి ఉండడం వల్ల ఇది నవ్వులాట కాదని అనుకోక తప్పడం లేదు.

భామిని మండలం నేరడి వద్ద నిర్మించతలపెట్టిన బ్యారేజి వంశధార స్టేజ్–2కు గుండెకాయ లాంటిది. దాని నుండే ఈ ప్రాజెక్టుకు నీళ్ళు లభిస్తాయి. అయితే నేరడి బ్యారేజికి ఒరిస్సా అనుమతి ఇవ్వడం లేదు. వారిని ఒప్పించే ప్రయత్నమూ జరగడం లేదు. వివాద పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వాన్ని అడిగి ట్రిబ్యునల్ ఏర్పాటు చేసే ప్రయత్నమూ జరగడం లేదు. అసలు ఆ దిశగా మన రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్న దాఖలాలే లేవు.

ప్రాజెక్టుకు నీటి మూలం అయిన నేరడి బ్యారేజి అసలు సాధ్యమేనా అన్న సందేహం తీరకుండానే మిగిలిన ప్రాజెక్టు పనులు మాత్రం జరిగిపోతున్నాయి. 20 వేల ఎకరాలకు నీళ్లియ్యవలసిన వరద కాలువ పనులు మొదలయిపోయాయి. దాని మీద ఉన్న రెండు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల పనులూ మొదలయ్యాయి. కుడి ప్రధాన కాలువను పొడిగించే ప్రక్రియ కూడ జరిగిపోతూ ఉంది. 19 టియంసిల సామర్థ్యంతో నిర్మించబోయే హిరమండలం రిజర్వాయరు భూమి సేకరణకు అవసరమయిన సర్వే సైతం ప్రారంభమయింది.

చివరికి ఒరిస్సా ప్రభుత్వం ఒప్పుకోకపోతే ఇదంతా ఎవరి నోట్లో పోసినట్టు?

నేరడి బ్యారేజికి ప్రత్యామ్నాయంగా కాట్రగడ దగ్గర నది సహజ ప్రవాహం నుండే నీటిని పక్కకు తీసి ప్రస్తుతానికి పని నడిపిస్తామని అంటున్నారు. దానివల్ల స్టేజ్–2కు అవసరమయినంత నీళ్ళు లభిస్తాయా? లభిస్తాయన్న శాస్త్రీయమైన అంచనా ప్రభుత్వం వద్ద ఉన్నదా? లభించవనీ, హిరమండలం రిజర్వాయరు నింపడానికి కాదు కదా, పూర్తిగా తడపడానికి కూడ కాట్రగడ నీటి మళ్లింపు పథకం చాలదనీ నిపుణులు అంటున్నారు. మరి నేరడి బ్యారేజి ఎప్పటికీ సాధ్యంకాక కాట్రగడతోనే వంశధార స్టేజ్–2 సరిపెట్టుకోవలసివస్తే అంత కొంచెం నీటికి ఇంత భారీ తవ్వకాలూ, కట్టడాలూ ఎందుకు?

ఇదంతా ఎవరి నోట్లో పోయడానికి?

అసలు వంశధార స్టేజ్–2 లెక్కలే విచిత్రమైనవి. మేము ప్రధానంగా ఆందోళన చెందుతున్నది హిరమండలం రిజర్వాయర్ వల్ల నిర్వాసితులు కాబోయే 21 గ్రామాల గురించీ, బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి కొండలలో బందీలు కాబోయే 82 గిరిజన గ్రామాల గురించీ కాబట్టి హిరమండలం రిజర్వాయర్‌ను దృష్టిలో ఉంచుకొని మాట్లాడుకుందాం.

హిరమండలం 19 టియంసిల నీటి సామర్థ్యం గల రిజర్వాయరు. ఇందులో 19 టియంసిల నీరు నిలువ చేస్తే, 25 నుండి 30 టియంసిల దాకా పారించుకోవచ్చు. కానీ వంశధార స్టేజ్–2 ఆయకట్టు 1,07,000 ఎకరాలని ప్రభుత్వం అంటున్నది. అందులో 20,000 ఎకరాలు హిరమండలం రిజర్వాయర్‌కు ఎగువన కట్టబోయే వరదకాలువ ఆయకట్టు కాబట్టి దానికి నీళ్ళు హిరమండలం రిజర్వాయర్ నుండి తీసుకోరు. ఆ 20,000 తీసేస్తే మిగిలిన ఆయకట్టు 87,000 ఎకరాలు.

ఇది ప్రధానంగా వంశధార కుడి ప్రధాన కాలవ ద్వారా నీరు పొందుతుంది. అయితే కుడి ప్రధాన కాలవకు వంశధార నది నుండే ఇప్పటికే 30,000 ఎకరాల మేరకు నీళ్ళు ఇస్తున్నారని ప్రభుత్వమే చెప్పుకుంటున్నది. గొట్ట బ్యారేజికి ఎగువన మూడేళ్ల నాడు నిర్మించిన కుడి హెడ్‌రెగ్యులేటర్ నుండి ఈ మొత్తం ఇప్పటికే ఇవ్వడం జరుగుతున్నది. గొట్టా బ్యారేజి (వంశధార స్టేజ్-1) కారణంగా దిగువన దెబ్బతిన్న పాతకాలపు యెరగాం, పురుషోత్తపురం, భైరి ఓపెన్‌హెడ్ కాలవల ఆయకట్టు అవసరాలను భర్తీ చేసే చిన్న ఉద్దేశ్యంతో మొదలుపెట్టిన ఈ కుడి ప్రధాన కాలవ ఆయకట్టు ఇప్పటికే 30,000 ఎకరాలను చేరుకుంది. (నిజానికి ఇంకా ఎక్కువే ఇస్తున్నారని రైతులు అంటున్నారు కానీ వాదన కోసం ప్రభుత్వాన్నే నమ్ముదాం).

ఇంక మిగిలింది 57,000 ఎకరాలు. హైలెవెల్ కెనాల్ నుండి నీరు పొందే 5000 తీసేస్తే, కుడి ప్రధాన కాలవ ద్వారా హిరమండలం రిజర్వాయర్ నుండి నీళ్లు పొందవలసింది 52,000 ఎకరాలు. 52,000 ఎకరాలకు 5 టియంసిలు చాలు, నీళ్ళు దండిగా ఇస్తే 8 టియంసిలు చాలు. 5 లేక 8 టియంసిల నీళ్ళు పారించుకోవడానికి 3 లేక 5 టియంసిల సామర్థ్యంగల రిజర్వాయర్ చాలు.

మరి 19 టియంసిల సామర్థ్యంతో హిరమండలం రిజర్వాయర్ ఎందుకు నిర్మిస్తున్నట్టు? 21 గ్రామాల సస్యశ్యామలమైన భూములను ఎందుకు ముంచుతున్నట్టు? 82 ఆదివాసీ గ్రామాల వారిని కొండల మీద ఎందుకు బందీ చేస్తున్నట్టు?

ఎన్నిసార్లు అడిగినా ఈ ప్రశ్నకు ప్రభుత్వం నుండి జవాబు లేదు. వారు జవాబు చెప్పరు కాబట్టి మనం వారు చేపడుతున్న నిర్మాణాల నుండి ఊహించుకోవలసిందే తప్ప గత్యంతరం లేదు. మన సమాచార హక్కు దుర్గతి అది.

హిరమండలం రిజర్వాయర్‌ను తిరిగి నదికి కలుపుతూ నిర్మిస్తున్న లింక్ కాలవలో ఈ రహస్యం ఉండాలి. కాట్రగడ దగ్గర (నేరడి సంగతి మరచిపోవడం మంచిది) పక్కకు తీసిన నీటిలో కొంత భాగాన్ని ఈ లింక్ కాలవ ద్వారా తిరిగి నదిలోకి పోస్తారు. ఇది గొట్టా బ్యారేజి (వంశధార స్టేజ్-1) ఆయకట్టు స్థిరీకరణకు ఉపయోగపడుతుందని అంటున్నారు. దీనికైనా ఎంత నీళ్ళు అవసరం ఉండబోతాయి?

వంశధార-1 ఆయకట్టు 1,48,000 ఎకరాలు. అది పూర్తిగా అందుతూ వుంది. అందులో పూడిక కారణంగా 17,000 ఎకరాలకు నీళ్లందని పరిస్థితి రాగా, 1998లోనే దీనిని సరిదిద్దడానికి నిధులు సమకూర్చి 37 నీటి వినియోగదారుల సంఘాల ద్వారా కాలవ నిర్వహణ పనులు చేపట్టి మరమ్మతులు చేసినట్టు ప్రభుత్వం చెప్పుకుంటున్నది.

పూడిక సమస్య కూడ ఈ విధంగా తీరిపోయినట్టయితే ఇంక 'స్థిరీకరణ'కు ఎంత నీళ్ళు కావాలి? వంశధార స్టేజ్-1 ద్వారా నీళ్లిస్తున్నది మొదటి పంటకు. ఆ సీజన్‌లో స్టేజ్-1కు అవసరమైన నీళ్లే కాక ఎగువన ఉన్న కుడి హెడ్ రెగ్యులేటర్ నుండి కుడి ప్రధాన కాలవ ద్వారా 30,000 ఎకరాలకు ఇప్పటికే నీళ్లివ్వగలుగుతున్నారు. ఇంక స్థిరీకరణ ఎక్కడిది?

లింక్ కెనాల్ నీళ్లివ్వబోయేది వంశధార స్టేజ్-1 స్థిరీకరణకా, లేక అదే ఆయకట్టుకు రెండవ పంట నీటికా? అన్న సందేహం రాకమానదు. ప్రభుత్వం జవాబు చెప్పదు కాబట్టి మనం ఊహించుకోవలసిందే. 19 టియంసిల హిరమండలం రిజర్వాయర్ నిర్మాణానికి కుడి ప్రధాన కాలవ కింద కొత్త ఆయకట్టును కారణంగా చూపుతున్నప్పటికీ, ఎడమ కాలవ కింద 1,48,000 ఎకరాలకు రెండవ పంటకు నీళ్లివ్వడమే దాని ప్రధాన లక్ష్యం అని అర్థం అవుతుంది. (అయినప్పటికీ 19 టియంసిల రిజర్వాయర్ అక్కరలేదు. 13-15 టియంసిల సామర్థ్యం ఉంటే చాలును. అది వేరే విషయం).

ఇదే నిజమయితే ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయవలసి ఉంది. ముంపు బాధితుల కోణం నుండి ప్రాజెక్టులను ఎప్పుడు విమర్శించినా 'అభివృద్ధి'కి అడ్డం వస్తున్నారని ఎదురు దాడి చేస్తారు. సాగునీరు లేని ప్రాంతాలకు సాగునీరివ్వడం వాంఛనీయమైన అభివృద్ధేనని ఒప్పుకుందాం. కానీ ఇప్పటికే ఒక పంటకు నీరు పొందుతున్న వారికి రెండవ పంటకు నీళ్లివ్వడం కూడా అంతే అవసరమా? దాని కోసం కూడ ఇతరులు 'త్యాగం' చేయవలసిందేనా?

ఇదివరకటిలాగ ప్రతీ ప్రాజెక్టునూ అభివృద్ధిగానూ, ముంపునంతా అనివార్యంగానూ చూసే రోజులు పోయాయి. అభివృద్ధి అవసరమే కానీ, అది విధ్వంసకరం కాని అభివృద్ధి అయివుండాలని ఇవాళ నాగరిక ఆలోచనారీతి భావిస్తున్నది. ముంపు తప్పనిసరి అయితే ఆ ముంపు వల్ల బాధితులయ్యేవారికి కూడ అదే ప్రాజెక్టు కింద భూములివ్వడం ద్వారా గానీ ఇతరత్రా గానీ మెరుగయిన జీవనాన్ని ఇవ్వడం కూడ ప్రాజెక్టు రూపకల్పనలో భాగం కావాలని భావిస్తున్నది. ఈ ఆలోచనలు మన పాలకులకింకా తోచలేదు గానీ నాగరిక ప్రపంచం ఈ విషయాలను ఏ విధంగా చూస్తున్నదో ప్రజలయినా తెలుసుకోవడం అవసరం.

'విధ్వంసకరంకాని అభివృద్ధి' అనే ప్రమాణాన్ని పెట్టుకొని చూసినప్పుడు ఒక పంటకు ఇప్పటికే నీళ్లిస్తున్నవారికి రెండవ పంటకు కూడ ఇవ్వడానికి పెద్దఎత్తున ముంపును

ఆహ్వానించడం సమర్థనీయం కాదు. భారీ ప్రాజెక్టులు కట్టేసి రాష్ట్ర భగీరథులుగా, జిల్లా భగీరథులుగా చలామణి కావడం రాజకీయనాయకులకు సంతోషం కలిగించే విషయం కావచ్చును గానీ ప్రజలు దానికోసం త్యాగాలు చేయనక్కర లేదు.

హిరమండలం రిజర్వాయర్ నిర్వాసితుల పక్షాన ఈ మాటలు అంటున్నామని మొదటే చెప్పాము కాబట్టి ఇక వారి విషయం మాట్లాడుకుందాం. నిర్వాసితుల భవితవ్యాన్ని కూడ ప్రాజెక్టులో భాగం చేసి వారికి సహితం ప్రాజెక్టుద్వారా, లేక ప్రాజెక్టుకు అనుబంధంగా మెరుగయిన జీవితాన్ని అందించే సమకాలీన ఆలోచనా రీతి మన తరాలకింకా తోచలేదని చెప్పాము. మనకు నిన్నటి దాకా ఒక పునరావాస హక్కే లేదు. పునరావాసం ప్రభుత్వమిచ్చే భిక్షగా ఉండింది. ఇప్పుడు పరిస్థితి కొంచెం మారి ఒక మేరకు పునరావాస హక్కు కల్పించే విధానం వచ్చింది. జీవో 68 అనే విధాన ప్రకటన పత్రంలో దానిని రాష్ట్ర ప్రభుత్వం పొందుపరిచింది.

ఈ విధాన పత్రం 6వ అధ్యాయంలో పునరావాస హక్కు స్వరూప స్వభావాలను వివరించారు. భూమి సేకరణ వల్ల స్థిరాస్తులు కోల్పోయిన వారికి ఎప్పటి లాగే నష్టపరిహారం దక్కుతుంది. అందులో మార్పేమీలేదు. నిర్వాసిత గ్రామాన్ని తిరిగి ఒక గ్రామంగానే ఇంకోక చోట అన్ని వసతులతోనూ నిర్మించాలన్న డిమాండ్ ఏదయితే ప్రజాస్వామిక ఉద్యమాలు చేస్తున్నాయో అటువంటి పునరావాస హక్కేదీ ఈ విధాన పత్రంలో లేదు. వేరే ఎక్కడయినా ఇళ్ల స్థలం ఫ్రీగా పొందాలంటే ఇప్పుడు కోల్పోయిన స్థలానికి నష్టపరిహారం వదులుకోవాలి. కోల్పోయిన ఇంటికి మారుగా ఇల్లు కట్టుకోవడానికి దరిద్రరేఖకు దిగువన ఉన్నవారికి మాత్రం 40 వేల రూపాయలిస్తారు. ముంపుకు గురయిన సాగుభూమికి ప్రత్యామ్నాయంగా అంతే సాగుభూమి పొందే హక్కులేదు. ఒకవేళ ఎక్కడయినా ఎవరి ఆక్రమణలో లేని సాగు యోగ్యమైన ప్రభుత్వ భూమి అందుబాట్లో ఉంటే ఇస్తారు. అయితే ఆ మేరకు ముంపుకు గురయిన భూమికి నష్టపరిహారం వదులుకోవలసి వస్తుంది.

మరి కొత్తగా ఉన్న హక్కేమిటి ఈ పునరావాస విధాన పత్రంలో అంటే, ముంపుకు గురయిన వారు మళ్లీ ఎక్కడయినా జీవనాన్ని పొందడానికి కొంతకాలం పడుతుందని గుర్తించి ఆ కాలం గడవడానికి ఆర్థిక సహాయం ప్రభుత్వం చేస్తుంది. భూమి పూర్తిగా కోల్పోయిన రైతులకు 750 రోజుల కనీస వేతనం లెక్కగట్టి చేతిలో పెడుతుంది. వ్యవసాయ కూలీలకూ ఇతర వృత్తుల వారికీ 625 రోజుల కనీస వేతనం, సన్నకారు రైతులుగా మారిన వారికి 500 రోజుల కనీస వేతనం ఒక్కసారిగా ఇవ్వడం

జరుగుతుంది. ఇంకా చిన్నా, చితక విషయాలు ఈ 'పునరావాస విధాన పత్రం'లో ఉన్నాయి గానీ ఇప్పటి దాకా లేనిదీ కొత్తగా ఇస్తున్నదీ ఈ ఆర్థిక సహాయం ఒక్కటే. 'దీనికి సహాయ పునరావాస విధానం' అని పేరు పెట్టినప్పటికీ ఇది నిజానికి పునరావాస విధానం కాదు. కొంచెం మెరుగయిన నష్టపరిహార విధానం మాత్రమే.

కాబట్టి ముంపుకు గురి కాబోయే ప్రజల జీవన ప్రమాణం ఇప్పుడున్నట్టు ఇక మీదట ఉండబోదనేది (బాగా నష్టపరిహారం పొందగల పెద్ద రైతులను మినహాయిస్తే) స్పష్టమే. ఇవి ఒకటీ రెండూ కుటుంబాలు కావు. దాదాపు 30 వేల నుండి 40 వేల జనాభా నిర్వాసితులవుతారు. ప్రభుత్వం లెక్క ప్రకారం పొలం మాత్రమే పోయి ఇల్లు భద్రంగా ఉంటుంది అనే కోవకు చెందినవారు కూడ అక్కడే ఉండి బతకలేరు. జీవో 68 ప్రకారం వారు కూడా 'ప్రాజెక్టు బాధిత కుటుంబాల' లెక్కలోకి వస్తారు.

ఇది హిరమండలం రిజర్వాయర్‌లో ప్రత్యక్షంగా ముంపుకు గురయ్యే 21 మైదాన గ్రామాల విషయం కాగా, రిజర్వాయర్‌కు ఆవలనున్న కొండలలో బందీ కాబోయే 82 ఆదివాసీ గూడెంల ప్రజలది మరింత సంకటస్థితి. ప్రభుత్వం లెక్కలలో వారివి 'ముంపు గ్రామాలు' కావు. రిజర్వాయర్ నీటిమట్టం ఎంతవరకు ఉంటే అంత మేరకు మాత్రమే నీటి పారుదల శాఖ లెక్కలో 'ముంపు ప్రాంతం'. రిజర్వాయర్ నీటి మట్టం, మరియు వంద మీటర్ల ఎగువ వరకు నీటిపారుదలశాఖ లెక్కలు వేసినదే ముంపు ప్రాంతం. జీవో 68 రూపంలో జారీ అయిన పునరావాస విధాన పత్రం కూడ ముంపు ప్రాంతంలో ఏదయినా వృత్తి చేసుకొని బతుకుతున్న వారిని 'ప్రాజెక్టు బాధిత కుటుంబాలు'గా గుర్తిస్తుందే తప్ప ప్రాజెక్టు వల్ల రాకపోకలు బంద్ అయిపోయే కారణంగా జీవనం కొనసాగించడం అసాధ్యం అయ్యే వారిని గుర్తించదు. ఇటువంటి బాధితులు ప్రతీ ప్రాజెక్టుకు ఉంటారని అనేక సందర్భాలలో ప్రభుత్వం దృష్టికి వస్తూనే ఉన్నా, లేక లేక రూపొందించిన ఈ పునరావాస విధాన పత్రంలో వారికి గుర్తింపు ఇవ్వలేదు. హిరమండలం రిజర్వాయర్ విశిష్టత ఏమంటే ఇటువంటి బాధితులు పెద్ద సంఖ్యలో ఉండడం, వారందరూ ఆదివాసులు కావడం. 82 గూడెంల ప్రజలకు ముందు నీళ్లు, వెనక కొండలు కలిసి బయటి ప్రపంచం నుండి రాకపోకలకు ఆటంకంగా ఉంటాయి. బయలు ప్రదేశంలోనే బందీలయి బతకవలసి ఉంటుంది.

వీరి గురించి మేము ఇప్పటికే అధికార యంత్రాంగం దృష్టికి ఒకటికి నాలుగు సార్లు తీసుకొచ్చినప్పటికీ మేము వ్యక్తం చేస్తున్న ఆందోళన నిజమా కాదా అన్న విచారణ సహితం అధికారులిప్పటిదాకా చేపట్ట లేదంటే 'అభివృద్ధి' సాధించామని చెప్పుకోవాలన్న

కోరిక, భగీరథులమనిపించుకోవాలన్న నాయకుల దాహం, వారినెంత అమానుషంగా తయారు చేస్తున్నాయో గ్రహించవచ్చు. మా డిమాండ్లు ఇవీ –

హిరమండలం రిజర్వాయర్ ప్రతిపాదన విరమించుకోవాలి.

వంశధార ఎడమ కాలవ ఆయకట్టుకు రెండవ పంటకు నీళ్లిచ్చే ఆలోచన విరమించి కుడి ప్రధాన కాలవ ఆయకట్టుకు ప్రస్తుతం ఉన్న కుడి హెడ్‌రెగ్యులేటర్ ద్వారా నది నుండే నేరుగా నీళ్లు తీసుకోవాలి.

కాట్రగడ పథకాన్ని వరద కాలవకే పరిమితం చేయాలి.

జీవో 68ని పూర్తిగా తిరగరాసి సమకాలీన/ ప్రజాస్వామిక ఆలోచనలకు అనుగుణంగా సమగ్ర పునరావాస విధానంగా రూపొందించాలి.

'అభివృద్ధి'కి ఆదివాసులను సునాయాసంగా బలిచేసే అమానుష పాలనా వైఖరిని విడనాడాలి.

మొదటి భాగం 'జలయజ్ఞానికి ఆదివాసీ సమిధలు' పేరుతో ప్రజాతంత్రలో 22.5.2005న వచ్చిన వ్యాసంలోని కొంత భాగం. రెండవ భాగం మానవ హక్కుల వేదిక, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల సంఘం సంయుక్త కరపత్రంగా వచ్చింది.

1 సెప్టెంబరు 2005



# చెరువు కట్టలు ఎందుకు తెగుతున్నాయి?

వలిగొండ గురించి ఇప్పటికే చాలా రాసారు. చాలా అన్నారు. అయినా చెప్పవలసిన ముఖ్యమైన విషయాలు మిగిలిపోయాయి.

విపరీతంగా వర్షాలు కురుస్తూ ఎక్కడ బడితే అక్కడ వరదలు వస్తున్నాయని తెలిసి కూడ రైల్వే వారు బ్రిడ్జిలు, కల్వర్టులు బాగున్నాయా లేదా అని చూసుకోవడంలో విఫలం అయ్యారా, లేక చెరువు కట్టలు తెగి రైల్వే లైన్ వైపు నీటి వరద ప్రవహిస్తున్న సంగతి రైల్వే వారికి తెలియజేయడంలో నీటి పారుదలశాఖ విఫలం అయిందా అనేది డెల్టా ప్యాసెంజర్ కొట్టుకుపోయిన సందర్భంగా జరిగిన చర్చ.



ప్రశ్న ఇదే అయితే తప్పు ప్రధానంగా రైల్వే వారిదేనని (పత్రికలు తొలినాడే ఈ నిర్ణయానికి వచ్చేసాయి) నిర్ధారించడం న్యాయమే. ట్రాక్ భద్రత వారి బాధ్యత. ట్రాక్ కింద ఉన్న బ్రిడ్జిలు, కల్వర్టులు బాగున్నాయో లేదో ఎప్పటికప్పుడు చూసుకోవడానికి ప్రత్యేకమైన (అంటే అది తప్ప వేరే డ్యూటీ లేని) అధికారులు రైల్వే శాఖలో ఉన్నారు. ఆ అధికారి కింద తగినంత మంది సిబ్బందీ ఉన్నారు. వర్షాలు భారీగా పడినట్టయితే అకస్మాత్తుగా వరదలొచ్చే ప్రమాదం ఉందన్న కామన్‌సెన్స్ ఉన్న వారెవరయినా అటువంటి పరిస్థితిలో తాము అప్రమత్తంగా ఉండి తమకింది సిబ్బందిని అప్రమత్తం చేయవలసి ఉండింది. తగినంత మంది డ్యూటీలో ఉండేటట్టు చూడవలసి ఉండింది. ఇదేమీ జరగలేదనీ, ఈ సంగతి కప్పిపెట్టడానికి దక్షిణమధ్య రైల్వే వారు నానా తంటాలు పడ్డారనీ పత్రికలు ఆధారాలతో సహా తెలియచెప్పాయి.

అయితే ఈ ప్రశ్నలే ఎందుకు వేసుకోవాలి? చెరువుకట్టలు ఎందుకు తెగవలసి వచ్చింది అన్న ప్రశ్న ఎందుకు వేసుకోకూడదు? ఎప్పుడో ఇరవై ఏళ్లకొకసారి తప్ప రాజాలని కుంభవృష్టిని ప్రమాణంగా పెట్టుకొని ప్రశ్న వేయడం అర్థరహితం అనే ముందు చెరువుల వ్యవస్థ (అధికార పరిభాషలో చిన్న తరహా నీటి పారుదల వ్యవస్థ) చక్కగా ఉన్నా కూడ ఆ రెండు మూడు రోజులు కురిసిన వానలకు చెరువుకట్టలు తెగి ఉండేవేనేమో. కానీ 'ఏమో' అంటున్నాము కాబట్టి తెగకుండ ఉండేవేమోనని కూడ అనుకొని ఈ కోణం నుండి కొంచెం ఆలోచిద్దాం. ఎందుకంటే వందకు పైగా రైలు ప్రయాణీకులు ప్రాణాలు పోయాయనేది ఒక బాధ కాగా, లేక లేక నిండిన చెరువుల నుండి నీళ్లన్నీ కొట్టుకు పోయాయన్నది ఇంకొక బాధ. వలిగొండ పరిసరాల నిత్య దుర్భిక్షం ఎరిగిన వారికిది చిన్న బాధ కాదని అర్థం అవుతుంది.

ఒకనాడు గ్రామాలలో చెరువుల వ్యవస్థను రైతులే రక్షించుకునేవారనీ, బ్రిటిష్ పాలనతో మొదలయిన మార్పుల కారణంగా ఆనాటి గ్రామీణ వ్యవస్థ, కట్టడి ధ్వంసమయి, దానికి ప్రత్యామ్నాయమేదీ నెలకొనకపోవడం వల్ల చెరువులు నాశనం అయినాయనీ తరచుగా ఒక ఫిర్యాదు వింటుంటాం. అది నిజమే కానీ ఆ రోజులు తిరిగిరావు. ఎందుకంటే అప్పటి రోజులలో గ్రామీణ నీటి వనరులను పకడ్బందీగా నిర్వహించింది ప్రజాస్వామికమైన సహకార వ్యవస్థ కాదు. నిచ్చెన మెట్ల గ్రామీణ వ్యవస్థ.

అనంతపురం జిల్లాలోని గుత్తి పట్టణం సమీపంలో ఒకపెద్ద చెరువు ఉంది. (రాయల సీమలోని చెరువులు తెలంగాణలోని చెరువుల కంటె సగటున పెద్దవి. ఇక్కడికంటె అక్కడ వర్షపాతం ఇంకా తక్కువ కాబట్టి, కురిసిన వర్షాన్ని పదిలంగా దాచుకోవలసిన అవసరం ఎక్కువ.) ఆ చెరువుకు పదేళ్ల కింద వరుసగా ఒకే చోట రెండు సంవత్సరాలు గండి పడి నీళ్లన్నీ వృథాగా పోయాయి. చెరువు కట్టకు భద్రంగా గండి పూడ్చేపాటి నిర్వహణ కూడ సాధ్యం కాదా అని గుత్తి ఎంఆర్‌వోను అడిగితే, రాయలసీమకే చెందిన ఆయనగారు 'ఇప్పుడు ఎవరి మాట ఎవరికి బట్టింది చెప్పు- మా చిన్నతనంలో రెడ్డి చిటికె వేస్తే ఊరంతా కదిలి వస్తుంది. ఇప్పుడు? నాకేల అని వీపు తిప్పుకొని పోతారు' అన్నాడు. రెడ్డి అంటే ఇక్కడ గ్రామ పెద్ద - పటేలు, మునసబు. రెడ్డి చిటికెను ఆజ్ఞగా శిరసావహించి ప్రజలు- ముఖ్యంగా పెద్దలకు సేవచేయడం ధర్మంగా గల కింది కులాలు- ఎదురుచెప్పకుండ కదలడం వల్ల ఇటువంటి మంచి కొంచెం జరిగి ఉండవచ్చును గానీ చెడు చాలా జరిగిందని మనకు తెలుసు. ఆ రోజులు తిరిగి రావాలని ఎవ్వరమూ కోరుకోము.

మరి ప్రత్యామ్నాయం ఏమిటి అంటే గ్రామీణ వనరులను ప్రజాస్వామ్య సహకార స్ఫూర్తితో, ఉమ్మడిగా ప్రజలు కాపాడుకునే వ్యవస్థ. ఆ ప్రత్యామ్నాయం కోసం ఏ ప్రయత్నమూ జరగలేదనేది నిజం కాదు. ప్రజలే ఉన్నతమైన చైతన్యంతో ఒక కట్టడి మీద నిలబడి నీటివనరులనూ పర్యావరణాన్నీ కాపాడుకున్న ఉదంతాల గురించి అప్పుడప్పుడు వింటుంటాం.

అయితే చట్టం కూడా అటువంటి వ్యవస్థను అధికారికంగా నెలకొల్పే ప్రయత్నం చేసింది. రాజకీయ సంకుచితత్వం, గ్రామీణ పెత్తందార్ల అధికార దాహం, సామాజిక జీవితంలోని ముఠా సంస్కృతి, నిధులలేమి దాని అమలుకు అవరోధంగా నిలిచాయిగానీ ఒకనాటి ఉమ్మడి బాధ్యతను ఆనాటి నిచ్చెనమెట్ల ప్రాతిపదిక మీది నుండి తొలగించి ప్రజాస్వామిక ప్రాతిపదిక మీద నిలబెట్టే ప్రయత్నం జరగకపోలేదు.

1997లో నీటిపారుదల వ్యవస్థ నిర్వహణ యావత్తు ఆయకట్టుదార్ల చేతిలో పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒక చట్టం చేసింది (ఆం.ప్ర ఫార్మర్స్ మేనేజ్‌మెంట్ ఆఫ్ ఇరిగేషన్ సిస్టమ్స్ చట్టం). అదే సంవత్సరం దాని కింద రూల్స్ కూడ ప్రకటించింది. ఇంక ఆ తరువాత నీటి పారుదల ప్రాజెక్టులను రూపొందించి, నిర్మించి, కాలవలు తవ్వి ఏయేటికాయేడు డిస్ట్రిబ్యూటరీలలోకి నీళ్లు పంపించడం మాత్రమే ప్రభుత్వం పని. (ఇప్పుడు ఈ పని కూడ మొత్తంగా కాంట్రాక్టర్లకిచ్చేస్తున్నారు కాబట్టి ఇక మీదట ఇది కూడ ఉండక పోవచ్చు). ఆ నీటిని స్వీకరించి, దానిని ఆయకట్టుదార్ల పొలాలకు పారించడానికి టైంటేబుల్ రూపొందించి, దాని ప్రకారం ఆ నీటిని పంచుకొని, నీళ్లు తక్కువ ఉన్న సంవత్సరాలలో ఏ పంటలు వేయకూడదో నిర్ణయించుకొని, దానిని అమలు చేసుకొని, చివరి భూములకు నీళ్లందకుండ ఎగువన ఉన్న వాళ్లే నీళ్లంతా తీసేసుకునే అక్రమాన్ని అరికట్టి, సీజన్ అయిపోయిన తరువాత మళ్లీ సీజన్ వచ్చేలోపల నీటిపారుదల వ్యవస్థకు అవసరమైన మరమ్మతులన్నీ చేసి, పనిలోపనిగా మురుగు నీరు తొలగించే ఏర్పాటు చేసి, కాలవగట్లపైనా చెరువుగట్లపైనా మొక్కలు చెట్లు పెంచడం ద్వారా పర్యావరణాన్ని మెరుగుపరిచి, సాగునీటిని తగిన రీతిలో వినియోగించుకోవడానికి అవసరమైన భూసార పోషణ, సంరక్షణ చర్యలు చేపట్టి, నీటిని పొదుపుగా వాడుకునే వ్యూహాలు రచించి, వాటిని ఆయకట్టుదార్లకు నేర్పించి ఇంకా ఇటువంటి చాలా పనులు చేసే బాధ్యతంతా ఆయకట్టుదార్లదే.

ఈ గురుతర బాధ్యత నిర్వహించవలసిన ఆయకట్టుదార్ల సంస్థ పేరు నీటి వినియోగదార్ల సంఘం. ఒక్కొక్క చెరువుకు (మరీ పెద్దదీ మరీ చిన్నదీ కానట్టయితే) ఒక నీటి వినియోగదార్ల సంఘం ఉంటుంది. ఆయకట్టుదార్లందరూ దానిలో సభ్యులుగా

ఉంటారు. ఒక కార్యవర్గాన్ని ఎన్నుకుంటారు. మధ్యతరహా, పెద్ద తరహా నీటి పారుదల ప్రాజెక్టయితే గరిష్ఠంగా 4000 ఎకరాల ఆయకట్టు మేరకు ఒకటి చొప్పున పలు నీటి వినియోగదార్ల సంఘాలుంటాయి. అటువంటి కొన్ని సంఘాలు కలిసి రెండవ అంచె వ్యవస్థ (డిస్ట్రిబ్యూటరీ కమిటీ) ఏర్పడుతుంది. నీటి వినియోగదార్ల సంఘాల అధ్యక్షులందరూ ఈ రెండవ అంచె వ్యవస్థలో ప్రాథమిక సభ్యులు. పెద్ద ప్రాజెక్టయితే దానికింద ఉన్న డిస్ట్రిబ్యూటరీ కమిటీల అధ్యక్షులంతా కలిసి ప్రాజెక్టు కమిటీగా– మూడవ అంచె వ్యవస్థగా– ఏర్పడతారు.

ఈ మూడంచెల వ్యవస్థలో సభ్యులంతా రైతులే, ఆయకట్టుదార్లే. నీటిపారుదల వ్యవస్థల నిర్వహణ బాధ్యత మొత్తంగా వీరిదే. ప్రాథమిక బాధ్యత నీటి వినియోగదార్ల సంఘాలది కాగా, పర్యవేక్షణ బాధ్యత, ప్రణాళికా రచన బాధ్యత పై స్థాయి కమిటీలది.

ఈ వ్యవస్థలు బాగా పనిచేస్తే ఒకనాటి స్వయం నిర్వహణ ప్రజాతంత్ర ప్రాతిపదికపైన తిరిగి నెలకొనేది. కానీ చట్టం చేసి ఎనిమిదేళ్ళయినా అటువంటిదేం జరగలేదు. రాజకీయ స్వార్థానికీ, ముఠా తత్వానికీ, అధికార దాహానికీ చట్టంలోని రెండు లోపాలు కూడ తోడయ్యాయి. స్వయం నిర్వహణ పేరుతో ఈ చట్టం ఆయకట్టుదార్లపైన పెట్టే బాధ్యతకు సాంకేతిక సలహాలు, సమాచారం చాలా అవసరం. ప్రభుత్వ నీటిపారుదల శాఖే కాదు, వ్యవసాయశాఖ, పర్యావరణ నిపుణులు, భూసార సంరక్షణలో నిపుణులు అందరూ ఆయకట్టుదార్లతో కలిసి పనిచేస్తే తప్ప ఈ చట్టం లక్ష్యం ఒనగూడదు. 'రైతులకే అంతా అప్పగించేసారు. మనకేం పని లేదు' అని బల్లకింద కాళ్లు జాపుకొని విశ్రమించే అధికార గణం ఉన్నచోట అది జరగదు. జరగడం లేదు. చట్టం వారిపైన స్పష్టమైన బాధ్యతలు పెట్టాలి. రెండవది, అతి ముఖ్యమైనది, నిధుల సమస్య. సకల బాధ్యతలూ ఆయకట్టుదార్ల పైన పెట్టిన చట్టం వారికి తగు మాత్రం నిధులు పొందే హక్కు ఇవ్వలేదు. నిధులకు అయిదు మూలాలు, 'ఇంకెక్కడి నుండయినా పొందవచ్చు' అనే ఆరవ మూలం సెక్షన్ 22లో సూచించారు గానీ నిజంగా అవసరాలు తీర్చగలిగేది ప్రభుత్వమిచ్చే గ్రాంటులే. అవి తగినంత కాదు, అందులో దశాంశం కూడ లేక ఈ అద్భుతమైన వ్యవస్థ ఎన్నికలప్పుడు తప్ప పని చేయడం లేదు. మరి 'వలిగొండలు' ఎందుకు జరగవు?

ప్రజాతంత్ర

10 డిసెంబర్ 2005



## పోలవరం ప్రాజెక్టు :
# ఇంతకంటే ఘోరం ఇంకోటి ఉండదు

**జం**తువుకు తలా తోకా ఉంటాయి. జంతువు రూపురేఖలు అర్థం చేసుకోవాలంటే తల దగ్గర మొదలుపెట్టి తోకదాకా పరిశీలించడం మానవ మాత్రులయిన వారికి సహజం. తోక దగ్గర మొదలుపెడతాననే వాడిని మామూలుగా వెర్రివాడంటాం.

ఇప్పుడు మనకొక ముఖ్యమంత్రి వచ్చాడు. ఈయన వ్యవసాయదారులకు ఎట్టి పరిస్థితిలోనూ సాగునీరు ఇస్తానంటున్నాడు. ఎప్పటికైనా హామీ ఇచ్చిన అన్ని ప్రాజెక్టులూ కట్టేస్తానంటున్నాడు. కడుతున్నాడు కూడా. కానీ తోక దగ్గర మొదలు పెడుతున్నాడు. ఇది ఆయన సొంత విషయమయితే వెర్రివాడనుకుందుము కానీ మనందరి విషయం కాబట్టి మనల్ని వెర్రివాళ్లను చేస్తున్నాడనక తప్పదు.



ఒక నీటి పారుదల ప్రాజెక్టు కట్టాలంటే మొదట నీళ్లుండాలి. దానిని వాడుకునే హక్కు మనకుండాలి. ఇది మొట్టమొదటి విషయం. ఆ తరువాత ప్రాజెక్టుకొక ప్రణాళిక ఉండాలి. అది సాంకేతికంగా ఆమోదనీయం కావాలి. ఆపైన ప్రాజెక్టుకయ్యే ఖర్చు, దాని వల్ల వచ్చే ప్రయోజనాల అంచనా ఉండాలి. దాని ప్రకారం కూడా అది ఆమోదనీయం కావాలి. ప్రాజెక్టు వల్ల అడవి మునిగేటట్టయితే కేంద్ర అటవీశాఖ ఆమోదం కావాలి. ఎంత అడవి భూమి మునిగితే అంత భూమిని అడవి పెంపకానికి వేరొక చోట అప్పగించనిదే కేంద్ర అటవీశాఖ సాధారణంగా ఆమోదం ఇవ్వదు. ప్రాజెక్టు వల్ల ఆదివాసులు నిర్వాసితులయ్యేటట్టయితే కేంద్ర ప్రభుత్వ

సాంఘిక సంక్షేమశాఖ ఆమోదం కావాలి. పునరావాసం గురించి ఎంతో కొంత హామీ ఇవ్వనిదే ఆ ఆమోదం లభించడం కష్టం.

ఇవి పాలనా నియమాల ప్రకారం, చట్టం ప్రకారం తప్పనిసరి విషయాలు. ముంపుకు గురయ్యే ప్రజల పునరావాసం కూడా చట్టంలో ఒక హక్కయి ఉంటే ముంపుకు సంబంధించిన సమగ్రమైన అంచనా, ముంపుకు గురయ్యేవారికి కల్పించబోయే పునరావాసాన్ని గురించి సమగ్రమైన అంచనా కూడా తప్పనిసరి అయివుండేవి. కానీ పునరావాసం ఒక హక్కు కాకపోవడం భారతదేశపు చట్టాలలోని అత్యంత బాధాకరమైన లోపాలలో ఒకటి. అయినప్పటికీ ఇది అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన విలువ కాబట్టి ముంపు, పునరావాసాల అంచనా కూడా ముందుగా ఉండాలని ప్రజాస్వామిక ఉద్యమాలు అంటున్నాయి.

ఇవన్నీ అయిన తరువాతే ప్రాజెక్టు నిర్మాణం మొదలు కావాలి. దానికి టెండర్లు పిలవాలి, పని మొదలుపెట్టాలి. కానీ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం మొదట చెప్పిన చర్యలేవీ చేపట్టకుండా నేరుగా టెండర్లు పిలవడం మొదలుపెట్టింది. వేల కోట్లు కేటాయించి కాలవలు తవ్విస్తూ ఉంది. ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీ కూడా ప్రాజెక్టుల ప్రక్రియను తోక దగ్గర ఎందుకు మొదలు పెడుతున్నావు అని అడగకుండా తానూ తోక దగ్గరే చర్చ పెడుతున్నది. టెండర్లలో అక్రమాలు, ఏకపక్ష వైఖరి ప్రాజెక్టుల గురించి జరిగే ఏకైక చర్చ అయింది.

తలను విడిచిపెట్టి తోక దగ్గర మొదలుపెట్టిన భారీ ప్రాజెక్టులలో ఒకటి పోలవరం. అప్పుడెప్పుడో 1970లలో, 1980లలో తయారు చేసిన ప్రణాళిక తప్ప ఆ ప్రాజెక్టుకు ఈ మధ్య తయారు చేసిన ప్రణాళికేదీ లేదు. అప్పట్లో తయారుచేసిన ప్రణాళికకు ఆమోదమూ లేదు. ఎంత భూమి మునుగుతుందో, ఎంతమంది నిర్వాసితులవుతారో కచ్చితమైన అంచనా ఆనాడూ లేదు, ఈనాడూ లేదు. ఆనాడు ప్రభుత్వం చెప్పిన అంచనా సరియినది కాదని, ప్రభుత్వం 213 గ్రామాలు మునుగుతాయని అంటుండగా నిజానికి 276 గ్రామాలు మునుగుతాయని సెంటర్ ఫర్ ఎకనమిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్) పరిశోధన చేసి తేల్చింది.

ఇప్పుడు ఆ మాత్రం అంచనా కూడా లేకుండా మళ్లీ ప్రభుత్వం పోలవరం పనులు మొదలు పెట్టింది. గతంలో పునాదిరాళ్లు వేయడంతో సంతృప్తి చెందింది. ఈసారి కాలవల తవ్వకం ఉధృతంగా సాగుతున్నది. కాబట్టి ప్రాజెక్టు నిజంగా కట్టేస్తారేమోనని ముంపుకు గురికాగల గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఈ నేపథ్యంలో పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి, ఖమ్మం జిల్లాలలో ముంపుకు గురికాగల ప్రాంతాలలో మానవహక్కుల వేదిక పర్యటించింది. ఆదివాసుల సంఘాల ప్రతినిధులతో కలిసి చేసిన ఈ పర్యటనలో మేము గ్రామస్తులతో వివరంగా మాట్లాడాము. వారి ప్రస్తుత జీవిత స్థితిగతుల గురించి, రేపు నిర్వాసితులయితే కోల్పోయే జీవనాన్ని గురించి, హక్కుల గురించి వారిని అడిగి తెలుసుకున్నాము. ప్రాజెక్టు గురించి వారి అభిప్రాయం అడిగాము, మాకు తోచింది చెప్పాము.

ముంపుకు సంబంధించిన అధికారిక నివేదిక ఏదీ లేదు కాబట్టి తొలినాటి అంచనాల ననుసరించి 1996లో 'సెస్' వారు ప్రకటించిన రిపోర్టును ఆధారం చేసుకొని ఒక అవగాహనకు రావడం తప్ప చేయగలిగింది లేదు. ఆ నివేదిక ప్రకారం పోలవరం డ్యాం ఎత్తు (పూర్తి రిజర్వాయర్ స్థాయి- ఎఫ్ఆర్ఎల్) 150 అడుగుల కాంటూర్‌లో ఉంటుంది. కాబట్టి ఆ కాంటూర్ వరకు డ్యాంకు ఎగువన నది వెడల్పవుతుంది. ఆ కాంటూర్ వరకు నదికి ఇరువైపులా నీళ్లు నిలుస్తాయి. అయితే 'సెస్' నివేదిక గుర్తించినట్టు ఎఫ్ఆర్ఎల్ 150 అడుగుల కాంటూర్‌లో ఉన్నట్టయితే ముంపు కేవలం 150 అడుగుల కాంటూర్‌కే పరిమితం అవుతుందని అనుకోవడం సరయినది కాదు. నదిలో ప్రవాహం వేగంగా ఉన్నప్పుడు, అలల తాకిడి ఉన్నప్పుడు ఇంకా ఎక్కువ కాంటూర్‌లో ముంపు ఉండగలదు కాబట్టి 160 అడుగుల కాంటూర్ దాకా మునుగుతుందని అంచనా వేయడం సబబు. అంతే కాకుండా కాగితం మీద కాంటూర్ వేసుకొని దాని ప్రకారం మాత్రమే ముంపును అంచనా వేసేటట్టయితే అసంబద్ధమైన పరిస్థితి తలెత్తవచ్చని కూడా సెస్ నివేదిక గుర్తించింది. ఒక ఊరిలో పొలాలు మొత్తం మునిగి ఆవాసాలు మాత్రం మిగలవచ్చు. అప్పుడు ఆ ఊరు 'ముంపు గ్రామం' కాదంటే ఎట్లా? పొలాలు మొత్తం పోగొట్టుకొని వాళ్లక్కడ ఏ విధంగా బతుకుతారు? ఇది ఆదివాసుల గ్రామాలకు ఎక్కువగా వర్తిస్తుందని సెస్ నివేదిక గుర్తించింది. వారి సాగుభూములు నది ఒడ్డున ఉంటాయి. ఇళ్లు ఎత్తు మీద ఉంటాయి. నది వెడల్పయి సాగుభూములు మునిగి ఇళ్లు మిగిలితే వారక్కడ ఉండి ఏం చేసుకొని బతకాలి? ఏం తిని కడుపు నింపుకోవాలి?

ఈ విధంగా వివేచించి 'సెస్' నివేదిక 276 గ్రామాలు ముంపుకు గురవుతాయని, అప్పటి లెక్కల ప్రకారం 27,798 కుటుంబాలు, లక్షా 17 వేల జనాభా నిర్వాసితులవుతారని అంచనా వేసింది. ఆ నివేదిక తయారయి ఒక దశాబ్దం గడిచింది కాబట్టి గ్రామాలు అన్నే ఉన్నా కుటుంబాల సంఖ్య, జనాభా పెరిగే ఉంటాయి.

**మండలాల వారీగా ముంపు గ్రామాలు**

| మండలం | గ్రామాల సంఖ్య |
|---|---|
| **ఖమ్మం జిల్లా** | |
| వరరామచంద్రాపురం | 45 |
| కూనవరం | 48 |
| చింతూరు | 17 |
| కుకునూరు | 34 |
| వేలేరుపాడు | 39 |
| భద్రాచలం | 13 |
| బూర్గంపాడు | 9 |
| **పశ్చిమగోదావరి జిల్లా** | |
| పోలవరం | 29 |
| **తూర్పుగోదావరి జిల్లా** | |
| దేవీపట్నం | 42 |

ఈ గ్రామాల జనాభాలో 47 శాతం ఆదివాసులు, 15 శాతం దళితులు, 23 శాతం వెనుకబడిన కులాలు, 15 శాతం అగ్రకులాలు అని 'సెస్' అంచనా వేసింది. చింతూరు, పోలవరం, వేలేరుపాడు, దేవీపట్నం, కూనవరం, వరరామచంద్రాపురం మండలాలలో నిర్వాసితులు కాగల జనాభాలో ఆదివాసులు సగం కంటె ఎక్కువ. కుకునూరు, బూర్గంపాడు మండలాలలో నిర్వాసితులలో మెజారిటీ దళితులు.

ముంపంటూ వస్తే ఈ ప్రజలు ఏం కోల్పోతారు? ఒక హక్కుగా ఏం పొందుతారు? ఇక్కడే నిర్వాసితులు కాబోయే వారిలో ఆదివాసులకూ ఇతరులకూ తేడా వస్తుంది. అందరూ ఎంతో కొంత కోల్పోతారు, అందరికీ ప్రాజెక్టు వల్ల నష్టం ఉంది, సందేహమేమీ లేదు. మా పర్యటనలో భాగంగా మేము వేలేరుపాడు మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించినప్పుడు, మేము చెప్పిందంతా శ్రద్ధగా రాసుకున్న విలేకరులు ఆ శ్రద్ధకు కారణం మేము అడగకుండానే చెప్పారు 'మండల కేంద్రం కూడా మునుగుతుంది కాబట్టి మేము కూడా వ్యతిరేకమే సార్ ఈ ప్రాజెక్టుకు. మీ వార్త బాగా రాస్తాం' అన్నారు.

అయితే ఆదివాసులకు ప్రత్యేకంగా ఉండే సమస్య ఏమిటంటే వారి జీవనాధారమైన వనరులపైన వారికి ఉన్న చట్టపరమైన హక్కు చాలా స్వల్పం. చట్టపరమైన హక్కున్న స్థిరాస్తులను స్వాధీనం చేసుకున్నప్పుడు మాత్రమే చట్టపరమైన నష్టపరిహారం దక్కుతుంది. నిజానికి చట్టపరమైన హక్కున్న భూమిలో కూడా పూర్తిగా సొంత భూమి కాక ప్రభుత్వం డి-ఫారం పట్టా ఇచ్చిన భూమి అయినట్టయితే నష్టపరిహారం దక్కదని మన హైకోర్టు ఒకనాడు అభిప్రాయపడింది గానీ, ఈ మధ్యనే ఏడుగురు జడ్జిల బెంచి ఆ అభిప్రాయాన్ని తిరగదోడి నష్టపరిహారం విషయంలో సొంత పట్టా అయినా, డి-ఫారం పట్టా అయినా ఒకటేనని౦ది.

అయితే ఆదివాసులు చట్టపరమైన హక్కు ఉన్న భూమే కాక కొండపోడు భూములను కూడా దాదాపు ప్రతీ ఊరిలోనూ ఏదో ఒక మేరకు అనుభవిస్తున్నారు. వారిలో మరీ పేదలకు ఇదొక్కటే జీవనాధారం. ఈ భూమిని రేపు కోల్పోతారు గానీ దీనికేం నష్టపరిహారం దక్కదు. ఇదికాక, సంఘాలు గట్టిగా ఉన్నచోట వారు పోరాటాలు చేసి గిరిజనేతరుల నుంచి తిరిగి స్వాధీనం చేసుకున్న భూమి చాలా ఉంది. ఎల్‌టిఆర్ చట్టం కింద కేసు వేసి గెలిచినట్టయితే ఆ భూమికి పట్టాలు ఉండేవేమో గానీ అది అన్ని సందర్భాలలోనూ సాధ్యం కాకపోవచ్చు. కోర్టుకెక్కితే సాక్ష్యాలు చూపలేక ఓడిపోయే ప్రమాదం కూడా ఉంటుంది. ఆ విధంగా సంపాదించుకున్న భూమికి పట్టాలు ఉండవు కదా. పంట వేసుకొని పండించుకోవడానికి పట్టాలు అక్కరలేదు కాని ఆ భూమిని బ్యాంకులో తనఖా పెట్టడానికో మరొకరికి కుదువ పెట్టడానికో అయితే కావాలి. అలాగే రేపు ముంపు వస్తే పట్టాలు లేని కారణంగా వాళ్లకు దమ్మిడీ నష్టపరిహారం దక్కదు. మేము పర్యటించిన మేరకు దేవీపట్నం మండలం (తూర్పుగోదావరి జిల్లా)లో ఈ సమస్య పెద్దఎత్తునే ఉంది.

భూమికాక వారికి ఉన్న వేరే ప్రధానమైన జీవనాధారం అడవి నుండి సేకరించే చిన్నతరహా అటవీ ఉత్పత్తులు. దీనిలో మళ్లీ రెండు రకాలుంటాయి. ఒకటి అమ్మకానికి పనికొచ్చేవి. వీటిని గిరిజన సహకార సంఘానికో, వ్యాపారులకో అమ్ముకుంటారు. రెండు, నిత్య జీవితంలో వాడుకునేవి. మొదటి కోవకు చెందినవి జిగురు, తేనె, కరక్కాయలు, గానుగ గింజలు, ముష్టి గింజలు, కుంకుడు కాయలు, చిల్లగింజలు, నల్లజీడి గింజలు, చీపురు పుల్లలు, సరమామిడి చెక్క, శీకాకాయలు, కొండజీడి పిక్కలు, తంగేడు గింజలు, అడ్డాకులు, విప్ప పలుకులు మొదలయినవి. వ్యవసాయ పనులు లేని సీజన్‌లో వీటి సేకరణ, అమ్మకం వారి ప్రాణాలను నిలుపుతుంది. సంవత్సరంలో

రెండు నెలలదాకా ఈ ఆదాయం మీదే బ్రతికే ఊర్లు చాలా ఉన్నాయి. రెండవ కోవకు చెందినవి రకరకాల దుంపలు లేక గడ్డలు, బలుసాకు వంటి ఆకుకూరలు. ఇవి నేరుగా ఆహారంగా ఉపయోగపడతాయి. ఏ తిండీ దొరకనప్పుడు అడవికి పోయి దుంపలు (తేగదుంప, బల్లదుంప, అడవి కంద, కిరస దుంప, తాడిదుంప వగైరా) తెచ్చుకొని వండుకొని తిని బతుకుతారు.

అడవి నుండి బయటకు పోవలసివస్తే ఈ ఆదాయం, ఈ ఆహారం మొత్తంగా పోతుంది. దీనికి ఏ నష్టపరిహారం ఉండదు, ఏ ప్రత్యామ్నాయమూ ఉండదు.

పశుగ్రాసానికి కొదవలేక పోవడం వల్ల అడవిలోని అన్ని ఊర్లలోనూ వందల సంఖ్యలో పశువులు– ముఖ్యంగా ఆవులు ఉన్నాయి. గోచీ తప్ప వేరే బట్ట ఎరుగనివారికి సహితం 10–15 ఆవులున్నాయి. వాటిని పోషించనక్కరలేకుండా అవే యజమానిని పోషిస్తాయి. రేపు ఈ పశువులను తోలుకొని అడవి బయటకు పోయినట్టయితే పశుగ్రాసం ప్రధానమయిన సమస్య అవుతుంది. ఈ మధ్య కాలంలో మైదాన ప్రాంత గ్రామాలలో పెద్ద రైతులు సహితం పది పశువులు ఉంచుకోవడానికి తటపటాయిస్తున్నారు. ఇంక ఆదివాసీ నిర్వాసితుల సంగతి ఏం చెప్పాలి?

ఊరుమ్మడి చెట్లు అడవిలో ఒక ముఖ్య ఆహార వనరు. చింతచెట్లు, మామిడిచెట్లు, తాడిచెట్లు వీటిలో ప్రధానమైనవి. తాటికల్లుకు ఆదివాసుల జీవితంలో చాలా ప్రాధాన్యత ఉంది. అది కేవలం నిషా ఇచ్చే మత్తు పదార్థం మాత్రమే కాదు, పోషకాహారం కూడా. వేసవిలో ఊర్లకు ఊర్లు తాటి కల్లు మీదనే బతుకుతాయి. ఒక్కొక్క ఊరిలోనూ వందల సంఖ్యలో ఉన్న ఈ చెట్లను విడిచిపెట్టి రేపు బయటకు పోయినట్లయితే వారు కోల్పోయే ఈ ఆహారానికి నష్టపరిహారం ఏమీ దక్కదు.

ఆదివాసులకు ఏజెన్సీలో ఉండే ప్రత్యేకమైన హక్కులున్నాయి. ఇవి రాజ్యాంగంలోని అయిదవ షెడ్యూలు కింద జారీ అయినవి. ఏజెన్సీలో ఉంటేనే ఈ హక్కులు ఉంటాయి. వారి భూములను గిరిజనేతరులు ఏ రకంగానూ సొంతం చేసుకోవడానికి వీలులేదు. ప్రభుత్వ బంజర్లు వారికి తప్ప వేరెవ్వరికీ సాగుకు ఇవ్వడానికి వీలులేదు. గ్రామ సర్పంచ్, మండల ప్రెసిడెంట్ పదవులకు నూటికి నూరుశాతం వారికే రిజర్వేషన్ ఉంది. టీచర్ పోస్టులలో 100 శాతం, కొన్ని ఇతర నాల్గవ తరగతి ఉద్యోగాలలో 75 శాతం దాకా ఆదివాసీ విద్యావంతులకే రిజర్వ్ అయి ఉన్నాయి. స్థానిక వనరుల యాజమాన్యానికీ అభివృద్ధి పనులకూ సంబంధించి ఆదివాసీ గ్రామ సభకు, గ్రామ

పంచాయితీకీ ప్రత్యేక అధికారాలు పంచాయతీరాజ్ చట్టంలోని 6-ఎ అధ్యాయం కింద ఉన్నాయి. ఏజెన్సీని విడిచిపెట్టిపోతే ఇవ్వన్నీ పోతాయి.

అన్నిటినీ మించి ఆదివాసీ గ్రామాలలో ఒక అనిర్వచనీయమైన ఉమ్మడితనం ఉంటుంది. ఇది మనుషులకే కాదు, వారి చుట్టూ ఉన్న చెట్లకూ కొండలకూ కూడా వర్తిస్తుంది. వారి జీవితం, ఆచారాలు, అలవాట్లు దీనిని పెనవేసుకొని ఉంటాయి. దానివల్ల పొందే మానసిక సంతృప్తికీ ప్రశాంతికీ 'నష్టపరిహారం' అంటూ ఏదీ ఉండదు. అడవి బయట దీనిని పునర్నిర్మించుకోవడం దాదాపు అసాధ్యం.

అందుకే పునరావాసం గురించి మాట్లాడితే ఆదివాసులు నవ్వుకుంటూ చెట్టుకు చెట్టు, పుట్టకు పుట్ట, కొండకు కొండ, వాగుకు వాగు ఇట్లాగే కట్టిస్తారా అని అడుగుతున్నారు. కట్టిచ్చేటట్టయితేనే ఇక్కడి నుండి పోతాం అంటున్నారు. చాలామంది నిక్కచ్చిగా ఇక్కడి నుంచి పోనే పోమంటున్నారు. వేరే ఎక్కడో వారికి పునరావాస కాలనీలు కట్టిచ్చి తలా ఎకరమో, రెండో బంజరు భూమి కేటాయించినా ఇప్పుడున్న జీవికలో సగం కూడా దొరకదు వాళ్లకు. ఆ మాత్రం పునరావాసం ఇస్తారన్న నమ్మకమూ లేదు, ఇవ్వాలని చెప్పే చట్టం గానీ పాలసీ నియమం గానీ ఏదీ లేదు. ఈ సంగతి మూడు జిల్లాలలోని ఆదివాసులకు బాగానే తెలుసును కాబట్టి అత్యధిక భాగం మంది అసలు పోలవరం వద్దే వద్దు అంటున్నారు.

ఇది అభివృద్ధికి అడ్డంపడే వైఖరి అన్న వాదనను వాళ్లూ విన్నారు. దానికి కూడా వాళ్ల దగ్గర జవాబుంది. గోదావరి నీళ్లు 'వృథాగా' సముద్రంలోకి వెళ్లిపోతున్నది కాబట్టి ప్రాజెక్టు కట్టి దానిని సాగుకోసం, తాగునీటి కోసం వాడుకోవాలని కదా ప్రభుత్వం ఆలోచిస్తున్నది? మరి ఆ సాగునీరేదో మా భూములకే ఇయ్యవచ్చు కదా? మా భూములు ముంచి మైదాన ప్రాంతాల భూములకెందుకివ్వాలి? అంటున్నారు. పోలవరం డ్యాం సైట్ దగ్గర గోదావరిలోకి అకస్మాత్తుగా వచ్చి చేరే నీరేదీ లేదు. అక్కడ నిలపబోయేదంతా పైనుండి వచ్చి చేరే నీరే. ప్రాణహిత నుండి, ఇంద్రావతి నుండి, శబరి నుండి, డజన్ల సంఖ్యలో ఉన్న వాగులు, వంకల నుండి వచ్చి గోదావరిలో కలిసి అడవి గ్రామాలను దాటి ప్రవహించి పోలవరం చేరే నీటికే డ్యాం కట్టి విజయవాడ నుండి విశాఖపట్నం దాకా వాటిని తీసుకుపోయి 'అభివృద్ధి' సాధించాలని ప్రభుత్వం ఆలోచన. మరి మా ఊరి పక్కనే గోదావరిలో లిఫ్టు పెట్టి ఆ నీళ్లు మాకే ఇస్తే మేమే అభివృద్ధి చెందుతాము కదా? అని వారు అడుగుతున్నారు. అది అభివృద్ధి ఎందుకు

కాదు, మైదాన ప్రాంతాలకు ఆ నీటిని పారిస్తేనే అది అభివృద్ధి ఎందుకవుతుందో చెప్పమంటున్నారు.

ఐటిడిఏ వారు చేపట్టిన కొన్ని లిఫ్టు ఇరిగేషన్ స్కీంలు ప్రస్తుతం లేకపోలేదు. ఒక్క తూర్పు గోదావరి జిల్లా రంపచోడవరం డివిజన్లోనే 36 స్కీంలు చేపట్టారు. కానీ అవన్నీ విచిత్రంగా ఫెయిల్ అయి కూర్చున్నాయి. స్థలం ఎంపికలో అసమర్థత వల్లనో, సరుకు కొనుగోలులో అవినీతి వల్లనో గానీ మినహాయింపు లేకుండా అన్ని లిఫ్టులూ ఫెయిల్ అయ్యాయి. కానీ సక్రమంగా కడితే పోలవరం కింద మునగబోయే అన్ని గ్రామాలకూ కాకున్నా గోదావరి, శబరి నదులకు దగ్గరగా ఉన్న గ్రామాలకు సాగునీరు ఇయ్యవచ్చు. ఆపైన మిగిలిన నీటికి పోలవరం దగ్గరే డ్యాం కట్టే బదులు డైవర్షన్ (ఆనకట్ట) కట్టి ఏ ముంపూ లేకుండ మైదాన ప్రాంతాలకూ కొంత మేరకు పారించుకోవచ్చు.

ప్రాజెక్టుల వల్ల కలిగే ముంపు గురించి, నిర్వాసితుల సమస్యల గురించి ఎప్పుడు మాట్లాడినా 'అభివృద్ధి'కి అడ్డువస్తున్నారన్న చర్చ వస్తుంటుంది కాబట్టి ఇక్కడ రెండు మాటలు చెప్పడం అవసరం అనుకుంటున్నాము. మొదటిది, ప్రజాతంత్ర దృక్పథం అభివృద్ధికి వ్యతిరేకం కాదు; కేవలం అసమ అభివృద్ధికి వ్యతిరేకం, విధ్వంసక అభివృద్ధికి వ్యతిరేకం. సాగునీటి విషయానికొస్తే, అది వ్యవసాయ అభివృద్ధికి అవసరమే. కానీ ప్రకృతి సిద్ధంగా మనిషికి లభించే ఈ వనరుపైన అందరికీ (సాంకేతిక సాధ్యాసాధ్యాల పరిధిలో) సమాన హక్కు ఉండాలి. పోలవరానికి ప్రతిపాదించిన ఆయకట్టు ఇప్పటికే సాగునీటి లభ్యత ఉన్న ప్రాంతాలలో ఉంది. దాని బదులు ఆ నీటిని – విఫలమైన లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలే తప్ప పనిచేసే సాగునీటి వ్యవస్థ లేని ఆదివాసీ ప్రాంతాలకే అందివ్వడం న్యాయం కాదా? దానివల్ల స్థూల రాష్ట్ర ఆదాయంలో రాగల పెరుగుదల తగ్గిపోవచ్చు. కానీ ఆ పెరుగుదల ఆదివాసులకు దక్కుతుంది కాబట్టి అదే ప్రజాస్వామికమైన అభివృద్ధి.

రెండవది నిర్వాసితుల హక్కుల సమస్య. భారీ ప్రాజెక్టును అన్ని సందర్భాలలో వ్యతిరేకించవలసిందేనా అనే చర్చలోకి మేము ప్రస్తుతం పోవడం లేదు. ప్రాజెక్టును నిర్దిష్టంగా పరిశీలించి ఒక నిర్ణయానికి రావడమే ఉచితం అని ప్రస్తుతానికి అనుకుందాం. ఈ నిర్దిష్ట పరిశీలనలో ఏమేం విషయాలు చూడాలి?

ప్రాజెక్టు వల్ల అభివృద్ధి వస్తుందని అనుకున్నా, దానిని పొందేది మొత్తం సమాజం కాదు, కొందరేననేది స్పష్టమే. ప్రత్యక్ష ప్రయోజనాలూ పరోక్ష ప్రయోజనాలూ

ఉంటాయని అనుకున్నా, రెండూ కలిపినా అవి అందరికీ దక్కవు. కాబట్టి ప్రయోజనం పొందేవారు కొందరుంటారు. నష్టపోయే వారూ ఉంటారు. ప్రయోజనం పొందేవారి జీవితాలు కచ్చితంగా బాగుపడతాయి. నష్టపోయే వారి జీవితాలు ఏ మేరకు నష్టపోతాయనేది వారికి దక్కే నష్టపరిహారం మీద, పునరావాసం మీద ఆధారపడి ఉంటుంది. ఒక ప్రాజెక్టు వల్ల నిర్వాసితులయ్యే వారికి, ఆ ప్రాజెక్టు వల్ల వచ్చే ప్రయోజనంలో మొదటి వాటా ఇవ్వాలనేది– నీటిపారుదల ప్రాజెక్టయితే ఆ ప్రాజెక్టు చివరి భూములలో కాక మొదటి భూములలోనే వారికి సాగుభూములు ఇవ్వాలని– ఇవ్వాళ అంతర్జాతీయంగా రూపొందుతున్న నాగరికతా ప్రమాణం. మనం దాని అంచులకు కూడా  చేరుకోలేదు.

కాబట్టి నిర్దిష్టమైన పరిశీలనలో వేసుకోవలసిన ప్రశ్నలు ఏమిటంటే ప్రయోజనం పొందేవారు ఎవరు? నష్టపోయేవారు ఎవరు? ప్రయోజనం పొందేవారికి ఈ ప్రయోజనం ఎంత అవసరం? నష్టపోయేవారికి ఆ నష్టం ఎంత వినాశకరం? ఈ ప్రాజెక్టు ద్వారా వినియోగించుకోబోయే వనరును ఇంకొక రకంగా వినియోగించినట్టయితే మొత్తం మీద సామాజిక న్యాయం ఇంకా ఎక్కువగా జరిగే అవకాశం ఉందా? ఇత్యాది.

పోలవరం ప్రాజెక్టు ద్వారా ప్రభుత్వం 7 లక్షల 27 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చి, విశాఖపట్నంకు మంచినీళ్ళిచ్చి, కృష్ణా బేసిన్ కోసం ప్రకాశం బ్యారేజికి 80 టియంసిల నీళ్లు తరలించదలచుకుంది. సాగునీరు ఇచ్చేది తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు, కృష్ణా జిల్లాకు. ఆ జిల్లాలలో ఇప్పటికే డెల్టా కాలవల ద్వారా నీళ్లొచ్చే ప్రాంతం కంటె కొంచెం ఎగువన ఉన్న ప్రాంతానికి ఈ నీళ్లొస్తాయి తప్ప ఆ జిల్లాలలో కూడా పూర్తి మెట్ట ప్రాంతాలకు కాదు.

అవి వర్షపాతం బాగానే ఉండే ప్రాంతాలు. వ్యవసాయేతరంగా కూడా బాగానే అభివృద్ధి చెందిన ప్రాంతాలు. పోలవరం నీళ్లొస్తే అక్కడి ప్రజల జీవితాలు సుసంపన్నం అవుతాయనడంలో సందేహమేమీ లేదు గానీ పోలవరం నీళ్లు దక్కడం వారికి జీవన్మరణ సమస్య కాదు. విశాఖపట్నంకు మంచినీళ్లు కూడా అంతే. విపరీతంగా పెరిగిపోతున్న ఆ నగరానికి మంచినీళ్లు చాలా అవసరం. కానీ దానికి ప్రత్యామ్నాయం స్థానికంగా లేదా అంటే ఉందనే చెప్పాలి. ఉత్తరాంధ్రలో అనకాపల్లి నుండి ఇచ్ఛాపురం దాకా ఉన్న నీటి వనరులను సరిగ్గా ఉపయోగపెట్టే ప్రయత్నం ప్రభుత్వాలు చేయలేదుగానీ

చేస్తే ఆ మూడు జిల్లాల నీటి అవసరాలు స్థానికంగానే తీర్చవచ్చు. పోలవరం నీళ్లు రాకపోతే విశాఖపట్నంకు మంచినీళ్లు దొరకవన్న పరిస్థితేమీ లేదు. ఇక్కడ ఇంకొక అనుమానాన్ని కూడా ప్రస్తావించాలి. పోలవరం నుండి విశాఖపట్నంకు నీళ్లు తెచ్చే పైప్‌లైను రాజమండ్రి–విశాఖపట్నం రైల్వే లైనుకు ఎడమ పక్కన ఉండబోతుంది. ఆ రైల్వే లైనుకు కుడిపక్క నుండే ప్రాంతంలో విశాఖపట్నం– కాకినాడ– విజయవాడ కారిడార్ పేరిట ప్రభుత్వం వేగవంతమైన అభివృద్ధి పేరుతో అనుమతించబోయే స్పెషల్ జోన్‌లూ సాఫ్ట్‌వేర్ పార్కులూ రాబోతాయి. పోలవరం నీళ్లు నిజంగా విశాఖపట్నం ప్రజల తాగునీటి కోసం వినియోగించబోతారా, లేక దారిలో తూర్పుకు మళ్లించి ఈ 'కారిడార్'కు ఇవ్వబోతారా? అనే అనుమానమూ ఉంది.

ఇక కృష్ణా బేసిన్‌కు తరలించడానికి పోలవరం నుండి 80 టియంసిల నీళ్లు విజయవాడ దగ్గరున్న ప్రకాశం బ్యారేజికి తీసుకుపోయే విషయం చూద్దాం. ఇది కృష్ణానది ఎగువన ఉన్న తెలంగాణ, రాయలసీమలలోని దుర్భిక్ష ప్రాంతాల వినియోగానికి అని చెప్తున్నారు. మహబూబ్‌నగర్, నల్లగొండ, కర్నూలు, అనంతపురం జిల్లాలలో తీవ్ర దుర్భిక్షం ఉన్నమాట వాస్తవమే. కృష్ణా జలాల ప్రాజెక్టులను వారికి హామీ ఇచ్చిన మాటా వాస్తవమే.

అయితే ఈ కారణంగా పోలవరం ప్రాజెక్టు సమర్థనీయం అనే నిర్ణయానికొచ్చే ముందు కొన్ని విషయాలు చూడాలి. ఒకటి 80 టియంసిల నీళ్లెప్పుడయితే పోలవరం నుండి కృష్ణా బేసిన్‌కు తరలించబడతాయో అప్పుడవి కృష్ణా జలాలలో భాగం అవుతాయి. మనం ఆ నీటిని కర్ణాటకతోనూ మహారాష్ట్రతోనూ పంచుకోక తప్పదు. 80 టియంసిలలో 35 వారు తీసుకోగా, 45 మాత్రమే మనకు దక్కుతాయి. ఈ 45 టియంసిలు నేరుగా దక్షిణ తెలంగాణకూ రాయలసీమకూ పోవు. ప్రకాశం బ్యారేజిలో చేరతాయి. నది పైభాగం నుండి ప్రకాశం బ్యారేజికి వచ్చే నీటిలో 45 టియంసిలు ఎగువన ఆపుకున్నట్టయితేనే ఎగువ ప్రాంతాలు ఈ పంపిణీ వల్ల ప్రయోజనం పొందగలవు. అది ఏ సంవత్సరంలో ఎంత మేరకు సాధ్యం అవుతుంది, ఎంత ఎగువన సాధ్యం అవుతుంది అనేది ఆయా సంవత్సరాల వర్షపాతాన్ని బట్టి ఉంటుంది. కానీ 45 టియంసిల నీరు మాత్రం ప్రతీ సంవత్సరం పోలవరం నుండి ప్రకాశం బ్యారేజికి వచ్చి చేరుతుంది. ఎందుకంటే గోదావరిలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయి కాబట్టి. అంటే ఈ మళ్లింపు తప్పకుండా సాధించేది కృష్ణా డెల్టా స్థిరీకరణ. తెలంగాణ, రాయలసీమలకు ప్రయోజనం ఒనగూడవచ్చు, ఒనగూడకపోవచ్చు.

ఆ ప్రాంతాలకు వర్షాభావ సంవత్సరాలలో నష్టం కూడా జరగవచ్చు. పోలవరం నుండి మళ్లించే 80 టియంసిలలో మన వాటా 45 టియంసిలే అయినా మొత్తం 80 టియంసిలూ ప్రకాశం బ్యారేజికి పోతాయి. కర్ణాటక, మహారాష్ట్రలు తమ వాటా కింద నుండి తీసుకోలేవు. మీదనే ఆపుకుంటాయి. అంటే రాష్ట్రంలోకి కృష్ణ, తుంగభద్ర నదులు ప్రవేశించే లోపలే 35 టియంసిల నీళ్లు వాళ్లు తుంగభద్ర డ్యాం నుండి గానీ, ఆల్మట్టి నుండి గానీ మళ్లించుకోగలరు. ఇది సగటు సంవత్సరాలలో నష్టం చేయకపోవచ్చును గానీ వర్షాభావ సంవత్సరాలలో సహితం ఎగువ రాష్ట్రాలు 35 టియంసిలు ఉంచేసుకుంటాయి కాబట్టి కృష్ణా తుంగభద్రలు రాష్ట్రంలోకి ప్రవేశించే దగ్గరే ఉన్న ప్రాజెక్టులకు నష్టం కలగగలదు. ఇవి తెలంగాణ, రాయలసీమలలోనే ఉన్నాయి; జూరాల, రాజోలిబండ, రేపు రాబోయే భీమ, తుంగభద్ర ఎగువ కాలువ, దిగువ కాలువలు.

కాగా, పోలవరం ద్వారా సుభిక్షమైన కోస్తాంధ్ర జిల్లాలకు, కృష్ణా బేసిన్‌లోని దుర్భిక్ష ప్రాంతాలకు గోదావరి జలాల్ని తరలించే ముందు గోదావరి జలాలు తప్ప వేరే గత్యంతరం లేని ఉత్తర తెలంగాణలోని దుర్భిక్ష ప్రాంతాలకు సాగునీటి వసతి కల్పించడం అవసరం. సాగునీటి పైన సమాన హక్కు ఒక ప్రజాతంత్ర విలువ అన్న మా అభిప్రాయాన్ని పైన చెప్పాము. ఆ దృష్టితో చూసినప్పుడు ఉత్తర తెలంగాణలోని దుర్భిక్ష ప్రాంతాలకు గోదావరి జలాలు తప్ప వేరే ఏ ఆధారమూ లేదు కాబట్టి ఆ ప్రాంతాల అవసరాలు తీర్చగల ఆచరణాత్మక పథకం చేపట్టిన తరువాతే వేరే అవసరాల కోసం– ఎంత న్యాయమైన అవసరాలయినా సరే– గోదావరి జలాల వినియోగాన్ని తలపెట్టాలి. నల్లగొండ, వరంగల్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ జిల్లాలు కలుసుకునే ప్రాంతం (ప్రజ్ఞాపూర్– సిద్దిపేట రోడ్డు కేంద్రంగా ఒక అర్ధచంద్రాకారంలో పరచుకొని ఉన్న మెట్ట ప్రాంతం) దుర్భిక్షంలో దక్షిణ తెలంగాణ, రాయలసీమలకు పెద్దగా తీసిపోదు. ఈ ప్రాంతానికి గోదావరి నీళ్లందించే కచ్చితమైన ప్రణాళిక ఇప్పటికీ లేదు. కాగితం మీద చూసినప్పుడు గోదావరిలో మన రాష్ట్ర వాటా చాలానే ఉన్నట్టు తోస్తుంది గానీ గోదావరి జలాల వినియోగంలోని సాంకేతిక సమస్యలను దృష్టిలో పెట్టుకున్నప్పుడు పరిస్థితి భిన్నంగా కనిపించక మానదు. కరెంటు పెట్టి భారీగా 'లిఫ్టు' చేయకుండ ఉత్తర తెలంగాణలోని మెట్ట ప్రాంతాలకు గోదావరి జలాలు చేరవేయడం సాధ్యపడదు. గోదావరిలో నీళ్లెంత ఉన్నాయనేది కాదు, దానిని తీసుకోవడానికి ప్రభుత్వం ఖర్చెంత పెట్టగలదనేది సమస్య. అంతంత ఖర్చుపెట్టి

ఎన్ని ప్రాజెక్టులు కట్టగలదనేది సమస్య. కాబట్టి ఎగువ ప్రాంతాల హక్కులను వ్యవస్థీకరించకుండ దిగువన వేరే వినియోగానికి వనరులు, నీళ్లు కేటాయించడం భావ్యం కాదు.

ఇదంతా ఒకెత్తయితే పోలవరం వస్తే ముంపుకు గురికాగల ప్రజల – ముఖ్యంగా వారిలో సగం పైగా ఉన్న ఆదివాసుల – జీవనానికీ జీవితానికీ జరగగల హాని ఊహకు సహితం అందడం కష్టం. పైన చెప్పినట్టు వాళ్లకు నష్టపరిహారం రాగల స్థిరాస్తులున్నది కొంచెమే. వారి జీవనం ప్రధానంగా ప్రకృతిసిద్ధంగా లభించే సంపదను ఆధారం చేసుకొని సాగుతున్నది. ఆ ప్రకృతిని మొత్తం రేపు కోల్పోతారు. దానిని తిరిగి ఎక్కడా ఏ రూపంలోనూ ప్రభుత్వం వారికి కల్పించలేదు. వారి విషయంలో పునరావాసం అనే మాటకు అర్థమే లేదు. మామూలు అర్థంలో ఏ ఊరి వెలుపలో ఒక కాలనీ కట్టిచ్చి, ఎకరమో రెండెకరాలో బంజరు భూమి ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా, పోలవరంలో శతాంశం ముంపు ఉండే ప్రాజెక్టుల విషయంలో పునరావాసం ఏ విధంగా అమలయిందో చూస్తే అది కల్ల అని అర్థం అవుతుంది.

ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టుకున్నప్పుడు పోలవరం ప్రాజెక్టును పూర్తిగా వ్యతిరేకించడమే సరయిన ప్రజాస్వామిక వైఖరి అని మేము భావిస్తున్నాం.

మానవహక్కుల వేదిక 7వ బులెటిన్‌లో వచ్చిన రిపోర్టు
2005

# పోలవరం ప్రాజెక్టును ఎందుకు వ్యతిరేకిస్తున్నాం?

పోలవరం రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన 'జలయజ్ఞం'లోని అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు. దానిని ఏ విధంగానయినా పూర్తిచేస్తానని ముఖ్యమంత్రి ప్రకటిస్తున్నాడు. దానికి ఏ అనుమతులూ లేవు కదా అంటే అనుమతుల అవసరం ఏమిటని ఒకసారి అంటాడు. ముందు పని ముగించేసుకొని ఆ తరువాత అనుమతులు తెచ్చుకోకూడదా అని ఇంకొక సారి అంటాడు. ఇదిగో అనుమతులు తెచ్చేస్తున్నామని వేరొకసారి అంటాడు.

పోలవరం కట్టదగ్గ ప్రాజెక్టయితే ఈ పట్టుదలను అభినందించవచ్చు. దానికి సహాయం కూడా అందియ్యవచ్చు. కానీ అది కట్టదగ్గ ప్రాజెక్టు కాదని మానవహక్కుల వేదిక అభిప్రాయం. ఇది అభివృద్ధి నిరోధకమైన అభిప్రాయం అని చాలామంది అనబోతారు కాబట్టి దీనిని వివరించడం అవసరం అని మేము భావిస్తున్నాం.



స్థూలంగా మూడు కారణాల వల్ల ఈ ప్రాజెక్టును వ్యతిరేకించాలని అనుకుంటున్నాం. ఒకటి, అది ఆదివాసుల జీవితాలను పెద్దెత్తున విధ్వంసానికి గురి చేస్తుంది. రెండు, ఇప్పటికే అభివృద్ధి చెందిన ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయడానికి ఇప్పటికీ వెనకబడి ఉన్న ప్రాంతాలను, ప్రజలను ముంచుతుంది; నిర్వాసితులను చేస్తుంది. మూడు, ఉత్తర తెలంగాణ జిల్లాలలోని మెట్ట భూములకు తగిన మోతాదులో గోదావరి జలాలను దక్కకుండ చేస్తుంది.

పోలవరం ప్రాజెక్టు స్వరూపాన్ని గురించి సమగ్రమైన నివేదిక ఇప్పటివరకు ప్రభుత్వం ప్రజల ముందు ఉంచలేదు. చేపడుతున్న కాలవల నిర్మాణానికీ ప్రకటించుకున్న ప్రాజెక్టుకూ పొంతన కనిపించడం లేదు. ప్రకటించుకున్న ప్రాజెక్టు లెక్కల ప్రకారం పోలవరం ప్రాజెక్టు ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలలో 7 లక్షల 27 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తుంది. 975 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేస్తుంది. 23 టియంసిల నీళ్లు ఎడమ కాలవ ద్వారా విశాఖపట్నం దాకా అనేక గ్రామాలకూ, పట్టణాలకూ తాగడానికి, పరిశ్రమల అవసరాలకూ ఇస్తుంది. 80 టియంసిల నీటిని కుడి కాలవ ద్వారా కృష్ణా బేసిన్‌కు తరలించి కృష్ణా బేసిన్ ఎగువ ప్రాంతాల నీటి అవసరాలు తీరుస్తుంది. ఈ అవసరాల కోసం పోలవరం దగ్గర నిర్మించబోయే డ్యాం నుండి అది 325 టియంసిల నీళ్లు తీసుకుంటుంది.

ఈ ప్రయోజనాలు సాధించడానికి ఈ ప్రాజెక్టు ఎంత విధ్వంసం సృష్టించబోయేదీ ప్రభుత్వం చెప్పడం లేదు. స్పష్టమైన సమాచారం ఇవ్వకుండ 'నిర్వాసితులను తప్పక ఆదుకుంటాం' అనీ 'నిర్వాసితులకు ఏ కష్టమూ రానివ్వం' అనీ ప్రకటిస్తున్నది. అప్పుడెప్పుడో 15 సంవత్సరాల క్రితం జరిగిన సర్వేలను బట్టి, ఈ ప్రాజెక్టు కింద మూడు జిల్లాలలో 9 ఏజెన్సీ మండలాలు ముంపుకు గురవుతాయి. 276 గ్రామాలు పూర్తిగానో పాక్షికంగానో మునుగుతాయి. అప్పటి జనాభా లెక్కల ప్రకారం ఒక లక్ష పదిహేడు వేల మంది నిర్వాసితులవుతారు.

ఆ మండలాలు పోలవరం (పశ్చిమగోదావరి జిల్లా), దేవీపట్నం (తూర్పు గోదావరి జిల్లా), వరరామచంద్రాపురం, కూనవరం, చింతూరు, భద్రాచలం, బూర్గుంపాడు, కుకునూరు, వేలేరుపాడు (ఖమ్మం జిల్లా). ఇవన్నీ ఏజెన్సీ మండలాలే. జనాభాలో దాదాపు సగం మంది ఆదివాసులు. ప్రధానంగా కోయ, కొండరెడ్డి తెగలవారు.

అప్పటికీ ఇప్పటికీ ముంపుగ్రామాల సంఖ్య పెరగకున్నా వాటిలోని జనాభా తప్పక పెరిగే ఉంటుంది. ఇప్పుడు లక్షా యాభైవేల దాకా ఉండవచ్చు. వీరికి పునరావాసం ఇస్తామని ప్రభుత్వం ఎన్ని మాటలు మాట్లాడినా వీరి జీవన ప్రమాణం ఇప్పుడున్న దానికంటే బాగా పడిపోతుందనడంలో సందేహమేమీ లేదు. ప్రాజెక్టు వల్ల ముంపుకు గురయ్యే ప్రజలకు తొలిసారిగా పునరావాస 'హక్కు' కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మొన్నటి ఏప్రిల్ నెలలో జారీ చేసిన జీవో 68లో నిర్వాసితుల జీవన ప్రమాణం పడిపోకుండ చూసే సదుపాయమేదీ లేదు. తాత్కాలిక ఆర్థిక సహాయం మాత్రమే ఆ జీవో ఇస్తుంది. నిర్వాసితులు కాబోయే వారిలో సగం మంది ఆదివాసులని ముందే చెప్పాం. వారికి ఏజెన్సీలోనే పునరావాసం కల్పించడానికి భూమి లేదు, ఆటవీ సంరక్షణ చట్టం కూడా

ఒప్పుకోదు. ఏజెన్సీ బయట వారికి పునరావాస కాలనీలు ఒకవేళ ఏర్పాటు చేసినా వారక్కడ జీవనాధారం ఇప్పుడున్న దానిలో పదవ వంతు కూడ సంపాదించలేరు. అడవి ఇచ్చే పుష్కలమైన ఉమ్మడి ఫలసాయం, రకరకాల గింజలు, ఆకులు, దుంపలు, జిగురు, తేనె మొదలైన చిన్నతరహా అటవీ ఉత్పత్తులు, వంటచెరుకు, పశుగ్రాసం బయట దొరకవు. షెడ్యూల్డు ప్రాంతానికి ఉండే ప్రత్యేకమైన చట్టాల రక్షణా ఇక వారికి ఉండదు.

రాజకీయంగా నోరు లేని ప్రజల జీవితాలను ఇంతటి విధ్వంసానికి గురిచేసి, ఇప్పటికే అంతో యింతో బాగున్న వారి బతుకులు ఇంకింత బాగుచేయడం కోసం కడుతున్న ప్రాజెక్టును కట్టదగ్గదిగా ఎందుకు భావించాలి?

దాని బదులు అవే గ్రామాలకు అదే నీటిని సాగునీరుగా అందియ్యడం నిజమైన అర్థంలో 'అభివృద్ధి' కాదా అని కూడా అడుగుతున్నాం. పోలవరం ప్రాజెక్టు కింద మునగబోయే 276 గ్రామాలు గోదావరి నది ఒడ్డున ఇటూ అటూ ఉన్నాయి. వాటిని దాటి కిందికి ప్రవహించి, కింద రాబోయే పోలవరం కట్ట తాకిడికి వెడల్పయి ఆ గ్రామాలను ముంచబోయే నది నీటిని, ఎత్తిపోతల ద్వారా గానీ వేరే ఏ రకంగానయినా గానీ అవే గ్రామాలకు సాగునీరుగా అందించినట్టయితే ఆ నీటిని సద్వినియోగం చేసినట్టూ అవుతుంది. మైదాన ప్రాంతాల వారి బతుకులనే కాక అడవి బిడ్డల బతుకులనూ బాగుచేసినట్టవుతుంది. అభివృద్ధిలో సమతుల్యమూ సాధించినట్టవుతుంది. బాగున్నవాళ్లను ఇంకా బాగుచేయడానికి ఏమీలేని వాళ్లను ఇంకింత నాశనం చేయడం ఏ రకమైన అభివృద్ధి?

ఈ పని చేస్తే మహా అయితే ఒక లక్ష ఎకరాలు సాగులోకి వస్తాయేమోగానీ ఇప్పుడు కట్టబోయే ప్రాజెక్టు వల్ల ఏడు లక్షల ఎకరాల సాగు, 975 మెగావాట్ల కరెంటు వగైరా ఒనగూడుతాయి కదా అంటారేమో. 'అభివృద్ధి' అనే దానిని 'ఎంత' అనే తప్ప 'ఎవరికి' అనే ప్రశ్నతో బేరీజు వేసుకోనక్కరలేదనే ఈ వైఖరే అప్రజాస్వామికం అని మేము అంటున్నాం. టోకున ఎన్ని ఎకరాలు సాగులోకి వచ్చాయి, ఎన్ని ఊర్లకు నీళ్లందాయి అని మాత్రమే కాక ఎవరి భూములకు అందాయి, ఏ ఊర్లకు అందాయి అని ప్రశ్నించుకొని సమతుల్యాన్ని పెంచే ప్రత్యామ్నాయాన్ని ఎంచుకోవడం మెరుగయిన, ప్రజాస్వామికమైన అభివృద్ధి పంథా అని అంటున్నాం.

దానివల్ల గోదావరి జలాలలో మన వాటా నీళ్లు మనం పూర్తిగా వాడుకోక 'వృథా' అవుతుందని భయపడనవసరం లేదు. పోలవరం ముంపు ప్రాంతానికి ఎగువన ఇదే నీటిని వెనుకబడిన తెలంగాణ జిల్లాల కోసం ఉపయోగించడానికి తలపెట్టిన

ప్రాజెక్టులు అతీగతీ లేకుండ ఉన్నాయి. 85 టియంసిల నీటిని వినియోగించుకోగల ఇచ్చంపల్లి ప్రాజెక్టు పొరుగు రాష్ట్రాల అభ్యంతరాల కారణంగా మొదలే కాకుండ ఉండిపోయింది. దానిని తగిన విధంగా రూపొందించే ఆలోచన చేస్తే అది సమతుల్యంతో కూడిన అభివృద్ధికి దోహదపడుతుంది. 'దేవాదుల' అనే పేరుతో మొదలయి ఇప్పుడు గోదావరి ఎత్తిపోతల పథకం అనే పేరుతో కేవలం 5 టియంసిల వినియోగానికి భారీగా నిర్మిస్తున్న ప్రాజెక్టు ద్వారా 50 టియంసిల దాకా నీళ్లు తీసుకొని కరీంనగర్, వరంగల్, మెదక్, నల్లగొండ జిల్లాల ఎగువ ప్రాంత భూములకు సాగునీరిచ్చే ఆలోచన ప్రభుత్వ ప్రణాళికలోనే ఉంది. దానికి వేగంగా కార్యరూపం ఇయ్యవచ్చును. ఖమ్మం జిల్లాకు విస్తారంగా నీళ్లివ్వగల దుమ్ముగూడెం ప్రాజెక్టు మీద దృష్టి పెట్టవచ్చు. వీటికంటె ఎగువన కూడ తెలంగాణ జిల్లాలకు నీళ్లివ్వగల ప్రతిపాదిత ప్రాజెక్టులు (శ్రీరాంసాగర్ వరద కాలవ, యెల్లంపల్లి వగైరా) ఉన్నాయి గానీ అవి పోలవరంతో నీటి కేటాయింపుకు పోటీకి రాగల ప్రాజెక్టులు కావు కాబట్టి వీటిని మాత్రమే ఇక్కడ ప్రస్తావిస్తున్నాం.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ప్రస్తుతం తవ్వుతున్న కాలవలనూ, ప్రాజెక్టు ఫలితాల గురించి ప్రభుత్వం చెప్తున్న మాటలనూ బట్టి చూస్తే పై ప్రాజెక్టులకు నీళ్లేమయినా ఉంటాయా అన్న సందేహం వస్తుంది. పోలవరం ద్వారా కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాలలో ఏడు లక్షల ఇరవై ఏడువేల ఎకరాలు కాదు, 16 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే ఆలోచన ఉన్నట్టు ప్రభుత్వం ప్రకటనలు తెలియచేస్తున్నాయి. గోదావరి డెల్టాలో పదిన్నర లక్షల ఎకరాల స్థిరీకరణ కూడ పోలవరం ద్వారా చేపడతామని అంటున్నారు. పోలవరం నీళ్లు ఎప్పుడొస్తాయోనని దానికి ప్రత్యామ్నాయంగా దాని ప్రతిపాదిత ఆయకట్టులోనే కొంత భాగాన్ని తడపడానికి రూపొందించిన తాడిపూడి, పుష్కరం ప్రాజెక్టులను ఒకవైపు పూర్తి చేస్తూ మళ్లీ అదే ఆయకట్టుకు పోలవరం కాలవలు కూడా తవ్వుతున్నారు. తొలినాటి అంచనాల ప్రకారం పోలవరం ప్రధాన కాలవ 9000 క్యూసెక్కుల ప్రవాహం కోసం నిర్మించాలని ఉండగా ఇప్పుడు 17,500 క్యూసెక్కుల ప్రవాహానికి తగినట్టు నిర్మిస్తున్నారు. చాలా వెడల్పుగా, లోతుగా నిర్మిస్తున్నారు.

దీనిని బట్టి చూస్తే పోలవరం ద్వారా 325 కాదు, 500 టియంసిల దాకా నీళ్లు తీసుకునే ఆలోచన ఉన్నట్టు స్పష్టం అవుతున్నది. కేవలం వ్యవసాయానికేనా లేక కోస్తా జిల్లాలలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక అవసరాలకూ తీసుకోబోతారా అన్న సందేహాలూ ఉన్నాయి. సమాచారాన్ని ఒక హక్కుగా భావిస్తున్న

ఈ రోజులలో ఈ రకమైన ఊహాగానాలు చేయడం మనకు సిగ్గనిపించినా సమాచారాన్ని దాచిపెట్టడం ప్రభుత్వానికి సిగ్గనిపించడం లేదు కాబట్టి కంటికి కనిపిస్తున్న విషయాలను బట్టి ఈ ప్రశ్నలు వేసుకోవలసి వస్తున్నది.

పూర్తయిపోయిన ప్రాజెక్టులు పోను గోదావరి జలాలలో మన రాష్ట్ర వాటా ఇంక 680 టియంసిలే ఉందని నిపుణుల అంచనా. అందులో 500 పోలవరం ద్వారా తీసుకునేటట్టయితే ఎగువన ఉన్న తెలంగాణ జిల్లాల అవసరాలకేం మిగులుతుంది? ప్రాంతీయ అసమానతలు అప్రజాస్వామికం అని అందరూ ఒప్పుకుంటున్నట్టు మాట్లాడుతున్న ఈ రోజులలో ఇటువంటి ప్రాజెక్టులను అంగీకరించగలమా?

పైగా, దుమ్ముగూడెం, ఇచ్చంపల్లి మొదలయిన ప్రాజెక్టులు పోలవరం ప్రాజెక్టు భద్రతకు కూడ అవసరం అని నిపుణులు అంటున్నారు. గోదావరి నదిలో సంవత్సరంలో కొన్ని దినాలు పెద్దెత్తున ప్రవాహం ఉంటుంది. 20 లక్షల క్యూసెక్కుల నుండి 36 లక్షల క్యూసెక్కుల దాకా ఈ ప్రవాహ పరిమాణం ఉండగలదు. ఎగువన కట్టవలసిన ప్రతిపాదిత ప్రాజెక్టులేవీ కట్టకపోతే పోలవరం ఆనకట్టే నేరుగా ఈ ప్రవాహాన్ని భరించవలసి వస్తుంది. దానికది తట్టుకోలేదనీ, పెద్దెత్తున విధ్వంసం జరిగే ప్రమాదముందనీ నిపుణులు అంటున్నారు. అంతా నాకే కావాలన్న ఆశపోతుతనం మన ఆరోగ్యానికి కూడ మంచిది కాదు మరి!

గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించడం పోలవరం ప్రాజెక్టు ముఖ్య లక్ష్యాలలో ఒకటని రాష్ట్ర ప్రభుత్వం అంటున్నది. తొలినాటి అంచనాల ప్రకారం తరలించబోయేది 80 టియంసిలే. అందులో 35 టియంసిలు కర్ణాటక, మహారాష్ట్రల వాటాగా పోతాయి. ఆ మేరకు ఆ రాష్ట్రాలు కృష్ణా జలాలను ఎగువన ఆపుకుంటాయి. ఇంక మిగిలిన నీటి బదిలీ 45 టియంసిలే. అయినప్పటికీ ఇది రాయలసీమలోని కరువు ప్రాంత ప్రాజెక్టుల అవసరాలకు ఉపయోగపడుతుందని పోలవరం ప్రాజెక్టును సమర్థిస్తూ చేసే ఒక ముఖ్య వాదనగా ప్రభుత్వం అంటున్నది. గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించడం అంటూ జరిగితే అది రాయలసీమకే కాదు, దక్షిణ తెలంగాణకూ ఉపయోగపడుతుంది. ఉపయోగపెట్టవలసి ఉంటుంది. ఈ బేసిన్ బదిలీ గురించి బచావత్ అవార్డులో ప్రస్తావించిన చోట కృష్ణా బేసిన్ ఎగువనున్న దుర్భిక్ష ప్రాంతాల గురించి ప్రస్తావించారే తప్ప ఒక ప్రాంతాన్నో, కొన్ని జిల్లాలనో ప్రస్తావించలేదు. కరువు రాయలసీమలో ఉన్నట్టే దక్షిణ తెలంగాణలోనూ ఉంది. నీళ్లు రెండు ప్రాంతాలకూ కావాలి.

అయితే ఆ అవసరాల కంటే ముందు గోదావరి బేసిన్‌లోని ఉత్తర తెలంగాణకు చెందిన మెట్ట ప్రాంతాల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వడం న్యాయంగా ఉంటుంది. ఆ ప్రాంతాలకు గోదావరి జలాలు తప్ప వేరే లేవు కాబట్టి ఈ ప్రాధాన్యం న్యాయమైనది. దీనికి అవసరమైన ప్రాజెక్టుల రూపకల్పన అరకొరగా ఉంచేసి వేరే అవసరాల గురించి మాట్లాడడం న్యాయం కాదు.

కాబట్టి ఆదివాసుల జీవించే హక్కు, వారి మనుగడ హక్కు, అభివృద్ధిలో సమతుల్యం, నీటి హక్కులలో న్యాయమైన ప్రాధాన్యం, చివరికి ప్రాజెక్టు భద్రత– దేనిని ప్రమాణంగా పెట్టుకొని చూసినా పోలవరం ప్రాజెక్టు సమర్థనీయం కాదు. కాకపోగా, దానికి అవసరమైన ఏ అనుమతులూ లేవు. నీటి లభ్యత, ఉంటే దానిని వాడుకునే హక్కు, ప్రాజెక్టు డిజైన్‌లకు కేంద్ర జలవనరుల సంఘం అనుమతి అవసరం. అది లేదు. పదివేల ఎకరాల అడవి భూమి పోలవరం ప్రాజెక్టు కింద మునగనుంది కాబట్టి కేంద్ర అటవీశాఖ అనుమతి అవసరం. దానికోసం అంతే మొత్తంలో అడవి పెంచడానికి భూమి కేటాయించడం అవసరం. అదీ లేదు. అడవితోబాటు ఆదివాసుల ఆవాసాలు మునుగుతాయి కాబట్టి కేంద్ర సాంఘిక సంక్షేమ శాఖ అనుమతి అవసరం. అది కూడ లేదు. విలువయిన జీవావరణం ముంపుకు గురవుతుంది కాబట్టి కేంద్ర పర్యావరణ శాఖ అనుమతి అవసరం. అది సహితం లేదు. ఇవేవీ లేకపోయినా, టెండర్లు పాడుకోవడానికి కాంట్రాక్టర్లుంటే చాలునని రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం అనుకోవచ్చును గానీ చట్టం అనుకోదు.

ఇన్ని కారణాల వల్లా పోలవరం ప్రాజెక్టు వద్దంటున్నాం. దాని నిర్మాణాన్ని ఆపాలంటున్నాం. ఇప్పటికే దానిని ఆపడానికి ఉద్యమిస్తున్న ఆదివాసీ ప్రజలతో అందరం కలవాలంటున్నాం.

మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది
3 సెప్టెంబర్ 2005

# రెండవ కృష్ణా ట్రిబ్యునల్ ముందు మౌనమే సరయిన వ్యూహమా?

రెండవ కృష్ణా జలాల ట్రిబ్యునల్ ముందు రాజశేఖరరెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరేమిటో ప్రజలెవ్వరికీ తెలియకుండానే ట్రిబ్యునల్ విచారణ జరిగిపోతున్నది. ముగిసిపోవచ్చును కూడ.

ఇప్పటికి లభించిన రెండు మూడు సూచనలను బట్టి ఎడాపెడా పునాదిరాళ్ళు వేస్తున్న కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు నీటి హక్కు పొందే ఆలోచనేదీ రాష్ట్ర ప్రభుత్వానికి లేదని అర్థం అవుతున్నది. 'మిగులు జలాలను ఆంధ్రప్రదేశ్ వాడుకోవచ్చునని బచావత్ ట్రిబ్యునల్ చెప్పింది కదా– వాడుకుంటాం. దానిపైన ఆంధ్రప్రదేశ్‌కు హక్కు ఉండదని అనింది కాబట్టి హక్కు అడగం. మిగులు జలాలపైన ప్రాజెక్టులు కట్టిపెట్టుకుంటామంతే. వాటికి నీళ్ళు దక్కవలసిందేనని ఒక హక్కుగా అడగం. నీళ్ళు ఉంటే తీసుకుంటాం. లేకపోతే ఆయకట్టును బీడు పెట్టుకొని, లేదా వర్షాధార పంటలు (వర్షం పడితే) పండించుకొని బతుకుతాం–'



రెండవ కృష్ణాజలాల ట్రిబ్యునల్ ముందు ఈ నాలుగు మాటలు చెప్పి ఇంటికొచ్చేసి, గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించడం ద్వారా ఈ మిగులు జలాల ప్రాజెక్టులకు నికర జలాలు సమకూర్చాలన్నది రాజశేఖరరెడ్డి వ్యూహం. ఇది చాలా తెలివయిన వ్యూహమని ఆయన అభిమానులు అనుకుంటుండవచ్చును గానీ ఇది కృష్ణా బేసిన్ ఎగువ ప్రాంతపు ప్రాజెక్టులకు తీరని నష్టం చేస్తుంది.

కృష్ణా బేసిన్ అంటున్నాను తప్ప తెలంగాణ, రాయలసీమ అన్న తేడా ఈ సందర్భంలో పాటించడం అనవసరం. చారిత్రక, రాజకీయ కారణాలవల్ల

ఇవి రెండు భిన్నమైన 'గుర్తింపులు'గా ఉన్నాయి. ఉండకూడదని కాదుగానీ ఈ తేడా నదీజలాల విషయంలోకీ ప్రవేశించడం వల్ల నీటిహక్కులలో అసమానతలను తొలగించే ప్రయత్నాలకు నష్టమే జరిగింది. ప్రధానంగా పెన్న బేసిన్‌కు చెందిన రాయలసీమ కృష్ణానది మీద కన్ను వేసిందన్న సందేహం తెలంగాణలో మొదటినుండి ఉంది. కృష్ణా జలాలన్నీ రాయలసీమకే నంటూ అన్నీ తెలిసి ఉండవలసిన రాజశేఖరరెడ్డి, ఏమీ తెలియనక్కర లేదని భావిస్తున్న 'రాయలసీమ ఐక్యవేదిక' నాయకులు ప్రకటిస్తుండడంతో ఈ సందేహం క్రమంగా ద్వేషంగా మారుతున్నది. ఇప్పుడొక సంవత్సరకాలంగా తెలంగాణలో కోస్తా ఆధిపత్యం కంటె రాయలసీమ నీటి దాహం మీద ఎక్కువ వ్యతిరేకత ఉందంటే అతిశయోక్తి కాదు.

ఇది దురదృష్టకరం. రాయలసీమ ప్రధానంగా పెన్న బేసిన్‌లో ఉన్నా పాక్షికంగా కృష్ణా బేసిన్‌లోనూ ఉంది. దక్షిణ తెలంగాణ మొత్తంగా కృష్ణా బేసిన్‌లో ఉంది. ఈ రెండు ప్రాంతాల మధ్య కృష్ణా జలాలు ఏ విధంగా పంచాలన్న విషయంలో తేడాలు ఉండవచ్చును గానీ, ముందసలు కృష్ణా జలాలపైన కృష్ణా బేసిన్ ఎగువ జిల్లాలకు హక్కు పెంపొందించాలన్న విషయంలో విభేదానికి తావు ఉండకూడదు. కానీ విశాల దృక్పథం కంటే సంకుచిత వైఖరులు ఎక్కువ ఆనందాన్ని ఇచ్చే రాజకీయ సంస్కృతి ప్రస్తుతం రాజ్యమేలుతుండడం వల్ల కృష్ణా బేసిన్ ఎగువ ప్రాంతపు జిల్లాల ఉమ్మడి ప్రయోజనాల గురించి హేతుబద్ధంగా ప్రభుత్వంతో వాదించే వాళ్ళు కరువయ్యారు.

గోదావరి జలాల తరలింపు ద్వారా కృష్ణా బేసిన్‌లోని పెండింగ్ ప్రాజెక్టులకు నికరజలాలు సమకూర్చవచ్చునన్న ఆలోచనకు తీవ్రమైన పరిమితులున్నాయి. గోదావరి బేసిన్ జిల్లాలే ఆరున్నాయి– ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్. వీటి మెట్ట ప్రాంతాలకే కాక నల్గొండ, రంగారెడ్డి జిల్లాలలోని కొన్ని తీవ్ర దుర్భిక్ష ప్రాంతాలకు కూడా గోదావరి జలాలు అందియ్యక తప్పని పరిస్థితి ఉంది.

కాగా, గోదావరిలో మన రాష్ట్ర వాటా ఇంకా మిగిలి ఉన్నది 680 టియంసిలే. అందులో 335 పోలవరంకు అధికారికంగా ఇప్పటికే కేటాయించబడింది. అందులో 80 కృష్ణా బేసిన్‌కు పోతాయి. మిగిలిన 255 టియంసిలు కోస్తాంధ్రకు పోతాయి. ఇంక ఉండేది 345 టియంసిలు. దీనిలో 120 దుమ్ముగూడెం ద్వారా కృష్ణా బేసిన్‌కు తరలించే యోచన ఉంది. అంటే తెలంగాణలోని గోదావరి బేసిన్ జిల్లాలకు మిగిలేది 225 టియంసిలు. ఇంకొక రకంగా చెప్పాలంటే గోదావరిలో ఇంక మన వాటాకు మిగిలి ఉన్న 680 టియంసిలలో 255 కోస్తా జిల్లాలకు, 200 కృష్ణా బేసిన్ జిల్లాలకు, 225 తెలంగాణలోని గోదావరి బేసిన్ జిల్లాలకు దక్కుతాయన్నమాట. ఇది అన్యాయమని ఉత్తర తెలంగాణవాసులు ఆందోళన చేయడంలో ఆశ్చర్యం లేదు.

వారి ఆందోళన సంగతి అటుంచి, ఈ రకంగా గోదావరి నుండి కృష్ణా బేసిన్‌కు తరలించబోతున్న 200 టియంసిలు కృష్ణా బేసిన్ ఎగువ ప్రాంతాల కరువు తీరుస్తాయని రాజశేఖర్‌రెడ్డి, ఆయన అభిమానులు చేస్తున్న వాదన సరయినదేనా? ఈ 200 టియంసిలను దృష్టిలో పెట్టుకొని, రెండవ కృష్ణా ట్రిబ్యునల్‌లో ఏ ప్రతిపాదనలూ పెట్టకుండ, 'మేము కృష్ణా బేసిన్‌లో పునాదిరాళ్ళు వేసిన ప్రాజెక్టులకు నీటి కేటాయింపు అడగము, నీటిహక్కులడగము, వరదనీళ్ళు ఉన్నప్పుడు పారించుకొని సంతృప్తి చెందుతామంతే' నని చెప్పి ఇంటికొచ్చేయాలన్న ఆలోచన సరయినదేనా?

మొదటి విషయమేమిటంటే ఈ తరలించజూస్తున్న ఈ 200 టియంసిలు మొత్తం మనకు దక్కవు. ఎప్పుడయితే ఆ నీరు గోదావరి నుండి వచ్చి కృష్ణా బేసిన్‌లో చేరుతుందో అప్పుడది కృష్ణా బేసిన్ నికర జలాలలో భాగం అవుతుంది. దానిని మనం కర్నాటక, మహారాష్ట్రలతో పంచుకోవలసి వస్తుంది. 200లో బహుశా 90 వారికి, 110 మనకు దక్కుతాయి.

ఈ 110లో ఇప్పటికే అనధికారికంగా కృష్ణాబేసిన్‌లో కట్టేసిన ప్రాజెక్టుల కోటా సగంపైగా తినేస్తుంది. ఇందులో ప్రధానమైనది కడప, నెల్లూరు జిల్లాలకు నీళ్ళిచ్చే తెలుగుగంగ, నల్గొండకూ హైదరాబాద్‌కూ నీళ్ళిచ్చే ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు, దాని వరదకాలవ. తెలుగుగంగకు 29 టియంసిలు కేటాయించబడ్డాయి. ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టుద్వారా హైదరాబాద్‌కే 16 టియంసిలు ఇచ్చే ఆలోచన ఉన్నట్టు వింటున్నాం. కాబట్టి ఆ ప్రాజెక్టుకు 30 అయినా కేటాయించనిదే నల్గొండకు న్యాయం జరుగదు. ఇవి రెండు కాక మరొక అనధికార కేటాయింపు కూడా ఉంది. అది కడప జిల్లా కెసికెనాల్ చివరి భూముల కోసం శ్రీశైలం ఎస్కేప్ చానెల్ నుండి తీసుకుంటున్న 10 టియంసిలు. ఈ మూడూ కలిపితే ఇప్పటికే జరిగిపోయిన అనధికార కేటాయింపు 69 టియంసిలు. 110లో 69 పోను మిగిలేది 41 టియంసిలు. దీనితో కల్వకుర్తి ఎత్తిపోతల, నెట్టెంపాడు ఎత్తిపోతల, శ్రీశైలం ఎడమగట్టుకాలువ, హంద్రీ -నీవా, గాలేరు- నగరి, వెలుగొండ, పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయరు... ఇన్ని వచ్చేస్తాయా? వీటిని చూపించే కదా గోదావరి జలాలు కృష్ణా బేసిన్‌కు తరలించి కరువు ప్రాంతాల కష్టాలు తీరుస్తామని హామీలు గుప్పిస్తున్నారు? 41 టియంసిలతో వీటిలో ఏ ఒక్కటో మాత్రమే సాధ్యమవుతుంది. మిగిలిన వాటికి నీళ్లెక్కడ తెస్తారు? కృష్ణానదీ జలాల పునఃపంపిణీ జరిగితే 80 టియంసిలు దక్కగలవు. కృష్ణాడెల్టా అవసరాల కోసం నాగార్జునసాగర్‌కు దిగువన నదిలోకి వచ్చే నీరు మాత్రమే తీసుకోవాలనీ, సాగర్‌కు ఎగువన నదిలో వచ్చే నీరంతా తెలంగాణ, రాయలసీమలకేననీ అనడం పునఃపంపిణీ సారాంశం. దానివల్ల ఎగువ ప్రాంతాలకు 80 టియంసిలు

దక్కుతాయి. అయితే ఈ ప్రతిపాదనకు రాజశేఖర్‌రెడ్డి ఈ రోజే కాదు, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడ ఒప్పుకోలేదు. అప్పుడు మిగిలిన మార్గం ఒక్కటే. 'డిపెండబిలిటీ ఫాక్టర్' తగ్గించి తక్కువ నీటి భరోసాతో ఎక్కువ ప్రాజెక్టులు కట్టుకోవడం.

ప్రస్తుతం 75 శాతం డిపెండబిలిటీ ప్రాతిపదికన నికరజలాలు నిర్ణయిస్తున్నాం. అంటే ఆయకట్టుదార్లకు నాలుగింట మూడేళ్ళు నీళ్ళు లభిస్తాయన్న సగటు భరోసా ఉండాలంటున్నాం. దీనిని 60 శాతానికి తగ్గించడానికి అందరూ ఒప్పుకున్నట్టయితే – అంటే ఆయకట్టుదార్లకు అయిదింట మూడేళ్ళు నీటిభరోసా ఉంటే చాలునని అంగీకరించేటట్టయితే ఆంధ్రప్రదేశ్ వాటా కొచ్చే నికరజలాలు 200 టియంసిలు పెరుగుతాయి. అప్పుడు పైన పేర్కొన్న దుర్భిక్ష ప్రాంతాల ప్రాజెక్టులన్నీ కట్టుకోవచ్చు. వాటన్నింటినీ కట్టుకోదలచుకుంటే ఇది తప్ప వేరే మార్గం లేదు. అయితే దీనికి కృష్ణా డెల్టా, సాగర్ ఆయకట్టుదార్లకు నచ్చజెప్పాలి. రెండవకృష్ణా ట్రిబ్యునల్ ముందు ఈ ప్రతిపాదన పెట్టి ఆమోదం పొందాలి. అంతే తప్ప 'మేము మిగులు జలాలపైన కట్టుకుంటున్న ప్రాజెక్టులకు నీటికేటాయింపులు అడగం. వరద ఉన్నప్పుడు తీసుకుంటాం. మమ్మల్ని వదిలేయండి' అని కృష్ణా ట్రిబ్యునల్‌కు దండం పెట్టి వచ్చేసి, తన జిల్లా మిగులు జలాల ప్రాజెక్టుల కోసం మాత్రం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను వెడల్పు చేసి పెట్టుకోవాలనుకోవడం సంకుచిత రాజకీయమేకాక తెలివితక్కువతనం కూడ.

రాజశేఖర్‌రెడ్డి గోదావరి నీళ్ళు తెచ్చి కృష్ణా బేసిన్ ప్రజల కరువు తీరుస్తాడని నమ్ముతున్నవాళ్ళు ఇంకొక విషయం గ్రహించడం లేదు. 200 టియంసిలు తరలిస్తే అందులో 90 కర్ణాటక, మహారాష్ట్రలకు ఇయ్యవలసి ఉంటుందని అన్నాను. ఆ 90 టియంసిలు వాళ్ళు ప్రకాశం బ్యారేజి నుండి, సాగర్ నుండి నీటి ట్యాంకర్లతో తీసుకుపోరు. ఎగువనే ఆపుకుంటారు. అంటే ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించే కృష్ణా, తుంగభద్ర జలాలలో 90 టియంసిలు తగ్గిపోతాయి. సాధారణ సంవత్సరాలలో ఇది నష్టం చేయదుగానీ పడమటి కనుమలలో వర్షం తక్కువ పడిన సంవత్సరాలలో మన ఎగువ ప్రాంతపు ప్రాజెక్టులు– జూరాల, భీమా, రాజోలిబండ, తుంగభద్ర ఎగువకాలవ, దిగువ కాలవ– దెబ్బతినగలవు. ఇవన్నీ కరువు ప్రాంతాల ప్రాజెక్టులేనని వివరించి చెప్పనక్కరలేదు.

ప్రజాతంత్ర
25 మార్చి 2006



# రెండవ కృష్ణా ట్రిబ్యునల్ ముగియక ముందే...

రెండవ కృష్ణా నదీజలాల ట్రిబ్యునల్ సంచలనాత్మక ప్రక్రియ కాబోతుందని పదేళ్ల కింద – అయిదేళ్ల కింద కూడ అనుకున్నాం. మొదటి కృష్ణా ట్రిబ్యునల్ (బచావత్ ట్రిబ్యునల్‌గా ఇది పేరు పొందింది) కర్ణాటకకూ మహారాష్ట్రకూ అన్యాయం చేసి 'వాళ్ల' నీళ్లు పెద్దమొత్తంలో 'మనకు', అంటే ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిందని ఇక్కడెవ్వరూ ఒప్పుకోరుగానీ ఆ ఎరుక ఆ రెండు రాష్ట్రాలలోనూ బచావత్ అవార్డు అమలులో ఉన్న రోజులలో పెరిగింది. అట్లాగే బచావత్ అవార్డు వల్ల లాభం జరిగిన ఆంధ్రప్రదేశ్‌లో ఆ లాభం యావత్తు కోస్తాంధ్రకే జరిగిందన్న ఎరుక తెలంగాణ, రాయలసీమలలోనూ పెరిగింది. దీని ప్రభావం రెండవ కృష్ణా ట్రిబ్యునల్ మీద ఉంటుందని 2000 సంవత్సరం మే నెలలో బచావత్ అవార్డు గడువు ముగిసిన నాటికి ముందునుండే రాజకీయ విశ్లేషకులుగా మమ్మల్ని మేము భావించుకుంటున్న వాళ్లం అనుకుంటూ వచ్చాం. అందుకు తెలంగాణ, రాయలసీమ ప్రజలను సన్నద్ధులను చేయాలన్న ప్రయత్నమూ కొంత జరిగింది.



సంచలనం కాదు కదా, తుస్సుమన్న శబ్దం కూడ వినపడకుండ రెండవ కృష్ణా ట్రిబ్యునల్ పని జరిగిపోతూ ఉంది. ఆ ట్రిబ్యునల్ ముందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరి గురించి ఏ చర్చా ఇక్కడ జరగడం లేదు. అసలెవ్వరూ దాని గురించి మాట్లాడడం లేదు.

కోస్తా ఆంధ్రవాసులు మాట్లాడకపోవడంలో ఆశ్చర్యపోవలసిందేమీ లేదు. స్థిరపడిపోయిన హక్కులను కదిలించకుండ ఉంటే వాళ్లకు చాలును.

కొత్తగా వాళ్లకెట్లాగూ ఏమీ రాదు, అక్కరలేదు కూడా. ఉన్నది తీసేసే పునఃపంపిణీ ప్రతిపాదనేదీ రానంతకాలం కృష్ణాజలాల గురించి మాట్లాడవలసిన అవసరం వాళ్లకు లేదు. కానీ ఊహించని విషయం తెలంగాణ, రాయలసీమవాసులు కూడ మాట్లాడకపోవడం, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏ మాత్రం ఇబ్బంది పెట్టకుండ ట్రిబ్యునల్ ఎదుట కాలక్షేపం చేయనివ్వడం. దీనికి కారణాలు లేకపోలేదు. అవి చేదయిన కారణాలయినా వాటిని ప్రస్తావించకతప్పదు.

తెలంగాణవాదులు మాట్లాడక పోవడానికి రెండు కారణాలు కనిపిస్తాయి. ఒకటి, తెలంగాణ ఉద్యమం ప్రధానంగా గోదావరి బేసిన్ ఉద్యమం. ఒక్క తెలంగాణ రాష్ట్ర సమితే కాదు, అన్ని తెలంగాణవాద సంస్థలు ప్రధానంగా గోదావరి బేసిన్ సంస్థలే. కృష్ణా బేసిన్ గురించి అవగాహన, పట్టింపు వారికి అసలే లేకపోలేదు గానీ తొందర మాత్రం లేదు. రెండు, కృష్ణాజలాల గురించి హేతుబద్ధమైన, సూత్రబద్ధమైన చర్చ చేసేటట్టయితే ఆ నదినీటిలో రాయలసీమ హక్కుల గురించి ఎంతో కొంత మాట్లాడవలసి ఉంటుంది. అది తెలంగాణవాదులకు ఇష్టం లేదు.

రాయలసీమవాదులు అనే వాళ్లెవరూ ప్రస్తుతం రాజకీయంగా చురుకుగా లేరు– అజ్ఞానమే ప్రధాన సంపత్తి అయిన స్వీట్ల పుల్లారెడ్డిని మినహాయిస్తే. అయితే రాయలసీమ ప్రయోజనాల గురించి మాట్లాడే సామాజిక కార్యకర్తలు, మేధావి వర్గం లేకపోలేదు. వాళ్లు కూడ మౌనంగా ఉండడానికి రెండు కారణాలు కనిపిస్తాయి. 'మనవాడు' ముఖ్యమంత్రిగా ఉన్నాడు, ఎట్లాగో ఒకలాగ 'మన ప్రయోజనాలు' కాపాడుతాడు, అనవసరంగా మాట్లాడి అతగాడిని ఇబ్బంది పెట్టడం ఎందుకు అన్న వైఖరి ఒకటి. ఎట్లాగో ఒకలాగ సాధించే ప్రయోజనాలు ఎట్లాగో ఒకలాగ పోగలవన్న స్పృహ ఈ వైఖరికి దూరం. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచడానికి ఒక జీవో చాలునునుకుంటే, మూడేళ్ల తరువాత ఇతగాడి పాలన ముగిసినాక దాని తొలినాటి సామర్థ్యాన్ని సహితం సగానికి తగ్గించడానికి ఇంకొక జీవో చాలదా? అడ్డగోలుగా సాధించుకునే హక్కులు స్థిరపడతాయా? రెండవ కారణం, 1980ల నుండి కూడ రాయలసీమవాదులు కృష్ణాజలాల గురించి చేస్తున్న ఆలోచనలు ఊహాత్మకమైనవి. సూత్రబద్ధమైన ఆలోచన చేస్తే ఊహాలోకాల నుండి నేలమీదికి దిగిరావలసి ఉంటుంది. ఉదాహరణకు కృష్ణాజలాలు రాయలసీమకేననీ, తెలంగాణ గోదావరి నీళ్లతో సరిపెట్టుకోవాలనీ రాయలసీమవాదులలో చాలామంది ఎప్పటినుండో అంటున్నారు. ఇది సాంకేతికంగానూ రాజకీయంగానూ కూడ అవాస్తవికమైన ఆలోచన.

ఇన్ని కారణాలూ కలిసి రాజశేఖరరెడ్డి ప్రభుత్వానికి రెండవ కృష్ణా ట్రిబ్యునల్ ఎదుట తన వైఖరిని సజావుగా సాగించుకోవడానికి అవసరమైన అవకాశాన్ని ఇచ్చాయి.

ఒక్క చుక్క నికరజలాన్ని అడగము, కట్టుకుంటున్న అన్ని ప్రాజెక్టులకూ మిగులు జలాలున్నప్పుడే నీళ్లు తీసుకుంటాం అని చెప్పి చేతులు దులిపేసుకునే అవకాశాన్ని ఇచ్చాయి. ఇదే చివరి మాటయితే చాలా నష్టం జరుగుతుంది. ఈ మిగులు జలాల ప్రాజెక్టులన్నీ కరువు ప్రాంతాల ప్రాజెక్టులు. కిందటి సంవత్సరం, ఈ సంవత్సరం కృష్ణానదిలో మిగులు జలాలు సమృద్ధిగా ఉండడం వల్ల ప్రాజెక్టు గేట్లు తెరిచేటప్పుడు మంత్రులు 'ప్రాజెక్టులు కట్టకపోవడం వల్ల ఇన్ని నీళ్లు వృథాగా సముద్రంలోకి పోతున్నాయి' అంటూ ఉపన్యాసాలు ఇచ్చారు గానీ ఇదెప్పుడో పదేళ్లకొకసారి ఉండే పరిస్థితి. మామూలు సంవత్సరాలలో మిగులుజలాలు కొద్దిగా మాత్రమే ఉంటాయి. అవి మాకు కావాలంటే మాకు కావాలని ఈ కరువు ప్రాంతాల ప్రాజెక్టుల ఆయకట్టుదార్లు, రాజకీయ నాయకులు ఆందోళనకు దిగుతారు. అందరి కోరికలూ తీరవు కాబట్టి, మిగులు నీటి పంపిణీకి న్యాయబద్ధమైన విధానమేదీ రూపొందించలేదు కాబట్టి, ఇది జిల్లాల మధ్య, ప్రాంతాల మధ్య ద్వేషాన్ని రెచ్చగొడుతుంది. మిగులునీటిని వచ్చినదాన్ని వచ్చినట్టు తీసుకుపోవడం కోసం ముందుగానే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం పెంపుదల ద్వారా వసతి ఏర్పాటయిన కడప జిల్లా పట్ల ఇప్పటికే మహబూబ్‌నగర్ నుండి అనంతపురం దాకా అందరిలోనూ వ్యతిరేకత ఏర్పడింది- గాలేరు-నగరి అనే కడపజిల్లా ప్రాజెక్టు ఇంకా పూర్తికాక ముందే, దానితో పోటీకి రాగల ఏ ప్రాజెక్టూ ఇంకా పూర్తికాక ముందే.అన్నీ పూర్తయిన తరువాత ఇది భయంకరమైన సామాజిక ఘర్షణకు దారి తీయగలదు. ప్రజల మధ్య విద్వేషాలే నాయకులకు వరం అని నమ్మే రాజశేఖరరెడ్డి ఫ్యాక్షనిస్టు వైఖరికి తప్ప వేరే ఎవరికీ, ఏ ప్రజాతంత్ర ఆలోచనా రీతికీ ఇది సంతోషం కలిగించదు.

మాట్లాడటానికి ఎవరి కారణాల వల్ల వారు సిద్ధంగా లేకున్నా సమయం మించిపోక ముందే మాట్లాడగల వాళ్లయినా మాట్లాడకపోవడం క్షంతవ్యం కాదు.కృష్ణా నదీజలాలపైన ఆధారపడి ప్రతిపాదించిన - ఇప్పుడు వేలకోట్లు గుమ్మరించి కట్టేస్తున్న ప్రాజెక్టులకు నికరజలాలు ఇవ్వాలంటే మన రాష్ట్ర వాటాను పునఃపంపిణీ చేయడం ఒక్కటే మార్గం. ఈ పునఃపంపిణీలో రెండు అంశాలుంటాయి. ఒకటి, నీటి కేటాయింపునే పునఃపంపిణీ చేయడం, రెండు డిపెండబిలిటీని (తెలుగులో భరోసా అందాం) తగ్గించడం ద్వారా, నీటి కేటాయింపును పునఃపంపిణీ చేసినా చేయకున్నా, నికరజలాల రాశిని పెంచి ఎగువ ప్రాంతాల ప్రాజెక్టుల కోసం నీటి హక్కును పునఃపంపిణీ చేయడం.

నీటి కేటాయింపు పునఃపంపిణీ ద్వారా కృష్ణా డెల్టా వాటాను 80 టియంసిలు తగ్గించి ఎగువ ప్రాంతాలలో కేటాయించవచ్చు. కృష్ణా డెల్టా తీసుకునే నికర జలాలలో 80 టియంసిలు నాగార్జునసాగర్‌కు ఎగువ ప్రాంతాలలో కేటాయించవచ్చు. ఎందుకంటే కృష్ణా డెల్టా తీసుకునే నికర జలాలలో 80 టియంసిలు నాగార్జునసాగర్‌కు ఎగువ

నుండి వస్తుంది. దానిని ఎగువనే నిలిపి వేయడం ఈ పునఃపంపిణీకి అర్థం. డెల్టావాసులను ఇబ్బంది పెట్టకుండా ఇదే ఫలితాన్ని సాధించడం కోసమే గోదావరిపైన పోలవరం  డ్యాం కట్టి 80 టియంసిలు ప్రకాశం బ్యారేజికి తరలిస్తామంటున్నారు. పోలవరం వల్ల వచ్చే అనేక అనర్థాలను అటుంచి, ఆ రకంగా 80 టియంసిలు తెచ్చుకుంటే  అదంతా మనమే వాడుకోలేము. అందులో దాదాపు సగం కర్ణాటకకూ మహారాష్ట్రకూ ఇయ్యవలసి ఉంటుంది. పునఃపంపిణీకి ఒప్పుకుంటే పోలవరం కట్టనక్కరలేదు, ఆదివాసులను ముంచనక్కరలేదు, ఆ నీళ్లు ఎగువ రాష్ట్రాలకు ఇయ్యనక్కరలేదు.

డెల్టాకు 80 టియంసిలు తగ్గించే పునఃపంపిణీయే కాక సాగర్ కుడికాలవ ద్వారా గుంటూరు, ప్రకాశం జిల్లాలకు తీసుకుంటున్న నీటిని కూడ తగ్గించి ఎగువ ప్రాంతాలకు పునఃపంపిణీ చేయవచ్చునా అన్న ఆలోచన రావచ్చు. అయితే కుడికాలవ రాకముందు పల్నాడు తాలూకా తెలంగాణ, రాయలసీమలకు ఏ రకంగానూ తీసిపోని కరువు ప్రాంతంగా ఉండిందని గుర్తుంచుకుంటే దీనికి అవకాశం తక్కువని ఒప్పుకోక తప్పదు.

ఈ నీటి కేటాయింపుకు రెండవ కృష్ణా ట్రిబ్యునల్ అనుమతి అవసరం లేదు. ప్రస్తుతం ప్రాజెక్టులన్నీ 75 శాతం నీటి భరోసాతో మంజూరవుతున్నాయి. అంటే సగటున నాలుగింట మూడేళ్లు నీళ్ళుంటాయన్న భరోసాతో అన్న మాట. దానిని అయిదింట మూడేళ్లకు – అంటే 60 శాతం భరోసాకు – తగ్గించినట్టయితే తక్కువ భరోసాతో ఎక్కువ నికరజలం లభిస్తుంది. మన రాష్ట్ర వాటా ఇంకొక 200 టియంసిలు పెరుగుతుంది. నీటి కేటాయింపు పునఃపంపిణీ కూడ చేసి 80 టియంసిలు ఎగువ ప్రాంతాలకు కేటాయించినట్టయితే మొత్తం 280 టియంసిల వరకు నికరజలాలు 60 శాతం భరోసాతో లభిస్తాయి. ప్రస్తుతం వేలకోట్లు పోసి కడుతున్న 'మిగులు జలాల ప్రాజెక్టులకు', ఇప్పటికే కట్టేసిన తెలుగు గంగ, ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టులకు, ఈ నీటిని పంపిణీ చేయడానికొక ప్రజాతంత్ర ప్రాతిపదికను రూపొందించుకొని, ప్రాజెక్టులు కట్టుకొని, వాటి నిర్వహణకు ఒక స్వతంత్ర యంత్రాంగాన్ని అమలులోకి తేవాలి.

రెండవ కృష్ణా ట్రిబ్యునల్ కథ ముగిసే లోపల ఈ ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించకపోతే మాత్రం అపారనష్టం జరగగలదు.

ప్రజాతంత్ర

20 ఆగస్టు 2006



## నదీ జలాలు :

# రాయలసీమ రాజకీయార్థిక జీవితం



**నా**కిచ్చిన టాపిక్ ఏమిటి అనేది పొద్దున్నించి చాలామంది కుతూహలంగా ఉన్నట్లున్నారు. పోతిరెడ్డిపాడు గురించి మాట్లాడతావా అని అడిగారు చాలా మంది. మాట్లాడతాను తప్పనిసరిగా. ఎందుకంటే రాయలసీమ సమస్యల్లో సాగునీరు ముఖ్యమైనది కాబట్టి. రాజశేఖరరెడ్డి చేస్తున్న జల రాజకీయాల గురించి మాట్లాడుకోవలసిందే, తప్పదు.

రాజకీయ, ఆర్థిక విశ్లేషణ అంటే మామూలుగా మార్క్సిస్టు పరిభాషలో ఒక అర్థం ఉంది – వర్గం ప్రాతిపదిక వ్యవస్థను విశ్లేషించడం అనేది. కాని నేను అది చేయబోవడం లేదు. దానికి చాలా కారణాలు ఉన్నాయి. అవన్నీ ఎందుకుగాని ఆర్.ఎస్.రావుగారు ఒక మాట అన్నారు. మనం సమస్య గురించి మాట్లాడుకునేటప్పుడు వర్గాన్ని మర్చిపోతున్నామని. అది న్యాయమైన అభిశంసనే; వర్గం ఒక్కటే కాదు– సామాజిక, సాంఘిక అంతరాలు చాలా ఉన్నాయి. కాబట్టి వర్గ విశ్లేషణ కాకుండా సాంఘిక నిర్మాణాన్ని ప్రాతిపదికగా చేసుకున్న విశ్లేషణ అనే అర్థంలో కొంతవరకూ మాట్లాడతాను. దానిలో వర్గం ఉంటుంది, కులం ఉంటుంది, ప్రాంతాలు ఉంటాయి, ఉపప్రాంతాలు ఉంటాయి, అన్నీ ఉంటాయి.

మూడవది రామ్మోహన్ ప్రస్తావించిన రాయలసీమ ఐడెంటిటీ, గుర్తింపు. దాని గురించి నేను మాట్లాడను. ఎందుకంటే అది ప్రజలలో విస్తృతంగా లేదు. ప్రజలలో విస్తృతంగా లేనిది మాట్లాడుకోకూడదనేమీ కాదు కానీ దానికి తొందర లేదు. తెలంగాణ ప్రజలలో తెలంగాణ గుర్తింపు విస్తృతంగా ఉంది కాబట్టి దాని గురించి మాట్లాడుకోవడమనేది తప్పనిసరి, రచయితలయినా ఎవరైనా సరే. రాయలసీమకు ఆ తొందర ఏమీ లేదు.

నాలుగవది, చంద్రశేఖర్ కొంచెం గాభరాగా సాహిత్యం గురించి మాట్లాడతావా అని అడిగాడు. నేను మాట్లాడను. పొరబాటున కూడా సాహిత్యం ప్రస్తావన రాదు నేను మాట్లాడేదాంట్లో. ఈ నాలుగు హామీలతో నేను చెప్పదల్చుకున్న విషయాలు చెప్తాను.

ఇంకొకటి కూడా ఉంది. తెలంగాణ, రాయలసీమ అని మాట్లాడేటప్పుడు సహజంగానే అభివృద్ధి, వెనుకబాటుతనం అనే పదాలు వస్తాయి, ఆ భావనలు వస్తాయి. ఏ అర్థంలో ప్రయోగిస్తున్నాం అనేది కూడా వస్తుంది. ఆర్.ఎస్.రావుగారు ఒక ఫ్రేమ్‌వర్క్ ఇచ్చారు. నేను దానిని ప్రయోగించను. మామూలుగా ప్రజాతంత్ర ఉద్యమాలు, ప్రజా ఉద్యమాలు ఒక అర్థంలో ఉపయోగిస్తున్నాయి ఈ మాటలను. మాకు అభివృద్ధి లేదు, మేము వెనుకబడి ఉన్నాము అని ఒక ప్రాంతమైనా, ఒక జిల్లా అయినా అన్నప్పుడు ఏ అర్థంలో ప్రయోగిస్తున్నామంటే రెండు పూటలా తినడానికి తిండి, ఆ తిండి పెట్టగల వనరులు, ఉపాధి-ఉద్యోగాలు, పని, చదువుకునే అవకాశాలు, వైద్య సదుపాయాలు, రాబోయే తరం ఇంకొంచెం బాగా బతకడానికి కొంచెం మిగులు - ఈ మేరకు ఉండాలి, అది మాకు లేదు అనే అర్థంలో వాడుతున్నాము. ఇవన్నీ కూడా ప్రస్తుతం ఉన్న ఆర్థిక వ్యవస్థ చట్రంలో భాగంగానే అడుగుతున్నాము. దీని వెలుపల కాదు. ప్రస్తుతం ఉన్న ఈ ఆర్థిక వ్యవస్థ చట్రమే తప్పు కావచ్చు. తప్పు అనడానికి చాలా కారణాలు ఉన్నాయి. అయినప్పటికీ జరుగుతున్న సంవాదం దీంట్లో భాగంగానే జరుగుతోంది కాబట్టి నేను కూడా దానికి పరిమితమయ్యే అభివృద్ధి, వెనుకబాటుతనం అనే మాటలను ప్రయోగిస్తాను. ఆర్.ఎస్.రావు గారు ఉపయోగించిన ఫ్రేం వర్క్‌లో అయితే తెలంగాణ most developed area అవుతుంది. మీకు ప్రత్యేక రాష్ట్రం ఎందుకు అంటే దెబ్బలు పడతాయి అక్కడ. అందువల్ల ఇప్పుడున్నటువంటి రాజకీయ సంవాదంలో అంతర్భాగంగా, ఆ ఫ్రేమ్‌వర్క్‌లోనే ఈ మాటలను ప్రయోగిస్తాను.

ఈ కోణం నుండి.. అంటే తిండి, పని, కనీసమైన జీవన సదుపాయాలు అనే కోణం నుండి రాయలసీమను చూసినపుడు... నీటిలేమి అనేది చాలా ప్రధానమైనటువంటి లక్షణంగా మనకు కనిపిస్తుంది. రాయలసీమను మొత్తంగా తీసుకుంటే కూడా వర్షపాతం బాగా తక్కువ ఉండే నేల అది. ఆ కురిసే వర్షాన్ని కూడా నిలుపుకోగల, ఆ రకమైన మట్టి లేనటువంటి.. నేల. అసలే వర్షపాతం తక్కువ. దాని వల్ల భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయి ఉండటం, ఆ కారణంగా వాటిని బాగా పైకి తీసుకువచ్చి పంటలు పండించటమనేది చాలా కష్టతరమై పోవడం - ఆర్థికంగానూ, ఇతరత్రా కూడా- జరిగింది. పోనీ ప్రధానమైన నదులేమైనా ఉన్నాయా ఆ జలాల మీద ఆధారపడటానికి అంటే పెన్నానది ఒక్కటే అక్కడ ప్రధానమైన నది. గోదావరి తీరం నుంచి చూస్తే కృష్ణ ఒక సారహీనమైన నదిగా కనిపిస్తుంది. కృష్ణ ఒడ్డున

నిలబడి చూస్తే పెన్నా ఇంకా సారహీనమైనదిగా కనబడుతుంది. అయినా రాయలసీమకు ఉన్నది అదే. కడపజిల్లా మొత్తం పెన్నా బేసిన్‌లోనే ఉంది. అనంతపురం ప్రధానంగా పెన్నా బేసిన్‌లో, పాక్షికంగా కృష్ణా బేసిన్‌లో ఉంది. కర్నూలు కొంచెం ఎక్కువగా కృష్ణా బేసిన్‌లో ఉన్నా, గణనీయంగా పెన్నా బేసిన్‌లోనూ ఉంది. చిత్తూరుకు ప్రధానంగా ఉన్నది పెన్నా ఉపనదులే. మిగిలినవన్నీ కూడా సువర్ణముఖి లాంటివి – అక్కడ పుట్టి, అక్కడే సముద్రంలో కలుస్తాయి. ఈ నేలలు–ఒక్క పెన్నా బేసిన్ మినహాయించి–మిగిలిందంతా కూడా ఎర్రనేలలే. పెన్నా బేసిన్ మాత్రమే నల్ల రేగడి నేలలు. ఎర్రనేలలు నీటిని ఎక్కువ నిలుపుకోలేవు. అందువల్ల కురిసే కొంత వర్షం కూడా ఆ నేలను సారవంతం చేయలేదు. అది మినరల్స్‌ని జీర్ణం చేసుకోలేదు. రాయలసీమకు సంబంధించి ఇది భౌతికమైనటువంటి వాస్తవం. నిజానికి రాయలసీమే కాదు..మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాలు, ప్రకాశం జిల్లాలో ఉన్న మార్కాపురం డివిజను ప్రాంతం–ఇదంతా కూడా 700 మి.మీ కంటె తక్కువ సగటు వర్షపాతం ఉండే ప్రాంతం. కొంతమేరకు మహబూబ్‌నగర్‌లో సారవంతమైన నేలలు ఉన్నప్పటికీ మొత్తం మీద సారహీనమైనటువంటి నేలలు ఉన్న ప్రాంతమే ఇదంతా. చారిత్రక కారణాల వల్ల ఇవ్వాళ వీటిని కొంత రాయలసీమ అనీ, కొంత తెలంగాణ అనీ, కొంత ఆంధ్రా ప్రాంతమనీ మాట్లాడుకుంటున్నాము. ఆ చరిత్రను ఇవ్వాళ కాదని ప్రయోజనం లేదు, అది వాస్తవం.

నిజాం నవాబు 1800లో రాయలసీమను ఈస్ట్ ఇండియా కంపెనీకి ఇచ్చేయకుండా తనే పరిపాలించి ఉంటే ఇవ్వాళ ఈ ప్రాంతానికి కొంత ఎక్కువ న్యాయం జరిగే అవకాశం ఉండేది. చీలికలు లేకుండా ఉండేది. ఈ ప్రాంతం అంతా కూడా నైసర్గికంగా, ప్రకృతిరీత్యా అనుకూలమైన జీవిత పరిస్థితులు ఉండేటువంటి ప్రాంతం. దురదృష్టవశాత్తూ చారిత్రక కారణాలు కూడా దానికి తోడయ్యాయి–అది విడిపోయి ఉందివ్వాళ. రాయలసీమకూ, దక్షిణ తెలంగాణకూ మధ్య ద్వేషాలు కూడా ఎక్కువగా కనిపిస్తూ ఉన్నాయి. ఆ చరిత్రను కాదని ప్రయోజనం లేదు. ఒక వాస్తవంగా దాన్ని అంగీకరించక తప్పదు.

రాష్ట్ర జనాభాలో రాయలసీమ జనాభానూ, రాష్ట్రం విస్తీర్ణంలో రాయలసీమ విస్తీర్ణాన్నీ తీసుకున్నప్పుడు విస్తీర్ణం నిష్పత్తి కంటే జనాభా నిష్పత్తి దాదాపు మూడవవంతు తక్కువ ఉంది. రాష్ట్రం మొత్తం విస్తీర్ణంలో రాయలసీమ విస్తీర్ణాన్నీ, రాష్ట్ర జనాభాలో రాయలసీమ జనాభానూ పోల్చి చూసుకుంటె ఇది మూడవవంతు తక్కువ ఉందంటే అంత తక్కువగా జనాభాను పోషించగల నేల ఇక్కడ ఉంది అనేది మనకు అర్థం అవుతుంది. ఇక్కడ జన సాంద్రత కూడా చాలా తక్కువ మిగతా ప్రాంతాలతో పోలిస్తే. నేల పోషించలేదు

కాబట్టే జనాభా తక్కువ ఉంది. ఇంకొకరకంగా తీసుకుంటె కూడా సాగుయోగ్యమైన భూమి మొత్తం విస్తీర్ణంలో ఎంత ఉందీ అంటే రాష్ట్ర నిష్పత్తికంటే 25 శాతం తక్కువ రాయలసీమలో ఉంది. బంజరుభూమి, సాగుయోగ్యంకాని భూమి తీసుకున్నా రాష్ట్ర నిష్పత్తితో పోలిస్తే 25 శాతం ఎక్కువ రాయలసీమలో ఉంది. పోనీ సాగుయోగ్యం కాకపోయినా పశుపోషణకు పనికివచ్చేటటువంటి పచ్చిక బయళ్ళు ఉన్నాయా అంటే అవి కూడా రాయలసీమలో మూడోవంతు తక్కువే. అంటే పశుపోషణకుగానీ, వ్యవసాయానికిగానీ పనికిరానటువంటి భూములే చాలా ఎక్కువగా ఉన్నాయి. అందులోనూ అతి తక్కువ సాగుయోగ్యమైన భూమి ఉన్నది కడపజిల్లాలో. జిల్లా వైశాల్యం, సాగు యోగ్యమైన భూముల వైశాల్యం నిష్పత్తి తీసుకున్నా అతి తక్కువగా ఉండేది రాష్ట్రం మొత్తం మీద కడప జిల్లాలోనే. చాలా పెద్దఎత్తున రిజర్వు ఫారెస్టు ఉన్న ఖమ్మం కంటె కూడా కడపజిల్లాలో సాగుయోగ్యమైన భూమి తక్కువగా ఉంది.

అయినా రాజశేఖరరెడ్డీ, రమణారెడ్డీ... ఈ రెడ్డీ ఆ రెడ్డీ వీళ్ళు చేసిన ఘనకార్యం ఏమిటీ అంటే తక్కువగా ఉన్న ఆ సాగుయోగ్యమైన భూమికి ఎక్కువ నీళ్ళు ఇవ్వగలిగారు. అనంతపురం కంటె డబుల్‌గా నీళ్ళు ఇవ్వగలిగారు. అది... వాళ్ళ రాజకీయాలు.. తర్వాత చెప్తాను - ఏ రకంగా వాళ్లు ఈ పనులన్నీ చేయగలిగారు అనేది.

అనంతపురంలో మరీ ఘోరమైన పరిస్థితి... అక్కడ సగటు వర్షపాతం 550 మి.మీ. పైగా సారహీనమైన నేలలు. అందుకే ఎడారి అయిపోయింది అని తరచుగా అంటూ ఉంటాం అనంతపురం జిల్లా గురించి. ఇవన్నీ ఒక పక్క. ఈ కారణంగానే భూగర్భ జలాలు కూడా వెయ్యి అడుగులదాకా పోయింది రాయలసీమలో. తెలంగాణలో కూడా చాలా ప్రాంతాల్లో 600 ఆడుగుల దాకా పోయింది కానీ రాయలసీమలో ముఖ్యంగా రాయచోటి, మదనపల్లె, వాయల్పాడు-అంటే కడప జిల్లా తూర్పుప్రాంతం, చిత్తూరు-కడపను ఆనుకుని ఉన్న ప్రాంతంలో దాదాపు వెయ్యి అడుగులు పోతే తప్ప నీళ్ళు రావు. అక్కడొక రైతు మేం మాట్లాడుతూ ఉంటే... నవ్వుకుంటూ ఒకమాట అన్నాడు... అంటే అంత కష్టంలోనూ ఒక Sense of Humour ఉంటుంది. -వెయ్యి అడుగులు పోయినా రాలేదు సారూ, ఆపేసినాను. ఇంకొంచెం పోతే పెట్రోలు దొరికేదేమో నాకు... అన్నాడాయన.

దీనివల్ల నీళ్ళు బయటకు తీయడమూ కష్టమే, కరెంట్ ఖర్చూ ఎక్కువ అవుతుంది. ఎంత ఫ్రీగా కరెంటు ఇస్తాం అన్నా-అంత హెవీ మోటార్లు పెడితే... తరచుగా కరెంటు

పోతూ ఉంటుంది. వోల్టేజి తేడాలు కూడా ఎక్కువ ఉంటాయి. అది సాధ్యమయ్యే వ్యవసాయం కాదు. ఒకవేళ మీరు అనవచ్చు – చాలామంది అంటూ ఉంటారు కూడా – ఇవన్నీ ఉన్నపుడు దానికి తగినటువంటి పంటలే పండించుకుని బతకలేరా అని. ఇపుడు ఆర్.ఎస్.రావుగారు అన్నదాంతో ఇది కలుస్తుంది ఒక రకంగా. కొన్ని assume చేసుకుంటున్నాం మనం. పండిస్తే వడ్లే పండించాలి, చేస్తే ఉద్యోగమే చేయాలి, అదీ ఫ్యాక్టరీ నౌఖరీయే కావాలి అనుకుంటూ ఉన్నాం మనం. నేను ఇంతకుముందే అన్నాను...ఇవ్వాళ ఉన్న ఆర్థిక వ్యవస్థ చట్రంలో భాగంగానే మనం మాట్లాడుకుంటున్నామని. ఈ సంవాదం దాంట్లో భాగంగానే జరుగుతూ ఉంది. కాబట్టి దాన్ని నేను assume చేసుకుంటున్నా. సజ్జలు పండించుకోవచ్చు, జొన్నలు పండించుకోవచ్చు, వాటితో కూడా బతకొచ్చు. కాని ఏమవుతుందీ అంటే ఏమీ మిగలదు, ఏదీ అమ్ముడుపోదు, పిల్లల్ని చదివించటం సాధ్యం కాదు. పిల్లలు కూడా ఇంజనీరింగ్ తప్పితే చదువుకోరు. అది కూడా బతుకే అనుకోరు. అనుకుంటే బాగానే ఉండు. కానీ అనుకోవడం లేదు ఇవ్వాళ. కాబట్టి వడ్లే పండించుకోవాలి. అవి పండకపోతే వేరుశనగ పండించుకోవాలి. సన్‌ఫ్లవర్ పండించుకోవాలి. రాయలసీమ వ్యవసాయం ఇవ్వాళ ఎంత అస్థిరం అంటే ఏ కారణంగానైనా డిస్ట్రిబ్యూషన్ మార్కెట్లు దెబ్బతింటే రాయలసీమలో మళ్ళీ క్షామం రాగలదు. అయితే క్షామాలు గతించిపోయాయి. ఎందుకంటే మార్కెట్ పెరిగింది, రవాణా సదుపాయం పెరిగింది, ప్రజా పంపిణీ వ్యవస్థ ఒకటి వచ్చేసింది – కాబట్టి ఎంత కరువొచ్చినా క్షామాలు రావు, ఎక్కడ నుంచైనా వస్తాయి ధాన్యం అంటున్నారు. అది వాస్తవమే కొంతవరకు. కాని ఇవ్వాళ నడుస్తున్న ఆర్థిక సంస్కరణల్లో భాగంగా ప్రజా పంపిణీ వ్యవస్థను తగ్గించి, తగ్గించి మూసేస్తే... ఏ కారణంగానైనా రవాణావ్యవస్థ దెబ్బతింటే, రాయలసీమలో భయంకరమైన క్షామం రాగలదు. ఎందుకంటే అక్కడ తిండిగింజలు పండించట్లేదు. తెలంగాణ, ఆంధ్రా ఈ రెండు ప్రాంతాల్లోనే ఇవ్వాల్టికీ 70 శాతం తిండిగింజలు పండిస్తున్నారు. రాయలసీమలో దాదాపు 70 శాతం నూనెగింజలు పండిస్తున్నారు – అది పల్లీలు కావచ్చు, సన్‌ఫ్లవర్ కావచ్చు.

మనం మాట్లాడుకుంటున్న ఆర్థిక వ్యవస్థ చట్రంలో భాగంగా దీనికి ప్రత్యామ్నాయంగా వచ్చే ప్రశ్న ఏమిటీ అంటే–ఫ్యాక్టరీలు ఏమన్నా ఉన్నాయా, ఉద్యోగాలు ఏమన్నా వస్తున్నాయా–ప్రభుత్వ ఉద్యోగాలు ఎట్లాగూ లేవు–ఫ్యాక్టరీలో పనులేమన్నా దొరుకుతున్నాయా అన్న ప్రశ్న ఈ చట్రంలో భాగంగా వస్తుంది. నేను ఇంతకు ముందే అన్నా, ఈ చట్రాన్ని assume చేసుకుంటున్నా. దాంట్లో భాగంగానే మాట్లాడుకుంటూ ఉన్నాం మనం – వెనుకబాటుతనమైనా, అభివృద్ధైనా... ఫ్యాక్టరీలూ,

ఫ్యాక్టరీల్లో చూపించే పనీ–ఇవేమన్నా పెరిగినయ్యా అన్న ప్రశ్న దీంతోపాటు అనుబంధంగా వస్తుంది. ఇవ్వాళ ఉన్నటువంటి అభివృద్ధి నిర్వచనంలో దాన్ని లెక్కలోకి తీసుకుంటూ ఉన్నాం. దానిక్కూడా జవాబు ఏమిటీ అంటే–రాష్ట్ర జనాభాలో రాయలసీమ జనాభా 19 శాతం ఉంది. రాష్ట్ర ఫ్యాక్టరీల్లో రాయలసీమ ఫ్యాక్టరీల సంఖ్య 11 శాతం మాత్రమే. ఫ్యాక్టరీ కార్మికుల శాతం 5 మాత్రమే. మీకు అనుమానం రావచ్చు – ఫ్యాక్టరీల సంఖ్య 11 శాతం, కార్మికుల సంఖ్య 5 శాతం ఎందుకవుతారూ అని. అంటే చిన్నవి ఇవన్నీ కూడా. నాపరాయి పాలిషింగ్ మిల్లులు చాలా ఉన్నా, అందులో పనిచేసేవాళ్ళ సంఖ్య చాలా తక్కువ ఉంటుంది. అందువల్ల ఫ్యాక్టరీల సంఖ్య కొంచెం ఎక్కువగా కనపడినా అవన్నీ చిన్నమిల్లులు–స్టోన్ పాలిషింగ్ మిల్లులు లేదా లైమ్‌స్టోన్ ఫ్యాక్టరీలు–కావడం వల్ల కార్మికులు ఇంకా తక్కువ ఉంటారు. వ్యవసాయరీత్యా వెనుకబాటుతనంతో పాటు, పారిశ్రామికంగా ఉపాధి చాలా తక్కువ. ఇవ్వాళున్న పరిస్థితుల్లో ఇది తప్ప వేరే ఉపాధి మార్గాలనేవి లేవు.

1980 నుంచి కూడా రాయలసీమలో చాలామంది రచనలు చేస్తూ వస్తున్నారు రాయలసీమ ఏ విధంగా అభివృద్ధి కావాలి అని. ఒక భ్రమ ఒకటి – అపారమైన ఖనిజ సంపద రాయలసీమలో ఉందని, దానిని అభివృద్ధి చేస్తే బాగుంటుందని అంటూ ఉంటారు. నాకు తెలిసి అటువంటిదేమీ లేదిక్కడ. సంఖ్య రాసుకుంటె అనేక రకాలైన ఖనిజాలు ఉన్నాయి కానీ అపారమైనదేమీ లేదిక్కడ. ఉండేది లైమ్‌స్టోన్ ఒక్కటే. డోన్‌లో, లేకపోతే మన తాడిపత్రి, కొలిమిగుండ్ల, కొండాపురం – ఆ ప్రాంతాల్లో ఉంది. వాటితో ముద్దనూరు, ఎర్రగుంట్ల వంటి ప్రాంతాల్లో సిమెంట్ ఫ్యాక్టరీలు నడుస్తా ఉన్నాయి. అంతకంటె పెద్ద ఎక్కువేమీ లేదు. రెండోది ఇంటి నిర్మాణంలో పనికొచ్చే రకరకాల స్లాబ్ స్టోన్స్. అవేమీ కూడా పెద్దగా ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడానికి పనికొచ్చేవి కావు. ఇక మిగిలిన ఖనిజాలు చాలా కొద్దికొద్దిగా ఉన్నాయి. అవేమీ పెద్దగా ఆర్థిక అభివృద్ధికి ఆధారం కాగలవి కావు. అయినా ఒక భ్రమ ఒకటి రాయలసీమలో ఉంది. తమకు అపారమైన ఖనిజ సంపద ఉందని, అయినా తమను ఎవరూ పట్టించుకోవడం లేదు అనుకుంటున్నారు వాళ్ళు. వాస్తవంగా ఐతే లేవు. మరి ఎట్లా బతకాలి అంటే వనరులు బైటనుండి వస్తే తప్ప రాయలసీమ బాగుపడే అవకాశం లేదు. నీటి వనరులు కానివ్వండి, పెట్టుబడి వనరులు కానివ్వండి, ఇంకేదైనా కానివ్వండి. తెలంగాణ వనరులు ఉండీ, వాటిని వినియోగించని కారణం వల్ల అభివృద్ధి చెందని ప్రాంతమైతే, రాయలసీమ వనరులు లేక వాటిని తీసుకురాలేక పోవడం వల్ల అన్యాయం జరిగిన ప్రాంతం. ఆ తేడా ఉంది రెండు ప్రాంతాల్లో.

ఒకే ఒక విషయంలో బ్రిటిష్ పరిపాలనలో ఉండటం వల్ల ఇవ్వాల్టి ఆధునిక జీవితానికి తగినటువంటి పాలనా వ్యవహారాలు, ఇంగ్లీషు చదువులవీ అలవాటు కావడం వల్ల

విద్య ఒక్కదాంట్లో రాయలసీమ తెలంగాణ కంటె కూడా బాగా అభివృద్ధి అయింది, దాదాపు ఆంధ్ర ప్రాంతంతో సమానంగా. అందువల్ల మీకు హైదారాబాద్‌లో చాలా చోట్ల రాయలసీమవాళ్ళు ఉద్యోగాల్లో కనిపిస్తారు. హైకోర్టు  నిండా రాయలసీమ లాయర్లు కనిపిస్తారు. రాయలసీమలో కొట్లాటలు ఎక్కువ, లిటిగేషన్స్ ఎక్కువ కనుక హైకోర్టు నిండా రాయలసీమ లాయర్లే కనిపిస్తారు. ఒకే కులం అనుకోండి అంతా, కానీ మొత్తానికి కనిపిస్తారు హైకోర్టులో.

అదొక్క విషయంలో చారిత్రక కారణాల వల్ల వచ్చిన అభివృద్ధి ఉంది. రెండు ప్రధానమైన ప్రాజెక్టులు ఉన్నాయి. తుంగభద్రా డ్యాం నుంచి అనంతపురం జిల్లాకు ఒక హైలెవెల్ కాలువ, కర్నూలుకు ఒక లోలెవల్ కాలువ తీశారు. సుంకేసుల దగ్గర కె.సి.కెనాల్‌కు డ్యాం కట్టారు. రాజకీయ పార్శ్వంలో వచ్చినపుడు చెబుతాను. ఈ కె.సి.కెనాల్‌ను ముఖ్యంగా కడపజిల్లా నాయకులు చాలా సమర్థవంతంగా కాపాడుకుంటూ వచ్చారు. మన రాష్ట్రంలో కృష్టాడెల్టా, గోదావరి డెల్టా, వంశధార స్టేజ్-1 ఈ మూడింటితో సమానంగా కాపాడబడ్డ ప్రాజెక్టు అంటే కె.సి.కెనాల్ ప్రాజెక్టే. ఎప్పుడూ కూడా దాని ఆయకట్టు కంటే ఎక్కువ నీళ్ళు తీసుకుంటూనే ఉన్నారు. అయినా చాలదంటూనే ఉంటారు ఎప్పుడూ. ఇంకా కె.సి.కెనాల్ బాగుచేస్తానని జలయజ్ఞంలో అదనంగా కూడా పెట్టుకున్నాడు రాజశేఖరరెడ్డి. చెయ్యొద్దని కాదు కానీ సమదృష్టి ఉండాలా, అక్కర్లేదా అన్నది ప్రశ్న. ఇవ్వాళ పోరుమామిళ్ళ ప్రాంతానికి పోయి చూస్తే అర్థమవుతుంది, ఎంత దుర్భరంగా ఉంది అక్కడ జీవితం అనేది. అన్ని ప్రాంతాలకు ఒకే రకమైన ప్రాముఖ్యాన్నిచ్చి అవసరాన్ని బట్టి చేయాలి. చెయ్యకపోవడం సహజంగానే ఆగ్రహం తెప్పిస్తుంది. తప్పు కూడా కాదది.

తుంగభద్ర హై లెవెల్, లోలెవెల్ కెనాళ్ళు బాగా పాడయినా, వాటిని పట్టించుకునే పరిస్థితి లేదు. తుంగభద్ర డ్యాంలో పూడిక చాలా ఉండటం వల్ల నీళ్ళు నిలవడం లేదు. కాబట్టి కాలువల్లోకి పోయేలోపునే అది పొర్లొచ్చేస్తోంది. తుంగభద్ర హైలెవెల్ కెనాల్, లోలెవెల్ కెనాల్ రెండూ కూడా కొంత కర్ణాటకకు, కొంత మనకు వస్తాయి. అందుచేత కర్ణాటక వాళ్ళే సమాంతర కాలవ తీద్దామని చాలాకాలంగా ఒక ప్రతిపాదన చేస్తున్నారు. ఇది చాలా సులభమైన విషయం. కాని ఆంధ్రప్రదేశ్ ఒప్పుకోవడం లేదు. ఎందుకంటే ఆ నీళ్ళు అనంతపురానికి పోతాయి. అనంతపురం అంటె పట్టింపు లేదు. రాజశేఖరరెడ్డికీ లేదు. ఎవరికీ లేదు. దీనికి ఖర్చక్కర్లేదు. సగం సగం పంచుకోవచ్చు, భారీ ప్రాజెక్టులక్కర్లేదు. ఇప్పటికే కాలువ ఉంది. అయినా చెయ్యరు. రాజశేఖరరెడ్డి జల రాజకీయాలలో కీలకమైన అంశం ఏమిటంటె కాంట్రాక్టర్లకు

భారీగా పైసలొచ్చే పనులు మాత్రమే జరుగుతాయి. డ్యాం ఇప్పటికే ఉంది కాబట్టి ఎక్కువ పైసలు రావు.

అదిలాబాద్ జిల్లాలో పెన్‌గంగ ప్రాజెక్టు ఒకటి ఉంది. సందర్భం కాబట్టి చెబుతున్నాను – రాజకీయాలను అర్థం చేసుకోవడానికి. మహారాష్ట్రలో ప్రాజెక్టు కట్టేశారు వాళ్ళు ఖర్చు పెట్టుకుని. వాళ్ళేమి అడుగుతున్నారంటే–మాకు పైసలు కొంత ఇవ్వండి, ఒక కాలువ తవ్వుకొని పొండి అని. ఆదిలాబాద్ జిల్లాలో జైలన్, బేల, తాంసీ బాగా వెనుకబడిన మండలాలు. అక్కడ 40 వేల ఎకరాలకు నీళ్ళొస్తాయి. కాని మొత్తం జలయజ్ఞంలో అది ఎక్కడా కనిపించదు. ఏమంటె కాంట్రాక్టర్లకు ఏమీ రాదు. వారి జల రాజకీయాలను అర్థం చేసుకోవాలంటె ఇది కూడా దృష్టిలో పెట్టుకోవాలి. అనంతపురానికి నీళ్ళిచ్చే HLC దగ్గర నుండి ఆదిలాబాద్‌కి నీళ్ళిచ్చే పెన్‌గంగ వరకు ఎందుకు వాటి ప్రస్తావన ఉండదు అంటె రాజశేఖరరెడ్డిగారి మనసు నిండా ఉండేది సివిల్ కాంట్రాక్టరు యోగక్షేమాలు మాత్రమే. ఆ కాంట్రాక్టరుకు పనికిరాని ప్రాజెక్టు వారికి అక్కర్లేదు. అది పక్కన పెడదాం అనుకుంటాడు. అందువల్ల ఏమైందీ అంటె నదీజలాల నుండి ఇప్పటికే కట్టిన ప్రాజెక్టుల ద్వారా ఏ మేరకైతే ప్రయోజనం వచ్చి ఉండగలదో ఆ మేరకు కూడా రాని పరిస్థితి ఇవాళ ఏర్పడింది రాయలసీమలో. సమస్య ఎట్లా పరిష్కారమవుతుంది అనే దాని కంటె ముందు రాయలసీమ సామాజిక స్థితిని కొంత అర్థం చేసుకుంటె బాగుంటుంది. రామ్మోహన్ ప్రస్తావించారు– రాయలసీమ అనగానే ఫాక్షన్‌లు అని ఒక కారికేచర్ తయారయింది అని. కారికేచర్ అయిన మాట వాస్తవమే కావచ్చు కానీ వాస్తవం కూడా అది. ఈ వాస్తవం వల్ల చాలా నష్టపోయింది రాయలసీమే, వేరే ఎవరూ కాదు.

కనీసమైన ప్రజాస్వామిక రాజకీయ వ్యవస్థ గానీ, ఇంతకంటె మెరుగైన జీవితం సాధించుకోవడానికి–నిర్వచనాల్లోకి పోకుండా అభివృద్ధి అందాం టూకీగా–అవసరమైన ఉద్యమ చైతన్యం గానీ, ప్రజా ఉద్యమాల ఒత్తిడి గానీ లేకపోవడం రాయలసీమ అభివృద్ధి కాకపోవడానికి ఒక ముఖ్యమైన కారణం. ఇక్కడున్న పెత్తందారీ వర్గం తాము ఏవైతే ముఖ్యమని అనుకున్నారో వాటిని రాష్ట్ర రాజకీయాలలో ఒత్తిడి పెట్టి, దౌర్జన్యం కూడా చేసి సాధించుకున్నారు. మీరు కడపనూ, మహబూబ్‌నగర్‌నూ పోలిస్తే వర్షపాతం కడపలోనూ, మహబూబ్‌నగర్‌లోనూ దాదాపు ఒకటే. కాబట్టి నైసర్గికమైన అననుకూలత రెండు ప్రాంతాల జనజీవనంలోనూ ఒకటే. కానీ కడపజిల్లాకు మన దినపత్రికల పరిభాషలో సమర్థవంతమైన నాయకులు – రౌడీ నాయకులు అందాం వాళ్ళని – ఉన్నారు. మహబూబ్‌నగర్‌కి లేరు. మహబూబ్‌నగర్‌కు సాధారణ రాజకీయ

నాయకులు కూడా లేరు. కాబట్టి మహబూబ్‌నగర్‌కు భీమా ప్రాజెక్టు రాలేదు. జూరాల సగం, సగం జరిగి ఆగిపోయింది. కె.సి.కెనాల్ మాత్రం భద్రంగా తయారయింది.

ఆ నాయకులకు చేతనయినది ఏమిటంటే తాము కావాలని అనుకున్నదాన్ని రకరకాల రూపాల్లో దౌర్జన్యం చేసైనా, ఒత్తిడి పెట్టైనా తెచ్చుకుంటున్నారు వాళ్ళు. సరే దానివల్ల బాగా వెనుకబడిన ప్రాంతాలకు నీళ్ళు కొన్ని వచ్చాయి, కాదనడం లేదు. కానీ ఈ రకమైన రాజకీయాలు సాగితే – ఎప్పుడైతే ఒత్తిడి పెట్టేవాళ్ళు, దౌర్జన్యం చేసేవాళ్ళు సాధించగలుగుతారో, వేరే వాళ్ళు సాధించలేరో... అప్పుడు అసమానతలు పెరుగుతాయి. అది లేనివాళ్ళ మధ్య అసమానతలు. లేమిలో అసమానతలు పెరిగితే అది మరింత ఎక్కువగా విద్వేషానికి, నష్టానికి దారి తీస్తుంది. ఇవ్వాళ అదే జరుగుతూ ఉంది. ప్రజాతంత్ర వాతావరణంగానీ, ప్రజాతంత్ర రాజకీయాలకు ఒక స్థానంగానీ రాయలసీమలో చాలా తక్కువ. మొదటి మూడు నాలుగు పార్లమెంట్ ఎన్నికల్లో కడప ఎం.పి – సి.పి.ఐకి చెందిన వ్యక్తే. కాని ఎట్లా గెలిచారు అంటే ఈ రకరకాల ఫ్యాక్షనిస్టులతో మంచి సంబంధాలు పెట్టుకొని, మంచివాడు అనిపించుకొని. నువ్వు, నేను కొట్టుకోవడం ఎందుకు, వాడికి ఓట్లు వేస్తే సరిపోతుంది కదా అనుకున్నారు మొదట్లో. కాలక్రమంలో అది కూడా లేకుండా పోయింది. ఆ కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు కూడా గ్రామీణ ప్రాంతాల కొచ్చేసరికి, గ్రామ రాజకీయాలలో ఫ్యాక్షనిస్టులుగా వ్యవహరించడం మొదలుపెట్టారు.

సాహిత్యకారులకు కోపం రావచ్చు. రాచమల్లు రామచంద్రారెడ్డి గురించి ఒక కథ చెప్తారు, కడపలోనే చెప్తారు. చాలా చదువుకున్నవాడు. నేను చూళ్ళేదు ఎప్పుడూ. కాని ఆయన గురించి వింటే నెమ్మదస్తుడు, పెద్దమనిషి అని అనుకుంటాం. పులివెందులకు పోతే మాత్రం... ఆయన ఊళ్ళో ఉన్నపుడు ఎవరో వచ్చి – అన్నా అవతలి వాళ్లు ఓట్లు వేస్తున్నారు అని చెపితే, ఏనా కొడుకురా ఓట్లు వేసేది అని ఆయన కొడవలి తీసుకుని పోయాడంటారు. అంటే కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, నాయకులు కూడా గ్రామీణ ప్రాంతాల ముఠాకక్షల వాతావరణం కొచ్చేటప్పటికి అంతకంటె భిన్నంగా వ్యవహరించలేని పరిస్థితి. లోతుగా విశ్లేషిస్తూ మేం రిపోర్టులు వేసాం. ఒకసారి చదివితే అర్థం అవుతుంది – కమ్యూనిస్టు రాజకీయాలు ఏ విధంగా తమకే తెలియకుండా ఈ ఫ్యాక్షన్లు పెరగడానికి దోహదం చేశాయన్నది. మనకు చరిత్రలో అది చాలా స్పష్టంగానే కనిపిస్తుంది. రామ్మోహన్ అన్నారు ఫ్యాక్షన్లు అంటే కేవలం హత్యలు కాదు, అధికారాన్ని, వనరులనూ గుప్పెట్లో పెట్టుకోవడానికి ఒక సాధనం అని. తొలినాడు అది కాదు. తొలినాడు గ్రామాలలో పెత్తనం కోసం పోటీ

ఉండేది. ఒక రెడ్డి ఇటువైపు ఉంటే, ఒక రెడ్డి ఆవైపు... పెత్తనం నీదా, నాదా... ఊళ్ళో పెద్దరికం నీదా నాదా అని కొట్లాటలు ఉండేవి. వాళ్ళు గమనించిందేమిటంటే ఈ కొట్లాటల్లో భాగంగా గ్రామాన్ని చీల్చి కంట్రోల్లో పెట్టుకోగలుగుతున్నామని. సగం గ్రామం, ముప్పావు వంతు గ్రామం వింటారు చెప్పిన మాట అన్నప్పుడు దీన్ని రాజకీయాల్లో ఎందుకు ప్రయోగించకూడదు అన్న ఆలోచన 1960ల నుంచీ వచ్చింది. రాజకీయాల్లో దీన్ని ప్రయోగిస్తే ఇంక ఏ హామీనీ ఇవ్వనక్కర్లేదు. ఏ చేతిబోరూ వేయనక్కర్లేదు. ఏ రోడ్డూ వేయించనక్కర్లేదు. ఎన్నికల్లో గెలుస్తూ ఉండవచ్చు. సివిల్ కాంట్రాక్టుల్లో దీన్ని ప్రయోగిస్తే ఎవర్నీ అడుక్కోనక్కర్లేదు. ఎవరికీ డబ్బులిచ్చి మాన్పించనక్కరలేదు. దౌర్జన్యంగా కాంట్రాక్టులు చేసుకోవచ్చు.

ఈ అవగాహన 1960, 70ల నుంచీ పెరిగింది. ఎమర్జెన్సీ తర్వాత మొదటితరం నాయకులైన వై.ఎస్. రాజశేఖరరెడ్డి దీన్లో ప్రధానుడు. ఎం.వి. రమణారెడ్డి, మిగతావాళ్ళు దీన్ని పెద్దఎత్తున అసెంబ్లీ, పార్లమెంట్ రాజకీయాల్లోకి తీసుకువచ్చి ఒక వినాశకరమైన వాతావరణాన్ని రాయలసీమలో తయారుచేసారు. రాజశేఖరరెడ్డి అయితే కడపజిల్లాకే పరిమితం కాలేదు. కర్నూలు, అనంతపురం ఎక్కడైతే అక్కడ తన మనషులకు వ్యతిరేకంగా ఎవరూ ఎదగడానికి వీల్లేదు. ఎవడైనా వ్యతిరేకమైనవాడు ఒక ప్రాంతంలో ఏకగ్రీవంగా నాయకుడిగా ఉంటే వాడికి వ్యతిరేకంగా ఒకణ్ణి పుట్టించాలి. ఒకణ్ణి రెచ్చగొట్టాలి. వాడికి బాంబులియ్యాలి. వాడికి ధైర్యమివ్వాలి. హత్యలు చేయడాన్ని ప్రోత్సహించాలి. ఎదుటివాణ్ణి నాశనం చెయ్యాలి. చేసుకుంటూ వచ్చాడు. ఇక్కడ నేను చెప్పదలచుకున్న ఒక విషయం చాలామందికి బహుశ కొంత ఇబ్బంది కలిగించేది ఏమిటంటే ఇది కేవలం నాయకుల్లో మాత్రమే ఉంది అనుకుంటే పొరపాటు. కేవలం నాయకుల్లో మాత్రమే ఈ రకమైన సంస్కృతి ఉందని అనుకోవద్దు. దౌర్జన్యం చేసి, ఏమైనా చేసి సాధించుకోవచ్చు, తప్పేమీలేదు. ఒక పద్ధతి అవసరం లేదు, ఒక ప్రమాణం అవసరం లేదు అనే ధోరణి అందరిలో ఉంది. ఇవ్వాళ రాజశేఖరరెడ్డి ఎట్లా రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నారో చూస్తున్నాం. మనం అంటూ ఉంటాం ఎట్లా చేస్తావయ్యా ఈ పని నువ్వు? అని. నదీజలాల విషయంలో ఎవరి వాటా ఎంతో నిర్ణయించిన తర్వాతే ప్రాజెక్టు కట్టు అంటే ఆయనకు అర్థం కాదు. ఎందుకంటే ఏదైనా ఒక పని చేయడానికి ఒక నియమం ఉండాలి అనే భావనే అర్థం కాదు ఆయనకి. అధికారం ఉంది, నేను చేస్తానంటాడు. నియమబద్ధంగా పరిపాలన చెయ్యాలి, నియమబద్ధంగా బతకాలి అన్న భావనే లేకపోవడం ఆయన ఒక్కడి ప్రత్యేకతేమీ కాదు. సాధారణ సామాజిక సంస్కృతిలోనే ఒక అంశంగా ఉంది కాబట్టి వాళ్ళది సాధించు కోగలుగుతున్నారు, చెయ్యగలుగుతున్నారు. ప్రజలు వీళ్ళ దగ్గరికి

పోకపోతే – తప్పు మార్గమైనా ఒప్పుమార్గమైనా నా అవసరం తీరాల్సిందే అని ప్రజలు ఒక నాయకుడు దగ్గరకు పోకపోతే – నాయకులు నాయకులు కారు. పోతారు జనం వారి దగ్గరికి. చాలాకాలం నుండి ఈ మాట అంటూ ఉన్నాను. నియమబద్ధమైన జీవితం ఉండాలి. సామాజిక జీవితం ఆ రకంగానే ఉండాలి, ఆ రకంగానే సమస్యలు పరిష్కారం కావాలి అన్న సంస్కృతి అభివృద్ధి కాకపోతే ఫాక్షనిజం పోదు రాయసీమలో. దాన్ని పోగొట్టడానికి ఏ మేరకు రాజకీయ ఉద్యమాలు కృషి చేయగలుగుతాయి అన్నది ప్రశ్న. అది జరగనంతకాలం నాయకులను ఎంత తిట్టినా, ఫాక్షనిస్టులను ఎంత తిట్టినా మనం తిట్టిన వాళ్ళమే అవుతాం. తిట్టినందుకు మనల్ని గౌరవిస్తారు కూడా.

నాకు బాగా జ్ఞాపకం – అప్పట్లో సంధ్యగారి నాయకత్వంలో కర్నూలు జిల్లాలో మంచి ఉద్యమం నడిచింది, భూస్వామ్య సాయుధ ముఠాల వ్యతిరేక పోరాటం అని. మేం దాంట్లో పాల్గొన్నాము. కోయిలకుంట్లలో మీటింగ్ పెట్టినపుడు పెద్దవాళ్ళొచ్చి ఏడుస్తూ తలచుకున్నారు – ఇట్లా మాట్లాడొచ్చని తెలియదు మాకని. అది కూడా విజయమే. కాదని నేననడం లేదు. కానీ అక్కడే ఆగిపోకూడదు. ప్రజా జీవిత సంస్కృతిలోనే ప్రజాస్వామిక విలువలను పెంపొందించకపోతే ఫాక్షనిజం పోదు. ఆ సంస్కృతి అనేది సాధారణ జీవితంలో ఉండబట్టే ఈ నాయకుల ఆధిపత్యమనేది, ఫ్యాక్షనిజం అనేది వర్ధిల్లగలుగుతోంది. దీన్ని పోగొట్టడానికి ఎవరూ ఏ కార్యాచరణా, ఏ రచనా చేస్తున్నట్టు నాకైతే అనిపియ్యడం లేదు. ఒక ఉదాహరణను చాలా మీటింగ్‌ల్లో కూడా చెప్పాను. చిత్తూరు జిల్లాలో దామల చెరువు నుంచి పీలేరు దగ్గర ఒక గ్రామానికి పోవాల్సివచ్చినప్పుడు బస్ లేక ఏదో పౌల్ట్రీవ్యాన్ పోతుంటే ఎక్కాను. అక్కడ లెవెల్ క్రాసింగ్ గేట్ ఉంది. దసరా పండగ దగ్గరపడ్డ రోజులవి. ఆ గేట్‌మాన్ గేట్ వేసేసి – రైలు రావడం లేదు – డబ్బులు వసూలు చేసుకుంటున్నాడు. 10 రూ, 20 రూపాయలు... రోజూ వచ్చి పోతావు కదా ఇవ్వు అని. మిగతా చోట్ల కూడా చేస్తారు... కాని ఎపుడు చేస్తారు? రైలొచ్చినపుడు గేట్ వేసి ఉన్నపుడు రోజూ వచ్చే బండొస్తే నాకు మామూలియ్యవయ్యా అని అడుక్కుంటారు. అది మామూలే, అలవాటే అది. ఇక్కడ అలా కాదు. గేటు నా చేతిలో ఉంది కాబట్టి వేసేస్తా, వేసి తీసుకుంటా పైసల్నేను. చాలా చిన్న విషయమే. కాని అది కల్చర్‌లో భాగం అయినపుడు ఏమవుతుందంటే ఆధిపత్య రాజకీయాలు, పెత్తందారీ రాజకీయాలు, దౌర్జన్యం చేసి ఏదైనా సాధించుకోవచ్చుననే రాజకీయాలకు ఒక పునాది ఏర్పడుతుంది. అది ఏర్పడింది.

ఇది రాయలసీమను భయంకరంగా నాశనం చేసింది. రాయలసీమకే నష్టం చేసింది. వేరే వాళ్ళు అంటున్నారు, వెక్కిరిస్తున్నారు అని కోపమొస్తే ఏం ప్రయోజనం?

నష్టపోయింది రాయలసీమ. దాన్ని పోగొట్టుకోవాలి. ఎట్లా పోగొట్టుకుంటామన్నది ఆలోచించుకోవాలి. మళ్ళీ మళ్ళీ ఆ నాయకుల వెనకాలే పోతూ ఉండటం కాదు. బహుజన సమాజ్ పార్టీ, బహుశ 1994 ఎన్నికలప్పుడనుకుంటాను, ఒక వెలుగు వెలిగింది. బహుజన సమాజ్ పార్టీ దళితుల పార్టీ. ఏమి ఆఫీసులుంటాయి దానికి? ఒక చిన్న మురికివాడలో దానికి ఒక రూం ఉండేది. ఎన్నికలు వచ్చేసరికి కడపలో అది నాలుగు రూమ్‌ల ఆఫీసు అయింది. ఎవరిచ్చారయ్యా అంటే వై.ఎస్. ఇచ్చాడు అని చెప్పారు. ఆయన పిలిచి అన్నాడట– ఆఫీసు పెట్టుకోండి. రాజకీయాలు అవసరం కదా చెయ్యండి అని. ఆయన అనడం ఆశ్చర్యం కాదు, వీళ్ళు తీసుకోవడం ఆశ్చర్యం. దాన్ని వ్యతిరేకించేటటువంటి రాజకీయ సంస్కృతి పెంపొందించకపోతే కష్టం అవుతుంది. ఈ పెత్తందారీ, అప్రజాస్వామిక రాజకీయాలు జీవితాలు బాగు చేసుకోవడానికి అవసరమైన – నేను విప్లవాల గురించి మాట్లాడడం లేదు – కనీస ప్రజాతంత్ర ఆచరణకు కూడా ఆటంకంగా ఉన్నాయనేది వాస్తవం.

ఏ యూనియన్‌కు పొండి, యూనియన్ నాయకుడు ఈ రెడ్డి లేదా ఆ రెడ్డి ఉంటాడు. అంటే నేను కులాల గురించి మాత్రమే మాట్లాడడం లేదు. కులం గురించి మాట్లాడతా కాని అది మాత్రమే మాట్లాడటం లేదు. ఇక్కడ రెడ్డి ఎవరు అంటే ఎవరో ఫ్యాక్షనిస్టు. కారణం అడిగితే ఏమంటారు యూనియన్ నాయకులు? ఎవరో ఒకరి దగ్గరికి పోకపోతే అవతలివాడు ఇంకొకరి దగ్గరకు పోతాడు కదా అంటారు. అవతలివాడు పోకమునుపే నేను పోతే నా ప్రయోజనాలు కాపాడబడతాయి కదా అంటాడు. ఏం జరుగుతుంది చివరికి? కొట్లాట అవుతుంది. మీరు చస్తారు. లేదా జైలుకి పోతారు. వాళ్ళు బాగానే ఉంటారు. అది కూడా ముఖ్యమైన విషయం కాదు. ప్రజాతంత్ర వాతావరణం ధ్వంసం అవుతుంది. అది ఇప్పటికే ధ్వంసమయ్యింది. దానికి అనుబంధంగా చెప్పుకోవలసిన విషయం ఏమంటె చాలా తరచుగా రాయలసీమ ప్రయోజనాల గురించి వింటూ ఉంటాం మనం. రాయలసీమకు మేలు చేసారనో, మేలు చేయలేదనో, రాయలసీమ ప్రయోజనాలు ఇవనో, అవనో అంటూ ఉంటారు. ఇదంతా కూడా ఒక్క ప్రాంతానికి చెందిన మాటలు మాత్రమేనన్న సంగతిని గుర్తించాలి. బయటివాళ్ళు రాయలసీమ అని వినేదంతా కూడా కడపజిల్లా పడమటి భాగం, కర్నూలు జిల్లా తూర్పు భాగం. పాలకొండ నుంచి ఎర్రమల కొండలదాకా మధ్య ఉండే ప్రాంతం. అటునుండి – నంద్యాల, ఆళ్లగడ్డ, కోయిలకుంట్ల, జమ్మలమడుగు; ఇటునుండి ప్రొద్దుటూరు, మైదుకూరు, పులివెందుల, కడప – ప్రాంతం. ఇదంతా కూడా పెన్నా నది పరీవాహక ప్రాంతం. కుందూ పరీవాహక ప్రాంతం. నల్లరేగడి నేలలున్న ప్రాంతం. సారవంతమైన నేలలున్న ప్రాంతం.

కె.సి.కెనాల్ నీళ్ళొచ్చే ప్రాంతం. మైలవరం ప్రాజెక్టు నీళ్ళొచ్చే ప్రాంతం. ఇక్కడుండే రెడ్డి కులస్తులెవరైతే ఉన్నారో వాళ్ళ ఆధిపత్యం రాయలసీమ పేరుమీద నడుస్తూ ఉంటుంది. నాకు బాగా జ్ఞాపకం. దళితోద్యమ కార్యకర్త ఒకరు దీనికి రెడ్డిస్తాన్ అని పేరు పెట్టాడు. ఈ రెడ్డిస్తాన్ వాక్కే రాయలసీమ వాక్కయి వినబడుతూ ఉంది. ఆర్.ఎస్.రావుగారు అన్నారు – మర్చిపోవద్దు వర్గ విశ్లేషణను అని. ఇది కూడా ఒక వర్గమేనని నేననుకుంటాను. వర్గమంటే ఒక సాంఘిక నిర్మాణం. దానికి వ్యతిరేకమైన వాక్కును ఎక్కడా బలంగా రానీయలేదు.

ఎంతమందికి తెలుసు నల్గొండ జిల్లా మునుగోడు, నారాయణపురం ప్రాంతాల్లో ఉన్నట్లుగా కర్నూలు జిల్లాలోని పత్తికొండ తాలూకాలో కూడా ఫ్లోరైడ్ సమస్య ఉందని? ఎవరూ మాట్లాడలేదు దాని గురించి. మాట్లాడే నోరు లేదిక్కడ. రాయలసీమ గురించి గొంతు చించుకునేవాళ్ళెవరూ మాట్లాడరు దాని గురించి. అదే రకంగా మార్కాపురం ప్రాంతంలోనూ ఫ్లోరైడ్ సమస్య ఉంది. అదీ ఎవరూ మాట్లాడరు. ఈ వాయిస్ అంతా, గొంతంతా కూడా రెడ్డిస్తాన్ నుంచే వస్తుంది. బయటి వాళ్ళు ఎవరన్నా మాట్లాడినా ఈ గొంతుతోనే మాట్లాడతారు. ఈ ప్రాంతం గురించే మాట్లాడతారు. అది కూడా చాలా నష్టం చేసింది. ఎందుకంటే జలరాజకీయాలేవైతే రాజశేఖరరెడ్డి చేస్తూన్నాడో అదంతా కూడా రెడ్డిస్తాన్‌కు నీళ్ళిచ్చేవే. గాలేరు – నగరైనా, తెలుగుగంగైనా, గండికోటైనా – చివరికి ఆ ప్రాంతాన్ని నూటికి నూరుశాతం సాగునీరు లభించే ప్రాంతంగా మార్చదలుచుకున్నాడాయన. ఉండదెక్కువ కాలం కానీ ఉంటే మాత్రం మార్చదల్చుకున్నాడాయన. ఖనిజాలు ఉన్నాయన్నారు కానీ పెద్దగా లేవిక్కడ. ఎం.వి.రమణారెడ్డిగారి పుస్తకాలు చదివితే అపారమైన ఖనిజ సంపద ఉందని రాస్తూ ఉంటాడాయన.

రాయలసీమ గురించి 'కదలిక' అని ఒక పత్రిక వస్తుంది. నేను వాళ్ళని తప్పు పట్టడం లేదు కాని లైమ్ స్టోన్, స్లాబ్ స్టోన్ తప్ప రాయలసీమలో వేరేమీ లేవు. అవి రెండూ కూడా పెద్దయెత్తున పారిశ్రామికంగా ఉపయోగపడే ఖనిజాలు కావు. స్వతహాగా నీటి వనరులు లేవు. ఈ మధ్య కాలంలో అంటున్నారు – వనరులే ఉండనక్కర లేదు, నాలెడ్జ్ ఇండస్ట్రీ కూడా రావచ్చు అని. ఇవ్వాళ విజ్ఞానమే ఒక వనరు. కాబట్టి ఎడారిలో కూడా డెవలప్‌మెంట్ రావచ్చు అని అంటున్నారు. కాని జమ్మలమడుగులో, రాయచోటిలో, ఉరవకొండలో ఐ.టి. ఇండస్ట్రీస్ పెట్టే వాళ్ళను నేనింతవరకు చూడలేదు. వచ్చినప్పుడు చూద్దాం. దాన్ని నమ్ముకుంటే చాలా కష్టం. మరింక ఎక్కడ్నుంచి రాయలసీమకు డెవలప్‌మెంట్ రావాలన్నది చాలా పెద్ద ప్రశ్న. సాగునీరు మరింత

ఎక్కువగా రావడం – ఇది జరక్కపోతే ఇక ముందుకు పోయే అవకాశం ఉండదు. అది మాత్రం వాస్తవం. అది ఎక్కడ నుంచి రావాలి? ఇక మన రాష్ట్ర జల రాజకీయాల దగ్గరకు వస్తాను.

రాజశేఖరరెడ్డిగారు జలయజ్ఞం పేరు మీద ఏదైతే మాట్లాడుతున్నాడో ఈ జల రాజకీయాల వల్ల జరుగుతున్న ముఖ్యమైన నష్టం తెలంగాణ, రాయలసీమ మధ్య ఒక విద్వేషపూరితమైన వాతావరణం పెరగడం. దీంట్లో పెత్తందారీ రాజకీయాల్లో ఉండే వాళ్ళు మాత్రమే పాల్గొంటే ఆశ్చర్యమేమీ లేదు కానీ ప్రజాతంత్ర ఉద్యమాలు కూడా భాగమవుతున్నాయి. ప్రజాతంత్ర భావాలుగల రాజకీయ కార్యకర్తలు, రచయితలు, మేధావులు కూడా భాగమవుతున్నారు. ఒక చిన్న ఫార్ములా తోటి నడుస్తోంది ఈ ఘర్షణ అంతా కూడా. అవతలవైపు తెలంగాణలో విద్యాసాగరరావుగారు కృష్ణానది మిగులు జలాలలో రాయలసీమకు ఒక్క చుక్క కూడా హక్కులేదు అంటున్నారు. నికర జలాల్లో బచావత్ అవార్డు ఇచ్చింది కాబట్టి ఉందన్నారు. విద్యాసాగరరావు గారికి అది కూడా ఇష్టం లేదు కానీ బచావత్ అవార్డు ఇచ్చింది కాబట్టి ఉందని అన్నారు.

విద్యాసాగరరావుగారు టి.ఆర్.ఎస్ నాయకుడు మాత్రమే కాదు. టి.ఆర్.ఎస్ సాగునీటి సిద్ధాంతవేత్త మాత్రమే కాదు. తెలంగాణ ఉద్యమానికే సాగునీటి సిద్ధాంతవేత్త. ఆయన అభిప్రాయాన్ని ఈ విషయంలో తప్పు అన్నవాళ్ళనెవర్నీ చూడలేదు తెలంగాణలో. ఇటు రాయలసీమ కొచ్చేసరికి ఎం.వి.రమణారెడ్డి, రాజశేఖరరెడ్డి వాళ్ళ కాలం నుంచి కృష్ణానది మిగులు జలమంతా రాయలసీమకే, తెలంగాణ గోదావరితో సరిపెట్టుకోవాలి అంటూ వస్తున్నారు. పూర్తిగా పరస్పర విరుద్ధమైన ఆలోచనలు. రాయలసీమలో కూడా కృష్ణానది మిగులు జలాలు మొత్తం రాయలసీమకే అనే అభిప్రాయం తప్పు అన్నవాళ్ళను, ప్రజాతంత్ర వాదులతో సహా, ఇప్పటిదాకా చూళ్ళేదు. మాబోటి వాళ్ళం మాట్లాడితే కోపం. కడపలో నేనంటే చాలా ద్వేషం ఉంది. పోతిరెడ్డిపాడును వ్యతిరేకిస్తున్నాడు, కడపకు అన్యాయం చేస్తున్నాడు అని. నేనేం ఆపలేదు దాన్ని. తప్పు అంటున్నానంతే. మేం చేయగలిగింది పెద్దగా ఏమీ లేదు. అది వేరే సంగతి. ఈ వాతావరణం పోవాలీ అని అంటే కృష్ణా జలాలకు సంబంధించిన ఒక వాస్తవికమైన ప్రజాతంత్ర స్వభావం కలిగిన చర్చ అవసరం. చాలా వివరంగా మాట్లాడుకోవచ్చు కానీ క్లుప్తంగా మాట్లాడతాను. మరోసారి ఎప్పుడైనా దీనిమీద మాట్లాడుకోవచ్చు 24 గంటలసేపు. ఎందుకంటే ఇది రాబోయే రోజుల్లో చాలా కీలకమైన విషయం అవుతుంది.

తెలంగాణ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగానే ఉన్నా, వేరైనా ప్రజల మధ్య విద్వేషాలు చాలా చాలా నష్టకరం. చాలా బాధాకరం. దానికి ఇది దోహదం చేస్తుంది. రాజశేఖరరెడ్డి

ఆయన ఆలోచన చెప్తూ వస్తున్నారు. రాయలసీమలో చాలామంది ఆయనకు ఓకే అంటున్నారు. ఎట్లయిపోయిందంటే కృష్ణాజలాల గురించి సూత్రబద్ధంగా మాట్లాడితే తెలంగాణ మిత్రులేమో రాయలసీమకు హక్కు ఉందని అనాల్సి వస్తుంది. కాబట్టి సైలెంట్‌గా ఉందామనుకుంటున్నారు. రాయలసీమ మిత్రులేమో ఎందుకు అనవసరంగా – రాజశేఖరరెడ్డి ఏదో చేస్తున్నాడు కదా చెయ్యనియ్యరాదు – మాట్లాడితే తప్పో ఒప్పో అనవలసి వస్తుందని వీళ్ళు కూడా సైలెంట్‌గా ఉంటున్నారు. ఆ విధంగా రాజశేఖరరెడ్డి లాభపడుతూ ఉన్నాడు. ఎట్లా లాభపడుతున్నాడంటే పూర్తిగా అహేతుకమైన, అన్యాయమైన వైఖరిని రెండవ కృష్ణా ట్రిబ్యునల్ దగ్గర తీసుకోవడం ద్వారా. ఆయనకు నీళ్ళక్కరలేదు. కాంట్రాక్టులు కావాలి. కాంట్రాక్టులు మాత్రం అద్భుతంగా ఇచ్చేసుకుంటూ పోతున్నాడు. మిత్రులకు జేబులు నిండుతున్నాయి. నష్టమంతా జరిగిపోతోంది. మనమెవ్వరం మాట్లాడం. ప్రజాతంత్ర శక్తులు మాట్లాడవు. ఆయన ఏమంటున్నాడు అక్కడకు పోయి – కృష్ణా నది మీద మిగులు జలాల ఆధారంగా అనేక ప్రాజెక్టులు మేమూ కట్టిస్తున్నాము అని చెపుతున్నాడు. ఇప్పటికే కాలువలు తవ్వేస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడికిపోయినా ఇక రాజశేఖరరెడ్డి కాలువలే కనిపిస్తాయి.

వరంగల్లు పోతే కాకతీయ శిథిలాలు ఉంటాయి. ఇంకో పదేళ్ళకు రాష్ట్రమంతటా రాజశేఖరరెడ్డి శిథిలాలు ఉంటాయి. ఎక్కడకు పోయినా కాలువలుంటాయి. అర్థం కాదు ఎవరికీ కూడా. అప్పుడు చరిత్రకారులు చెప్పాలి – ఈ కాలువలేమిటని. కృష్ణా ట్రిబ్యునల్‌కు పోయి ఏమంటాడాయన – ఇన్ని ప్రాజెక్టులు కడుతున్నామిక్కడ... మహబూబ్‌నగర్‌కు నెట్టెంపాడు, కల్వకుర్తి, నల్గొండకు శ్రీశైలం ఎడమగట్టు కాలువ, ఎలిమినేటి మాధవరెడ్డి కాలువ, దానికి మరో తోక వరద కాలువ కూడా. అసలే లేదు దానికో తోక కూడా. గాలేరు–నగరి కడపకు, హంద్రీ–నీవా కర్నూలు, అనంతపురాలకు జాయింటుగా, ప్రకాశం జిల్లా మార్కాపురం ప్రాంతానికి వెలుగొండ అని ఒక ప్రాజెక్టు... ఇలా. నిన్న ఎర్రగొండపాలెం పోయాం మేము. అక్కడ నల్లమల అడవులలో కూంబింగ్ పేరు మీద చెంచులను పోలీసులు బెదిరించి – మీరు ఖాళీ చేయండి, లేకపోతే ఇళ్ళు తగలబెడతాము అంటే పాపం అందరూ పారిపోయారు. అక్కడి వాళ్ళతో మాట్లాడుతూ ఎప్పుడు బాగుపడతారంటే వెలుగొండ వస్తుంది కదా సార్ అన్నారు. వెలుగొండ ఎప్పుడు వస్తుందో! ఎట్లా కడతాడు రాజశేఖరరెడ్డి వెలుగొండను. అది వచ్చే ప్రాజెక్టా! వచ్చే నీళ్ళా! కాలువలు వస్తాయి గ్యారెంటీగా. ఎవరి జేబులు నిండాలో అవి నిండుతాయి. ఆయన రెండవ కృష్ణా ట్రిబ్యునల్ దగ్గరకు పోయి అవన్నీ మిగుల జలాల ప్రాజెక్టులు, హక్కులడగము కాబట్టి మీరు వాటి గురించి పట్టించుకోవద్దు అంటే వాళ్లు అద్భుతం అన్నారు. చాలా బావుంది అన్నారు. అక్కడ

బ్రిజేష్ మిశ్రాయో ఎవరో ఉన్నారు. ఆయన సుప్రీంకోర్టు జడ్జి. ఆయనకైనా తోచాలికదా, హక్కు అడగకుండా ప్రాజెక్టు ఎలా కడుతున్నావని! ఆయన అడగలేదు. రాజశేఖరరెడ్డికేం కావాలి? కర్ణాటకవాడు ఒక అప్లికేషన్ వేశాడు. ఆంధ్రా ప్రాజెక్టులపై స్టే ఇవ్వండి అని. ఈయనేం అన్నాడు – హక్కు అడగనన్నాడు. హక్కు అడిగితే కదా స్టే ఇవ్వాలి! హక్కే అడగనప్పుడు ఎందుకు పో అన్నాడు. మరి ఏం చేయదలచుకున్నాడు ఈయన? ఒకటేం చెపుతాడు ఒక ప్రక్క, వచ్చినపుడే వస్తాయిలే అని.

కడపజిల్లా వాళ్ళు కూడా వచ్చినపుడు వస్తుందిలే, పదేళ్ళకి ఒకసారి వస్తే మాత్రమేమి అంటారు. పదేళ్ళకు ఒకసారి వస్తే రైతులు రెడీగా ఉంటారా – భూములున్నా కూడా ఆ నీళ్ళు వచ్చినపుడు పంటలు తయారు చేసుకోవడానికి? ఆయనా రైతే, సాధ్యమవుతుందా అట్లా వాడుకోవడం పదేళ్ళకు? వస్తే ఎవరికి పంచుతావు? దేనికి ముందిస్తావు, దేనికి వెనకిస్తావు, ఎవరికి ఎంతిస్తావు? నీ దగ్గర చట్టం లేదు. జి.వో.లేదు. ఒక విధానం లేదు. కొట్టుకోవాలి. అంతే కదా? ఇప్పటికే మహబూబ్‌నగర్, కర్నూలు వాళ్లు కొట్టుకుంటూ ఉన్నారు. ఇంకా కొట్టుకోవాలనా? ఇప్పటికే కడపంటే ద్వేషం వచ్చేసింది రాష్ట్రమంతా, వాళ్ళకేం చేయకపోయినా కూడా. ఇంకా పెరగాలి కదా ద్వేషం–రాజశేఖరరెడ్డి రాజకీయాలే అవి. ఫ్యాక్షన్ రాజకీయాలలో ప్రాథమిక సూత్రం ఏమిటంటే ప్రజలు ఎంత కొట్టుకుంటే నాయకులు అంత బావుంటారని. మీరు పులివెందులకు పోయిరండి. ఏవైనా నాలుగు గ్రామాలు ప్రశాంతంగా ఉన్నాయంటే రాజశేఖరరెడ్డి వెతుకుతాడు ఎవరిని లేవగొట్టాల అక్కడ అని. ప్రశాంతంగా ఉంటే ఓట్లు రావు, ప్రశాంతంగా ఉంటే గుంపు రాదు. కొట్టుకుంటే గుంపు వస్తుంది. ఒకడ్ని లేవగొట్టాలి, బాంబులేయాలి, కానీంద్రా నేను చూసుకుంటా అని చెప్పాలి.

దీన్నే ఆయన ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రయోగిస్తున్నాడు. అది మనం అర్థం చేసుకోలేకపోతున్నాము. రెండవది ఏమంటాడూ అంటే రాజశేఖరరెడ్డి – ఇది చాలామంది నమ్ముతున్నారు సీరియస్‌గా–గోదావరి నుంచి 200 టియంసిలు కృష్ణాబేసిన్‌కి వస్తాయి. ఆ రెండు వందల టియంసిలతో ఎనిమిది ప్రాజెక్టులకు తలా 20, 30 ఇస్తే ప్రాజెక్టులు పూర్తవుతాయి కదా అనేది రెండవ వాదన. చాలామందిలో ఇది సరైనదే కదా, ఉత్తర తెలంగాణలో అనవసరంగా దీనిని ఎందుకు వ్యతిరేకిస్తున్నారు అనే అభిప్రాయం ఉంది. విషయాలు తెలియక అభిప్రాయపడుతున్నారు. దానిలో మూడు రకాల నష్టాలున్నాయి.

గోదావరి నుంచి రెండువందల టియంసిలు నీరు కృష్ణాబేసిన్‌కి వచ్చేస్తే దాన్నించి రాయలసీమకి ఇస్తానంటాడు. ఆయన ఎట్లిస్తాడు రాయలసీమకి మాత్రమే?

మహబూబ్‌నగర్‌కు ఎందుకియ్యవు? నల్గొండకి ఎందుకియ్యవు? ఇదంతా కూడా కృష్ణా బేసిన్ కాదా! తీసుకురావడం అంటూ జరిగితే మహబూబ్‌నగర్ కివ్వాలి, నల్గొండకివ్వాలి నువ్వు – ఎనిమిది ప్రాజెక్టులు ఉన్నాయి కదా! 2 మహబూబ్‌నగర్, 3 నల్గొండ, 1 కడప, 1 అనంతపురం – కర్నూలు, ఒకటేమో మార్కాపురం డివిజనుకు అందరికీ ఇవ్వాలిగా నువ్వు....అట్లా చెప్పడు రాయలసీమకే ఇస్తానంటాడు. సరే అది పోనీయండి. ఆ 200 టియంసిలు వస్తే ఏం జరుగుతుందో మనం తెలుసుకోవాలి.

మూడు నష్టాలున్నాయన్నాను కదా. ఒకటి మనకు మాత్రమే తెలివి ఉందనుకుంటే తప్పు. బచావత్ ట్రిబ్యునలప్పుడే కర్ణాటక వాళ్లు ఒక ప్రశ్న వేశారు. మహబూబ్‌నగర్‌ని చూపించి, అనంతపురాన్ని చూపించి నీళ్ళు చాలా అడిగింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మిమ్మల్ని. వీళ్ళు రేపు గోదావరి నుంచి నీళ్లు బదిలీ చేయబోతారు. అప్పుడు మాకివ్వరు దాన్ని అన్నారు. అంటే బచావత్ అవార్డులో ఏం రాశారంటే – ఎప్పుడైనా గోదావరి బేసిన్ నుంచి కృష్ణా బేసిన్‌కు ఆంధ్రప్రదేశ్ నీళ్ళు గానీ బదలాయిస్తే దాంట్లో వాటా కర్ణాటక, మహారాష్ట్ర కూడా పొందవచ్చు అని. ఆ 200 టియంసిలు వస్తే ఏం జరుగుతుంది అంటే కృష్ణా జలాలలో 90 టియంసిలు కర్ణాటక, మహారాష్ట్రలకు పోతుంది. మిగిలిన 110 టియంసిలు ఎక్కడికొస్తాయవి? ప్రకాశం బ్యారేజికి, నాగార్జున సాగర్‌కు వస్తాయి. పోలవరం నుంచి వచ్చేవి మాత్రమే మన వాటా అవుతుంది. ఇది ఒక ప్రాథమిక వాస్తవం. కాని అంతైనా వచ్చింది కదా అనొచ్చు మీరు. రెండవది ఏమౌతుంది అంటే, ఆ వచ్చే 200 లలో 80 ఏమో ప్రకాశం బ్యారేజికి, దుమ్ముగూడెం నుంచి 120 సాగర్‌కు వస్తాయి. అవి పైకి పోవు కదా. కర్ణాటకకి, మహారాష్ట్రకి ఎట్లాపోతాయి? పోవు. మరి వాళ్ళు వాటా ఎట్లా తీసుకుంటారు? పైన ఆపేస్తారు. ఏమి ఆపేస్తారు వాళ్ళు – తుంగభద్ర నుండి కిందికి వచ్చే నీళ్ళను ఆపేస్తారు.

రెండు – తుంగభద్ర నుంచి అనంతపురానికి హెచ్ఎల్‌సి తీసుకుపోయే నీళ్ళు ఆపేస్తారు. తుంగభద్ర నుండి ఆర్‌డిఎస్ (రాజోలిబండ డైవర్షన్ స్కీంకు) వచ్చే నీరు ఆపేస్తారు. తుంగభద్రనుండి కర్నూలు ఎల్ఎల్‌సికి వచ్చే నీళ్ళు ఆపేస్తారు. ప్రతి సంవత్సరం ఆపకపోవచ్చు. కాని కరువు సంవత్సరంలో మాత్రం గ్యారంటీగా ఆపేస్తారు. అప్పుడు ఏం జరుగుతుంది? కరువు ప్రాంతాల పేరు మీద గోదావరి బేసిన్ నుంచి బదిలీ చేసి, కరువు సంవత్సరంలో కరువు ప్రాంతాల ప్రాజెక్టులకు వెళ్లాల్సిన నీళ్ళు ఆగిపోతాయి. ఎవరికి పుష్కలంగా ఉంటాయి? కృష్ణా డెల్టాకి మాత్రం గ్యారంటీగా నీళ్ళుంటాయి. సాగర్ కుడి కాలువ, ఎడమ కాలువలో కూడా గ్యారంటీగా నీళ్ళుంటాయి. పైన మాత్రం నీళ్ళు ఆగిపోతాయి.

మూడవది ఉత్తర తెలంగాణ వాదులు చేస్తున్న న్యాయమైనటువంటి ఫిర్యాదు. గోదావరిలో నీళ్ళు అనంతంగా ఉన్నాయని రాయలసీమ వాళ్లు అనుకుంటున్నారు. అనంతంగా ఏమీ లేవు అక్కడ. 680 టియంసిలు మిగిలి ఉన్నాయిప్పుడు. 680 టియంసిలలో 325 పోలవరం ద్వారా తీసుకోబోతున్నారు. దాంట్లో ఒక చుక్క కూడా తెలంగాణకు రాదు. గోదావరీ నదీ పరీవాహక ప్రాంతం ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాలు. 325 టియంసిలు పోలవరం ద్వారా తీసుకుంటే ఒక చుక్క కూడా ఈ జిల్లాలకు రాదు. అదంతా కూడా కోస్తా జిల్లాలకు పోతుంది. 680లో 325 పోతే ఎంత మిగిలిందండి? 355 మిగిలింది. ఆ 355 లో 120 ఇటు దుమ్ముగూడెం నుండి కృష్ణాబేసిన్‌కు తీసుకుంటున్నారు. అంటే 235 మిగులుతుంది. ఉత్తర తెలంగాణకు మిగిలేది 235. ఎవరికైనా కోపం వస్తుంది. మా పక్కన పోయే నీళ్ళు కొంత తీసుకుంటే తీసుకో, మాతో సమానంగా కృష్ణా బేసిన్‌కి పంపిస్తావు. మాతో సమానంగా కింద వాడుకుంటావు. మూడు వంతులు పంచి మాకు ఒక వంతు ఇస్తాను అనంటే ఎట్లా? ఒక జిల్లా రెండు జిల్లాలు కావు. ఖమ్మం, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఆరు జిల్లాలు. సహజంగానే అభ్యంతరాలు ఉంటాయి.

ఇక్కడొక ప్రశ్న తెలంగాణ వాళ్ళను కూడా అడగాలి. ఏమంటె రాజశేఖరరెడ్డి గోదావరి బేసిన్ నుంచి కృష్ణా బేసిన్‌కి బదిలీ చేస్తున్న నీళ్ళు రాయలసీమకే అన్నప్పుడు రాయలసీమకే అని ఎట్లంటావు, నల్గొండ మహబూబ్‌నగర్‌లకు కూడా ఇవ్వాలి అనే బదులు అసలు ఇవ్వనేవద్దు అంటున్నారు వాళ్ళు. ఆ టోన్ ఎందుకు వస్తోంది? గోదావరి జలాలు కృష్ణా బేసిన్‌కంటూ వస్తే రాయలసీమకి మాత్రమే కాదు, నల్గొండకివ్వాలి నువ్వు, మహబూబ్‌నగర్ కివ్వాలి నువ్వు అనే బదులు ట్రాన్స్‌ఫర్‌ని మొత్తం వ్యతిరేకిస్తాం మేము అంటున్నారు. ఇంత ట్రాన్స్‌ఫర్ కాదు కొంచెం తీసుకోండి మీరు – ఆ కొంచెంలో దక్షిణ తెలంగాణకు కూడా ఇవ్వండి అనే వాదన కాకుండా, అసలే ఇవ్వడానికి వీలులేదు అన్న వాదన ఎందుకొస్తోంది?

ఇది నేను తెలంగాణలో కూడా అంటూనే ఉన్నాను. తెలంగాణ ఉద్యమం ఉత్తర తెలంగాణ ఉద్యమంగానే ఉంది. గోదావరి బేసిన్ ఉద్యమంగానే ఉంది. అది కృష్ణా బేసిన్ ఉద్యమంగా కూడా ఉండి ఉంటే, దక్షిణ తెలంగాణ ఉద్యమంగా కూడా ఉండి ఉంటే వాళ్ళ అభ్యంతరం ఇట్లా ఉండేది కాదు. రాజశేఖరరెడ్డి ఆ నీళ్లు రాయలసీమకు మాత్రమే అనడానికి వీలులేదు. రాయలసీమ, దక్షిణ తెలంగాణ రెండూ కృష్ణా బేసిన్ ప్రాంతాలే. రెండూ కలిపి మాట్లాడాలి. ఇవన్నీ వివరిస్తూ చాలాసేపు మాట్లాడొచ్చు.

కాని ఏం చెయ్యాలి అన్న ప్రశ్నగానీ వేస్తే నేను చాలా కాలంగా అంటున్నది ఒకటి – ఇంతసేపు మనం మాట్లాడుతున్నది కృష్ణా నదిలోని మిగులు జలాల గురించి. ఈ మిగులు జలాలు తెలంగాణకా! రాయలసీమకా? బదిలీ చేయాలా వద్దా ఈ మాటలు మాట్లాడుతున్నాము. కాని నికర జలాలను పునఃపంపిణీ చేయాలి. వేరే మార్గం ఏదీ లేదు అని నా ఉద్దేశ్యం. ఆ పునః పంపిణీకి ప్రాతిపదిక క్యాచ్‌మెంట్ ఎవరిది, ఎవరి క్యాచ్‌మెంట్ ఎక్కువుంటే వారికే ఎక్కువ రావాలి అని కాకూడదు. మహబూబ్‌నగర్ మిత్రులు చాలామంది ఇక్కడున్నారు. వాళ్ళు అంటూ ఉంటారు. కృష్ణానది ఎక్కువగా ప్రవహించేది మహబూబ్‌నగర్‌లో కాబట్టి మాకే ఎక్కువ రావాలి అని. ఇది అవునా కాదా అనుకునేముందు మనం గమనించాల్సింది క్యాచ్‌మెంటే ప్రాతిపదిక అయితే నీళ్ళన్నీ కర్ణాటకవి మనవి కావు. మనం తెలంగాణ, రాయలసీమ, ఆంధ్రా అంటున్న నీళ్ళన్నీ కర్ణాటక నీళ్ళు. 20 లక్షల ఎకరాల సాగుకు మనం కర్ణాటక నీళ్ళు తీసుకుంటున్నాము. వారి క్యాచ్‌మెంట్ నీళ్ళు అవి. ఆ ప్రాతిపదిక కాదు నేను పెడుతున్నది. అన్ని ప్రాంతాలకు, అందరి ప్రజానీకానికి నీటి మీద హక్కు సమానంగా ఉండాలి అని. ఆ ప్రతిపాదన ఉండాలనంటె ఎక్కడ వర్షపాతం తక్కువ ఉంటె అక్కడ నదీజలాలు ఎక్కువ ఇవ్వాలి. సాంకేతిక సాధ్యాసాధ్యాలు ఎప్పుడూ ఉంటాయి. ముఖ్యంగా వెలిగొండ ప్రాజెక్టుకు సాంకేతికంగా చాలా కష్టంగా ఉంటుంది ఇవ్వడం. సూత్రప్రాయంగా సాగునీటి మీద, తాగునీటి మీద సమానమైన హక్కు ఉండాలి అంటే ఎక్కడ వర్షపాతం తక్కువ ఉంటుందో, ఎక్కడ నీటిని నిలుపుకునే Soil retention కెపాసిటీ తక్కువ ఉంటుందో, ఎక్కడ భూగర్భజలాలు మరీ లోతుగా ఉంటాయో ఆ ప్రాంతానికి ఎక్కువ నదీ జలాలు, వర్షపాతం ఎక్కువ ఉండే ప్రాంతాలకు తక్కువ నదీజలాలు అనే ప్రాతిపదిక గాని పెట్టుకుంటే మంచిది. రకరకాల చారిత్రక కారణాల వల్ల ఇవ్వాళ ఈ ఎనిమిది ప్రాజెక్టులు లిస్టవుట్ చేశాము. అవన్నీ కూడా ఒక హక్కుగానే భావించడం బావుంటుంది. అదనంగా అంటే కష్టం. నెట్టెంపాడు, కల్వకుర్తి, శ్రీశైలం ఎడమగట్టు కాలువ, ఎనిమినేటి మాధవరెడ్డి కాలువ, రాయలసీమకు హంద్రీ–నీవా, గాలేరు– నగరి, ప్రకాశం జిల్లాకు సాంకేతికంగా సాధ్యమయితే వెలిగొండ ప్రాజెక్టు వీటన్నింటిని హక్కుగానే భావించడం బావుంటుంది.

మరి నీళ్ళు ఎట్లివ్వాలి వీటికి? ఎప్పుడొస్తే అప్పుడిస్తామన్నది సరియైనది కాదు. గోదావరి బేసిన్ నుంచి ట్రాన్స్‌ఫర్ కూడా సరియైనది కాదు. అవి రెండూ సరియైనవి కానపుడు ఎక్కడనుండి వస్తాయి అంటే, కృష్ణా డెల్టాకిచ్చే వాటాను రెండు రకాలుగా తగ్గించడం అవసరం. సాధ్యమే అది. ఒకటి భౌతికంగానే నీటి పరిమాణాన్ని తగ్గించడం.

సుందరయ్యగారు కూడా అన్నారని చెపుతారు కృష్ణా డెల్టా వాసులు పంట మార్పిడికి రెడీ కాకపోతే పైవాళ్ళకు న్యాయం జరగదు అని. అది వాస్తవమైన వైఖరే. న్యాయమైన వైఖరే! దానివల్ల ఎంత వస్తుంది అంటే 80 టియంసిలు మాత్రమే వస్తుంది. ఎందుకంటే సాగర్‌కు ఎగువన  నదిలోకి వచ్చి చేరే నీళ్ళలో కృష్ణ డెల్టాకు ఎంత పోతాయి అంటే 80 టియంసిలు మాత్రమే పోతాయి. ఇంకా తగ్గియ్యాలి అంటే ఒకే ఒక మార్గం పాలేరు మీద గానీ, మూసీనది మీద గానీ కొత్త ప్రాజెక్టు కట్టి తగ్గించవచ్చు. కానీ అవి ఇప్పుడు అవుతాయో లేదో చెప్పడం కష్టం. కాని ఆ 80 టియంసిలు చాలవు.సాగర్ డ్యాంను గోడగా మార్చాలి. అంటే గేట్లు ఉండవు. అప్పుడు దానికి దిగువన వచ్చే నీళ్ళు మాత్రమే కృష్ణా డెల్టాకు పోతాయి. మిగిలినదంతా కూడా సాగర్, సాగర్ ఎగువన ఉంచుకుంటే 80 టియంసిలు అదనంగా వస్తాయి. కానీ అవి కూడా చాలవు. ఇప్పటికే మనం మిగులు జలాల ప్రాజక్టులు రెండు కట్టేస్తున్నాము. ఒకటి తెలుగుగంగ దాదాపు అయిపోయింది. రెండోది ఎలిమినేటి మాధవరెడ్డి కాలువ. అది కూడా దాదాపు అయిపోయింది.

ఎలిమినేటి మాధవరెడ్డి కాలువలో జరిగిన మరొక అన్యాయమేంది అంటే, సైలెంట్‌గా ఎవరూ మాట్లాడకుండా హైదరాబాద్‌కు 16 టియంసిలు తీసుకొస్తూ ఉన్నారు. చెప్పిందేమో నల్గొండ జిల్లాకని. నల్గొండ జిల్లాలోని ఫ్లోరైడ్ ప్రాంతాలు మునుగోడు, నారాయణపురం మండలాలకు నీళ్ళియ్యాలి, అక్కడ ఫ్లోరైడ్ తీవ్రంగా ఉంది అని చెప్పి – దానికోసం ఎలిమినేటి మాధవరెడ్డి కాలువ కట్టి, 4 టియంసిలు మాత్రమే హైద్రాబాదుకు అని చెప్పి ఇప్పుడు 16 టియంసిలు దొంగతనంగా తీసుకువస్తున్నారు. అయినా ఎవ్వరూ మాట్లాడరు. ఎంతమంది నల్గొండ వాళ్ళు మాట్లాడినా సరే ఉద్యమంగా రాలేదు. ఆ కాలువ అయిపోయింది. అట్లే ఇవాళ తెలుగుగంగ పేరుమీద 30 టియంసిలు అదనంగా తీసుకుపోతున్నారు. కడపకు, నెల్లూరుకు, చిత్తూరుకు కూడా తీసుకుపోతున్నారు దానిని. ఎలిమినేటి మాధవరెడ్డి కాలువ పేరుమీద మరో 25 టియంసిలు పోతున్నాయంటే, ఇప్పటికే 55 టియంసిలకు జరిగిపోయింది నిర్మాణం.

కాబట్టి 80 టియంసిలు మాత్రమే సాగర్ దగ్గర ఆపితే చాలదు. నెట్టెంపాడుగానీ కల్వకుర్తిగానీ, శ్రీశైలం ఎడమగట్టు కాలువగానీ, హంద్రీ – నీవాగానీ, గాలేరు – నగరిగానీ పూర్తికావాలంటే, వాటికి నీళ్లు రావాలంటే దానికి ఒకటే ఒక మార్గం ప్రతిపాదిస్తున్నారు చాలా కాలంగా. నికర జలం అనే దానిని అంచనా వేసేటప్పుడు డిపెండబిలిటీ ఫ్యాక్టర్ ఒకటి తీసుకుంటారు. ఏమని అంటే నాలుగింట మూడు

సంవత్సరాలు అయితే 75% డిపెండబిలిటీ అంటున్నారు. అంటే నాలుగింట మూడు సంవత్సరాలు గ్యారంటీగా ఉంటున్న నీళ్ళకే ప్రాజెక్టులు కట్టుకుంటాము అని. దానినే నికర జలం అంటున్నారు. అవే 2060 టియంసిలు ఉన్నాయని అంటున్నారు. దాన్ని ఎవరూ హేతుబద్ధమైనది కాదు అని అనడం లేదుగానీ కృష్ణానది మీద ఉన్న పరిస్థితిని దృష్టిలో పెట్టుకున్నప్పుడు, మనం గాని దానిని 60%కి తగ్గిస్తే, నాల్గింట మూడేళ్ళు కాదు ఐదింట మూడేళ్ళు గ్యారంటీ ఉంటుంది రైతుకు అని గాని తగ్గిస్తే మరొక 200 టియంసిలకు ప్రాజెక్టులు కట్టుకోవచ్చు. ఆ రెండు వందల టియంసిలు ఈ అన్ని ప్రాజెక్టులకు సరిపోతాయి. ఒకోదానికి 30, 40గానీ కేటాయిస్తే, 3 లక్షల, 4 లక్షల ఎకరాలకు నీళ్ళు ఇవ్వడానికి, ఐదింట మూడేళ్ళు నీళ్ళు అందియ్యడానికి అది సరిపోతుంది. కాబట్టి కృష్ణా డెల్టాకు సాగర్ దిగువ నుంచి పోయే 80 టియంసిలు ఆపితే సాగర్‌దగ్గర ఆ 80 టి.యం.సిలు + డిపెండబిలిటీ 75 నుండి 60 శాతానికి తగ్గించడం ద్వారా వచ్చేటటువంటి మరొక 200 టియంసిల నికర జలాలను కలుపుకుంటె ఈ అన్ని ప్రాజెక్టులు కట్టుకోవచ్చు.

దీనికి కూడా మన కృష్ణాడెల్టా వాసులు ఒప్పుకోవాల్సిందే. సాగర్ కుడి కాలువ, ఎడమ కాలువ వాళ్ళు కూడా అప్పుడు ఒప్పుకోవలసిందే. వాళ్ళ భరోసా తగ్గుతుంది గానీ నీళ్ళుంటాయి. వాళ్ళకు కూడా లేని సంవత్సరాలలో వర్షపాతం మీద ఆధారపడక తప్పదు. అప్పుడు అందరిలాగా వాళ్ళు కూడా బతకాలి. దీనికి వాళ్ళు అంగీకరిస్తే బాగుంటుంది గానీ దురదృష్టవశాత్తు ఈ చర్చ ప్రజాతంత్ర ఉద్యమాలలో కూడా పెట్టడం సాధ్యం కావడం లేదు. ఎందుకంటె తెలంగాణలో వైఖరి మిగులు జలాలు మొత్తం తెలంగాణకేనని, రాయలసీమ వైఖరి మిగులు జలాలు మొత్తం రాయలసీమకేనని. రెండూ అవాస్తవికమైన ఆలోచనలు. ఈ అన్ని ప్రాజెక్టుల మధ్య వాటిని పంచుకోవాలి. మిగులు కాకుండా ఉండాలి, నికరజలాలే కావాలి అంటే ఈ రకమైన మార్గాలు అనుసరించాలి అనే ప్రతిపాదన పెట్టాలి. దాని మీద చర్చ జరిపి ఒక వైఖరి తీసుకోగలిగితే ప్రజాతంత్ర ఉద్యమకారులు – ప్రజలను విడగొట్టి ద్వేషాలను పెంచే రాజకీయాలకు విరుద్ధమైన వాతావరణాన్ని వెనుకబడిన ప్రాంతాల మధ్య మనం పెంపొందించగలుతాము. చివరిగా పోతిరెడ్డిపాడు గురించి చెప్పి ముగిస్తాను.

రాజశేఖరరెడ్డిగారు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచుతున్నాడు. అంటే ఎక్కువ నీళ్ళు తీసుకోవటానికి పెంచుతున్నాడు. ఆయన చెప్తున్న వాదన ఏమిటి?

వర్షాలు పడ్డాక కృష్ణా నదిలో ఇదివరకు 45 రోజులకు నీళ్ళు వచ్చేవంట తీరికగా, ఇప్పుడు అల్మట్టి కట్టిన తరువాత 33 రోజులలో వచ్చేస్తున్నాయంట. ఎవరు చెప్పారో నాకు తెలియదుగానీ నిజమేనని అనుకుందాం కొంతసేపు. 45 రోజులలో మెల్లగా వచ్చేవి ఇప్పుడు 33 రోజులలో వచ్చేస్తుంటే – మరి తెలుగుగంగకు, గాలేరు – నగరికి నీళ్ళు తీసుకోవాలి కదా! వచ్చి వెళ్ళిపోతాయి కదా అవన్నీ కూడా త్వరగా తీసుకోకపోతే. త్వరగా తీసుకోవాలంటే సామర్థ్యం పెంచుకోవాలి. అందుకని పెంచుతున్నాను అన్నాడు. బాగానే ఉంది. ఆ మిగులు జలాల మీద ఇన్ని ప్రాజెక్టులు ఉన్నాయి కదా! నెట్టెంపాడు ఉంది. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ఉంది. శ్రీశైలం ఎడమగట్టు కాలువ ఉంది. ఎలిమినేటి మాధవరెడ్డి కాలువ ఉంది. రాయలసీమకి హంద్రీ – నీవా ఉంది. ప్రకాశం జిల్లాకు వెలిగొండ ప్రాజెక్టు ఉంది. మరి వాటికి నీళ్లుపోయే ప్రాజెక్టుల మూతి వెడల్పు చేయవా నువ్వు? అవి మూతి ఉండేవి కావనుకోండి; లిఫ్టులు అయితే ఎక్కువ మోటార్లు పెట్టు. నెట్టెంపాడుకు రెండురెట్లు మోటార్లు శాంక్షన్ చేయి. కల్వకుర్తికి రెండురెట్లు ఎక్కువ మోటార్లు శాంక్షన్ చేయి. అవి చేయకుండా ఇది మాత్రం చేస్తా అని నువ్వంటె సహజంగానే అందరికీ కోపం వస్తుంది.

చిన్న ఉదాహరణ చెప్తే బహుశ ఇంకా బాగా అర్థమవుతుంది. టియంసిలు, మోటార్లు అంటే అర్థం కాకపోవచ్చు. చిన్న కాలువ పోతూ ఉంటుందండి ఒకచోట – ఎనిమిదిమంది రైతులుంటారు. రోజులో అర్ధగంట మాత్రమే నీళ్ళు పోతాయి ఆ కాలువలో. ఎనిమిది మందికి హక్కుంది. ఒకాయన బకెట్‌తో తీసుకుంటాడు. ఒకాయన ట్యూబ్ పెట్టి నొల్లుకుంటాడు నోటితో. మొత్తం ఎనిమిది మందీ తీసుకుంటూ ఉన్నారు. అర్ధగంట వచ్చేది పావుగంటలో వెళ్ళిపోతాయి నీళ్ళంతా. అకస్మాత్తుగా మారిపోయింది అంతా. రాజశేఖరరెడ్డిగారు చెప్పారు కాబట్టి మారిపోతుంది పరిస్థితి. వాళ్ళలో ఒకాయన ఆయన బంధువు. ఆయనకు రెండో బకెట్ ఇస్తాడు – నువ్వు రెండు బకెట్లు పెట్టుకో అంటాడు. మిగిలిన వాళ్ళకి ఏమీయడు. ఏమనుకుంటారు వాళ్ళు? మా వాటా మేము తీసుకోలేకపోగా రెండో బక్కెట్‌తో ఆయన మా వాటా కూడా తీసుకుంటాడేమోనని డౌట్ రాదా ఎవరికైనా. చిన్న విషయమది. ఎందుకు కడప వాళ్ళకి అర్థం కాదిది? కడపలో డెమోక్రసీ లేకుండా పోలేదు కదా. ఈ లోగా హైదరాబాద్ బ్రదర్స్ ఏమంటారంటే తీసుకునేవి మిగులు జలాలు అయినపుడు అంత కింది నుండి ఎందుకు పైనుండి తీసుకోరాదా అంటున్నారు. ఇది పొన్నాల లక్ష్మయ్య, జనార్దన్‌రెడ్డి స్టేజి

ఎక్కి తిట్టుకుంటె అయ్యేది కాదు. ఇంజనీర్లు చెప్పాలి. స్టేజి ఎక్కి సవాళ్ళు విసురుకునే, రాజీనామా చేసుకునే విషయం కాదది.

ఈ కొట్లాటలు శాశ్వతంగా ఉండబోతున్నాయి. కాబట్టి ఒక రివర్‌వాలీ అథారిటీ (నిర్వహణా యంత్రాంగం) పెట్టుకుంటె మంచిది. అంటే ఈ కృష్ణా జలాల్లో-మిగులు జలాలు, నికరజలాలు ఎలా పంచాలి, ఎవరికి పంచాలి. ఏ గేటు ఎప్పుడు తెరవాలి, ఏ గేటు ఎప్పుడు మూయాలి... వగైరా విషయాలను పర్యవేక్షించే యంత్రాంగం. బైరెడ్డి రాజశేఖరరెడ్డిలాంటి వాళ్లు వచ్చి గేటు పగలకొట్టే ప్రమాదం ఒకటి ఉంటుంది కాబట్టి అలాంటి అథారిటీ ఒకటి తప్పని సరిగా ఉండాలి. దాంట్లో రాయలసీమ వాళ్ళొద్దు, తెలంగాణ వాళ్ళొద్దు, ఆంధ్రా వాళ్ళొద్దు, బెంగాల్ వాళ్ళని పెట్టుకుందాం కావాలంటే. ఇంజనీర్లని కూచోబెట్టి నిర్ణయం చేయమందాం. నియమాలు క్లియర్‌గా ఉండాలి. జి.ఓ.లు క్లియర్‌గా ఉండాలి! అవి అమలు కావాలి! అట్లయితేనే కొట్లాటలు లేకుండా ఉంటుంది. ప్రాథమికంగా నీటి హక్కు అనేది అందరికి సమానంగా ఉండాలి అనే ప్రాతిపదిక మీద తెలంగాణ, రాయలసీమల మధ్య ఉన్న ఈ తగాదా పరిష్కారమైతే బాగుంటుంది అని చెప్తూ నేను సెలవు తీసుకుంటున్నాను.

విరసం 15వ రాష్ట్ర సాహిత్య పాఠశాలలో ఉపన్యాసం, కర్నూలు
14 జనవరి 2007
'రాజ్యం-సంక్షేమం' పుస్తకంలో కూడా వచ్చింది, అక్టోబర్ 2010
ఈ ఉపన్యాసాన్ని balagopal.org లోను, youtube లోను వినవచ్చు



# హంద్రీ - నీవా ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిర్మించాలి

కరువు పీడిత రాయలసీమలోని అత్యంత కరువు పీడిత ప్రాంతానికి చాలా కాలంగా ఆశాదీపంగా ఉంది హంద్రీ- నీవా ప్రాజెక్టు. ఒకటికి మూడుసార్లు పునాదిరాళ్ళు వేసిన ఈ ప్రాజెక్టు నిర్మాణం ఎట్టకేలకు మొదలైందని సంతోషించాలో, లేక నీటి భరోసా గానీ, కనీసం స్పష్టమైన మిగులు నీటి కేటాయింపు గానీ లేని ఈ ప్రాజెక్టు తీర్చవలసిన కరువులో నాలుగోవంతయినా తీరుస్తుందా అని ఆందోళన చెందాలో తెలియని స్థితిలో ప్రజలున్నారు.

కర్నూలు, అనంతపురం జిల్లాల పడమటి ప్రాంతానికీ, అనంతపురం జిల్లా దక్షిణ భాగానికీ, చిత్తూరు జిల్లా పడమటి ప్రాంతానికీ, కడప జిల్లాలో నీటితడి ఎరుగని తూర్పు భాగానికీ నీళ్ళియ్యవలసి ఉంది హంద్రీ-నీవా. 40 టియంసిల కేటాయింపులో 4 టియంసిలు తాగునీటికి పోగా 36 టియంసిలతో నాలుగు జిల్లాలలో 6 లక్షల ఎకరాలకు సాగునీరివ్వాలని తొలినాటి ప్రతిపాదన. 36 టియంసిలతో 6 లక్షల ఎకరాలంటే ఆరుతడి పంట కంటే తక్కువ నీళ్ళిస్తారని అర్థం. ఈ ప్రాజెక్టు కావలసిందేనని ప్రజలు చాలా కాలంగా పట్టుబడుతున్నారు.



నీళ్ళు తగు మాత్రం ఉండడం ఎంత ముఖ్యమో, ఆ నీటి మీద హక్కు ఉండడం అంతే ముఖ్యం. కానీ హంద్రీ- నీవాతో సహా రాయలసీమ, తెలంగాణ జిల్లాలలో కృష్ణా నది మీద చేపడుతున్న తొమ్మిది ప్రాజెక్టులకు నీటిహక్కు అడగబోమనీ, నీళ్ళున్నప్పుడే పొలాలకు పారించుకుంటామనీ

మన రాష్ట్ర ప్రభుత్వం రెండవ కృష్ణా జలాల ట్రిబ్యునల్‌కు హామీ ఇచ్చివచ్చింది. ప్రతి సంవత్సరం కృష్ణానది నీళ్ళు అపారంగా సముద్రం పాలవుతున్నాయని మీడియా ప్రచారం చేస్తుండడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఆ హామీ ఇచ్చి ఎంత నష్టం చేసిందో ప్రజలు గ్రహించడం లేదు. సంవత్సరంలో కొద్దిరోజులు నదిలో వరద వచ్చి పెద్దెత్తున నీళ్ళు పరవళ్ళు తొక్కుతూ సముద్రంలోకి పోతున్న అభిప్రాయం మీడియా దృశ్యాలు మనకు కలిగిస్తుండవచ్చును. కానీ ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మిగులు జలాల ప్రాజెక్టులన్నీ కట్టేస్తే ఈ వరద వాటి అవసరాలకు ఎంతమాత్రం సరిపోదు. ఎప్పుడో ఒకసారి తప్ప ఈ ప్రాజెక్టులు హామీ ఇచ్చిన నీటి పారకాన్ని రైతులకీయవు. నాలుగింట మూడు సంవత్సరాలు రైతులు ఒట్టి కాలవలను చూస్తూ కాలం గడపవలసి ఉంటుంది.

రాయలసీమ, తెలంగాణ జిల్లాల కరువు ప్రాంతాలకు ఎక్కడికక్కడ విడివిడిగా హామీలిస్తూ సంతృప్తిపరచడం మన పాలకులు నేర్చుకున్నారు. ప్రజలకు తమ గురించే తప్ప ఇతరుల గురించి అవగాహన లేకపోవడం వల్ల ఈ మాయలో పడుతున్నారు. కానీ నిజానికి ఇవన్నీ కరువు ప్రాంతాలే కాబట్టి అన్నిటి అవసరాలు తీర్చవలసిందే. సమభావంతో తీర్చవలసిందే. అధికార బలం ఉన్న నాయకులు తమ ప్రాంతానికి నీళ్ళిచ్చే ప్రాజెక్టుకు ప్రత్యేక హక్కులు కల్పించాలని చూడడం సమన్యాయం కాదు, సమంజసమూ కాదు. వెనుకబడిన ప్రాంతాలను ఒకే తాటిమీద ముందుకు నడిపించినప్పుడే సమన్యాయమూ జరుగుతుంది, ప్రజల మధ్య సామరస్యమూ నెలకొంటుంది.

కృష్ణానది జలాలపైన ఆధారపడి నిర్మిస్తున్న మిగులు జలాల ప్రాజెక్టులన్నిటినీ కలిపి లెక్కించినట్టయితే 300 నుంచి 350 టియంసిల నీరు అవసరమవుతుంది. అది కూడా చాలదని ప్రజలు ఆయా ప్రాంతాలలో భావిస్తున్నారు. నాలుగు జిల్లాలలోని తీవ్ర దుర్భిక్ష ప్రాంతాలకు నీళ్ళియ్యవలసిన హంద్రీ-నీవాకు 40 టియంసిలు చాలవనీ 100 టియంసిలు కావాలనీ డిమాండ్ ముందు కొచ్చింది. అటు తెలంగాణలో కృష్ణానది బేసిన్ ఉండి కూడా ఆ నది నుంచి ఒక చుక్కనీరు పొందని రంగారెడ్డి జిల్లాకు నీళ్ళివ్వాలన్న డిమాండ్ ముందుకొస్తున్నది. ఇవన్నీ లెక్కలోకి తీసుకున్నట్టయితే 'వేల క్యూసెక్కులు వృథాగా సముద్రంలోకి పోతున్నాయంటూ' ఎన్ని ప్రాజెక్టులయినా కట్టుకోవచ్చునన్న అభిప్రాయం కలిగిస్తున్న మీడియా వ్యాఖ్యలు, తెలిసీ తెలియని రాజకీయ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు అర్థరహితమైనవని గ్రహిస్తాం. అప్పుడు ఇన్ని ప్రాజెక్టులకూ నీళ్ళెక్కడి నుంచి ఇవ్వాలన్న ప్రశ్న వస్తుంది.

వర్షపాతం తక్కువ ఉన్న ప్రాంతాలకు నదీజలాలు ఎక్కువ ఇవ్వాలి, వర్షపాతం ఎక్కువ ఉన్న ప్రాంతాలకు తక్కువ ఇవ్వాలి అన్న ప్రాథమిక సమానతా సూత్రానికి విరుద్ధంగా మన రాష్ట్రంలో వర్షపాతం ఎక్కువ ఉన్న కోస్తా ప్రాంతానికే నదీజలాలు ఎక్కువ ఇవ్వడం జరుగుతున్నది. అతి తక్కువ వర్షపాతం ఉన్న రాయలసీమ, దక్షిణ తెలంగాణ జిల్లాలకు నీటి హక్కే లేకుండా ఎప్పుడుంటే అప్పుడే ఇస్తాం అనే ప్రాతిపదిక మీద తొమ్మిది మిగులు జలాల ప్రాజెక్టులను కడుతున్నది రాష్ట్ర ప్రభుత్వం. బాగున్న వాళ్ళకు 75 శాతం భరోసాతో ప్రాజెక్టులు, దౌర్భాగ్యులకు ఏ భరోసా లేని 'లక్కీ డ్రా' ప్రాజెక్టులు కట్టడం ఏం న్యాయం?

అందుకే కృష్ణానదీ జలాల పునఃపంపిణీ జరగాలని చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నాం. నాగార్జునసాగర్ ఎగువన నదిలో చేరే నీరంతా ఎగువ ప్రాంతపు కరువు జిల్లాలకే కేటాయించినట్టయితే కృష్ణా డెల్టాకు పోతున్న 80 టియంసిల నికర జలం రాయలసీమ, తెలంగాణ జిల్లాలలో కడుతున్న కొత్త ప్రాజెక్టులకు దక్కుతుంది. కృష్ణా డెల్టా, నాగార్జునసాగర్ తదితర పాత ప్రాజెక్టుల నీటి భరోసాను 75 నుంచి 60 శాతానికి తగ్గిస్తే అదే భరోసాతో ఇంకొక 200 టియంసిలపైన కూడా నీటిహక్కు లభిస్తుంది. గోదావరి నుంచి నీళ్ళు తరలించే ఆలోచన ప్రభుత్వం చేస్తున్నది గానీ అది ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రయోజనాలను దెబ్బతీస్తుందని ఆ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు ద్వారా భారీగా గోదావరి జలాలను కోస్తా జిల్లాలకు తరలిస్తున్నారు. కాబట్టి వారి ఆందోళన సహేతుకమైనదే.

అసలు ప్రభుత్వానికి వ్యవసాయదారుల సంక్షేమం పట్టిందా, లేక రైతుల పేరు మీద కడుతున్న ప్రాజెక్టులన్నీ ప్రత్యేక ఆర్థిక మండలాలకూ, పరిశ్రమలకూ నీళ్ళివ్వడానికా అన్న సందేహమూ వస్తున్నది. పోలవరం ఎడమ కాలువ నీళ్ళు సాగునీటికీ కాదు, తాగునీటికీ కాదు. కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలి నుంచి ఎస్.కోటలో జిందాల్ వారి బాక్సైట్ రిఫైనరీ దాకా కార్పొరేట్ కంపెనీల అవసరాల కోసం అనేది స్పష్టంగా ఉంది. గండికోట రిజర్వాయర్ కోసం అని పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని ఏకపక్ష నిర్ణయం ద్వారా పెంచింది కడప జిల్లా రైతుల ప్రయోజనాల కోసం సహితం కాదు. బ్రాహ్మణీ స్టీల్స్‌కు, పులివెందుల యురేనియం ప్రాజెక్టుకు నీళ్ళివ్వడానికి అన్న విషయమూ స్పష్టం అవుతున్నది. తాగునీటికీ, సాగునీటికీ ఇచ్చిన తరువాతే వేరే అవసరాలకు నీళ్ళివ్వాలన్న న్యాయబద్ధమైన సూత్రాన్ని ప్రభుత్వం ఉద్దేశ్య పూర్వకంగా పక్కన పెట్టింది.

హంద్రీ– నీవా ప్రాజెక్టును సమగ్రంగా నిర్మించి నాలుగు జిల్లాలలో 6 లక్షల ఎకరాలకు తగు మాత్రం నీళ్ళివ్వాలనీ, తొలి ప్రతిపాదన ప్రకారం తాగునీరు ఇవ్వాలనీ, కరువు ప్రాంతాలన్నిటి నీటి అవసరాలను సమభావంతో తీర్చాలనీ డిమాండ్ చేస్తూ జరిపే ఈ బహిరంగ సభకు ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

మానవహక్కుల వేదిక  కర్నూలు జిల్లా శాఖ కరపత్రంగా వచ్చింది

21 ఆగస్టు 2007



# కడప జిల్లాలో ఊట చెరువుల సంతర్పణ

ఒకే గ్రామపంచాయితీలో 50 ఊట చెరువులు ఉండడం ఎక్కడయినా చూసారా?

చూడలేదా? కడప జిల్లాకు రండి చూద్దురుగానీ. ఆ ఊరి పేరు తాటిగుంటపల్లి. మండలం వీరబల్లి. అది పెద్ద పంచాయితీయే. చిన్నవీ చితకవీ కలుపుకొని 16 పల్లెలున్నాయి. భూమి యావత్తు ఎగుడుదిగుడుగా ఉంటుంది. చిట్టడవి దండిగా కనిపిస్తుంది. అయితే అన్నిటికంటే వింత దృశ్యం ఎక్కడబడితే అక్కడ కనిపించే చెక్‌డ్యాంలు, పికప్ ఆనకట్టలు. ఒక ఎత్తయిన ప్రదేశంలో నిలబడి చుట్టూ పరికిస్తే ఉన్నచోటి నుండి కదలకుండా అరడజనుదాకా చూడవచ్చు. నేల ఎగుడు దిగుడుగా ఉండడం వల్ల వాగులూ వంకలూ సగటు కంటే ఎక్కువే ఉన్నాయి తాటిగుంటపల్లి శివారులో. అయినప్పటికీ 50 ఊట చెరువులకు సరిపడా నీరు ఉండడానికి అదేం చిరపుంజి కాదు కదా. సగటు వర్షపాతం చాలా తక్కువ ఉండే ప్రాంతం. కాబట్టి అన్ని ఆనకట్టలకు కావలసినన్ని వంకలేమీ లేవు. అయితేనేం? వాగేదీ లేకపోతే 'ఒకానొక స్థానిక వంక' అని రాసి అధికారులు అనుమతులు ఇచ్చేసారు.



ఇది చంద్రబాబునాయుడు దృష్టి కొచ్చేంత భారీ కుంభకోణం కాకపోవచ్చు. ఒక్కొక్క 'ఊట చెరువు' కాంట్రాక్టు కేవలం 3 నుండి 9 లక్షల రూపాయల మధ్యన ఉంటుంది. ఇది చిన్న మొత్తం కాబట్టి పెద్ద కాంట్రాక్టర్లెవరూ రంగంలోకి దిగలేదు. ఆ ఊళ్ళ రెడ్లే చూసుకున్నారు. అయితే అసలు ఖర్చు 60 వేల నుండి 2 లక్షల చిల్లర మించి ఉండదు కాబట్టి బాగానే మిగిలించుకుంటున్నారు.

ఈ ఊట చెరువుల ప్రతిపాదనలు కాంట్రాకర్ల నుండే ప్రభుత్వం వద్దకు పోవడం విశేషం. న్యాయంగానయితే అటువంటి ప్రతిపాదన గ్రామపంచాయితీ పెట్టవచ్చు, లేదా నీటి పారుదల శాఖ నిపుణులు పెట్టవచ్చు. వీరెవ్వరూ పెట్టకుండా కాంట్రాక్టర్లే ప్రతిపాదనలు పెట్టుకుంటున్నారు. ఎంఆర్వో దగ్గర ఆయకట్టు సర్టిఫికేట్ తీసుకొని, ఫలాన వంకపైన ఆనకట్ట అని సంబంధిత నీటి పారుదల శాఖ అధికారి నుండి మరొక సర్టిఫికెట్ తీసుకొని లైన్లో నిలబడి 'నాకు ఒక ఆనకట్ట' అని అడిగి తెచ్చుకుంటున్నారు.

ఎగుడు దిగుడు ప్రాంతం కాబట్టి వర్షమంటూ పడినప్పుడు పల్లం ఎటువైపు ఉంటే అటువైపు నీటి ప్రవాహం కొంత ఉంటుంది. దానికి 'స్థానిక వంక' అని పేరుపెట్టి ఒక ఆనకట్ట మంజూరు చేస్తే ఎంతో కొంత నీళ్లు నిలుస్తాయి. కాలువలు తవ్వుకుని పంటలు పండించుకోవడానికి కావలసినంత నిలవకపోవచ్చును గానీ ఊటచెరువు అని పేరు పెట్టడానికి ఏ కొంచెం నిలిచినా ఇబ్బందేమీ లేదు.

ఖర్చెంత, ప్రయోజనమెంత అన్న లెక్కలు తీస్తే వేరే సంగతి గానీ తీసేదెవరు? అది కడప జిల్లా . ఆ జిల్లాకు చెందిన ప్రతీ కాంగ్రెస్ కార్యకర్తకు కనీసపక్షం ఒక బొలేరో లేక స్కార్పియో కొనుక్కొని హడావుడిగా తిరిగే స్తోమత కలిగించాలన్నది రాజశేఖర్‌రెడ్డి ఆకాంక్ష. అది బహిరంగ రహస్యం కాబట్టి వారు ప్రతిపాదించిన 'పనులు' కాదనగల అధికారులెవరు? 'ప్రభుత్వం మాది. ఏం చేసుకుంటావో చేసుకోపో' అనేది ఆ జిల్లా అంతటా రెండు మూడేళ్లుగా వినపడుతున్న దబాయింపు. యువరాజుకు దగ్గరయిన వారి దురుసుతనమయితే చెప్పనలవి కాదు. విమర్శించగల వాళ్లు తమ నోళ్లు తామే కట్టేసుకోవడానికి ఒక వాదన కల్పించుకున్నారు. కడప అంటే వై.ఎస్. కాబట్టి తెలుగుదేశం పాలనలో ఆ జిల్లాకు ఏమీ జరగలేదంట. అప్పుడది అన్యాయం అని రాష్ట్రంలో ఎవరూ మాట్లాడలేదంట. కాబట్టి ఇప్పుడు చేసుకుంటే తప్పేముంది? ఏమేమి జరగలేదో ఒక జాబితా సులభంగానే ఇస్తారు. అటువంటి జాబితా ఏ జిల్లాలో లేదు? ప్రాంతీయ అభిమానం నుండి పుట్టే వాదనలలో సర్వత్రా ఉండే గుణమే ఇది. మాకు ఇది జరగలేదు, అది ఇవ్వలేదు అని ఏకరవు పెట్టినప్పుడు వేరే ఎవరికైనా జరిగిందా, వేరే ఎవరికైనా ఇచ్చారా అన్న ప్రశ్నకు చోటు ఉండదు. ప్రాంతీయతత్వానికి తన గురించే తప్ప పక్కవారి గురించి కనీస సమాచారం కూడా తెలియదు.

అటువంటి ప్రాంతీయ ఆవేశం ఇప్పుడు కడప జిల్లాను పట్టుకుంది. పూర్తికాని ప్రాజెక్టులను, చేపట్టని పనులను, నెరవేరని హామీలను నెమరు వేసుకుంటూ 'రాక

రాక మాకు అవకాశం వస్తే సహించలేకుండ ఉన్నారు' అన్నది బజారు నుండి పత్రికా కార్యాలయాలదాకా అంతటా వినపడే అభిశంసన. వేరే ఎక్కడయినా అయితే ఇది తప్పుడు తర్కం అనీ, అందరూ ఇట్లాగే ఆలోచించడం మొదలుపెడితే ప్రజాస్వామ్యం ధ్వంసం అవుతుందనీ అనే వాళ్లు ఒకరు కాకపోతే ఒకరు ఉంటారు గానీ రాజకీయాలను ఫ్యాక్షన్ ముఠాల కళ్లతో చూడడం అలవాటయిన ఆ జిల్లాలో ఇది అత్యంత సహజమైన వైఖరిగా అందరికీ అనిపిస్తుంది.

ఊట చెరువుల సంతర్పణకు తిరిగి వద్దాం. 'అభివృద్ధికి ఎంత కావాలన్నా అడగండి- ఎంత కావాలన్నా ఇస్తాం' అని రాజశేఖర్‌రెడ్డి అనడం వింటున్నాం. పత్రికలలోను, టివిలలోను విన్నప్పుడు ఆ 'అడిగేవారు' ప్రజలు అనుకుంటాం. కాని 'అడిగేవారు' ప్రజలు కాదు, కాంగ్రెస్ మనుషులు, వారి ఆశీస్సులు పొందిన ఛోటా, బడా కాంట్రాక్టర్లు అని గుర్తించినప్పుడు ఆ ప్రకటన స్వభావమే మారిపోతుంది. కడప జిల్లాకు సంబంధించినంత వరకు జరుగుతున్నదేమిటంటే ఎక్కడికక్కడ ఏ పేరు పెట్టి అభివృద్ధి పనులు మంజూరు చేయించుకుంటే కాంట్రాక్టులు పుడతాయో అవన్నీ ప్రతిపాదనలవుతున్నాయి. అన్ని ప్రతిపాదనలూ మంజూరవుతున్నాయి. జాతీయ రహదారి కంటే వెడల్పయిన జిల్లా రోడ్డు దీనికొక ఉదాహరణ.

ఆ జిల్లా తూర్పుభాగాన ఉన్న పెన్నానది పరీవాహక ప్రాంతాన్ని మినహాయిస్తే తక్కినదంతా బంజర్లు, గుట్టలు, రాళ్లమయం కాబట్టి చెక్‌డ్యాముల ద్వారా భూగర్భజలాలను అభివృద్ధి చేస్తాం, లేదా వంకల మీద కట్టే పికప్ ఆనకట్టల ద్వారా 50-100 ఎకరాల ఆయకట్టుకు నీళ్లు పారిస్తాం అన్న ప్రతిపాదన సహజంగానే న్యాయంగా తోస్తుంది. వీరబల్లి, గాలివీడు, రామాపురం అనే మండలాలలో ఈ తర్కంతో ఎడాపెడా మైనర్ ఇరిగేషన్ స్కీంలు మంజూరవుతున్నాయి. దగ్గరకు పోయి చూస్తే తప్ప ఎంత వృథా జరుగుతున్నదనేది అర్థం కాదు. పెరగగల భూగర్భ జలాలను వాడుకోవడానికి దరిదాపులలో వ్యవసాయ భూములే లేని బంజర్లలోని ఊటచెరువులను చూసినప్పుడూ, ఎంఆర్‌వో రాసిచ్చిన ఆయకట్టుకు సరిపడా నీళ్లు నిలవడం సంగతి అటుంచి కనీసం నాలుగు పశువులకు నెలరోజుల తాగునీరు కల్పించగల మేరకైనా నీళ్లు దొరకని చోట కట్టిన ఆనకట్టలను చూసినప్పుడూ అర్థమవుతుంది. స్థానిక ప్రజలకు పెద్దగా అభ్యంతరం ఉండకపోవచ్చు- ఖర్చు తమది కానప్పుడు నాలుగు పశువులకు నెలరోజులు తాగునీళ్లివ్వడానికి లక్షలు ఖర్చు పెట్టి చెక్‌డ్యాంలు కట్టినా అభ్యంతరమెందుకుంటుంది? కానీ అన్ని ప్రజావసరాలూ తీర్చవలసిన ప్రభుత్వ వనరులు ముఖ్యమంత్రి స్వంత జిల్లాలో కార్యకర్తల జేబులు నింపడానికి వృథా

అవుతుంటే అది గ్రహించగలవాళ్లు కూడ 'రాకరాక మావాడు వచ్చాడు– మా జిల్లాను అభివృద్ధి చేసుకోనివ్వండి' అని తర్కించడం చాలా అభ్యంతరకరం.

అయితే స్థానిక ప్రజలు తమ అవసరాల రీత్యానే వ్యతిరేకించే అవకాశం లేకపోలేదు. ఇప్పుడు చెక్‌డ్యాంల సంతర్పణ జరుగుతున్న చోట కొన్ని పాత చెరువులున్నాయి. అనాలోచితంగా మంజూరు చేస్తున్న ఊటచెరువు కారణంగా వాటి నీటి వనరులు తగ్గిపోయే ప్రమాదం వుంది. తాటిగుంటపల్లి శివారులోని వీరప్ప చెరువు, ద్వాదశి చెరువు అనే రెండు చెరువులు చూస్తే ఈ విషయం అర్థం అవుతుంది. నిజానికి వర్షం వచ్చినప్పుడు వాగులలో, వంకలలో, బంజర్లలో ప్రవహించే నీళ్లు వృథా అవుతున్నాయనుకోవడమే పొరపాటు. వాటి వినియోగం ఏదో ఒక రూపంలో స్థిరపడి ఉంటుంది. అంతకంటే ముఖ్యమైన అవసరానికి వాటిని వినియోగించుకోవడానికి ఆనకట్ట కడతామంటే అది న్యాయమే కావచ్చును గానీ దానికి అధ్యయనం కావాలి, హేతుబద్ధమైన వివేచన కావాలి. అంతా వృథా అవుతున్నట్టేనని భావించి ఏ కట్టకట్టినా అభివృద్ధేనని దబాయించడం అర్థరహితం.

కానీ స్థిరపడిన నీటి హక్కులు కోల్పోతున్నవారికి వీటిని కాదనే హక్కు ఉందా? ఇప్పటికే నోరు విప్పిన ఒకరిద్దరిని కడప పద్ధతిలో బెదిరించడం, హెచ్చరికలు చేయడం మొదలయింది. 'మన ముఖ్యమంత్రి మన జిల్లాకు అడిగినదంతా ఇస్తుంటే అడ్డమొస్తారా' అంటూ ప్రాంతీయ దురభిమానం వారి గొంతులను నొక్కేస్తున్నది. లాభం ఎవరికంటే నిన్న మొన్నటి దాకా ఊరి శివారు దాటని వాడు ఇవ్వాళ స్కార్పియో బండి దిగకుండా ఊర్లు తిరుగుతున్నాడే– వాడికి.

ప్రజాతంత్ర

23 మార్చి 2008



# వాళ్ళకెందుకు 'ప్రాణహితం' కాలేదు?

తెలంగాణలోని వెనకబడిన జిల్లాలలో ఆదిలాబాద్ జిల్లాకు కూడా స్థానం ఉన్నది. ఆదిలాబాద్ జిల్లాను ఆనుకొని ప్రాణహిత నది పారుతున్నా స్థానిక ఆదివాసీ ప్రజానీకానికి సాగునీటిని అందించాలన్న 'సోయి' రాష్ట్రాన్ని ఇప్పటివరకు ఏలిన ఏ ప్రభుత్వానికీ లేదు.

'ప్రజాప్రస్థానం' పేరుతో గ్రామగ్రామానికి కాలినడకన వచ్చి రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా చూసి పరిష్కరిస్తానన్న వాగ్దానంతో అధికారంలోకి వచ్చిన రాజశేఖర్‌రెడ్డి ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీ రైతులకు సాగు, తాగు నీరు అందించే విధంగా ఏ ప్రాజెక్టు చేపట్టలేదు సరికదా ఇక్కడి గ్రామాలను ముంచి, ఇక్కడి నీరు కొల్లగొట్టుకుపోయే విధ్వంస ప్రణాళికను మాత్రం సిద్ధం చేశాడు. ఆ ప్రణాళిక రూపమే 'ప్రాణహిత-చేవెళ్ళ ఎత్తిపోతల ప్రాజెక్టు'. దానికి పునాది రాళ్ళు కూడా వేశాడు.

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న భారీ ప్రాజెక్టులలో ప్రాణహిత - చేవెళ్ళ ప్రాజెక్టు ఒకటి. ఇది జలయజ్ఞానికే తలమానికమని ప్రభుత్వం చెప్పుకుంటున్నది. వార్ధా, పెన్ గంగా నదులు కలిసి కౌటాల మండలం తుమ్మిడిహేటి గ్రామం వద్ద ప్రాణహితగా మారుతున్న చోట ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తున్నారు. ఇక్కడ లభిస్తున్న 305 టియంసిల నీటిలో 160 టియంసిల నీటిని వినియోగించుకొని ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, వరంగల్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు విస్తారంగా సాగునీటిని, తాగునీటిని ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నది. ఇందుకోసం 40 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామని, నిర్వహణ కోసం 3375 మెగావాట్ల కరెంటును వినియోగిస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నది. నీళ్ళు ఇవ్వాలన్న ప్రభుత్వం ఉద్దేశ్యం పట్ల మాకు అభ్యంతరం లేదు. కానీ ఇక్కడి

నుండి పోతున్న నీటిలో స్థానికుల సాగునీటి అవసరాలను ఏ మాత్రం తీరుస్తున్నారు అన్నది మా ప్రశ్న.

దూర ప్రాంతాలకు నీళ్ళు తీసుకుపోయి సంతర్పణ చేస్తున్న ఈ ప్రాజెక్టు నది దాపున ఉన్న గ్రామాలకు మాత్రం చుక్క నీరు కూడా ఇవ్వడం లేదు. తుమ్మిడిహేటి నుండి ప్రాజెక్టు కాలువ కర్జెల్లి, బారెగూడ, సలుగుపల్లి, సులుగుపల్లి దాటి, చెన్నూర్‌లో ప్రవేశించిన తరువాతే స్థానిక ప్రజలకు కొద్దిపాటి నీరు ఇస్తుంది. ఎల్లంపల్లి దాటిన తరువాతనే చెప్పుకోదగ్గ ఆయకట్టు మొదలవుతుంది. ఇదెక్కడి అన్యాయం అని స్థానిక ప్రజలు అడుగుతున్న ప్రశ్నకు ప్రభుత్వం నుండి ఏ జవాబు లేదు. డిసెంబర్ 16వ తేదీన ఇక్కడ శంకుస్థాపన చేయడానికి వచ్చిన ముఖ్యమంత్రిని నిలదీయడానికి స్థానిక ప్రజలు సమాయత్తం కాగా, వారి నాయకులను అరెస్టు చేసి శంకుస్థాపన కానిచ్చేశారు.

ఇది సస్యశ్యామలమైన ప్రాంతం అయివుంటే ప్రభుత్వ వైఖరిని అర్థం చేసుకొని ఉండవచ్చు. కానీ ప్రాణహిత నది దాపున ఉన్న కౌటాల, జెజ్జూరు, దహెగాం, కాగజ్‌నగర్ మండలాల గ్రామాలు వర్షాధారంగా ఒక పంట పండించుకొని బతికే గ్రామాలు. ఆకాశ తరిగా సోయాబీన్స్, కందులు, పెసలు పండించుకొని ఆ తరువాత ఎక్కడయినా పని దొరికితే చేసుకొని, దొరకకపోతే పస్తులుండే ఊర్లు. చాలాకాలంగా ప్రజలు ప్రాణహిత మీద ఆశలు పెట్టుకున్నారు. నాయకులు హామీలిచ్చారు. ప్రాణహిత-చేవెళ్ళ ప్రాజెక్టు ప్రతిపాదన గురించి విన్న నాటి నుండి తమ సాగునీటి అవసరాలు తీరుతాయని అనుకున్నారు. తమ నాలుగు మండలాల సాగు భూములకు ఎంత నీరు కావాలి? 10 లేక 15 టియంసిలు కేటాయించకపోతారా అని భావించారు. ప్రభుత్వ అధికారులు, సిర్పూర్ ఎమ్మెల్యే కూడా అదే అభిప్రాయం కలిగించారు.

కానీ నవంబర్ 19 నాడు చేవెళ్ళలో ముఖ్యమంత్రి మొదటి శంకుస్థాపన చేసినప్పుడు పత్రికలలో ప్రచురించిన ప్రకటన ఆ ఆశలన్నీ అడియాసలేనని రుజువు చేసింది. ప్రాజెక్టు మొదలయిన చోటు నుండి 25 కిలోమీటర్ల వరకు ఈ కాలువ ఒక్క చుక్క నీళ్ళియ్యదని ఆ ప్రకటన జత చేసిన పటం తెలుపుతుంది. అప్పటి నుండి స్థానిక ప్రజలలో ఆందోళన మొదలయింది. దానిని అరెస్టులతో చల్లార్చి తన పని కానిచ్చుకొని పోదామని ప్రభుత్వం చూస్తున్నది.

ప్రాజెక్టు ఫలితం స్థానికులకు దక్కదు గానీ నష్టమంతా వారికే. కాలువ కోసం 300 మీటర్ల వెడల్పు భూమిని, దాని ఒడ్డుకోసం మరింత భూమిని కాలువ మార్గం వెంబడి ప్రభుత్వం సేకరిస్తున్నది. స్థానిక ప్రజలకు ఉన్న వనరులు, ఉన్న జీవనాధారం లేకుండా చేసి దూరప్రాంతాలకు నీళ్లివ్వడం ఏ రకమైన పాలనా నీతి?

నిజానికి అధికారులు ఈ గ్రామాల ప్రజలకు ప్రాణహిత-చేవెళ్ళ ప్రాజెక్టు గురించి గానీ దాని రూపురేఖల గురించి గానీ ఏ రోజూ ఏమీ చెప్పలేదు. ఏ సమాచారం ఇవ్వలేదు. సర్వే సిబ్బంది వస్తారు. ఏమీ చెప్పకుండా సర్వే చేసుకుంటారు. ప్రజలు అభ్యంతరం తెలిపితే 'దౌర్జన్యం' చేసారంటారు. ప్రజలకు కనీసం సమాచారం ఇవ్వకుండా వారి జీవన వనరులను, వారికి అందుబాట్లో ఉన్న నీటి వనరులను వారికి కాకుండా చేయడం 'దౌర్జన్యం' అనిపించుకోదా? కాలువ కింద ఎంత భూమి పోతుంది? అందులో పట్టా భూమి ఎంత? లావణీ ఎంత, బంజరు ఎంత, అడవి ఎంత? భూమి కోల్పోయిన వారికి ప్రభుత్వం వేరే ఎక్కడయినా భూమినిస్తుందా? కూలి చేసుకొని బతికే పేదలకు వేరే ఎక్కడయినా ఉపాధి కల్పిస్తుందా? ఈ ప్రశ్నలకు జవాబు చెప్పకుండా ప్రాజెక్టు పనులు చేసుకుంటూ పోవడం, ప్రజలను చీకట్లో ఉంచడం, ప్రజాస్వామ్య పాలన అనిపించుకుంటుందా?

ప్రాజెక్టు వల్ల కలిగే ఫలాలను స్థానికేతరులు అనుభవిస్తూ ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన స్థానిక గిరిజన ప్రజలు మాత్రం నిర్వాసితులై సర్వం కోల్పోయి నిరాశ్రయులు కారాదు. బలమైన ప్రజా నిరసన మాత్రమే నిర్వాసిత ప్రజలకు న్యాయం జరిగేటట్లు చేస్తుంది. కావున ప్రాణహిత పరీవాహక గ్రామాల సాగునీటి అవసరాలను తీర్చాలని డిమాండ్ చేస్తూ జరిగే ప్రజాచైతన్య యాత్రలో అన్ని వర్గాల ప్రజలు, రాజకీయ పక్షాలు, ప్రజాస్వామికవాదులు పాల్గొని మద్దతునివ్వవలసిందిగా కోరుతున్నాము.

## మా డిమాండ్లు

ప్రాణహిత నది నీటిలో కనీసం 25 టి.యం.సి.లు కౌటాల, బెజ్జూరు, దహెగాం, కాగజ్‌నగర్, సిర్పూర్ మండలాల సాగునీటి, తాగునీటి అవసరాలకు కేటాయించాలి. దాని కోసం ఆచరణ యోగ్యమైన ప్రాజెక్టు ప్రణాళికను రూపొందించాలి.

ఆదిలాబాద్ జిల్లా కలెక్టరు, నీటిపారుదల శాఖ అధికారులు ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు వల్ల భూములు కోల్పోయే అన్ని గ్రామాలలోను గ్రామ సభలకు హాజరయి ప్రాజక్టు తీరుతెన్నుల గురించి, సేకరించబోయే భూముల గురించి, నష్టపరిహారం పునరావాసాల గురించి వివరంగా ప్రజలకు చెప్పి ప్రజల అభిప్రాయాలు వినాలి.

పై రెండూ జరిగేదాకా ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పనులు చేపట్టకూడదు.

మానవహక్కుల వేదిక ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లా శాఖల కరపత్రంగా వచ్చింది.



24 జనవరి 2009

## ప్రాణహిత – చేవెళ్ళ ప్రాజెక్టు :

# స్థానిక అవసరాలు పట్టవా?

వై.ఎస్. రాజశేఖరరెడ్డి ఏదో ఒకరోజు దిగిపోక తప్పదుగానీ అతని జలయజ్ఞం అవశేషాలు మాత్రం మన రాష్ట్రాన్ని (తెలంగాణ వేరయితే రెండు రాష్ట్రాలను) చాలాకాలం పాటు వెన్నాడుతూనే ఉంటాయి. ఈ ఒక్క కారణంగా తెలుగువారు అతనిని చాలాకాలం జ్ఞాపకం ఉంచుకుంటారు.

కొన్నిచోట్ల నీటి చుక్క ఎరుగని కాలవలుంటాయి. కొన్నిచోట్ల కరెంటు కరువయి నిలిచిపోయిన భారీ లిఫ్టులుంటాయి. కొన్నిచోట్ల కరెంటున్నా బిల్లు కట్టేవాడు లేక ఆగిపోయిన లిఫ్టులూ ఉంటాయి. ఈ కారణాలవల్ల ప్రాజెక్టులు శాశ్వతంగా అటకెక్కగా ఎండిపోయిన కాలవలు భూమి మీద అంగారక గ్రహాన్ని తలపించబోతాయి. కొన్నిచోట్ల వచ్చీరాని నీళ్ల కారణంగా నీకు ముందా నాకు ముందా అని ఇరుగు పొరుగు జనం కొట్టుకోబోతారు.

అతను బాధపడతాడని కాదు. తన ప్రయోజనం తాను నెరవేర్చుకోవడం వల్ల వేరే వాళ్లు నష్టపోతేనూ కష్టపడితేనూ బాధపడే నైజం కాదతనిది. మనసు నిండా ఆనందిస్తాడు. నిన్నగాక మొన్న కాంగ్రెస్ అధినాయకత్వం తెలంగాణ గురించి రెండు రోజులు తర్కించి తర్కించి ఏ నిర్ణయం తీసుకోకుండా విరమించిననాడు రాజశేఖరరెడ్డి టివి కెమెరాల ముందు ఎంతగా విరగబడి ఆనందిస్తూ కనిపించాడో చూసే ఉంటారు కదా? వేరే ఎవరైనా ఎంతటి విజయోత్సాహంలోనైనా మరీ అంత పబ్లిగ్గా సంతోషం ప్రకటిస్తే ఓడిపోయినవారు నొచ్చుకుంటారేమోనని కొంచెం

తటపటాయిస్తారు. అది మానవనైజం గానీ ఫాక్షనిస్టు నైజం అది కాదు. ఓడిపోయిన వాడు ఎంతగా కుళ్ళుకుంటే ఫాక్షనిస్టు అంతటి విజయానందం పొందుతాడు.

జలయజ్ఞం విషయానికొస్తే, ఏ కారణం లేకుండ కడుబీద ప్రజానీకానికి కడుపుమంట మిగిలిస్తున్న ప్రాజెక్టులలో ప్రాణహిత- చేవెళ్ళ ఒకటి. ఆ ప్రాజెక్టు మీద చాలా విమర్శలే ఉన్నాయి. ఎకరానికి ఎత్తిపోతలకు అవసరమైన కరెంటు కోసం 10 వేల రూపాయలు ఏటా ఖర్చు చేసి రైతులకు సాగు నీరిచ్చే బదులు ఆ డబ్బు నేరుగా ఇచ్చేయడం తక్కువ శ్రమ కాదా అని వెక్కిరించినవారు ఉన్నారు. ఇది వెక్కిరింతే అయినప్పటికీ, ఆ ప్రాజెక్టులో భాగమైన 16 లిఫ్టుల కోసం ఒక అల్ట్రామెగా థర్మల్ ప్లాంటును విడిగా కేటాయించవలసి ఉందనేది వాస్తవమే. కరెంటు ఖరీదు మీద ప్రభుత్వం అజమాయిషీ ఎంతమేరకు ఉంటుందన్న విషయం ప్రశ్నార్థకంగా మారుతున్న ఈ తరుణంలో కరెంటు పైన అంత భారీగా ఆధారపడే ప్రాజెక్టును వేలకోట్లు ఖర్చుపెట్టి నిర్మించడంలోని విజ్ఞత ఎంత అన్నది చర్చించవలసిన విషయమే. ఇది ప్రాణహిత- చేవెళ్లకే కాదు, జలయజ్ఞం లోని అన్ని ప్రాజెక్టులకూ- పోలవరాన్నీ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులనూ మినహాయించి- హెచ్చుతగ్గులతో వర్తించే చర్చే. చివరికి రాజశేఖరరెడ్డి కడప జిల్లా ప్రయోజనాల కోసం కడు జాగ్రత్తగా కాపాడుకొస్తున్న గాలేరు- నగరి లేక గండికోట ప్రాజెక్టు కూడా దీనికి మినహాయింపు కాదు.

అయితే ఇవ్వాళ్టి విషయం అది కాదు. ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టు ప్రాణహిత నీటిని (ఒకటో రెండో టియంసిలు కాదు, 160 టియంసిలు) చాలా దూరం తీసుకొని పోతుంది గానీ ఆ నది ఒడ్డున ఉన్న గ్రామాలకు ఒక చుక్క నీరియ్యదు. ఆదిలాబాద్ జిల్లాలోని కౌటాల మండలం తుమిడిహేటి గ్రామం దగ్గరి నుండి ఎత్తిపోతల ద్వారా ఈ ప్రాజెక్టు నీటిని తరలిస్తున్నారు. కౌటాల, బెజ్జూరు మండలాలలోని అనేక గ్రామాలలో దాదాపు 300 మీటర్లు వెడల్పున కాలువ కోసం, దాని ఒడ్డున రోడ్డు కోసం భూమి తీసుకోవడం జరుగుతున్నది. రైతుల స్వంత భూములు, ప్రభుత్వం పేదలకిచ్చిన అసైన్డ్ భూములు, పేదలు అనేక రకాలుగా వాడుకుంటున్న ప్రభుత్వ భూములు తీసుకుంటున్నారు. కానీ ఆ ఊర్లకు ఆ ప్రాజెక్టు ద్వారా ఒక్క చుక్క నీరివ్వడం లేదు.

అవేం సస్యశ్యామలమైన గ్రామాలు కావు. వర్షాధారంగా ఒక పంట పండించుకొని బతికే ఊర్లు. ఇప్పుడు తెలంగాణలోని ఇతర ప్రాంతాలలో దండిగా కనిపించే బోర్లు కూడా ఇక్కడ చాలా తక్కువ. వర్షంనీళ్లతో ఆకాశ వడ్లు, సోయా బీన్స్ పండించుకుంటారు. ఆ తరువాత ఎక్కడ పని దొరికితే అక్కడ కూలికి పోతారు.

ప్రాణహిత నుండి 10 టియంసిల నీళ్లు తీసుకొని ఎత్తిపోతల ద్వారా ఈ గ్రామాలకు సాగునీరివ్వాలన్న డిమాండు చాలా కాలంగా ఉంది. దీనికి ప్రభుత్వానికి తీరలేదు గానీ 160 టియంసిల తీసుకొని అయిదు జిల్లాలకు నీళ్లిచ్చే పథకం రచించడానికీ దాని నిర్మాణం చేపట్టడానికీ తీరింది.

నిజానికి ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు గురించి విన్నప్పుడు కౌటాల, బెజ్జూరు మండలాలేకాక పొరుగున ఉన్న దహెగాం, కాగజ్‌నగర్ మండలాల ప్రజలు కూడా చాలా సంతోషించారు. ఎందుకంటే తమకోసం 10 టియంసిలతో ప్రాజెక్టు కట్టమంటే ప్రభుత్వం స్పందించక పోవచ్చును గానీ, 160 టియంసిలతో పెద్ద ప్రాజెక్టు చేపట్టేటట్టయితే అందులో 10 టియంసిలు తమకోసం కేటాయించడం ఏమంత కష్టం కాదు కదా అనుకున్నారు. అవసరమైతే ప్రాజెక్టుకు తీసుకుంటున్న నీటి పరిమాణాన్ని 10 టియంసిలు పెంచవచ్చు గూడ- ఎందుకంటే తుమిడిహేటి దగ్గర ప్రాణహితలో 305 టియంసిల నీరు ఉందని ప్రభుత్వం అంచనా. సిర్పూర్ ఎమ్మెల్యే గారు కూడా ఈ ఆశను ప్రోత్సహించారు. మీకు తప్పకుండా ఇస్తాం అన్నారు. ఎన్నిసార్లు మోసపోయినా ప్రభుత్వాలను ప్రజలు నమ్ముతూనే ఉంటారు కాబట్టి ఈ గ్రామాల ప్రజలు కూడ నమ్మారు.

కానీ మొన్నటి నవంబర్ 19 నాడు చేవెళ్లలో ఈ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసిననాడు ప్రభుత్వమే అన్ని దినపత్రికలలోను ప్రాజెక్టు పరీవాహక ప్రాంత చిత్రపటాన్ని ప్రచురించింది. అది చూసి కౌటాల, బెజ్జూరు మండలాల ప్రజలు అవాక్కయ్యారు. మొదటి 25 కి.మీ.లు ఆ ప్రాజెక్టు కాలవ ఒక్క చుక్క నీరియ్యకుండ దర్జాగా వారి భూములనుండి వెళ్లిపోతుంది. ఆ తరువాత కొంచెం సాగునీరు ఇస్తుంది. యెల్లంపల్లిని దాటి ఆదిలాబాద్ జిల్లా దక్షిణ భాగాన్ని చేరుకున్న తరువాతే చెప్పుకోదగ్గ మోతాదులో నీళ్లిస్తుంది.

అవాక్కయిన ప్రజలు మళ్లీ ఎమ్మెల్యేను అడిగారు. ఏం పెద్దమనిషివయ్యా, ఈ ప్రాజెక్టు మాకు నీళ్లిస్తుందని అన్నావు కదా అన్నారు. అతను మాట మార్చలేదు. ఇవాళ కాకపోతే రేపయినా తప్పకుండా ఇస్తుందనీ, ఇయ్యకపోతే తనను అదే కాలవలో ముంచమనీ (లేదా అటువంటిదే ఏదో) షరతుతో కూడిన హామీ ఇచ్చాడు. వేరే వాళ్లకు నీళ్లు, మాకు హామీలా అని ఆగ్రహించిన స్థానిక ప్రజలు ఆందోళనకు దిగారు.

ప్రాణహిత- చేవెళ్లకు చేవెళ్లలో శంకుస్థాపన వేయడమేంది, ప్రాణహిత దగ్గర వేయాలె గాని అని కెసిఆర్ ఎద్దేవా చేసినందుకు కాబోలు రాజశేఖరరెడ్డి డిసెంబర్ 16నాడు రెండవ శంకుస్థాపన కోసం తుమిడిహేటి వచ్చాడు. హెలికాప్టర్‌లో వచ్చే ముఖ్యమంత్రిని

అడ్డుకోలేకపోయినా కార్లలో రాకతప్పని జిల్లా నాయకులనయినా అడ్డుకుందాం అని స్థానిక ప్రజలు ఆలోచించారు. అయితే ప్రభుత్వం వారందరినీ అరెస్టు చేయించి శంకుస్థాపన కార్యక్రమం చేసుకొని పోయింది.

ఇంతకూ ప్రాణహిత నీళ్లు ఆ నది దాపున ఉన్న గ్రామాలకు దక్కుతాయా, లేక ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో ప్రజలకు అందకుండ ఎగిరి పోయినట్టు అవీ ప్రజలకు అందకుండా ఎగిరిపోతాయా?

ప్రజాతంత్ర

25 జనవరి 2009



# ఈ పుస్తకంలో చేర్చని వ్యాసాల జాబితా

- ఆల్మట్టి ఉపన్యాసం ('రాజ్యం-సంక్షేమం' పుస్తకంలో వుంది)
- కృష్ణానది నీళ్ళను న్యాయంగా పంచుకుందాం
- అసమాన నీటి పంపకం - ప్రాంతాల మధ్య వైషమ్యాలకు దారితీస్తుంది
- ప్రాజెక్టులు - సాధ్యాసాధ్యాలు
- జలయజ్ఞానికి ఆదివాసీ సమిధలు
- పోతిరెడ్డిపాడు గొడవ
- కరువుకూ పోలవరానికి సంబంధం ఏమిటో?
- పోలవరం నిర్మిస్తే ఘోరమే
- సమైక్య రాష్ట్రం కావాలిగాని ఏ చిన్న ప్రయోజనం వదులుకోరా?
- జలరాజకీయాలు, ప్రాంతీయ అసమానతలు

*పై వ్యాసాలలోని విషయాలు ఈ పుస్తకంలోని ఇతర వ్యాసాలలో కూడా వచ్చినందువలన, దానికి తోడు ఈ పుస్తకం ఇప్పటికే పెద్దదయిందన్న ఉద్దేశంతో వీటిని ఇందులో చేర్చలేదు. ఆసక్తి ఉన్నవారు వీటిని www.balagopal.orgలో చదువుకోవచ్చు.*



# ముఖ్యమైన ప్రాజెక్టులు - వాటి సంక్షిప్త వివరాలు

*ఈ పుస్తకంలోని వ్యాసాలలో ప్రస్తావనకు వచ్చిన ప్రాజెక్టుల వివరాలను మాత్రమే ఇక్కడ ఇచ్చాం. ఈ సమాచారమంతా 2013 మార్చి 31 నాటికి ప్రభుత్వం అధికారికంగా చెప్పినదే. శంకుస్థాపనల విషయంలో మొదటి శంకుస్థాపనను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నాం. రిజర్వాయర్ సామర్థ్యం ఇచ్చినప్పుడు* **gross** *సామర్థ్యమే ఇచ్చాం,* **net** *(నికర) కాదు. అలాగే నీటి కేటాయింపు వివరాలు ట్రిబ్యునల్ అవార్డుల్లో, ఒప్పందాల్లో ఉన్నవే ఇచ్చాం. ఆయకట్టు లెక్కలు కూడా ప్రతిపాదిత ఆయకట్టు వివరాలే, వాస్తవ ఆయకట్టు వివరాలు కాదు. నిర్మాణం పూర్తయిన ప్రాజెక్టులకు నిర్మాణ వ్యయం ఇచ్చాం, పూర్తికాని వాటికి అంచనా వ్యయం ఇచ్చాం. ఎంత ప్రయత్నించినా దొరకని వాటిని వదిలేశాం.*

## కృష్ణా బేసిన్ ప్రాజెక్టులు

### 1. ఆల్మట్టి, నారాయణపూర్ రిజర్వాయర్లు

అసలు పేరు : అప్పర్ కృష్ణా ప్రాజెక్టు

శంకుస్థాపన : 1964

నీటి కేటాయింపు : ఆల్మట్టి - 54 టి.యం.సిల నికర జలాలు,
నారాయణపూర్ - 119 టి.యం.సి.ల నికర జలాలు.

రిజర్వాయర్ల సామర్థ్యం : ఆల్మట్టి - 42.19 టి.యం.సిలు
నారాయణపూర్ - 37.86 టి.యం.సి.లు

ఆయకట్టు : 15.36 లక్షల ఎకరాలు

ప్రధాన కాలవల పొడవు :

1. ఆల్మట్టి లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ - 103 కి.మీ, ఆయకట్టు 49,980 ఎకరాలు
2. ఆల్మట్టి రైట్ బ్యాంక్ కెనాల్ - 67 కి.మీ, ఆయకట్టు 39,767 ఎకరాలు

3. నారాయణపూర్ లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ – 78 కి.మీ, ఆయకట్టు 10.09 లక్షల ఎకరాలు

4. నారాయణపూర్ రైట్ బ్యాంక్ కెనాల్ – 95 కి.మీ, ఆయకట్టు 2.07 లక్షల ఎకరాలు

నిర్మాణ వ్యయం : 11,254 కోట్లు

నిర్మాణ దశ : 2010లో పూర్తయింది

కర్ణాటకలోని బీజాపూర్, బాగల్‌కోట్, గుల్బర్గా, రాయచూర్, కొప్పల్ జిల్లాలలోని కరువు పీడిత ప్రాంతాలకు సాగునీరు అందించే ప్రాజెక్టు ఇది. రెండు స్టేజిలలో, మూడు దశలలో (ఫేజ్‌లలో) నిర్మించిన ఈ ప్రాజెక్టులో 297 మెగావాట్ల విద్యుదుత్పత్తి కూడా ఒక భాగం. బీజాపూర్ జిల్లా బాగేవాడి తాలూకాలోని ఆల్మట్టి గ్రామం దగ్గర్లో ఆల్మట్టి రిజర్వాయరును, అదే జిల్లా ముద్దేబిహాల్ తాలూకాలోని సిద్ధాపూర్ గ్రామం వద్ద నారాయణపూర్ రిజర్వాయరును నిర్మించారు. రెండిటికీ మధ్య దూరం సుమారు 50 కి.మీ. నారాయణపూర్ లెఫ్ట్ బ్యాంక్ కెనాల్‌కి నాలుగు పెద్ద బ్రాంచ్ కాలవలున్నాయి. అవి షాపూర్ – 76 కి.మీ, ఇండి – 172 కి.మీ, ముద్బల్ – 50.80 కి.మీ, జెవర్గీ – 86.36 కి.మీ.

అప్పర్ కృష్ణా ప్రాజెక్టు కింద మూడు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలు కూడా ఉన్నాయి.

i) రాంపూర్ ఎత్తిపోతల పథకం: ఇది నారాయణపూర్ రిజర్వాయర్ కుడిగట్టు నుంచి నీళ్లు తీసుకుని 49,980 ఎకరాలకు సాగునీరు అందిస్తుంది.

ii) ఇండి ఎత్తిపోతల పథకం: ఇది నారాయణపూర్ లెఫ్ట్ బ్యాంకు కెనాల్ నుంచి నీళ్లు తీసుకుని 1.03 లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తుంది.

iii) ముల్వాడి ఎత్తిపోతల పథకం: ఇది ఆల్మట్టి రిజర్వాయరు ఎడమగట్టు నుంచి నీళ్లు తీసుకుని 76,200 ఎకరాలకు సాగునీరు అందిస్తుంది.

వీటి తర్వాత అప్పర్ కృష్ణా ప్రాజెక్టు స్టేజి–III 2011లో మొదలయింది. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ అవార్డు కింద కర్ణాటకకు అదనంగా లభించిన 170 టి.యం.సిలలో 130 టి.యం.సిలను వాడుకుని అవే జిల్లాలలో మరో 13.10 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వనున్నారు. దీని అంచనా వ్యయం 17,207 కోట్లు.

## 2. భీమా ఎత్తిపోతల పథకం

| | | |
|---|---|---|
| పూర్తి పేరు | : | రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకం |
| శంకుస్థాపన | : | 1996లో అనుమతులు లభించినప్పటికీ 2005లో పనులు మొదలుపెట్టారు. |
| నీటి కేటాయింపు | : | 20 టి.యం.సిల నికర జలాలు |
| ప్రతిపాదిత ఆయకట్టు | : | 2.03 లక్షల ఎకరాలు; 4,000 ఎకరాల స్థిరీకరణ |
| ప్రధాన కాలవల పొడవు | : | బుద్‌పూర్ కుడిగట్టు కాలవ – 16.00 కి.మీ.<br>బుద్‌పూర్ ఎడమగట్టు కాలవ – 37.80 కి.మీ.<br>సంగంబండ కుడిగట్టు కాలవ – 24.40 కి.మీ.<br>సంగంబండ ఎడమగట్టు కాలవ – 45.00 కి.మీ<br>ఏనుకుంట కాలవ – 29.00 కి.మీ<br>రంగ సముద్రం కాలవ – 81.00 కి.మీ<br>శంకర సముద్రం కుడిగట్టు కాలవ – 39.00 కి.మీ<br>శంకర సముద్రం ఎడమగట్టు కాలవ – 97.00 కి.మీ |
| అంచనా వ్యయం (2008) | : | 2,158.40 కోట్లు |
| నిర్మాణ దశ | : | ఇంకా పూర్తి కాలేదు |

కృష్ణానది మన రాష్ట్రంలోకి ప్రవేశించాక ఇదే మొదటి ప్రాజెక్టు. ఇది మహబూబ్‌నగర్ జిల్లాలోని 11 మండలాలకు సాగునీరు ఇవ్వడమే కాక లక్షన్నర జనాభా గల 196 గ్రామాలకు తాగు నీటిని కూడా సరఫరా చేస్తుంది.

ఈ ప్రాజెక్టుకు కేటాయించిన 20 టి.యం.సిలలో లిఫ్ట్–I కింద 11.687 టి.యం.సిలను మొదట జూరాల జలాశయం ఒడ్డునున్న పంచదేవపాడు దగ్గర 45 మీటర్లు లిఫ్ట్ చేస్తారు. దానిలో 7 టి.యం.సిలను బుద్‌పూర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయరుకు (సామర్థ్యం – 1.313 టి.యం.సిలు) చేర్చి, బుద్‌పూర్ రిజర్వాయరు కుడి ఎడమ కాలవల ద్వారా 46,800 ఎకరాలకు నీరందిస్తారు. మిగిలిన 4 పైచిలుకు టి.యం.సిలను మరో 22 మీటర్లు లిఫ్ట్ చేసి సంగంబండ రిజర్వాయరుకు (సామర్థ్యం – 3.317 టి.యం.సిలు) చేరుస్తారు. అక్కడ నుంచి సంగంబండ రిజర్వాయరు కుడి ఎడమ కాలవల ద్వారా 64,200 ఎకరాలకు నీటి సదుపాయం కల్పిస్తారు. లిఫ్ట్–I వల్ల ప్రయోజనం పొందే 1.11 లక్షల ఎకరాలు మఖ్తల్, ఆత్మకూరు తాలూకాలలో ఉన్నాయి.

లిఫ్ట్-II వనపర్తి తాలూకా రామన్‌పాడు దగ్గరున్న ఊకచెట్టివాగు ప్రాజెక్టు దగ్గర మొదలవుతుంది. అక్కడ 8.313 టి.యం.సిల నీళ్ళను 53.66 మీటర్లు లిఫ్ట్ చేసి ఏనుకుంట (సామర్థ్యం - 0.118 టి.యం.సిలు), రంగ సముద్రం (సామర్థ్యం - 1.895 టి.యం.సిలు), శంకర సముద్రం (సామర్థ్యం - 1.818 టి.యం.సిలు) బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లకు చేర్చి వాటి కాలవల ద్వారా మరో 92 వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తారు. దీనివల్ల లాభపడే తాలూకాలు ఆత్మకూరు, వనపర్తి, కొల్లాపూర్‌లు. ఈ ప్రాజెక్టు ద్వారా శంకర సముద్రం, రంగ సముద్రం చెరువుల కింద సాగులో ఉన్న మరో 4,000 ఎకరాల ఆయకట్టు కూడా స్థిరీకరించబడుతుంది.

## 3. జూరాల ప్రాజెక్టు

| | | |
|---|---|---|
| పూర్తి పేరు | : | ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు |
| శంకుస్థాపన | : | 1981 |
| నీటి కేటాయింపు | : | 17.84 టి.యం.సిల నికర జలాలు |
| రిజర్వాయర్ సామర్థ్యం | : | 11.94 టి.యం.సిలు |
| ప్రతిపాదిత ఆయకట్టు | : | 1.02 లక్షల ఎకరాలు |
| ప్రధాన కాలువల పొడవు | : | కుడిగట్టు ప్రధాన కాలువ - 46.30 కి.మీ |
| | | ఎడమ గట్టు ప్రధాన కాలువ - 85.28 కి.మీ |
| అంచనా వ్యయం (2008-09) | : | 1,240.47 కోట్లు |
| నిర్మాణ దశ | : | ఇంకా పూర్తి కాలేదు |

ఆంధ్ర - కర్ణాటక సరిహద్దుకు 18 కి.మీ దూరంలో మహబూబ్‌నగర్ జిల్లా ధరూర్ మండలం రేవులపల్లి దగ్గర ఉందీ ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టు ఎడమగట్టు ప్రధాన కాలవ ఆత్మకూరు, పెబ్బేరు, కొత్తకోట మండలాలలో 64,500 ఎకరాలకు, కుడిగట్టు ప్రధాన కాలవ గద్వాల్, ఇటిక్యాల, మంపాడ్, ధరూర్, వీపనగండ్ల, కొల్లాపూర్ మండలాలలో 37,700 ఎకరాలకు సాగునీటిని సరఫరా చేస్తుంది. పై మండలాలకు తాగు నీటిని కూడా ఇస్తుంది. ఈ ప్రాజెక్టు ద్వారా 240 మెగావాట్ల విద్యుదుత్పాదన కూడా జరుగుతుంది.

## 4. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం

పూర్తి పేరు : జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం

శంకుస్థాపన : 2004

ప్రతిపాదిత ఆయకట్టు : 2,00,000 ఎకరాలు

నీటి కేటాయింపు : 21.425 టి.యం.సిల మిగులు జలాలు

ప్రధాన కాలవల పొడవు, వాటి ఆయకట్టు:

గూడెందొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయరు కుడి కాలవ: 76 కి.మీ; 56,000 ఎకరాలు

గూడెందొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయరు ఎడమ కాలవ: 8 కి.మీ; 6,000 ఎకరాలు

రేలంపాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కుడి కాలవ: 51 కి.మీ; 1,09,000 ఎకరాలు

రేలంపాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఎడమ కాలవ: 43 కి.మీ; 29,000 ఎకరాలు

అంచనా వ్యయం: 1,521.14 కోట్లు

నిర్మాణ దశ: మొదటి దశ ట్రయల్ రన్ జరిగింది

మహబూబ్‌నగర్ జిల్లా గద్వాల, ఆలంపూర్ నియోజకవర్గాలలోని 8 మండలాలకు సాగునీటితో పాటు 148 గ్రామాలకు తాగునీరు అందించే ఈ ప్రాజెక్టును రెండు దశలలో నిర్మిస్తారు. జూరాల ప్రాజెక్టు తీరప్రాంతంలోని ఉప్పేరు దగ్గర కృష్ణానది నుంచి నీటిని తీసుకుని రెండు చోట్ల 49 మీటర్లు, 63 మీటర్లు చొప్పున లిఫ్ట్ చేస్తారు. మొదటి ఎత్తిపోతలను గూడెందొడ్డి దగ్గర, రెండవదాన్ని రేలంపాడు దగ్గర ప్రతిపాదించారు. 2012 సెప్టెంబరులో ట్రయల్‌రన్ నిర్వహించి నాలుగు మోటార్లలో ఒక మోటారు ద్వారా 750 క్యూసెక్కుల నీటిని గూడెందొడ్డి జలాశయానికి చేర్చారు.

మొదటి దశలో గూడెందొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సామర్థ్యం – 1.20 టి.యం.సిలు) ద్వారా 62 వేల ఎకరాలకు, రెండవ దశలో రేలంపాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు (సామర్థ్యం – 2.309 టి.యం.సిలు) ద్వారా 1.38 లక్షల ఎకరాలకు సాగు నీటిని అందించే ఈ ప్రాజెక్టు వల్ల ధరూర్, గద్వాల, గట్టు, మల్దకల్, ఐజ, ఇటిక్యాల, వడ్డేపల్లి, మంపాడ్ మండలాలకు ప్రయోజనం కలుగుతుంది.

## 5. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం

| | | |
|---|---|---|
| పూర్తి పేరు | : | మహాత్మాగాంధి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం |
| శంకుస్థాపన | : | 1999 |
| నీటి కేటాయింపు | : | 25 టి.యం.సిల మిగులు జలాలు |
| ప్రతిపాదిత ఆయకట్టు | : | 3.40 లక్షల ఎకరాలు |
| ప్రధాన కాలవ పొడవు | : | 206.60 కి.మీ. |
| అంచనా వ్యయం (2005) | : | 2,990 కోట్లు |
| నిర్మాణ దశ | : | మొదటి దశ ట్రయల్ రన్ జరిగింది. |

శ్రీశైలం రిజర్వాయరు బ్యాక్ వాటర్స్ నుంచి కృష్ణా జలాలను తీసుకునే ఈ ప్రాజెక్టు మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ మండలం రేగుమాన్‌గడ్డ దగ్గర నిర్మాణమవుతోంది. నది నీళ్లను మూడు దశలలో మొత్తం 258 మీటర్లు (244 నుంచి 502 మీటర్ల వరకు) లిఫ్ట్ చేసే పథకం ఇది. మొదటి దశలో 95 మీటర్లు లిఫ్ట్ చేసి ఎల్లూరు జలాశయానికి (సామర్థ్యం- 0.35 టి.యం.సిలు) తరలించి దాని నుంచి 13 వేల ఎకరాలకు నీరు అందిస్తారు. అక్కడి నుంచి వాలు ద్వారా సింగోటం జలాశయానికి (సామర్థ్యం- 0.55 టి.యం.సిలు) చేర్చి అక్కడ రెండో లిఫ్ట్ ద్వారా 86 మీటర్లు ఎత్తి జొన్నలబొగడ రిజర్వాయరుకు (సామర్థ్యం - 2.14 టి.యం.సిలు) పంపిస్తారు. దాన్నించి 43,200 ఎకరాలకు సాగునీటిని ఇస్తారు. మిగిలిన నీటిని (3,250 క్యూసెక్కులను) మూడో లిఫ్ట్ ద్వారా 117 మీటర్లు ఎత్తి గుడిపల్లిగట్టు రిజర్వాయరుకు (సామర్థ్యం - 0.960 టి.యం.సిలు) చేరుస్తారు. 2.83 లక్షల ఎకరాలకు, అంటే ఆయకట్టులో అత్యధిక భాగం ఈ జలాశయం నుంచే సాగవుతుంది. ప్రయోజనం పొందే మండలాలు - కొల్లాపూర్, పెదకొత్తపల్లి, కోడేర్, లింగాల, అచ్చంపేట, ఉప్పునూతల, బల్మూరు, నాగర్‌కర్నూలు, బిజినేపల్లి, తెలకపల్లి, కల్వకుర్తి, వంగూరు, మిడ్జిల్, తాడూరు, వెల్దండ, తిమ్మాజిపేట, మద్దుల్, ఘన్‌పూర్, గోపాల్‌పేట్, వనపర్తి, పానగల్, పెద్దమందడి (అన్నీ మహబూబ్‌నగర్ జిల్లాలోనివే). దారిలోని 303 గ్రామాలకు తాగునీటి సదుపాయం కూడా కల్పిస్తుంది ఇది.

## 6. అప్పర్ తుంగ ప్రాజెక్టు

| | | |
|---|---|---|
| శంకుస్థాపన | : | 1992 |
| నీటి కేటాయింపు | : | 12.24 టి.యం.సిల నికర జలాలు |
| రిజర్వాయర్ సామర్థ్యం | : | 3.23 టి.యం.సి.లు |
| ఆయకట్టు | : | 1.98 లక్షల ఎకరాలు |
| ప్రధాన కాలవల పొడువు | : | 339.50 కి.మీ |
| నిర్మాణ వ్యయం | : | 1,644.11 కోట్లు |
| నిర్మాణ దశ | : | 2010లో పూర్తయింది |

కర్ణాటకలోని షిమోగా జిల్లాలో తుంగ నదిపై కట్టిన ప్రాజెక్టు ఇది. ఈ నది భద్రతో కలిసి తుంగభద్రగా మారి ఆ తర్వాత కృష్ణానదిలో కలుస్తుంది. గజానూరు వద్దనున్న తుంగ ఆనకట్టకు వంద మీటర్ల దిగువన కట్టారు ఈ ప్రాజెక్టును. ఇది హావేరి జిల్లాలో 1.76 లక్షల ఎకరాలకు, దావణగెరె జిల్లాలో 17,753 ఎకరాలకు, షిమోగా జిల్లాలో 4,463 ఎకరాలకు సాగు నీరు అందిస్తుంది.

## 7. తుంగభద్ర ప్రాజెక్టు (డ్యామ్, కాలువలు)

| | | |
|---|---|---|
| శంకుస్థాపన | : | 1945 |
| నీటి కేటాయింపు | : | 230 టి.యం.సిల నికర జలాలు (కర్ణాటకకు - 151.49 టి.యం.సిలు, ఆంధ్రప్రదేశ్‌కు - 78.5 టి.యం.సిలు) |
| రిజర్వాయర్ సామర్థ్యం | : | 133 టి.యం.సిలు |
| ఆయకట్టు | : | కర్ణాటకలో - 8.96 లక్షల ఎకరాలు<br>ఆంధ్రప్రదేశ్‌లో - 4.85 లక్షల ఎకరాలు |

ప్రధాన కాలువల పొడవు, వాటికి నీటి కేటాయింపు:

| | | |
|---|---|---|
| 1. రైట్ బ్యాంక్ హైలెవెల్ కెనాల్ | : | 196.43 కి.మీ; 50 టి.యం.సిలు |
| 2. రైట్ బ్యాంక్ లోలెవెల్ కెనాల్ | : | 350 కి.మీ; 52 టి.యం.సిలు |
| 3. లెఫ్ట్ బ్యాంక్ హైలెవెల్ కెనాల్ | : | 15 కి.మీ; 10 టి.యం.సిలు (విద్యుత్ ఉత్పాదనకు మాత్రమే) |
| 4. లెఫ్ట్ బ్యాంక్ లోలెవెల్ కెనాల్ | : | 225 కి.మీ; 92 టి.యం.సిలు |

నిర్మాణ వ్యయం: 117.47 కోట్లు (డ్యామ్, ప్రధాన కాలువల నిర్మాణ వ్యయం)

నిర్మాణ దశ: 1953లో డ్యామ్, 1967లో కాలువలు పూర్తయ్యాయి.

నాగార్జున సాగర్ లాగే ఇదీ బహుళార్థ సాధక ప్రాజెక్టు. తుంగభద్ర డ్యామ్ కర్ణాటకలోని బళ్ళారి జిల్లా హోస్పేట దగ్గర ఉంది. లెఫ్ట్ బ్యాంకు కెనాల్స్ రెండూ పూర్తిగా కర్ణాటక పరిధిలో ఉండగా రైట్ బ్యాంకు కెనాల్స్ మాత్రం అటు కర్ణాటకలోనూ, ఇటు ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రవహిస్తాయి. ఈ ప్రధాన కాలవలకే కాక ఇది కర్ణాటకలోని రాయ, బసవన్న, విజయనగర చానల్స్‌కు 9 టి.యం.సిలను, ఆంధ్రప్రదేశ్‌లోని రాజోలిబండ డైవర్షన్ స్కీముకు 7 టి.యం.సిలను, కె.సి.కెనాల్‌కు 10 టి.యం.సిలను అవసరమైనప్పుడు విడుదల చేస్తుంది.

అంతర్రాష్ట్ర ప్రాజెక్టు కావడం వలన కేంద్ర ప్రభుత్వం 1953లోనే నీటి నియంత్రణకు ఒక బోర్డును నెలకొల్పింది. ఈ బోర్డుకు కేంద్ర జలసంఘం చీఫ్ ఇంజనీర్ ఒకరు అధ్యక్షుడిగా, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన ఇద్దరు అధికారులు సభ్యులుగా ఉంటారు.

## ఎ. తుంగభద్ర రైట్ బ్యాంక్ హై లెవెల్ కెనాల్:

దీన్ని మనం ఎక్కువగా హెచ్ఎల్‌సి అని పిలుస్తుంటాం. ఇది తుంగభద్ర డ్యాం నుంచి 50 టి.యం.సిల నీటిని తీసుకుని 105 కి.మీ దూరం ఉమ్మడి కాలవగాను, ఆ తర్వాత 91 కి.మీ కేవలం ఆంధ్రప్రదేశ్ కాలవగాను ప్రవహిస్తుంది. ఈ 50 టి.యం.సిలలో ఆంధ్రప్రదేశ్ వాటా 32.5 టి.యం.సిలు. దీనికి పెన్నానది నుంచి మిడ్ పెన్నార్ రెగ్యులేటర్, మైలవరం డ్యాంల ద్వారా మరో 7.88 టి.యం.సిలు వచ్చి కలుస్తాయి. హెచ్ఎల్‌సిలో రెండు దశలున్నాయి.

**i) మొదటి దశ:** ఈ దశ పనులను 11.74 కోట్ల ఖర్చుతో 1966లో పూర్తి చేశారు. దీనివల్ల అనంతపురం జిల్లాలో 1,07,516 ఎకరాలకు, కడప జిల్లాలో 5,657 ఎకరాలకు (మొత్తం 1,13,173) సాగునీరు లభిస్తోంది. దీని హెడ్ వర్క్స్ అనంతపురం జిల్లాలోని పెంకచర్ల గ్రామం దగ్గర ఉన్నాయి. ఇది అనంతపురం పట్టణానికి 9 క్యూసెక్కుల తాగునీరు కూడా సరఫరా చేస్తుంది. ఈ దశ కింద నాలుగు ప్రధాన కాలువలు నిర్మించబడ్డాయి.

1) హైలెవెల్ మెయిన్ కాలవ : 186 కి.మీ; ఆయకట్టు 35,366 ఎకరాలు

2) మిడ్ పెన్నార్ నార్త్ కెనాల్ : 58.30 కి.మీ; ఆయకట్టు 13,174 ఎకరాలు

3) మిడ్ పెన్నార్ సౌత్ కెనాల్ : 95.56 కి.మీ; ఆయకట్టు 36,502 ఎకరాలు

4) తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ : 30.58 కి.మీ; ఆయకట్టు 28,114 ఎకరాలు

మిడ్ పెన్నార్ రిజర్వాయరు (సామర్థ్యం - 4.41 టి.యం.సిలు) కూడా దీనిలో భాగమే.

**ii) రెండవ దశ:** 2.21 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఈ దశ పనులు ఇంకా పూర్తికాలేదు. దీనివల్ల అనంతపురం, కడప జిల్లాలతో పాటు కర్నూలు జిల్లాకు కూడా సాగునీరు లభిస్తుంది. ఈ దశ పనుల్లో 14 నిర్మాణాలున్నాయి.

రెండవ దశలోని ప్రధాన కాలవలు, వాటి ఆయకట్టు వివరాలు

1. గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ : 59.4 కి.మీ; ఆయకట్టు 15,396 ఎకరాలు
2. ఆలూరు బ్రాంచ్ కెనాల్ : 39.68 కి.మీ; ఆయకట్టు 14,774 ఎకరాలు
3. గూటి సబ్ బ్రాంచ్ కెనాల్: 8.41 కి.మీ; ఆయకట్టు 16,271 ఎకరాలు
4. మైలవరం నార్త్ కెనాల్: 34.34 కి.మీ; ఆయకట్టు 50,000 ఎకరాలు
5. మైలవరం సౌత్ కెనాల్: 44.44 కి.మీ; ఆయకట్టు 25,000 ఎకరాలు
6. పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయరు రైట్ కెనాల్: 112 కి.మీ; ఆయకట్టు 50,000 ఎకరాలు.
7. యాడికి కెనాల్ సిస్టమ్ : 50,000 ఎకరాలు

మైలవరం డ్యాం (సామర్థ్యం - 9.96 టి.యం.సిలు), పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సామర్థ్యం - 11.10 టి.యం.సిలు) కూడా ఇందులో భాగమే. రెండవ దశ పనులు ఇంకా పూర్తికాలేదు.

## బి. తుంగభద్ర రైట్ బ్యాంక్ లోలెవెల్ కెనాల్

దీన్ని ఎక్కువగా ఎల్ఎల్సి అంటారు. ఒక్క కర్నూలు జిల్లాలోనే 1.51 లక్షల ఎకరాలకు సాగునీరు సరఫరా చేస్తుంది. 350 కి.మీ పొడవుగల ఈ కాలవ ఉమ్మడి కాలవ కనుక మొదటి 250 కి.మీలు తుంగభద్ర బోర్డు ఆధీనంలో ఉంటుంది. మిగతాది ఆంధ్రప్రదేశ్ కిందికి వస్తుంది. లోలెవెల్ కెనాల్కు కేటాయించిన మొత్తం 52 టి.యం.సి.లలో ఆంధ్రప్రదేశ్ వాటా 29.5 టి.యం.సి.లు. ఇది ఒక టి.యం.సి. నీటిని 194 గ్రామాలకు తాగు నీరుగా కూడా సరఫరా చేస్తోంది.

## 8. రాజోలిబండ డైవర్షన్ స్కీం

| | | |
|---|---|---|
| శంకుస్థాపన | : | 1946 |
| నీటి కేటాయింపు | : | 17.10 టి.యం.సిల నికర జలాలు (కర్ణాటకకు 1.20, ఆంధ్రప్రదేశ్‌కు 15.90) |
| ఆయకట్టు | : | 93,379 ఎకరాలు (కర్ణాటకలో 5,879, ఆంధ్రప్రదేశ్‌లో 87,500 ఎకరాలు) |
| ప్రధాన కాలవ పొడవు | : | 143 కి.మీ. (కర్ణాటకలో 43, ఆంధ్రప్రదేశ్‌లో 100 కి.మీ) |
| నిర్మాణ దశ | : | 1958లో పూర్తయింది |

కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ జిల్లాలో రాజోలిబండ వద్ద తుంగభద్ర మీద కట్టిన ప్రాజెక్టు ఇది. తుంగభద్ర డ్యాంకు 120 కి.మీ దిగువన ఉండే ఈ ప్రాజెక్టు కర్ణాటకలో రాయచూర్ జిల్లాకు, ఆంధ్రప్రదేశ్‌లో మహబూబ్‌నగర్ జిల్లాలోని ఐజ, ఇటిక్యాల, అలంపూర్, వడ్డేపల్లి, మంపాడ్ మండలాలలోని 87,500 ఎకరాలకు సాగునీరు ఇస్తుంది. కర్నూలు జిల్లాలో 4 గ్రామాల్లోని 300 ఎకరాలకు కూడా సాగునీరు ఇస్తుంది.

## 9. గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకం

| | | |
|---|---|---|
| శంకుస్థాపన | : | 2002 |
| నీటి కేటాయింపు | : | 5.37 టి.యం.సిల నికరజలాలు |
| ప్రతిపాదిత ఆయకట్టు | : | 50,000 ఎకరాలు |
| ప్రధాన కాలవ పొడవు | : | 19.015 కి.మీ. |
| అంచనా వ్యయం | : | 130.42 కోట్లు |
| నిర్మాణ దశ | : | పూర్తి కాలేదు |

తుంగభద్ర డ్యాం పూడిక వలన లోలెవెల్ కెనాల్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన 24 టి.యం.సిలలో 18.5 టి.యం.సిలు మాత్రమే వస్తుండడంతో ఆ లోటును భర్తీ చేయడానికి రూపొందించిన ప్రాజెక్టు ఇది. ఈ ప్రాజెక్టులో 11 చిన్న చిన్న లిఫ్ట్ ఇరిగేషన్ స్కీములు, ఒక మైనర్ ఇరిగేషన్ స్కీమ్ – అన్నీ తుంగభద్ర కుడిగట్టు మీదే ఉన్నాయి. దీని ద్వారా కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని మంత్రాలయం, ఎమ్మిగనూరు, నందవరం, కోసిగి, పెద్దకదుబూరు మండలాలకు, కోడుమూరు నియోజకవర్గంలోని సి.బెళగల్, గూడూరు, కోడుమూరు, కల్లూరు మండలాలకు సాగునీరు అందుతుంది. ఆ 11 లిఫ్ట్‌లు – మూగలదొడ్డి, సోగనూరు, పులచింత, చిలకలడోన, దొడ్డి, మాధవరం, బసలదొడ్డి, నదిచాగి, గుండ్రేవుల, కె.సింగవరం, తిమ్మనదొడ్డి. మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టు సూగూరు దగ్గర ఉంది.

## 10. కె.సి.కెనాల్

| | | |
|---|---|---|
| పూర్తిపేరు | : | కర్నూలు కడప కాలవ |
| శంకుస్థాపన | : | 1863 |
| నీటి కేటాయింపు | : | 39.90 టి.యం.సిల నికర జలాలు |
| ఆయకట్టు | : | 2.66 లక్షల ఎకరాలు |
| ప్రధాన కాలవ పొడవు | : | 306 కి.మీ |
| వ్యయం | : | 3 కోట్లలోపే |
| నిర్మాణ దశ | : | 1870లో పూర్తయింది |

'మద్రాసు ఇరిగేషన్ అండ్ కెనాల్ కంపెనీ లిమిటెడ్' అనే డచ్ కంపెనీ రవాణా అవసరాలతో పాటు నీటి పారుదల కోసమని ఈ కాలవను నిర్మించింది. 1882లో బ్రిటిష్‌వాళ్లు దీన్ని 3.02 కోట్లకు కొని సర్ ఆర్థర్ కాటన్ సూచన మేరకు నీటిపారుదలను పెంచి రవాణా వాడకాన్ని తగ్గించారు. 1933 నాటికి రవాణాను పూర్తిగా నిలిపేశారు.

తుంగభద్ర డ్యాంకు 200 కి.మీ దిగువన ప్రారంభమవుతుందీ కాలవ. ఇది ప్రధానంగా కర్నూలు (1.74 లక్షల ఎకరాలు), కడప (0.92 లక్షల ఎకరాలు) జిల్లాలకు సాగునీరు అందించే ప్రాజెక్టే అయినా కొద్ది భాగం మహబూబ్‌నగర్ జిల్లాకు కూడా ఉపయోగపడుతుంది. తుంగభద్ర, గాలేరు, కుందు, పెన్నా నదుల మీద నాలుగు ఆనకట్టలు కట్టి ఒక వినూత్న పద్ధతిలో దీన్ని రూపొందించారు. ఆయా చోట్ల ఆయకట్టుకు అవసరమైన నీటిని మాత్రమే కె.సి.కెనాల్ ద్వారా తీసికెళుతూ మిగతా నీటిని నదుల ద్వారా తరలించడం ఈ డిజైన్ ప్రత్యేకత. కె.సి.కెనాల్ కోసం కట్టిన నాలుగు ఆనకట్టలు ఇవీ–

**i) సుంకేసుల ఆనకట్ట:** తుంగభద్ర కుడిగట్టు మీద కర్నూలు జిల్లాలో ఉన్న సుంకేసుల గ్రామానికి, ఎడమగట్టు మీద మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న రాజోలి గ్రామానికి మధ్య ఈ ఆనకట్ట కట్టారు. కె.సి.కెనాల్ ఇక్కడ్నించే మొదలై సూల లాకుల దాకా 120.19 కి.మీ. ప్రయాణిస్తుంది. అక్కడ్నించి కెనాల్ నీళ్లు రెండుగా చీలిపోయి ఒక భాగం ఆ ప్రాంత ఆయకట్టుకు అవసరమైన నీళ్లను తీసుకుపోతే మిగతా భాగం నిప్పుల వాగులోకి వెళ్లి కలుస్తుంది.

**ii) సంతజూటూరు ఆనకట్ట:** నిప్పులవాగు ద్వారా వచ్చిన నీరు గాలేరు నదిలో కలిసి కొంతదూరం ప్రయాణించిన తర్వాత గాలేరు, కె.సి.కెనాల్ కలిసేచోట సంతజూటూరు దగ్గర కట్టారు ఈ ఆనకట్టను.

**iii) రాజోలి ఆనకట్ట:** సంతజూటూరు ఆనకట్ట తర్వాత గాలేరు నది 13 కి.మీ. ప్రయాణించి కుందు నదిలో కలుస్తుంది. సంతజూటూరు ఆనకట్ట నుంచి 84 కి.మీ ప్రయాణించాక కె.సి.కెనాల్ కుందు నదిలో కలుస్తుంది. అక్కడ కట్టిన ఆనకట్టే ఇది.

**iv) ఆదినిమ్మాయపల్లి ఆనకట్ట:** రాజోలి ఆనకట్టకు, దీనికి మధ్య దూరం 56.36 కి.మీ. రాజోలి ఆయకట్టుకు కావాల్సిన నీరు తీసుకున్న తర్వాత మిగిలిన నీరు కొంత దూరం కుందులోనే ప్రవహించాక పెన్నా నదిలో కలుస్తుంది. కె.సి.కెనాల్ పెన్నానదిలో కలిసేచోట ఈ ఆనకట్ట కట్టారు.

మొదటి రెండు ఆనకట్టలు కర్నూలు జిల్లాలో, తర్వాతి రెండు ఆనకట్టలు కడప జిల్లాలో ఉన్నాయి. ఆదినిమ్మాయపల్లి ఆనకట్ట తర్వాత కె.సి.కెనాలే మరో 14.86 కి.మీ ప్రయాణించి కృష్ణపురం దగ్గర కడప చెరువులో కలిసి ఆగిపోతుంది.

## 11. హంద్రీ – నీవా ప్రాజెక్టు

| | | |
|---|---|---|
| పూర్తి పేరు | : | అనంత వెంకటరెడ్డి హంద్రీ – నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం |
| శంకుస్థాపన | : | 1988 |
| నీటి కేటాయింపు | : | 40 టి.యం.సి.ల మిగులు జలాలు |
| ప్రతిపాదిత ఆయకట్టు | : | 6.025 లక్షల ఎకరాలు |
| అంచనా వ్యయం (2007) | : | 6,850 కోట్లు (ఫేజ్–I: 2,774 కోట్లు; ఫేజ్–II: 4,076 కోట్లు) |
| ప్రధాన కాలవ పొడవు | : | 610 కి.మీ |
| నిర్మాణ దశ | : | ఇంకా పూర్తి కాలేదు |

ఇది రాయలసీమ నాలుగు జిల్లాల్లోని బాగా వెనకబడిన ప్రాంతాలకు తాగునీరు, సాగునీరు సరఫరా చేయడానికి ఉద్దేశించిన పథకం. శ్రీశైలం రిజర్వాయరు బ్యాక్ వాటర్స్ నుంచి కృష్ణానది నీళ్ళు లిఫ్ట్ చేసే ఈ పథకం కర్నూలు జిల్లా మల్యాల దగ్గర మొదలవుతుంది. దీనికి కర్నూలు జిల్లాలో 115 కి.మీ. అనంతపురం జిల్లాలో 370 కి.మీ, చిత్తూరు జిల్లాలో 125 కి.మీ దూరం కాలవలు ఉంటాయి.

రెండు దశలలో నిర్మించే ఈ ప్రాజెక్టు ద్వారా తొలి దశలో కర్నూలు జిల్లాలో 80 వేల ఎకరాలకు, అనంతపురం జిల్లాలో 1.18 లక్షల ఎకరాలకు 14 టి.యం.సిల సాగునీరు అందివ్వాలని ప్లాన్. మొదటి దశ కాలవ పొడవు 216 కి.మీ. మొదటి దశలో మొత్తం

8 లిఫ్టులు ద్వారా 203 మీటర్లు లిఫ్ట్ చేసి కృష్ణగిరి (సామర్థ్యం - 0.153 టి.యం.సిలు), పత్తికొండ (సామర్థ్యం - 0.898 టి.యం.సిలు), జీడిపల్లి (సామర్థ్యం - 1.55 టి.యం.సిలు) రిజర్వాయర్లను నింపుతారు.

రెండవ దశలో అనంతపురం జిల్లాలో 2.27 లక్షల ఎకరాలకు, కడప జిల్లాలో 37,500 ఎకరాలకు, చిత్తూరు జిల్లాలో 1.40 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని ప్లాన్. రెండవ దశలో ఒక లిఫ్ట్, 5 రిజర్వాయర్లు ఉన్నాయి. అవి మారాల రిజర్వాయరు (సామర్థ్యం - 0.464 టి.యం.సిలు), శ్రీనివాసపురం రిజర్వాయరు(సామర్థ్యం - 0.354 టి.యం.సి.లు), గొల్లపల్లి రిజర్వాయరు (సామర్థ్యం - 1.096 టి.యం.సిలు), చెర్లొపల్లి రిజర్వాయరు (సామర్థ్యం - 1.096 టి.యం.సిలు), అడవిపల్లి రిజర్వాయరు (సామర్థ్యం - 1.10 టి.యం.సిలు).

రెండవ దశలో 394 కి.మీ పొడవైన ప్రధాన కాలవే గాక పేరూరు (పొడవు - 16 కి.మీ), ఆత్మకూరు (పొడవు - 5 కి.మీ), మడకశిర, పుంగనూరు (పొడవు - 210 కి.మీ), తంబళ్ళపల్లి (పొడవు - 40 కి.మీ), వాయల్పాడు (పొడవు - 44 కి.మీ), నీవా (పొడవు - 120 కి.మీ) మొదలైన ప్రధాన బ్రాంచ్ కాలవలు కూడా ఉన్నాయి.

ఎన్నో శంకుస్థాపనల తర్వాత కూడా పెద్దగా ముందుకు కదలని ఈ ప్రాజెక్టులో కొన్ని మార్పులు చేసి తాగునీటి సరఫరాకు అవసరమైన పనులను ముందుగా పూర్తి చేశారు. 33 లక్షల మందికి 5.5 టి.యం.సిల తాగునీటిని సరఫరా చేసే ఆ పథకానికి హంద్రీ-నీవా తాగునీటి సరఫరా పథకం అని వేరే పేరు పెట్టారు.

నిజానికి హంద్రీ- నీవా నదులతో ఈ ప్రాజెక్టుకు ఏమీ సంబంధం లేదు. కాకపోతే ఆ నదుల పరీవాహక ప్రాంతంలో దీని ఆయకట్టు ఉంది.

## 12. గాలేరు - నగరి ప్రాజెక్టు

| | | |
|---|---|---|
| పూర్తి పేరు | : | కృష్ణదేవరాయ గాలేరు - నగరి సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం |
| శంకుస్థాపన | : | 1988 |
| నీటి కేటాయింపు | : | 38 టి.యం.సి.ల మిగులు జలాలు |
| ప్రతిపాదిత ఆయకట్టు | : | 2.6 లక్షల ఎకరాలు |
| ప్రధాన కాలవ పొడవు | : | 338.021 కి.మీ |
| అంచనా వ్యయం | : | 7,466.36 కోట్లు (ఫేజ్-I: 4,940.45 కోట్లు, ఫేజ్-II: 2,525.91 కోట్లు) |
| నిర్మాణ దశ | : | ఇంకా పూర్తి కాలేదు |

శ్రీశైలం రిజర్వాయరు బ్యాక్ వాటర్స్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా కడప, నెల్లూరు, చిత్తూరు, జిల్లాలలో రబీ సాగుకు కృష్ణానది నీళ్ళను రెండు దశలలో తీసుకుపోయే పథకం ఇది. మొదటి దశలో ఎస్ఆర్బిసి మెయిన్ కాలవ ద్వారా ముందుగా గోరకల్లు రిజర్వాయర్ (సామర్థ్యం - 12.44 టి.యం.సిలు)కు నీళ్ళను తీసుకెళ్ళి అక్కడ్నించి ఒక వరద కాలవ (పొడవు - 57.70 కి.మీ) ద్వారా అవుకు రిజర్వాయరు (సామర్థ్యం - 4.31 టి.యం.సిలు)ను నింపుతుంది. అవుకు రిజర్వాయరు నుంచి మరొక వరద కాలవ (పొడవు - 58.125 కి.మీ) ద్వారా పెన్నానది మీద కడుతున్న గండికోట రిజర్వాయరును (సామర్థ్యం - 26.85 టి.యం.సిలు) నింపుతుంది. ఈ ప్రాజెక్టు ప్రధాన కాలవ గండికోట రిజర్వాయర్ నుంచి మొదలవుతుంది. మొదటి దశ ప్రధాన కాలవ మీద వామికొండ సాగర్ (సామర్థ్యం - 1.6 టి.యం.సిలు), సర్వరాజసాగర్ (సామర్థ్యం - 3.059 టి.యం.సిలు) రిజర్వాయర్లు వున్నాయి. మొదటి దశలో గండికోట నుంచి మొదలయ్యే 32.64 కి.మీల పొడవున్న ప్రధాన కాలువ ద్వారా కడప జిల్లాలో 35 వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తారు.

రెండవ దశలో కడప జిల్లాలో 1.20 లక్షల ఎకరాలకు, చిత్తూరు జిల్లాలో 1.035 లక్షల ఎకరాలకు, నెల్లూరు జిల్లాలో 1,500 ఎకరాలకు సాగునీటిని సరఫరా చేస్తారు. ఈ దశలో 305 కి.మీ పొడవైన ప్రధాన కాలవ ద్వారా ఉద్దిమడుగు (సామర్థ్యం - 1.04 టి.యం.సిలు), మల్లిమడుగు (సామర్థ్యం - 2.86 టి.యం.సి.లు), శ్రీ బాలాజీ (సామర్థ్యం - 3.0 టి.యం.సిలు), పద్మసాగర్ (సామర్థ్యం - 0.45 టి.యం.సిలు), శ్రీనివాససాగర్ (సామర్థ్యం - 0.448 టి.యం.సిలు), వేణుగోపాల్సాగర్, వేపగుంట, అడవి కొత్తూర్ (సామర్థ్యం - 1.0 టి.యం.సి) రిజర్వాయర్లను నింపుతూ నగరి నదిలోకి నీళ్ళను తీసుకెళుతుందీ ప్రాజెక్టు.

ఈ ప్రాజెక్టు దారిలోని గ్రామాలకు, పట్టణాలకు మంచినీటి సదుపాయం కూడ కల్పిస్తుంది.

ఈ ప్రాజెక్టు నుంచి నీళ్లు తీసుకునే ఇతర ప్రాజెక్టులు

1) గండికోట ఎత్తిపోతల పథకం ద్వారా 88,500 ఎకరాల పులివెందుల బ్రాంచ్ కెనాల్ ఆయకట్టు స్థిరీకరణకు - 6 టి.యం.సిలు.

2) 1,26,000 ఎకరాలకు మైక్రో ఇరిగేషన్ పద్ధతిలో సాగునీటిని అందించేందుకు ఉద్దేశించిన గండికోట - చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయరు పథకానికి- 8.83 టి.యం.సిలు.

3) బ్రహ్మణీ స్టీల్స్ - 2.00 టి.యం.సిలు; ఎస్.జె.కె. స్టీల్ ప్లాంట్ - 0.3 టి.యం.సిలు; రఘురాం సిమెంట్స్ - 0.09 టి.యం.సిలు.

## 13. తెలుగు గంగ ప్రాజెక్టు

| | | |
|---|---|---|
| పూర్తి పేరు | : | నందమూరి తారక రామారావు తెలుగు గంగ ప్రాజెక్టు |
| శంకుస్థాపన | : | 1983 |
| నీటి కేటాయింపు | : | సాగునీటికి – 59 టి.యం.సిల మిగులు జలాలు<br>తాగునీటికి – 15 టి.యం.సిల నికర జలాలు |
| ప్రతిపాదిత ఆయకట్టు | : | 5.75 లక్షల ఎకరాలు |
| ప్రధాన కాలవ పొడవు | : | 433.275 కి.మీ<br>(పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఆంధ్రప్రదేశ్ – తమిళనాడు సరిహద్దు వరకు: 408 కి.మీ, ఆంధ్రప్రదేశ్ – తమిళనాడు సరిహద్దు నుంచి పూండి జలాశయం వరకు: 25.275 కి.మీ.) |
| అంచనా వ్యయం (2006-07) | : | 4,432 కోట్లు |
| నిర్మాణ దశ | : | పూర్తి కాలేదు |

మద్రాసు మహానగరానికి మంచినీటి సరఫరా కోసం మొదట ఉద్దేశించిన ఈ ప్రాజెక్టు క్రమంగా సాగునీటి ప్రాజెక్టుగా విస్తరించింది. ప్రతిపాదిత 5.75 లక్షల ఎకరాల ఆయకట్టులో కర్నూలు జిల్లాలో 1.08, కడప జిల్లాలో 1.67, చిత్తూరు జిల్లాలో 0.46, నెల్లూరు జిల్లాలో 2.54 లక్షల ఎకరాలు ఉన్నాయి. ఇది మద్రాసు మహానగరానికి తీసుకెళ్లే 15 టి.యం.సిల కృష్ణా జలాలలో కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌ల వాటా తలా 5 టి.యం.సి.లు. దీని హెడ్‌వర్క్స్ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వద్ద ఉన్నాయి. అక్కడ్నించి బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ ద్వారా కృష్ణా జలాలు చెన్నై సమీపంలోని పూండి జలాశయం చేరుకుంటాయి.

సాగునీటికి ఉద్దేశించిన 59 టి.యం.సిల మిగులు జలాలలో కృష్ణానది నుంచి 29, పెన్నానది నుంచి 30 తీసుకుంటారు. వీటిని వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు (16.95 టి.యం.సిలు), శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి రిజర్వాయరు (17 టి.యం.సిలు), సోమశిల రిజర్వాయరు (78 టి.యం.సిలు), కందలేరు రిజర్వాయరు (68 టి.యం.సిలు)ల ద్వారా సరఫరా చేస్తారు.

## 14. శ్రీశైలం ప్రాజెక్టు

| | | |
|---|---|---|
| పూర్తి పేరు | : | నీలం సంజీవరెడ్డి సాగర్ శ్రీశైలం ప్రాజెక్టు |
| శంకుస్థాపన | : | 1963 |
| నీటి కేటాయింపు | : | 33 టి.యం.సిల నికర జలాలు (ఆవిరి నష్టం) |
| రిజర్వాయరు సామర్థ్యం | : | 308 టి.యం.సి.లు |
| నిర్మాణ వ్యయం | : | 38.47 కోట్లు |
| నిర్మాణ దశ | : | 1984లో పూర్తయింది |

కర్నూలు జిల్లాలోని శ్రీశైలం దగ్గర కృష్ణానది మీద కట్టిన ఈ ప్రాజెక్టు మొదట కేవలం జల విద్యుదుత్పాదనకు ఉద్దేశించినది. ఈ ప్రాజెక్టులో రెండు జలవిద్యుత్ కేంద్రాలున్నాయి. ఎడమగట్టు మీద ఉన్న కేంద్రం 900 మెగావాట్లు, కుడిగట్టు మీద ఉన్న కేంద్రం 770 మెగావాట్లు ఉత్పత్తి చేస్తాయి. మన రాష్ట్రంలో ఇదే మొదటి, అతిపెద్ద జలవిద్యుత్ కేంద్రం. విద్యుదుత్పాదన తర్వాత ఆ నీటిని నాగార్జునసాగర్‌కు వదిలేసే వారు. అంటే నాగార్జునసాగర్‌కు ఇది బ్యాలెన్సింగ్ రిజర్వాయరుగా ఉపయోగపడేది. ఈ ప్రాజెక్టు నుండి నేరుగా సాగు కోసం నీటిని తరలించకూడదని బచావత్ ట్రిబ్యునల్ తన నివేదికలో స్పష్టంగా పేర్కొంది. అందుకే కేవలం ఆవిరి నష్టానికని 33 టి.యం.సిలను కేటాయించింది.

అయితే ఆ తర్వాత సాగునీటి అవసరాల కోసం 1981లో శ్రీశైలం కుడిగట్టు కాలవ (ఎస్ఆర్‌బిసి), 1983లో తెలుగుగంగ ప్రాజెక్టు, శ్రీశైలం ఎడమగట్టు కాలవ (ఎస్ఎల్‌బిసి)లు నిర్మించాలని నిర్ణయించారు.

ఈ ప్రాజెక్టులే కాక జలయజ్ఞంలో భాగంగా ప్రస్తుతం కొత్తగా కడుతున్న గాలేరు-నగరి, హంద్రీ-నీవా, వెలిగొండ, కల్వకుర్తి ప్రాజెక్టులు కూడా శ్రీశైలం రిజర్వాయర్ తీరప్రాంతం నుంచే కృష్ణానది నీటిని తీసుకుంటాయి.

## 15. శ్రీశైలం కుడిగట్టు కాలవ (ఎస్ఆర్బిసి)

| | | |
|---|---|---|
| శంకుస్థాపన | : | 1981 |
| నీటి కేటాయింపు | : | 19 టి.యం.సి.ల నికర జలాలు |
| ఆయకట్టు | : | 1.90 లక్షల ఎకరాలు |
| ప్రధాన కాలవ పొడవు | : | 199 కి.మీ |
| అంచనా వ్యయం (1993-94) | : | 1,979 కోట్లు |
| నిర్మాణ దశ | : | ఇంకా పూర్తికాలేదు |

ఈ కాలవ నిర్మాణంలో ఏడు ముఖ్య భాగాలు ఉన్నాయి

i) 3.4 కి.మీ పొడవైన అప్రోచ్ చానెల్

ii) పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్

iii) 16.34 కి.మీ. పొడవైన మెయిన్ కెనాల్

iv) బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్

v) 199 కి.మీ పొడవైన కుడి బ్రాంచి కాలవ

vi) గోరకల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు (సామర్థ్యం - 12.44 టి.యం.సిలు)

vii) అవుకు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు (సామర్థ్యం - 4.31 టి.యం.సిలు)

కుందేరు నది కుడి వైపుండే భూములకు ఇది సాగునీరు ఇస్తుంది. దీని ఆయకట్టులో కర్నూలు జిల్లాలో (మూడు తాలూకాలు) 1.67 లక్షల ఎకరాలు, కడప జిల్లాలో (ఒక తాలూకా) 22,600 ఎకరాలు ఉన్నాయి.

1983లో తెలుగుగంగ ప్రాజెక్టు రంగం మీదికొచ్చాక బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ వరకు, అంటే పైన పేర్కొన్న ఏడు ముఖ్య భాగాలలో మొదటి నాలుగూ తెలుగుగంగ ప్రాజెక్టులో కలిపేశారు.

## 16. శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బిసి)

| | | |
|---|---|---|
| పూర్తి పేరు | : | ఎలిమినేటి మాధవరెడ్డి శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ ప్రాజెక్టు |
| శంకుస్థాపన | : | గ్రావిటీ స్కీమ్ - 1983, లిఫ్ట్ స్కీమ్ - 1998 |
| నీటి కేటాయింపు | : | 30 టి.యం.సిల మిగులు జలాలు |
| ఆయకట్టు | : | గ్రావిటీ స్కీమ్ - 3.0 లక్షల ఎకరాలు<br>లిఫ్ట్ స్కీమ్ - 2.7 లక్షల ఎకరాలు |
| ప్రధాన కాలవల పొడవు | : | గ్రావిటీ స్కీమ్ (టన్నెల్స్‌తో సహా) - 185 కి.మీలు<br>లిఫ్ట్ స్కీమ్ హెచ్ఎల్‌సి - 136 కిమీ<br>లిఫ్ట్ స్కీమ్ ఎల్ఎల్‌సి - 85 కి.మీ |
| అంచనా వ్యయం: | : | 5,639.66 కోట్లు (లిఫ్ట్ స్కీమ్ + గ్రావిటీ స్కీమ్ + ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం) |
| నిర్మాణ దశ | : | ఇంకా పూర్తి కాలేదు |

ఇది ప్రధానంగా నల్లగొండ జిల్లాకు సాగునీరు, తాగునీరు తీసికెళ్లే కాలవ. మూడు లక్షల ఎకరాల మెట్ట పొలాలకు సాగునీరు, దారిపొడుగునా ఉన్న ఫ్లోరైడ్ బాధిత గ్రామాలకు తాగునీరు ఇవ్వడం దీని లక్ష్యం. ఇందులో రెండు ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. ఒకటి గ్రావిటీ స్కీమ్, రెండోది లిఫ్ట్ స్కీమ్. మొదటిది ఆలస్యమవుతోందని రెండోది మొదట మొదలుపెట్టారు. గ్రావిటీ స్కీంలో భాగంగా తవ్వే సొరంగాలలో రెండవ దాని చివర ఈ రెండు స్కీమ్‌ల కాలవలూ వచ్చి కలుస్తాయి. గ్రావిటీ స్కీమ్ పూర్తయ్యాక లిఫ్ట్ స్కీమ్‌ని వేరే వాటి కోసం ఉపయోగిస్తారు.

**i) లిఫ్ట్ స్కీమ్:** ఇది నాగార్జునసాగర్ రిజర్వాయరు నుంచి రెండుచోట్ల నీళ్లను లిఫ్ట్ చేసి నల్లగొండ జిల్లాలోని 21 మండలాలకు చెందిన 2.70 లక్షల ఎకరాల మెట్ట పొలాలకు అందిస్తుంది. దానితో పాటు 516 ఫ్లోరైడ్ బాధిత గ్రామాలకు తాగునీరు కూడా ఇస్తుంది. దీనికి రెండు కాలవలున్నాయి. హైలెవెల్, లోలెవెల్ కాలవలు. మొదటిది 2.20 లక్షల ఎకరాలను, రెండోది 50 వేల ఎకరాలను సాగు చేస్తుంది.

హైలెవెల్ కాలవకు సంబంధించి ఆరు ముఖ్య నిర్మాణాలు ఉన్నాయి.

1. అప్రోచ్ చానెల్ పొడవు – 6 3.32 కి.మీ
2. ఇన్‌టేక్ చానెల్ పొడవు – 1.47 కి.మీ
3. లింక్ కెనాల్ పొడవు – 9.26 కి.మీ
4. అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సామర్థ్యం – 1.5 టి.యం.సిలు)
5. ఉదయ సముద్రం చెరువు (సామర్థ్యం – 1.52 టి.యం.సిలు)

లోలెవెల్ కాలవ వరద సమయంలో గ్రావిటీ ద్వారా, మామూలు సమయంలో 4 మెగావాట్ల పంపుల ద్వారా నీళ్లను లిఫ్ట్ చేస్తుంది. దీని పొడవు 85 కి.మీ.

**ii) గ్రావిటీ స్కీమ్ లేదా టన్నెల్ స్కీమ్:** ఆయకట్టు భూముల కంటే శ్రీశైలం రిజర్వాయరు ఎత్తు మీద ఉండడం వల్ల గ్రావిటీ ద్వారా నీళ్లను తీసికెళ్లడం సులభమన్న ఉద్దేశంతో దీన్ని రూపొందించారు. అయితే నల్లమల కొండలు అడ్డుగా ఉండడంతో, కనీసం రెండు సొరంగాలను తవ్వాల్సిన అవసరం ఉండడంతో ఇది ఆలస్యమవుతుందని లిఫ్ట్ స్కీం మీద ముందుగా దృష్టి పెట్టారు.

**ఈ స్కీంలో ఐదు ముఖ్య భాగాలున్నాయి.**

1. శ్రీశైలం డ్యాంకు 4 కి.మీ ఎగువన హెడ్ రెగ్యులేటర్ ఏర్పాటు.
2. మహబూబ్‌నగర్ జిల్లా అమ్రాబాద్ పీఠభూమిలో 43.5 కి.మీ పొడవుండే మొదటి సొరంగం. ఈ సొరంగం దిండి లోయలోకి తెరుచుకుంటుంది.
3. రెండు సొరంగాల మధ్య దిండి లోయలో ఒక బ్యాలెన్సింగ్ రిజర్వాయరు (సామర్థ్యం – 7.54 టి.యం.సిలు). ఇది దిండి రిజర్వాయరుకు 30 కి.మీ దిగువన ఉంటుంది.
4. 7.24 కి.మీ పొడవుండే రెండో సొరంగం. దిండి – పెద్దవాగు మధ్యనుండే కొండను తొలచి ఈ సొరంగాన్ని నిర్మిస్తారు.
5. రెండవ సొరంగం తర్వాత 25 కి.మీ. వరకు ఓపెన్ కాలవగా ఉండి, అక్కడ లిఫ్ట్ స్కీమ్ మెయిన్ కాలవలో కలుస్తుంది. కాలవ మూసీ రిజర్వాయరు దాకా వెళుతుంది. హెడ్ రెగ్యులేటర్ నుండి మూసీ దాకా టన్నెల్స్‌తో సహా మొత్తం పొడవు 185 కి.మీ.

లక్ష ఎకరాలకు సాగునీటిని అందించే ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం కూడా ఇందులో భాగమే కానీ దీని పనులు ఇంకా మొదలు కాలేదు.

## 17. వెలిగొండ ప్రాజెక్టు

| | | |
|---|---|---|
| పూర్తి పేరు | : | పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు |
| శంకుస్థాపన | : | 1996 |
| నీటి కేటాయింపు | : | 43.5 టి.యం.సిల మిగులు జలాలు |
| ప్రతిపాదిత ఆయకట్టు | : | 4.47 లక్షల ఎకరాలు |
| ప్రధాన కాలవల పొడవు | : | తూర్పు ప్రధాన కాలవ - 199.91 కి.మీ<br>తీగలేరు కాలవ - 48.15 కి.మీ<br>గొట్టిపడియ కాలవ - 12 కి.మీ<br>పశ్చిమ బ్రాంచ్ కాలవ - 22.7. కి.మీ |
| అంచనా వ్యయం (2005-06) | : | 5,150 కోట్లు |
| నిర్మాణ దశ | : | పూర్తి కాలేదు |

కృష్ణానది నీళ్లను ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాలలోని కరువు పీడిత ప్రాంతాలకు తీసుకెళ్లే ప్రాజెక్టు ఇది. సాగునీటితో పాటు దారి పొడవునా ఉన్న గ్రామాలకు (15 లక్షల జనాభా) తాగునీరు కూడా అందిస్తుంది. నల్లమల కొండల్లోని కొల్లంవాగు అనే ఊరి దగ్గర రెండు సొరంగాలు తవ్వి శ్రీశైలం రిజర్వాయరు బ్యాక్ వాటర్స్ నుంచి నీళ్లు తీసుకెళ్లాలని ప్లాన్. ప్రకాశం జిల్లా నల్లమల కొండల్లోని సుంకేసుల, గొట్టిపడియ, కాకర్ల వద్ద డ్యామ్‌లు కట్టడం వల్ల నల్లమలసాగర్ రిజర్వాయరు (సామర్థ్యం - 53.85 టి.యం.సిలు) ఏర్పడుతుంది. ఆ నీటిని తీగలేరు, గొట్టిపడియ, తూర్పు కాలవల ద్వారా పొలాలకు సరఫరా చేస్తారు. ఈ మూడు ప్రధాన కాలవలు నల్లమల సాగర్ నుంచే మొదలవుతాయి. తూర్పు కాలవ మీద పెద్దిరెడ్డిపల్లె రిజర్వాయరు (సామర్థ్యం - 2.023 టి.యం.సి.లు), పశ్చిమ బ్రాంచ్ కాలవ మీద తురిమెళ్ళ (సామర్థ్యం - 2.453 టి.యం.సిలు), గుండ్ల బ్రహ్మేశ్వరం (సామర్థ్యం - 0.415 టి.యం.సిలు) రిజర్వాయర్లు, రాచర్ల చెరువు ఉన్నాయి. ఈ ప్రాజెక్టు వల్ల ప్రకాశం జిల్లాలోని 23 మండలాలలో 3.36 లక్షల ఎకరాలకు, కడప జిల్లాలోని 2 మండలాలలో 27,200 ఎకరాలకు, నెల్లూరు జిల్లాలోని 5 మండలాల్లో 84,000 ఎకరాలకు సాగునీటి సదుపాయం కలుగుతుంది.

## 18. డిండి ప్రాజెక్టు, డిండి ఎత్తిపోతల పథకం

### డిండి ప్రాజెక్టు

కృష్ణానదికి ఉపనది అయిన డిండి నది మీద నల్లగొండ జిల్లాలోని డిండి మండలం డిండి గ్రామం వద్ద 1940లో మొదలు పెట్టి 1943లో పూర్తి చేసిన ప్రాజెక్టు ఇది. దీనికి నీటి కేటాయింపు 3.7 టి.యం.సి.ల నికర జలాలు. రిజర్వాయరు సామర్థ్యం 2.441 టి.యం.సిలు. ఈ ప్రాజెక్టు ఎడమ కాలవ ద్వారా దేవరకొండ నియోజక వర్గంలోని 15 గ్రామాలలో 9,665 ఎకరాలకు సాగునీరు అందుతుంది. కుడి కాలువ ద్వారా మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని మూడు గ్రామాలకు చెందిన 335 ఎకరాల ఆయకట్టుకే కాక 2,835 ఎకరాల ఆయకట్టు గల సిస్టమ్ చెరువులకు నీరందిస్తుంది. మొత్తం ఆయకట్టు 12,835 ఎకరాలు. ఈ ప్రాజెక్టు నిర్మాణ వ్యయం 34 లక్షల రూపాయలు మాత్రమే.

### డిండి ఎత్తిపోతల పథకం

నల్లగొండ జిల్లాలోని దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలలోని కొన్ని ప్రాంతాలకు, మహబూబ్‌నగర్ జిల్లాలోని అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాలలోని కొన్ని ప్రాంతాలకు సాగు, తాగు నీరు అందించేందుకు డిండి ఎత్తిపోతల పథకం ఉద్దేశించబడినది. శ్రీశైలం జలాశయం నుంచి 30 రోజులలో 4.15 టి.యం.సిల నీటిని, మరో 60 రోజులలో 31.10 టి.యం.సిల నీటిని వెరసి 35.25 టి.యం.సిల కృష్ణా మిగులు జలాలను ఎస్ఎల్‌బిసి మొదటి సొరంగం ద్వారా నక్కలగండి జలాశయానికి (సామర్థ్యం - 7.64 టి.యం.సిలు) తరలిస్తారు. అందులో 28.65 టి.యం.సిల నీటిని నక్కలగండి జలాశయం నుంచి డిండి నదిపై కొత్తగా నిర్మించే మధ్య డిండి జలాశయంలోకి (సామర్థ్యం - 11 టి.యం.సిలు) ఎత్తిపోతల ద్వారా తరలిస్తారు. మిగతా 6.60 టి.యం.సిల నీరు రెండవ సొరంగ మార్గం ద్వారా ఉదయసముద్రం ఎత్తిపోతల పథకంకు చేరుతుంది.

నక్కలగండి జలాశయం నుంచి 2.30 కి.మీ పొడవు గల కాలవ ద్వారా, 1.55 కి.మీ నిడివి గల సొరంగ మార్గం ద్వారా ప్రయాణించిన నీరు 5 పంపుల ద్వారా పంప్ హౌజ్ నుంచి 70 మీటర్ల ఎత్తుకు ఎత్తబడి మధ్య డిండి జలాశయం చేరుతుంది. ఆ జలాశయం ఎడమ కాలవ వేయి ఎకరాలకు, కుడి కాలువ 90,500 ఎకరాలకు 10 టి.యం.సిల సాగు నీరు అందిస్తాయి. ఈ కుడి కాలవ పైన కాచారం, దేవరకొండ, సోనులపల్లి గ్రామాల దగ్గర మూడు ఆఫ్‌లైన్ రిజర్వాయర్లను ఏర్పాటు చేస్తారు. ఈ మూడు జలాశయాల సామర్థ్యం 8.713 టి.యం.సిలు. మిగతా నీటిని 1.25 కి.మీ కాలవ, ఆనక 12.75 కి.మీ సొరంగం ద్వారా పంపు హౌజ్‌కు చేర్చి అక్కడి నుంచి 6 పంపుల ద్వారా 132 మీటర్ల ఎత్తుకు లిఫ్ట్ చేసి ఎగువ డిండి జలాశయానికి

(సామర్థ్యం-7.248 టి.యం.సిలు) చేరుస్తారు. ఎగువ డిండి ఎడమ కాలవ మూడు వేల ఎకరాలకు, కుడి కాలవ 2.47 లక్షల ఎకరాలకు సాగు నీరు అందిస్తాయి. కుడి కాలువ పైన నాలుగు ఆఫ్‌లైన్ రిజర్వాయర్లను జిగవలి తండా, అరకపల్లి, కొండూరు తండా, వెంకపల్లి తండా దగ్గర ఏర్పాటు చేస్తారు. ఈ నాలుగు జలాశయాల మొత్తం సామర్థ్యం 6.389 టి.యం.సిలు.

3,41,500 ఎకరాల కరువు పీడిత ప్రాంతాలకు 28.65 టి.యం.సి.ల కృష్ణా మిగులు జలాలను అందించే ఈ పథకంపైన సుమారు 4,377 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా. 266 మెగావాట్ల విద్యుత్తు అవసరమున్న ఈ ప్రాజెక్టుకు ఇంతవరకూ ఎటువంటి అనుమతీ లభించలేదు.

## 19. నాగార్జునసాగర్ ప్రాజెక్టు

| | | |
|---|---|---|
| శంకుస్థాపన | : | 1955 |
| నీటి కేటాయింపు | : | 281 టి.యం.సిల నికర జలాలు |
| | | రైట్ బ్యాంక్ కెనాల్ - 132 టి.యం.సిలు |
| | | లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ - 132 టి.యం.సిలు |
| | | ఆవిరి నష్టం - 17 టి.యం.సిలు |
| రిజర్వాయరు సామర్థ్యం | : | 408 టి.యం.సిలు |
| ఆయకట్టు | : | రైట్ బ్యాంక్ కెనాల్ - 11.13 లక్షల ఎకరాలు |
| | | లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ - 10.30 లక్షల ఎకరాలు |
| ప్రధాన కాలవల పొడవు | : | రైట్ బ్యాంక్ కెనాల్ - 203 కి.మీ |
| | | లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ - 179 కి.మీ |
| నిర్మాణ వ్యయం | : | 120.67 కోట్లు |
| నిర్మాణ దశ | : | 1967లో పూర్తయింది |

నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని నందికొండ దగ్గర కృష్ణానది మీద కట్టిన ఈ బహుళార్థ సాధక ప్రాజెక్టు అన్ని విధాలా అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది. ఈ డ్యామ్ ప్రపంచంలోనే ఎత్తయిన అతిపెద్ద రాతి డ్యామ్. నాగార్జునసాగర్ నుంచి ఆరు జిల్లాలకు సాగునీరు అందుతుంది. లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ నుంచి నల్లగొండ జిల్లాలో 3.81, ఖమ్మం జిల్లాలో 2.76, కృష్ణా జిల్లాలో 3.70 లక్షల ఎకరాలకు, పశ్చిమ గోదావరి జిల్లాలో 2,244 ఎకరాలకు నీరు సరఫరా అవుతుంది. రైట్ బ్యాంక్ కెనాల్ నుంచి గుంటూరు జిల్లాలో 6.68, ప్రకాశం జిల్లాలో 4.44 లక్షల ఎకరాలకు నీళ్లు లభిస్తాయి. రైట్ బ్యాంక్ కాలవకు జవహర్ కాలవని, లెఫ్ట్ బ్యాంక్ కాలవకు లాల్ బహుదూర్ కాలవని పేరు పెట్టారు.

## 20. మూసీ ప్రాజెక్టు

| | | |
|---|---|---|
| శంకుస్థాపన | : | 1954 |
| నీటి వాడకం | : | 4.63 టి.యం.సిల నికర జలాలు |
| రిజర్వాయరు సామర్థ్యం | : | 4.83 టి.యం.సిలు |
| ఆయకట్టు | : | 30 వేల ఎకరాలు |
| ప్రధాన కాలవల పొడవు | : | కుడి కాలవ - 33.80 కి.మీ |
| | | ఎడమ కాలవ - 41.75 కి.మీ |
| నిర్మాణ వ్యయం | : | 3.62 కోట్లు |
| నిర్మాణ దశ | : | 1963లో పూర్తయింది |

కృష్ణానది ఉపనది అయిన మూసీ మీద నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం బొప్పారం గ్రామం వద్ద ఈ ప్రాజెక్టును కట్టారు. సూర్యాపేట, కేతేపల్లి, వేములపల్లి మండలాల్లోని 42 గ్రామాలకు సాగునీటిని సరఫరా చేస్తుంది ఇది.

## 21. పులిచింతల ప్రాజెక్టు

| | | |
|---|---|---|
| పూర్తిపేరు | : | కానూరి లక్ష్మణరావు (కె.ఎల్.రావు) సాగర్ పులిచింతల ప్రాజెక్టు |
| శంకుస్థాపన | : | 1988 |
| నీటి కేటాయింపు | : | 9 టి.యం.సి.ల నికర జలాలు |
| రిజర్వాయర్ సామర్థ్యం | : | 45.77 టి.యం.సిలు |
| ఆయకట్టు | : | 13.08 లక్షల ఎకరాల కృష్ణా డెల్టా స్థిరీకరణ. |
| అంచనా వ్యయం(2009) | : | 1,281.00 కోట్లు |
| నిర్మాణ దశ | : | ఇంకా పూర్తవలేదు |

విజయవాడలోని ప్రకాశం బ్యారేజీకి 85 కి.మీ ఎగువన గుంటూరు జిల్లా బెల్లంకొండ మండలంలోని పులిచింతల గ్రామం దగ్గర కడుతున్న ప్రాజెక్టు ఇది. 45.77 టి.యం.సిల నీటి నిల్వ సామర్థ్యం గల ఒక రిజర్వాయర్‌ను అక్కడ కట్టి కృష్ణా డెల్టాలో ఖరీఫ్ పంటకు సకాలంలో నీళ్ళు అంద జేయాలనేది ఈ ప్రాజెక్టు ముఖ్యోద్దేశం. దీనివల్ల అదనపు ఆయకట్టు ఏమీ రాదు గాని కృష్ణా డెల్టా స్థిరీకరణ జరుగుతుంది.

## 22. కృష్ణా డెల్టా వర్క్స్ / ప్రకాశం బ్యారేజీ

| | | |
|---|---|---|
| శంకుస్థాపన | : | కృష్ణాడెల్టా వర్క్స్ - 1852<br>ప్రకాశం బ్యారేజీ - 1954 |
| నీటి కేటాయింపు | : | 181.20 టి.యం.సిల నికర జలాలు |
| బ్యారేజి సామర్థ్యం | : | 3.071 టి.యం.సిలు |
| ఆయకట్టు | : | 13.08 లక్షల ఎకరాలు |
| ప్రధాన కాలవల పొడవు | : | తూర్పు కాలవ - 370 కి.మీ<br>పడమర కాలవ - 322 కి.మీ |
| నిర్మాణ వ్యయం | : | కృష్ణా డెల్టా వర్క్స్ - 2 కోట్లు (ఆనకట్ట మరియు కాలవల ఖర్చు)<br>ప్రకాశం బ్యారేజి - 2.78 కోట్లు (ఆనకట్ట నిర్మాణ ఖర్చు మాత్రమే) |
| నిర్మాణ దశ | : | కృష్ణా డెల్టా వర్క్స్ 1855లో పూర్తయింది<br>ప్రకాశం బ్యారేజి 1957లో పూర్తయింది |

1833లో తీవ్ర కరువొచ్చి కృష్ణా జిల్లా జనాభాలో 40 శాతం మరణించడంతో బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ కృష్ణా డెల్టా వర్క్స్‌కు శ్రీకారం చుట్టింది. 5.80 లక్షల ఎకరాలకు సాగునీరివ్వగల పనులకు సర్ ఆర్థర్ కాటన్ డిజైన్ చేయగా కెప్టెన్ చార్లెస్ ఆర్ 2 కోట్ల వ్యయంతో వాటిని అమలు చేయించారు. వందేళ్ల తర్వాత 1952లో ఆనకట్టకు పగుళ్లు రావడంతో 1954లో ప్రకాశం బ్యారేజీ మొదలు పెట్టి 1957లో పూర్తి చేశారు. ఈ బ్యారేజి నుంచి కృష్ణా జిల్లాలో 6,79,498 ఎకరాలు, పశ్చిమ గోదావరి జిల్లాలో 58,000 ఎకరాలు, గుంటూరు జిల్లాలో 4,99,231 ఎకరాలు, ప్రకాశం జిల్లాలో 72,120 ఎకరాలకు సాగునీరు లభిస్తుంది. కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలకు నీళ్ళిచ్చే ప్రధాన కాలవలు - కృష్ణా ఈస్ట్ బ్యాంక్ కాలవ, ఏలూరు కాలవ, రైవస్ కాలవ, బందర్ కాలవ, అప్పర్ పుల్లేరు కాలవ, లోయర్ పుల్లేరు కాలవ, పోలరాజ్ కాలవ, క్యాంప్‌బెల్ కాలవ, బంటుమిల్లి కాలవ, రామరాజు పాలెం చానల్. గుంటూరు, ప్రకాశం జిల్లాలకు నీళ్ళిచ్చే కాలవలు - కృష్ణా వెస్ట్ మెయిన్ కెనాల్, కృష్ణా వెస్ట్ బ్యాంక్ కెనాల్, హైలెవల్ కెనాల్, కొమ్మమూరు కాలవ, నిజాంపట్నం కాలవ, ఈస్ట్ సైడ్ చానల్, వెస్ట్ సైడ్ చానల్.

# గోదావరి బేసిన్ ప్రాజెక్టులు

## 1. లెండి ప్రాజెక్టు

| | | |
|---|---|---|
| శంకుస్థాపన | : | 1985 |
| నీటి కేటాయింపు | : | 6.36 టి.యం.సిలు (మహారాష్ట్ర –3.93 టి.యంసిలు ఆంధ్రప్రదేశ్ - 2.43 టి.యం.సిలు) |
| రిజర్వాయర్ సామర్థ్యం | : | 5.12 టి.యం.సిలు |
| ప్రతిపాదిత ఆయకట్టు | : | 49,000 ఎకరాలు (మహారాష్ట్ర - 27,000, ఆంధ్రప్రదేశ్ - 22,000) |
| ప్రధాన కాలవల పొడవు | : | లెఫ్ట్ బ్యాంక్ కాలవ - 51.30 కి.మీ<br>రైట్ బ్యాంక్ కాలవ - 35 కి.మీ |
| అంచనా వ్యయం (2010) | : | 263.9 కోట్లు (ఆంధ్రప్రదేశ్ వాటా మాత్రమే) |
| నిర్మాణ దశ | : | ఇంకా పూర్తి కాలేదు |

మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా గోనెగావ్ గ్రామం దగ్గర మంజీరా ఉపనది అయిన లెండి నది మీద కడుతున్న అంతర్రాష్ట్ర ప్రాజెక్టు ఇది. ఈ ప్రాజెక్టు ప్రధాన కాలవ మొదటి 20.46 కి.మీ ఉమ్మడి కాలవగా మొదలై ఆ తరువాత కుడి, ఎడమ కాలువలుగా చీలుతుంది. మహారాష్ట్రకు నీళ్ల తీసికెళ్లే ఎడమ కాలవను 30.84 కి.మీ, ఆంధ్రప్రదేశ్‌కు నీళ్ల తీసికెళ్లే కుడి కాలవను 35 కి.మీ తవ్వాలని ప్లాన్. ఈ ప్రాజెక్టు ద్వారా నిజామాబాద్ జిల్లా మద్నూరు తాలూకాలోని 31 గ్రామాలు లబ్ధి పొందుతాయి. రిజర్వాయరు ఖర్చును మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లు 62:38 నిష్పత్తిలోనూ, ఉమ్మడి కాలవల ఖర్చును 50.21:49.79 నిష్పత్తిలోనూ పెట్టుకోవాలనేది ఒప్పందం.

## 2. లోయర్ పెన్‌గంగ ప్రాజెక్టు

| | | |
|---|---|---|
| నీటి కేటాయింపు | : | 42.67 టి.యం.సి.లు<br>మహారాష్ట్ర - 37.55 టి.యం.సిలు<br>ఆంధ్రప్రదేశ్ - 5.12 టి.యం.సిలు |
| ప్రతిపాదిత ఆయకట్టు | : | 2,50,885 ఎకరాలు<br>మహారాష్ట్ర - 2,10,885 ఎకరాలు<br>ఆంధ్రప్రదేశ్ - 40,000 ఎకరాలు |
| ఆంధ్రకు నీళ్ళిచ్చే రైట్ బ్యాంక్ కెనాల్ పొడవు | : | 48.60 కి.మీ |
| అంచనా వ్యయం | : | 2,100 కోట్లు (ఇందులో ఆంధ్రప్రదేశ్ వాటా 250 కోట్లు మాత్రమే) |
| నిర్మాణ దశ | : | ఇంకా పూర్తి కాలేదు |

ఇదీ ఉమ్మడి ప్రాజెక్టే. గోదావరి ఉపనది అయిన పెన్‌గంగ మీద మహారాష్ట్రలోని యవత్‌మాల్ జిల్లా చిక్కల్ వార్ధా దగ్గర కడుతున్నారు. ఇది ఆంధ్రా- మహారాష్ట్ర సరిహద్దుకు 12 కి.మీ ఎగువన ఉంటుంది. మహారాష్ట్రలోని 2,10,885 ఎకరాలకు, ఆంధ్రప్రదేశ్‌లోని ఆదిలాబాద్ జిల్లా జైనత్, బేలా, ఆదిలాబాద్ మండలాలకు చెందిన 61 గ్రామాలలో 40 వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తుంది. హెడ్ వర్క్స్ ఖర్చును నీటి వాడకం నిష్పత్తిలోనూ, ఉమ్మడి కాలవ ఖర్చును ఆయా రాష్ట్రాలకు అవసరమయ్యే గరిష్ట ప్రవాహ నిష్పత్తిలోనూ, ఏ రాష్ట్రానికి చెందిన కాలవకయ్యే ఖర్చును ఆ రాష్ట్రాలు భరించాలని ఒప్పందం.

ఈ ప్రాజెక్టుకు ప్రణాళికా సంఘం అనుమతి 1951లో ఢిల్లీలో జరిగిన అంతర్రాష్ట్ర సమావేశంలో లభించింది. 1975లో ప్రాజెక్టు నిర్మాణానికై మహారాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నా నేటికీ పూర్తికాలేదు.

## 3. సింగూరు ప్రాజెక్టు

| | | |
|---|---|---|
| పూర్తిపేరు | : | మొగలిగుండ్ల బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టు |
| నీటి కేటాయింపు | : | 11 టి.యం.సిలు |
| రిజర్వాయరు సామర్థ్యం | : | 29.91 టి.యం.సిలు |
| ప్రతిపాదిత ఆయకట్టు | : | 40,000 ఎకరాలు |
| ప్రధాన కాలవల పొడవు | : | ఎడమ కాలవ - 48.00 కి.మీ |
| | | కుడి కాలవ - 12.00 కి.మీ |
| నిర్మాణ దశ | : | 1990లో డ్యాం పూర్తయింది |

గోదావరి ఉపనది అయిన మంజీర నది మీద మెదక్ జిల్లా సింగూరు దగ్గర కట్టిన ప్రాజెక్టు ఇది. ఈ ప్రాజెక్టు ముఖ్య లక్ష్యాలు

1. జంట నగరాలకు రోజుకు 62.5 మిలియన్ గ్యాలన్ల నీరు సరఫరా చేయడం.
2. నిజాంసాగర్ ప్రాజెక్టుకు 8.35 టి.యం.సిలను, ఘనపురం ఆనకట్టకు 4.06 టి.యం.సిలను క్రమబద్ధంగా విడుదల చేసి ఆ ప్రాజెక్టుల ఆయకట్టును స్థిరీకరించడం.
3. నిజాంసాగర్ రిజర్వాయరులో ఒండ్రుమట్టి చేరకుండా నిలిపి వేయడం.

అయితే ఆ తర్వాత సింగూరు ముంపు బాధితుల ఒత్తిడి మేరకు మెదక్ జిల్లాలో 40 వేల ఎకరాలకు సాగునీటి వసతి కల్పించేందుకు 2 టి.యం.సిల నీటిని విడుదల చేయాలని 1980లో కొత్త లక్ష్యంగా చేర్చారు.

ఈ 40 ఎకరాలకు సాగునీటిని అందించడానికి సింగూరు కాలవలను, సిలారపు రాజనర్సింహ ఎత్తిపోతల పథకాలను 121.67 కోట్ల అంచనా వ్యయంతో మొదలు పెట్టారు. ఈ పనులు ఇంకా పూర్తవలేదు. అంతే కాకుండా ఈ ప్రాజెక్టు 15 మెగావాట్ల విద్యుదుత్పత్తి కూడా చేస్తుంది.

## 4. ఘనపురం ఆనకట్ట

| | | |
|---|---|---|
| శంకుస్థాపన | : | 1899 |
| నీటి కేటాయింపు | : | 4.06 టి.యం.సిలు |
| రిజర్వాయర్ సామర్థ్యం | : | 0.3 టి.యం.సిలు |
| ఆయకట్టు | : | 21,625 ఎకరాలు |
| ప్రధాన కాలవల పొడవు | : | కుడి కాలవ - 42.8 కి.మీ |
| | | ఎడమ కాలవ - 14.8 కి.మీ |
| వ్యయం | : | 18 లక్షలు |
| నిర్మాణ దశ | : | 1905 లో పూర్తయింది |

మెదక్ జిల్లా కుల్చారం మండలం ఘనపురం గ్రామం వద్ద మంజీరా నదిపై ఉంది ఈ ఆనకట్ట. దీన్ని నిజాం పాలకులే నిర్మించారు. కుడి, ఎడమ కాలవలకు మహబూబ్‌నహర్, ఫతేనహర్ అని పేర్లు పెట్టారు. మొదటది 42.8 కి.మీ పొడవుండి 12 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తుంది. రెండోది 14.8 కి.మీ పొడవుండి 9625 ఎకరాలకు నీళ్లిస్తుంది. దీని ఆయకట్టంతా మెదక్ జిల్లాలోని కుల్చారం, మెదక్, పాపన్నపేట మండలాలలో ఉంది.

## 5. మంజీర నీటి సరఫరా పథకం

ఇది కేవలం హైదరాబాద్ నగరానికి మంజీరా నది నుండి తాగునీటిని సరఫరా చేసే పథకం. దీనికి నీటి కేటాయింపు 2.97 టి.యం.సిలు. దీని రిజర్వాయర్ మెదక్ జిల్లా సంగారెడ్డి దగ్గర్లోని కల్బగూరు వద్ద వుంది. రిజర్వాయర్ సామర్థ్యం 1.5 టి.యం.సిలు. 1962లో శంకుస్థాపన చేసి 1965లో పూర్తి చేశారు. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అధీనంలో ఉంటుంది.

## 6. నిజాంసాగర్ ప్రాజెక్టు

| | | |
|---|---|---|
| శంకుస్థాపన | : | 1923 |
| నీటి కేటాయింపు | : | 1931లో 58 టి.యం.సిలు, ప్రస్తుత కేటాయింపు 37.87 టి.యం.సిలు |
| రిజర్వాయర్ సామర్థ్యం | : | మొదట 30 టి.యం.సిలు, ఆ తరువాత 11.8 టి.యం.సిలు, 1970 నుంచి 17.8 టి.యం.సిలు. |
| ప్రతిపాదిత ఆయకట్టు | : | 2.75 లక్షల ఎకరాలు, ప్రస్తుత ఆయకట్టు 2.31 లక్షల ఎకరాలు |
| ప్రధాన కాలవ పొడవు | : | 155 కి.మీ |
| నిర్మాణ దశ | : | 1931లో పూర్తయింది. అయితే 1970లో రిజర్వాయరు ఎత్తును, నిల్వ సామర్థ్యాన్ని పెంచారు. |

ఇది గోదావరి ఉపనది అయిన మంజీరా నదిపై నిజామాబాద్ జిల్లా అచ్చంపేట వద్ద నిజాం నిర్మించిన ఆనకట్ట. ఈ రిజర్వాయరు నుంచి నిజాంసాగర్, కోటగిరి, యద్పల్లి, మక్లూర్, జక్రాన్‌పల్లి, బాన్సువాడ, వర్ని, నిజామాబాద్, పెంజాల్, వేల్పూర్, బీర్కూర్, బోధన్, డిచ్‌పల్లి, నందిపేట, బాల్కొండ మండలాలకు సాగునీరు లభిస్తుంది.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కట్టినపుడు నిజాంసాగర్ ఆయకట్టులో 28 వేల ఎకరాలు ముంపుకు గురయింది. దానికి తోడు నిజాంసాగర్ రిజర్వాయరులో ఇసుక, మట్టి మేటలు వేయడం వలన దీని నిల్వ సామర్థ్యం తగ్గింది. అందుకే 1970లో రిజర్వాయరు ఎత్తు పెంచి నీటి నిల్వ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచారు.

## 7. అలీసాగర్ ఎత్తిపోతల పథకం

| | | |
|---|---|---|
| శంకుస్థాపన | : | 1999 |
| నీటి కేటాయింపు | : | 2.96 టి.యం.సిలు |
| రిజర్వాయర్ సామర్థ్యం | : | 2.96 టి.యం.సిలు |
| ప్రతిపాదిత ఆయకట్టు | : | 53,793 ఎకరాలు |
| ప్రధాన కాలవ పొడవు | : | 17.355 కి.మీ |
| నిర్మాణ వ్యయం | : | 261.30 కోట్లు |
| నిర్మాణ దశ | : | 2006-07లో పూర్తయింది |

నిజాంసాగర్ కాలవ చివరి భూములకు నీటి సరఫరా కోసం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు తీర ప్రాంతంలో గోదావరి నది మీద నిజామాబాద్ జిల్లా నవీపేట మండలంలోని కోస్లి గ్రామం దగ్గర కడుతున్న ప్రాజెక్టు ఇది. నవీపేట కాక రాంజాల్, నందిపేట, డిచ్‌పల్లి, మక్లూరు మండలాలకు ఇది సాగునీరు ఇస్తుంది. దీనికి ఎత్తిపోతలు మూడు దశల్లో జరుగుతాయి.

1. గోదావరి నుంచి మొదట కోస్లి దగ్గర లిఫ్ట్ చేసి భరత్ తండా రాతికుంట(Cistern) లోకి తీసికెళతారు. అక్కడ్నించి గ్రావిటీ (వాలు) ద్వారా తాడ్బిలోలి చెరువులోకి తరలిస్తారు. 2. తాడ్బిలోలి చెరువు నుంచి కళ్యాపూర్ గుట్ట రాతికుంటలోకి, అక్కడ్నించి గ్రావిటీ ద్వారా పోచారం చెరువులోకి తీసికెళతారు. 3.పోచారం చెరువు నుంచి జానకంపేట గుట్ట రాతికుంటలోకి, అక్కడ్నించి గ్రావిటీ ద్వారా నిజాంసాగర్ మెయిన్ కాలవలోకి, అలీసాగర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయరులోకి నీళ్లను తరలిస్తారు.

## 8. గుత్ప ఎత్తిపోతల పథకం

| | | |
|---|---|---|
| పూర్తిపేరు | : | అరుగుల రాజారాం గుత్ప ఎత్తిపోతల పథకం |
| శంకుస్థాపన | : | 1999 |
| నీటి కేటాయింపు | : | 3.04 టి.యం.సిలు |
| రిజర్వాయర్ సామర్థ్యం | : | 3.04 టి.యం.సిలు |
| ఆయకట్టు | : | 38,792 ఎకరాలు |
| ప్రధాన కాలవ పొడవు | : | 22.04 కి.మీ |
| వ్యయం | : | 204 కోట్లు |
| నిర్మాణ దశ | : | పూర్తయింది |

నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం ఉమ్మెడ గ్రామం వద్ద గోదావరి నదిపై కట్టిన ఎత్తిపోతల పథకం ఇది. నిజామాబాద్ జిల్లాలో నిజాంసాగర్ ప్రాజెక్టు చివరి భూముల స్థిరీకరణ కోసం రూపొందించిన ఈ ప్రాజెక్టు గోదావరి నీళ్లను రెండు దశలలో లిఫ్ట్ చేస్తుంది. 1.ఉమ్మెడ దగ్గర లిఫ్ట్ చేసి దార్మోరా చెరువులో పోస్తుంది. 2. దార్మోరా చెరువు నుంచి లిఫ్ట్ చేసి 85వ మైలురాయి వద్ద నిజాంసాగర్ కాలువలోకి, గుత్ప చెరువులోకి పోస్తుంది. నందిపేట, మక్లూరు, జక్రాన్‌పల్లి, డిచ్‌పల్లి, ఆర్మూరు, బాల్కొండ ప్రయోజనం పొందుతున్న మండలాలు.

## 9. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

నిజామాబాద్ జిల్లాలో పోచంపాడు వద్ద గోదావరి నదిపై కట్టిన పెద్ద ప్రాజెక్టు ఇది. దీన్ని పోచంపాడు ప్రాజెక్టు అని కూడా పిలుస్తారు. నెహ్రూ శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టులో మూడు దశలున్నాయి.

**ఎ. స్టేజ్ –I**

| | | |
|---|---|---|
| శంకుస్థాపన | : | 1963 |
| నీటి కేటాయింపు | : | 145.35 టి.యం.సిలు |
| రిజర్వాయర్ సామర్థ్యం | : | 112 టి.యం.సిలు |
| ఆయకట్టు | : | 9.69 లక్షల ఎకరాలు |
| ప్రధాన కాలవల పొడవు (రెండు స్టేజ్‌లు కలిపి) | : | కాకతీయ కాలవ–346 కి.మీ<br>సరస్వతి కాలవ–77 కి.మీ<br>లక్ష్మి కాలవ–3.5 కి.మీ |
| నిర్మాణ వ్యయం (2004) | : | 2,500 కోట్లు |

స్టేజ్–I లో కాకతీయ కాలవ కింద నిజామాబాద్ జిల్లాలో 11,024 ఎకరాలకు, కరీంనగర్ జిల్లాలో 5,36,328 ఎకరాలకు, వరంగల్ జిల్లాలో 3,64,078 ఎకరాలకు సాగునీరు లభిస్తుంది. సరస్వతీ కాలవ నీళ్ళు ఒక్క అదిలాబాద్ జిల్లాలో 34,967 ఎకరాలకు అందుతాయి. లక్ష్మికాలవ నీళ్ళు నిజామాబాద్ జిల్లాలో 21,866 ఎకరాలకు లభిస్తాయి.

**స్టేజ్–I లోని ముఖ్య నిర్మాణాలు**

1. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రిజర్వాయరు
2. 284 కి.మీల వరకు కాకతీయ కాలవ నిర్మాణం
3. 3.5 కి.మీల లక్ష్మి కాలవ నిర్మాణం
4. 77 కి.మీల సరస్వతి కాలవ నిర్మాణం
5. కాకతీయ కాలవ 146వ కి.మీ వద్ద లోయర్ మానేరు రివర్ క్రాస్
6. లోయర్ మానేరు డ్యాం

**బి. స్టేజ్–II**

| | | |
|---|---|---|
| శంకుస్థాపన | : | 1984 |
| నీటి కేటాయింపు | : | 24.40 టి.యం.సిల గోదావరి జలాలు,<br>4.703 టి.యం.సిల భూగర్భ జలాలు |

| | | |
|---|---|---|
| ప్రతిపాదిత ఆయకట్టు | : | 4.40 లక్షల ఎకరాలు |
| అంచనా వ్యయం | : | 1,043.14 కోట్లు |
| నిర్మాణదశ | : | ఇంకా పూర్తి కాలేదు |

స్టేజ్-II లో వరంగల్ జిల్లాలో 1.13 లక్షల ఎకరాలకు, ఖమ్మం జిల్లాలో 68,914 ఎకరాలకు, నల్లగొండ జిల్లాలో 2.57 లక్షల ఎకరాలకు సాగునీటి వసతి కల్పిస్తారు. ఇందుకోసం 24.405 టి.యం.సిల గోదావరి జలాలను, 4.70 టి.యం.సిల భూగర్భ జలాలను వినియోగించాలని ప్లాన్.

**స్టేజ్-II లోని ముఖ్య నిర్మాణాలు**

1. కాకతీయ కాలవను 284 నుంచి 346 కి.మీ వరకు పొడిగించడం
2. మూడు బ్రాంచ్ కాలవలతో సహా మొత్తం 14 డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం
3. మైలారం బ్యాలెన్సింగ్ రిజర్వాయరు
4. బయ్యన్న వాగు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు
5. కాకతీయ కాలవ 285 కి.మీ వద్ద ఆకేరు అక్విడక్ట్

**సి. వరద కాలవ**

| | | |
|---|---|---|
| శంకుస్థాపన | : | 1993 |
| నీటి కేటాయింపు | : | 20 టి.యం.సిలు |
| ప్రతిపాదిత ఆయకట్టు | : | 2.2 లక్షల ఎకరాలు |
| ప్రధాన కాలవ పొడవు | : | 288 కి.మీ |
| అంచనా వ్యయం | : | 4729.28 కోట్లు |
| నిర్మాణ దశ | : | ఇంకా పూర్తి కాలేదు |

20 టి.యం.సిల శ్రీరాంసాగర్ ప్రాజెక్టు మిగులు నీటిని మళ్ళించడం ద్వారా మరో 2.2 లక్షల ఎకరాలకు నీటి వసతి కల్పించే ప్రాజెక్టు ఇది. ఈ ప్రాజెక్టు హెడ్ వర్క్స్ నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలంలోని ముప్కాల్ వద్ద ఉన్నాయి. ఇది కరీంనగర్ జిల్లాలో 1.30 లక్షల ఎకరాలకు, వరంగల్ జిల్లాలో 60 వేల ఎకరాలకు, నల్లగొండ జిల్లాలో 30 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తుంది.

ఈ ప్రాజెక్టును రెండు దశలలో పూర్తి చేయాలని ప్లాన్.

**మొదటి దశ**

1. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఒడ్డున హెడ్ రెగ్యులేటర్, అప్రోచ్ చానెల్
2. 125 కి.మీల వరద కాలవ (శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరు రిజర్వాయరు వరకు)

3. కరీంనగర్ జిల్లా మన్వాడ గ్రామం వద్ద 25.87 టి.యం.సిల నీటి నిల్వ సామర్థ్యంతో మిడ్ మానేరు రిజర్వాయరు

4. మిడ్ మానేరు రిజర్వాయరు నుంచి లక్ష ఎకరాలకు సాగునీరు అందించే రెండు కాలవల నిర్మాణం.

**రెండవ దశ**

1. లిఫ్ట్ మరియు గ్రావిటీ కాలవ (మిడ్ మానేరు రిజర్వాయరు నుంచి గౌరవెల్లి రిజర్వాయరు వరకు)

2. గౌరవెల్లి రిజర్వాయరు (సామర్థ్యం - 1.095 టి.యం.సిలు)

3. గౌరవెల్లి రిజర్వాయరు నుంచి 1.2 లక్షల ఎకరాలకు సాగు నీరు ఇచ్చే రెండు కాలవల నిర్మాణం.

## 10. కడెం ప్రాజెక్టు

| | | |
|---|---|---|
| పూర్తిపేరు | : | కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టు |
| శంకుస్థాపన | : | 1944 |
| నీటి కేటాయింపు | : | 13.42 టి.యం.సిలు |
| రిజర్వాయర్ సామర్థ్యం | : | 7.62 టి.యం.సిలు |
| ఆయకట్టు | : | 69,828 ఎకరాలు |
| ప్రధాన కాలవల పొడవు | : | ఎడమ కాలవ - 73.6 కి.మీ |
| | | కుడి కాలవ - 8 కి.మీ |
| నిర్మాణ దశ | : | 1958లో పూర్తయింది |

గోదావరి ఉపనది అయిన కడెం నదిపై ఆదిలాబాద్ జిల్లా కడెం మండలం పెద్దూరు గ్రామం దగ్గర 1944లో నిజాం ప్రారంభించిన ప్రాజెక్టు ఇది. కడెం నది గోదావరిలో కలవడానికి 4 కి.మీ ఎగువన ఉంటుంది దీని జలాశయం. కడెం ప్రాజెక్టు ద్వారా కడెం, జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట, మంచిర్యాల మండలాల్లోని 98 గ్రామాలకు సాగునీరు లభిస్తుంది. 73.6 కి.మీ పొడవున్న ఎడమ కాలవ 68,128 ఎకరాలకు, 8 కి.మీ పొడవున్న కుడి కాలవ 1,700 ఎకరాలకు నీటి సరఫరా చేస్తాయి.

## 11. అప్పర్ మానేరు డ్యామ్

| | | |
|---|---|---|
| శంకుస్థాపన | : | 1945 |
| నీటి కేటాయింపు | : | 4.44 టి.యం.సిలు |
| రిజర్వాయర్ సామర్థ్యం | : | 2.15 టి.యం.సిలు |
| ఆయకట్టు | : | 13,086 ఎకరాలు |
| నిర్మాణ వ్యయం | : | 199 లక్షలు |
| నిర్మాణ దశ | : | 1950లో పూర్తయింది |

గోదావరి ఉపనది అయిన మానేరుపై కరీంనగర్ జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల గ్రామం వద్ద కట్టారు ఈ డ్యామ్‌ను. దీనిని నర్మాల ప్రాజెక్టు అని కూడా పిలుస్తుంటారు. కూడెల్లి వాగు మానేరు నదిలో కలిసేచోట నిజాం పాలకులే దీనిని నిర్మించారు. కుడికాలవ ద్వారా 12,346 ఎకరాలకు, ఎడమకాలవ ద్వారా 740 ఎకరాలకు నీరు అందించే ప్రాజెక్టు ఇది. లోయర్ మానేరు డ్యామ్ శ్రీరాంసాగర్ ప్రాజెక్టు మొదటి దశలో భాగమైతే మిడ్ మానేరు డ్యామ్ శ్రీరాంసాగర్ వరదకాలవ ప్రాజెక్టులో అంతర్భాగం.

## 12. లోయర్ మానేరు డ్యామ్

| | | |
|---|---|---|
| పూర్తి పేరు | : | ప్రొ॥ జి.వి.సుధాకర్‌రావు లోయర్ మానేరు డ్యాం |
| శంకుస్థాపన | : | 1969 |
| రిజర్వాయర్ సామర్థ్యం | : | 24 టి.యం.సిలు |
| నిర్మాణ దశ | : | 1985లో పూర్తయింది |

గోదావరి ఉపనది అయిన మానేరు మీద కరీంనగర్ పట్టణం దగ్గర కట్టిన డ్యామ్ ఇది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాకతీయ కాలవకు ఇది బ్యాలెన్సింగ్ రిజర్వాయరుగా పని చేస్తుంది. దీనికి ప్రత్యేక నీటి కేటాయింపులు లేవు.

## 13. ఎల్లంపల్లి ప్రాజెక్టు

| | | |
|---|---|---|
| పూర్తి పేరు | : | శ్రీపాదసాగర్ ఎల్లంపల్లి ప్రాజెక్టు |
| శంకుస్థాపన | : | 2004 |
| నీటి కేటాయింపు | : | 63 టి.యం.సిలు |

| | | |
|---|---|---|
| రిజర్వాయర్ సామర్థ్యం | : | 20.175 టి.యం.సిలు |
| ఆయకట్టు | : | 2.20 లక్షల ఎకరాలు, 30 వేల ఎకరాల స్థిరీకరణ |
| అంచనా వ్యయం (2008) | : | 3,177.74 కోట్లు |
| నిర్మాణ దశ | : | ఇంకా పూర్తి కాలేదు |

శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు దిగువన గోదావరి నదిలో లభ్యమయ్యే నీటిని వాడుకోవడం కోసం ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు. కరీంనగర్ జిల్లా రామగుండం మండలం ఎల్లంపల్లిలో 20.175 టి.యం.సిల సామర్థ్యంతో బ్యారేజి నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టును రెండు స్టేజీలలో, నాలుగు ఫేజ్‌లలో నిర్మించాలని ప్లాన్.

స్టేజ్–I, ఫేజ్–I: ఎల్లంపల్లి బ్యారేజి నిర్మాణం, మంథని నియోజక వర్గంలో 20 వేల ఎకరాలకు 2 టి.యం.సిల సాగు నీటి సరఫరా.

స్టేజ్–I, ఫేజ్–II: ఎన్.టి.పి.సికి 8.5 టి.యం.సిల నీటి సరఫరా.

స్టేజ్–II, ఫేజ్–I: కరీంనగర్ జిల్లా 19 మండలాలలో 2,00,000 ఎకరాలకు 12 టి.యం.సిల సాగునీటి సరఫరా, 30,000 ఎకరాల కడెం ఆయకట్టు స్థిరీకరణ.

స్టేజ్–II, ఫేజ్–II: ఈ ఫేజ్ ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టులో భాగం అయింది. దీనికి 20 టి.యం.సిల నీటిని కేటాయించారు.

ఈ ప్రాజెక్టు ద్వారా కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలలోని సింగరేణి కాలరీస్ కాలనీల తాగునీటికి 1.75 టి.యం.సిలు, రామగుండం, మంచిర్యాల, మందమర్రి, బెల్లంపల్లి పట్టణాల తాగునీటికి 2 టి.యం.సిలు సరఫరా చేస్తారు.

## 14. ప్రాణహిత ప్రాజెక్టు

1951లో ప్రణాళికా సంఘం అనుమతించిన గ్రావిటీ ప్రాజెక్టు ఇది. ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టు వచ్చాక దీన్ని పూర్తిగా పక్కన పెట్టేశారు. 1975లో మహారాష్ట్రతో ఒప్పందం కుదుర్చుకుని 12 టి.యం.సిల నీటితో ఆదిలాబాద్ జిల్లాలోని సిర్‌పూర్ మండలంలో 78 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని భావించారు. అయితే మహారాష్ట్ర విముఖత కారణంగా ఆనకట్ట నిర్మాణాన్ని విరమించుకుని నదీ జలాల మళ్లింపు ద్వారా ఆదిలాబాద్ జిల్లాలో 50 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని భావించారు. 2006–07 నాటికి అదీ పోయింది. దీని ప్రతిపాదిత ఆయకట్టు ప్రాణహిత– చేవెళ్ల ఎత్తిపోతల పథకంలో కూడా భాగం కాకపోవడంతో ఆ ప్రాంతం చాలా నష్టపోయింది.

## 15. ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టు

| | | |
|---|---|---|
| పూర్తిపేరు | : | డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం |
| శంకుస్థాపన | : | 2007 |
| నీటి కేటాయింపు | : | 180 టి.యం.సిలు |
| ఆయకట్టు | : | 16.40 లక్షల ఎకరాలు |
| ప్రధాన కాలవ పొడవు | : | 1,055 కి.మీ. |
| అంచనా వ్యయం (2008) | : | 38,500 కోట్లు |
| నిర్మాణ దశ | : | పూర్తి కాలేదు |

గోదావరి ఉపనది అయిన ప్రాణహిత మీద నిర్మిస్తున్న భారీ ప్రాజెక్టు ఇది. వార్ధా, వైన్‌గంగ సంగమ స్థలమైన తుమ్మిడిహెట్టి (ఆదిలాబాద్ జిల్లా కౌటాల మండలం) వద్ద బ్యారేజి నిర్మాణం జరుగుతుంది. తుమ్మిడిహెట్టి కుడిగట్టు వైపునుండగా మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఉన్న కుంగడమాల్ గ్రామం ఎడమగట్టు వైపునుంటుంది. ఈ ప్రాజెక్టు ప్రాణహిత నుంచి 160 టి.యం.సిల నీటిని, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 20 టి.యం.సిల గోదావరి నీటిని తీసుకుని ఏడు తెలంగాణ జిల్లాల్లోని 16.40 లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు దారి పొడుగునా గ్రామాలకు మంచినీరు (10 టి.యం.సిలు), హైదరాబాద్ నగరానికి మంచినీరు (30 టి.యం.సిలు), పరిశ్రమల కోసం మరో 16 టి.యం.సిల నీటిని సరఫరా చేస్తుంది.

22 లిఫ్టులుండే ఈ ప్రాజెక్టు నిర్వహణకు 3,466 మెగావాట్ల విద్యుచ్ఛక్తి అవసరం. కాలవల్లో 849 కి.మీ గ్రావిటీ ద్వారా ప్రవహించేవే అయినా 206 కి.మీ సొరంగమార్గం తవ్వాల్సి ఉంటుంది.

ఆదిలాబాద్ జిల్లాలో 19 మండలాల్లో 1,56,500 ఎకరాలకు, కరీంనగర్ జిల్లాలో 10 మండలాల్లో 1,71,449 ఎకరాలకు, వరంగల్ జిల్లాలో 2 మండలాల్లో 11,863 ఎకరాలకు, నిజామాబాద్ జిల్లాలో 19 మండలాల్లో 3,04,500 ఎకరాలకు, మెదక్ జిల్లాలో 22 మండలాల్లో 5,19,152 ఎకరాలకు, నల్లగొండ జిల్లాలో 11 మండలాల్లో 2,29,832 ఎకరాలకు, రంగారెడ్డి జిల్లాలో 14 మండలాల్లో 2,46,704 ఎకరాలకు సాగునీరు ఇస్తుందీ ప్రాజెక్టు.

## 16. ఇచ్చంపల్లి ప్రాజెక్టు

ఇచ్చంపల్లి ప్రధానంగా విద్యుదుత్పాదనకు ఉద్దేశించిన మూడు రాష్ట్రాల - ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ - ఉమ్మడి ప్రాజెక్టు. 975 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి నిర్ధారించిన నిష్పత్తిలో పంచుకుంటాయి. అయితే ఇచ్చంపల్లి రిజర్వాయరు నుంచి ఆంధ్రప్రదేశ్ 80 టి.యం.సిల దాకా సాగునీరు తీసుకోవచ్చు. 1858లోనే కాటన్ సహకారంతో నిజాం ఇక్కడొక బ్యారేజి కట్టడానికి ప్రయత్నించారు కాని సాధ్యం కాలేదు. ఆ తర్వాత ఇంద్రావతి నది గోదావరిలో కలిసే చోటకు దిగువన ఈ ప్రాజెక్టు కట్టాలని ప్రతిపాదించారు కాని మూడు రాష్ట్రాలకు చెందిన 926 చ.కి.మీ నేల, ముఖ్యంగా అటవీ భూములు ముంపుకు గురవుతాయనే కారణం వల్ల దీని నిర్మాణం వాయిదా పడుతూ వస్తోంది. ఈ ప్రాజెక్టు ద్వారా కరీంనగర్, ఖమ్మం, వరంగల్ జిల్లాలలోని 1,57,000 ఎకరాలకు గ్రావిటీ ద్వారానే సాగునీటి వసతి కల్పించవచ్చు. ముంపును మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకించడంతో తొలుత అనుకున్న 112.77 మీటర్ల డ్యాం ఎత్తును 95 మీటర్లకు తగ్గించారు. అయినా ఛత్తీస్‌గఢ్ ఒప్పుకోక పోవడంతో డ్యాం నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది. దీన్ని ఎత్తిపోతల పథకంగా మార్చడం తప్ప గత్యంతరం లేదని భావిస్తున్నారు.

## 17. దేవాదుల ఎత్తిపోతల పథకం

| | | |
|---|---|---|
| పూర్తిపేరు | : | జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం |
| శంకుస్థాపన | : | 2001 |
| నీటి కేటాయింపు | : | 38.18 టి.యం.సిలు |
| ఆయకట్టు | : | 6.21 లక్షల ఎకరాలు |
| ప్రధాన కాలవల పొడవు | : | మొదటి దశ - 138.5 కి.మీ |
| | | రెండవ దశ - 196.40 కి.మీ |
| | | మూడవ దశ - 202 కి.మీ |
| అంచనా వ్యయం | : | 9,178.70 కోట్లు |
| నిర్మాణ దశ | : | మొదటి దశ ట్రయల్ రన్ జరిగింది |

వరంగల్ జిల్లా ఏటూరునాగారం మండలం గంగారం గ్రామం వద్ద గోదావరి నుంచి 38.18 టి.యం.సిల నీటిని లిఫ్ట్ చేసే పథకం ఇది. ఇది ఇంద్రావతి–గోదావరి సంగమ స్థలానికి 22 కి.మీ దిగువన ఉంది. ఈ నీళ్ళలో సాగునీటి వాటా 36.25 టి.యం.సిలు కాగా గ్రామీణ తాగునీటి సరఫరాకు 1.36 టి.యం.సిలు, పట్టణ తాగునీటికి సరఫరాకు 0.56 టి.యం.సిలు, పారిశ్రామిక అవసరాల కోసం 0.012 టి.యం.సిలు కేటాయించారు. ఈ ప్రాజెక్టు ద్వారా వరంగల్ జిల్లాలో 5,61,229 ఎకరాలకు, నల్లగొండ జిల్లాలో 45,671 ఎకరాలకు, కరీంనగర్ జిల్లాలో 14,100 ఎకరాలకు సాగునీటి సదుపాయం కలుగుతుంది. ఈ ప్రాజెక్టు మూడు దశలుగా నిర్మాణమవుతుంది.

**మొదటి దశ:** ఈ దశలో 5.18 టి.యం.సిల నీళ్ళను గంగారం నుంచి భీమ్‌ఘన్‌పూర్, రామప్ప, శాలివాగు, నగరం/ పులుకుర్తి, ధర్మసాగరం చెరువుల మీదుగా స్టేషన్ ఘన్‌పూర్ చెరువుకు 4 దశలలో 275 మీటర్ల ఎత్తుకు లిఫ్ట్ చేస్తారు. 138.5 కి.మీ పొడవుండే పైప్‌లైన్ల నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. 2010లో ట్రయల్ రన్ జరిపి ధర్మసాగరం చెరువుకు నీళ్ళు వదిలారు. ఈ దశ ఆయకట్టు 1,22,700 ఎకరాలు.

**రెండో దశ:** గంగారం నుంచి 7 పంపింగ్ స్టేషన్ల ద్వారా భీమ్‌ఘన్‌పూర్, రామప్ప, శాలివాగు, నగరం/పులుకుర్తి, ధర్మసాగరం, గండిరామారం, బొమ్మకూరు, తపస్‌పల్లి, ఆర్.ఎస్.ఘనపూర్, అశ్వరావుపల్లి, చిట్టకోడూరు చెరువులకు 7.25 టి.యం.సిల నీటిని లిఫ్ట్ చేసి 1,79,260 ఎకరాలకు అందిస్తారు. ఈ దశలో లిఫ్ట్ మొత్తం ఎత్తు 470 మీటర్లు. పైప్‌లైన్ల పొడవు 196.40 కి.మీ.

**మూడో దశ:** ఇది మరో 2,41,790 ఎకరాలకు సాగునీటిని ఇస్తుంది. పైప్ లైన్లతో పాటు సొరంగాల నిర్మాణం కూడా ఇందులో భాగం. 25.75 టి.యం.సిల నీటిని 510 మీటర్ల వరకు లిఫ్ట్ చేస్తారు.

ఈ మూడు దశలలోని ఆయకట్టుకే కాక చెరువుల కింద ఉన్న మరో 77,250 ఎకరాలకు కూడా ఈ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందుతుంది.

## 18. కంతనపల్లి ఎత్తిపోతల పథకం

| | | |
|---|---|---|
| పూర్తి పేరు | : | పి.వి.నరసింహారావు కంతనపల్లి సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం |
| శంకుస్థాపన | : | 2009 |
| రిజర్వాయరు సామర్థ్యం | : | 22.57 టి.యం.సిలు |
| ఆయకట్టు | : | 7.5 లక్షల ఎకరాల శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు స్థిరీకరణ |
| ప్రధాన కాలవల పొడవు | : | 99.2 కి.మీ (సొరంగ మార్గాలు, గ్రావిటీ కాలవలు కలిపి) |
| అంచనా వ్యయం | : | 10,409 కోట్లు |
| నిర్మాణ దశ | : | ప్రాజెక్టు పనులు మొదలు పెట్టలేదు |

గోదావరి నదిపై వరంగల్ జిల్లా ఏటూరునాగారం మండలం కంతనపల్లి గ్రామం దగ్గర కట్టాలనుకుంటున్న ప్రాజెక్టు ఇది. బ్యారేజీ కట్టి అక్కడ్నించి నాలుగు సొరంగాలు, రెండు గ్రావిటీ కాలవలు, మూడు లిఫ్ట్‌ల ద్వారా కాకతీయ కాలువలోకి నీళ్లు తీసికెళ్ళడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. మొదట నీటిని బ్యారేజీ నుంచి సొరంగ మార్గం (20.5 కి.మీ) ద్వారా తరలించి, 63 మీటర్లు లిఫ్ట్ చేసి మేడారం దగ్గర కొత్తగా కట్టే తమ్మలవాగు జలాశయానికి, అక్కడ్నించి మరో సొరంగ మార్గం (23.475 కి.మీ) ద్వారా తరలించి, 120 మీటర్లు లిఫ్ట్ చేసి జంగాలపల్లి సిస్టర్న్‌కు తరలిస్తారు. అక్కడ్నించి పులిగూడెంకు గ్రావిటీ కాలవ (10.30 కి.మీ) ద్వారా, పులిగూడెం నుంచి మల్లంపల్లికి సొరంగ మార్గం (14.90 కి.మీ) ద్వారా, మల్లంపల్లి నుంచి పెగడపల్లికి గ్రావిటీ కాలవ (8.30 కి.మీ) ద్వారా నీటిని చేరుస్తారు. పెగడపల్లి నుంచి 21.725 కి.మీ పొడవైన సొరంగం ద్వారా తరలించి, మరో 66 మీటర్లు లిఫ్ట్ చేసి కాకతీయ కాలవలోకి నీటిని చేరుస్తారు.

ఈ ప్రాజెక్టు ద్వారా వరంగల్ జిల్లాలో 4,23,578 ఎకరాలు, నల్లగొండ జిల్లాలో 2,57,508 ఎకరాలు, ఖమ్మం జిల్లాలో 68,914 ఎకరాల శ్రీరాంసాగర్ ప్రాజెక్టు మొదటి, రెండవ దశలలోని ఆయకట్టు స్థిరీకరించబడుతుంది. ఈ ప్రాజెక్టు దేవాదులకు దిగువన ఉన్నందువల్ల దేవాదుల దగ్గర నీటి మట్టం తగ్గకుండా చూసేందుకు కూడా ఉపయోగపడుతుంది.

## 19. దుమ్ముగూడెం – నాగార్జునసాగర్ లింక్ కెనాల్ ప్రాజెక్టు

| | | |
|---|---|---|
| పూర్తి పేరు | : | జ్యోతిరావు పూలే దుమ్ముగూడెం – నాగార్జునసాగర్ సుజల స్రవంతి (లింక్ కెనాల్) |
| శంకుస్థాపన | : | 2009 |
| నీటి వాడకం | : | 165 టి.యం.సిల వరద జలాలు |
| ఆయకట్టు | : | 22 లక్షల ఎకరాల నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు సిర్థీకరణ |
| ప్రధాన కాలవ పొడవు | : | 244 కి.మీ |
| అంచనా వ్యయం | : | 19,521.42 కోట్లు |
| నిర్మాణ దశ | : | ఇంకా మొదలు కాలేదు |

ఖమ్మం జిల్లా మణుగూరు మండలం అనంతారం గ్రామం దగ్గర దుమ్ముగూడెం ఆనకట్టకు ఎగువన గోదావరి నది నుంచి 165 టి.యం.సిల వరద నీటిని లిఫ్ట్ చేయాలనుకుంటున్న పథకం ఇది. వరద సమయంలో 80 రోజుల పాటు 24 వేల క్యూసెక్కుల గోదావరి జలాలను లిఫ్ట్ చేసి అందులో 19,000 క్యూసెక్కులను (131 టి.యం.సిలు) 244 కి.మీ తరలించి, మార్గమధ్యంలోని ఆరు లిఫ్టులు – మొద్దులగూడెం, కళ్యాణపురం, రేగెళ్ళ, ఒడ్డుగూడెం, కోయగూడెం, బయ్యారంల ద్వారా 127 మీటర్లు ఎత్తి నాగార్జున సాగర్ డ్యాంకు దిగువన కడ్తున్న టెయిల్‌పాండ్‌కు హాలియా నది ద్వారా చేరుస్తారు. అక్కడి నుంచి ఈ నీటిని రివర్సబుల్ టర్బైన్స్ ద్వారా సాగర్ జలాశయానికి పంప్ చేస్తారు. తరలించిన నీటిని కుడి, ఎడమ కాలువల ద్వారా సాగర్ ఆయకట్టుకు అందిస్తారు.

మిగిలిన 5,000 క్యూసెక్కులలో 4,000 క్యూసెక్కులను (27 టి.యం.సిలు) మెయిన్ కాలవ 115వ కి.మీ. వద్ద నుంచి ఫీడర్ చానల్ ద్వారా నాగార్జునసాగర్ లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ 21వ మెయిన్ బ్రాంచ్ కాలవకు, 1,000 క్యూసెక్కులను (7 టి.యం.సిలు) ప్రధాన కాలవ 169.80 కి.మీ.వద్ద నుంచి ముక్త్యాల బ్రాంచ్ కాలవకు తరలిస్తారు.

## 20. దుమ్ముగూడెం ఎత్తిపోతల పథకం

| | | |
|---|---|---|
| పూర్తి పేరు | : | రాజీవ్ దుమ్ముగూడెం ఎత్తిపోతల పథకం. |
| నీటి కేటాయింపు | : | 16.50 టి.యం.సిలు |
| ఆయకట్టు | : | 2 లక్షల ఎకరాలు |
| ప్రధాన కాలవ పొడవు | : | 206.68 కి.మీ |

| | | |
|---|---|---|
| అంచనా వ్యయం (2008) | : | 1681 కోట్లు |
| నిర్మాణ దశ | : | ఇంకా పూర్తి కాలేదు |

దుమ్ముగూడెం ఆనకట్టకు 1.5 కి.మీ ఎగువన గోదావరి కుడిగట్టు మీదున్న పాములపల్లి గ్రామం (ఖమ్మం జిల్లా అశ్వారావుపేట మండలం) దగ్గర 16.50 టి.యం.సిల నీటిని లిఫ్ట్ చేస్తారు. ఈ నీటిని మొదట కొత్తగా కడుతున్న మారెళ్ళపాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరుకు, అక్కడి నుంచి పాల్వంచ మండలంలోని కరకవాగు చెరువుకు తరలిస్తారు. కరకవాగు చెరువు నుంచి రెండు మార్గాలలో ఒకటి ఇల్లెందు వైపు, రెండోది ఎనుకూరు వైపు నీటిని లిఫ్ట్ చేస్తారు. ఇల్లెందు వైపు మార్గంలో బేతంపూడి రిజర్వాయరు, లలితాపురం చెరువులను బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లుగా ఉపయోగించుకుంటూ చివరిగా పెద్ద చెరువు సుదిమళ్ళకు లిఫ్ట్ చేస్తారు. ఎనుకూరు వైపు మార్గంలో సింగ భూపాలెం రిజర్వాయరును బ్యాలెన్సింగ్ రిజర్వాయరుగా ఉపయోగించుకుంటూ, కొత్తగా కడుతున్న సీతారామ పురం తాండ, వినోభానగర్, మద్దుకూరు నీటి కొలనుల ద్వారా యెర్రగుంట జలాశయానికి చేరుస్తారు.

దీనివల్ల ఖమ్మం జిల్లా అశ్వాపురం, బూర్గంపాడ్, పాల్వంచ, టేకులపల్లి, కొత్తగూడెం, జూలూరుపాడ్, ఏనుకూరు, కల్లూరు, పెనుబల్లి, కారేపల్లి, కామేపల్లి, గార్ల, బయ్యారం, చంద్రుగొండ, తల్లాడ మండలాలలో 1,97,000 ఎకరాలకు వరంగల్ జిల్లాలో మూడు వేల ఎకరాలకు సాగునీటి వసతి కలుగుతుంది.

## 21. పోలవరం ప్రాజెక్టు

| | | |
|---|---|---|
| పూర్తి పేరు | : | ఇందిరాసాగర్ పోలవరం ప్రాజెక్టు |
| శంకుస్థాపన | : | 1981 |
| నీటి కేటాయింపు | : | 301.38 టి.యం.సిలు |
| రిజర్వాయర్ సామర్థ్యం | : | 194.6 టి.యం.సిలు |
| ఆయకట్టు | : | 7.20 లక్షల ఎకరాలు |
| ప్రధాన కాలవల పొడవు | : | ఎడమ కాలవ - 181.50 కి.మీ |
| | | కుడి కాలవ - 174 కి.మీ |
| అంచనా వ్యయం (2010) | : | 16,010.45 కోట్లు |
| నిర్మాణ దశ | : | ఇంకా పూర్తికాలేదు |

సర్ ఆర్ధర్ కాటన్ నిర్మించిన గోదావరి బ్యారేజికి 42 కి.మీ ఎగువన పశ్చిమగోదావరి జిల్లా పోలవరం మండలం రామయ్యపేట గ్రామం దగ్గర కడుతున్న భారీ ప్రాజెక్టు ఇది. 7.20 లక్షల ఎకరాలకు సాగునీరే కాక 960 మెగావాట్ల విద్యుదుత్పత్తి; కృష్ణా, గోదావరి డెల్టాల స్థిరీకరణ; విశాఖపట్నం నగరానికి, అనకాపల్లి పట్టణానికి, కాలవలకు ఆనుకుని ఉన్న 4 జిల్లాల్లోని 48 మండలాలకు చెందిన 540 గ్రామాలకు తాగునీటి సరఫరా; విశాఖపట్నం ఉక్కు ఫ్యాక్టరీకి, మరికొన్ని పరిశ్రమలకు నీటి సరఫరా చేసే ప్రాజెక్టు ఇది.

**కుడి కాలవ:** ఈ కాలవ పశ్చిమగోదావరి జిల్లాలో 2.58 లక్షల ఎకరాలకు, కృష్ణా జిల్లాలో 0.62 లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తుంది. కృష్ణా డెల్టా ఆయకట్టు స్థిరీకరణ కోసం 80 టి.యం.సిల నీటిని కూడా సరఫరా చేస్తుంది. 174 కి.మీ పొడవైన ఈ కాలవ పశ్చిమగోదావరి జిల్లాలో 196 గ్రామాలకు, కృష్ణా జిల్లాలో 57 గ్రామాలకు మంచినీటి సదుపాయం కూడా కల్పిస్తుంది.

**ఎడమ కాలవ:** తూర్పుగోదావరి జిల్లాలోని నేలకోట దగ్గర ప్రారంభమవుతుందీ కాలవ. తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లాల్లో దాదాపు 181.50 కి.మీ. ప్రయాణించి విశాఖ జిల్లాలోని నాగులపల్లిలో అంతమవుతుంది. దీని ఆయకట్టు దాదాపు 4 లక్షల ఎకరాలు. తూర్పుగోదావరిలో 2,49,872 ఎకరాలు, విశాఖపట్నంలో 1,50,071 ఎకరాలు. విశాఖ పారిశ్రామిక అవసరాల కోసం ఇది 23.44 టి.యం.సిల నీటిని అదనంగా తీసికెళుతుంది.

పోలవరం నుంచి సాగునీరు - 193.24 టి.యం.సిలు

కృష్ణానదికి మళ్లించేవి - 84.70 టి.యం.సి.లు

విశాఖ పారిశ్రామిక అవసరాలకు - 23.44 టి.యం.సి.లు

మొత్తం - 301.38 టి.యం.సిలు

ఈ ప్రాజెక్టు పూర్వపు పేరు రామపాదసాగరం. 1941లోనే దివాన్ బహదూర్ ఎల్.వెంకటకృష్ణ అయ్యర్ అనే ఇంజనీర్ దీనికి రూపకల్పన చేశారు. అయితే పనులేమీ జరగలేదు. 1980 నుంచి అడపాదడపా ప్రయత్నాలు జరుగుతున్నా ఇప్పటికీ దీనికి అన్ని అనుమతులూ రాలేదు. అటవీభూమి, ఆదివాసీ గ్రామాల మునక, పొరుగు రాష్ట్రాలకు వచ్చే ముంపు - వీటన్నిటి కారణంగా ఈ ప్రాజెక్టు చాలా వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. అనుమతులు రాకపోయినా కాలవల నిర్మాణం జరిగిపోయింది. స్పిల్‌వే, రాక్‌ఫిల్ డ్యాం, పవర్‌బ్లాక్‌ల నిర్మాణానికి టెండర్లు కూడా పిలిచారు. డ్యాం నిర్మాణం మాత్రం ప్రారంభం కాలేదు.

## 22. పుష్కర ఎత్తిపోతల పథకం

| | | |
|---|---|---|
| పూర్తి పేరు | : | తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం |
| నీటి కేటాయింపు | : | 11.80 టి.యం.సిలు |
| ఆయకట్టు | : | 1,85,906 ఎకరాలు |
| ప్రధాన కాలవ పొడవు | : | 95.50 కి.మీ |
| అంచనా వ్యయం | : | 608.04 కోట్లు |
| నిర్మాణ దశ | : | ఇంకా పూర్తి కాలేదు |

గోదావరి బ్యారేజికి 41.10 కి.మీ ఎగువన గోదావరికి ఎడమ గట్టు మీద ఉన్న పురుషోత్తపట్నం దగ్గర నిర్మిస్తున్న పథకం ఇది. పోలవరం ప్రాజెక్టుకు అనుమతులు రాకపోవచ్చన్న అనుమానంతో పుష్కరం, తాడిపూడి, మరో రెండు చిన్న ఎత్తిపోతల పథకాలను రూపకల్పన చేసింది రాష్ట్ర ప్రభుత్వం. పుష్కర ఎత్తిపోతల కింద 11.80 టి.యం.సిల నీటిని లిఫ్ట్ చేసి తూర్పుగోదావరి జిల్లాలోని 14 మండలాల్లో 1.80 లక్షల ఎకరాలకు సాగునీటిని ఇవ్వడం దీని లక్ష్యం. దీని ముఖ్య భాగాలు.

1. పురుషోత్తపట్నం దగ్గర పంపు హౌస్ 2. గోపాలపురం గ్రామం దగ్గర మొదటి లిఫ్ట్ 3. తాళ్లూరు దగ్గర రెండో లిఫ్ట్ 4. బెండపూడి దగ్గర మూడో లిఫ్ట్

ఈ ప్రాజెక్టు ద్వారా లబ్ధి పొందే మండలాలు- కోరుకొండ, రాజనగరం, గండేపల్లి జగ్గంపేట, పెద్దాపురం, కిర్లంపూడి, గొల్లప్రోలు, ప్రత్తిపాడు, శంకవరం, తొండంగి, కోటనందూరు, తుని, దేవీపట్నం, గోకవరం.

## 23. తాడిపూడి ఎత్తిపోతల పథకం

| | | |
|---|---|---|
| నీటి కేటాయింపు | : | 12.50 టి.యం.సిలు |
| ఆయకట్టు | : | 2.07 లక్షల ఎకరాలు |
| ప్రధాన కాలవ పొడవు | : | 80.45 కి.మీ |
| అంచనా వ్యయం | : | 526.27 కోట్లు |
| నిర్మాణదశ | : | ఇంకా పూర్తి కాలేదు |

గోదావరి కుడిగట్టు మీద పశ్చిమగోదావరి జిల్లా తాడిపూడి మండలం తాడిపూడి గ్రామం వద్ద కడుతున్న ఎత్తిపోతల పథకం ఇది. దీనివల్ల ఆ జిల్లాలోని 14 మండలాలకు సాగునీరు లభించడమే కాక దారి పొడవునా ఉన్న 5.40 లక్షల జనాభాకు తాగునీరు కూడా అందుతుంది. లిఫ్ట్‌కు 23 మెగావాట్ల విద్యుత్తు అవసరం. ఈ ప్రాజెక్టు ద్వారా

లబ్ధి పొందే మండలాలు- తాళ్ళపూడి, కొవ్వూరు, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, గోపాలపురం, చాగల్లు, నల్లజర్ల, భీమడోలు, దెందులూరు, నిడదవోలు, ద్వారకా తిరుమల, దేవరపల్లి, పెంటపాడు.

## 25. గోదావరి డెల్టా సిస్టం

| | | |
|---|---|---|
| శంకుస్థాపన | : | 1857 |
| నీటి కేటాయింపు | : | 263.60 టి.యం.సిలు |
| రిజర్వాయర్ సామర్థ్యం | : | 3.78 టి.యం.సిలు |
| ఆయకట్టు | : | 10.13 లక్షల ఎకరాలు |
| ప్రధాన కాలవల పొడువు | : | తూర్పు డెల్టా కాలవ పొడవు 254 కి.మీ<br>ఆయకట్టు 2.81 లక్షల ఎకరాలు<br>సెంట్రల్ డెల్టా కాలవ పొడవు 199 కి.మీ ఆయకట్టు 2.01 లక్షల ఎకరాలు<br>పశ్చిమ డెల్టాలోని 11 ప్రధాన కాలవల పొడవు 563 కి.మీ, ఆయకట్టు 5.30 లక్షల ఎకరాలు. |
| నిర్మాణ దశ | : | 1862 లో పూర్తయింది |

సర్ ఆర్థర్ కాటన్ ధవళేశ్వరం దగ్గర గోదావరిపై కట్టిన ఆనకట్ట, సాగునీటి కాలవలు వందేళ్లకు పైగా చెక్కు చెదరకుండా నిలిచాయి. ఆనకట్ట శిథిలమైందని 1970-88ల మధ్య ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు సహాయంతో పాత ఆనకట్ట స్థానంలో సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజిని 191.65 కోట్ల వ్యయంతో నిర్మించింది. గోదావరి డెల్టాలో మూడు ముఖ్య భాగాలున్నాయి. తూర్పు డెల్టా, సెంట్రల్ డెల్టాలు గౌతమి, వశిష్ట, వైనతేయ పాయల మధ్యన తూర్పుగోదావరి జిల్లాలో ఉంటే పశ్చిమ డెల్టా పశ్చిమగోదావరి జిల్లాలో వశిష్టకు కుడివైపున ఉంటుంది.

తూర్పు డెల్టాలో ప్రధాన కాలవ పొడవు 254 కి.మీ కాగా దాని నుంచి నీళ్లు తీసికెళ్లే చిన్న కాలవల పొడవు 857 కి.మీ. మొత్తం కాలవల పొడవు 1101 కి.మీ. వీటి కింద 23 మండలాలలో 2,81,303 ఎకరాలు సాగవుతాయి.

సెంట్రల్ డెల్టాలో ప్రధాన కాలవ పొడవు 199 కి.మీ కాగా మరో 742 కి.మీల పొడవు గల చిన్న కాలవలు ఉన్నాయి. మొత్తం కాలవల పొడవు 941 కి.మీ. వీటి కింద 16 మండలాలలో 2,01,896 ఎకరాలు సాగవుతాయి.

పశ్చిమ డెల్టాలో 563 కి.మీల పొడవు గల 11 ప్రధాన కాలవలు ఉన్నాయి. ఆయకట్టు 5,29,962 ఎకరాలు.

# పెన్నా, ఇతర బేసిన్ ప్రాజెక్టులు

## 1. అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు

పెన్నా నదిపైన అనంతపురం జిల్లా రామగిరి మండలం పేరూరు గ్రామం వద్ద నిర్మించిన మధ్యతరహా నీటిపారుదల పథకం ఇది. 1952లో ప్రారంభించి 1959లో పూర్తి చేశారు. ఖర్చు 1.60 కోట్లు కాగా ఆయకట్టు 10,048 ఎకరాలు. అనంతపురం జిల్లాలోని రామగిరి, కనగానపల్లి, కంబదూరు, రాప్తాడు మండలాలలో 14 గ్రామాలకు సాగునీరు ఇస్తుంది. 24.60 కి.మీ పొడవుండే కుడిగట్టు కాలవ 9,478 ఎకరాలకు, 5.79 కి.మీ పొడవుండే ఎడమగట్టు కాలవ 570 ఎకరాలకు నీరు ఇస్తుంది. ఈ ప్రాజెక్టు రిజర్వాయరు సామర్థ్యం 1.81 టి.యం.సిలు.

## 2. పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయరు

లక్ష ఎకరాలకు సాగునీరు అందించే ఈ రిజర్వాయరును అనంతపురం జిల్లా కూడేరు మండలం కొర్రకోడు గ్రామం దగ్గర పెన్నానదిపై కడుతున్నారు. దీనికి కేటాయింపు 10 టి.యం.సిలు కాగా రిజర్వాయరు నిల్వ సామర్థ్యం 11.10 టి.యం.సిలు. దీనికి రెండు కాలవలు – పి.ఎ.బి.ఆర్ కుడి కాలవ, యాడికి కెనాల్ సిస్టం ఉన్నాయి. ఇది 40 మెగావాట్ల విద్యుదుత్పత్తి కూడా చేస్తుంది. ఇది కూడా తుంగభద్ర ప్రాజెక్టు హైలెవల్ కెనాల్ స్టేజ్–II లో భాగమే.

**i) పి.ఎ.బి.ఆర్ కుడి కాలవ:** దీని పొడవు 112 కి.మీ. ఇది కూడేరు, సింగనమల, అనంతపురం, రాప్తాడు, ధర్మవరం, చెన్నేకొత్తపల్లి, తాడిమర్రి మండలాలలో 50 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వడంతో పాటు దారి పొడవునా ఉన్న చెరువుల కింద మరో 7,500 ఎకరాల ఆయకట్టును స్థిరీకరిస్తుంది. దీని 78.53 కి.మీ రాయి వద్ద నుంచి ధర్మవరం బ్రాంచి కాలవ ప్రారంభమై ఇంకో 30.97 కి.మీ వెళుతుంది. అదే విధంగా 103.05 కి.మీ రాయి వద్ద నుంచి పప్పూరు బ్రాంచి కాలవ ప్రారంభమై ఇంకో 8.75 కి.మీ ముందుకు వెళుతుంది.

**ii) యాడికి కెనాల్ సిస్టం:** ఇది పి.ఎ.బి.ఆర్. స్టేజి–II కిందికి వస్తుంది. 5 టి.యం.సిలతో 50 వేల ఎకరాల్లో రబీ పంటకు నీరు ఇవ్వడం దీని లక్ష్యం. పెదవడుగూరు, యాడికి, పెదపప్పూరు, తాడిపత్రి మండలాలలో 38 గ్రామాలు దీని వల్ల లబ్ది పొందుతాయి.

## 3. మిడ్‌పెన్నార్ రిజర్వాయరు

దీన్ని పెన్నానది మీదే కట్టినప్పటికీ ఇది తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కాలవ స్టేజి-IIలో భాగం కాబట్టి ఈ రిజర్వాయరు కోసం కేటాయించిన నీళ్లన్నీ తుంగభద్రవే. నీటి కేటాయింపు 9.89 టి.యం.సిలు కాగా రిజర్వాయర్ సామర్థ్యం 4.41 టి.యం.సిలు. అనంతపురం జిల్లాలోని 9 మండలాలలో 77,632 ఎకరాలకు నీళ్లిచ్చే ఈ రిజర్వాయరును గార్లదిన్నె మండలంలోని పెనకచర్ల గ్రామం దగ్గర కడుతున్నారు. దక్షిణ కాలవ పొడవు 96.56 కి.మీ కాగా ఉత్తర కాలవ పొడవు 58.30 కి.మీ, తాడిపత్రి బ్రాంచి కాలవ పొడవు 30.58 కి.మీలు. ప్రయోజనం పొందే మండలాలు- పామిడి, పెద్దవడుగూరు, గార్లదిన్నె, అనంతపురం, బుక్కరాయ సముద్రం, సింగనమల, పాట్లూరు, తాడిపత్రి, ఎల్లనూరు.

## 4. మైలవరం రిజర్వాయరు

ఇదీ తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కాలవ స్టేజి-IIలో భాగంగా పెన్నానది మీద నిర్మించిన రిజర్వాయరే. కడప జిల్లా మైలవరం దగ్గర ఉన్న ఈ రిజర్వాయరు సామర్థ్యం 9.960 టి.యం.సిలు. 1968-69లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు 1981-82 నాటికి పూర్తయింది. కాలవల నిర్మాణం పూర్తయేసరికి 1985-86 అయింది. కడప జిల్లాలో మైలవరం, జమ్మలమడుగు, పెదముడియం, పొద్దుటూరు, రాజుపాలెం, ఎర్రగుంట్ల, కమలాపురం మండలాలకు, కర్నూలు జిల్లాలో సంజవేముల, చాగలమర్రి మండలాలకు సాగునీరును అందించే ఈ రిజర్వాయరు ఆయకట్టు 75 వేల ఎకరాలు. ఉత్తర కాలవ పొడవు 34.30 కి.మీ, ఆయకట్టు 50 వేల ఎకరాలు. దక్షిణ కాలవ పొడవు 43 కి.మీ, ఆయకట్టు 25 వేల ఎకరాలు. నిర్మాణ వ్యయం 124.36 కోట్లు.

## 5. అప్పర్ సగిలేరు ప్రాజెక్టు

పెన్నా ఉపనది అయిన సగిలేరు నదిపై కడప జిల్లా కలసపాడు మండలం తంబాళపల్లి గ్రామం వద్ద 1896లో ఈ ప్రాజెక్టు నిర్మించారు. ఇది కలసపాడు, పోరుమామిళ్ళ, బి.కొండూరు మండలాలలోని 9 గ్రామాలలో 5,281 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇస్తుంది.

## 6. లోయర్ సగిలేరు ప్రాజెక్టు

పెన్నా ఉపనది అయిన సగిలేరు నదిపై కడప జిల్లా బి.కొండూరు మండలం వడ్డెమాను గ్రామం వద్ద కట్టారు ఈ ప్రాజెక్టును. 0.60 టి.యం.సిల నీటిని వాడుకునే ఈ ప్రాజెక్టు రిజర్వాయరు సామర్థ్యం 0.169 టి.యం.సిలు. 51 లక్షల రూపాయల ఖర్చుతో

1959లో పూర్తి చేశారు దీన్ని. ఈ ప్రాజెక్టు ద్వారా బి.కొండూరు, బ్రహ్మంగారి మఠం మండలాలలోని 16 గ్రామాలలోని 11,804 ఎకరాల ఆయకట్టుకు సాగునీటి సరఫరా చేస్తారు.

## 7. సోమశిల ప్రాజెక్టు

పెన్నానది మీద నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం సోమశిల గ్రామం వద్ద కట్టిన ప్రాజెక్టు ఇది. సోమశిల రిజర్వాయరు సామర్థ్యం 78 టి.యం.సిలు కాగా దాని కున్న నీటి కేటాయింపు 48.528 టి.యం.సిలు. ఈ ప్రాజెక్టు కొత్తగా 1.39 లక్షల ఎకరాల సాగు నీరు సరఫరా చేయడంతో పాటు పెన్నా డెల్టా కింది 2.75 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు దోహదపడుతుంది. 10 మెగావాట్ల విద్యుదుత్పత్తి, కావలి, నెల్లూరు పట్టణాలకు మంచినీటి సరఫరా కూడా చేస్తుంది. 2006 నాటికి సోమశిల నిర్మాణ అంచనా వ్యయం 1,196 కోట్లు. చెన్నైకు మంచినీళ్లు ఇచ్చే పథకం కోసం శ్రీశైలం రిజర్వాయరు నుంచి వచ్చే 15 టి.యం.సిల నీరు దీని ద్వారానే కందలేరు రిజర్వాయరుకు వెళుతుంది. అలాగే పెన్న వరద నీళ్లను కూడా ఇది కందలేరు రిజర్వాయరుకు మళ్లిస్తుంది.

దీనికున్న నాలుగు కాలవలు, వాటి ఆయకట్టు ఈ విధంగా ఉన్నాయి.

1. కావలి కాలవ – పొడవు 67.5 కి.మీ, ఆయకట్టు 50 వేల ఎకరాలు
2. ఉత్తర కాలవ – పొడవు 73 కి.మీ, ఆయకట్టు 20 వేల ఎకరాలు
3. దక్షిణ కాలవ – పొడవు 76.20 కి.మీ, ఆయకట్టు 25 వేల ఎకరాలు
4. కనుపూరు కాలవ – ఆయకట్టు 44 వేల ఎకరాలు

## 8. పెన్నా డెల్టా సిస్టం

పెన్నానది కర్ణాటక రాష్ట్రంలో నంది కొండలకు వాయువ్యాన ఉన్న చెన్నకేశవ కొండల్లో పుట్టి అనంతపురం, కడప, నెల్లూరు జిల్లాల ద్వారా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తుంది. సంగం ఆనకట్ట, నెల్లూరు ఆనకట్ట, దాని కింద ఉన్న కాలవలు, చెరువులు అన్నిటినీ కలిపి పెన్నా డెల్టా వ్యవస్థ అంటారు.

**i) సంగం ఆనకట్ట:** కోస్తా జిల్లాలలో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడినపుడు అన్ని నదుల మీద కట్టినట్టే బ్రిటిష్ వాళ్లు పెన్నానది మీద కూడా నెల్లూరు జిల్లా సంగం దగ్గర ఒక ఆనకట్ట కట్టారు. 1882లో పని మొదలై 1886లో పూర్తయింది. సంగం ఆనకట్ట నుంచి నీళ్లు తీసికెళ్లే ప్రధాన కాలవలు ఐదు.

1. 12 వేల ఎకరాల ఆయకట్టు ఉన్న నెల్లూరు చెరువుకు నీళ్లు తీసికెళ్లే నెల్లూరు ట్యాంకు సప్లై చానల్.

2. కనుపూరు కాలవ. 18,865 ఎకరాల ఆయకట్టు ఉన్న 83 మధ్యతరహా చెరువులకు నీళ్లు అందించే ఈ కాలవను స్వతంత్ర ప్రాజెక్టుగానే నిర్మించారు. పై రెండూ కుడిగట్టు కాలవలు.

3. ఎడమగట్టు మీదున్న మూడు కాలవలలో మొదటిది కనిగిరి మెయిన్ కెనాల్. 1.30 లక్షల ఎకరాల ఆయకట్టు గల కనిగిరి రిజర్వాయరుకు నీళ్లందించే కాలవ ఇది.

4. రెండోది దువ్వూరు కాలవ. ఇది 6,981 ఎకరాలకు నీళ్లు ఇస్తుంది.

5. మూడోది కావలి కాలవ. ఇది సోమశిల ప్రాజెక్టులో భాగం. 25 వేల ఎకరాలకు నీళ్లు ఇస్తుంది.

సంగం ఆనకట్ట నుంచి ప్రధానంగా నీళ్లు తీసుకునేవి కనిగిరి రిజర్వాయరు, నెల్లూరు చెరువులు. సంగం ఆనకట్టకు ఎడమవైపున్న పెద్ద రిజర్వాయరు కనిగిరి రిజర్వాయరు. దీనికి సంగం ఆనకట్ట నుంచే కాక ఇతరత్రా కూడా నీళ్లు వస్తాయి. దీని ప్రధాన కాలవలు- దక్షిణ కాలవ, తూర్పు కాలవ. దక్షిణ కాలవ 26,337 ఎకరాలకు, తూర్పు కాలవ 44,216 ఎకరాలకు నీళ్లు ఇస్తాయి. మలిదేవి డ్రయిన్, పైడేరు ఎస్కేప్ చానల్ ద్వారా కూడా కొన్ని వేల ఎకరాలకు నీళ్లు అందుతాయి. పైడేరు చానల్ మీద తలమంచి దగ్గర చిన్న ఆనకట్ట కట్టి అల్లూరు పెద్ద చెరువుకు, అల్లూరు రామన్న చెరువుకు నీటి సరఫరా చేస్తున్నారు. కనిగిరి రిజర్వాయరు నిల్వ సామర్థ్యం 6 టి.యం.సిలు. నెల్లూరు చెరువు సంగం ఆనకట్టకు కుడివైపున్న రిజర్వాయరు. దీని నిల్వ సామర్థ్యం 0.83 టి.యం.సిలు.

ii) **నెల్లూరు ఆనకట్ట:** 1853లో 1,12,500 రూపాయల ఖర్చుతో మద్రాసు ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టు ఇది. సర్ ఆర్థర్ కాటన్ సూచనలను కలుపుకుని 1862-63లో పూర్తి చేశారు. 1919లో, మళ్లీ 1941లో దీని ఎత్తు కొద్దిగా పెంచారు. ఈ ఆనకట్ట నుంచి రెండు ప్రధాన కాలవలు నీరు తీసికెళతాయి. ఒకటి జాఫర్ సాహెబ్ కాలవ (పొడవు - 8 కి.మీ.), రెండు సర్వేపల్లి కాలవ (పొడవు - 21 కి.మీ). సర్వేపల్లి కాలవ సర్వేపల్లి రిజర్వాయరుకు నీరు తీసికెళ్లడంతో పాటు విడిగా కూడా సాగునీరు సరఫరా చేస్తుంది.

**సర్వేపల్లి రిజర్వాయరు :** నిల్వ సామర్థ్యం 1.74 టి.యం.సిలు కాగా దాని ఆయకట్టు 12,900 ఎకరాలు. ఇది వెంకటాచలం మండలం సర్వేపల్లి గ్రామం దగ్గర ఉంది.

సంగం, నెల్లూరు ఆనకట్టల ప్రతిపాదిత ఆయకట్టు 1.75 లక్షల ఎకరాలైనా ప్రస్తుతం అది 2.47 లక్షల ఎకరాలుగా ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారా లబ్ధిపొందే మండలాలు- అల్లూరు, దగదర్తి, కొడవలూరు, సంగం, విడవలూరు, బోగోలు, ఇందుకూరుపేట, ముత్తుకూరు, టిపిగూడూరు, బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు, నెల్లూరు, వెంకటాచలం.

సంగం ఆనకట్ట కేటాయింపు -15 టి.యం.సిలు; ఆయకట్టు - 1.50 లక్షల ఎకరాలు

నెల్లూరు ఆనకట్ట కేటాయింపు -10 టి.యం.సిలు; ఆయకట్టు- 97,000 ఎకరాలు

## 9. గండిపాలెం ప్రాజెక్టు

మన్నేరు నదికి ఉపనది అయిన పిల్లాపేరు పైన నెల్లూరు జిల్లా ఉదయగిరి మండలం గండిపాలెం దగ్గర కట్టిన మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టు ఇది. ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లోని 17 గ్రామాల్లో రొటేషన్ పద్ధతిపై ఖరీఫ్‌లో 16 వేల ఎకరాలకు, రబీలో 8 వేల ఎకరాలకు నీళ్లు ఇస్తుంది. 1975లో మొదలుపెట్టి 1988 నాటికి కాలవలతో సహా పనులన్నీ పూర్తి చేశారు. కాని ప్రస్తుతం 10,263 ఎకరాలకు మాత్రమే నీరు ఇవ్వగలుగుతున్నారు. రిజర్వాయర్ సామర్థ్యం - 1.88 టి.యం.సిలు.

## 10 మోపాడు రిజర్వాయరు

ప్రకాశం జిల్లా పామూరు మండలం మోపాడు గ్రామం వద్ద మన్నేరు నదిపై కట్టిన చిన్న రిజర్వాయరు ఇది. దీనికి నీటి కేటాయింపు 2.09 టి.యం.సిలు కాగా నిల్వ సామర్థ్యం 2.154 టి.యం.సిలు. ప్రకాశం జిల్లాలో 8,040 ఎకరాలకు, నెల్లూరు జిల్లాలో 4,460 ఎకరాలకు సాగునీరు ఇస్తుంది.

## 11. రాళ్లపాడు రిజర్వాయరు

ఇది మన్నేరు నదిపై ప్రకాశం జిల్లాలో కట్టిన ప్రాజెక్టు. రిజర్వాయరును లింగ సముద్రం మండలం పెంట్రాల గ్రామం వద్ద కట్టారు. నీటి కేటాయింపు 2.18 టి.యం.సిలు. రిజర్వాయర్ సామర్థ్యం 1.10 టి.యం.సిలు. ఆయకట్టు ప్రకాశం జిల్లాలో 13,193 ఎకరాలు, నెల్లూరు జిల్లాలో 2807 ఎకరాలు, మొత్తం 16 వేల ఎకరాలు. దీనిని 1954లో మొదలుపెట్టి 90 లక్షల ఖర్చుతో 1958లో పూర్తి చేశారు.

## 12. పాలేరు - బిట్రగుంట ఆనకట్ట

దీన్ని పాలేరు నదిపై ప్రకాశం జిల్లా కందుకూరు మండలం జిల్లెళ్లమూడి గ్రామం దగ్గర కట్టారు. నీటి కేటాయింపు 1.21 టి.యం.సిలు అయితే నిల్వ సామర్థ్యం 0.3689 టి.యం.సిలు. ఇది ప్రకాశం జిల్లా జరుగుమల్లి, సింగరాయకొండ మండలాలలోని 7,262 ఎకరాలకు సాగునీటిని అందిస్తుంది.

## 13. వంశధార ప్రాజెక్టు

దీని పూర్తి పేరు బొడ్డేపల్లి రాజగోపాలరావు వంశధార ప్రాజెక్టు. ఆంధ్రప్రదేశ్ నదుల్లో నాలుగవ పెద్ద నది వంశధార. ఒరిస్సాలోని కోరాపుట్ జిల్లాలో పుట్టి ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా మీదుగా ప్రవహించి కళింగపట్నం వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది.

### వంశధార స్టేజి-I

వంశధార స్టేజి-I లో మూడు ముఖ్య భాగాలున్నాయి. 1) శ్రీకాకుళం జిల్లా హిర మండలం మండలంలో గొట్ట వద్ద బ్యారేజి నిర్మాణం 2) 104 కి.మీ పొడవైన ఎడమ కాలవ నిర్మాణం. దీని ఆయకట్టు 1.48 లక్షల ఎకరాలు. 3) 68 చిన్న కాలవలు. వంశధార స్టేజి-I 1970లో మొదలై 1977లో పూర్తయింది. 398 గ్రామాలకు ప్రయోజనం చేకూర్చే దీని ఖర్చు 119.18 కోట్లు. దీని ఆయకట్టు 1.48 లక్షల ఎకరాలు. ఈ స్టేజి ద్వారా లబ్ధిపొందే మండలాలు- హిరమండలం, కోటబొమ్మాళి, నందిగామ, పలాస, సంతబొమ్మాళి, టెక్కలి, జలుమూరు, మెలియాపుట్టి, నరసన్నపేట, పోలాకి, సరవకోట, వజ్రపుకొత్తూరు.

### వంశధార స్టేజి-II

రెండు ఫేజ్‌లలో నిర్మించే స్టేజ్-IIలో ఫేజ్-I ద్వారా 62,280 ఎకరాలకు, ఫేజ్-II ద్వారా 45,000 ఎకరాలకు సాగునీరు అందుతుంది. స్టేజ్-II ఫేజ్-Iలోని ముఖ్య నిర్మాణాలు రెండు. అవి

1) గొట్టా బ్యారేజికి ఎగువన హెడ్ రెగ్యులేటర్ నిర్మాణం

2) 55.28 కి.మీ పొడవున్న కుడిగట్టు ప్రధాన కాలవ.

స్టేజ్-II ఫేజ్-IIలో నేరడి గ్రామం దగ్గర బ్యారేజి కట్టి వరద కాలవద్వారా నీటిని హిరమండలం రిజర్వాయర్ (సామర్థ్యం-19.05 టి.యం.సిలు) లోకి మళ్లిస్తారు.

ఫేజ్-IIలో ముఖ్య నిర్మాణాలు

1) హిరమండలం రిజర్వాయర్

2) 34.10 కి.మీల పొడవైన వరద కాలవ, దానిమీద సింగిడి (సామర్థ్యం-0.069 టి.యం.సిలు), పారపురం (సామర్థ్యం- 0.404 టి.యం.సిలు) బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు

3) హిరమండలం రిజర్వాయరు నుంచి 33.25 కి.మీల పొడవైన హైలెవల్ కెనాల్

4) హిరమండలం రిజర్వాయరు నుంచి వంశధార నదికి, గొట్ట బ్యారేజి కుడిగట్టు ప్రధాన కాలవకు లింక్ కెనాల్స్

వంశధార స్టేజి-II అంచనా వ్యయం 1,142.90 కోట్లు.

వంశధార స్టేజి-Iకు 17.841 టి.యం.సిలు, స్టేజి-IIకు 17.385 టి.యం.సిలు కేటాయించారు.

## 14. జంఝావతి రిజర్వాయరు

నాగావళికి ఉపనది అయిన జంఝావతి నది మీద విజయనగరం జిల్లా కొమరాడ మండలం రాజ్యలక్ష్మీపురం గ్రామం దగ్గర కడుతున్న రిజర్వాయర్ ఇది. దీని పూర్తి పేరు వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు జంఝావతి రిజర్వాయరు. దీనికి నీటి కేటాయింపు 4 టి.యం.సిలు కాగా రిజర్వాయరు నిల్వ సామర్థ్యం 3.40 టి.యం.సిలు. దీని ప్రతిపాదిత ఆయకట్టు 24,640 ఎకరాలు. దీని వల్ల లబ్ధిపొందే మండలాలు - గరుగుబిల్లి, పార్వతీపురం, కొమరాడ, సీతానగరం, మక్కువ.

## 15. గంగా - కావేరి లింకు

'నదుల అనుసంధానం' తొలిసారి ప్రాచుర్యంలోకి వచ్చింది 1972లో కె.ఎల్.రావు ప్రతిపాదించిన గంగా - కావేరి పథకంతో. దాని ప్రకారం పాట్నా వద్ద లభించే 60 వేల క్యూసెక్కుల గంగాజలంలో 10 వేల క్యూసెక్కుల్ని గంగా బేసిన్‌లోనే వాడుకొని, మిగతా 50 వేల క్యూసెక్కులను 1800 అడుగుల ఎత్తుకు లిఫ్ట్ చేసి సోన్, నర్మద, వైన్‌గంగ, ప్రాణహిత, గోదావరి, కృష్ణానదులను దాటించి కావేరిలో కలుపుతారు. దీనివల్ల కోటి ఎకరాలకు నీరందుతుంది. గంగా - కావేరి లింకుతోపాటు మరికొన్ని లింకులను కూడా కె.ఎల్.రావు ప్రతిపాదించారు. ఈ పథకం అమలుకు 12,500 కోట్లు అవుతుందని ఆయన అంచనా. కాని దీనికి 70 వేల కోట్లు ఖర్చువుతుందని, ఎకరంపై విద్యుత్ ఖర్చే రు.12,500 ఉంటుందని, ఆరేడు వేల మెగావాట్ల విద్యుత్ అవసరముంటుందని కేంద్రం దాన్ని బుట్టదాఖలు చేసింది. ఆ తర్వాత కెప్టెన్ దస్తూర్ ప్రతిపాదించిన గార్లెండ్ స్కీం కూడా అమలుకు యోగ్యమైనది కాదని కేంద్రం కొట్టివేసింది. కాలక్రమేణా కేంద్రం నేషనల్ పర్‌స్పెక్టివ్ ప్లాన్‌ను ఖరారు చేసింది. అందులో ఒకటి హిమాలయ నదుల అభివృద్ధి పథకం, రెండవది ద్వీపకల్ప నదుల అభివృద్ధి పథకం.

**హిమాలయ నదుల అభివృద్ధి పథకం:** ఇందులో మళ్లీ రెండు. గంగ, బ్రహ్మపుత్ర నదులపైనా, మన దేశంలోనూ నేపాల్‌లోనూ ఉన్న వాటి ఉపనదులపైనా జలాశయాలు

నిర్మించి, వర్షాకాలపు నీటిని భద్రపరిచి, సాగునీరు, విద్యుదుత్పాదన, వరద నియంత్రణ సాధించడంతో పాటు గంగా ఉపనదులైన కోసీ, గండక్, ఘాగ్రా లోని మిగులు జలాలను కాలువల అనుసంధానం ద్వారా పశ్చిమ ప్రాంతాలకు తరలించే ప్రతిపాదన ఒకటి. అదేవిధంగా బ్రహ్మపుత్రను గంగానదికి అనుసంధానం చేసి దారిలో గంగా బేసిన్‌లోని క్షేత్రాలకు సాగునీరు అందచేయడమే కాక, హర్యానా, రాజస్థాన్, గుజరాత్‌లలోని కరువు పీడిత క్షేత్రాలకు నీటిని తరలించడం ఈ పథకంలోని మరో ప్రతిపాదన.

**ద్వీపకల్పపు నదుల అభివృద్ధి పథకం:** ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంత వరకు ఈ పథకం ముఖ్యమైనది. ఇందులో ప్రధానమైన లింకు మహానది - గోదావరి - కృష్ణ - కావేరి - వైగై - గుండార్. ఇందుకోసం తొమ్మిది లింకులను ప్రతిపాదించారు. ఈ తొమ్మిది కాక, ముంబయికి ఉత్తరాన ఉన్న నదులను, తపతికి దక్షిణాన ఉన్న నదులతో కలిపే రెండు లింకులు, యమునకు దక్షిణాన ఉన్న ఉపనదులు కేవన్‌చంబల్ నదులతో అనుసంధానం చేసే రెండు లింకులు, పశ్చిమ దిశవైపు ప్రవహించే కొన్ని నదులను తూర్పువైపు తరలించే మరో మూడు లింకులు మొత్తం 16 లింకులు ఈ ద్వీపకల్పపు పథకంలో ఉన్నాయి.

హిమాలయ నదుల అభివృద్ధి పథకం అమలయితే 5 కోట్ల 60 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. 30 వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. అలాగే ద్వీపకల్పనదుల అభివృద్ధి పథకం ద్వారా 3 కోట్ల 30 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. 4 వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. ఈ పథకం అమలుకు 3,698 మెగావాట్ల విద్యుత్తు ఎత్తిపోతల కోసం అవసరం అవుతుంది. మొత్తం ప్రాజెక్టు అమలుకు 5 లక్షల 60 కోట్లు ఖర్చు అనేది అప్పటి అంచనా. ప్రాజెక్టు అధ్యయనాలు ద్వీపకల్పపు పథకం విషయంలో పూర్తయినాయి కాని హిమాలయ నదుల విషయంలో వివిధ దశలలో ఉన్నాయి.



## మట్టి ముద్రణలు

1. రంఘం - వేనేపల్లి పాండురంగారావు
లైంగిక విజ్ఞానం-శృంగార సమాచారం - 1997
2. జల్ జలా - ముస్లింవాద కవితా సంకలనం - 1998
3. పట్నం వచ్చిన పల్లె - భూపాల్
తెలంగాణ బతుకుకథల భూపాల్ నవలిక
4. ఎవరీ పనిపిల్ల - తుమ్మేటి రఘోత్తమ రెడ్డి
'పనిపిల్ల' కథపై చర్చ - 2003
5. ఏశకాంత - సంపతి సోమయ్య
తెలంగాణ దళిత కవిత్వం - 2006
6. పహెచాన్ - గీతాంజలి
ముస్లిం స్త్రీల అస్తిత్వ కథలు - 2007
7. నన్హే ఓ నన్హే - అనిశెట్టి రజిత - నానీలు - 2007
8. తెలంగాణ కవిత-2007 - సంపాదకులు సుంకర రమేష్ -2008
9. ఇరుసు - సంపాదకులు కాసుల ప్రతాపరెడ్డి
తెలంగాణ సాహిత్య వ్యాసాలు -2008
10. తెలంగాణ కవిత-2008 - సంపాదకులు సుంకర రమేష్ -2009
11. తెలంగాణ సామెతలు-జాతీయాలు
- సంపాదకులు కర్ర ఎల్లారెడ్డి
12. కావడి కుండలు - సీమాంధ్ర కవుల తెలంగాణం
సంపాదకులు కోయి కోటేశ్వరరావు - 2010
13. తెలంగాణ కవిత-2009 - సంపాదకులు సుంకర రమేశ్ - 2010
14. తెలంగాణ వెతలు - బోయ జంగయ్య కథలు
15. తెలంగాణ కవిత-2010 - సంపాదకులు సుంకర రమేష్
16. పాటల ఊట - పయిలం సంతోష్ - 2012
17. జలపాతాలు - కె.బాలగోపాల్ - 2013

మట్టి ముద్రణలు
ఆలగడప, మిర్యాలగూడ, నల్లగొండ, తెలంగాణ- 508 207
ఫోన్ : 98480 15364

సాగునీటితో అన్ని సమస్యలూ పోవుగానీ తీవ్ర దారిద్ర్యాన్ని తగ్గించవచ్చు. సాగునీటి ప్రాతిపదికన జరిగే అభివృద్ధికి కొంత విస్తృత ప్రాతిపదిక ఉంటుంది. కొద్ది మందికి ఎక్కువ ప్రయోజనం కల్పించడమే కాకుండా ఎక్కువమందికి కొంత ప్రయోజనం కూడ కల్పిస్తుంది. ఎక్కువమంది చేతిలో కొంత మిగులు ఉంటుంది. దానితో ఆ వర్గాలలోని మలితరం కొంతయినా చదువుకొని సాంకేతికంగా పురోగమించిన జీవిత రంగాలలోకి ప్రవేశించగలరు. లేదా అది వర్తక, పారిశ్రామిక పెట్టుబడిగా మారగలదు. కోస్తా ఆంధ్ర జిల్లాల చరిత్ర ఈ వాస్తవాన్ని కళ్ళకు కట్టినట్టు చూపిస్తుంది.



jalapaataalu ❙ k.balagopal

మట్టి ముద్రణలు ❙ ఆలగడప ❙ తెలంగాణ